Ramazaan Aasayaalu (The Objectives of Ramazaan-Telugu)

# రమజాన్ శుభాలు


రచన
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఫ్లాట్ నెం.106,
సహారాకాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2,
✆ 040-66710795, 91-9441515414


వెల.............................................................రూ. 100/-లు




| | |
|---|---|
| Name of the Title: | Ramazaan Aasayaalu<br>Telugu<br>(The Objectives of Ramazaan) |
| Compilation : | **ABUL IRFAN**<br>Hyderabad-2 |
| All rights reserved with: | Islamic Resource Centre |
| First Edition: | October, 2006 |
| Copies: | 1000 |
| Published by: | Islamic Resource Centre<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-2, Ph: 66710795 |
| Type set by: | Alifain, Geeturai Graphics<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-500002 |
| Printed at: | Cosmic Printers<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-500002 |
| Price: | Rs. 100/- |

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం



“రమజాన్ ఖుర్‌ఆన్ అవతరించిన నెల. ఈ గ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలు, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి, కనుక ఇక నుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి.” (ఖుర్‌ఆన్-2:185)



# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | తొలిపలుకులు | 009 |
| 2. | స్వాగత సన్నాహాలు | 012 |
| 3. | దివి నుండి దిగిన దివ్యౌషధి | 013 |
| 4. | ఖుర్‌ఆన్ మనందరి జీవిత సంవిధానం | 014 |
| 5. | తొలి దివ్యావిష్కృతి | 016 |
| 6. | ఖుర్‌ఆన్ అవతరణ విధానాలు | 019 |
| 7. | దైవసందేశహరుడు-జిబ్రీల్ (అలైహి) | 019 |
| 8. | దైవప్రవక్త (స) ఆజ్ఞలే మనకు శిరోధార్యం | 023 |
| 9. | ఖుర్‌ఆన్ ఛాలెంజ్ | 024 |
| 10. | ఖుర్‌ఆన్ ఆధునిక పాఠ్యగ్రంథం | 025 |
| 11. | మానవ విరచితం కాదు | 027 |
| 12. | మహాకవి తుఫైల్ దౌసీ పరివర్తన | 028 |
| 13. | మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? | 030 |
| 14. | చంద్రఖండన మహిమ | 033 |
| 15. | “పిచ్చి” ప్రచారం | 035 |
| 16. | పైశాచిక పలుకులు కాదు, పరిశుద్ధవాణి | 040 |
| 17. | ఖుర్‌ఆన్ విశిష్ఠత | 042 |
| 18. | ఖుర్‌ఆన్ అవతరణకు కారణాలు | 044 |
| 19. | ఖుర్‌ఆన్ భవిష్యత్ ప్రకటనలు | 045 |
| 20. | విశ్వాస, అవిశ్వాస లక్షణాలు | 047 |
| 21. | విశ్వజనీన వాణి | 049 |
| 22. | భాష, రచన, శైలి | 051 |
| 23. | సాక్ష్యం | 052 |
| 24. | గ్రంథ పరిరక్షణ | 053 |
| 25. | ఖుర్‌ఆన్ ఇతివృత్తం | 055 |
| 26. | ఇస్లాంవ్యతిరేక శక్తుల కుట్రలు | 058 |
| 27. | కరదీపిక | 061 |
| 28. | ఐకమత్యానిక ఏకైక సూత్రం | 063 |

29. విభేదాలతో విడిపోతే వినాశం తప్పదు 069
- ☸ రఫేయదైన్ 069
- ☸ చేతులు కట్టుకునే స్థానం 070
- ☸ స్త్రీలు చేసే నమాజ్ పద్ధతి 070
- ☸ ఫాతిహా సూరా సమస్య 070
- ☸ పంక్తుల క్రమబద్ధీకరణ 072

30. రేఖ వేరు, కొలబద్ద వేరు 074
31. ఖుర్ఆన్ సిఫారసు 079
32. పాఠ్యగ్రంథం పట్ల విశ్వాసుల ప్రవర్తన 081
33. నీతికి నెలవు నమాజ్ 084
34. పరిశుభ్రత-(ఉజూ, గుసుల్) 090
- ✦ ఉజూ 091
- ✦ తయమ్ముమ్ 091
- ✦ గుసుల్ (స్నానం) 092
- ✦ ఉజూ భంగమయ్యే విషయాలు 092

35. నమాజ్ ముందువిషయాలు 092
- ✠ అజాన్ పలుకులు 092
- ✠ నమాజ్ వేళలు, రకాతులు 093

36. వ్యక్తిగత నమాజ్ విధానం 094
- ✦ వితర్ నమాజ్ 099
- ✦ సహూ సజ్దా 100
- ✦ ఖసర్ నమాజ్ 102
- ✦ ఖజా నమాజ్ 103
- ✦ స్త్రీల నమాజ్ 103

37. సామూహిక నమాజ్ పద్ధతి 105
- ✠ నమాజ్ నాయకత్వం (ఇమామత్) 105
- ✠ తప్పిపోయిన రకాతులను నెరవేర్చే పద్ధతి 105
- ✠ జుమా నమాజ్ 107
- ✠ ఈద్ నమాజ్ 107





38. నమాజ్ ప్రభావం 108
- ✦ ప్రభావంలేని నమాజ్ 112

39. ఖుర్ఆన్ పఠనం, పఠన సజ్దా 113
- ✠ పఠన ప్రాముఖ్యం 114
- ✠ పఠన సజ్దా 116

40. జిక్ర్-దుఆలు 117
- ✦ జిక్ర్ (దైవధ్యానం) 117
- ✦ దుఆలు (వేడుకోలు) 118
- ✦ వివరణ 118
- ✦ ఖుర్ఆన్ దుఆలు 120

41. నఫిల్ నమాజ్‌లు 122
- ✠ తహజ్జుద్ నమాజ్ 122
- ✠ తహజ్జుద్ వేళ, రకాతుల సంఖ్య 123
- ✠ తహ్యాతుల్ ఉజూ 124
- ✠ తహ్యాతుల్ మస్జిద్ 124
- ✠ ఇష్రాఖ్ నమాజ్ 124
- ✠ అవాబీన్ నమాజ్ 124
- ✠ సలాతె తస్బీహ్ 124
- ✠ సలాతె కుసూఫ్, సలాతె ఖుసూఫ్ 125
- ✠ నమాజ్ నిషిద్ధ వేళలు 126

42. దైవభీతి పరాయణత 128
43. దైవభీతి తెచ్చిన పరివర్తన 131
44. పాపభీతి-మానసిక ప్రభావం 133
- ✦ దైవనిఘా 134

45. దైవభీతి సర్వత్రా ద్యోతకమవ్వాలి 137
- ✦ పైన బటారం, లోన లటారం 139

46. ప్రదర్శనాబుద్ధి, ప్రపంచవ్యామోహం 141
47. ఉపవాసాల ప్రాముఖ్యం 145
48. ఉపవాస పుణ్యఫలం 152

| | |
|---|---|
| 49. అత్యధిక దానధర్మాలు | 153 |
| 50. అన్నదానం | 158 |
| 51. రూ.10/-ల పెట్టుబడిపై రూ.100/-ల లాభం | 159 |
| 52. తరావీ నమాజ్ | 162 |
| ✠ సామూహిక తరావీ నమాజ్ | 163 |
| ✠ తరావీ రకాతుల సంఖ్య | 164 |
| 53. ఉపవాస వ్రతాలు | 166 |
| 54. ఆరు విధాల ఉపవాసాలు | 168 |
| ✦ ఫరజ్ ఉపవాసాలు | 168 |
| ✦ వాజిబ్ ఉపవాసాలు | 168 |
| ✦ మస్నూన్ ఉపవాసాలు | 168 |
| ✦ నఫిల్ ఉపవాసాలు | 171 |
| ✦ హరాం ఉపవాసాలు | 172 |
| ✦ మక్రూహ్ ఉపవాసాలు | 172 |
| 55. సైరన్ కూతతో సహ్రీ ఆరంభం | 174 |
| 56. రోజా నుండి మినహాయించబడినవారు | 179 |
| ✠ వ్యాధిగ్రస్తుడు | 179 |
| ✠ బాగా వయస్సు మీరిన వృద్ధుడు | 179 |
| ✠ ఉన్మాది, అపస్మారకుడు | 179 |
| ✠ సమరయోధుడు | 180 |
| ✠ గర్భిణీ స్త్రీలు | 180 |
| ✠ పాల తల్లి | 180 |
| ✠ ప్రయాణీకుడు | 181 |
| ✠ చనిపోయిన మనిషి ఖజా రోజాలు | 184 |
| 57. ఉపవాసంలో ఆంక్షలు, రాయితీలు | 185 |
| ✦ మరచిపోయి తినడం, త్రాగడం | 185 |
| ✦ ఇంజెక్షన్ ద్వారా పదార్థ ప్రవేశం | 186 |
| ✦ గాయాలపై మందు పూత | 187 |





| | |
|---|---|
| ✦ చెవులు, కళ్ళలో మందు వేయడం | 187 |
| ✦ టూత్‌పేస్ట్, టూత్‌పౌడర్ల వాడకం | 188 |
| ✦ మర్మాంగం గుండా మందు వాడకం | 188 |
| ✦ రోజా స్థితిలో శస్త్రచికిత్స, అవయవ మార్పిడి | 188 |
| ✦ వీర్య స్ఖలనం | 190 |
| ✦ ఉపవాస స్థితిలో భార్యతో ఎలా మసలుకోవాలి? | 190 |
| ✦ వేసవి తాపం, దప్పిక సమయాల్లో చన్నీటి స్నానం | 190 |
| ✦ వాంతి అయితే రోజా భంగం కాదు | 191 |
| 58. ఇఫ్తార్ (ఉపవాస విరమణ) | 191 |
| 59. ఆంక్షల సంక్షిప్త స్వరూపం | 194 |
| ✠ చెయ్యకూడని పనులు | 194 |
| ✠ అవాంఛనీయమైన పనులు | 194 |
| ✠ చెయ్యగలిగే పనులు | 195 |
| ✠ రోజా అవసరం లేని వారు | 195 |
| ✠ పరిహారం, ప్రాయశ్చిత్తం | 196 |
| 60. పాపం పోయి పారితోషికం దక్కింది | 197 |
| 61. మహా శుభరాత్రి | 198 |
| 62. ఏతికాఫ్ | 204 |
| 63. ఫిత్రా ప్రాముఖ్యం | 205 |
| ✦ పేదల హక్కు- ఫిత్రా | 206 |
| ✦ పాపవినాశిని | 208 |
| ✦ ఫిత్రా చెల్లించాల్సినవారు | 208 |
| ✦ ఫిత్రా ఎంత, ఎవరికి, ఎప్పుడు? | 209 |
| 64. నడిరేయి నిర్ణయం | 209 |
| 65. ఆత్మ పరిశీలన | 214 |
| 66. రమజాన్ శుభాలకు అర్హులు | 217 |
| ✠ రమజాన్‌శుభాల కోసం రచయిత వెంపర్లాట | 222 |
| 67. రమజాన్ చారిత్రక సంఘటనలు | 223 |

# తొలి పలుకులు

ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో రమజాన్ ఉపవాసవ్రతం ఒకటి. రమజాన్ నెలంతా ఉపవాసాలు పాటించడం ప్రతి ముస్లింకు విధి (ఫర్జ్)గా నిర్ణయించబడింది. అదీగాక రమజాన్ మాసంలో సాధారణ నమాజులతో పాటు తరావీ నమాజులనే ప్రత్యేక నమాజులు కూడా చేయవలసి ఉంటుంది. ఆ తర్వాత కుటుంబంలోని ప్రతి సభ్యుని తరపున పేదలకు విధిగా ఫిత్రాదానం చెల్లించాలి. ఉపవాసాలు నిర్విఘ్నంగా పాటించినందుకు దేవుని పట్ల కృతజ్ఞతగా పండుగ నమాజ్ కూడా చేయాలి. రమజాన్ నెలలో బలమైన కారణం లేకుండా ఒక్కరోజు ఉపవాసం మానేసినా ఆ వెల్తీని సంవత్సరం పొడుగూతా ఉపవాసాలు పాటించినా భర్తీ కాదు.

దీన్నిబట్టి రమజాన్ నెలకు ఎంత ప్రాముఖ్యం ఉందో సులభంగా అర్థం చేసుకోవచ్చు. రమజాన్ మాసానికి ఇంతటి ప్రాముఖ్యం రావడానికి కారణం ఆ నెలలోని ఒక శుభరాత్రిన దివి నుండి భువికి అంతిమ దైవవాణి అయిన ఖుర్ఆన్ అవతరించడమే. యావత్తు మానవాళికి జీవిత సకల రంగాల్లో మార్గదర్శనం చేసి వారి ఇహపరలోకాల సాఫల్యానికి వెలుగుబాట చూపే దివ్యఖుర్ఆన్ 1400 సంవత్సరాలు గడచినా మార్పు చెందని, ఇకముందు ప్రళయం దాకా మార్పుకు గురికాలేని కలియుగ వేదం, తిరుగులేని జీవిత సంవిధానం. ఈ వాస్తవాన్ని ముస్లిములే కాదు, ముస్లిమేతర మేధావులు సైతం కాదనలేరు.

కాని ఈనాడు ముస్లింలలో అత్యధికమంది ఇలాంటి మహత్తర గ్రంథంలోని మౌలిక బోధనలకు దూరమయిపోయారు. వారు ఖుర్ఆన్‌ని దైవగ్రంథంగా ఎంతగానో గౌరవిస్తారు కూడా. దాన్ని అప్పుడప్పుడు భక్తిపారవశ్యంతో పారాయణం చేసి కళ్ళకు అద్దుకోవడం కూడా చేస్తారు. ముస్లిమేతరుల తరపున దానికేదయినా అపచారం జరిగితే ఎనలేని ఆగ్రహోద్రేకాలు కూడా వ్యక్తపరుస్తారు. అంతవరకే ఖుర్ఆన్ పట్ల వారి గౌరవాభిమానాలు. కాని దాని ధ్యేయం, మౌలిక బోధనల విషయంలో ఆచరణకు దారితీయని ఇలాంటి గౌరవాభిమానాలు ఇహపరలోకాలలో తమకు ఏ మేరకు ప్రయోజనం చేకూర్చుతాయో వారు ఆలోచించడం లేదు.

రమజాన్‌నెలలో ఉపవాసాలు పాటించాలని సృష్టికర్త ముస్లింలను ఆదేశిస్తూ ఆ ఉపవాసాల వల్ల వారిలో దైవభీతి జనిస్తుందని కూడా తెలియజేశాడు. దైవభీతి అంటే జీవితంలోని ప్రతి వ్యవహారంలోనూ దేవునికి భయపడుతూ ఆయన ఆచరించమని ఆదేశించిన సత్కార్యాలు ఆచరిస్తూ, ఆయన వారించిన దుష్కార్యాలకు దూరంగా మసలుకోవడమే కదా! కాని ఈ పనే నేటి ముస్లింలలో అత్యధికమంది చేయలేక పోతున్నారు. అయినా తమకు దేవుని పట్ల భయభక్తులు ఉన్నాయని చెప్పుకుంటారు. ఇది ఆత్మవంచన వైఖరి అని కూడా వారు గ్రహించలేక పోతున్నారు.



ఈ వైఖరికి కారణం వారు ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ తరచుగా చదవక పోవడమే. దివ్యఖుర్ఆన్ విద్యార్థిలా నిత్యం పఠించవలసిన పాఠ్యగ్రంథం. రోజుకు అయిదు పూటలు నమాజ్ చేయాలని నిర్దేశించబడిన దైవాజ్ఞ ఉద్దేశ్యం కూడా ఇదే. నమాజ్‌లో పఠించే అరబీ సూక్తులు అర్థం కాకపోతే వాటి అనువాదమైనా రోజూ ఓ గంట సేపు అధ్యయనం చేస్తుండాలి. అప్పుడే జీవితంలోని సమస్త రంగాల్లో దేవుని ఆజ్ఞలేమిటో, ఆయన చేసిన హితవులేమిటో తెలుస్తాయి, తద్వారా హృదయంలో నిజమైన దైవభీతి జనించి వారు తమ దైనందిన జీవితంలో వాటిని ఆచరించ గలుగుతారు. ఇదే రమజాన్ ఉపవాసాల లక్ష్యం.

అలాంటి ముస్లింలే రమజాన్ శుభాలకు అర్హులవుతారు. ఈ పుస్తకంలో దీన్ని గురించే విపులంగా చర్చించడం జరిగింది. దాంతోపాటు నమాజ్ ప్రాముఖ్యం, దాని విధానం, ఉపవాస నియమాలు కూడా ఇందులో పేర్కొనబడ్డాయి. అత్యల్ప విషయాల్లోని ఫిఖ్హా భేదాభిప్రాయాల వల్ల జనసామాన్యంలో ఏర్పడిన అనైక్యతా అపరిశృతుల్ని దూరం చేయడానికి, వారిలో ఖుర్ఆన్ అధ్యయనం పట్ల ఆసక్తి కలిగించడానికి కూడా ఈ పుస్తకంలో శాయాశక్తులా కృషి జరిగింది. కనుక ఇది పాఠకుల ఆదరణ పొంది వారికి ప్రయోజనం చేకూర్చుతుందని ఆశిస్తున్నాను.

## రచనకు ఆధార గ్రంథాలు


(1) ఆసాన్ ఫిఖహ్.................................మౌలానా ముహమ్మద్ యూసుఫ్ ఇస్లాహి

(2) కితాబుస్సౌమ్.................................మౌలానా అబుల్ఆలా మౌదూది

(3) ఫజాయలె ఖుర్ఆన్........................మౌలానా అబుల్ఆలా మౌదూది

(4) మషాలె రాహ్.................................మౌలానా గులాం ముహమ్మద్ మన్సూరి

(5) తరీఖాయె నమాజ్..........................మౌలానా ముహమ్మద్ సులైమాన్ ఖాశ్మి

(6) సహీబుఖారి.....................................ఇమామ్ బుఖారి (రహ్మలై)

(7) మువత్తా...........................................ఇమామ్ మాలిక్, ముహమ్మద్ (రహ్మలై)

(8) నమాజె నబవీ (స)..........................డాక్టర్ సయ్యిద్ షఫీఖుర్రహ్మాన్

(9) ఖుర్ఆన్ భావామృతం....................ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2

(10) ముహమ్మద్ ఆదర్శ జీవితం.........ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2

(11) ఇస్లాం ధర్మశాస్త్రం..........................అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్, హైదరాబాద్

(12) మహాప్రవక్త మహితోక్తులు............అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్, హైదరాబాద్


అబుల్ ఇర్ఫాన్
23-9-2006
(--రచయిత--)

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# రమజాన్ శుభాలు

"అదిగో రమజాన్ నెలవంక!"

"ఏదేది? నాక్కనపడటం లేదే!"

"ఇటురా, ఇక్కడ నిలబడి ఆ రెండు చెట్ల మధ్య గుండా చూడు" అన్నాడు రియాజ్ చేత్తో సైగచేసి చూపిస్తూ.

"ఆ...ఏదీ...ఆ...ఆ...కనపడిందిలే. రమజాన్ నెలవంక, రమజాన్ నెలవంక. రేపటి నుంచే రోజాలు మొదలు" అంటూ సంతోషంతో ఎగిరి గంతేసింది రజియా.

"ఒరేయ్ కరీం! రేపుదయం పెరుగు కోసం తోడెయ్యడానికి ఖాశిం దుకాణానికి వెళ్ళి ఓ లీటర్ పాలు తీసుకురారా!"

"పొద్దున్నే పెరుగేమిటమ్మా! రేపుదయం తెస్తాలే పాలు."

"ఒరె వెర్రిమొహమా! రేపట్నుంచే రమజాన్ రోజాలు మొదలు. తెల్లవారుజామున సహరీ ఏర్పాట్లు చేయాలి, తొందరగా పాలు తీసుకురా."

"అమ్మా! అమ్మా!! నాన్నగారు క్యాంపు నుంచి వస్తున్నారే" అంటూ సలీం తుర్రున బయటికి పరుగెత్తాడు.

"నాన్నా! రేపట్నుంచే రమజాన్ రోజాలట. నేను కూడా రోజా ఉంటా నాన్నా!"

"నీకింకా ఎనిమిదేండ్లు కూడా నిండలేదు. అప్పుడే రోజాలు ఉంటావా? వచ్చే ఏడు ఉందువుగానిలే."

"ఉహూ...నేను ఈ యేడు నుంచే రోజాలు ఉంటాను" అన్నాడు సలీం తన నిర్ణయానికి తిరుగులేదన్నట్లు గట్టిగా చెబుతూ.

"ఏం వదినా, ఏం చేస్తున్నావు? రేపట్నుంచే రమజాన్ రోజాలు మొదలు. సైరన్ల మోతలు విన్నావు కదా!" అన్నది ఆరిఫా.

"ఆ...విన్నాను. రేపు తెల్లవారుజామున సహరీ కోసం ఏం వండాలో ఏమో! ఈయనగారు మసీదు నుంచి ఇంకా రాలేదు" అన్నది రుఖ్సానా.

"ఏమేవ్! సైరన్ కూతలు విన్నావుగా. తెల్లవారుజామున సహరీ కోసం ఏదైనా ప్రత్యేక వంటకం చేస్తున్నావా?" ఇంట్లో అడుగు పెడ్తూనే అడిగాడు షమ్సుద్దీన్.

"ప్రత్యేక వంటకం సంగతేమోగాని, రేపట్నుంచి సాధారణ వంటకం కూడా కష్టమే. ఇంట్లో సరుకులు నిండుకున్నాయి" అన్నది ఖమ్రున్నిసా.



"ఆ...నెలాఖరు కదా! డోంట్‌వర్రి, ఈనెల జీతం రెండ్రోజులు ముందే దొరికింది. ఇప్పుడే పోయి ముఖ్యమైన సరుకులు తెస్తానుండు" అంటూ షమ్సుద్దీన్ ఎంత వేగంగా ఇంటికి వచ్చాడో అంతే వేగంతో బయటికి వెళ్ళాడు.

## 2. స్వాగత సన్నాహాలు

ఇదండీ! రమజాన్ నెల స్వాగత వాతావరణం. రమజాన్ నెల ప్రారంభం కాగానే ముస్లింసమాజం ఉత్తేజభరితం అవుతుంది. ముఖ్యంగా పట్టణ ముస్లింలలో రమజాన్ వాతావరణం స్పష్టంగా గోచరిస్తుంది. ఇక హైదరాబాద్ పాతబస్తీ సంగతయితే చెప్ప నవసరమేలేదు. ప్రతి గల్లీలో ఒకటి రెండు మసీదులుండే పాతబస్తీ రమజాన్ మొదటి రోజే సైరన్ మోతలతో దద్దరిల్లుతుంది. పిల్లల ఉరుకులు, పరుగులతో వీధులు అలజడిగా ఉంటాయి. మసీదులు తాజా సున్నం, తాజా పెయింట్లతో వింత శోభలు వెదజల్లుతూ; నిత్య నమాజీలతో పాటు కొత్త ముఖాలతో కళకళలాడుతాయి.

"రమజాన్ మాసమా స్వాగతం - రోజాల మాసమా స్వాగతం"

"అదిగో విన్నారా! హుసైన్ గారింట్లో రమజాన్ కేసెట్ వేశారు. మీరా కేసెట్ కొనుక్కోరమ్మంటే ఇంతవరకు కొనుక్కోరాలేదు" అన్నది మా ఆవిడ చిరుకోపంతో.

"హుసైన్ భాయీ! రమజాన్ కేసెట్ వేశారు బాగుందికాని, రమజాన్ సన్నాహాలు ఏం చేస్తున్నారు మీరు?"

"ఆ...ఏముంది, రేపు తెల్లవారు జామున సహరీ తిని ఉపవాసాలు ఉండటం, సాధారణ నమాజులతో పాటు తరావీ నమాజులు చేయడమేగా!" అన్నాడు మా హుసైన్ భాయి.

"అది సరే. అసలు రమజాన్ మాసం ఆశయం ఏమిటో, దాని శుభాలు ఏమిటో ఆ శుభాలకు అర్హులెవరో మీరేమయినా ఆలోచించారా?"

"నిజమేనండీ! ఇవి తీవ్రంగా ఆలోచించాల్సిన విషయాలే. వీటిని గురించి మనం రేపు సమావేశమయి చర్చిద్దాం. వీటికి సంబంధించిన పుస్తకాలేమైనా మీ దగ్గర ఉంటే పాయింట్లు నోట్ చేసి ఉంచండి" అన్నాడు మా హుసైన్ భాయి.

"నా దగ్గరయితే ఉర్దూలో చాలా పుస్తకాలున్నాయి. ఆ విషయాలన్నీ తీసి చదివి తెలుగులో అనువదించాలంటే ఈ నెలలో సాధ్యమయ్యే పనేనా?" అన్నాను నేను.

"అవన్నీ ఇప్పుడు అక్కర్లేదు. ముఖ్యమైన పాయంట్లు నోట్ చేస్తే చాలు. క్షుణ్ణంగా చదివి వివరంగా రాయదలచుకుంటే, ఆ పని రమజాన్ తర్వాత ప్రారంభించండి. కనీసం వచ్చే రమజాన్‌కయినా పుస్తకం ప్రింటయి వచ్చేస్తుంది" అంటూ సలహా ఇచ్చాడు మా హుసైన్ భాయ్.

నేనీ సలహాను నెమరేసుకుంటూ 'కాదు, ఈ పవిత్ర కార్యం ఈ శుభమాసంలోనే ప్రారంభించాలి' అని గట్టిగా నిర్ణయించుకున్నాను.

అసలు రమజాన్ నెలకు ఇంత ప్రాముఖ్యం రావడానికి కారణం ఏమిటీ? రమజాన్ నెలలోనే ఉపవాసాలు ఎందుకు పాటించాలి? ఈ ఉపవాసాల లక్ష్యం ఏమిటీ? ప్రత్యేకంగా రమజాన్ నెలలోనే ఫిత్రా దానాలు ఎందుకు చేయాలి? ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు చాలా మంది ముస్లింలకు తెలియవు. ఈ విషయంలో ఉర్దూ చదవను, వ్రాయను రాని తెలుగు ముస్లింల పరిస్థితి అయితే మరీ ఘోరం. రమజాన్ నెలకు ఇంత ప్రాముఖ్యం రావడానికి ముఖ్యమైన కారణం ఈ నెలలో మానవాళికి మార్గదర్శనం చేసే "ఖుర్ఆన్" అవతరణ ప్రారంభం కావడమే.

## 3. దివి నుండి దిగిన దివ్యౌషధి

యావత్తు ప్రపంచం భయంకర రుగ్మతలకు నెలవయిపోయింది. సమస్త మానవాళి వ్యాధిగ్రస్తమయ్యింది. ముదిరిన రోగాలతో మానవత్వం చిక్కిశల్యమయి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. దైవదాసుల హృదయాల్లో దుష్టశక్తులన్నీ తిష్ఠవేసి మానవతకు తూట్లు వేస్తున్నాయి. బహుదైవారాధనా విషక్రిములు సర్వత్రావ్యాపించి స్వైరవిహారం చేస్తున్నాయి. హింసాదౌర్జన్యాల మశూచికం విలయతాండవమాడుతోంది. అన్యాయం, అక్రమాల కలరా కార్చిచ్చులా అంటుకుపోతోంది. అశ్లీలం, అసభ్యతల అంటువ్యాధి ఆకాశానికి ఎగబ్రాకింది. మత్తుపానీయాల మహమ్మారి మనస్సులను తుత్తునియలు చేస్తోంది.

అలాంటి స్థితిలో అజ్ఞానం, అనైతికతలు అలుముకున్న ఆ నిరాశా నిశీధిలో అకస్మాత్తుగా ఓ ఆశాకిరణం మెరిసింది. అంధకారాన్ని పటాపంచలు చేస్తూ, పైశాచికతా జాడ్యాలను పారద్రోలేందుకు పుడమిపై ఓ సర్వరోగ నివారిణి అవతరించింది. ఆత్మ వికాసం కోసం పరితపించే అంతరాత్మను ఆదుకోవడానికి వరాల వసంతమయి అరుదెంచిన రమజాన్ నెలలో దివి నుండి భువిపైకి ఓ దివ్యౌషధి అవతరించింది. అదే అంతిమ దైవవాణి- పవిత్ర ఖుర్ఆన్.

ఈ మహోద్గ్రంథమే మానవాళి జీవితాన్ని సమూలంగా సంస్కరించి మానవత్వాన్ని తిరిగి అందలమెక్కించింది. ఈ దివ్యౌషధే సకల ఆధ్యాత్మిక, నైతిక, ఆర్థిక, సామాజిక రుగ్మతలను నిర్మూలించి నీతి, న్యాయం, సమత, సౌభ్రాతృత్వాలతో నిండిన ఓ అపూర్వ సత్సమాజాన్ని ఓ అద్భుత సంక్షేమ రాజ్యాన్ని నెలగొల్పింది. ఈ అమృత కలశమే వర్ణం, వర్గం, జాతి, తెగ, భాష, ప్రాంతం మొదలైన వివక్షలన్నిటినీ అంతమొందించి మొత్తం మానవాళిని శాంతీ సామరస్యాలతో కూడిన వసుధైక కుటుంబంగా మార్చివేసింది.

ఇది పధ్నాలుగు శతాబ్దాల క్రితం సంభవించిన గొప్ప చారిత్రక సంఘటన. కాని ఈనాడు అలాంటి మహత్తర గ్రంథం అందమైన గలేబుల్లో బందీ అయి అటకపై కెక్కి



కూర్చోవలసి వచ్చింది. ఇప్పుడిది కేవలం పారాయణం, ప్రార్థనల వరకే పరిమితమయి తన గత ప్రాభవాన్ని కోల్పోయింది. ముస్లింలలో అత్యధికమంది ఈ గ్రంథాన్ని అప్పుడప్పుడు ఎంతో భక్తి శ్రద్ధలతో పఠిస్తూ పరవశించిపోవడమేగాని, అది వివిధ జీవన రంగాల్లో సూచించిన బోధనలకు అనుగుణంగా తమ నీతి నడవడికలను తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయడం లేదు. రమజాన్ మాసంలో రోజాలు మటుకు ఎంతో నిష్ఠగా పాటిస్తారు. కాని ఆ రోజా లక్ష్యం దివ్యఖుర్ఆన్‌ని పూర్తిగా అనుసరించడం ద్వారానే నెరవేరుతుందన్న వాస్తవాన్ని వారు విస్మరించారు. ఈ కారణంగానే వారు దాని శుభాలకు దూరమయి అనేక సమస్యలతో సతమతమయిపోతున్నారు.

ఐరోపా ఖండంతో సహా అనేక దేశాల్లో ప్రతిరోజూ ఎందరో ప్రజలు మానవకల్పిత నియమాలతో, ఊహాజనిత సిద్ధాంతాలతో విసిగిపోయి అంతిమదైవవాణి వైపుకు మరలుతుంటే, ఆ మహాభాగ్యం కలిగివున్న ముస్లింలు హ్రస్వదృష్టితో దాన్ని పూజా పురస్కారాలకు పరిమితం చేయడం ఎంత విచారకరం! రమజాన్ శుభమాసంలోనైనా వారు ఈ విప్లవాత్మక గ్రంథంలోని బోధనలను, వాటి విలువలను గురించి ఆలోచించారా?

"మేమీ ఖుర్ఆన్‌లో విశ్వాసులకు స్వస్థత, (దైవ) కారుణ్యాలు చేకూర్చే విషయాలు అందజేస్తున్నాము. అయితే దుర్మార్గులకు మాత్రం ఇది మరింత నష్టాన్నే కలిగిస్తుంది." (ఖుర్ఆన్-17:82)

## 4. ఖుర్ఆన్ మనందరి జీవిత సంవిధానం

ఈనాడు సైన్సు, సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధించిన మానవుడు భూమండలం దాటిపోయి చంద్రమండలంపై సైతం విజయపతాకాన్ని ఎగరవేశాడు. మరోవైపు సుఖవంతమైన జీవితం కోసం అవసరమైన అత్యాధునిక సాధన సంపత్తిని కూడా సమకూర్చుకోగలిగాడు. అయితే ఎంతగా అభివృద్ధి సాధించాడో అంతగా అతను వివిధ సమస్యల్లో కూరుకుపోతున్నాడు. సమస్యలను పరిష్కరించుకోలేక సతమతమవుతూ శాంతీసంతృప్తులకు దూరమైపోయాడు. నిరంతరం ఆందోళనలతో దిక్కుతోచక మనశ్శాంతికై అలమటిస్తూ చీకటి లోయలలో తచ్చాడుతున్నాడు.

హద్దులు మీరిన స్వార్థ ప్రియత్వం, పదార్థపూజ మనుషుల్లోని మానవత్వాన్ని రోజురోజుకు దిగజార్చివేస్తున్నాయి. తత్ఫలితంగా ప్రజల మధ్య పరస్పర సహాయం, సహకారం, సానుభూతి, విశ్వాసం, మైత్రి, మమకారాలు క్షీణించిపోయాయి. వ్యక్తుల్లో చోటుచేసుకున్న ఈ అవలక్షణాలు జాతులపై తమ దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి.

సమస్యల విషవలయం నుండి బయట పడేందుకు వ్యక్తిగత, సామూహిక పరిష్కారం కోసం కొత్తకొత్త సిద్ధాంతాలు రూపొందుతున్నాయి. వాటిపై రకకాల ప్రయోగాలు జరుగుతున్నాయి. ఫలితం- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే! చేస్తున్న ప్రతి ప్రయోగం విఫలమవుతూ పోతున్నది; ప్రతి ప్రయత్నమూ బెడిసి కొడ్తున్నది. భౌతికవాదం

నుండి పుట్టుకొచ్చిన లిబరిజం, క్యాపిటలిజం, కమ్యూనిజం మొదలైన సిద్ధాంతాలన్నీ మానవాళిని మరింత పతనావస్థకే నెట్టి వేస్తున్నాయి. ఈ సిద్ధాంతాలు మన కళ్ళ ముందే బీటలు వారి సమూలంగా అంతరించి పోతున్నాయి. అంతేకాదు, వీటి ధ్వజవాహకులు, ప్రచారకులు తమ సిద్ధాంతాలపై తామే అసహాయత, అసహ్యతలను వ్యక్తపరిచి అవి విఫలమయినట్లు బహిరంగంగా ఒప్పుకున్నారు. ఇలా ఎందుకు జరిగింది?

దీనికి సమాధానం ఒక్కటే- మానవుడు కల్పించుకున్న సిద్ధాంతాలు, చేసిన ప్రయోగాలన్నీ ఏకపక్షమయిపోయాయి. అతను భౌతికవాద పరిధిని దాటి ఎన్నడూ ఆలోచించలేదు. నైతిక, ఆధ్యాత్మిక ఛాయలకు అతను క్రమంగా దూరమయిపోయాడు. నైతిక, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన ఈ సిద్ధాంతం, ఈ భావన- సృష్టికర్త, విశ్వపాలకుడు, నిజప్రభువు, యజమాని అయిన దేవుని దగ్గరే అతనికి లభిస్తుంది. విశ్వయజమాని దానికి సంబంధించిన సముచిత ఏర్పాటు కూడా చేశాడు.

మానవుడు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడల్లా సృష్టికర్త తన ప్రవక్తల ద్వారా అతనికి మార్గదర్శకత్వం చేస్తూ వచ్చాడు. కాని మనోవాంఛలకు దాసులయి పోయిన అనేకమంది ప్రజలు దైవబోధనలను ఎల్లప్పుడూ విస్మరిస్తూనే పోయారు. చివరికి విశ్వప్రభువు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ద్వారా తన దివ్య మార్గదర్శకత్వాన్ని, శాశ్వత ప్రబోధనావళిని ఖుర్ఆన్ రూపంలో మానవులకు అంద జేశాడు. అది నేటికీ మన మధ్య సురక్షితంగా ఉంది.

దివ్యఖుర్ఆన్ మన సృష్టికర్త నుండి అవతరించిన అద్భుత వాణి. అందులో మన కొరకు చక్కని మార్గదర్శకత్వం ఉంది; మన సమస్యలన్నిటికీ సరైన పరిష్కారం ఉంది; ఆధ్యాత్మిక సౌఖ్యానికి సంబంధించిన దివ్యబోధనలు ఉన్నాయి; నీతి నడవడికల నియమావళి ఉంది; ఆరోగ్యవంతమైన ఒక సత్సమాజం నిర్మాణానికి కావలసిన ప్రాతిపదికలు కూడా సూచించబడ్డాయి. ఇది మన వ్యక్తిగత, సామూహిక జీవితం కోసం ఎంతో శ్రేష్ఠమైన ఓ సమగ్ర జీవన వ్యవస్థను ప్రసాదించింది.

ప్రస్తుత ప్రపంచంలో ఎలాంటి మార్పులకు, చేర్పులకు, ప్రక్షిప్తాలకు గురికాకుండా స్వచ్ఛమైన దైవవాణి ఏదైనా ఉందంటే అది ఒక్క దివ్యఖుర్ఆన్ మాత్రమే. ఇది మానవ రచన ఎంత మాత్రం కాదు. విశ్వప్రభువు నుండి జిబ్రయీల్ దూత (అలైహి) ద్వారా ముహమ్మద్ మహోదయుని (సల్లం) హృదయ ఫలకంపై అవతరించిన జీవిత సంవిధానం. ముహమ్మద్ ప్రవక్త (స) నిరక్షరాస్యులన్న సంగతి జగద్విదితం, చారిత్రక యదార్థం, ఇందలో పరస్పర విరుద్ధ విషయాలకుగాని, మానవబుద్ధికి వ్యతిరేకమైన అంశాలకుగాని ఎలాంటి తావులేదు. ఇలాంటి అద్భుత ప్రబోధనావాహిని ఒక నిరక్ష రాస్యుని నోట జాలువారి కేవలం 23 ఏళ్ళ అతిస్వల్ప కాలంలో మానవుని సకల జీవన రంగాలలో సంపూర్ణ విప్లవం తీసుకొచ్చిందంటే ఇంతకంటే గొప్ప మహిమ మరేమి కాగలుగుతుంది? అందుకే ఖుర్ఆన్ ఒక మహిమ అని అభివర్ణించబడింది.



# 5. తొలి దివ్యావిష్కృతి

దివ్యఖుర్ఆన్ మానవరచన ఎంతమాత్రం కాదు. ఇది మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హృదయఫలకంపై అవతరించిన అంతిమ దైవగ్రంథం. యావత్తు మానవాళికి రుజుమార్గం చూపడానికి అవతరించిన దివ్యవాణి. సమస్త జీవనరంగాలలో మనిషిని మానవుడిగా తీర్చిదిద్దడానికి పంపబడిన కట్టకడపటి కరదీపిక. కేవలం ఇరవై మూడు సంవత్సరాలలో మానవుని జీవితాన్ని సమూలంగా సంస్కరించిన ఏకైక విప్లవాత్మక గ్రంథం. దురాచారాలు, అంధవిశ్వాసాలు, అనైక్యత, నీతిరాహిత్యం, హింసాదౌర్జన్యా లతో కూడిన అజ్ఞాన కారుచీకట్ల అరబ్బు సమాజంలో సత్యసంధుడిగా, నిజయితీ పరుడిగా ఖ్యాతిచెందిన మహనీయ ముహమ్మద్ (సల్లం) ద్వారా పంపబడిన అపూర్వ గ్రంథరాజం ఇది.

ఇంతకూ ఈ దివ్యవాణి మహనీయ ముహమ్మద్ (స)పై ఎలా అవతరించింది? ఎవరి ద్వారా ఆయన దగ్గరకు పంపబడింది? ఏ విధంగా ఆయన వద్దకు చేరింది? ఒక్కసారి ఆ మహనీయుని జీవిత చరిత్ర పుటలు చూద్దాం.....

అది రమజాన్ మాసం. దైవకారుణ్యం ధరిత్రిపై వర్షించే పవిత్ర మాసం. హిరా గుహలో సమస్త విషయాల నుండి దృష్టి మళ్ళించి పూర్తిగా దైవచింతనలో లీనమైపోయిన ముహమ్మద్ మహనీయుని (సల్లం) హృదయంలో రుజుమార్గం రోజురోజుకు కాంతిమంతం కాసాగింది. ఒక సుప్రభాతం వేళ హిరాగుహలో హఠాత్తుగా ఓ అద్భుత దృశ్యం ప్రత్యక్షమయింది. ఎంతో అందమైన ముఖవర్చస్సుతో కూడిన అసాధారణమైన ఓ మానవాకారం ఆయన ముందుకు వచ్చి నిలబడింది.

వచ్చీరాగానే "చదువు" అన్నాడా వ్యక్తి.

"నాకు చదవడం రాదే!" అన్నారు ముహమ్మద్ (సల్లం) తొట్రుపడి బెదురు చూపులతో చూస్తూ.

అప్పుడతను మహనీయ ముహమ్మద్ (సల్లం)ని గట్టిగా అదిమి వదిలేస్తూ 'చదువు' అన్నాడు మళ్ళీ.

"నాకు చదవడం రాదు" తిరిగి అదే జవాబు.

మళ్ళీ ఆ వ్యక్తి ఆయన్ని గట్టిగా అదిమి వదిలేస్తూ "చదువు" అన్నాడు.

ఈసారి ముహమ్మద్ (సల్లం) తనను ఆ వ్యక్తి మరింత గట్టిగా అదిమి గొంతు నులిమేస్తాడేమోనన్న భయంతో "ఏం చదవాలి?" అని అడిగారు.

"చదువు సృష్టికర్త అయిన (నీ) ప్రభువు పేరు స్మరించి. ఆయనే మానవుణ్ని గడ్డ కట్టిన రక్తంతో సృజించాడు. చదువు, నీ ప్రభువు మహోన్నతుడు, ఎంతో ఉదారుడు. ఆయనే మానవునికి కలం ద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు" అన్నాడు ఆ విచిత్ర

వ్యక్తి. (దివ్య ఖుర్ఆన్–96:1–5)

ముహమ్మద్ (సల్లం) అలాగే చదివి విన్పించారు. తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన తరువాత ముహమ్మద్ (సల్లం) గుహలోనే కొన్ని క్షణాలు భీతావహులై నిల్చున్నారు. ఓసారి చుట్టూ కలియజూసి కలవరపడ్డారు.

"ఇప్పుడెవరు తనతో మాట్లాడింది? తనను చదవమని బలవంతం చేసిందెవరు?" మనసులో పరిపరివిధాల ఆలోచనలు, అనుమానాలు రేకెత్తాయి.

గుహ నుండి చరచరా బయటికి వచ్చారు. తనకేదో పిశాచం ఆవహించిందని భ్రమపడి గబగబా గుట్టలు, మిట్టలు దాటుకుంటూ ఇంటిదారి పట్టారు.

ఇంటికి చేరుకోగానే పడక మీద వాలిపోయి "దుప్పటి కప్పు, దుప్పటి కప్పు" అన్నారు గజగజ వణికిపోతూ.

హ్రజత్ ఖదీజా (రజి) భర్త పరిస్థితి చూసి కంగారు పడిపోయారు. ఆమె వెంటనే దుప్పటి తెచ్చి కప్పారు. ఈ అసాధారణ పరిస్థితికి కారణం అడగడానికి ఆమె సాహసించలేకపోయారు.

"ఏమిటీ, ఈయన ఆరోగ్యం బాగా లేదా? ఏదైనా వ్యాధి సోకిందా? లేక మరేదైనా ఆపద వచ్చిపడిందా?"

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడచిపోయాయి. పరిస్థితి కొంచెం కుదుటపడింది. భయం దూరమయింది. వణుకు కూడా తగ్గిపోయింది. దాంతో ముహమ్మద్ (సల్లం) దుప్పటి తొలగించి లేచి కూర్చున్నారు.

అప్పుడు హ్రజత్ ఖదీజా (రజి)కు కొంచెం ధైర్యం వచ్చింది.

"ఏం జరిగిందండీ? ఒంట్లో బాగా లేదా? ఇప్పటిదాకా మీరు ఎక్కడున్నారు?"

"ఏమని చెప్పను ఖదీజా! ఎప్పుడూ జరగని ఓ వింత సంఘటన జరిగింది. నేను హిరా గుహలో కూర్చొని ఉంటే తెల్లటి వస్త్రాలు ధరించిన ఒక అందమైన వ్యక్తి వచ్చాడు నా దగ్గరికి. వచ్చిరాగానే చదవమని నన్నాజ్ఞాపించాడు. ఇలా మూడుసార్లు జరిగింది. చివరికి నేను అతను చెప్పినట్లు ఎలాగో చదివాను. ఆ తరువాత అతను వెళ్ళిపోయాడు.

నాకు భయమేసి గుహ నుండి గబగబా నడిచి ఇంటికొచ్చాను.

ఖదీజా! ఏమయింది నాకు? ఇదంతా చూస్తుంటే నాకేదో ప్రాణాపాయం కలుగుతుందని భయంగా ఉంది" అంటూ ముహమ్మద్ (సల్లం) జరిగిన వృత్తాంతమంతా భార్యకు తెలియజేశారు.

ఖదీజా చాలా తెలివితేటలుగల మహిళ. ఈ సంఘటన విని ఆమె భయపడలేదు. దాని వెనుకున్న మర్మాన్ని గ్రహించి భర్త వైపు ఎంతో గౌరవంగా చూస్తూ ఇలా అన్నారు:



"భయపడకండి. శుభఘడియ వచ్చింది, సంతోషించండి. నన్ను సృజించిన దేవుని సాక్షి! మీరు సత్యసంధులు, దయార్ద్రహృదయులు, నిజాయితీపరులు, పేదల పాలిట పెన్నిధి. మీరు అతిథులను సత్కరిస్తారు, మంచి పనులలో ప్రజలతో సహకరిస్తారు. అటువంటి వారైన మీకు దేవుడు ఎన్నటికీ ప్రాణాపాయం కలిగించడు."

అర్ధాంగి మాటలతో ముహమ్మద్ (సల్లం)కు కొంచెం ధైర్యం వచ్చింది. కలవరపాటు చాలావరకు తగ్గిపోయింది. వాడిన ముఖపద్మం వికసించింది. ఆయన క్షణంపాటు శ్రీమతి వైపు కృతజ్ఞతా భావంతో చూశారు.

తన భర్త దైవప్రవక్త కాబోతున్నాడని గ్రహించిన ఖదీజా పరమ సంతోషంతో పొంగిపోయారు. ఏమైనప్పటికీ ఈ విషయాన్ని ధృవపరచుకోవడానికి అన్నయ్య వరఖా దగ్గరికెళ్ళి అడుగుదాం అనుకున్నారు ఆమె మనసులో.

ఈ విషయాన్నే ఆమె శ్రీవారికి చెప్పి ఆయన్ని తీసుకొని వరఖా దగ్గరకు వెళ్ళారు.

వరఖా బిన్ నౌఫల్ హ్రజత్ ఖదీజా పెద్దనాన్న కుమారుడు. వరసకు అన్నవుతాడు. వయసు బాగా పైబడిన పండుముసలి. అయితే అతను గొప్ప తత్వవేత్త. వివిధ మతాలను కాచి వడబోసిన ప్రముఖ మతపండితుడు. ప్రతి విషయాన్నీ సునిశితంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునే మనస్తత్వం కలవాడు.

ఈయన మొదట యూదమతం వైపు మొగ్గాడు. తర్వాత క్రైస్తవమం స్వీకరించాడు. బైబిల్‌ని ఏండ్ల తరబడి అధ్యయనం చేసి, అందులోని లోతుపాతులు తెలుసుకున్న గొప్ప పరిశోధకుడు. అరబీలో దాన్ని అనువదించే పని కూడా ప్రారంభించాడు.

హ్రజత్ ఖదీజా (రజి) అతని ముందు ముహమ్మద్ (సల్లం)కు ఎదురైన అపూర్వ సంఘటన గురించి ప్రస్తావిస్తూ "ఈయన చెప్పేది కాస్త విను అన్నయ్యా!" అన్నారు.

వరఖా బిన్ నౌఫల్ "బాబూ! ఇంతకూ నువ్వు హిరా గుహలో ఏం చూశావు?" అని అడిగాడు ఎంతో కుతూహలంతో.

మహనీయ ముహమ్మద్ (సల్లం) జరిగిన వృత్తాంతం వివరించారు. అది విని వరఖా ఇలా అన్నాడు:

"నా ప్రాణం ఎవరి అధీనంలో వుందో ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను. నీవు వర్ణించిన ఆ అద్భుత శక్తి ఎవరో కాదు. గతంలో మూసా ప్రవక్త (అలైహి) దగ్గరకు దైవసందేశం తెస్తూవుండిన జిబ్రీల్ దూతే ఆయన. దేవుడు నిన్ను తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. నీవిప్పుడు దైవప్రవక్తవు. తౌరాత్, ఇంజీల్ గ్రంథాలలో నీ దౌత్యం గురించి భవిష్యత్ ప్రకటనలు ఉన్నాయి. నీ అనుచర సమాజం యావత్ ప్రపంచంలో వ్యాపిస్తుంది. అయితే ముహమ్మద్! నీవు దైవప్రవక్త అయినట్లు ప్రకటించావంటే లోకులు నిన్ను తిరస్కరిస్తారు. స్వస్థలం నుంచి నిన్ను వెళ్ళగొడ్తారు. చివరకు నీతో యుద్ధం చేయడానికైనా వెనుదీయరు. అప్పటిదాకా నేను బ్రతికి ఉంటే ఎంత బాగుండు!"

“ఏమిటీ, ప్రజలు నన్ను ఇక్కడ్నుంచి వెళ్ళగొడ్తారా?” ముహమ్మద్ (సల్లం) ఆశ్చర్యం వెలిబుచ్చుతూ అడిగారు.

“ఔను నాయనా! గతంలో దైవప్రవక్తలు వచ్చినప్పుడల్లా వారి జాతిప్రజలు ఇలాగే ప్రవర్తించారు. నాకా రోజులు చూసే భాగ్యముంటే నా సర్వశక్తులు వొడ్డి నిన్ను ఆదుకుంటాను” అంటూ వరఖా ప్రేమతో దైవప్రవక్త (సల్లం) నుదుటిని చుంబించాడు.

ఆ తరువాత మహనీయ ముహమ్మద్ (సల్లం) శ్రీమతితో పాటు అక్కడ్నుంచి లేచి భారంగా అడుగులేస్తూ ఇంటికి చేరుకున్నారు.....

# 6. ఖుర్ఆన్ అవతరణ విధానాలు

ఇలా ప్రారంభమయింది ఖుర్ఆన్ అవతరణ పరంపర. తొలి దివ్యావిష్కృతి అవతరణ తరువాత దైవదూత జిబ్రీల్ (అలైహి) ఒక్కోసారి మానవాకారంలో, మరొక్కోసారి తన నిజరూపంలో వచ్చి ముహమ్మద్ మహనీయుని (స)కి తరుచుగా దైవసందేశం అందజేస్తుండేవారు. ఈ దివ్యసందేశం సృష్టికర్త నుండి దైవదూత జిబ్రీల్ ద్వారా ముహమ్మద్ ప్రవక్త (సల్లం) హృదయ ఫలకంపై అవతరిస్తుంది. అప్పుడు ఆయన ఒక విధమైన విచిత్రానుభూతికి లోనయ్యేవారు.

ఓసారి ఆయన ఒంటెపై ప్రయాణం చేస్తుంటే దైవసందేశం అవతరించింది. ఈ దివ్యావిష్కృతి (Revelation) కలగజేసిన భారాన్ని ఒంటె భరించలేక క్రుంగిపోతూ అతికష్టంగా నిలదొక్కుకోగల్గింది. ఒక్కోసారి దివ్యావిష్కృతి గణగణమంటూ గంట మోతలా విన్పిస్తూ అవతరిస్తుంది. అది దైవప్రవక్త (సల్లం)కు ఎంతో బాధాకరంగా ఉంటుంది. ఆ తర్వాత దైవప్రోక్త సూక్తులు ఆయన స్మృతిపథంలో నిలిచిపోతాయి.

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం ఓసారి దైవసందేశం అవతరిస్తున్న సమయంలో ఆమె ఆయన పరిస్థితి గమనించారు. అప్పుడు అపరిమితమైన చలి ఉండింది. అయినప్పటికీ ఆయన ఫాలభాగంపై ముచ్చెమటలు పోశాయి.

బూటకపు బాబాలు, దొంగస్వాములు, బహుదైవారాధక సాధువుల్లా మహనీయ ముహమ్మద్ (సల్లం) “నాకు దేవుడు కలలో కన్పించి ఇలా ఉపదేశించాడ”ని లేదా “ధ్యానంలో లీనమైపోయినప్పుడు నాకు దైవప్రేరిత జ్ఞానోదయం అయింద”ని జనంతో ఎప్పుడూ చెప్పుకోలేదు. తాను నేరుగా దైవప్రేరణతో దైవప్రవక్తనయ్యానని లేదా తాను సాక్షాత్తు అవతారపురుషుణ్ణని కూడా ఆయన ప్రకటించుకోలేదు.

# 7. దైవసందేశహరుడు జిబ్రీల్ (అలై)

మహనీయ ముహమ్మద్ (సల్లం) తాను విశ్వసృష్టికర్త చేత నియమించబడిన దైవప్రవక్త అని, ఆ సృష్టికర్త నుండే దైవదూత జిబ్రీల్ (అలైహి) ద్వారా తనపై దైవ సందేశం అవతరిస్తుందని మాత్రమే చెప్పుకున్నారు.



“ఇది సర్వలోకప్రభువు అవతరింపజేసిన (అద్భుత)వాణి. దీన్ని తీసుకొని నమ్మకస్తుడయిన దైవదూత స్పష్టమయిన అరబీభాషలో నీ హృదయఫలకంపై అవతరింపజేశాడు, నీవు (దైవదాసుల్ని) హెచ్చరించేవారిలో చేరాలన్న ఉద్దేశ్యంతో. (ఏకదైవారాధన, దైవప్రవక్తపట్ల విధేయత, పరలోకభావన వంటి) ఈ విషయాలు పూర్వీకుల గ్రంథాలలో కూడా ఉన్నాయి.” (ఖుర్ఆన్-26:192-196)

“వారికిలా చెప్పు: ‘దీన్ని పరిశుద్ధాత్మ యధాతథంగా మీ ప్రభువు దగ్గర నుండి అవతరింపజేశాడు. విశ్వాసుల విశ్వాసాన్ని మరింత పటిష్ఠం చేయడానికి, విధేయులైన వారికి సన్మార్గం చూపి, శుభవార్త అందజేయడానికి (ఈ గ్రంథం అవతరించింది)’. నీ గురించి వారు, ఒక వ్యక్తి ఇతనికి నేర్పుతున్నాడని చెబుతున్న సంగతి మాకు తెలుసు. కాని వారు ఏ మనిషిని ఉద్దేశించి ఈ మాటలు అంటున్నారో అతను అరబ్బేతరుడు. ఇదేమో స్పష్టమైన అరబీ భాషలో అవతరించింది.” (ఖుర్ఆన్-16:102,103)

దేవుని దగ్గర్నుంచి ఆయన ప్రవక్తలకు దివ్యావిష్కృతి (వహీ)ని చేరవేసే దైవదూత హజ్రత్ జిబ్రీల్ (అలైహి)ని ఇక్కడ పరిశుద్ధాత్మ అని పేర్కొనబడింది.

“మానవులారా! మీ ప్రభువు వైపు నుండి మీ దగ్గరికి స్పష్టమైన ప్రమాణం వచ్చింది. మేము (మీ అజ్ఞానాంధకారం దూరంచేసి రుజుమార్గం చూపడానికి) మీ దగ్గరకు స్పష్టమైన జ్యోతి పంపాము.” (ఖుర్ఆన్-4:174)

“వారికి చెప్పు: ‘జిబ్రీల్ పట్ల విరోధభావం ఉన్నవారు ఒక విషయం తెలుసుకోవాలి. జిబ్రీల్ దేవుని ఆజ్ఞతోనే ఈ గ్రంథం నీమీద అవతరింపజేశాడు. ఇది గతంలో అవతరించిన గ్రంథాలను ధృవీకరిస్తోంది; విశ్వసించేవారికి సన్మార్గం చూపి, సాఫల్య శుభవార్త నందజేస్తుంది.” (ఖుర్ఆన్-2:97)

“(మక్కా ప్రజలారా! వినండి.) మీ సహచరుడు (ముహమ్మద్) పిచ్చివాడేమీ కాదు. ఇతనా సందేశహరుడ్ని ప్రకాశవంతమైన దిగ్మండలంపై ప్రత్యక్షంగా చూశాడు. ఇతను అతీంద్రియ (జ్ఞానం ప్రజలకు అందజేసే) వ్యవహారంలో ఏమాత్రం పిసినారితనం వహించడు. ఇది శాపగ్రస్తుడయిన షైతాన్‌కు సంబంధించిన వాక్కు కూడా కాదు. అలాంటప్పుడు మీరు (దారితప్పి) ఎటు పోతున్నారు? (ఖుర్ఆన్-81:22-26)

“అస్తమిస్తున్న నక్షత్రం సాక్షి! మీ సహచరుడు (పొరపాటున కూడా) దారితప్ప లేదు, (కావాలని కూడా) పెడదారి పట్టలేదు. అతను తన మనోవాంఛలకు తలయొగ్గి మాట్లాడడు. ఇది అతని (హృదయఫలకం)పై అవతరింపజేయబడిన దివ్యావిష్కృతి. ఎంతో వివేకవంతుడయిన ఓ మహాశక్తిమంతుడు (జిబ్రీల్) అతనికీ విషయాలు నేర్పుతున్నాడు. అతను తూర్పుదిక్కున ఎగువ దిగ్మండలంపై ఉన్నప్పుడు ఇతను అతనికి ఎదురుగా నిలబడ్డాడు. తరువాత మరికాస్త దగ్గరగా వచ్చి శూన్యంలో నిల్చున్నాడు. ఈవిధంగా అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంతకంటే కొంచెం తక్కువ

దూరాన (వచ్చి) నిలబడ్డాడు. అప్పుడతను దైవదాసునికి అందజేయవలసిన దివ్య సందేశం అందజేశాడు. కళ్ళు చూసినదానిలో హృదయం అసత్యాన్ని మిళితం చేయ లేదు. ఇలా చర్మచక్షువులతో చూసిన దాని విషయంలో మీరు ఇతనితో వాదిస్తున్నారా?" (ఖుర్ఆన్–53:1–12)

"ఇతను మరోసారి కూడా అతడ్ని (సప్తమాకాశంలో) 'సిద్రతుల్ ముస్తహా' అనే దివ్య వృక్షరాజం దగ్గర చూశాడు. దాని దరిదాపులోనే నివాసయోగ్యమైన స్వర్గధామం ఉంది. ఆ సమయంలో ఆ వృక్షరాజంపై అనిర్వచనీయమైన అద్భుతమేదో ఆవరిస్తూ ఉండింది. అతని చూపులు వేరేవైపు మరలడంగాని, హద్దుమీరి ముందుకు పోవడంగాని జరగలేదు. (ఈవిధంగా) అతను తన ప్రభువు (ప్రతిభ)కు సంబంధించిన గొప్ప నిదర్శనాలలో (అంటే మహిమలలో) కొన్నిటిని చూశాడు." (ఖుర్ఆన్–53:13–18)

పై సూక్తులలో అతను అంటే దైవప్రవక్తలకు దివ్యావిష్కృతి (వహీ) అందజేసే దైవదూత జిబ్రీల్ (అలై) అని అర్థం. ఇతను అంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) అని అర్థం. దైవప్రవక్త (స) ఖుర్ఆన్ అవతరణ ప్రారంభరోజుల్లో జిబ్రీల్ (అలై)ని మొదటిసారిగా ఆయన అసలురూపంలో చూశారు. అప్పుడు జిబ్రీల్ దూత ఆరొందల రెక్కలతో యావత్తు నభోమండలంలో విస్తరించి ఉన్నారు. ఈ అసాధారణ దృశ్యం చూసి ముహమ్మద్ ప్రవక్త (సల్లం) భయపడిపోయారు.

మహనీయ ముహమ్మద్ (సల్లం) జిబ్రీల్‌దూత (అలైహి)ను రెండవసారి ఆయన అసలు రూపంలో మేరాజ్ సంఘటన సందర్భంగా చూశారు. దేవుడు దైవప్రవక్త (స)ను సప్తాకాశాల పర్యటన చేయించి అక్కడి అద్భుతాలను చూపించాడు. దీన్నే "మేరాజ్" సంఘటన అంటారు.

కొందరు ఈ సూక్తులు విని దైవప్రవక్త (సల్లం) దేవుడ్ని ప్రత్యక్షంగా చూశారని అపార్థం చేసుకున్నారు. ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని ఖండిస్తూ "మీలో ఎవరైనా ముహమ్మద్ (స) తమ ప్రభువుని చూశారని అంటే అతను అబద్ధ మాడుతున్నాడన్నమాట" అన్నారు. మరొక సందర్భంలో "ముహమ్మద్ (సల్లం) తమ ప్రభువుని చూశారని ఎవరైనా అన్నాడంటే అతను దేవునిపై ఘోరమైన నింద మోపు తున్నాడన్నమాట" అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని గురించి దైవప్రవక్త (స)ను అడిగినప్పుడు, తాను దేవుడ్ని చూడలేదని, జిబ్రీల్(దూత)ను మాత్రమే ఆకాశం నుండి దిగుతున్నప్పుడు చూశానని అన్నారు ఆయన. (వివరాలకు బుఖారి చూడండి.)

ముస్లిం, నసాయి, ముస్నద్ అహ్మద్, తబ్రానీ గ్రంథాలలో హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించి పేర్కొనబడిన ఉల్లేఖనాలు ఈ విధంగా ఉన్నాయి:

(1)"దైవప్రవక్త (సల్లం) తమ ప్రభువును హృదయంతో రెండుసార్లు చూశారు." (2)"దైవప్రవక్త (సల్లం) తమ ప్రభువును కళ్ళతో కాకుండా హృదయంతో చూశారు."



(3)"దేవుడు ఇబ్రాహీం (అలైహి)ని తన మిత్రుడిగా చేసుకున్నాడు; మూసా (అలైహి)తో ప్రత్యక్షంగా సంభాషించాడు; ముహమ్మద్ (సల్లం)కు తన దర్శనభాగ్యం కలిగించాడు; ఈవిషయం విని మీరు ఆశ్చర్యపడుతున్నారా?" (4)" నేను నాప్రభువుని చూశాను" అని స్వయంగా దైవప్రవక్త (స) చెప్పారు. (5) "ఈరోజు రాత్రి నా ప్రభువు అత్యంత శ్రేష్ఠమైన రూపంతో నా దగ్గరకు వచ్చాడు" అని దైవప్రవక్త (స) చెప్పారు. దైవప్రవక్త దేవుడ్ని స్వప్నంలో చూశారని ఆయన మాటలకు అర్థం కావచ్చని నేను భావిస్తున్నాను." (6)"దైవప్రవక్త (సల్లం) తమ ప్రభువుని రెండుసార్లు చూశారు. ఒకసారి కళ్ళతో, మరొక సారి హృదయంతో చూశారు."

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించిన పై ఉల్లేఖనాలన్నీ ఒక దాంతో మరొకటి పొంతన లేకుండా అసంబద్ధంగా ఉన్నాయని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు. అదీగాక ఇవిక్కడ పేర్కొనబడిన ఖుర్ఆన్ సూక్తికి అనుగుణంగా లేకపోవడం కూడా గమనార్హం.

తిర్మిజి గ్రంథం ప్రకారం అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఒక సమావేశంలో మాట్లాడుతూ "దేవుడు తన దర్శన భాగ్యాన్ని, ప్రత్యక్ష సంభాషణను ముహమ్మద్ (స), మూసా (అలైహి)ల మధ్య విభజించాడు. ఆయన మూసా (అలై)తో రెండుసార్లు ప్రత్యక్షంగా మాట్లాడాడు. ముహమ్మద్ (సల్లం)కు ఆయన రెండుసార్లు తన దర్శన భాగ్యం కలిగించాడు"అని అన్నారు. హజ్రత్ మస్రూఖ్ ఈమాట విని హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకెళ్ళి "అమ్మా! ముహమ్మద్ (సల్లం) తమ ప్రభువుని చూశారా?" అని అడిగారు. హజ్రత్ ఆయిషా (రజి) "నీ మాటలు విని నా రోమాలు (భయంతో) నిక్క బొడుచుకున్నాయి" అన్నారు. ఆ తరువాత ఆమె రెండవ పేరాలో పేర్కొన్నట్లు అలా అనడం అబద్ధమాడటంతో సమానమని, దైవప్రవక్త (సల్లం) దేవుడ్ని కాదు, దైవదూత జిబ్రీల్ (అలైహి)ని మాత్రమే చూశారని తెలియజేశారు.

మరొక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు: "ఈ విషయంలో అందరికంటే ముందు నేనే దైవప్రవక్త (సల్లం)ను, మీరు మీ ప్రభువును చూశారా అని అడిగాను. దానికాయన "లేదు, నేను జిబ్రీల్‌ని మాత్రమే ఆకాశం నుండి దిగుతుంటే చూశాను" అన్నారు.

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో అబూజర్ గిఫ్ఫారి (రజి) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త (సల్లం)ను "మీరు మీ ప్రభువును చూశారా?" అని అడిగాను. దానికాయన "నాకు, దైవదర్శనానికి మధ్య జ్యోతి అడ్డుతెరగా నిలిచింది"అన్నారు. మరో ఉల్లేఖనం ప్రకారం "నేను నా ప్రభువును చూడలేదు, జ్యోతిని చూశాను" అన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం "దేవుని సృష్టితాలలో ఏ ఒక్కరి దృష్టీ ఆయన్ని చేరుకోజాలదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

# 8. దైవప్రవక్త(స) ఆజ్ఞలే మనకు శిరోధార్యం

దైవధర్మానికి దేవుని ఏకత్వం కేంద్రబిందువు వంటిది. ఆ కేంద్రబిందువుని చేరుకోవడానికి, తదనుగుణంగా మనుగడ సాగించి ఇహపర లోకాలలో సాఫల్యం పొందడానికి ప్రవక్తల దౌత్యం ఒక్కటే పరమపద సోపానం. కనుక సృష్టికర్త, విశ్వపాలకుడైన ఏకైక దేవుడు మాత్రమే ఆరాధనకు అర్హుడని విశ్వసించేవారు ఆ ఆరాధనా విధానాలను తెలుసుకోవడానికి ఆయన ప్రవక్తలను కూడా తప్పనిసరిగా విశ్వసించవలసి ఉంది.

దేవునికి మానవులకు మధ్య దౌత్యం నెరపడానికి దైవప్రవక్తలే సంధాన కర్తలుగా వ్యవహరిస్తారు. దేవుడు వీరిని ప్రతి యుగంలో మానవుల నుండే ఎన్నుకొని మానవులకు రుజుమార్గం చూపుతూ వచ్చాడు. ఒక ప్రవక్త బోధనలు ప్రక్షిప్తాలకు గురయినప్పుడల్లా మరో ప్రవక్తను ఉద్భవింపజేసేవాడు. ఈ ప్రవక్తల పరంపరలోని కడపటి దైవప్రవక్తే మహనీయ ముహమ్మద్ (సల్లం). అందువల్ల అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని విశ్వసించి, ఆయన బోధనలను అనుసరించడం ఇప్పుడు యావత్తు మానవులకు విధి అయి పోయింది. మరోమాటలో చెప్పాలంటే ముక్తి, మోక్షాలు పొందడానికి ఇప్పుడు ముహమ్మద్ మహనీయుని (సల్లం) దౌత్యం మాత్రమే ఏకైక మార్గం.

దేవుడు తన అంతిమ గ్రంథం దివ్యఖుర్ఆన్‌లో ఈ విషయాన్నే విశదీకరిస్తూ "ఓ మానవులారా! మీ ప్రభువు వైపు నుండి (మా) ప్రవక్త సరైన బోధనలను తెచ్చాడు. కనుక ఆయన్ని విశ్వసించండి, మీకు మేలు జరుగుతుంది" అని ఆదేశించాడు. మరొకచోట "ఎవరయితే ప్రవక్త ఆజ్ఞను శిరసావహిస్తాడో అతను దేవుని ఆజ్ఞను శిరసావహించినట్లే"నని తెలియజేశాడు. దైవప్రవక్త తనకు దేవుడు అందజేసిన విషయాలనే మానవులకు చేరవేస్తాడు గనుక ప్రవక్త ఆజ్ఞలను పాటించడమంటే దేవుని ఆజ్ఞలను పాటించడమే అవుతుంది. అలాగే ఒక వ్యక్తి ప్రవక్తను ప్రేమిస్తున్నాడంటే దైవాన్ని ప్రేమిస్తున్నాడని గ్రహించాలి.

అయితే ఈనాడు దైవప్రవక్త (సల్లం)పై తమకు ఎనలేని ప్రేమ ఉందని చెప్పుకునే వారు ఆయనకొరకు అత్యధికంగా దరూద్ పఠించడం వరకే పరిమితమయిపోవడం ఎంతో విచారకరం. ధర్మ వ్యవహారాలకు సంబంధించిన ప్రతి సందర్భంలోనూ వీలైనంత ఎక్కువగా దరూద్ పఠిస్తే చాలు ఇక తమ బాధ్యత తీరిపోయినట్లేనని భావిస్తున్నారు వీరు. అంతేగాని జీవితంలోని సమస్త రంగాల్లోనూ ఆ మహనీయుని బోధనలను అనుసరించాల్సిన ఆవశ్యకతను వీరు అర్థం చేసుకోలేకపోతున్నారు.

మరికొందరు అయితే దైవప్రవక్త (సల్లం)ను హద్దుమీరిన పొగడ్తలతో ఆకాశానికి ఎత్తారు. అంటే హిందూమతంలోని ఆత్మ-పరమాత్మలను కలిపేసిన తత్వవిచారంలా దైవప్రవక్త (సల్లం)ను దేవుని స్థాయికి చేర్చి, ఆయన అసలు మానవుడు కాదు అనేవరకు పోయారు. ఈ భావన 'ఇఖ్లాస్' సూరాకు ఎంత విరుద్ధమైనదో ఆలోచించండి.



# 9. ఖుర్ఆన్ ఛాలెంజ్!

ఖుర్ఆన్‌లోని భాషాశైలిని, విషయతీరును గమనిస్తే, ఇది తప్పకుండా దైవవాణేనని మన అంతరాత్మ అప్రయత్నంగా ఘోషిస్తుంది. అందువల్ల ఖుర్ఆన్‌లోని సూక్తుల్ని, వాటి శైలిని పరిశీలించి ప్రశాంతంగా ఆలోచించమని దేవుడు మానవుల్ని కోరుతున్నాడు.

"వారు ఖుర్ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ వద్ద నుండి గాక మరెవరి వద్ద నుండో వచ్చి వుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా!" (4:82)

దైవభీతి, పరలోక చింతనల ప్రవృత్తి గలవారిని కదలించడానికి ఇలాంటి సూక్తులెన్నో ఉన్నాయి ఈ గ్రంథంలో. ప్రపంచపూజారులను గురించి, అంతరాత్మ ప్రబోధనను నొక్కిపెట్టిన వారిని గురించి మాత్రం మనం ఏమీ అనలేము. అలాంటి వారి ముందు ఎన్ని ప్రమాణాలు వచ్చినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే అవుతుంది. కాకపోతే ఈ గ్రంథం దైవవాణియా కాదా అని అనుమానంలో పడేవారికి స్వయంగా ఖుర్ఆన్ ఇలా ఒక సవాలు విసరుతోంది:

"వారికి చెప్పు: 'యావత్తు మానవులు, జిన్నులు ఏకమయి కఠోరతపస్సు చేసినా, పరస్పరం సహకరించుకున్నా, ఖుర్ఆన్‌లాంటి గ్రంథాన్ని ఎన్నటికీ రచించలేరు." (దివ్యఖుర్ఆన్-17:88)

"వారు ఈగ్రంథాన్ని స్వయంగా అతనే కల్పించుకున్నాడని అంటున్నారా? అయితే వారినిలా అడుగు: 'సరే, ఇలాంటి పది అధ్యాయాలు రచించి తీసుకురండి. (కావాలంటే) ఈ పనిలో మీకు సహాయపడేందుకు ఒక్క దేవుడ్ని వదలి మీరు ఎవరెవర్ని పిలుచుకోగలరో వారందర్నీ పిలుచుకోండి. మీరు నిజాయితీపరులైతే (ఈపని చేసి చూపండి). వారు గనక మీ సహాయానికి రాకపోతే ఈ గ్రంథం (మానవమేధాజనితం కాదని,) దైవజ్ఞానంతో అవతరించిందని, ఆ దేవుడు తప్ప మరో ఆరాధ్యుడు లేడని తెలుసుకోండి. మరి మీరు (ఇప్పటికైనా ఈ సత్యానికి) తల వొగ్గుతారా?" (ఖుర్ఆన్-11:13,14)

"దీన్ని దైవప్రవక్త స్వయంగా రచించుకున్నాడని అంటున్నారా వారు? వారికిలా చెప్పు: 'మీ ఆరోపణ నిజమయితే ఇలాంటి ఒక అధ్యాయం రచించి తీసుకురండి. (కావాలంటే) ఈ పనికోసం ఒక్క దేవుడ్ని వదలి మీరు ఎవరెవరిని పిలుచుకోగలరో వారందర్నీ పిలుచుకోండి.' అసలు వారు తమకు తెలియని విషయాన్ని (మూర్ఖంగా) తిరస్కరిస్తున్నారు. దాని వాస్తవికత ఏమిటో వారికింకా తెలియదు. వారికి పూర్వం ఉండిన ప్రజలు కూడా ఇలాగే నిరాకరించారు. ఇకచూడు, ఆ దుర్మార్గులకు ఎలాంటి గతి పట్టిందో!" (ఖుర్ఆన్-10:38,39)

"ఇతను ఖుర్ఆన్‌ని స్వయంగా కల్పించుకున్నాడ'ని అంటున్నారా? అసలు వీరు సత్యాన్ని విశ్వసించడానికే సిద్ధంగా లేరు. వీరు తమ అభిప్రాయమే నిజమనుకుంటే

ఇలాంటి అద్భుతమైన వాణినొకదాన్ని రచించి తీసుకురమ్మను." (52:33,34)

"ఒకవేళ మా దాసునిపై అవతరింపజేసిన ఈ గ్రంథం గురించి మీకేదయినా అనుమానముంటే ఇందులోని అధ్యాయంలాంటి ఓఅధ్యాయం రచించి తీసుకురండి. ఈపని కోసం ఒక్క దేవుణ్ణి వదలి మీ మద్దతుదారులందర్నీ పిలుచుకోండి. మీరు సత్య వంతులయితే ఈ పని చేసిచూపండి. మీరీ పని చేయలేకపోతే.... ఎంతమాత్రం చేయలేరు....మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్య తిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి ఉంది." (ఖుర్ఆన్-2:23,24)

ఈ సవాలును ఈనాటివరకూ ఎవరూ ఎదుర్కోలేక పోయారు. దైవప్రవక్త (స) కాలంలో గొప్పగొప్ప కవులు, రచయితలు ఈ సవాలును ఎదుర్కోలేక చేతులెత్తేశారు. ఒకసారి కావ్యపూర్ణం కోసం "కౌసర్" అధ్యాయంలోని మొదటి సూక్తిని ఓ చర్మపు పొరపై రాసి కాబాగోడకు వ్రేలాడ దీయడం జరిగింది. దాన్ని పూరించడానికి చాలామంది కవులు ప్రయత్నించారు. కాని ఒక్కరూ కావ్య పూర్ణం చేయలేక పోయారు. ఆ తరువాత ఆ అధ్యాయం పూర్తిగా అవతరించింది. దాన్ని చూసి ఆ కవులు సిగ్గుతో తలలు దించుకొని, ఇది మానవరచన ఎంతమాత్రం కాదని గ్రహించారు.

క్రీ.శ.727లో జరిగిన మరో సంఘటన గమనించండి. ప్రజల్ని అమితంగా ప్రభావితం చేస్తున్న ఖుర్ఆన్‌ని చూసి కొందరు సత్యవ్యతిరేకులు ఇలాంటిదే మరో గ్రంథం రచించాలని ఓ పథకం వేశారు. ఈ పనికి వారు ఆ కాలంలో గొప్ప పండితుడిగా ప్రసిద్ధిచెందిన ఇబ్నుల్‌మఖ్ఫా అనే వ్యక్తిని సంప్రదించారు. అతను ఓ సంవత్సరంలోనే తానీ పని పూర్తి చేస్తానని వారికి హామీనిచ్చి రచనా కార్యానికి ఉపక్రమించాడు. ఆరు మాసాల తరువాత వారు పని ఎంత వరకు వచ్చిందోనని చూడటానికి అతని దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో అతను చేతిలో కలం, కాగితాలు పట్టుకొని దీర్ఘాలోచనలో మునిగివున్నాడు. అతని ముందు రాసి చించేసిన కాగితాలు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. కాని ఆ మహారచయిత ఖుర్ఆన్‌ని పోలిన ఒక్క వాక్యం కూడా రాయలేకపోయాడు. అతను తన అసమర్థతకు సిగ్గుపడుతూ ఓటమి అంగీకరించి ఆ రచనాబాధ్యత నుండి తప్పుకున్నాడు. (Mohammad, His life and Doctrine P.143, by Wollaston)

## 10. ఖుర్ఆన్-ఆధునిక పాఠ్యగ్రంథం

"ఈ గ్రంథం సర్వలోక ప్రభువు నుండి అవతరించింది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. (ఇలాంటి గ్రంథం గురించి) వీరు 'దీన్ని ఇతను కల్పించుకున్నాడ'ని అంటున్నారా? కాదు. ఇది నీ ప్రభువు నుండి వచ్చిన సత్యం." (ఖుర్ఆన్-32:2,3)

"ఖుర్ఆన్ దేవుని దగ్గరనుండి దివ్యావిష్కృతి లేకుండా మానవులు తమంతట తాము రచించుకోగల గ్రంథం కాదు. ఇది పూర్వం అవతరించిన దైవగ్రంథాల్ని ధృవీకరిస్తున్న దివ్యగ్రంథం, (వాటన్నిటి మౌలిక బోధనలను) విపులీకరించే సమగ్ర గ్రంథం. ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన గ్రంథం. ఇందులో ఎలాంటి సందేహం లేదు." (ఖుర్ఆన్-10:36,37)



"విషయస్పష్టత కలిగిన మా సూక్తులు విన్పించడం ద్వారా సత్యం వారి ముందుకు వచ్చినప్పుడు ఈ తిరస్కారులు దాన్ని గురించి "ఇదంతా మాయాజాలం" అంటారు. దైవసందేశహరుడు దీన్ని స్వయంగా కల్పించుకున్నాడని అంటున్నారా వీరు? అయితే వారికిలా చెప్పు: 'నేనొకవేళ దీన్ని స్వయంగా కల్పించుకుంటే, దేవుని పట్టునుండి మీరు నన్ను ఏ విధంగానూ కాపాడలేరు. మీరు కల్పించి చెబుతున్న మాటలను గురించి దేవునికి బాగా తెలుసు. (ఈ విషయంలో) నాకూ మీకూ మధ్య దేవుడే సాక్షి. (కనుక ఇప్పటికైనా మీ వైఖరి మార్చుకుంటే) ఆయన ఎంతో క్షమించే వాడు, కరుణించేవాడు." (ఖుర్ఆన్-46:7,8)

"ముహమ్మద్ (సల్లం)! వారికీ సంగతి కూడా తెలియజెయ్యి: 'నేనేమీ ఈనాడు కొత్తగా వచ్చిన ప్రవక్తను కాను. (నాలాంటి ప్రవక్తలు పూర్వం కూడా ఎందరో వచ్చి పోయారు.) రేపు మీ విషయమైనా, నా విషయమైనా ఏమవుతుందో నేను చెప్పలేను. నేను నా దగ్గరకొస్తున్న దివ్యావిష్కృతిని అనుసరిస్తున్నవాణ్ణి మాత్రమే. నేను (విషయం గురించి ప్రజలను) స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి తప్ప మరేమీ కాను." (ఖుర్ఆన్-46:9)

"వారికిలా చెప్పు: 'ఇది దేవుని దగ్గర్నుండే వచ్చిన వాణి అయివుండి, దాన్ని మీరు తిరస్కరిస్తే (రేపు ప్రళయదినాన మీ గతేమవుతుంది)? దీన్ని గురించి ఆలోచించారా మీరు? ఇలాంటిదే (గతంలో) ఒకవాణి వచ్చినప్పుడు ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక సాక్షి దానికి అనుకూలంగా సాక్ష్యం ఇచ్చాడు. (అది బోధించే సత్యాన్ని) అతను విశ్వసించాడు. కాని మీరు మాత్రం గర్వపోతులయి పోయారు. అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సద్బుద్ధి ప్రసాదించడు." (ఖుర్ఆన్-46:10)

"దీనికి పూర్వం మూసా (ప్రవక్త)కు ఇవ్వబడిన (తౌరాత్) గ్రంథం (మానవుల పాలిట) మార్గదర్శినిగా, (దైవ)కారుణ్యంగా వచ్చింది. ఇప్పుడీ (గ్రంథం దాన్ని ధృవీకరిస్తూ దుర్మార్గుల్ని హెచ్చరించడానికి, సన్మార్గ వైఖరి అవలంబించే వారికి శుభవార్త అందజేయడానికి అరబీ భాషలో అవతరించింది. (ఖుర్ఆన్-46:12)

"దేవుడే తమ ప్రభువని పలికి, ఆమాట పైన్నే స్థిరంగా ఉండేవారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. అలాంటివారికే స్వర్గ ప్రవేశం లభిస్తుంది. వారు భూలోకంలో చేసిన సత్కార్యాలకు ప్రతిఫలంగానే ఈ స్వర్గభాగ్యం లభిస్తుంది. అక్కడే వారు కలకాలం (సుఖంగా) ఉంటారు. (ఖుర్ఆన్-46:13,14)

"మేము జిన్నుల సమూహం ఒకదాన్ని ఖుర్ఆన్ వాణి వినేందుకు నీదగ్గరకు పంపాము. వారు (నీవు ఖుర్ఆన్ పఠిస్తున్న) స్థలానికి చేరుకొని పరస్పరం నిశ్శబ్దంగా

ఉండండని అన్నారు. ఖుర్‌ఆన్ పఠనం ముగిసిన తరువాత వారు హెచ్చరించేవారుగా తమ జాతిప్రజల దగ్గరికెళ్ళి (ధర్మబోధ చేస్తూ) వారితో ఇలా అన్నారు: 'మాజాతి సోదరులారా! మేమొక (అద్భుత) గ్రంథం విన్నాం. ఇది మూసా నిష్క్రమణ తరువాత అవతరించింది. పూర్వం అవతరించిన (దైవ) గ్రంథాలను ధృవీకరిస్తోంది. సత్యం, సన్మార్గాల వైపు మార్గదర్శనం చేస్తుంది. కనుక మాజాతి సోదరులారా! దేవుని వైపు పిలిచేవాని పిలుపు అందుకోండి. ఆయన్ని విశ్వసించండి. దేవుడు మీ తప్పులు మన్నిస్తాడు. మిమ్మల్ని ఘోరశిక్ష నుండి రక్షిస్తాడు." (ఖుర్‌ఆన్–46:29–31)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ధర్మప్రచారం కోసం తాయిఫ్ వెళ్ళి అక్కడ పరిస్థితి అనుకూలించనందున బాధాతప్త హృదయంతో మళ్ళీ మక్కా పట్నానికి తిరుగు ముఖం పట్టారు. దారిలో ఆయన నఖ్లా అనే చోట విడిది చేశారు. ఆ రాత్రి ఆయన నమాజులో ఖుర్‌ఆన్ పఠిస్తుంటే జిన్నుల (భూతాల) సమూహం ఒకటి యాదృచ్ఛికంగా అటువచ్చి ఖుర్‌ఆన్ బోధ విన్నది. అయితే ఈ సంగతి దైవప్రవక్త (సల్లం)కు ఏమాత్రం తెలియదు. ఆ తరువాత దేవుడు ఈ సంఘటన గురించి దివ్యావిష్కృతి ద్వారా ఆయనకు తెలియజేశాడు.

ఖుర్‌ఆన్ మానవులకోసమే గాక జిన్నులకోసం కూడా వచ్చింది. అందువల్ల ఈ సంఘటనలో జిన్నులు ఖుర్‌ఆన్ విని విశ్వసించారు. తరువాత వారు తమ జాతి ప్రజలకు దగ్గరికెళ్ళి దాన్ని ప్రచారం కూడా చేశారు. ఈ సంఘటన తర్వాత జిన్నులు తరచుగా దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఖుర్‌ఆన్ విని పోతుండేవారు. దైవప్రవక్త (సల్లం) మక్కాలో ఉన్న కాలంలో జిన్నులు ఈవిధంగా ఆరుసార్లు వచ్చి పోయారని తెలుస్తోంది. కొన్ని హదీసుల్ని బట్టి దైవప్రవక్త (సల్లం) జిన్నుల విజ్ఞప్తిపై నిర్ణీత సమయానికి ఓ ప్రత్యేక నిర్జన ప్రదేశానికెళ్ళి ఖుర్‌ఆన్ పఠించేవారని, అప్పుడు జిన్నులు ఆయన చుట్టూ చేరి ఆ దైవవాణిని శ్రద్ధగా వినేవారని తెలుస్తోంది.

"దైవసందేశ ప్రచారకుని మాట విననివాడు ప్రపంచంలో దేవుని పట్టునుండి తప్పించు కోలేడు. అంతేకాదు, దేవుని పట్టునుండి కాపాడగలిగే ఏ సహాయకుడుగాని, సంరక్షకుడుగాని అతనికి లభించదు. ఇలాంటివారే పూర్తిగా మార్గభ్రష్టత్వంలో పడిపోయేవారు." (ఖుర్‌ఆన్–46:32)

## 11. మానవ విరచితం కాదు

"దేవుడు తప్ప మరో ఆరాధ్యుడు లేడని చెబితే 'ఏమిటీ! ఓ పిచ్చికవి చెప్పే మాటలు విని మాదైవాలను వదలుకోవాల్నా?' అంటారు వారు గర్వంతో. కాని అతను సత్యం తీసుకొచ్చాడు. గతప్రవక్తల (బోధనల)ను ధృవపరుస్తున్నాడు.(అలాంటి ప్రవక్తను నిరాకరిస్తే) మీరు తప్పకుండా అతి బాధాకరమైన శిక్ష చవిచూడవలసి వస్తుంది. మీకు లభించే ప్రతిఫలం మీరు చేసుకునే కర్మలను బట్టే ఉంటుంది." (ఖుర్‌ఆన్–37:35–39)



"వారికి మా సూక్తులు విన్పిస్తున్నప్పుడు 'ఆ...విన్నాంలే. తలచుకుంటే మేము కూడా ఇలాంటి మాటలు సృష్టించగలం. ఇవి పూర్వం నుండీ జనం చెప్పుకుంటూ వస్తున్న పుక్కిటి పురాణాలే కదా! ఈనాడు కొత్తేముంది?' అని పలికేవారు." (8:31)

"ముహమ్మద్ (స)! వారు 'ఇదంతా అతనే కల్పించుకున్నాడ'ని అంటున్నారా? అయితే వారికిలా చెప్పు: 'ఒకవేళ నేను దీన్ని స్వయంగా కల్పించుకుంటే, ఆ నేరం నాదే. కాని మీరు చేస్తున్న నేరాలకు నేను ఎలాంటి బాధ్యుడ్ని కాను." (ఖుర్‌ఆన్–11:35)

"సత్యతిరస్కారులు (ఖుర్‌ఆన్‌ని విమర్శిస్తూ) 'ఇవన్నీ అతను కల్పించుకున్న అభూతకల్పనలు. ఈ పనిలో అతనికి ఇతరులు సహాయపడుతున్నారు' అంటారు. వీరు ఘోరమైన అన్యాయానికి, పచ్చి అబద్ధానికి పాల్పడ్డారు. అంతేకాకుండా 'ఇవన్నీ పూర్వకాలం మనుషుల నుండి వస్తున్న కట్టుకథలు. వాటిని ఈయన గారు వ్రాయించి ఉదయం, సాయంత్రం (జనానికి) విన్పిస్తున్నాడు' అని కూడా చెప్పసాగారు. ముహమ్మద్! వారికి చెప్పు: 'దీన్ని భూమ్యాకాశాల రహస్యాలను ఎరిగినవాడు మాత్రమే అవతరింపజేశాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్‌ఆన్–25:4–6)

"మేమితనికి కవిత్వం నేర్పలేదు. కవిత్వం అతనికి శోభించదు కూడా. ఇదొక హితోపదేశం, స్పష్టమైన పఠనగ్రంథం." (ఖుర్‌ఆన్–36:69)

"ఇవన్నీ అస్పష్టమైన కలలకు సంబంధించిన విషయాలు; అతని స్వీయ కల్పనలు. అసలితను (గొప్ప)కవి. అలా కాకపోతే గతప్రవక్తల్లా ఇతనుకూడా మనకు ఏదైనా నిదర్శనం చూపాలి. గత ప్రవక్తలందరూ నిదర్శనాలిచ్చే కదా పంపబడ్డారు' అంటారు వారు. కాని పూర్వం మేము నాశనం చేసిన పట్టణాలలోని ప్రజలు సత్యాన్ని విశ్వసించలేదు. మరి వీరు విశ్వసించడానికి సిద్ధంగా ఉన్నారా?" (ఖుర్‌ఆన్–21:5,6)

## 12. మహాకవి తుఫైల్ దౌసీ పరివర్తన

మక్కా బహుదైవారాధకులు ఇస్లామీయ ఉద్యమాన్ని నిరోధించడానికి ప్రయోగించిన ప్రచారాస్త్రాలలో 'ఖుర్‌ఆన్ మానవ విరచితం, ముహమ్మద్ ఓ గొప్ప కవి' అన్నది కూడా ఉంది. ఈ పని కోసం వారు యావత్తు అరేబియాలో ప్రముఖ కవిగా పేరుగాంచిన తుఫైల్ బిన్ అమ్ర్ దౌసిని వాడుకోవడానికి ప్రయత్నించారు. తుఫైల్ దౌసి ప్రముఖ కవి మాత్రమే కాదు, మంచీచెడుల విచక్షణాజ్ఞానం కలిగిన గొప్పమేధావి కూడా. పైగా యమన్ ప్రాంతంలో నివసించే దౌస్‌తెగకు నాయకుడు కూడా. ఆ ప్రాంతానికి అతను స్వతంత్ర ప్రతి పత్తిగల ఓ చిన్నపాటి రాజు.

అతను ఓసారి కొందరు అనుచరులతో కాబాదర్శనం కోసం మక్కా వచ్చాడు. ఈ సంగతి తెలిసిన ఖురైషీయులు వెంటనే బయలుదేరి పట్నం వెలుపలే అతనికి ఘనంగా స్వాగతం చెప్పారు. ఆయన పట్ల తమకు ఎంత గౌరవం, అభిమానం

ఉన్నాయో చెప్పుకున్నారు. తుఫైల్ కోసం ఖురైష్ నాయకులతో పాటు జనసామాన్యం కూడా వందల సంఖ్యలో వచ్చారు. తరువాత అందరూ కలసి అతడ్ని ఊరేగింపుగా పట్టణానికి తీసుకొచ్చారు.

పట్నంలో ప్రవేశించగానే ఖురైష్ నాయకులు దైవప్రవక్త (సల్లం) గురించి, ఇస్లాం గురించి అతనికి దుర్బోధ చేశారు. ముహమ్మద్ పెద్ద మాంత్రికుడని, ఒక్కసారి గనక అతని నోట వెలువడే వాణి వింటే చాలు, మనిషి ఇట్టే అతని వలలో పడిపోతాడని, అంచేత అతనికి కాస్త దూరంగా ఉండాలని మరీమరీ హెచ్చరించారు. తుఫైల్ ఈ దుర్బోధకు గురయి నిజమే కాబోలు అనుకున్నాడు.

చివరికి ఈ జనసమూహం కాబాలయానికి చేరుకుంది. తుఫైల్ ఖురైష్‌నాయకులతో కలసి ఆలయంలో ప్రవేశించాడు. అక్కడ దైవప్రవక్త (స) ఓచోట నమాజ్ చేస్తూవుండటం చూశాడు. ఎందుకైనా మంచిదని దూది తెప్పించుకొని రెండు చెవుల్లో పెట్టుకున్నాడు. ఆ తరువాత కాబా ప్రదక్షిణ చేయడం ప్రారంభించాడు. కాబా ప్రదక్షిణ ముగిసిన తరువాత ఖురైషీయులతో కలసి అతిథి గృహానికి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళ తరువాత తుఫైల్ మళ్ళీ కాబా ప్రదక్షిణ కోసం వచ్చాడు. అప్పుడు అతని వెంట అతని సహచరులు మాత్రమే ఉన్నారు. అతను చెవుల్లో దూది పెట్టుకొని కాబా ప్రదక్షిణ చేయడం ప్రారంభించాడు. అలా ప్రదక్షిణ చేస్తూ దైవప్రవక్త (సల్లం) సమీపంగా పోవలసి వచ్చింది. అప్పుడు యాదృచ్ఛికంగా ఖుర్‌ఆన్ వాక్యమొకటి చెవిలో పడనే పడింది. అందులో ఖురైషీయులు చెప్పినట్లు ఏ చెడూ ఉన్నట్లు అన్పించలేదు. అంచేత రెండు క్షణాలు అక్కడే నిలబడి జాగ్రత్తగా ఆలకించాడు. దైవవాణి చెవులకు వింపుగా సోకింది. దాంతో తుఫైల్ ఆలోచనలో పడ్డాడు.

“అయ్యయ్యో! నేనెంత అమాయకుడ్ని. నేను గొప్ప కవిని. మంచీచెడులు, సత్యా సత్యాలను విచక్షణచేసే జ్ఞానం, ఆలోచించే మేధా, విజ్ఞతావివేచనాలు కూడా ఉన్నవాడ్ని. మరి ఈయన మాటలు ఎందుకు వినకూడదు? మంచి మాటలైతే సరే, మంచివి కాకపోతే తిప్పికొట్టవచ్చు” అనుకున్నాడు మనసులో తుఫైల్.

దైవప్రవక్త (సల్లం) నమాజు చేసి ఇంటికి బయలుదేరారు. తుఫైల్ ఆయన వెనకాల నడిచి ఆయన ఇంటికి చేరుకున్నాడు. తనను ఖురైషీయులు భయపెట్టి చెప్పిన మాటలన్నీ దైవప్రవక్త (సల్లం)కు విన్పించాడు. దైవప్రవక్త (సల్లం) అతడ్ని ఎంతో ఆదరించి ఖుర్‌ఆన్ సూక్తులు విన్పించారు.

దాంతో తుఫైల్ మానసాకాశం జ్ఞానజ్యోతితో ప్రకాశవంత మయింది. దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్ పఠనం ముగించి, ఇస్లాం స్వీకరణ గురించి హితోపదేశం చేశారు. తుఫైల్ దౌసీ ఏమాత్రం సంకోచించకుండా వెంటనే ఇస్లాం స్వీకరించాడు.

“దైవప్రవక్తా! నా తెగలో నాకు మంచి పలుకుబడి ఉంది. అందరూ నన్ను



ఎంతగానో గౌరవిస్తారు. నేనేది చెప్పినా విని వెంటనే దాన్ని అమలుపరుస్తారు. ఇప్పుడే పోయి నేను వారిని ఇస్లాం వైపు ఆహ్వానిస్తాను”అన్నారు తుఫైల్ (రజి) అమితోత్సాహంతో.

“చాలా సంతోషం” అన్నారు దైవప్రవక్త (సల్లం) పరమానందంతో.

“దైవప్రవక్తా! మీజాతివాళ్ళు మిమ్మల్ని వేధిస్తూ జీవితం దుర్భరం చేశారని విన్నాను. అంచేత మీరు, మీ అనుచరులు నా దగ్గరకు వచ్చేయండి. మాదేశంలో మీరు ప్రశాంతంగా దైవారాధన చేయవచ్చు; చీకూచింతా లేకుండా హాయిగా గడపవచ్చు.

“మక్కా ఖురైషీయులు మా దేశంలో ఏ ముస్లింపై కూడా చేయిచేసుకునే దుస్సాహసానికి పాల్పడలేరు. అదీగాకుండా నేను నా కిరీటాన్ని మీ శిరస్సుపై ఉంచుతాను. నా దేశం మీ దేశమవుతుంది. నా ప్రజలు ముస్లింలయి మీకు విధేయులయి ఉంటారు. నేను మీకు బానిసనయి సేవచేస్తాను” అన్నారు హజ్రత్ తుఫైల్ దౌసీ (రజి).

“నీ సానుభూతికి కృతజ్ఞుడ్ని. నాకుగాని, ఇతర ముస్లింలకుగాని ఎలాంటి హోదా, అధికార కాంక్షలు లేవు. నేను దేవుని ఆదేశం లేకుండా ఏ పనీ చేయలేను. ఆయన ఆజ్ఞ అయినప్పుడు మాత్రమే మేము మక్కా నుండి వలసపోతాం. ఇప్పుడు నీవు చేయవలసిందల్లా ఒక్కటే. నీవు నీవు నీ దేశానికి వెళ్ళిపో. అక్కడ నీ ప్రజలకు దైవ సందేశం అందజేసి వారిని ఇస్లాం స్వీకరించేలా ఒప్పించు. అయితే ఈ విషయంలో వారిని బలవంతం చేయడంగాని, మరెలాంటి వత్తిడి తీసుకురావడంగాని జరగకూడదు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“అలాగే మీ ఆదేశానుసారం చేస్తాను. నేనీ రోజే బయలుదేరి వెళ్తాను. పోగానే ఇస్లాం ప్రచారం ప్రారంభిస్తాను” అన్నారు హజ్రత్ తుఫైల్ దౌసి (రజి).

ఆ తరువాత హజ్రత్ తుఫైల్ బిన్ అమ్ర్ దౌసి (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గర సెలవు తీసుకొని యమన్‌కు వెళ్ళిపోయారు. స్వస్థలం చేరుకోగానే ముందుగా ఆయన తన గృహస్థులకు ఇస్లాం సందేశం విన్పించి దాన్ని స్వీకరించమని చెప్పారు. ఆయనంటే అపార గౌరాభిమానాలుగల కుటుంబ సభ్యులు తక్షణమే ఇస్లాం స్వీకరించారు. తరువాత ఆయన చేసిన హితబోధతో ఆయన తెగ ప్రజలంతా క్రమేణా కొన్నాళ్ళలోపే ఇస్లాం స్వీకరించి ముస్లింలయి పోయారు.

## 13. మంత్రాలకు చింతకాయాలు రాల్తాయా?

మక్కా బహుదైవారాధకులు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని మాంత్రికుడని, తాంత్రికుడని కూడా అసత్యప్రచారం ప్రారంభించారు. అంతేకాదు, ఆయన్ని పిచ్చివాడని కూడా దుష్ప్రచారం చేశారు ఖుర్‌ఆన్ ఈ దుష్ప్రచారాన్ని కూడా తిప్పికొట్టింది.

“స్వయంగా తమ నుండే ఒకతను భయపెట్టేందుకు రావడంపట్ల వారికి ఆశ్చర్యం కలిగింది. వారు ‘ఇతను మాంత్రికుడు, అబద్ధాలకోరు. దేవుళ్ళందరినీ తీసేసి ఆ

స్థానంలో ఒకే ఒక దేవుణ్ని తెచ్చిపెట్టాడే! చాలా విచిత్ర విషయమిది' అని అంటున్నారు." (ఖుర్ఆన్-38:4,5)

"ప్రజలను జాగృతపరచమని, (సత్యాన్ని) విశ్వ సించినవారికి వారిప్రభువు దగ్గర నిజమైన గౌరవప్రతిష్ఠలు ఉన్నాయన్న శుభవార్త విన్పించమని మేము మానవుల్లోనే ఒక మనిషికి సూచించాము. ఈ విషయం వారికి విచిత్రంగా ఉందా? పైగా సత్య తిరస్కారులు 'ఇతను పచ్చిమాంత్రికుడ'ని చెబుతున్నారు. (ఖుర్ఆన్-10:2)

"వీరికి పూర్వం గతజాతులు కూడా తమ దగ్గరకు వచ్చిన దైవప్రవక్తను మాంత్రి కుడనో, పిచ్చివాడనో ఆరోపించారు. ఇది పూర్వం నుంచీ ఇలాగే సాగుతూ వస్తోంది. (ఈవిషయంలో) వీరంతా పరస్పరం రాజీకి వచ్చారా ఏమిటి? లేదు. వీరసలు తలబిరుసు జనం. కనుక ప్రవక్తా! నీవు వారినుండి ముఖం తిప్పుకుంటే నీ దోషం ఏమీలేదు. అయితే హితబోధ చేస్తూఉండు. విశ్వసించేవారికి హితబోధ ప్రయోజనం కలిగిస్తుంది. (ఖుర్ఆన్-51:52-55)

హజ్ సీజన్ వచ్చిందంటే చాలు, ఖురైష్ నాయకులకు కంపరమెత్తి పోతుంది. కారణం ముహమ్మద్ (సల్లం) బయట నుంచి వచ్చే వేలాది యాత్రికుల్ని కలుసుకొని వారికి నూతన ధర్మాన్ని నూరి పోస్తారని భయపడటమే. అంచేత ఓరోజు వారు వలీద్ బిన్ ముగైరా అధ్యక్షతన రహస్యంగా సమావేశమయ్యారు. అందులో అతిరధ మహా రధులంతా పాల్గొన్నారు. వలీద్ సభికుల్ని ఓమారు కలియజూసి ఇలా ప్రసంగించాడు:

"సోదరులారా! ముహమ్మద్ (స) ప్రచారంతో అతని అనుచరుల సంఖ్య రోజురోజు కు పెరిగిపోతోంది. అతణ్ని గట్టిగా ప్రతిఘటించకపోతే త్వరలోనే మనం సమాజంలో అప్రతిష్ఠ పాలుకావలసి వస్తుంది. అంచేత వెంటనే అతని మీద తగిన చర్య తీసుకోవాలి. హజ్దినాలు వస్తున్నాయి. బయట నుంచి అనేకమంది యాత్రికులు వస్తారు. మనమంతా తక్షణమే ఒక నిర్ణయానికి రావాలి. ఆ తర్వాత మనలో ఏ ఒక్కరూ విరుద్ధ ప్రకటనలు చేయకూడదు. అలా చేస్తే మన పథకమంతా పాడైపోయి మన నిజస్వరూపాలు బయట పడతాయి. చెప్పండి ఏం చేద్దాం?"

"ముహమ్మద్ జోస్యం చెప్పేవాడని ప్రచారం చేద్దాం" అన్నారు కొందరు.

"వద్దు, మనం ఎంతోమంది జోస్యగాళ్ళను చూశాం. వారి మాటలకు, ముహమ్మద్ (సల్లం) చెప్పే సూక్తులకు పోలికే లేదు" అన్నాడు వలీద్.

"అయితే పిచ్చివాడు అందాం" మరికొందరి సలహా.

"కాదు. పిచ్చివాడి మాటలు ఎలా ఉంటాయో అందరికీ తెలుసు. ఇతనిలో పిచ్చివాడి చేష్టలు మచ్చుకైనా లేవు" అన్నాడు వలీద్.

"పోనీ కవి అందామా?"



"అతను కవి కూడా కాదు. నేను కవితా జగత్తును అమూలాగ్రంగా వడపోశాను. అతని వాక్కులో కవిత్వం ఏమాత్రం గోచరించదు. మరేదయినా ఆలోచించండి."

"సరే, ముహమ్మద్ (స) గొప్ప ఇంద్రజాలికుడంటేనో?" మరో సలహా.

"ఇంద్రజాలికుడని కూడా అనలేం. మనం ఎంతమంది ఇద్రజాలికుల్ని చూడ లేదూ? కాని ఒక్కడైనా ముహమ్మద్ (స) సూక్తి లాంటి మంత్రం చెప్పగలడా?"

"అయితే మరి ఏమని ప్రచారం చేద్దాం అతణ్ని గురించి?" అడిగారు కొందరు.

"దైవసాక్షి! అతని వాక్కులో అనిర్వచనీయమైన మాధుర్యం ఉంది. అది సుమధుర ఫలాలతో నిండి బలంగా, లోతుగా వేళ్ళూనిన మహావృక్షం లాంటిది. అంచేత మనం ఏది బొంకినా అందరికీ నమ్మకం కలిగించేదిగా ఉండాలి. ఇతను గొప్ప మాంత్రికుడు. ప్రతి ఒక్కరినీ ఇట్టే మంత్రముగ్ధుల్ని చేసే అద్భుతవాణి తెచ్చాడు. దాని ప్రభావంతో అతను తండ్రీ కొడుకుల్లో, అన్నా చెల్లెళ్లో, భార్యాభర్తల్లో, ఒక కుటుంబానికి మరో కుటుంబానికి మధ్య విభేదాలు సృష్టిస్తాడు అని ప్రచారం చేద్దాం" అన్నాడు వలీద్.

ఈ మాటలు విని అందరూ సరే అంటే సరే అన్నారు. సమావేశం ముగిసింది. తరువాత అందరూ అవకాశం కోసం ఎదురుచూడసాగారు.

కాబాయాత్ర శుభతరుణం రానేవచ్చింది. దేశం నలుమూలల నుండి వేలాది మంది యాత్రికులు వచ్చారు. సమయం కోసం కాచుకొని ఉన్న ఖురైషీయులు అనుకున్న ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)పై దుష్ప్రచారం ప్రారంభించారు:

"ముహమ్మద్ సంగతి మీకు తెలియదేమో! అతను పెద్ద ఇంద్రజాలికుడు. అతని మాటలు ప్రతి ఒక్కర్నీ ఇట్టే ఆకట్టుకొని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. దాంతో తండ్రీ కొడుకుల్లో, భార్యాభర్తల్లో పొరపొచ్చాలు; అన్నా చెల్లెల్లో పొట్లాటలు వస్తాయి. జాగ్రత్త సుమా! అతని మాయదారి మాటల్లో పడకండి" అన్నాడు వలీద్.

"నేను ఒంటరిగా పుట్టించినవాణ్ని నాకు వదిలెయ్యి. (నేను చూసుకుంటానతని సంగతి.) నేనతనికి అపార సిరిసంపదలు ప్రసాదించాను. అతణ్ని ఎల్లప్పుడూ వెన్నంటి ఉండే కొడుకుల్ని ఇచ్చాను. సుఖసంతోషాలకు అవసరమైన జీవన సామగ్రినంతా ప్రసాదించాను. అయినా నేను తనకు మరింత అనుగ్రహిస్తానని పేరాశతో ఉన్నాడు.

అలా ఎన్నటికీ జరగదు. అతను మా సూక్తుల పట్ల ద్వేషం పెంచుకున్నాడు. త్వరలోనే నేనతణ్ని కఠినమైన (నరక) శిఖరం ఎక్కిస్తాను. అతను ఎంతో ఆలోచించి (మాకు వ్యతిరేకంగా) పన్నాగం పన్నడానికి ప్రయత్నించాడు. వాడు నాశనం గాను! ఎలాంటి దుష్ట యత్నానికి ఒడిగట్టాడు!! వాడు పాడుగాను! ఎలాంటి దారుణానికి పాల్పడ్డాడు!!

తరువాత అతను (జనం వైపు) చూశాడు. ఆ తరువాత భృకుటిముడిచి, మూతి విరుచుకున్నాడు. ఆపై వెనక్కి తిరిగి హూంకరించాడు. చివరికతను 'ఇది పూర్వం నుంచీ

వస్తున్న మంత్రజాలం తప్ప మరేమీకాదు. ఇది మానవవాక్కు మాత్రమే' అన్నాడు. (ఖుర్ఆన్. 74:1-25)

ఈ ప్రచారం యాత్రికుల్లో కార్చిచ్చులా వ్యాపించింది. అంచేత కొందరు ముహమ్మద్ (సల్లం)ను కలుసుకోవడానికే భయపడ్డారు. మరికొందరు ఎందుకొచ్చిందిలే మనకు అనుకొని యాత్రానంతరం కిమ్మనకుండా వెళ్ళిపోయారు. చాలామంది హజ్ తర్వాత స్వస్థలం చేరుకొని తమ బంధుమిత్రులకు వింతగా చెప్పుకున్నారు.

ఇలా దైవప్రవక్త (సల్లం) పేరు అనతికాలంలోనే దేశమంతా వ్యాపించిపోయింది. శత్రు దుష్ప్రచారం వల్ల ఒక్కోసారి ఇస్లామీయ ఉద్యమానికి ప్రయోజనం కూడా చేకూరుతుంది. దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఖురైష్ బహుదైవారాధకులు ప్రారంభించిన ఈకొత్త ప్రచారం విని నిజానిజాలేమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో ఇతర ఊళ్ళ నుంచి కూడా కొందరు మక్కా పట్నానికి బయలుదేరారు. అలా మక్కా వచ్చినవారిలో అనేకమంది ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (సల్లం)కు అనుచరులుగా మారిపోయారు. ఈవిధంగా సత్యతిరస్కారుల దుష్టపథకం బెడిసికొట్టింది. ఇస్లాంను తుడిచిపెట్టాలని ప్రయత్నిస్తే అది మరింత విస్తృతం కాసాగింది. దాంతో వారు జరిగిన పొరపాటు గ్రహించి తల బాదుకున్నారు.

## 14. చంద్రఖండన మహిమ

“ప్రళయఘడియ సమీపించింది. చంద్రుడు చీలిపోయాడు. కాని వీరు మాత్రం ఎలాంటి మహిమ చూసినా (సత్యాన్ని విశ్వసించకుండా) విముఖులయి పోతున్నారు. పైగా ఇది రోజూ ప్రదర్శిస్తున్న మంత్రజాలమేనని అంటున్నారు. వారు (చంద్రఖండన మహిమను కూడా) తిరస్కరించి తమ మనోవాంఛలకు బానిసలయి పోయారు. ప్రతి వ్యవహారం చివరికి ఒక పర్యవసానానికి చేరుకోక తప్పదు.” (ఖుర్ఆన్-54:1-3)

ప్రళయకాల చిహ్నంగా పూర్ణ చంద్రుడు తృటిలో రెండు ఖండాలుగా చీలిపోయి తిరిగి కలుసుకోవడం అసాధారణ విషయమైనా అదొక చారిత్రక సంఘటన. హదీసు గ్రంథాల్లోని వివిధ ఉల్లేఖనాలను పరిశీలిస్తే ఇది హిజ్రీ శకానికి దాదాపు ఐదు సంవత్సరాల పూర్వం ఒక పున్నమి రాత్రిన చంద్రోదయం జరిగిన కొద్దిసేపటికే సంభవించినట్లు తెలుస్తోంది. పూర్ణచంద్రుడు హఠాత్తుగా రెండు భాగాలుగా చీలిపోయి మరుక్షణమే తిరిగి కలిసిపోయాడు. ఆ సమయంలో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మక్కా సమీపంలోని 'మినా' ప్రాంతంలో ఉన్నారు. ఆయన చంద్రుడు రెండుగా చీలి తిరిగి కలుసుకోవడాన్ని అక్కడున్నవారికి చూపిస్తూ “మీరు దీనికి సాక్షులుగా ఉండండి” అన్నారు.

కాని అవిశ్వాసులు అంత పెద్ద సంఘటన కళ్ళారా చూసి కూడా “ముహమ్మద్ (సల్లం) మన మీద మంత్రం వేశాడు. దాంతో మన కళ్ళు మోసపోయాయి” అన్నారు.



కాని కొందరు మాట్లాడుతూ “ముహమ్మద్ (స) మంత్రం (ఇక్కడున్న) మన మీద పారవచ్చు. అందరి మీద పారదు కదా! ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని రానివ్వండి. దీన్ని వారు చూశారో లేదో అడుగుదాం” అన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు కూడా తామీ అపరూప దృశ్యం చూశామని చెప్పారు.

క్షణంపాటు కన్పించిన ఈ అపూర్వ దృశ్యం చూసేందుకు జనమంతా ఆకాశం వైపు దృష్టి సారించి ఉండరు. పైగా లోకమంతా దాన్ని చూడటం సాధ్యపడదు. అరేబియా, తూర్పుదేశాల్లోని ప్రజలకే ఇది కన్పిస్తుంది. అయితే ఇలా చంద్రుడు రెండుఖండాలుగా చీలిపోవడం, గురుత్వాకర్షణ శక్తివల్ల మళ్ళీ కలుసుకోడం సాధ్యమే నని నేటి శాస్త్రవేత్తలు సులభంగా ఊహించగలరు.

మన దేశంలో మల్బార్ చక్రవర్తి ఈ దృశ్యం చూసినట్లు చరిత్రకారులు, ఖుర్ఆన్ భాష్యకారులు పేర్కొన్నారు. మౌలానా సులైమాన్ నద్వి (రహ్మ) ఇలా పేర్కొన్నారు:

“భారత్‌లో మొదటిసారిగా ఇస్లాం తన పాదాన్ని దక్షిణభారత్‌లో మోపింది. చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయిన సంఘటనను మల్బార్ చక్రవర్తి కళ్ళారా చూసినట్లు తెలుస్తోంది. ఓరోజు రాత్రి ఈదృశ్యం కన్పించింది. వెంటనే అతను పరిస్థితి తెలుసుకోడానికి దేశం నలుమూలలా ప్రతినిధుల్ని పంపించాడు. చివరికి అరేబియాలో ఒక దైవప్రవక్త ప్రభవించాడని, ఆయనే ఈ మహాత్యం చూపెట్టాడని తెలిసింది.

చక్రవర్తి ఈ సంగతి విని ఇస్లాం స్వీకరించాడు. తరువాత అరేబియా వెళ్ళి పోయాడు. కాని మక్కా చేరుకోక ముందే దారిలోనే ఎమన్‌లో చనిపోయాడు.”

ఆ తర్వాత దాదాపు వంద సంవత్సరాలకు హిజ్రీ శకం 2వ సంవత్సరం మల్బార్ రాజ్యానికి చీరామన్ చక్రవర్తి అయ్యాడు. అతను కూడా ఇస్లాం స్వీకరించాడు. ప్రఖ్యాత చరిత్రకారుడు 'ఫరిష్తా' ఈ ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ఇలా రాశాడు:

“కొందరు అరబ్బులు, అరబ్బేతరులు ఫార్సీ జలసంధి గుండా ఓడలలో సరాందీప్‌కు ప్రయాణమయ్యారు. కాని దారిలో పెనుతుఫాను రావడంతో వారి ఓడలు మల్బార్ తీరానికి చేరుకోవలసి వచ్చింది. అప్పుడు మల్బార్ చక్రవర్తి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను గురించి విచారిస్తే, ఈ ప్రయాణీకులు చంద్రుడు చీలిన సంఘటన కూడా తెలిపారు.

చక్రవర్తి ఈ ఉదంతం విని “ఇది చాలా గొప్ప మహిమే. గొప్ప సంఘటనలు సంభవించినప్పుడు దాన్ని రాసిపెట్టడం మా దేశ సంప్రదాయం” అని చెప్పి దైవప్రవక్త (సల్లం)కాలం నాటి దస్తావీజులు తెప్పించాడు. చూస్తే అందులో చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయి తిరిగి కలసిన సంఘటన గురించిన ప్రస్తావన ఉంది. దాంతో ఆ చక్రవర్తి ప్రభావితుడయి ఇస్లాం స్వీకరించాడు.”

# 15. "పిచ్చి" ప్రచారం

నిజాయితీపరుడైన బలవంతుడ్ని బలహీనులైన శత్రువులు ఎదురుగా వచ్చి ముఖాముఖి పోరాడలేక కుట్రలతో వెన్నుపోటు పొడుస్తారు. అదేవిధంగా అసత్య వాదులు సత్యవాదిని సరైన ప్రమాణాలతో ఎదుర్కోలేక అతను మతి భ్రమించిన వాడని, చేతబడికి గురయినవాడని, పిశాచం ఆవహించిన పిచ్చివాడని జనంలో దుష్ ప్రచారం చేస్తారు. దైవప్రవక్త (సల్లం) విషయంలో కూడా ఇదే జరిగింది.

పధ్నాల్గు వందల సంవత్సరాలు వెనక్కి వెళ్ళి ఓసారి గతంలోకి తొంగిచూడండి:

...హజ్ సీజన్ రావడంతో మక్కా దరిదాపుల్లోని ఉకాజ్, మజన్న, జిల్‌మజాజ్ మైదానాలు వందలాది డేరాలు, దుకాణాలు, ఇతర సాంస్కృతిక కేంద్రాలతో నిండి పోయాయి. అరేబియా నలుమూలల నుండి వచ్చే యాత్రికులు మక్కా పోతూ ముందుగా ఈ దుకాణాలకు, కేంద్రాలకు వస్తుంటారు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఆ సంతకు వెళ్ళి యాత్రికుల్ని కలుసుకొని వారికి దైవధర్మాన్ని పరిచయం చేయడం ప్రారంభించారు. బహుదైవారాధన వల్ల కలిగే దుష్ఫలితాలను గురించి హెచ్చరిస్తూ, ఇస్లాం స్వీకరించమని చెప్పసాగారు.

కాని దైవప్రవక్త (సల్లం) ఎక్కడికి పోతే అక్కడికల్లా అబూలహబ్, అతని మిత్రమూక చేరుకొని ఆయనకు వ్యతిరేకంగా జనంలో అపార్థాలు రేకెత్తించడానికి ప్రయత్నిస్తున్నారు. వారి దుష్ప్రచార జాలంలో చిక్కుకున్న ప్రజలు దైవప్రవక్త (సల్లం) చెప్పే మాటలు వినడానికి కూడా సిద్ధపడటంలేదు. పైగా కొందరు ఆయన్ని దుర్భాష లాడేవారు. మరికొందరు ముఖాలు తిప్పుకొని వెళ్ళిపోయేవారు. అయితే దైవప్రవక్త (సల్లం) మాటలు అసలు వినేవారే లేకపోలేదు.

సంత చివరి రోజుకు చేరుకుంది. ప్రజల రాకపోకలు కూడా పెరిగిపోయాయి. ఆరోజు కూడా దైవప్రవక్త (సల్లం) వచ్చి దైవసందేశ ప్రచారం ప్రారంభించారు. ఒక కూడలిలో నిల్చొని జనాన్ని పిలిచి ప్రసంగించసాగారు. ఏకదైవారాధన గురించి, మరణా నంతర జీవితాన్ని గురించి చెబుతుంటే ప్రజలు శ్రద్ధగా వింటున్నారు.

కాని అంతలో అబూలహబ్ ఎక్కడ్నుంచో షైతాన్‌లా ఊడిపడ్డాడు.

"ప్రజలారా! ఇతను నా తమ్ముడికొడుకు ముహమ్మద్. మన తాతల మతాన్ని వదిలేసి ఏదో కొత్త మతాన్ని సృష్టించుకున్నాడు. పచ్చి అబద్ధాలాడుతూ సంఘంలో చీలికలు తెస్తున్నాడు. ఇతని మాటలు నమ్మకండి" అన్నాడతను బిగ్గరగా.

అబూలహబ్ ఖురైష్ వంశస్థుడని, మక్కా ప్రజల అగ్రనాయకుల్లో ప్రముఖుడని ప్రజలకు తెలుసు. అంచేత అతని మాటలు వినగానే అందరూ జారుకున్నారు. దైవప్రవక్త (సల్లం) నిరాశచెందకుండా ధర్మప్రచారం కోసం మరో చోటికి బయలుదేరారు.



అబూలహబ్ చంకలు ఎగరేసుకుంటూ అక్కడ్నుంచి తన శిబిరానికి బయలు దేరాడు. కొన్ని అడుగులు నడిచాడో లేదో అతని భుజమ్మీద ఓ బలమైన చేయి పడింది. వెనక్కి తిరిగి చూస్తే, ఎర్రటి కనుగుడ్లతో, గారపట్టిన పళ్ళతో, జడలు కట్టిన శిరోజాలతో, నల్లటి పెదాలతో, మెడలో లావుపాటి పూసలదండతో చిరునవ్వు చిందిస్తూ ఓ భారీకాయం దర్శనమిచ్చింది.

"మీరు ముహమ్మద్ (స) వ్యవహారంతో బాగా విసిగిపోయినట్లు కన్పిస్తున్నారు" అన్నది ఆ భారీకాయం.

"ఆ... మీరు చెబుతున్నది నిజం. ముహమ్మద్ కొత్త మతాన్ని లేవదీసి మా జాతిలో, మా మతాచారాల్లో గందరగోళం సృష్టించాడు. అతడ్ని వదలించులేక మా ఖురైషీయులు సతమతమవుతున్నారు" అన్నాడు అబూలహబ్.

"బహుశా మీరు నన్ను గుర్తుపట్టలేదనుకుంటాను"

"మిమ్మల్ని గుర్తుపట్టకపోవడం ఏమిటీ? మిమ్మల్ని గురించి ఎవరికి తెలియదనీ! మీరు యావత్తు అరేబియాలోనే పేరుమోసిన మాంత్రికుడు జిమాద్. యమన్ దేశంలోని సుప్రసిద్ధ అజ్ద్ తెగ నాయకులు కూడా" చెప్పాడు అబూలహబ్.

"మీరు నన్ను బాగా గుర్తుపెట్టుకున్నారు. మీరన్నట్లు నేను నిజంగా అరేబియాలో గొప్ప ఇంద్రజాలికుడ్ని. మీ ముహమ్మద్‌కు ఎవరో చేతబడి చేసిఉంటారు. మీరేమీ విచారించకండి. నేను నా మంత్రబలంతో దాన్ని పోగొడ్తాను" అన్నాడు జిమాద్.

"మీరు నా తమ్ముడి కొడుక్కు పట్టిన దయ్యం వదలగొట్టి, కొత్తమతాన్ని ప్రచారం చేయనీయకుండా అతడ్ని ఆపగలిగితే నేను మీకు వంద ఒంటెలతో పాటు వంద వరహాలు బహుమానంగా ఇచ్చుకుంటాను."

"మీరు నాకు పెద్ద ఆశే చూపిస్తున్నారు. సరే లాత్, ఉజ్జాల సాక్షి! నేను మీ ముహమ్మద్‌కు పట్టిన భూతాన్ని వదలగొడ్తా. తరువాత మీరు మీ వాగ్దానానికి కట్టుబడి ఉండాలి సుమా!"

"నేనొక్కడ్నే కాదు, వలీద్, ఉత్బా, అబూసుఫ్యాన్ వగైరా నాయకులు కూడా మీకు బహుమానాలు ఇస్తారు" అన్నాడు అబూలహబ్.

"కొంచెం ఆగండి, నేను మీకు నా మంత్రప్రతిభ కాస్త చూపిస్తాను" అన్నాడు మహా మాంత్రికుడు జిమాద్.

"ఇక్కడ నేనొక్కడ్ని చూస్తే ఏం లాభం? మా శిబిరానికి పదండి. అక్కడ మా ఖురైష్ నాయకుల్ని కూడా పిలిపిస్తాను. వారందరి ముందు ప్రదర్శిస్తే బాగుంటుంది."

ఇలా మాట్లాడుకుంటూ వారిద్దరు శబిరానికి చేరుకున్నారు. అబూలహబ్ ఖురైష్ నాయకులందరినీ పిలుచుకు రమ్మని ఇద్దరు బానిసలను పంపించాడు. కాస్సేపటికి

ఖురైష్ నాయకులంతా అబూలహబ్ శిబిరానికి చేరుకున్నారు. శిబిరం ముందు తివాచీలు పరచి ఖురైషీయులందరూ కూర్చున్నారు. జిమాద్ వారి మధ్య నిలబడ్డాడు. ఇంద్రజాల ప్రదర్శనం గురించి విన్న ఇతరులు కూడా వందల సంఖ్యలో వచ్చిచేరారు.

“జనులారా! నేను యావత్తు అరేబియాలోనే ప్రసిద్ధి చెందిన ఇంద్రజాలకుడ్ని. దేశంలోని మాంత్రికులంతా గర్వంతో నన్ను తమ గురువుగా చెప్పుకుంటారు. అంచేత మీకందరికీ నా పేరు తెలిసేఉంటుంది” అన్నాడు జిమాద్.

“తెలుసు. తెలుసు. మీ పేరు జిమాద్” అన్నారు జనమంతా ముక్తకంఠంతో.

“నేను మాంత్రికుడ్ని మాత్రమే కాదు, ప్రముఖ కవిని కూడా. మీకు నా పేరు మాత్రమే తెలిసి ఉంటుంది. ఈరోజు నా మంత్ర విద్యను ప్రదర్శిస్తాను చూడండి. సరే, మీరంతా ఓసారి తల పైకెత్తి చూడండి. ఆకాశం నిర్మలంగా ఉంది. సూర్యుడు దేదీప్యమానంగా వెలిగి పోతున్నాడు. గాలి స్తంభించిపోయింది. ఎండవేడికి చెమటలు కారుతున్నాయి. ఔనా?”

“ఔనౌను” జనం అరిచి చెప్పారు.

“ఇప్పుడు చూడండి. ఆకాశంలో ఓ నల్లటి చుక్క కన్పిస్తోంది” అన్నాడు జిమాద్.

జనం ఆకాశంలో చూస్తే అక్కడ నిజంగానే ఓ నల్లటి చుక్క కన్పించింది. జిమాద్ ఆ చుక్క వైపే చూస్తూ ఏవో మంత్రాలు పఠిస్తున్నాడు. దాంతో ఆ చుక్క క్రమంగా విస్తరిస్తూ ఓ మబ్బుతునకగా మారింది. ఆ తర్వాత మెల్లగా గాలి వీచడం మొదలెట్టింది. ఆ మబ్బు తునక క్రమేణా విస్తరిస్తూ అక్కడి మైదానాన్ని క్షణాల్లో కప్పివేసింది.

ప్రజలు నోరు తెరచి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు.

ఆ తరువాత సూర్యుడు పూర్తిగా కనుమరుగైపోయాడు. ఆ వెనువెంటనే చల్లటిగాలి రివ్వున వీచింది.

“వర్షించు, బాగా వర్షించు. ఒక్క చుక్క కూడా కింద పడనీకుండా వర్షించు” అన్నాడు జిమాద్.

చిటపట చినుకులతో వర్షం మొదలయింది. ఏకధాటిగా వర్షం కురుస్తోంది. జనమంతా శూన్యంలో నీటి ధారలు చూస్తున్నారు. కాని ఒక్క చుక్క కూడ క్రింద పడటం లేదు.

“పిశాచ పటాలం అరబ్బుల్ని ఆశ్చర్యపరుస్తూ ఆర్భాటంగా వారి ముందు నుంచి నడవాలి చకచకా నడవాలి” అన్నాడు జిమాద్.

ప్రదర్శన మైదానం తూర్పు వైపున నల్లతెర చీల్చుకుంటూ చిత్రవిచిత్రమైన భయంకర ఆకారాలు గాలిలో తేలుతూ ఉరిమురిమి చూస్తూ మైదానంలోకి రాసాగాయి. అలా మైదానం రెండవ చివరికి పోయి అదృశ్యమవుతున్నాయి.



జనం ఆశ్చర్యంతో మట్టిబొమ్మల్లా చూస్తున్నారు. స్త్రీలు భయపడి కళ్ళు మూసుకున్నారు.

కాస్సేపటికి ఆ ఆకారాలన్నీ మైదానం రెండవ కొనకు వెళ్ళి అదృశ్యమయి పోయాయి. ఆ తర్వాత కారుమబ్బులు ఒక్కసారిగా విడిపోయాయి. సూర్యుడు మళ్ళీ వాడి కిరణాలతో ప్రత్యక్షమయ్యాడు. గాలి స్తంభించిపోయింది. జనానికి చెమటలు కారడం మొదలయింది.

“జిమాద్! నువ్వు నిజంగా గొప్ప మాంత్రికుడవోయ్. నువ్వు నీ మంత్రబలంతో ముహమ్మద్‌ని బాగుచేస్తావని నాకిప్పుడు పూర్తిగా నమ్మకం కుదిరింది” అన్నాడు అబూలహబ్.

“అయితే ముహమ్మద్‌ని ఇక్కడకు తీసుకురాగల్గితే తీసుకురండి. నేను వీలైనంత త్వరగా అతని దయ్యాన్ని వదలగొడ్తాను.”

”ఇప్పుడే పిలిపిస్తాను” అంటూ అబూలహబ్ ఒక బానిసను పంపాడు. ఆ బానిస వెళ్ళి కాస్సేపటికి మహనీయ ముహమ్మద్ (స)ని పిలుచుకొని వచ్చాడు.

“ముహమ్మద్! ఈ కొత్త వ్యక్తి ఎవరో నీకు తెలుసా?” అని అడిగాడు అబూలహబ్ జిమాద్ వైపు చూపిస్తూ.

“తెలియదు ఈయన ఎవరో” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“నే జెప్తాను. ఈయన యమన్ పౌరుడు. పేరు జిమాద్. గొప్ప మాంత్రికుడు. నీకేదో పిశాచం ఆవహించిందని విని దాన్ని వదలగొట్టడానికి వచ్చాడు ఈయన.”

ఈ మాటలు విని దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వారు.

“పెదనాన్నా! నాకెలాంటి పిశాచం ఆవహించలేదు. నువ్వు అనవసరంగా మోసపోతున్నావు. నేను దేవుని సందేశహరుడ్ని. ఆయన దాసుడ్ని” అన్నారు ఆయన.

“మళ్ళీ అదే పాతపాట పాడుతున్నావు. సరేలే, ఓసారి ఆయన ముందుకు పోయి నిలబడు”

దైవప్రవక్త (సల్లం) ఎలాంటి సంకోచం లేకుండా వెంటనే జిమాద్ ముందుకు పోయి నిల్చున్నారు.

జిమాద్ ఓసారి దైవప్రవక్త (స)ను ఆపాదమస్తకం పరికించి చూశాడు. కాని అతను ఆ మహనీయుని కళ్ళలోకి సూటిగా చూడలేక ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

“జిమాద్! మహామాంత్రికుడా! ఇంతకూ నా గురించి నువ్వేమి చెప్పదలిచావు?” అన్నారు దైవపవక్త (సల్లం) గంభీర స్వరంతో.

“మ్మి...మ్మి....మీ మీద ఓ పెద్ద పిశాచం ఆవహించింది. న్నే....న్నే...నేనొక మంత్రం చదువుతా, మీరు వినండి” అన్నాడు జిమాద్ తడబడుతున్న కంఠంతో.

"జిమాద్! నాకెలాంటి పిశాచం ఆవహించలేదు. నువ్వు నీ మంత్రవిద్యతో ప్రజల్ని ఆశ్చర్యపరచగలవు. కాని నేను దైవప్రవక్తను. నానోటి నుండి వెలువడే దైవవాణి ఎలాంటి మనిషినైనా ప్రభావితం చేస్తుంది. ముందుగా నేను దైవవాణి విన్పిస్తాను. తర్వాత నీవు నీ మంత్రాన్ని పఠించు" అన్నారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో.

"ఆ... అలాగే ముందు మీరే విన్పించండి" అన్నాడు జిమాద్ వాడిన ముఖంతో.

"సకల విధాల ప్రశంసలు దేవునికి మాత్రమే శోభిస్తాయి. కనుక మేము ఆయన్నే స్తుతిస్తాం. ఆయన సహాయమే అర్థిస్తాం. దేవుడు ఎవరికి సన్మార్గం చూపదలచుకుంటాడో అతడ్ని ఎవరూ అపమార్గంలో పడవేయలేరు. అలాగే దేవుడు ఎవరిని అపమార్గంలో పడేలా చేయదలచుకుంటాడో అతడ్ని ఎవరూ సన్మార్గంలో పెట్టలేరు. ఏకేశ్వరుడయిన ఆ దేవుడు తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ఆయనకు ఎవరూ సాటి లేరని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ దేవుని దాసుడని, ఆయన సందేశహరుడని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

జిమాద్ ఈ మాటలు విని ఆశ్చర్యపోతూ "ఏది మరోసారి విన్పించండి" అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) పై మాటలనే పునరుక్తం చేసి విన్పించారు.

"ఎంత మధురమైన వాణి ఇది! దయచేసి ఇంకొక్కసారి విన్పించండి."

దైవప్రవక్త (సల్లం) మూడవసారి కూడా అవే మాటలు విన్పించారు.

"నేను నా జీవితంలో అనేకమంది మాంత్రికుల్ని, జోతిష్కుల్ని, కవుల్ని చూశాను. కాని ఇలాంటి మధురమైన, ప్రభావవంతమైన వాణిని మాత్రం ఎవరినోటా వినలేదు. నిస్సందేహంగా మీరు దైవప్రవక్తే. నేను మిమ్మల్ని, మీ దేవుడ్ని విశ్వసిస్తున్నాను. చేయి జాపండి. నేను ఇస్లాం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు జిమాద్.

జిమాద్ అప్పటికప్పుడు సద్వచనం పఠించి ముస్లిం అయిపోయాడు. తర్వాత ఆయన జనసమూహాన్ని ఉద్దేశించి ఇలా అన్నారు:

"మిథ్యాదేవతల పూజారులారా! వినండి. బాగా వినండి. మహనీయ ముహమ్మద్ (సల్లం)కు ఎలాంటి భూతపిశాచాలు ఆవహించలేదు. ఈయన దైవసందేశహరుడు. దేవుని తరఫున ఆయన దాసులకు రుజుమార్గం చూపడానికి వచ్చిన దైవప్రవక్త (సల్లం). అందువల్ల నేను ముస్లింనయ్యాను. మీరు కూడా ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారండి. ముస్లింలుగా మారి మానవులుగా మనుగడ సాగించండి."

ఈ మాటలు వినగానే అబూలహబ్ కస్సున లేచాడు.

"మోసం! దగా!! నువ్వు ముహమ్మద్‌ని బాగుచేస్తానని చెప్పి మమ్మల్ని మోస గించావు. నువ్వు ముస్లిం కావడమేగాకుండా ఇతరుల్ని కూడా ముస్లింలయిపొమ్మని



చెబుతున్నావా? సామూహిక రక్తపాతం జరుగుతుందన్న భయం లేకపోతే, నేను ఇప్పుడే నిన్ను పట్టుకొని హతమార్చివేసేవాడ్ని" అన్నాడతను జిమాద్‌పై మండిపడుతూ.

"ఓరీ ద్రోహీ! నువ్వసలు నీ పేరుప్రతిష్ఠలకు, హోదాఅంతస్థులకు భంగం కల్గుతుందన్న భావనతో ముస్లిం కావడానికి భయపడుతున్నావు. నీ నరనరాల్లో ప్రాపంచిక వ్యామోహం నిండి పోయి ఉంది. ఇప్పటికయినా మించిపోయింది లేదు. విషయం అర్థం చేసుకొని ముస్లిం అయిపో. లేకుంటే చాలా పశ్చాత్తాపపడతావు" అన్నారు హజ్రత్ జిమాద్ (రజి).

"నీచుడా! నన్నే ఇలా అంటావా! ఉండు నీ నాలుక చీరేస్తాను" అంటూ అబూలహబ్ ఆగ్రహోదగ్రుడయి జిమాద్ (రజి) మీదికి లంఘించబోయాడు.

"ఆగు. మరో అడుగు ముందుకు వేశావా....... నీకీ రోజుతో నూకలు చెల్లినట్లేనని తెలుసుకో. నేను జిమాద్‌ని, అరేబియా మొత్తంలోనే పేరుమోసిన ఇంద్రజాలికుడ్ని."

జిమాద్ (రజి) మాటలు వినగానే అబూలహబ్ భయపడిపోయాడు. తక్కున ఆగిపోయాడు. అతను ఇంతకుముందే జిమాద్ మంత్రశక్తి చూసి ఉండటంతో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక దూషిస్తూ నిలబడిపోయాడు.

ఇంతకుముందే అబూలహబ్, అతని సహచరులు జిమాద్(రజి) ప్రదర్శించిన మంత్రవిద్య చూసినందువల్ల దాని ప్రభావం ఇంకా వారి మస్తిష్కాల నుంచి చెరిగి పోలేదు. అంచేత ఆయనకు వ్యతిరేకంగా ఏ ఒక్కరూ ఎలాంటి చర్య తీసుకోలేక నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు.

హజ్రత్ జిమాద్ (రజి) దైవప్రవక్త (స) అనుమతి తీసుకొని యమన్ వెళ్ళిపోయారు. కాస్సేపటికి దైవప్రవక్త (స) కూడా అక్కడ్నుంచి కదలి మక్కా వెళ్ళిపోయారు.

## 16. పైశాచిక పలుకులు కాదు, పరిశుద్ధవాణి

"వారు ఈ'వాణి'ని గురించి (ఎప్పుడైనా) ప్రశాంతంగా ఆలోచించారా? లేక వారి పూర్వీకుల దగ్గరకు రానటువంటి కొత్త విషయం ఏదైనా అతను తీసుకువచ్చాడా? లేక వారు తమ ప్రవక్తను గురించే అసలు ఎరగరా అతడ్ని నిరాకరించడానికి? లేక వారతడ్ని పిచ్చివాడని భావిస్తున్నారా? ఇవేమీ కాదు. అతను సత్యాన్ని తీసుకొని వచ్చాడు. అది వారిలో అనేక మందికి మింగుడు పడటం లేదు." (ఖుర్ఆన్-23:68-70)

"వారెప్పుడైనా (ప్రశాంత మనస్సుతో) ఆలోచించారా? వారి సహచరునికి ఎలాంటి పిచ్చి పట్టలేదు. అతను (పరలోకంలో ఎదురయ్యే దుష్పరిణామాలను గురించి) ఎలాంటి అరమరికలు లేకుండా హెచ్చరిస్తున్న దైవసందేశరుడు." (ఖుర్ఆన్-7:184)

"ప్రవక్తా! వారికిలా ఉపదేశించు: "నేను మీకు ఒక విషయం ఉపదేశిస్తున్నాను. దేవుని కోసం మీరు ఒక్కొక్కరు విడిగా, ఇద్దరేసి కలసి కూర్చొని ప్రశాంతంగా ఆలోచించండి.

మీ సహచరునిలో ఎలాంటి పిచ్చిలేదు. అతను అత్యంత కఠినమైన (నరక) శిక్ష రాకముందే దాన్ని గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు." (ఖుర్‌ఆన్–34:46)

"నూన్...కలం సాక్షి! వ్రాసేవారు వ్రాస్తున్నదాని సాక్షి!! నీ ప్రభువు దయవల్ల నీవు ఏమాత్రం పిచ్చివాడవు కావు. నీకు తప్పకుండా ఎన్నటికీ అంతంకాని గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. నిస్సందేహంగా నీవు అత్యున్నత సుగుణసంపత్తి కలవాడవు. మీలో ఎవరు ఉన్మాదులో త్వరలోనే నీకూ తెలుస్తుంది; వారికీ తెలుస్తుంది." (ఖుర్‌ఆన్–68:1–6)

"అందువల్ల మానవులారా! మీరనుకున్నది ఎంతమాత్రం నిజం కాదు. నేను నక్షత్రాల కక్ష్యల సాక్షిగా చెబుతున్నాను. మీరు గ్రహించగలిగితే ఇది గొప్ప ప్రమాణం. ఇది సురక్షిత గ్రంథంలో (రాయబడి) ఉన్న మహిమాన్వితమైన ఖుర్‌ఆన్. దీన్ని పవిత్రులు, పరిశుద్ధులు తప్ప మరెవ్వరూ తాకలేరు. ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన (దివ్య)వాణి." (ఖుర్‌ఆన్–56:75–80)

ఖుర్‌ఆన్ మహోన్నతమైన దైవగ్రంథం అని చెప్పడానికి పై సూక్తులలో నక్షత్రాలు ఉండే ప్రదేశాలపై, వాటి కక్ష్యలపై, గమ్యస్థానాలపై ప్రమాణం చేయడం జరిగింది. కోట్లాది గ్రహాలు, నక్షత్రాలతో నిండిన విశ్వవ్యవస్థను ఏ దేవుడు సృష్టించాడో ఆ దేవుడే ఈ గ్రంథాన్ని కూడా అవతరింపజేశాడు. విశ్వవ్యవస్థ ఎంత అద్భుతమైన క్రమపద్ధతిన పకడ్బందీగా సృష్టించబడిందో అంతే అద్భుతమైన క్రమపద్ధతిన పకడ్బందీగా ఖుర్‌ఆన్ కూడా రూపొందించబడింది. విశ్వవ్యవస్థలోని విషయాలు ఎంత యదార్థమయినవో ఖుర్‌ఆన్‌లోని విషయాలు కూడా అంతే యదార్థమైనవి. కనుక ఈ సూక్తులలో దేవుడు తన అద్భుతసృష్టి అయిన రోదసీ వస్తువులపై ప్రమాణంచేస్తూ తాను అవతరింపజేసిన ఈ వాణిని కూడా విశ్వసించి గౌరవించమని మానవాళికి హితోపదేశం చేస్తున్నాడు.

అవిశ్వాసులు ఖుర్‌ఆన్‌ని విశ్వసించడానికి నిరాకరిస్తూ, దాన్ని ఏ భూతమో, పిశాచమో ముహమ్మద్ (సల్లం)కు నేర్పుతోందని ఆరోపించేవారు. దేవుడు వారి ఆరోపణలను ఖండిస్తూ, ఈ అద్భుతవాణి దేవలోకంలోని ఓ సురక్షిత గ్రంథంలో ఉంచబడిందని, అక్కడికి ఎవరూ పోలేరని, భూతపిశాచాలకు ఆ శక్తి లేదని, అవి దాన్ని తాకనైనా తాకలేవని చెబుతున్నాడు. పరిశుద్ధులు, పాపరహితులైన దైవదూతలు మాత్రమే ఈ దివ్యగ్రంథాన్ని తాకడానికి, దాన్ని దివి నుండి భువికి దించడానికి అర్హులని కూడా దేవుడు ఈ సూక్తిలో స్పష్టం చేస్తున్నాడు.

"దీన్ని పిశాచ శక్తులు (షైతానులు) తీసుకొని అవతరించలేదు. ఈపని వాటికి తగినది కాదు. ఈవిధంగా అవి చేయలేవు కూడా. కనీసం దీన్ని వినడానికి కూడా అవకాశం లేకుండా వాటిని దూరంగా ఉంచడం జరిగింది." (ఖుర్‌ఆన్–210–212)

"కాబట్టి, (మీరనుకునేది నిజం) కాదు. మీకు గోచరించేదాని పేర, గోచరించని



దాని పేర ప్రమాణం చేసి చెబుతున్నాను. ఇది గౌరవనీయుడైన సందేశహరుని వాక్కు. ఏ కవినోటో వెలువడిన మాటకాదు. మీరసలు బహుతక్కువగా విశ్వసిస్తారు. ఇది ఏ మాంత్రికుడో చెప్పిన వాక్కు కూడాకాదు. మీరసలు చాలా తక్కువగా ఆలోచిస్తారు. ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన (దివ్య)వాణి. ఇతను స్వయంగా కల్పించి ఏదైనా ప్రచారంచేస్తే, మేమితని కుడిచేయి పట్టుకొని కంఠనాళం కోసివేసే వాళ్ళం. అప్పుడు మమ్మల్ని ఈపని నుండి ఏశక్తీ అడ్డుకోలేదు." (ఖుర్‌ఆన్–69:39–47)

# 17. ఖుర్‌ఆన్ విశిష్ఠత

"విషయస్పష్టత కల్గిన ఈగ్రంథం సాక్షి! మీరు అర్థంచేసుకోవడానికి వీలుగా దీన్ని మేము అరబీభాషలో పఠనగ్రంథం (ఖుర్‌ఆన్)గా చేశాం. నిజానికిది మా దగ్గరున్న మూలగ్రంథం లోనిది. మాదృష్టిలో ఇది మహోన్నతమయినది, వివేచనాపూరితమయిన గ్రంథం." (ఖుర్‌ఆన్–43:2–4)

"ఈ ఖుర్‌ఆన్ యావత్ మానవాళి కోసం అవతరించిన హితోపదేశం. అనతి కాలంలోనే మీకు దీని వాస్తవికత ఏమిటో తెలుస్తుంది." (ఖుర్‌ఆన్–38:88)

"మేము ప్రతి విషయాన్నీ స్పష్టంగా విశదీకరించే (ఖుర్‌ఆన్) గ్రంథాన్ని నీపై అవత రింపజేశాము. ఈగ్రంథం (మాకు) విధేయులయిన వారికోసం చక్కటి మార్గదర్శినిగా, కారుణ్య ప్రదాయినిగా, శుభవార్త ప్రకటనగా అవతరించింది." (15:89)

"మేము నీకు మాటిమాటికి ఉచ్చరించదగిన ఏడు సూక్తులు ప్రసాదించాము. మేము నీకు మహోన్నతమైన ఖుర్‌ఆన్ (పాఠ్యగ్రంథం) అనుగ్రహించాము." (15:87)

"మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. ఇది మీ హృదయరుగ్మతలకు నివారిణి. దీన్ని స్వీకరించేవారికి ఇది మార్గదర్శిని, కారుణ్య ప్రదాయిని. ప్రవక్తా! వారికిలా తెలియజెయ్యి: "ఈ మహాభాగ్యాన్ని దేవుడు మీ కోసం పంపాడంటే ఇది ఆయన అనుగ్రహం, దాతృత్వాలే. దానిపై వారు ఆనందోత్సవాలు జరుపుకోవాలి. ఇది ప్రజలు కూడబెడ్తున్న దానికంటే ఎంతో శ్రేష్ఠమైనది." (10:57,58)

"రమజాన్ ఖుర్‌ఆన్ అవతరించిన నెల. ఈగ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి." (ఖుర్‌ఆన్–2:185)

"వారు ఖుర్‌ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ నుండిగాక మరెవరి నుండో వచ్చివుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా!" (ఖుర్‌ఆన్–4:82)

ఖుర్‌ఆన్ గురించి గత 1400 సంవత్సరాల నుంచి ధర్మ వేత్తలు పరిశోధనలు చేసి ఎన్నోభావాలు, మరెన్నో మర్మాలు కనుగొన్నారు. ఇప్పుడు ఖుర్‌ఆన్‌లోని మరో విశేషం కంప్యూటర్ పరిశోధన ద్వారా వెలుగులోకి వచ్చింది. ఖుర్‌ఆన్ వివిధ కోణాలలో

అంతర్లీనమైఉన్న "19" సంఖ్యే కంప్యూటర్‌లో బయల్పడిన కొత్తవిశేషం. ఇది సంఖ్యారాసిలో లఘుతమ, గురుతమ సంఖ్యల మిశ్రమం.

ఖుర్‌ఆన్ ప్రారంభ వాక్యమైన 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం'లో మొత్తం 19 అక్షరాలున్నాయి. ఇందులోని నాలుగు పదాలు ఖుర్‌ఆన్‌లో ఎన్నిసార్లు వచ్చాయో ఆ సంఖ్యలన్నీ 19 చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్యే. ఖుర్‌ఆన్‌లోని మొత్తం సూరాల సంఖ్య 114 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది.

ఖుర్‌ఆన్‌లో 29 సూరాలు, 14 అక్షరాలతో ఏర్పడే వివిధ పద సముదాయాలతో ప్రారంభమవుతాయి. ఉదా:- అలిఫ్ లాం మీమ్, యా సీన్, సాద్, ఖాఫ్, నూన్, హా మీమ్, మొదలైనవి. ఈ 14 అక్షరాలలోని ప్రతి అక్షరం ఏ సూరాలో వచ్చినా ఆ సూరాలో ఆ అక్షరసంఖ్య 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది. ఉదా:- ఖాఫ్ సూరాలోని మొదటి అక్షరమైన 'ఖాఫ్' ఆ సూరాలో 57 సార్లు వచ్చింది. ఇది 19చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్య. ఖలమ్ సూరా మొదటి అక్షరమైన 'నూన్' 133 సార్లు వచ్చింది. ఇది కూడా 19చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్యే. ఆరాఫ్, మర్యం, సాద్ సూరాల్లో మొదటి అక్షరం 'సాద్' ఒక్కొక్క సూరాలో 152 సార్లు వచ్చింది. 152 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్యే.

ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూరాలు రెండు మూడు బీజాక్షరాలతో కూడా ప్రారంభమవుతాయి. తాహా సూరాలో మొదటి అక్షరజంట 'తా,హా'లో 'తా' 28 సార్లు, 'హా' 314 సార్లు వచ్చాయి. ఈ రెండు సంఖ్యలు (28+314) కలపగా వచ్చే సంఖ్య 342 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది. యాసీన్ సూరాలో మొదటి అక్షరజంట 'యా, సీన్'లో 'యా' 237 సార్లు, 'సీన్' 48 సార్లు వచ్చాయి. ఈ రెండు సంఖ్యలు (237+48) కలపగా వచ్చే సంఖ్య 285 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది.

ఖుర్‌ఆన్‌లో ఏడు సూరాలు 'మీమ్, అయిన్' అనే అక్షరజంటతో ప్రారంభమవుతాయి. ఆ ఏడు సూరాలలో 'మీమ్' అనే అక్షరం 304 సార్లు, 'అయిన్' అనే అక్షరం 1862 సార్లు వచ్చాయి. ఈ రెండు సంఖ్యలు (304+1862) కూడగా వచ్చే సంఖ్య 2166 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది. మూడు బీజాక్షరాల సముదాయంతో ప్రారంభమయ్యే సూరాలు కూడా కొన్ని ఉన్నాయి. ఉదా:- 'అలిఫ్, లాం, మీమ్'లతో ప్రారంభమయ్యే 8 సూరాలున్నాయి. ఈ సూరాలలోని అలిఫ్, లాం, మీమ్ అనే అక్షరాలు మొత్తం 26,676 సార్లు వచ్చాయి. ఈ సంఖ్య కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది.

19 సంఖ్యకు లభించిన ఈ ప్రత్యేకత యాదృచ్ఛికం కాదు. యాదృచ్ఛికమయితే రెండుమూడు లేదా అయిదారు సార్లు వచ్చివుండేది. అనేక సార్లు వచ్చిందంటే ఖుర్‌ఆన్ నిస్సందేహంగా దేవుని వాణేనని, మానవమేధా జనితం ఎంతమాత్రం కాదని తెలుస్తుంది. (దావత్ పత్రిక నుండి)



# 18. అవతరణకు కారణాలు

"అలిఫ్-లామ్-రా. ముహమ్మద్ (స)! ఇది మేము నీపై దించిన దివ్యగ్రంథం. ప్రజల్ని నీవు చీకటి నుండి వెలుగులోకి తీసుకురావడానికే దీన్ని దించాము.అంటే వారి ప్రభువు ఆజ్ఞతో సర్వశక్తిమంతుడు, సకల ప్రశంసలకు అర్హుడైన దేవుని మార్గంలోకి అన్నమాట." (ఖుర్‌ఆన్-14:1,2)

"ఇది యావత్తు మానవుల కోసం అవతరించిన విశ్వజనీన సందేశం. (పరలోక) పరిణామాల్ని గురించి ప్రజలను హెచ్చరించడానికి, వారు దేవుడు ఒక్కడేనని తెలుసుకోవడానికి, బుద్ధిజ్ఞానం కలవారు స్పృహలోకి రావడానికి ఈ సందేశం పంపబడింది." (ఖుర్‌ఆన్-14:52)

"దైవప్రవక్త మిమ్మల్ని తన ప్రభువును విశ్వసించమని హితవు చేసి మీచేత ప్రమాణం చేయించినా మీరు దేవుణ్ని విశ్వసించరెందుకు? మీరు నిజంగా విశ్వసించినవారైతే (ఈ విశ్వాసరాహిత్య వైఖరేమిటీ?) మిమ్మల్ని చీకటి నుండి వెలుగులోకి తీసుకురావడానికి తన దాసునిపై నిర్దిష్ట సూక్తులు అవతరింపజేస్తున్నవాడు దేవుడే కదా! మీ విషయంలో దేవుడు ఎంతో దయార్ద్రహృదయుడు, గొప్పక్షమాశీలి." (ఖుర్‌ఆన్-57:8,9)

"ఈ గ్రంథంలోని బోధనల ద్వారా నీవు రాజధాని (మక్కా) నగర వాసుల్ని, దాని పరిసర ప్రాంతాల్లో నివసించే వారిని హెచ్చరించడానికి దీన్ని అవతరింపజేశాం. పరలోకాన్ని నమ్మేవారు ఈగ్రంథాన్ని విశ్వసిస్తున్నారు. పైగా వారు తమ నమాజ్ పట్ల ఎంతో జాగ్రత్త వహిస్తూ అత్యంత శ్రద్ధాసక్తులతో దాన్ని ఆచరిస్తున్నారు." (ఖుర్‌ఆన్-6:92)

"(ఇలాంటి గ్రంథం గురించి) వీరు "దీన్ని ఇతను కల్పించుకున్నాడ"ని అంటున్నారా? కాదు. ఇది నీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. నీకు పూర్వం హెచ్చరించేవారెవరూ రానటువంటి జాతిని నీవు హెచ్చరించేందుకు పంపబడిన సత్యమిది. దీని ద్వారా ఆ జాతిప్రజలు రుజుమార్గంలోకి వస్తారన్న లక్ష్యంతో అవతరించిన (పరమ) సత్యం." (ఖుర్‌ఆన్-32:3)

"ఈ ఖుర్‌ఆన్ ఇస్రాయీల్ సంతతి ప్రజలకు వారు పరస్పరం విభేదిస్తున్న అనేక విషయాలకు సంబంధించిన నిజానిజాలేమిటో తెలియజేస్తోంది. విశ్వాసుల పాలిట ఇది మార్గదర్శక గ్రంథం, (దైవ)కారుణ్యం." (ఖుర్‌ఆన్-27:76,77)

"ముహమ్మద్! దేవుడు నీకు చూపిన మార్గం అనుసరించి నీవు ప్రజల వ్యవహారాలు పరిష్కరించడానికి మేము సత్యపూరితమైన (ఈ) గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. కనుక నీవు నీతిలేని వారివైపు నిలబడి వాదించకు." (ఖుర్‌ఆన్-4:105)

"దేవుని వైపునుండి మీ దగ్గరకు (అజ్ఞానాంధకారం దూరంచేసే) జ్యోతి వచ్చింది. (సన్మార్గం చూపే) దేదీప్యమానమైన దివ్యగ్రంథం కూడా వచ్చింది. దీనిద్వారా దేవుడు

తన ప్రసన్నతాభాగ్యం కోరుకునేవారికి ముక్తిమార్గం చూపుతాడు. అంతేకాకుండా ఆయన తన అనుగ్రహంతో వారిని కారుచీకట్ల నుండి కాంతి వైపు తీసుకువెళ్తాడు; (అపమార్గం నుండి తీసి) రుజుమార్గంలో నడిపిస్తాడు." (ఖుర్‌ఆన్-5:16)

"నిస్సందేహంగా ఈ ఖుర్‌ఆన్ పూర్తిగా రుజుమార్గం చూపుతుంది. సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరించేవారికి గొప్పప్రతిఫలం లభిస్తుందని శుభవార్త అంద జేస్తోంది. పరలోకాన్ని విశ్వసించనివారికి మేము దుర్భరయాతన సిద్ధపరచి ఉంచామని కూడా ఇది హెచ్చరిస్తోంది." (ఖుర్‌ఆన్-17:9,10)

"(జ్ఞానం, చైతన్యం కలిగి) సజీవంగా ఉండే ప్రతి వ్యక్తినీ హెచ్చరించడం, తిరస్క రించేవారికి వ్యతిరేకంగా సాక్ష్యం ఏర్పరచడం దీని లక్ష్యాలు." (ఖుర్‌ఆన్-36:70)

"మేము మా ప్రవక్తలకు నిర్దిష్టమైన సూచనలు, నిదర్శనాలను ఇచ్చి పంపాము. వాటితో పాటు దివ్యగ్రంథాలను, జనం న్యాయానికి కట్టుబడి ఉండేందుకు కొలమానాన్ని కూడా అవతరింపజేశాము." (ఖుర్‌ఆన్-57:25)

# 19. ఖుర్‌ఆన్ భవిష్యత్ ప్రకటనలు

ఇప్పుడు మనం దివ్యఖుర్‌ఆన్‌లో సూచించబడిన భవిష్యత్ ప్రకటనలు ఏమిటో, ఆ తరువాత కాలంలో అవి ఎలా నిజమయ్యాయో తెలుసుకుందాం:

ఖుర్‌ఆన్‌లో దేవుడు ఒక చోట ఫిరౌన్ చక్రవర్తి గురించి ఈ విధంగా పేర్కొన్నాడు- "మేము ఇస్రాయీల్ సంతతివారిని సముద్రం గుండా క్షేమంగా) పోనిచ్చాము. అయితే ఫిరౌన్‌ని, (అతని సైన్యాన్ని ముంచివేశాము''....."ఇంకా అతని శవాన్ని (రాబోయే తరాలవారికి) ఒక గుణపాఠంగా చేసి వదలిపెట్టాము.'' అంటే ఫిరౌన్ భౌతిక కాయాన్ని చెడిపోకుండా ప్రజల కనువిప్పు కోసం సముద్రంలోనే భద్రపరిచామని అర్థం.

ఈ సూక్తి అవతరణకు 1500 సంవత్సరాల క్రితం ఈ సంఘటన జరిగింది. కాని క్రీ.శ. 1907 దాకా ఫిరౌన్ భౌతికకాయం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదు. మొట్ట మొదటిసారిగా 7వ శతాబ్దిలో ఖుర్‌ఆన్ మాత్రమే ఈ రహస్యాన్ని బయట పెట్టింది. 1907లో సర్ గ్రాఫ్టన్ స్మిత్ అనే వ్యక్తి సముద్రంలో ఫిరౌన్ శవాన్ని కనుగొన్నాడు. శవం పూర్వాపరాలను గురించి పరిశోధన జరిపితే ఇది మూసా ప్రవక్త (అలై) కాలంనాటి ఫిరౌన్ శవమని తెలిసింది. దాని మీద పేరుకున్న ఉప్పుపొరను బట్టి ఇది ఉప్పునీటిలో మునిగిందని తేలింది.

మక్కాలో సత్యతిరస్కారులు దైవప్రవక్త ప్రచార కార్యాన్ని నిరోధించడానికి ఒక కమిటీనీ ఏర్పరిచారు. దైవప్రవక్త (స)ను హేళన చేయడం, కించపరచడం, వీలైనంత వరకు ఆయన హృదయాన్ని గాయపరచడం- ఇదీ ఈ కమిటీ సభ్యుల పని. అయితే వీరి ఆగడాలు మితిమీరగానే వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది. దేవుడు తన



ప్రవక్త (సల్లం)కు ధైర్యం చెబుతూ ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రకటించాడు:

"ముహమ్మద్! బహుదైవారాధకుల చేష్టలను నీవు ఖాతరు చేయకు, వారిని ఓ కంట కనిపెట్టేందుకు మేము చాలు."

ఈ భవిష్యత్ ప్రకటన వెలువడిన తరువాత కమిటీ సభ్యులలో ఆసిమ్ బిన్ రాయెల్‌కు తేలుకుట్టింది. దాంతోనే అతను చనిపోయాడు. మాలిక్ బిన్ ఈతాల, హారిస్ బిన్ ఖైస్ అనే సభ్యులు తీవ్రమయిన కడుపు నొప్పితో ఊపిరి విడిచారు, అబీ బిన్ ఖల్ఫ్, నస్ర్ బిన్ హారిస్ అనేవాళ్ళు ముస్లిమ్‌ల చేత హతమార్చబడ్డారు. అసూద్ బిన్ ముత్తలిబ్, ఆస్ బిన్ మింబా అనే వ్యక్తులు కంటిలో ముల్లు గుచ్చుకోవడం వల్ల చనిపోయారు. దైవప్రవక్త (సల్లం)ను బాధించి ఇస్లామ్ ప్రచారాన్ని నిరోధించాలనుకున్న ఈ కమిటీ సభ్యులంతా ఈ విధంగా సర్వనాశనమయ్యారు.

మక్కాలో ఒకప్పుడు దైవప్రవక్త (స) సందేశాన్ని వినడానికి ఏ ఒక్కరూ ముందుకు వచ్చేవారు కాదు. కాని కొన్నాళ్ళకు "ఓ ప్రవక్తా! మేము (ఇస్లామీయ ఉద్యమాన్ని విస్తరింపజేయడం ద్వారా) నీ కీర్తిని ఉన్నతం చేశాము'' అన్న దైవప్రకటన వెలువడిన తరువాత ఇస్లాం స్వీకరించేవారి సంఖ్య అతివేగంగా పెరగసాగింది. కేవలం పదేళ్ళ కాలంలో అరేబియా నలుదిశలా ఇస్లామ్ వ్యాపించిపోయింది.

దివ్యఖుర్‌ఆన్ చేసిన మరొక భవిష్యత్ ప్రకటన చూడండి: "రోమన్‌లు సమీప భవిష్యత్తులో పరాజితులవుతారు. అయితే పరాజితులయిన తరువాత మళ్ళీ త్వరలోనే వారు ప్రాబల్యం వహిస్తారు...అది దేవుడు ప్రసాదించిన విజయం పట్ల ముస్లిమ్‌లు ఆనందోత్సవాలు జరుపుకునే రోజవుతుంది.'' (30:1-4)

రోమ్ చక్రవర్తి హెర్క్యులస్ భోగభాగ్యాల్లో మునిగితేలుతూ ఉండటం వల్ల రోమన్‌లు అడుగడుగునా ఓటమిని చవిచూడవలసి వచ్చింది. ఆనాడు రోమన్ల పతనావస్థను చూస్తే వారు మళ్ళీ విజయం సాధించి పూర్వ వైభవాన్ని పొందగలరని ఎవరూ ఊహించలేకపోయారు. అలాంటి స్థితిలో పై 'ఆయత్‌లు' అవతరించాయి. ఆ తరువాత రోమ్ చక్రవర్తి తన తప్పిదాల పట్ల పశ్చాత్తాపం చెంది నూతనుత్తేజంతో సమర శంఖం పూరించాడు. క్రీ.శ. 623లో ఆర్మేనియాను తిరిగి చేజిక్కించుకొని అనేక విజయాలు సాధించాడు. చివరికి రోమన్‌లు క్రీ.శ. 628లో ఈరాన్ చక్రవర్తి ఖుస్రూ పర్వేజ్‌ని చిత్తుగా ఓడించి బందీగా పట్టుకున్నారు. అదే సంవత్సరం ఇటు ముస్లింలు హుదైబియా ఒడంబడిక ద్వారా అనూహ్యమయిన విజయం సాధించి ఆనందోత్సవాలు జరుపుకుంటున్నారు. దైవవాణి చేసిన భవిష్యత్ ప్రకటన ఇలా నిజరూపం దాల్చడం చూసిన మక్కా బహుదైవారాధకులు నిర్ఘాంతపోయారు.

మక్కాలో అత్యల్ప సంఖ్యలో కడు పేదరికంలో ఉన్న ముస్లింల హీనస్థితిని చూసి వారు అన్నివిధాలా సుసంపన్నులయిన బహుదైవారాధకులపై ప్రాబల్యం

వహించగలరా అని కూడా ఆనాడు రాజకీయ పరిశీలకులు ఊహించే స్థితిలో లేరు. కాని దివ్యఖుర్‌ఆన్ "మా సైన్యమే ప్రాబల్యం వహిస్తుంది" అని స్పష్టంగా ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కొన్నాళ్ళకు ముస్లింలు మదీనా వలసపోయారు. ఆ తరువాత విజయ పరంపర ప్రారంభమైంది. అరేబియా సరిహద్దులు దాటి వారు పెను తుఫానులా దూసుకుపోయి ఈజిప్ట్, సూడాన్, ఖురాసాన్, టర్కీ, ఇరాఖ్, ఈరాన్, సిరియా, పాలస్తీనా, దక్షిణాఫ్రికా, భారత్ మొదలయిన దేశాలలో విజయ దుందుభి మోగించారు. ఇదంతా ఆ భవిష్యత్ ప్రకటన మహత్యమే.

ఖుర్‌ఆన్ పూర్తిగా దైవవాణి అని చెప్పడానికి ఇలా ఎన్నో నిదర్శనాలను పేర్కొన వచ్చు. కాని సంకుచితదృష్టి, దురభిమానాల దర్పణాలు తీసి, విజ్ఞతా వివేచనల సులోచనాలను ధరించినవారే ఈ నిదర్శనాల ద్వారా ఖుర్‌ఆన్ దైవవాణి అని గ్రహించ గలుగుతారు.

## 20. విశ్వాస, అవిశ్వాసాల లక్షణాలు

"ఈ గ్రంథం (దేవుని పట్ల) భయభక్తులు కలవారికి రుజుమార్గం చూపుతుంది. వారు అగోచరాలు, అతీంద్రియాలను విశ్వసిస్తారు; ప్రార్థన (వ్యవస్థ)ను స్థాపిస్తారు; మేము ప్రసాదించిన సంపద నుండి (మామార్గంలో) ఖర్చుపెడతారు; నీపై అవతరించిన ఈ గ్రంథాన్ని, నీకు పూర్వం గతప్రవక్తలపై అవతరించిన గ్రంథాలను విశ్వసిస్తారు. అదీగాక వారు పరలోకాన్ని కూడా విశ్వసిస్తారు. అలాంటి దైవభీతిపరులే తమ ప్రభువు నుండి వచ్చిన రుజుమార్గంలో నడిచేవారు. అలాంటివారే సాఫల్యం చెందేవారు; మోక్షం పొందేవారు." (ఖుర్‌ఆన్-2:2-5)

"విశ్వప్రభువుకు భయపడేవారు ఈ వాణి వినగానే వారి రోమాలు నిక్కబొడుచు కుంటాయి; వారి శరీరాలు జలదరిస్తాయి; వారి హృదయాలు మెత్తబడి దేవుని ప్రస్తావన వైపు మొగ్గుతాయి. ఇది దేవుని హితవాణి. దీని ద్వారా దేవుడు తాను తలచిన వారిని దారికి తెస్తాడు. ఆయన దారి తప్పించదలచిన వారికి మరెవరూ దారి చూపలేరు. (ఖుర్‌ఆన్-39:23)

"పూర్వం (గ్రంథ) జ్ఞానం ప్రసాదించబడినవారి ముందు దీన్ని పఠిస్తే, వారు అప్రయత్నంగా సాష్టాంగపడి 'మా ప్రభువు ఎంతో పరిశుద్ధుడు. ఆయన వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది' అని అంటారు. అంతేకాదు, వారు కంటతడి పెడ్తూ బోర్లాపడి సాష్టాంగపడతారు. అది విన్న తరువాత వారిలోని అణుకువ, భక్తిభావలు ద్విగుణీ కృతమైపోతాయి." (ఖుర్‌ఆన్-17:107-109)

"వారు తమకు తెలియని విషయాన్ని (మూర్ఖంగా) తిరస్కరిస్తున్నారు. దాని వాస్తవికత ఏమిటో వారికింకా తెలియదు. వారికి పూర్వముండిన ప్రజలు కూడా ఇలాగే నిరాకరించారు. ఇకచూడు, ఆ దుర్మార్గులకు ఎలాంటి గతి పట్టిందో!" (ఖురాన్-10:39)



"ప్రవక్తా! ఒకవేళ మేము కాగితాలపై రాసిన గ్రంథాన్ని నీపై అవతరింపజేసినా, దాన్ని ఈ తిరస్కారులు చేత్తో తాకిచూసి కూడా విశ్వసించరు. పైగా వారు ఇదంతా ఏదో మంత్రజాలం తప్ప మరేమీ కాదని వాదిస్తారు. అంతేకాదు, ఈ ప్రవక్తతో పాటు (అతని ప్రవక్తృత్వాన్ని ధృవపరిచేందుకు) ఒక దైవదూతను ఎందుకు దించలేదని కూడా అంటారు. ఒకవేళ మేము దైవదూతల్ని దించివుంటే ఈపాటికి ఎప్పుడో (వారి) వ్యవహారం తేలిపోయి ఉండేది. వారికి ఎలాంటి అవకాశమిచ్చేవారం కాము. మేము దైవదూతను అవతరింప జేయవలసివస్తే అతడ్ని మానవాకారంలోనే అవతరింపజేస్తాం. వారిప్పుడు ఎలా అనుమానంలో పడిఉన్నారో అప్పుడు కూడా అనుమానంలోనే పడి పోతారు." (ఖుర్‌ఆన్-6:7,8)

"నీ గురించి వారు, ఒక వ్యక్తి ఇతనికి (ఖుర్‌ఆన్) నేర్పుతున్నాడని చెబుతున్న సంగతి మాకు తెలుసు. కాని వారు ఏ మనిషిని ఉద్దేశించి ఈ మాటలు అంటున్నారో అతను అరబ్బేతరుడు. ఇదేమో స్పష్టమైన అరబీభాషలో అవతరించింది. దేవుని సూక్తులు విశ్వసించనివారికి దేవుడు ఎన్నటికీ సన్మార్గబుద్ధి ప్రసాదించడు. అలాంటి వారికి దుర్భర యాతన తప్పదు. దేవుని సూక్తులు విశ్వసించనివారే (ఇలాంటి) అబద్ధాలు పలుకుతారు. వారే అసలు అసత్యవాదులు." (ఖుర్‌ఆన్-16:103-105)

"దీన్ని గురించి ఇస్రాయీల్ సంతతి ధర్మవేత్తలకు తెలుసన్న విషయంలో వీరికి (మక్కాపౌరులకు) ఎలాంటి సూచన కానరావడం లేదా? మేము దీన్ని అరబ్బేతరునిపై అవతరింపజేసి, అతను దీన్ని చదివివిన్పించినా వీరు విశ్వసించరు. ఈవిధంగా మేము దీన్ని నేరస్థుల గుండెలలోకి గునపంలా దించుతాము. (దాంతో) వారు (రెచ్చిపోయి) వ్యధాభరితమైన శిక్ష కళ్ళారా చూసుకునేదాకా దీన్ని విశ్వసించరు. వారు ఏమరుపాటులో పడిఉన్నప్పుడు ఆ శిక్ష విరుచుకుపడితే (దాని సూచనలు చూసి భయంతో) 'ఇప్పుడు మాకేమైనా అవకాశం లభిస్తుందా?' అంటారు." (ఖుర్‌ఆన్-26:197-203)

"కృతఘ్నులు, ద్రోహులు తప్ప మా సూక్తులు ఎవరూ తిరస్కరించరు." (ఖుర్‌ఆన్-31:32)

"వీరు ఖుర్‌ఆన్ (సత్యత)ను గురించి ఆలోచించలేదా? లేక వారి హృదయ కవాటాలు మూసుకుపోయాయా? సత్యం, సన్మార్గాలు స్పష్టంగా ముందుకు వచ్చిన తరువాత కూడా వాటికి విముఖులైపోయారు. అందుకే షైతాన్ వారికోసం ఇలాంటి (కపట) వైఖరిని సులభం చేసి, లేనిపోని ఆశలు వారిలో పెంచి పోషించాడు." (ఖుర్‌ఆన్-47:24,25)

"అందువల్ల మానవులారా! మీరనుకున్నది ఎంతమాత్రం నిజం కాదు. నేను నక్షత్రాల కక్ష్యల సాక్షిగా చెబుతున్నాను. మీరు గ్రహించగలిగితే ఇది గొప్ప ప్రమాణం. ఇది సురక్షిత గ్రంథంలో (రాయబడి) ఉన్న మహిమాన్వితమైన ఖుర్‌ఆన్. దీన్ని పవిత్రులు, పరిశుద్ధులు తప్ప మరెవ్వరూ తాకలేరు. ఇది సర్వలోక ప్రభువు నుండి

అవతరించిన (దివ్య)వాణి. ఇలాంటి (అద్భుత) వాణిని మీరు నిర్లక్ష్యం చేస్తున్నారా? దీన్ని నిరాకరించడమే బ్రతుకు తెరువుగా పెట్టుకున్నారా?" (ఖుర్ఆన్–56:80–82)

ఖుర్ఆన్ మహోన్నతమైన దైవగ్రంథం అని చెప్పడానికి ఇక్కడ నక్షత్రాలుండే ప్రదేశాలపై, వాటి కక్ష్యలపై, గమ్యస్థానాలపై ప్రమాణం చేయడం జరిగింది. కోట్లాది గ్రహాలు, నక్షత్రాలతో నిండిన విశ్వవ్యవస్థను ఏ దేవుడు సృష్టించాడో ఆ దేవుడే ఈ గ్రంథాన్ని కూడా అవతరింపజేశాడు. విశ్వవ్యవస్థ ఎంత అద్భుతమైన క్రమపద్ధతిన పకడ్బందీగా సృష్టించబడిందో అంతే అద్భుతమైన క్రమపద్ధతిన పకడ్బందీగా ఖుర్ఆన్ కూడా రూపొందించబడింది. విశ్వవ్యవస్థలోని విషయాలు ఎంత యదార్థమైనవో ఖురాన్‌లోని విషయాలు కూడా అంతే యదార్థమైనవి. కనుక ఇలాంటి అద్భుతమైన వాణిని విశ్వసించి గౌరవించాలని దేవుడు మానవాళికి హితోపదేశం చేస్తున్నాడు.

అవిశ్వాసులు ఖుర్ఆన్‌ని విశ్వసించడానికి నిరాకరిస్తూ, దాన్ని ఏ భూతమో, పిశాచమో  ముహమ్మద్ (సల్లం)కు నేర్పుతోందని ఆరోపించేవారు. దేవుడు వారి ఆరోపణలను ఖండిస్తూ, ఈ అద్భుతవాణి దేవలోకంలోని ఓ సురక్షిత గ్రంథంలో ఉంచబడిందని, అక్కడికి ఎవరూ పోలేరని, భూతపిశాచాలకు ఆ శక్తి లేదని, అవి దాన్ని తాకనైనా తాకలేవని చెబుతున్నాడు. పరిశుద్ధులు, పాప రహితులైన దైవదూతలు మాత్రమే ఈ దివ్యగ్రంథాన్ని తాకడానికి, దాన్ని దివి నుండి భువికి దించడానికి అర్హులని కూడా దేవుడు ఈ సూక్తిలో స్పష్టం చేస్తున్నాడు.

ఖురైష్ నాయకులు ఇస్లామీయ ఉద్యమాన్ని తమ ఆర్థిక ప్రయోజనాలకు పెద్ద నష్టదాయకమని భావించేవారు. ఈ ఉద్యమం విజయవంతమయితే తమ ఉపాధి మార్గాలు మూసుకుపోతాయని భయపడసాగారు. అందువల్ల వారు సత్యాసత్యాలు, ధర్మాధర్మాలను గురించి విచారించకుండా ఆ ఉద్యమాన్ని అణచి వేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ విషయాన్నే ఇక్కడ ఖుర్ఆన్ వారు సత్య నిరాకరణను బ్రతుకుతెరువుగా చేసుకున్నారని అంటోంది.

## 21. విశ్వజనీన వాణి

ఖుర్ఆన్ ఏదోఒక ప్రత్యేకజాతినో, లేదా ఒక ప్రత్యేకవర్గాన్నో ఉద్దేశించి 'అరబ్బులారా!' అనిగాని, 'కార్మికులారా!' అనిగాని సంబోధించదు. ఇది ' ఓ మానవులారా!' అంటూ యావత్ మానవాళిని సంబోధిస్తుంది. ఖుర్ఆన్ దృష్టిలో మానవులంతా సమానులే. కాకపోతే అది తెలిపే పరమసత్యాన్ని విశ్వసించిన వారిని విశ్వాసులుగా, దాన్ని స్పష్టంగా నిరాకరించిన వారిని తిరస్కారులుగా పరిగణిస్తుంది. కారణం సత్యం-అసత్యం మంచి-చెడు ఎన్నటికీ ఒకటి కాజాలదు కదా!

ఖుర్ఆన్ 1400 సంవత్సరాల క్రితం నాటి మధ్యయుగం పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని అవతరించలేదు. ఇది సార్వజనీనమయినట్లే సార్వకాలికమయినది. ప్రళయ



కాలం వరకూ మానవాళికి పూర్తి మార్గదర్శకం చేయగల దైవగ్రంథం ఖుర్ఆన్ మాత్రమే. ప్రతి దైవప్రవక్తపై అవతరించే దైవబోధనలు ఆయన తరువాత ప్రభవించే దైవప్రవక్త వరకు మాత్రమే అమల్లో ఉంటాయి. అయితే మహనీయ ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్త కాబట్టి- అంటే ఆయన తరువాత మరో దైవప్రవక్త ప్రభవించే ప్రసక్తే లేదు. కాబట్టి ఖుర్ఆన్ బోధనలు ప్రళయకాలం దాకా అమల్లో ఉంటాయి.

"వారు తమ నోటితో దేవుని జ్యోతి (సత్యధర్మం) ఆర్పివేయ గోరుతున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు మాత్రం తన జ్యోతిని నేల నాలుగు చెరగులా ప్రసరింపజేయనిదే వదలిపెట్టడు. సత్యధర్మం బహుదైవారాధకులకు ఏమాత్రం నచ్చకపోయినా ఇది యావత్తు జీవనవ్యవస్థలపై ఆధిక్యత పొందడానికి ఆ దేవుడే తన ప్రవక్తకు సత్యాన్ని, హితబోధను ఇచ్చి పంపాడు." (ఖుర్ఆన్–9:32,33)

"ముహమ్మద్ (సల్లం)! నీవు ఎంత కోరుకున్నా వారిలో చాలామంది (నీవు బోధించే) సత్యాన్ని విశ్వసించరు. ఈ పని కోసం నీవు వారిని ఎలాంటి ప్రతిఫలం అడగకపోయినా వారు నమ్మేరకం కాదు. ఇది యావత్తు ప్రపంచ మానవాళి కోసం పంపబడిన హితబోధ." (ఖుర్ఆన్–12:103,104)

"రమజాన్ ఖుర్ఆన్ అవతరించిన నెల. ఈగ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి." (ఖుర్ఆన్–2:185)

"మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరికి స్పష్టమైన ప్రమాణం వచ్చింది. మేము (మీకు రుజుమార్గం చూపడానికి) మీ దగ్గరకు స్పష్టమైన జ్యోతి పంపాము. కనుక దేవుని సూక్తులు విశ్వసించి ఆయన చూపిన ధర్మాన్ని గట్టిగా ఆశ్రయించినవారిని ఆయన తన కారుణ్యానుగ్రహాల (స్వర్గం)లోకి ప్రవేశింపజేస్తాడు. అంతేకాకుండా తన దగ్గరకు చేరుకోవడానికి తిన్నని మార్గం కూడా చూపుతాడు." (ఖుర్ఆన్–4:174,175)

"ఇది యావత్తు మానవుల కోసం అవతరించిన విశ్వజనీన సందేశం. (పరలోక) పరిణామాలను గురించి ప్రజలను హెచ్చరించడానికి, వారు దేవుడు ఒక్కడేనని తెలుసుకోవడానికి, బుద్ధిజ్ఞానం కలవారు స్పృహలోకి రావడానికి ఈ సందేశం పంపబడింది." (ఖుర్ఆన్–14:52)

"ప్రవక్తా! మేము యావత్ మానవాళికోసం ఈ సత్యపూరిత గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. కనుక ఎవరు సన్మార్గం అవలంబిస్తారో అది వారికే ప్రయోజనకారి అవుతుంది. మరెవరు పెడదారి పట్టిపోతారో దానివల్ల వారే నష్టపోతారు. వారి బాధ్యత నీపై లేదు." (ఖుర్ఆన్–39:41)

"ఈ ఖుర్ఆన్ యావత్తు మానవాళి కోసం అవతరించిన హితోపదేశం. అనతి కాలంలోనే మీకు దీని వాస్తవికత ఏమిటో తెలుస్తుంది." (ఖుర్ఆన్–38:88)

# 22. భాష, రచన, శైలి

ఖుర్ఆన్ భాషా శైలి అద్భుతమయింది. దీన్ని ఫలానా శైలి అని నిర్దిష్టంగా పేర్కొనలేము. ఖుర్ఆన్‌లోని భాషా ఉరవడి, వాడి, వేడి అద్వితీయమైనవి. అందువల్ల కొందరు భాషాకోవిదులు ఇది ప్రాసయుక్తమైన గద్యమని, గద్యరూపంలో వున్న పద్యమని అభిప్రాయపడ్డారు. ఇందులో పద్యానికి ఉండవలసిన లాక్షణిక నియతి ఏదీ లేకపోయినా భావగర్భితమైన పదబంధాలు, కవితా సృష్టిలోని నుడికారపు వంపు సొంపులు, పదాలంకరణలు మాత్రం వున్నాయి.

అలాగే మరొకవైపు గద్యానికి వుండవలసిన భావగాంభీర్యం, భావసమగ్రత, విషయానుశీలనం, వాక్యాల పటుత్వం మనకు కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. అయినా ఖుర్ఆన్ శైలి గ్రంథరచనలా వుండదు. ఇది పూర్తిగా ప్రసంగ ధోరణిలో సాగుతుంది. ఓ నిరంతర ప్రసంగం! అనర్గళంగా సాగే వచనామృత ధార!

“ఇవి సత్యాన్ని స్పష్టంగా తెలియజేసే గ్రంథానికి చెందిన సూక్తులు. మేము దీన్ని పఠన గ్రంథంగా చేసి, విషయాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా అరబీ భాషలో అవతరింపజేశాము.” (ఖుర్ఆన్–12:2)

“మేమీ ఖుర్ఆన్‌ని ప్రజలు అర్థం చేసుకోవడానికి సులభతరం చేశాం; మరి (దీన్నుండి) హితబోధ గ్రహించే వారెవరైనా ఉన్నారా?” (ఖుర్ఆన్–54:17)

“దేవుడు అత్యంత శ్రేష్ఠమైన వాణి అవతరింపజేశాడు. ఇదొక గ్రంథం. దీని భాగాలన్నీ ఒకదానికొకటి అవినాభావసంబంధం కలిగిఉన్నాయి. ఇందులో విషయాలు అనేక సార్లు పునరావృతమయ్యాయి.” (ఖుర్ఆన్–39:23)

“(ప్రవక్తా!) ఆయనే నీ (హృదయఫలకం)పై ఈ గ్రంథాన్ని అవతరింపజేసిన వాడు. ఇందులో రెండురకాల సూక్తులున్నాయి. ఒకటి, (ఏమాత్రం సందిగ్ధానికి ఆస్కారంలేని) స్పష్టమైన సూక్తులు. ఇవి గ్రంథానికి మాతృకలు వంటివి. (అంటే గ్రంథ సారాంశాలు). రెండు, అస్పష్టమైనవి. వక్రబుద్ధికలవారు కలహాలు సృష్టించే ఉద్దేశ్యంతో ఎల్లప్పుడూ అస్పష్టమైన సూక్తుల వెంటే పడతారు. వాటికి లేనిపోని అర్థాలు ఆపాదించ డానికి ప్రయత్నిస్తారు. నిజానికి వాటి అసలుభావం దేవునికి తప్ప మరెవరికీ తెలియదు. దీనికి భిన్నంగా విషయపరిజ్ఞానంలో స్థితప్రజ్ఞులైనవారు “మేము వీటిని నమ్ముతున్నాము. ఇవన్నీ మా ప్రభువు నుండి వచ్చినవే” అని అంటారు. నిజానికి ఏ విషయం ద్వారా నయినా బుద్ధిమంతులే గుణపాఠం నేర్చుకుంటారు.” (ఖుర్ఆన్–3:7)

“ఈ సూక్తులు విజ్ఞతావివేచనాలతో నిండిన గ్రంథానికి సంబంధించినవి.” (ఖుర్ఆన్–10:1)

“నీ ప్రభువు వాక్కు సత్యం, న్యాయాల దృష్ట్యా స్వచ్ఛమైనది, సమగ్రమైనది. ఆయన వచనాలను ఎవరూ మార్చలేరు.” (ఖుర్ఆన్–6:115)



“ప్రజలు స్పృహలోకి వచ్చేందుకు ఖుర్ఆన్‌లో అనేక తార్కాణాలు పేర్కొన్నాము. వారు దుష్పర్యవసానం నుండి తప్పించుకోవడానికే మేము దీన్ని (వారికి తెలిసిన) అరబీ భాషలో అవతరింపజేశాం. ఇందులో ఎలాంటి వంకలు, వ్యత్యాసాలు ఏమాత్రం లేవు.” (ఖుర్ఆన్–39:27,28)

“మేమీ ఖుర్ఆన్‌ని ఏదైనా పర్వతం మీద దించితే, దాని పరిస్థితి ఏమవుతుందో నీవు చూస్తావు. అది దైవభీతితో కంపించి క్రుంగిపోతూ పగిలిపోతుంది. మానవులు (తమని గురించి) ఆలోచిస్తారని వారి ముందు మేమీ దృష్టాంతాలను పేర్కొంటున్నాం.” (ఖుర్ఆన్–59:21)

“భూమిని బ్రద్దలుచేసే, పర్వతాలను పెకలించి నడిపే, లేదా మృతుల్ని లేపి మాట్లాడ జేసే శక్తిగల ఏదైనా ఖుర్ఆన్‌ని ఒకవేళ అవతరింపజేసినా లాభం ఏమిటీ? సమస్త కార్యాలు దేవుని అధీనంలోనే ఉన్నాయి. దేవుడు తలచుకుంటే మానవులందర్నీ సన్మార్గంలో నడిపించ గలడు. విశ్వాసులు తృప్తిచెందడానికి ఇదొక్క మాట చాలదా?” (ఖుర్ఆన్–13:31)

# 23. సాక్ష్యం

“దేవుడు నీపై అవతరింపజేసినదానిని తన జ్ఞానసంపత్తితోనే అవతరింపజేశానని సాక్ష్యమిస్తున్నాడు. అందుకు దైవదూతలు కూడా సాక్షులుగా ఉన్నారు. అసలు ఒక్క దేవుని సాక్ష్యమే చాలు.” (ఖుర్ఆన్–4:166)

“ఒకవ్యక్తి తన ప్రభువు నుండి స్పష్టమయిన నిదర్శనం కలిగిఉన్నాడు. ఆ తరువాత (ఆ నిదర్శనాన్ని సమర్థిస్తూ) మరో నిదర్శనం కూడా అతని ప్రభువు నుండి వచ్చింది. దీనికి పూర్వం మార్గదర్శినిగా, (దైవ)కారుణ్యంగా అవతరించిన మూసా గ్రంథం (తౌరాత్) కూడా ఉంది.” (ఖుర్ఆన్–11:17)

“దేవునికి అబద్ధం ఆపాదించేవాడి కంటే పరమ దుర్మార్గుడెవరుంటారు? అలాంటి వారిని దేవుని ముందు ప్రవేశపెట్టడం జరుగుతుంది. అప్పుడు సాక్షులు తమ ప్రభువుకు అసత్యం ఆపాదించినవారు వీరేనని సాక్ష్యమిస్తారు. వినండి. దేవుని మార్గం నుండి ప్రజల్ని నిరోధించే దుర్మార్గులపై దైవశాపం విరుచుకుపడుతుంది. (ఖుర్ఆన్–11:18)

“వారికిలా చెప్పు: ‘ఇది దేవుని దగ్గర్నుండే వచ్చిన వాణి అయివుండి, దాన్ని మీరు తిరస్కరిస్తే (రేపు ప్రళయదినాన మీ గతేమవుతుంది)? దీన్ని గురించి ఆలోచించారా మీరు? ఇలాంటిదే (గతంలో) ఒక వాణి వచ్చినప్పుడు ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక సాక్షి దానికి అనుకూలంగా సాక్ష్యం ఇచ్చాడు. (అది బోధించే సత్యాన్ని) అతను విశ్వసించాడు. కాని మీరు మాత్రం గర్వపోతులయి పోయారు. అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సద్బుద్ధి ప్రసాదించడు.” (ఖుర్ఆన్–46:10)

# 24. గ్రంథ పరిరక్షణ

"ఖుర్‌ఆన్ విషయానికి వస్తే, దాన్ని మేమే అవతరింపజేశాము. దాన్ని పరిరక్షించే వాళ్ళము కూడా మేమే." (ఖుర్‌ఆన్-15:9)

"ప్రవక్తా! ఈ దివ్యావిష్కృతిని గుర్తుంచుకోవడానికి వడివడిగా నాలుక తిప్పకు. దాన్ని గుర్తుచేయించడం, నీ చేత చదివించడం కూడా మా పనే. కనుక మేము పఠిస్తున్నప్పుడు నీవు శ్రద్ధగా ఆలకించు చాలు. తర్వాత దాని భావం తెలియజేయడం కూడా మా బాధ్యతే." (ఖుర్‌ఆన్-75:16-19)

"ఇదొక శక్తిమంతమైన గ్రంథం. దుష్టశక్తులు దానిపై ముందునుంచీ దాడి చేయలేవు; వెనుక నుంచీ దాడి చేయలేవు. ఇది మహా వివేకవంతుడు, స్వతహాగా ప్రశంసనీయుడైన దేవుని నుండి అవతరించిన (అద్భుత)వాణి." (ఖుర్‌ఆన్-41:41,42)

ఖుర్‌ఆన్ సూక్తులు మొత్తం ఒకేసారి అవతరించలేదు. సందర్భానుసారం 23 సంవత్సరాల్లో అవతరించాయి. దైవప్రవక్త ముహమ్మద్ (స) తనపై ఖుర్‌ఆన్ సూక్తులు అవతరించినప్పుడల్లా ఒక లేఖకుడ్ని పిలిపించి అతనిచేత వాటిని అప్పటికప్పుడు రాయించేవారు. రాసిన తరువాత లేఖకుడు దాన్ని ఆయనకు వినిపించేవాడు. లేఖకుడు సరిగా రాశాడని నిర్ధారించుకున్న తరువాత ఆయన ఆ సూక్తుల్ని ఒకచోట భద్రపరిచేవారు.

అదీగాక ఇస్లాం ప్రారంభకాలం నుంచే నమాజ్‌లో ఖుర్‌ఆన్ సూక్తులు తప్పకుండా పఠించాలన్న ఆదేశం వుండటం వల్ల ప్రవక్త అనుచరులు ఖుర్‌ఆన్ సూక్తుల్ని వీలైనంత ఎక్కువగా కంఠస్థం చేసుకునేవారు. ఇక చదవడం, రాయడం వచ్చిన అనేక మంది సహాబీలు (ప్రవక్త అనుచరులు) ఖుర్‌ఆన్‌లోని వివిధ భాగాలను రాసుకొని దాచుకునేవారు. ఇలా ప్రవక్త కాలంలోనే ఖుర్‌ఆన్ భద్రపరచబడింది.

ప్రపంచంలో దైవవాణి పేరిట చెలామణి అవుతున్న మత గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. కాని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) మహనీయుని హృదయ ఫలకంపై అవతరించిన దివ్యఖుర్‌ఆన్ తప్ప వాటిలో ఏ ఒక్కటీ తన అసలు రూపంలో సురక్షితంగా లేదు. ఇవి నూటికి నూరు పాళ్ళు పూర్తిగా దైవప్రోక్తమైన గ్రంథాలేననడానికి వాటికి సరయిన చారిత్రక ఆధారాలు కూడా లేవు.

దీనికి భిన్నంగా దైవప్రవక్త (సల్లం) నిర్యాణం తర్వాత ఆయన మొదటి ప్రతినిధి (ఖలీఫా) అబూబకర్ సిద్దీఖ్ (రజి) వివిధ ప్రాంతాల్లోని హాఫిజ్‌లు (ఖుర్‌ఆన్ స్మర్తలు) అందర్నీ రాజధానికి రప్పించి, మొత్తం వ్రాతప్రతుల్ని సేకరించి, ప్రమాణబద్ధమైన ఒక సంపూర్ణ ఖుర్‌ఆన్ ప్రతిని గ్రంథం రూపంలో రాయించారు. ఆ తరువాత మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనా కాలంలో దాని ప్రతులు తీయించి అధికారికంగా ముస్లిం జగత్తులోని యావత్తు కీలక ప్రాంతాలకు పంపించారు. వాటిలో



రెండు వ్రాతప్రతులు ఈనాడు కూడా యధాతథ స్థితిలో వున్నాయి. కావాలంటే ఎవరైనా ఖుర్‌ఆన్ ముద్రిత ప్రతినొక దాన్ని తీసికెళ్ళి ఆ వ్రాత ప్రతులతో పోల్చి చూసుకోవచ్చు. అందులో వారికి ఒక్క సూక్తి, ఒక్క వాక్యం, ఒక్క పదం కాదుకదా చివరికి ఒక్క అక్షరం కూడా తేడా కనపడదు.

గత శతాబ్ది చివరిలో జర్మనీలోని మ్యూనిచ్ యూనివర్సిటీకి చెందిన ఒక సంస్థ ముస్లిం జగత్తులోని వివిధప్రాంతాల నుండి హిజ్రీ ఒకటోశతాబ్ది నుండి 14వ శతాబ్ది వరకు వివిధ కాలాల్లో రాయబడిన 42 వేల వ్రాత, ముద్రిత ప్రతుల్ని సేకరించింది. వాటిపై యాభై ఏళ్ళపాటు సుదీర్ఘ పరిశోధన జరిపి, చివరికి ఈ ప్రతుల్లో అచ్చు తప్పులు తప్ప ఎలాంటి తేడా లేదని తన నివేదికలో ప్రకటించింది. ఈసంస్థ రెండవ ప్రపంచయుద్ధ సమయంలో బాంబుదాడులకు గురయి నాశనమైనప్పటికీ దీని పరిశోధనా ఫలితాలు మాత్రం నేటికీ ప్రపంచం నుండి చెరిగిపోలేదు.

ప్రపంచ సంబంధమయిన ప్రతి గ్రంథమూ ఓ నిర్ణీత కాలం వరకు మాత్రమే చెలామణి అవుతుంది. ప్రగతి తరువాత దానికి పతనం కూడా తప్పనిసరిగా వస్తుంది. కాని ఒక్క దివ్యఖుర్‌ఆన్ మాత్రమే 14 వందల సంవత్సరాలు గడచిపోయినా పతనం చెందలేదు. ఇక ముందు కూడా అది పతనానికి గురికాదు. దాన్ని కాపాడే బాధ్యతను స్వయంగా సృష్టికర్తే తీసుకున్నాడు. "నిస్సందేహంగా ఈ గ్రంథాన్ని మేమే అవతరింపజేశాము. మేమే దీన్ని పరిరక్షిస్తాము." (22:9)

12వ శతాబ్దిలో ఇంగ్లాండు చక్రవర్తి రిచర్డ్ షేరూల్ శిలువ యుద్ధాలకు పూర్వం ఇంగ్లాండు, ఫ్రాన్సు, స్పెయిన్, జర్మనీ దేశాలకు చెందిన గొప్పగొప్ప పాదరీలను పిలిపించి ఒక సభ జరిపించాడు. వారందరితో సంప్రదించినమీదట అతనొక ఉత్తర్వుని జారీచేశాడు. దాని సారాంశం ఏమిటంటే- "ముహమ్మద్ (స) ధర్మాన్ని అంతమొందించడానికి ఇక ఒకేఒక మార్గం ఉంది. అతని మతగ్రంథాన్ని తుద ముట్టించాలి. దీనికోసం ముస్లిమ్ జగత్తులో ఉన్న ఖుర్‌ఆన్ ప్రతులన్నిటినీ కొని కాల్చివేయాలి. అప్పుడిక ముస్లిమ్‌లకు మతగ్రంథం అంటూ ఉండదు. వారి ధర్మం కూడా శాశ్వతంగా అంతరించిపోతుంది."

ఈ ఉత్తర్వు ప్రకారం క్రైస్తవ మతాధిపతులు టర్కీ, ఈజిప్ట్ మొదలయిన ముస్లిమ్ దేశాల నుండి వేలాది వ్రాతప్రతులు కొని కాల్చివేశారు. కాని ఈ అద్భుతవాణి వేలాది మంది ముస్లింల (హాఫిజ్‌ల) అంతరంగాలలో సురక్షితంగా ఉందన్న సంగతిని క్రైస్తవ మతపెద్దలు గ్రహించలేకపోయారు. కొంత కాలానికి ఈ హాఫిజ్‌ల ద్వారా ఖుర్‌ఆన్ వ్రాతప్రతులు మళ్ళీ తయారుచేయబడ్డాయి. ఈ విధంగా దేవుడు సత్యతిరస్కారుల కుట్రలను వమ్ముచేసి తన దివ్యగ్రంథాన్ని కాపాడుకున్నాడు.

ముప్ఫయి కాండాలలో విస్తరించివున్న ఖుర్‌ఆన్ అతి సులువుగా కంఠస్తమయిపోతుంది. ఖుర్‌ఆన్ దైవగ్రంథం అనడానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం మరేం కావాలి?

అదే నాలుగు సువార్తలతోకూడి వంద పేజీలుకూడా లేని బైబిల్ (కొత్త నిబంధన)ను కంఠస్థం చేసినవారు మనకు కాగడా బెట్టి వెతికినా కానరారు.

అదీగాక దైవవాణి అని చెప్పబడుతున్న ఏ మతగ్రంథం కూడా నేడు తన మూల భాషలో లేకుండా పోయింది. ఆ భాషను మాట్లాడేవారు కూడా ఈనాడు ప్రపంచంలో లేరు. తౌరాత్ హిబ్రూభాషలో ప్రోక్తమయింది. ఇంజీల్ సిరియక్ భాషలో ప్రోక్తమయింది. జొరాస్టర్ మతగ్రంథం 'అదెస్తా' విజీ భాషలో ఉండేది. వేదాలు వైదికభాష (ఆది సంస్కృతభాష)లో ఉండేవి. కాని ఈ భాషలు ఈనాడు ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నాయా? వాటిని అర్థం చేసుకునేవారు ఉన్నారా?

అదే ఖుర్ఆన్ విషయానికొస్తే ఈ గ్రంథం ప్రోక్తమయిన మూలభాష 'అరబీ' ఈనాటికీ ప్రపంచంలో సజీవంగా ఉంది. దాన్ని మాట్లాడే, అర్థం చేసుకునేవారు కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఖుర్ఆన్ తప్ప ఇతర దైవదత్త గ్రంథాలను విశ్వసించేవారు ఈనాటి తమ మతగ్రంథాలు నిజంగా తమ ప్రవక్తల కాలంలో ప్రోక్తమయిన దైవదత్త గ్రంథాలేనని నిస్సంకోచంగా, దృఢవిశ్వాసంతో చెప్పలేరు.

ఖుర్ఆన్ అవతరించిన అరబీభాష ఇరాఖ్ నుండి మొరాకో వరకు యాభై కోట్ల మంది ప్రజలకు ఈనాటికీ మాతృభాషగా ఉంది. అరబీభాష వ్యాకరణం, దాని పద కోశం, ఉచ్ఛారణ, నుడికారాలు 1400 సంవత్సరాల నుండి నేటికీ అలాగే వున్నాయి. ఆనాటి అరబ్బులు ఈగ్రంథాన్ని చదివి ఎలా అర్థం చేసుకునేవారో ఈనాడు కూడా అరబీభాష ఎరిగినవారు దీన్ని చదివి అలాగే అర్థం చేసుకో గలుగుతారు.

ఈ విధంగా దివ్యఖుర్ఆన్ దాని మూలభాషలో, దాని అసలు పదాలతో ఎలాంటి మార్పులకు, చేర్పులకు గురికాకుండా ఈనాటికీ నూరుశాతం సురక్షితంగా ఉంది. దేవుడు స్వయంగా దీని రక్షణ బాధ్యత తీసుకోవడం వల్ల దీనికి ఇన్ని విధాలుగా భద్రతా యేర్పాట్లు జరిగాయి. (15:9, 75:16-19 సూక్తులు చూడండి.) ఈ కారణంగానే ఖుర్ఆన్ ఎలాంటి ప్రక్షిప్తాలు, నిక్షిప్తాలకైనా గురయిందని విమర్శించ డానికి ఎవరూ సాహసించలేక పోతున్నారు.

## 25. ఖుర్ఆన్ ఇతివృత్తం

ఖుర్ఆన్ చారిత్రక గ్రంథం కాదు. అయినా ఇందులో గత జాతుల చారిత్రక గాథలు ఉన్నాయి. ఖుర్ఆన్ పౌరశాస్త్రం కాదు. అయినా ఇందులో పౌరజీవనానికి సంబంధించిన విషయాలున్నాయి. ఖుర్ఆన్ వైజ్ఞానిక గ్రంథం కాదు. అయినా ఇందులో ఖగోళిక, భౌగోళిక, శారీరక మొదలైన శాస్త్రవిషయాలు కూడా సూత్ర ప్రాయంగా సూచించబడ్డాయి. ఖుర్ఆన్ పూర్తిగా ఆధ్యాత్మిక తత్వశాస్త్రం కాదు, అయినా ఇందులో ఆత్మకు దేహానికి మధ్య సంబంధాన్ని, దాసునికి దైవానికి మధ్య బాంధవ్యాన్ని తెలిపే రహస్యాలు ఉన్నాయి. ఖుర్ఆన్ కేవలం నీతి శాస్త్రం కాదు.



అయినా ఇందులో ఇహపరలోకాల సాఫల్యానికి కావలసిన నీతి సూత్రాలున్నాయి. ఖుర్ఆన్ నేరస్మృతికి సంబంధించిన గ్రంథం కూడా కాదు. అయినా ఇందులో పోలీసులు, న్యాయస్థానాలు లేకపోయినప్పటికీ మనిషి పాపకార్యాలకు భయపడగలిగే అమోఘమైన నేరస్మృతి సూత్రాలు ఉన్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే సమస్త జీవన రంగాల్లోనూ మానవులకు మార్గదర్శకం చేసే అవసరమైన మౌలిక విషయాలు ఇందులో ఉన్నాయి. అందుకే ఖుర్ఆన్‌తో సరితూగ గల మరొక గ్రంథమే లేదు ప్రపంచంలో.

సమస్త జీవన రంగాలను సమన్వయ పరచి, సమతూకం నెలకొల్పి మనిషిని మానవత్వపు హద్దులో ఉంచగల బలమైన కేంద్రీయ శక్తి ఖుర్ఆన్‌లో మాత్రమే ఉంది. ఆ శక్తే 'తౌహీద్' అంటే దేవుని ఏకత్వం. ఖుర్ఆన్‌లోని యావత్తు ఆజ్ఞలు, అనుజ్ఞలు, హితవులు, బోధనలు ఈ కేంద్రీయ శక్తి చుట్టే నిరంతరం పరిభ్రమిస్తూ ఉంటాయి.

అందుకే ఖుర్ఆన్‌లోని ప్రగాఢంగా విశ్వసించి దాన్ని తన జీవిత సంవిధానంగా చేసుకున్న మోమిన్ (విశ్వాసి) వ్యాపారిగా ఉన్నా ఖుర్ఆన్ ఆదేశాల ప్రకారమే నీతి నిజాయితీలతో వ్యవహరిస్తాడు; న్యాయమూర్తిగా పనిచేసినా ఖుర్ఆన్ ఆజ్ఞల పరిధుల్లోనే తీర్పులిస్తాడు; మరేదైనా రంగంలో ఉద్యోగిగా ఉన్నా ఖుర్ఆన్ బోధనల ప్రకారమే నమ్మకంగా పనిచేస్తాడు; చివరికి రాజ్యపాలకుడయినా సరే ఖుర్ఆన్ సూచించిన సరిహద్దుల్లోనే మసలుకుంటూ నిజమైన ప్రజాశ్రేయోభిలాషిగా పరిపాలనా సాగిస్తాడు.

ఖుర్ఆన్ తన కేంద్రీయ శక్తిని బలహీనపరిచే చర్యలన్నిటిని తీవ్రంగా ఖండిస్తుంది. దీన్ని ఇస్లామీయ పరిభాషలో 'షిర్క్' అంటారు. అంటే మానవుని నిజప్రభువు, పోషకుడు, యజమాని, సృష్టికర్త, శాసనకర్త, సంరక్షకుడు, విధాత, విశ్వనిర్వాహకుడు అయిన అల్లాహ్ దైవత్వంలో, ఆయన శక్తి సామర్థ్యాలలో, ఆయన గుణగణాలలో దైవేతరులను భాగస్వాములుగా చేయడం అన్నమాట. ఇలా చేయడం ఘోరమైన నేరంగా ఖుర్ఆన్ పరిగణిస్తుంది.

ఖుర్ఆన్ మానవులకు అతీంద్రియ విషయాలను తెలియజేస్తుంది. మరణా నంతరం జీవిత విశేషాలు- స్వర్గం, నరకం, పునరుత్థాన దిన విషయాలు మొదలైనవి తెలుపుతుంది. దేవుణ్ని, దైవప్రవక్తను విశ్వసించిన సదాచార సంపన్నులైన విశ్వాసులకు స్వర్గశుభవార్తలను అందజేస్తుంది. తిరస్కారులకు నరక శిక్షలను గురించి హెచ్చరిస్తుంది.

ప్రపంచ పరీక్షాస్థలమని, కేవలం కొంతకాలం మాత్రమే గడపడానికి ఉన్న ఒక ప్రయాణ మజిలీ మాత్రమేనని; ఇక్కడ చేసుకున్న కర్మలకు ప్రతి మానవుడు పరలోకపు తీర్పుదినాన విశ్వ ప్రభువు సన్నిధిలో లెక్క చెప్పుకోవలసి ఉంటుందని, ఆ రోజున ప్రతి ఒక్కరికి పూర్తి న్యాయం జరుగుతుందని తెలియజేస్తోంది. ఈ జవాబుదారీ భావనే మనిషిని చెడులకు దూరంగా ఉంచగలుగుతుంది.

ఖుర్‌ఆన్ గతజాతుల ఉత్థాన పతనాలను గురించి, దైవప్రవక్తల, భక్తిపరాయణుల జీవన విశేషాలను గురించి తెలియజేస్తూ, వాటి నుంచి గుణపాఠం నేర్చుకోవలసిందిగా మానవులను కోరుతుంది. సత్యతిరస్కారులు, దుర్మార్గులు ప్రపంచంలో సయితం పరాభవం, పతనాలకు గురవుతారని అలాగే విశ్వాసులు, సదాచారులు ఇహలోకంలో కూడా ఔన్నత్య శిఖరాలను అందుకోగలరని చెబుతుంది. స్వర్ణ యుగంగా భాసిల్లిన "తొలి నలుగురి ఖలీఫాల పాలనా కాలం"లో ముస్లింల వైభవొన్నతుల ముందు యావత్ ప్రపంచం తలవంచిన సంగతి తెలిసిందే.

ఈ గ్రంథం మనిషిని దైనందిన జీవిత వ్యవహారాల నుండి సదా ఏకాంత కుహరాల్లోకి తీసికెళ్ళి తాత్విక చింతనను నూరిపోసే తత్వశాస్త్రం కాదు. ఇది దేవునికి, దాసునికి మధ్య వుండ వలసిన వాస్తవిక సంబంధాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని, దానికి బలం చేకూర్చేందుకు కావలసిన ఇతర అంశాలను ఉపవిషయాలుగా పేర్కొంటుంది. అందువల్ల ఇందులో జీవిత సమస్యలకు సంబంధించిన సమస్త విషయాలు మనకు కనిపిస్తాయి.

ఇది సామాజిక శాస్త్రం కాకపోయినా, ఇందులో సత్సమాజస్థాపనకు అవసరమైన సాంఘిక న్యాయం, సభ్యతాసంస్కృతులు, కౌటుంబిక, వైవాహిక విషయాలు కూడా వున్నాయి. ఇది నీతులు వల్లించే నీతిశాస్త్రం కాకపోయినా ఇందులో మానవుల్ని నీతిమంతులుగా, దైవభీతిపరులుగా తీర్చిదిద్దడానికి కావలసిన అత్యున్నత నైతిక నియమావళి పొందుపరచబడింది.

ఇది ఆర్థిక సమస్యల్ని పరిష్కరించే అర్థశాస్త్రం కాకపోయినా ఇందులో ధనార్జన, ధన వినియోగాలను గురించి చర్చించి ఆర్థిక న్యాయానికి రాచబాట నిర్మిస్తుంది. ఈ గ్రంథం రాజకీయ వ్యవహారాలను తెలిపే రాజకీయశాస్త్రం కాకపోయినా రాజనీతి, పరిపాలన, యుద్ధం, సంధి, జాతీయ, అంతర్జాతీయ సంబంధాలు మొదలైన రాజకీయ వ్యవహారాలను కూడా స్పృశిస్తుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఇది జీవితానికి సంబంధించిన సకలరంగాల్లో దేవుని హితవుల్ని మానవుల ముందు పెట్టి, వాటి విషయంలో మరణానంతరం దేవుని ముందు బాధ్యత వహించవలసి వుంటుందని అడుగడుగునా అతడ్ని హెచ్చరించే, ఉపదేశించే ఓ విశిష్ఠ గ్రంథరాజం.

కనుక ఈ ఆశయం నెరవేరాలంటే, విద్యార్థి తన పాఠ్య గ్రంథాన్ని పఠిస్తున్నట్లు ఈ గ్రంథాన్ని నిత్యం పఠిస్తూ ఉండాలి. ఈ కారణంగానే దీనికి "ఖుర్‌ఆన్" అని పేరొచ్చింది. అంటే పాఠ్యగ్రంథం, పఠనపుస్తకం, పారాయణ గ్రంథం అన్నమాట. ఈ భావంలో దీన్ని పఠణవేదమని కూడా చెప్పవచ్చు. హిందూమత గ్రంథాల్లోని కొన్ని భవిష్యత్ ప్రకటనల్ని పరిశీలిస్తే, వాటిలో ప్రస్తావించబడిన పఠణవేదం ఖుర్‌ఆనే అయి ఉండవచ్చన్న అనుమానం కూడా కలుగుతుంది.



ఏమైనప్పటికీ ఖుర్‌ఆన్ యావత్తు మానవాళి కోసం అవతరించిన అంతిమ దైవగ్రంథం. ఇది ప్రపంచ మానవులందరి ఉమ్మడిసొత్తు. దీనిపై ఏ ఒక్క జాతికీ, వర్గానికీ గుత్తాధిపత్యం లేదు. గాలి, నీరు, సూర్యరశ్మి మొదలైన ప్రకృతి వనరుల్ని మానవుడు ఎలా వినియోగించుకొని ప్రయోజనం పొందుతున్నాడో ఖుర్‌ఆన్ వల్ల కూడా అలాగే ప్రయోజనం పొందవచ్చు. ఇది ఇహలోకంలో మానవుల మార్గదర్శనం కోసం, పరలోకంలో వారి ముక్తి మోక్షాల కోసం సర్వేశ్వరుడు పంపిన ఏకైక హితవాణి. ఇందులో సత్యాన్వేషకులకు ఆసక్తికరమైన అనేక విషయాలు ఉన్నాయి. అందువల్ల సత్యాన్ని ప్రేమించి, మోక్షాన్ని కోరుకునే ప్రతిఒక్కరూ కనీసం ఒక్కసారైనా ప్రశాంతంగా ఆలోచించి దీన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతయినా వుంది.

పేదలను మరింత పేదలుగా, ధనికులను మరింత ధనికులుగా చేసి మితిమీరిన ఆర్థిక సమతూలనా రాహిత్యాన్ని కలిగించే పెట్టుబడిదారీ విధానం; ఆర్థిక సమానత్వం పేరిట పాలకులకు, పాలక పక్షం సభ్యులకు మాత్రమే విలాస జీవితాలు కల్పించి కార్మికులకు, కష్టజీవులకు చాలీచాలని వేతనాలతో బలవంతపు చాకిరీ చేయించే కమ్యూనిజం మానవుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయి. కారణం ఈ రెండు ఇజాలు పరస్పరం విరుద్ధమైన పచ్చి అతివాదాలు కావడమే. వీటకి భిన్నంగా ఇస్లాం ఆర్థిక, రాజకీయ రంగాలతోపాటు సమస్త జీవన రంగాల్లో సమతులనాన్ని, మధ్యేమార్గాన్ని పాటిస్తూ నేటి ఎలక్ట్రానిక్ యుగంలోనూ జీవిత ప్రతిసమస్యకూ సవ్యమైన పరిష్కర మార్గాన్ని చూపగలుగుతుంది.

ఖుర్‌ఆన్ మనందరి సొత్తు; సమస్త మానవుల ఉమ్మడి ఆస్తి; గాలి, నీరు, ఎండ లాగా ప్రతి ఒక్కరికీ ఉచితంగా లభించే ప్రకృతి ఒనరు; ఇహపరలోకాల సాఫల్యానికి ఏకైక సోపానం. కనుక- రండి! ఇందులోని అమృతమయ బోధనలను అధ్యయనం చేద్దాం, అర్థం చేసుకుందాం, ఆచరిద్దాం, అందరికీ పరిచయం చేద్దాం.

## 26. ఇస్లాంవ్యతిరేక శక్తుల కుట్రలు

ఖుర్‌ఆన్ వివిధ జీవనరంగాలలో ఆవరించిన అజ్ఞానాంధకారాన్ని తొలగించి యావత్ మానవాళికి వెలుగుబాట చూపదలచింది. 1400 ఏండ్ల క్రితం అజ్ఞానాంధ కారంలో తచ్చాడుతూ, అనేక దురాచారాలకు గురయి, అసంఖ్యాకమైన చెడుగుల్లో కూరుకుపోయిన అరబ్బులు ఖుర్‌ఆన్ సందేశం స్వీకరించగానే వారి జీవనసరళి పూర్తిగా మారిపోయింది. వారు ఆధ్యాత్మిక, నైతిక రంగాల్లోనే గాకుండా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాల్లో సైతం అత్యున్నత ప్రమాణాలు నెలగొల్పారు. ఆనాడు వారి జీవనసరళిని చూడగానే ప్రతివ్యక్తీ, ఖుర్‌ఆన్‌లో అంతటి విప్లవాత్మక శక్తి ఉందని, అలాంటి ఉన్నత సమగ్ర జీవనవిధానం ఉందని భావించేవాడు.

అయితే మానవాళికి ఖుర్‌ఆన్ తెచ్చిన ఈశుభాలను మానవతా వ్యతిరేకశక్తులు

ఎలా సహిస్తాయి? మహాప్రవక్త (సల్లం) ఇహలోకం వీడిన కొన్ని దశాబ్దాలకే ఈ దుష్ట శక్తులు ముస్లింలను ఖుర్‌ఆన్ నిజధ్యేయానికి, దాని ముఖ్యబోధనలకు దూరంచేయ డానికి ప్రయత్నాలు ఆరంభించాయి. ఇస్లాంలో ప్రధాన భాగమైన రాజకీయ రంగాన్ని వేరుచేయడానికి, ఖుర్‌ఆన్ పూజా పురస్కారాలు, కర్మకాండలకు పనికొచ్చే మతగ్రంథం తప్ప మరేమీకాదని నమ్మించడానికి అనేక కుట్రలు పన్నాయి. వాటి కుట్రల ప్రభావం క్రమేణా ముస్లింలపై కూడా పడింది. దాంతో వారు ఖుర్‌ఆన్ లక్ష్యానికి, దాని నిజ భావాలకు దూరమైపోయారు. ఖుర్‌ఆన్‌ని తమకు తెలిసిన భాషలో అధ్యయనం చేసి, అది మానవాళికిచ్చే సందేశాన్ని అర్థం చేసుకోవడానికి నేటికీ ప్రయత్నించడం లేదు. ముస్లింల ఈ అజ్ఞానవైఖరినే ఎత్తిచూపిస్తూ దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

“వారు ఖుర్‌ఆన్‌ని అధికంగానే పఠిస్తారు. కాని అది వారి కంఠాల నుండి క్రిందికి దిగదు. నాలుక మీదనే ఉండిపోతుంది. దాని జ్ఞానం, భావం వారి హృదయాల్లో లేశమైనా ఉండదు.”

ఒకప్పుడు మన దేశంలో ముస్లింలు ఖుర్‌ఆన్‌ని ఇతర భాషల్లో అనువదించ డమే పాపంగా భావించేవారు. చివరికి ఎలాగో ఢిల్లీలో షాహ్ వలియుల్లా (రహ్మలై) ధైర్యం చేసి ఖుర్‌ఆన్‌ని ఫార్సీ భాషలో అనువదించారు. ఈ సంగతి తెలియగానే యాభై మంది వ్యక్తులు కర్రలు, కత్తులతో వచ్చి ఢిల్లీ జామియా మసీదు మెట్లమీద కూర్చున్నారు. అక్కడ కూర్చొని వచ్చే పోయేవారు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ “షాహ్ వలియుల్లా ఖుర్‌ఆన్‌ని అనువాదం చేసి దైవమర్మాలు బయటపెట్టారు. అంచేత మా మౌల్వీలు ఆయన అంతుచూడమని చెప్పారు” అని పలికేవారు.

ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్టపథకాలకు కొందరు మతవేత్తల స్వార్థం, సంకుచిత భావాలు కూడా తోడయ్యాయి. ఇతర మతాలకు చెందిన పండితులు తమ మత గ్రంథాలను సామాన్య జనానికి ఎలా దూరంగా ఉంచగోరుతున్నారో, ముస్లిం నాయకుల్లో కూడా ఒక వర్గం సామాన్య ప్రజల్ని ఖుర్‌ఆన్‌కు దూరంగా ఉంచగోరు తోంది. ఖుర్‌ఆన్‌ని సామాన్యులు అర్థం చేసుకోలేరని, అంచేత దాని జోలికిపోకుండా తాము చెప్పిందే ‘ఖుర్‌ఆన్‌వాక్యం’గా భావించి నడుచుకోవాలని వీరు ప్రజలను శాసిస్తున్నారు. ఎవరైనా ఖుర్‌ఆన్ పట్ల ఆసక్తి కలిగి దాన్ని తమకు తెలిసిన భాషలో వ్యాఖ్యాన సమేతంగా అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తే ఆ ప్రయత్నాన్ని వీరు నిరోధించడానికి కూడా వెనకాడరు.

తత్ఫలితంగా అనేకమంది ముస్లింలు ఖుర్‌ఆన్ అధ్యయనం చేయడం మానేసి ఈ ‘పెద్ద మనుషులు’ చెప్పిన ప్రకారం తమ ధార్మికతను నమాజ్, రోజా, హజ్, ధ్యానం లాంటి కొన్ని ఆరాధనలకు పరిమితం చేసుకున్నారు. పండితులు, ధర్మవేత్తలు తప్ప ఇతరులు ఖుర్‌ఆన్‌ని నిజంగా అర్థం చేసుకోలేరన్న అపోహ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.



ఈ అపోహ వల్ల ఖుర్‌ఆన్‌తో ముస్లింల సంబంధం నామమాత్రంగా ఉండి పోయింది. తీరిక దొరికినప్పుడు అర్థం చేసుకోకుండా దాని అరబ్బీమూలాన్ని చిలక పలుకుల్లా పారాయణం చేయడం, అత్తరు పన్నీరు పూసి కళ్ళకు అద్దుకోవడం, ప్రమాణం చేయవలసి వచ్చినప్పుడు దాన్ని తీసుకొని తల మీద పెట్టుకోవడం, కంఠస్తం చేసి మసీదుల్లో ఇమామత్ లేక ఉపాధ్యాయ వృత్తి చేపట్టడం వరకే వారి సంబంధం పరిమితమయి పోయింది.

1869లో బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశంలోని ముస్లింల పరిస్థితి ఎలా ఉందో, ప్రత్యేకంగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వారి మనస్తత్వం ఏమిటో తెలుసుకొని రమ్మని ఒక కమీషన్‌ని పంపింది. ఈ కమీషన్ మన దేశంలో ఓ ఏడాది పాటుండి ముస్లింల మనోభావాలు, వారి మతవిశ్వాసాలు, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులన్నీ పరిశీలించి తిరిగొచ్చింది. రాగానే 1870లో లండన్‌లో ఓ చారిత్రక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో కమీషన్ సభ్యులతో పాటు భారతదేశంలో పనిచేసిన క్రైస్తవ మిషనరీ ఫాదరీలు కూడా కొందరున్నారు. ఆ సందర్భంలో కమీషన్ అధ్యక్షుడు సర్ విలియం హైండ్ సమర్పించిన నివేదిక చూడండి:

“ముస్లింల మతవిశ్వాసం ప్రకారం వారు ఏ పరదేశ ప్రభుత్వ పంచనా ఉండ లేరు. పరదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటం వారికి చాల అవసరం. ఈ ఆలోచనే వారి హృదయాల్లో ఓ నూతన ఉత్సాహాన్ని, ఉద్రేకాన్ని జనింపజేస్తుంది. వారా పోరాటానికి అనుక్షణం సిద్ధంగా ఉంటారు. ఈస్థితి వారిని పరదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ సమయంలోనైనా ఉద్రేక పరచగల్గుతుంది.”

క్రైస్తవ మిషనరీ ఫాదరీల నివేదికను కూడా చూడండి:

“ఇక్కడి ప్రజల్లో ఒక వర్గం వైరాగ్యభావాలు, పీరీ-మురీది (మతగురు పీఠం) తత్వంగల ముస్లింలు కూడా ఉన్నారు. కనుక ఇప్పుడు మనం తాను దైవప్రవక్తనని ప్రకటించుకోగల ఓ ద్రోహిని అన్వేషించగలిగితే అమితమైన ఉత్సాహంతో వేలాది మంది ప్రజలు అతని నకిలీ దైవదౌత్య పరిధిలోకి వస్తారు. ముస్లింలలో అలాంటి వ్యక్తిని తయారుచేయడం చాలా కష్టం. కష్టతరమైన ఈ పనిని సాధించగలిగితే ఆ వ్యక్తిని ప్రభుత్వం తరపున ఆశ్రయం, అండదండలు ఇచ్చి మన పనిని సులువుగా నెరవేర్చుకోవచ్చు....”

(వైట్‌హౌస్ కాన్ఫరెన్స్ రిపోర్ట్- “ది ఎరైవల్ ఆఫ్ బ్రిటిష్‌ఎంపైర్ ఆఫ్ ఇండియా”)

ఆ రోజుల్లోనే బ్రిటిష్ పార్లమెంటులో హౌస్ ఆఫ్ కామన్స్ అధ్యక్షుడు గామెండ్ ఐసన్ చేతిలో ఖుర్‌ఆన్ ప్రతి పట్టుకొని “ముస్లింల మధ్య ఈ పుస్తకం ఉన్నంతవరకూ మనం ప్రశాంతంగా పరిపాలన చేయలేం” అని చెబుతూ ఆ దైవగ్రంథాన్ని విసిరి నేలకేసి కొట్టాడు.

ఇలా ఆంగ్లేయుల దుష్టనీతి కారణంగా ముస్లింలు ఖుర్‌ఆన్ ఇచ్చే నిజమైన శిక్షణకు దూరమయి పోయారు. సమాజ సంస్కరణకు ఉపకరించని కొన్ని వ్యక్తిగత మతాచారాలు పట్టుకొని, అదే అసలైన ఖుర్‌ఆన్ శిక్షణ అని భావిస్తున్నారు. ఇలాంటి ముస్లింలనే దృష్టిలో పెట్టుకొని ఓసారి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ "ముస్లింలు తమ ఖుర్‌ఆన్‌ని గురించి మహాగొప్పలు చెప్పుకుంటారు. కాని వారి దగ్గర ఓ ప్రత్యేక వేషధారణ, జపమాల, ఉజూచెంబు తప్ప మరేదైనా ఉందా?" అని ఎత్తిపొడిస్తే ఈ మతపండితులు చేతకాని రోషంతో కుతకుత లాడిపోయారు.

20వ శతాబ్దం మూడో దశకం నుండి పరిస్థితి క్రమంగా మారసాగింది. ప్రఖ్యాత తత్వవేత్త మౌలానా అబుల్ ఆలా మౌదూదీ (రహ్మలై) తెచ్చిన విప్లవం భారత ఉప ఖండంలోని మేధావుల భావజగత్తునే మార్చివేసింది. ఆ మహనీయుడు రాసిన అద్భుత ఖుర్‌ఆన్‌వ్యాఖ్యానం, ఆయన సృజించిన విప్లవాత్మక సాహిత్యం కారణంగా ఇస్లాం సార్వకాలిక సమగ్ర జీవనవ్యవస్థ అన్న వాస్తవం ప్రజలకు తెలిసిపోయింది. ఖుర్‌ఆన్ వాస్తవికత ప్రాంతీయభాషల్లో కూడా వెలువడ నారంభించింది.

# 27. కరదీపిక

దీపం చీకటిని దూరం చేస్తుంది. జ్ఞానజ్యోతి అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తుంది. కాని చేతిలో టార్చిలైట్ పెట్టుకున్న ఆ 'ముస్లిం బాటసారి' పరిస్థితే చాలా దయనీయంగా ఉంది. పాపం, దేదీప్యమానమైన కరదీపిక కలిగివున్నా దాన్ని ఉపయోగించుకోలేక కారుచీకటిలో తచ్చాడుతున్నాడు.

అదొక అరణ్య ప్రదేశం. నడిరేయి కటిక చీకటిలో ఆ ముస్లిం బాటసారి ప్రయాణం చేస్తున్నాడు. మినుకు మినుకుమంటున్న నక్షత్రాలను కూడా కారుమబ్బులు కప్పి వేయడంతో అతను అడ్డదిడ్డంగా నడుస్తున్నాడు. అతను నడుస్తున్న దారిలో ఓ పెద్ద అగాధం ఉంది. మరో అయిదు నిమిషాలు అటువైపే నడిస్తే అతను అమాంతం అగాధంలో పడిపోయి ప్రాణాలు కోల్పోవడం ఖాయం. అంతలో ఎటునుంచో ఒక వ్యక్తి టార్చిలైట్ తీసుకొని కేకలు పెడుతూ అతని దగ్గరకు దూసుకువచ్చాడు. అతని వేషం, వాలకం చూస్తే ఫారెస్టు రేంజర్‌లా ఉన్నాడు.

ఫారెస్టు రేంజర్‌కు ఆ ప్రదేశంలో ఎక్కడ అగాధాలున్నాయో, మరెక్కడ క్రూర జంతువుల గుహలున్నాయో క్షుణ్ణంగా తెలుసు. అందుకే అతను బాటసారికి జరగనున్న ప్రమాదాన్ని పసికట్టి వచ్చాడు. అలా ఇంకాస్త దూరం నడిచివుంటే అగాధంలో పడిపోయి సజీవసమాధి అయ్యేవాడివని బాటసారితో చెబుతూ, అతనికి సరైన దారి చూపాడు. ఎంతో సానుభూతితో రేంజర్ తన టార్చిలైట్‌ని కూడా బాటసారికిచ్చి వెళ్ళిపోయాడు.

బాటసారి రేంజర్‌కు కృతజ్ఞతలు చెప్పి ప్రయాణం సాగించాడు. అతను బ్యాటరీ లైట్ వెలుగులో ఆ దారిన రెండు మైళ్ళు నడిచాడు. ఆ తరువాత ఆకాశంలో మబ్బులు



వీడి మిలమిల మెరుస్తున్న నక్షత్రాలు కన్పించగానే, ఇక బ్యాటరీలను అనవసరంగా తగలెట్టడం ఎందుకని భావించి అతను టార్చిలైట్‌ని సంచిలో పెట్టుకున్నాడు.

ఈసారి అతను నక్షత్రాల కాంతిలో నడుస్తూ, లాటరీలో వచ్చిన లక్షలాది రూపాయలను గురించి ఆలోచించసాగాడు. ఈ డబ్బుతో ఓ అందమైన బంగళా కట్టించుకోవాలి. అందులో ఖరీదైన ఫర్నీచర్, టివి, ఫ్రిజ్ మొదలైన విలాస వస్తువులన్నీ తెచ్చిపెట్టుకోవాలి. మిగతా డబ్బుతో వడ్డీ వ్యాపారం చేసి కూడబెట్టాలి. దానిమీద వచ్చే లాభంతో నైట్ క్లబ్బో, వైన్‌షాపో తెరవాలి. దాని లాభాలతో ఓ మంచి సినిమాహాలు కట్టించవచ్చు. ఆ తర్వాత ఫిలింప్రొడ్యూసర్, ఆపై మినిస్టర్.... ఇలా ఆలోచిస్తూ నడుస్తున్నాడు బాటసారి.

ఈలోగా నక్షత్రాలు మళ్ళీ కనుమరుగయి గాఢాంధకారం అలుముకుంది. ఎత్తయిన టేకు వృక్షాలు, ఇతర గుబురు చెట్లు తలలు విరబోసుకున్న రాకాసుల్లా నిలిచి నేలపై మరిన్ని చీకటి పొరలను పరిచాయి. దాంతో బాటసారి దారి తప్పాడు. అతను ఆలోచనల్లో మునిగిపోయి చీకటిలో తచ్చాడుతూ నడుస్తున్నాడేగాని, సంచిలోని బ్యాటరీలైట్‌ని తీసి వాడుకోవాలన్న తలంపే అతనికి కలగలేదు. అసలు తన దగ్గర వెలుగునిస్తూ దారిచూపే ఓ టార్చిలైట్ ఉందన్న సంగతే మరచిపోయాడు. పైగా సంచిలో ఓ మూల బరువుగా ఉన్న బ్యాటరీలైట్‌ని పట్టుకొని, దయ్యాలను పారదోలేందుకు ఇవ్వబడిన మంత్రదండమని భావించాడు. ఆ భావనతోనే అతను అంతటి తీవ్రమైన ఆలోచనల్లోనూ అప్పుడప్పుడు దాన్ని కళ్ళకు అద్దుకుంటూ, దాన్ని తనకిచ్చి ఎంతో మేలు చేసిన ఫారెస్టు రేంజర్‌ని పొగుడుతూ నడుస్తున్నాడు.

నేల మీద ముళ్ళు గుచ్చుకుంటున్నా, ఎదురాయి దెబ్బలు తగులుతున్నా, చెట్ల రెమ్మలు ఒరుసుకుంటున్నా ఖాతరుచేయకుండా హుషారుగా ఈలవేస్తూ నడుస్తున్నాడు బాటసారి. అతను నడిచే దారిలో దయ్యాలయితే ఎదురు కాలేదుగాని, అంతకంటే ఘోరమైన ప్రమాదమే పొంచిచూస్తోంది. అది క్రూరమృగాలు ఉంటున్న ఓ భయంకరమైన లోయ. మృత్యు కోరలు చాచి అతనివైపే చూస్తోంది. బాటసారి మరో ఫర్లాంగు ముందుకు నడిస్తే చాలు, అతని దేహంలో ఒక్క మాంసపు ముక్క కూడా మిగలదు. అంతటి ప్రమాదకర స్థితిలో కూడా ఆ బాటసారికి టార్చిలైట్ సంగతి గుర్తుకు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది కదూ?

అచ్చం ఇలాగే ఉంది ఈనాటి ముస్లింల పరిస్థితి. వీరు తమకు రుజుమార్గం చూపిన దైవప్రవక్త (సల్లం)నయితే ఘనంగా కీర్తిస్తారు. ఆ మహోపకారి చేసిన మేలుకు కృతజ్ఞతగా ఆయన కోసం మాటిమాటికి దరూద్ కూడా పఠిస్తారు. ప్రతి ఏడూ ఆయన జన్మదినోత్సవాన్ని కూడా వైభవంగా జరుపుతారు. కాని ఆయన అందజేసిన జ్ఞానజ్యోతిని బీరువాలో భద్రపరచి అజ్ఞానపు కారుచీకట్లలో తచ్చాడుతున్నారు. వారి వ్యక్తిగత, సామూహిక జీవితాల్లో జ్ఞానజ్యోతి కానరాదు. వారి దైనందిన వ్యవహారాల్లో, వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఆ జ్యోతి కాంతులు ప్రసరించవు.

దీనికి భిన్నంగా వారి జీవితాలపై మూఢాచారాలు, అంధవిశ్వాసాల కారుచీకట్లు ముసురుకున్నాయి. భౌతికారాధన కారుమేఘాలు కమ్ముకున్నాయి. మిథ్యావాదాలు వారిని చుట్టుముట్టాయి. వారు ప్రాపంచిక మైకంలో పడిపోయి తమ దగ్గరున్న జ్ఞాన జ్యోతిని మంత్రదండమని భావిస్తూ, దాన్ని అల్ప ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. అంతేకాదు, దాన్ని కాలం గడచిన కారణంగా బ్యాటరీలు మాడిపోయిన టార్చిలైట్‌లా పరిగణించి అటకపై ఎత్తిపెట్టారు.

వారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని మానవ మహోపకారిగా నయితే అంగీకరిస్తారు. కాని ఆచరణలో ఆయన్ని సమగ్ర మార్గదర్శిగా తలచడం లేదు. ఆయన బోధనలను ఆధునిక కాలపు అవసరాలను తీర్చే విషయాలుగా భావించడం లేదు.

ఈ కారణంగా వారు పూజాపురస్కారాల్లో, కర్మకాండల్లో, వివాహాది శుభకార్యాల్లో మాత్రమే దైవప్రవక్త (స)ను మతనాయకులుగా అంగీకరించి రాజకీయ-ఆర్థిక వ్యవహారాల్లో, పరిపాలన-పార్లమెంటు విషయాల్లో ఇతరుల్ని తమ నాయకులుగా చేసుకున్నారు. వారు ప్రజాసంబంధాలను, విద్యా ఉపాధి వ్యవహారాలను దైవధర్మంతో సంబంధంలేని ప్రాపంచిక విషయాలుగా పరిగణించారు. మహాప్రవక్త (స) ఆచరించి చూపిన సంపూర్ణ జీవన వ్యవస్థను రెండు భాగాలుగా విభజించి ఇది ప్రపంచ వ్యవహారం, అది పరలోక వ్యవహారమని చెబుతూ ప్రపంచ వ్యవహారాల్లో కన్పించే ప్రతి సజీవ విగ్రహాన్ని ఆరాధించసాగారు.

అయినప్పటికీ వారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) చూపిన మార్గంలోనే పూర్తిగా నడుస్తున్నామని, ఆయన హామీ ఇచ్చి చూపిన శుభ గమ్యానికి నేరుగా చేరుకుంటామని భ్రమిస్తున్నారు టార్చిలైట్ మరచి దారితప్పిన బాటసారిలా.

మరి వీరి పరిస్థితి ఆశ్చర్యంగా లేదూ? నిజానికి వీరి పరిస్థితి పట్ల ఆశ్చర్యపడక పోవడమే అత్యంతాశ్చర్యకరం.

## 28. ఐకమత్యానికి ఏకైక సూత్రం

ముస్లింల ఐకమత్యానికి ఏకైక మూల సూత్రం దివ్యఖుర్ఆన్ మాత్రమే. వారందర్నీ ఒక గొడుగు కిందకు చేర్చగలిగే, ఒకే త్రాటిపై నిలపగలిగే సాధనం ఈ దైవవాణే.

“మీరంతా కలసి దైవత్రాటిని దృఢంగా పట్టుకోండి. విభేదాలలో పడి చీలిపోకండి. దేవుడు చేసిన మేళ్ళను ఓసారి జ్ఞాపకం చేసుకోండి. మీరు పరస్పరం శత్రువులుగా ఉన్నప్పుడు దేవుడు మీ హృదయాలను కలిపాడు.” (దివ్యఖుర్ఆన్-3:103)

ఒకప్పుడు విభిన్న వర్గాలుగా, తెగలుగా, చీలిపోయి అనైక్యత, అంతఃకలహాలతో సతమతమవుతుండిన అరబ్బుల్ని ఇస్లాం సమైక్యపరచింది. జాతి, ప్రాంతం, వర్ణం, వర్గంలాంటి కృత్రిమ విచక్షణా గోడలను కూలగొట్టి దేవుని ఏకత్వం, దైవప్రవక్త విధేయతల ప్రాతిపదికలపై వారందర్నీ ఒక గొడుగు క్రిందికి చేర్చింది. అందువల్ల



ముస్లింలు ఇస్లాం సేవలో, దాని సంస్థాపనా కృషిలో నిరంతరం నిమగ్నులైఉండాలి. అదే వారి జీవనధ్యేయం. ఈ ధ్యేయాన్ని గనక మరచి ధర్మంలో అంతగా ప్రాముఖ్యం లేని అత్యల్ప విషయాల్ని గురించి వాదించుకోవడంలో కాలం గడిపితే వారిలో సమైక్యత సన్నగిల్లి తిరిగి విభేదాలు పొడసూపుతాయి.

“మీరు పరస్పరం కలహించుకోకండి. అలా చేస్తే మీలో అధైర్యం, బలహీనతలు చోటు చేసుకుంటాయి; మీ ప్రాబల్యం (క్షీణించి) పోతుంది.” (ఖుర్ఆన్-8:46)

“సత్యతిరస్కారులు ఒకరికొకరు సమర్థించుకొని సహకరించుకుంటున్నారు. మీరు (విశ్వాసులై ఉండి కూడా) అలా పరస్పరం సహకరించుకోకపోతే లోకంలో అరాచకం ఏర్పడి పెద్ద అల్లకల్లోలం చెలరేగుతుంది.” (ఖుర్ఆన్-8:73)

ఒక పార్టీకి లేదా సంస్థకు బయటి దాడుల కన్నా అంతర్గత కలహాలే అత్యంత ప్రమాదకరమైనవి. బయటి నుంచి ఎన్ని సవాళ్ళు ఎదురైనా, అంతర్గతంగా పటిష్ఠంగా ఉన్నప్పుడే ఆ పార్టీ లేదా సంస్థ విజయపథంలో పురోగమిస్తుంది. దీనికోసం పార్టీ కార్యకర్తలకు తమ పార్టీ నిబంధనావళిపై దృఢమైన విశ్వాసం, దాని లక్ష్యంపట్ల అమిత శ్రద్ధాసక్తులు ఉండటంతో పాటు, కార్యకర్తల మధ్య పరస్పరం ప్రేమాభిమానాలు, స్నేహసోదర భావాలు కూడా ఉండటం ఎంతో అవసరం.

దేవుడ్ని, ఆయన అంతిమ ప్రవక్త (సల్లం)ను విశ్వసించినవారి పార్టీ “ఇస్లాం.” వారి పార్టీ నిబంధనావళి “ఖుర్ఆన్.” దాని కార్యాచరణ విధానం “హదీస్.” పార్టీ లక్ష్యం “ధర్మ సంస్థాపనం”, తద్వారా దైవప్రసన్నత, పరలోకసాఫల్యం పొందడం. ఈ ఉన్నతలక్ష్యం కోసం పనిచేసేవారి భావాలు కూడా ఎంతో ఉన్నతంగా ఉండాలని, పార్టీ (ధర్మం)లో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాలపై రేకెత్తే విభేదాలకు అతీతంగా వారు విశాల దృక్పథం అలవరచుకోవాలని ఇస్లాం బోధిస్తోంది. పార్టీ నిబంధనావళిని, దాని కార్యాచరణ విధానాన్ని, దాని ఆశయాల్ని ఎంతగట్టిగా ప్రేమిస్తే అంతగా వారి మధ్య ప్రేమాభిమానాలు జనిస్తాయని చెబుతోంది.

పార్టీ నిబంధనావళిలో, దాని కార్యాచరణ విధానంలో విషయాలన్నీ స్పష్టంగా ఉన్నాయి. కనుక కార్యకర్తలు పరస్పరం కలహించుకొని, ముఠాలుగా చీలిపోయి తన్నుకు చచ్చే అగత్యం లేదు. ఒకవేళ స్వార్థం, సంకుచితభావాలతో ఎవరయినా అలా చేస్తే వారికి కఠినశిక్ష పడుతుందని పార్టీ నిబంధనావళి (ఖుర్ఆన్)లోని ఒక అధికరణ ఈవిధంగా కార్యకర్తల్ని హెచ్చరిస్తోంది:

“మీలో ఒకవర్గం (ప్రజల్ని) మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడు పనుల నుండి వారించేవారు తప్పకుండా ఉండాలి. అలాంటివారే (ఇహపరలోకాల్లో) సాఫల్యం చెందేవారు. స్పష్టమైన సూచనలు, ప్రమాణాలు వచ్చినప్పటికీ పరస్పరం విభేదించుకొని విభిన్న వర్గాలుగా చీలిపోయినవారిలా మీరూ కాకండి.

అలాంటి వారికి ఘోరమైన (నరక) యాతనలు కాచుకొని ఉన్నాయి.” (104-105)

కాని ఈనాడు యావత్తు ముస్లిం సమాజం ఖుర్‌ఆన్ మౌలిక బోధనలు విస్మరించి అనైక్యతా, అంతర్విభేదాలతో సతమతమవుతోంది. ప్రతి వర్గం ఎదుటి వర్గంపై విద్వేషం కక్కుతూ దుష్ప్రచారం సాగిస్తోంది. ముస్లింలు పైకి ఎంతో సమైక్యంగా ఉన్నట్లు కన్పిస్తున్నా ధర్మసంబంధమైన అత్యల్ప విషయాల్లో అత్యధిక విభేదాలు కల్పించుకొని ఒకరిపై నొకరు బురద చల్లుకుంటున్నారు.

అత్యల్ప విషయాల్లో విభేదాలను గురించి హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (ర) ఉల్లేఖనం వినండి: “నేనొక రోజు ఒకతను ఖుర్‌ఆన్ పఠిస్తున్న తీరును గమనించాను. దైవప్రవక్త (స) ఇలాంటి తీరుతో పఠించడం నేనిదివరకు ఎన్నడూ వినలేదు. అంచేత నేనా వ్యక్తిని దైవప్రవక్త (స) దగ్గరకు పిలుచుకెళ్ళి విషయం చెప్పాను. కాని ఈమాట విని దైవప్రవక్తకు కోపం వచ్చినట్లు అన్పించింది నాకు. ఆయన మా ఇద్దర్ని ఉద్దేశించి “మీరిద్దరూ బాగానే పఠిస్తున్నారు. పరస్పరం విభేదించుకోకండి. (ఇలాంటి) విభేదాల వల్లనే మీకు పూర్వముండిన జాతులు నాశనమయ్యాయి” అని అన్నారు.” (బుఖారి)

ఖుర్‌ఆన్, హదీసుల క్రియాత్మక అన్వయింపు (Application) విషయమై ధర్మంలో భేదాభిప్రాయం సహజమే. ప్రజలలో బుద్ధి, వివేకం, అవగాహనా తీరులు విభిన్నంగా ఉంటాయి ప్రతి వ్యక్తీ తన బుద్ధి, వివేకం, అవగాహనల ప్రకారమే మాట్లాడుతాడు. అంచేత వివిధ అభిప్రాయాలు, వాటికి సంబంధించిన ప్రమాణాలన్నీ సలహా సంప్రదింపుల వేదికపైకి తీసుకొస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించడానికి, ఎవరి అభిప్రాయం, ప్రమాణాలు బలమైనవో తెలుసుకోవడానికి అవకాశం లభిస్తుంది. అప్పుడు వాటిలో అన్నిటికంటే సముచితమైన, సహేతుకమైన విషయాన్ని అవలంబించవచ్చు.

ఒక వ్యక్తి తన అభిప్రాయానికి ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో మాత్రమే బలమైన ఆధారాలు చూపగలిగినప్పుడు, ఆ అభిప్రాయాన్ని కేవలం దేవుని ప్రసన్నత కోసం, సమాజ సంక్షేమం కోసం మాత్రమే అలా వెలిబుచ్చినప్పుడు అతను ధర్మంలోని సమిష్టి విషయాలలో ఇతరుల పట్ల సమైక్యతా సహకారాల భావంతో మసలుకుంటాడు. అంతేకాదు, తాను విభేదించిన అత్యల్ప విషయాలకు మౌలిక విషయాల స్థాయినిచ్చి తాను తప్ప ఇతరులంతా దారి తప్పారని భావించడు. షరీఅత్‌లోని అత్యల్ప విషయాల స్థాపనను ధర్మసంస్థాపనగా తలచి ఆ లక్ష్యసాధన కోసం మిల్లత్‌లో వర్గ సృష్టికి కారకుడు కాజాలడు.

అభిప్రాయభేదాన్ని సృజనాత్మక సలహా అని భావించకుండా మనిషి తన మాటే నెగ్గాలన్న పంతానికి పోతే విషయం అనుకూల వైఖరికి బదులు ప్రతికూల వైఖరిని సంతరించుకొని చివరికి జగడాలకు సైతం దారితీస్తుంది. ధర్మదృక్పథంలో తలెత్తే అవగాహనా విభేదాలు వర్గ సృష్టికి కారణభూతమవుతాయి.



ధర్మావగాహనలో మన పూర్వీకుల మధ్య కూడా అభిప్రాయభేదాలు కలిగేవి. వారు తమ విద్యాయోగ్యత, ధార్మికఅవగాహన, అనుభవాల ఆధారంగా తమ అభిప్రాయాలు ప్రకటించేవారు. అయితే వారు ఎంతో రుజువర్తనులు. వారు తమ భావాలతో ఏకీభవించనివారి పట్ల విద్వేషం ఉంచుకునేవారు కాదు. పైగా వారు తమ ప్రత్యర్థి భావాలను గౌరవించేవారు. ఇజ్తెహాద్ (అనువర్తన)కు సంబంధించిన వ్యవహారాల్లో వారు ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవిస్తూ పరస్పరం సద్భావం కలిగివుండేవారు.

అంతేకాదు, ఒక్కోసారి వారు యుక్తి, అవసరాల దృష్ట్యా తమ భావాలకు, అభిప్రాయాలకు వ్యతిరేకంగా కూడా తీర్పులు (ఫత్వాలు) ఇచ్చేవారు. అలా ఇవ్వడం తప్పని భావించేవారు కాదు. ఆ సమయంలో వారు ప్రత్యర్థి అభిప్రాయాన్ని “ఇది ఎక్కువ సరైన దృక్పథం”---“ఇది హృదయాన్ని ఆకట్టుకుంటోంది”---“ఇది ఎక్కువ సమంజసమైన అభిప్రాయం” అని ప్రశంసించేవారు. ఖుర్‌ఆన్, హదీసుల స్వభావానికి అనుగుణంగా ఉండే, స్పష్టమైన ఆదేశాల నుండి గ్రహించిన ఏ అభిప్రాయాన్నయినా వారు సంతోషంగా అంగీకరించేవారు.

సహాబీలలో, తాబయీలలో, ఆ తరువాతి వారిలోనూ ఎన్నో విభేదాలుండేవి. కొందరు నమాజ్‌లో ‘ఆమీన్’ని బిగ్గరగా పలికితే, మరికొందరు మౌనంగా పలుకుతారు. ఖుర్‌ఆన్ పఠనానికి ముందు కొందరు బిస్మిల్లా పఠిస్తే, మరికొందరు ఏమీ పఠించరు. కొందరు ‘రఫయదీన్’ చేస్తే, మరికొందరు చేయరు. కొందరు ఫజ్ర్ నమాజ్‌లో ‘ఖునూత్ దుఆ’ చదివితే, మరికొందరు చదివేవారు కాదు. వాంతి అయిన తర్వాత లేక ముక్కుదూలం పగిలి రక్తం కారిన తర్వాత నమాజ్ చేయడానికి  కొందరు కొత్తగా ‘ఉజూ’ అవసరమని భావిస్తారు. మరికొందరు అవసరం లేదని తలచేవారు.

ఇన్ని విభేదాలున్నా వారు ఒకరి వెనుక ఒకరు నమాజ్ చేయడాన్ని  చీదరించుకునేవారు కాదు. ఉదా: మదీనాప్రజలు మాలికీ ఫిఖా ననుసరించి నమాజ్‌లో ఖుర్‌ఆన్ పఠనానికి ముందు మనసులోగాని, పైకిగాని ‘బిస్మిల్లా’ పఠించే వారుకాదు. కాని ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి అనుయాయులు మదీనాలో మాలికీ దృక్పథం ఇమాముల నేతృత్వంలో ఎలాంటి సంకోచంలేకుండా నమాజ్ చేసేవారు. అలాగే జోరీగ కాటుకు చికిత్స చేయించుకున్న తర్వాత రోగి చేసిన పూర్వపు ఉజూ భంగమవుతుందని ఇమామ్ అబూయూసుఫ్ అభిప్రాయం. కాగా ఆయన అలాంటి చికిత్స చేయించుకున్న హారూన్ రషీద్ నాయకత్వంలో ఓసారి నమాజ్ చేశారు.

శరీరం నుండి రక్తం కారితే కొత్తగా ఉజూ చేసి నమాజ్ చేయవలసి ఉంటుందన్న విషయాన్ని ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ ఒప్పుకుంటారు. కాని ఆయన ఈ అభిప్రాయంతో ఏకీభవించని ఇమామ్ మాలిక్, ఇమామ్ ముసయ్యిబ్‌ల నేతృత్వంలో నిస్సంకోచంగా నమాజ్ చేశారు. ఇమామ్ షాఫయి ఫజ్ర్ నమాజ్‌లో ఖునూత్ దుఆ పఠించడం తప్పనిసరి అని భావించేవారు. అయితే ఓరోజు ఆయన ఇమామ్ అబూ

హనీఫా మస్జిద్‌లో ఫజ్ర్ నమాజ్ చేయవలసి వచ్చినప్పుడు ఖునూత్ దుఆ పఠించ లేదు. అప్పుడు ఒకతను "మీ దృక్పథం (మస్లక్)ని ఎందుకు వదిలేశారు" అని అడిగితే "నేను ఆయన పరిశోధనను ఎలా రద్దు చేయగలను, అయినా మనం ఇరాఖ్ ప్రజల పద్ధతిని పాటిస్తే వచ్చే నష్టమేమిటీ?" అని ఇమామ్ షాఫయి ఎదురు ప్రశ్న వేశారు.

ఒకసారి ఖలీఫా మన్సూర్‌కు ఒక ఆలోచన తట్టింది. ఇమామ్ మాలిక్ రాసిన మువత్తా గ్రంథానికి అనేక నకళ్ళు తీయించి వివిధ పట్టణాల్లోని ఖాజీలకు పంపి దాన్ని అమలు పరచుదామని భావించాడు. అయితే ఈ సంగతి ఇమామ్ మాలిక్‌కు తెలిసి మన్సూర్‌ని ఆ పని చేయడాన్ని వారిస్తూ 'ప్రజల్ని తాము ఎంచుకున్న దృక్పథం (మస్లక్) ప్రకారం నడచుకోవడానికి స్వేచ్ఛగా వదిలేయండి' అని చెప్పారు.

ఇవి భేదాభిప్రాయాలకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీటిని బట్టి మన పూర్వీకులు, పెద్దలు ఫిఖా వ్యవహారాల్లో, అత్యల్ప విషయాల్లో ఏర్పడిన విభేదాల విషయమయి ఎంతటి విశాలదృష్టి కలవారో అర్థం చేసుకోవచ్చు. వారు ఇస్లాం స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న అత్యున్నత విద్యాధికులైన ధర్మవేత్తలు, తత్వవేత్తలు అయినప్పటికీ ప్రజలు తమ దృక్పథాన్నే అనుసరించాలన్న ఉద్దేశ్యంతో వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

ఫిఖాకు సంబంధించిన అంతగా ప్రాముఖ్యం లేని విషయాలలో పెద్ద రాద్ధాంతం లేవదీస్తూ పోట్లాడుకునే నేటి ముస్లింలకు ఇందులో ఎంతయినా గుణ పాఠం ఉంది. ఇస్లాంవ్యతిరేక శక్తులు వ్యాపింపజేసిన అపోహల వల్లనేమి, పాశ్చాత్య నాగరికతా దృక్పథం నుండి పుట్టిన వివిధ రకాల సిద్ధాంతాల వల్లనేమి నేడు ఇస్లాం మౌలిక విషయాలకే పెద్ద ప్రమాదం వచ్చిపడింది. ఇలాంటి పరిస్థితిలో ముస్లిం మేధావులు, నాయకులు ఇస్లాం మౌలిక విషయాలను, దాని సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ ధర్మసంస్థాపన కోసం కృషి చేయవలసింది పోయి అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాల్లో తీవ్రంగా విభేదించుకొని పోట్లాడు కోవడం, మసీదులు వేరుచేసుకోవడం, వేర్వేరు వర్గాలుగా ఏర్పరచుకొని ఆ అప్రధాన విషయాలనే ప్రచారం చేసుకుంటూ దాన్ని మించిన గొప్ప ధర్మకార్యం లేదని భావించ డం ఎంతో శోచనీయం.

"గుమ్మడికాయ పోయే దారి ఎరగడు కాని, ఆవగింజ పోయే దారిని అట్టే పట్టి చూస్తాడు" అన్న సామెతను స్ఫురణకు తెచ్చే ఈ పరిస్థితి మారిపోవాలి. ముస్లింలు ప్రాముఖ్యంలేని ఫిఖా విభేదాలను పక్కన బెట్టి మౌలిక విషయాలపై సమైక్యమవ్వాలి. మనిషిని ఆర్థిక జంతువుగా మార్చే భౌతికవాద ప్రధానమైన జీవన దృక్పథాలను, నాస్తిక భావాలను, దైవరాహిత్య ధోరణులను ఎదుర్కొంటూ, ఇస్లాంకు నిజమైన ప్రతినిధులు గా తమ వాక్కాచరణల ద్వారా తోటి ప్రజలకు దాని నిజరూపాన్ని పరిచయం చేయ వలసిన అవసరాన్ని గుర్తించాలి.



ఖుర్‌ఆన్ విషయంలో దైవప్రవక్త (సల్లం) చేసిన ఈ క్రింది హెచ్చరికతో నయినా ముస్లింలు సమైక్యమవుతారేమో చూడాలి.

దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అలి (రజి)తో మాట్లాడుతూ "జాగ్రత్త! త్వరలో ఓ పెద్ద సంక్షోభం చెలరేగే కాలం రానున్నది" అని అన్నారు. హజ్రత్ అలి (రజి) ఈమాట విని "అయితే దైవప్రవక్తా! ఈ సంక్షోభం నుండి బయటపడే మార్గం ఏమిటీ?" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా చెప్పారు:

"దైవగ్రంథం. (దైవగ్రంథం ద్వారానే మీరీ సంక్షోభం నుంచి బయట పడగలుగు తారు.) ఈ గ్రంథంలో మీకు పూర్వముండిన జాతులపై ఏఏ పరిణామాలు సంభ వించాయో అవన్నీ ఉన్నాయి. మీ తర్వాత వచ్చే జాతులకు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో కూడా ఇందులో ఉన్నాయి. మీ (దైనందిన) వ్యవహారాలను గురించి నిర్ణయాలు ఎలా తీసుకోవాలో అవికూడా ఇందులో ఉన్నాయి. ఇది ఓ గంభీరమైన, నిర్ణయాత్మకమైన గ్రంథం. ఇదేదో ఆషామాషీ గ్రంథం కాదు. ఎవరైనా దుర్మార్గుడు, చండశాసనుడు ఈ గ్రంథాన్ని వదిలేస్తే దేవుడు అతడ్ని అణగద్రొక్కుతాడు. మరెవరైనా దీన్ని వదిలేసి మరెక్కడ్నుంచయినా మార్గదర్శనం పొందడానికి ప్రయత్నిస్తే దేవుడు అతడ్ని మార్గభ్రష్టుడిగా చేస్తాడు. ఈ ఖుర్‌ఆన్ దేవునికి చెందిన దృఢమైన త్రాడు. ఇది ఎంతో వివేకవంతమైన ఉపదేశం. ఇదే రుజుమార్గం. ఈ ఖుర్‌ఆన్ ఎలాంటి భావస్రవంతి కూడా మనిషిని తప్పుడు మార్గాలపైకి తీసుకుపో జాలదు. ఇందులో ఏ మానవవాక్కుతో నయినా కల్తీ చేయడం సాధ్యం కాదు. పండితులు దీన్ని ఎంత పరిశోధించినా ఎన్నటికీ తృప్తిచెందలేరు. (పరిశోధించిన కొద్దీ మరికొన్ని కొత్తకోణాలు వెలుగు చూస్తూనే ఉంటాయి.) ఎంత చదివినా ఇది పాత పడిపోదు. దీని వింతలు, మహిమలు ఎన్నటికీ అంతం కావు. జిన్నులు ఈ గ్రంథం (లోని సూక్తులు) విన్న తరువాత 'మేము రుజుమార్గం చూపే ఓ విచిత్రమైన ఖుర్‌ఆన్ విన్నాం. అందువల్ల మేము దీన్ని విశ్వసించాం' అని అనకుండా ఉండలేక పోయారు. ఎవరు ఖుర్‌ఆన్ ప్రకారం మాట్లాడుతాడో అతను సత్యం మాట్లాడిన వాడవుతాడు. మరెవరు ఖుర్‌ఆన్ ప్రకారం నడుచుకుంటాడో అతను తప్పకుండా తగిన ప్రతిఫలం పొందుతాడు. ఎవరు ఖుర్‌ఆన్ ప్రకారం నిర్ణయం తీసుకుంటాడో అతను న్యాయమైన నిర్ణయం తీసుకున్న వాడవుతాడు. మరెవరు ప్రజలకు దీన్ని అనుసరించమని పిలుపు నిస్తాడో అతను వారికి రుజుమార్గం చూపినవాడవుతాడు." (తిర్మిజి)

ఇలాంటి మహిమాన్విత గ్రంథం నేటి ముస్లింలకు పుట్టుకతోనే వారసత్వంలో సంక్రమించినందుకు వారు సంతోషంతో పొంగిపోతూ పండుగ జరుపుకోవాలి.

"ఈ మహాభాగ్యాన్ని దేవుడు మీ కోసం పంపాడంటే ఇది ఆయన అనుగ్రహం, దాతృత్వాలే. దానిపై వారు ఆనందోత్సవాలు జరుపుకోవాలి. ఇది ప్రజలు కూడబెట్టున్న దానికంటే ఎంతో శ్రేష్ఠమైనది." (ఖుర్‌ఆన్-10:57,58)

# 29. విభేదాలతో విడిపోతే వినాశం తప్పదు

మన దేశంలో హనఫీయుల తరువాత అహ్లెహదీస్ ప్రజలే ఎక్కువ మంది ఉన్నారు. కాబట్టి ఈ ఉభయవర్గాల ధర్మావగాహనా దృక్పథాలను గురించి ఇక్కడ కొన్ని విషయాలు తెలుసుకుందాం.

**రఫేయదైన్:-** ఈ విషయంలో హనఫీ దృక్పథం అహ్లెహదీస్ దృక్పథానికి భిన్నంగా ఉంది. హనఫీయులు నమాజ్‌లో తక్బీర్ చెప్పేటప్పుడు చేతులు చెవులదాకా ఎత్తుతారు. అహ్లెహదీస్ వారు భుజాల వరకే ఎత్తుతారు. వీరి దృక్పథాన్ని సమర్థిస్తున్న ఈ క్రింది హదీసు చూడండి.

“దైవప్రవక్త (సల్లం) నమాజ్ చేయదలచుకున్నప్పుడు రెండు చేతులు భుజాల దాకా పైకెత్తేవారు. చేతులు పైకెత్తుతూ అల్లాహుఅక్బర్ అని పలికేవారు.” (అబూదవూద్)

హనఫీ దృక్పథం పరదానియమాలను దృష్టిలో పెట్టుకొని ఈ హదీసును స్త్రీలకు మాత్రమే వర్తింపజేసింది. స్త్రీలు పురుషుల్లా చేతులు చెవులదాకా పైకెత్తితే వారి ‘సతర్’ అవయవాల ఆకృతి బహిర్గతమయ్యే అవకాశం ఉన్నందున వారు నమాజ్‌లో చేతులు భుజాల వరకే పైకెత్తాలని హనఫీ దృక్పథం ఆదేశించింది.

దైవప్రవక్త (సల్లం) చెవుల దాకా చేతులెత్తినట్లు కూడా ఉల్లేఖనాలు ఉన్నాయి. అబూదావూద్, నసాయి, హాకిమ్, అహ్మద్, తబ్రానీ, దారెఖత్నీ, తహావీ, ముస్లిం గ్రంథాలలో ఈ ఉల్లేఖనం ఉంది.

హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) కథనం: “మేము మదీనా వచ్చినప్పుడు మదీనా ప్రజలు చేతులు చెవులదాకా ఎత్తడం చూశాము. నేను ఆ తరువాత సంవత్సరం మదీనా వచ్చి చూస్తే మదీనా ప్రజలు ఉన్ని టోపీలు, పొడుగు చొక్కాలు ధరించి తీవ్రమైన చలి కారణంగా చేతులు భుజాల వరకే ఎత్తడం గమనించాను.”

‘రఫేయదైన్’ గురించి ఇమామ్ ఔజాయి (రహ్మాలై), ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై)ల మధ్య ఒక సంభాషణ జరిగింది. ఆ సంభాషణలో ఇమామ్ ఔజాయి (రహ్మాలై) హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనంతో ఇలా తెలిపారు: “దైవప్రవక్త (సల్లం) రుకూలోకి పోయేటప్పుడు, రుకూ నుండి లేచేటప్పుడు కూడా చేతులు పైకెత్తేవారు.” ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖనంతో ఇలా తెలిపారు: “దైవప్రవక్త (సల్లం) తక్బీరె తహ్రీమా (మొదటి తక్బీర్) చెప్పేటప్పుడు మాత్రమే చేతులు పైకెత్తేవారు. ఆ తరువాత చేతులు పైకెత్తేవారు కాదు.”

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: “ఏడు సందర్భాలలో తప్ప మరే సందర్భంలోనూ చేతులు పైకెత్త కూడదు. (1) తక్బీరె తహ్రీమా (నమాజ్‌లోని మొదటి తక్బీర్) చెప్పేటప్పుడు, (2) దుఆయే ఖునూత్‌కు సంబంధించిన తక్బీర్ చెప్పేటప్పుడు, (3) ఈద్ నమాజ్ తక్బీర్‌లు చెప్పేటప్పుడు, (4) అరఫాత్ తక్బీర్ చెప్పేటప్పుడు, (5) జమ్రాల తక్బీర్ చెప్పేటప్పుడు, (6) సఫా మర్వాల తక్బీర్ చెప్పేటప్పుడు, (7) ఇస్తిలాం తక్బీర్ చెప్పేటప్పుడు.” (హదాయ వ దరాయ)



**చేతులు కట్టుకునే స్థానం:-** నమాజ్‌లో చేతులు రొమ్ముపై కట్టుకునే విషయంలోనే గాకుండా, నాభి కింద కట్టుకునే విషయంలో కూడా హదీసులు ఉన్నాయి. ఈ రెండు విభిన్న విషయాలను గురించి హజ్రత్ వాయిల్ ఇబ్నె హుజర్ (రజి) ద్వారానే రెండు ఉల్లేఖనాలు ఉన్నాయి.

ఆయన ఒక ఉల్లేఖనంలో తమ తండ్రిగారు ఈవిధంగా చెప్పారని తెలిపారు: “దైవప్రవక్త (స) తమ కుడి చేతిని ఎడమ చేతిపై ఉంచి నాభి కింద కట్టుకున్నట్లు.” నేను చూశాను.” (ఇబ్నె అబీ షైబా).

రెండవ ఉల్లేఖనంలో ఆయన ఇలా తెలిపారు: “నేను దైవప్రవక్త (సల్లం)తో కలసి నమాజ్ చేశాను. అప్పుడాయన తమ కుడి చేతిని ఎడమ చేతిపై ఉంచి రొమ్ముపై కట్టుకున్నారు.” (ఇబ్నెమాజ).

హనఫీ దృక్పథం పరదా నియమాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఉల్లేఖనాన్ని స్త్రీలకు మాత్రమే వర్తింపజేసింది. అహ్లెహదీస్ వారు దీన్ని స్త్రీ పురుషులు ఇరువురికీ వర్తింపజేశారు.

**స్త్రీలు చేసే సజ్దా పద్ధతి:-** స్త్రీలు చేసే సజ్దా విషయంలో కూడా అహ్లెహదీస్ దృక్పథానికి, హనఫీ దృక్పథానికి తేడా ఉంది. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం స్త్రీలు పురుషులు మాదిరిగా పిరుదులు ఎత్తిపెట్టి సజ్దా చేస్తారు. హనఫీ దృక్పథం ప్రకారం స్త్రీలు పురుషుల సజ్దా పద్ధతికి భిన్నంగా పిరుదులు కాళ్ళకు ఆనిచ్చి, తొడలు కడుపుతో కలిపి, చేతులు పక్కటెముకలతో కలిపి సజ్దా చేస్తారు. ఈ రెండు దృక్పథాలకు కూడా అనుకూలమైన ఉల్లేఖనాలు ఉన్నాయి.

దైవప్రవక్త (సల్లం) ఇద్దరు స్త్రీలు నమాజ్ చేస్తున్నప్పుడు వారి దగ్గరకు వెళ్ళారు. ఆయన వారిద్దర్ని ఉద్దేశించి “మీరు సజ్దా చేసేటప్పుడు నేలకు అతుక్కుపోవాలి; మీ శరీరాన్ని నేల మీద ఆనిచ్చి పెట్టండి” అని చెప్పారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో ఇలా ప్రవచించారు: “స్త్రీ సజ్దా చేస్తున్నప్పుడు పొట్టను తొడలతో కలపాలి.” (బైహఖి)

**ఫాతిహా సూరా సమస్య:-** ఇమామ్ వెనుక ముఖ్తదీలు ఖుర్ఆన్ పఠించాలన్న విషయంతో పాటు ఖుర్ఆన్ పఠించకుండా మౌనంగా ఉండాలన్న విషయం గురించి కూడా అనేక హదీసులున్నాయి. ఉదాహరణకు దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన ఈ క్రింది హదీసులు చూడండి:

"(నమాజ్‌లో) ఇమామ్ అల్లాహుఅక్బర్ అన్నప్పుడు మీరూ అల్లాహుఅక్బర్ అనండి. అయితే ఇమామ్ ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు మీరు మౌనంగా ఉండండి." (ఇబ్నెమాజ, అబూదావూద్, నసాయి, తహావి)

"ఎవరికి ఇమామ్ ఉంటాడో ఆ ఇమామ్ చేసే పఠనం (ఖిరాత్) వారి పఠనం అవుతుంది." (ఇబ్నెమాజ, దారెఖుత్నీ, బైహఖీ, ముఅత్తా-ఇమాం మాలిక్)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఎవరు ఇమామ్ వెనుక నమాజ్ చేస్తుంటాడో ఇమామ్ (ఖుర్‌ఆన్) పఠనం ఆ ముఖ్తదీ పఠనంగా పరిగణించబడుతుంది." (ముఅత్తా-ఇమామ్ ముహమ్మద్)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) జుహ్రీ (బిగ్గరగా పఠించే) నమాజ్‌లో ముఖం తిప్పి (సలాం చేసి) ముగించిన తర్వాత "ఖుర్‌ఆన్ పఠనంలో ఈ ఘర్షణ ఏమిటీ?" అన్నారు. అప్పటి నుంచి జుహ్రీ నమాజ్‌లో ఇమామ్ వెనుక ప్రజలు ఖుర్‌ఆన్ పఠించడం మానేశారు." (మాలిక్, అబూదావూద్, తిర్మిజ, తహావి)

'హిదాయా' గ్రంథకర్త ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించకూడదనే విషయం మీద సహాబీల ఏకగ్రీవ అంగీకారం ఉందని తెలిపారు. అలాగే ఇమామ్ వెనుక ఖుర్‌ఆన్ పఠించరాదనే విషయాన్ని ఎనభై మంది సహాబీల అభిప్రాయం నిరూపిస్తోందని అల్లామా అయినీ తన గ్రంథంలో వ్రాశారు. ముస్లిం షరీఫ్‌లోని ఒక హదీసులో కూడా ఈమాట ఇలా ఉంది:

"దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు- "ఇమామ్ (ఖుర్‌ఆన్) పఠిస్తున్నప్పుడు మీరు మౌనంగా ఉండండి." (ముస్లిం)

ఇమామ్ వెనుక ముఖ్తదీలు కూడా ఫాతిహా సూరా తప్పకుండా పఠించాలని చెప్పేవారు గొప్ప ప్రమాణంగా ఈ క్రింది హదీసు పేర్కొంటారు:

"ఫాతిహా సూరా లేనిదే నమాజ్ నెరవేరదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ హదీసు నిజమైన హదీసే. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. కాని దైవ ప్రవక్త (సల్లం) ఈమాట వ్యక్తిగత నమాజ్ విషయంలో చెప్పారా లేక సామూహిక నమాజ్ విషయంలో చెప్పారా అనేది వివరించలేదు. ఒకవేళ వ్యక్తిగత, సామూహిక నమాజులు రెండిటికీ ఈమాట వర్తిస్తుందనుకుంటే సామూహిక నమాజ్‌లో ఇమామ్ ముఖ్తదీలకు ప్రాతినిధ్యం వహించి వారందరి తరపున ఫాతిహా సూరా పఠించే బాధ్యత నిర్వహిస్తున్నాడు కదా! ఇక ముఖ్తదీలు ఫాతిహాసూరా పఠించాల్సిన అవసరం ఏమిటీ? సామూహిక నమాజ్ విషయంలో ఆసక్తికరమైన రెండు హదీసులు ఉన్నాయి.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు- "మీ నమాజులు స్వీకరించబడాలని మీరు కోరుకుంటే మీకు నాయకత్వం మీ ధర్మవేత్తలే వహించాలి. ఎందుకంటే వారు మీకు, మీ ప్రభువుకు మధ్య ప్రతినిధి వర్గం (నాయకులు)." (హాకిం, బైహఖి)



ప్రతినిధి వర్గం నాయకుడు మాట్లాడుతున్నప్పుడు అనుచరులు అతనికి వంత పాడరు, మౌనంగా ఉంటారు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "(నమాజ్‌లో) ఇమామ్‌ని మీరి పోకండి. ఇమామ్ (అల్లాహుఅక్బర్ అని) తక్బీర్ చెబితే మీరూ తక్బీర్ చెప్పండి. అతను 'వలజ్జాల్లీన్' అంటే మీరు 'ఆమీన్' అనండి. ఇమామ్ రుకూ చేస్తే మీరూ రుకూ చేయండి. అతను 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అంటే మీరు 'అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్ద్' అనండి." (బుఖారి, ముస్లిం)

పై హదీసులో దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్ పఠనం గురించి ప్రస్తావించలేదు. ఫాతిహా సూరాలోని చివరి పదాన్ని మాత్రమే ప్రస్తావించి అప్పుడు ముఖ్తదీలు 'ఆమీన్' చెప్పాలని అన్నారు. ఒకవేళ సామూహిక నమాజ్‌లో ఇమామ్‌తో పాటు ముఖ్తదీలు కూడా ఫాతిహా సూరా పఠించవలసి ఉంటే, దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని పై హదీసులో తప్పకుండా ప్రస్తావించి ఉండేవారు. కాని అలా జరగలేదు.

ఫాతిహా సూరా పఠించనిదే నమాజ్ నెరవేరదనే హదీసు సమక్షంలో ఖుర్‌ఆన్‌లో కూడా ఒక ఆసక్తికరమైన సూక్తి ఈవిధంగా ఉంది:

"మీ ముందు ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి దాన్ని శ్రద్ధగా వినండి, మీరు కరుణించబడతారు." (7:204)

ఈ సూక్తిలోని ఆజ్ఞ సాధారణమైనది. కనుక ఖుర్‌ఆన్ సూక్తులు నమాజ్‌లో పఠిస్తున్నా, నమాజ్ బయట వేరే సమయాల్లో పఠిస్తున్నా వాటిని వినేవారు మౌనంగా ఉండి, శ్రద్ధగా ఆలకించాలి. అంతేగాని వాటిని నెమ్మదిగానైనా పునరుద్ఘాటించ కూడదని హనఫీ దృక్పథం పేర్కొన్నది.

దాదాపు ఏడేండ్ల క్రితంనాటి మాట. నా స్నేహితుడొకడు ఫాతిహా సూరా గురించి మాట్లాడుతో "ఫాతిహా సూరా పఠించనిదే నమాజ్ నెరవేరదని హదీసు ఉన్నప్పటికీ హనఫీయులు ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించరు" అని అన్నాడు. నేనీ మాట మాట విని "మీ ముందు ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి దాన్ని శ్రద్ధంగా వినండని ఖుర్‌ఆన్‌లో ఉంది మరి" అని అన్నాను. దానికి నా స్నేహితుడు తీవ్రంగా స్పందిస్తూ "ఆ...స్పష్టమైన ఒక హదీసు సమక్షంలో ఖుర్‌ఆన్‌ని తీసుకొస్తావా?" అన్నాడు. నేను చిరునవ్వుతో "హదీసు సమక్షంలో ఖుర్‌ఆన్ కాకపోతే మరేముంటుంది? ఖుర్‌ఆన్‌లో లభించకపోతే కదా హదీసు దగ్గరకు పోయేదీ?" అని అన్నాను.

**పంక్తుల క్రమబద్ధీకరణ:-** నమాజ్‌లో హనఫీ దృక్పథంగల ముఖ్తదీలు భుజానికి భుజం కలిపి నిలబడతారు. అహ్లెహదీస్ దృక్పథంగల ముఖ్తదీలు పాదానికి పాదం కలిపి నిలబడతారు. హదీసు వెలుగులో పరిశీలిస్తే ఈ రెండు పద్ధతులు కూడా సరయినవి కావని చెప్పవచ్చు.

హ్రజత్ అనస్ (రజి) కథనం: "(నమాజ్‌లో) పంక్తులు సరిచేసుకోండి. నేను మిమ్మల్ని వెనుక వైపు నుండి కూడా చూడగలను)" అన్నారు దైవప్రవక్త (స). "మాలో ప్రతి ఒక్కడూ (నమాజ్‌లో) భుజానికి భుజం, పాదానికి పాదం కలిపేవాడు. (బుఖారి)

హదీసులో విషయం ఇంత స్పష్టంగా ఉన్నా కొందరు తమ పద్ధతే సరైనదన్నట్లు మాట్లాడుతారు. హైదరాబాద్‌లో ఒక పెద్దాయనతో పరిచయం అయింది. తరచుగా నేను ఆయన ఇంటికి, ఆయన మా ఇంటికి వచ్చి ధార్మిక విషయాలు మాట్లాడుకునే వాళ్ళం. ఒకసారి మేమిద్దం అసర్ నమాజ్‌కు బయలుదేరాం.

దారిలో ఆ పెద్దాయన మాట్లాడుతూ "ఈ హనఫీయులు నమాజ్‌లో కాస్తంత కాలు తగిలితే చాలు, ఏదో అయినట్లు వెంటనే లాక్కుంటారు" అని అన్నాడు. నేను పై హదీసు చదివి ఉన్నందున "మహాశయా! ఏ హదీసులో పాదానికి పాదం ఆనిచ్చి నిలబడాలని ఉందో, అదే హదీసులో భుజానికి భుజం కలపాలని కూడా ఉంది" అని అన్నాను. దాంతో ఆ పెద్దాయన మారు మాట్లాడలేదు.

ఖుర్ఆన్, హదీసుల పట్ల సరైన అవగాహన కలిగిన ధర్మవేత్తలు, జాతీయ-అంతర్జాతీయ పరిస్థితుల్ని విశ్లేషణాదృష్టితో గమనిస్తున్న మేధావులు, ఉమ్మత్ శ్రేయోభిలాషులు ఈ రెండువర్గాలు సత్యమార్గంలో ఉన్నాయని చెబుతున్నారు. అయినా వాటిలో ప్రతివర్గం ప్రజలు తామే సత్యమార్గంలో ఉన్నామని చెప్పుకుంటున్నారు. ఖుర్ఆన్‌లో పేర్కొన్నట్లు గ్రంథప్రజలు కూడా ఇలాగే చెప్పుకుంటారు.

"యూదులైపోతే సన్మార్గంలో ఉంటారని యూదులు, క్రైస్తవులుగా మారితేనే రుజుమార్గం లభిస్తుందని క్రైస్తవులు అంటారు. వారికి చెప్పు: "ఇబ్రాహీం అనుచర సముదాయమే సన్మార్గంలో ఉంది. ఇబ్రాహీం స్వచ్ఛమైన ఏకదైవారాధకుడు." (2:135)

ప్రవక్త (స)నోట ఒక విషయాన్ని విన్న లేక ఆయన ఆచరించిన ఒక విషయాన్ని చూసిన అనేకమంది సహాబీలు వాటిని తమ సొంతమాటల్లో వ్యక్తపరిచారు. అదే విషయాన్ని సహాబీల నోట విన్న ఇతరులు కూడా దాదాపు తమ సొంత మాటల్లోనే హదీసు సేకరణ కర్తలకు చేరవేశారు. అంచేత అందులో కొద్దో గొప్పో తేడా ఉండటం సహజం. అదీగాక హదీసుకళ, ధర్మాహగాహనల దృష్ట్యా కూడా కొంచెం తేడాలుండే అవకాశముంటుంది. అయినా ఈ తేడాలు ధర్మంలోని మౌలిక అంశాల రూపురేఖల్ని మార్చగలిగేటంతటి భయంకరమైన విషయాలు కావు. కనుక ముస్లింలు యూదులు, క్రైస్తవుల అడుగుజాడలలో నడుస్తూ వాదులాడుకోవడం ఏమాత్రం మంచిది కాదు. అంతగా ప్రాముఖ్యంలేని ఫిఖ్హా విభేదాలను విద్వేష-విరోధాల స్థాయికి తీసుకుపోకుండా ఉండటంలోనే వారి శ్రేయస్సుంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా దుష్టశక్తులు ఇస్లాంను వక్రీకరించి ప్రచారంచేస్తూ, ముస్లింలపై ఎడతెరిపిలేని దాడులు చేస్తున్న ఈ రోజుల్లో ముస్లింలు ఫిఖ్హాకు సంబంధించిన తమ అంతర్విభేదాలు వదలి ఇస్లాం మౌలిక విషయాలపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# 30. రేఖ వేరు, కొలబద్ద వేరు

కొలబద్ద ఉపయోగించి ఒక రేఖ గీస్తే సాధారణంగా అది తిన్నగానే ఉంటుంది దాన్నే మనం 'సరళ రేఖ' అంటాము. ఈ సరళరేఖను ప్రమాణంగా తీసుకొని ఎవరైనా ఒక వస్తువును సరిచూసుకోవడానికి నిర్ణయించుకుంటే అతని నిర్ణయం సరైనదే అని చెప్పవచ్చు. అయితే ఆ సరళరేఖ ఎంత తిన్నగా ఉన్నప్పటికీ స్వతహాగా అది కొలబద్ద (స్కేలు) మాత్రం కాజాలదు.

ఒకవేళ ఈ సరళరేఖనే కొలబద్దగా తీసుకొని ఎవరైనా ఒక వస్తువును తయారు చేస్తే, తిరిగి ఆ వస్తువుని ప్రమాణంగా పరిగణించి వేరొకరు మరేదైనా వస్తువుని తయారుచేస్తే- ఇలా ఆ తరువాతి వారు తమకు పూర్వమున్న వస్తువులను ప్రమాణాలుగా తీసుకొని తమ వస్తువులను తయారుచేసుకుంటూ పోతే ఫలితం ఎలా ఉంటుందో ఊహించండి. ఇవన్నీ పోను పోను వంకర వస్తువులుగానే తయారవుతాయిగాని మొట్టమొదట రూపొందిన సరళరేఖలా తిన్నగా ఉండవు.

ఇలా ప్రతి వస్తువునూ లేక రేఖనూ ప్రమాణబద్ధమయిందని భావించి గుడ్డిగా అనుసరించడం మన అజాగ్రత్త, ఏమరుపాటులనే సూచిస్తుంది. అందువల్ల మనం రూపొందించే వస్తువుల్లో ఏమాత్రం వంకర ఉందని అన్పించినా వెంటనే దాన్ని అసలు స్కేలుతో చెక్ చేసుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది.

ఈ స్కేలు, కొలమానాలు అనేవి జీవితంలోని ప్రతి రంగంలో ఉన్నాయి. ఒక ఉన్నతాధికారి తన క్రింది అధికారి చేత ఏదైనా చట్టవిరుద్ధమైన పని చేయించదలచుకుంటే అతను తన క్రింది అధికారిని సంజ్ఞల ద్వారాగాని, నోటి మాటల ద్వారాగాని ఫలానా పని చేయమని ఆదేశిస్తాడు. క్రింది అధికారి ధైర్యస్థుడు, నిజాయితీపరుడు అయివుంటే తన పైఅధికారి ఆదేశాన్ని పాటించడం అవసరమని తెలిసినప్పటికీ మొదట దాన్నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాడు. చివరికి ఉన్నతాధికారి నుండి వత్తిడి వస్తే ధైర్యంతో "సార్! ఆ పనేదో కాస్త వ్రాతపూర్వకంగా చెప్పండి, చేస్తాను" అంటాడు వినయంగా.

అంటే అర్థం ఏమిటీ? "అయ్యా! తమరు ఒక రేఖ మాత్రమేగాని స్కేలు కాదు కదా! ఇప్పుడు మీ బుద్ధి ఏదో గడ్డి తిన్నట్లు అన్పిస్తోంది. అంచేత దయచేసి వ్రాతపూర్వకంగా ఆదేశించండి" అని క్రింది అధికారి సుతిమెత్తగా డిమాండ్ చేస్తూ, ఉన్నతాధికారిని స్కేలు మీదికి రమ్మని పిలుస్తున్నాడన్నమాట.

ఒక ఇంజినీరింగ్ కాంట్రాక్టరు తన క్రిందిఉద్యోగి అయిన తాపీమేస్త్రీతో ఫలానా ఇటికను కాస్త ముందుకు జరపమని అంటాడు. కాని కొలబద్ధతో ఇటుకలను సరైన స్థానంలో పెట్టిన ఆ తాపీమేస్త్రీ, సరిగానే ఉందయ్యా అంటాడు. అయినా కాంట్రాక్టరు ఇటుకను ముందుకు జరపవలసిందేనని పట్టుబడ్తాడు. అప్పుడు తాపీమేస్త్రీ "అయ్యా!

ఇటుకను సరిగానే పెట్టాను. కావాలంటే కొలబద్దతో సరిచూసుకోండి” అంటాడు. అంటే ఏమిటీ అర్థం? “మీరు ఒక రేఖ మాత్రమేగాని స్కేలు కాదు. మనిద్దరిలో ఎవరికి తేడా వచ్చినా ఇద్దరం తిరిగి స్కేలు ఉపయోగించి సరిచూసుకో వలసిందే” అని తాపీమేస్త్రీ చెబుతున్నాడన్నమాట.

అచ్చం ఇలాగే ఉంటుంది ఇస్లామీయ జీవన పరిస్థితి కూడా. ఈ విషయం గురించి ఖుర్ఆన్ ఏమంటున్నదో చూడండి:

“విశ్వాసులారా! దేవునిపట్ల, ఆయన ప్రవక్త పట్ల విధేయత కలిగి ఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదైనా వ్యవహారంలో మీ మధ్య వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని వైపుకు, ఆయనప్రవక్త వైపుకు మరల్చండి. మీరు వాస్తవంగా దేవుడ్ని, అంతిమ దినాన్ని విశ్వసిస్తున్నట్లయితే ఇదే మీకోసం సరైన పద్ధతి. పర్యవసానం రీత్యా కూడా ఇదే ఉత్తమ విధానం.” (4:59)

ముస్లింలు ఐకమత్యంతో సామూహిక జీవితం గడపాలని, జీవితంలోని ప్రతి రంగంలో ఖుర్ఆన్, హదీసుల ఆజ్ఞలను శిరసావహించాలని; దాంతోపాటు ఖుర్ఆన్, హదీసుల వెలుగులో వారి పైఅధికారులు లేక నాయకులు ఇచ్చే ఆజ్ఞలను కూడా తప్పకుండా పాటించాలని పై సూక్తి తెలియజేస్తోంది. ఈ సూక్తిలో “దేవుని పట్ల విధేయత కలిగి ఉండండి” అంటే ఖుర్ఆన్ ఆజ్ఞలను పాటించాలని; “ప్రవక్త (సల్లం) పట్ల విధేయత కలిగి ఉండండి” అంటే హదీసు బోధనలను అనుసరించాలని అర్థం. అధికారులిచ్చే ఆజ్ఞలు మాత్రం ఈ రెండిటి వెలుగులోనే ఉండాలి.

ఖుర్ఆన్, హదీసులే ఇస్లాం బోధనలకు మూలాధారాలు. కనుక ముస్లింలు ఈ రెండిటిని దృఢంగా పట్టుకోవాలి. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ రెండిటి ఆవశ్యకతను గురించి నొక్కి చెబుతూ “నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలి వెళ్తున్నాను. వాటిని దృఢంగా పట్టుకొని (ఆచరిస్తూ) ఉన్నంత కాలం మీరెన్నటికీ దారి తప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (ఖుర్ఆన్). రెండు, నా సంప్రదాయాలు (హదీస్)” అని అన్నారు. (ముఅత్తా-ఇమామ్ మాలిక్)

“నీ ప్రభువు సాక్షి! వారు తమ వివాదాల పరిష్కారం కోసం నిన్ను న్యాయనిర్ణేతగా అంగీకరించి, వాటిపై నీవిచ్చే తీర్పుపట్ల ఏమాత్రం తటపటాయించకుండా ఆసాంతం స్వీకరించనంత వరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు.” (ఖుర్ఆన్-4:65)

జీవిత వ్యవహారాలకు సంబంధించిన సమస్యలన్నింటినీ దైవప్రవక్త (సల్లం) చూపిన విధానం ప్రకారం పరిష్కరించుకోవాలని పై సూక్తిలో దేవుడు ముస్లింలను ఆదేశిస్తున్నాడు. అలాంటి వారే నిజమైన విశ్వాసులని చెబుతున్నాడు. “మీలో ఏ మనిషీ నేను తీసుకొచ్చిన విధానానికి అతని మనోభీష్టం లోబడి ఉండనంతవరకు విశ్వాసి కాలేడు” అని దైవప్రవక్త (సల్లం) స్పష్టంగా చెప్పారు.



“మరికొందరున్నారు. వారు ఎలాంటి జ్ఞానం, మార్గదర్శకత్వం, (జ్ఞాన)కాంతి ప్రసాదించే గ్రంథం ఏమీ లేకుండానే ప్రజలను పెడదారి పట్టించడానికి దేవుని విషయంలో గుండెలు విరుచుకొని మరీ వాదిస్తుంటారు. అలాంటి వాడికి ప్రపంచంలో అవమానం, అప్రతిష్ఠలే మిగులుతాయి. ప్రళయదినాన మేమతనికి నరకాగ్ని యాతనలు చవిచూపిస్తాము. ‘ఇదే నీకోసం, నీచేజేతులా సంపాదించి పంపుకున్నదాని ఫలితం. అంతేగాని దేవుడు తన దాసులకు ఎలాంటి అన్యాయం చేయడు’ (అని అతనికి చెప్పబడుతుంది).” (దివ్యఖుర్ఆన్-22:8-10)

హ్జ్రత్ అమీర్ మావియా (రజి), హ్జ్రత్ హకమ్ బిన్ అమ్ర్ గిఫ్ఫారీ (రజి)ని ఖురాసాన్ యుద్ధానికి పంపించారు. అక్కడ హకమ్ (రజి)కు అపార సమరసొత్తు లభించింది. ఈవార్త అమీర్ మావియా (రజి)కు చేరగానే సమరసొత్తులోని వెండి, బంగారాలను తన వద్దకు పంపి, మిగతా ధనాన్ని యోధులకు పంచమని ఆయన హకమ్ (రజి)కు ఆజ్ఞలు జారీచేశారు. కాని హ్జ్రత్ హకమ్ (రజి) దానికి సమాధానంగా “విశ్వాసులనాయకా! ఖలీఫా లేఖకు ముందే నా దగ్గరకు దైవలేఖ వచ్చింది. అంచేత నేను దాన్ని ఇంతకుముందే అమలుపరచాను” (అంటే సమరసొత్తు పంపిణీ విషయంలో ఖుర్ఆన్ ఆజ్ఞలను, షరీఅత్ నిబంధనలను అమలుపరచాను. కాబట్టి ఇక మీ ఆదేశాన్ని పాటించనవసరం లేదని భావించాను) అని రాసి పంపారు.

ఈ ఉత్తరం చూసి అమీర్ మావియా (రజి) ఆగ్రహోదగ్రులయ్యారు. ఫలితంగా హ్జ్రత్ హకమ్ (రజి) సంకెళ్ళతో జైల్లో బంధించబడ్డారు. చివరికి ఆ స్థితిలోనే ఆయన ప్రాణం విడిచారు. చనిపోయేముందు ఈ వ్యవహారాన్ని తీర్పుదినాన పరలోక న్యాయమూర్తి ఎదుట ఉంచడానికి వీలుగా తన భౌతికకాయాన్ని సంకెళ్ళతో సహా ఖననం చేయవలసిందిగా ఆయన వీలునామా రాశారు. (తబ్ఖాతె ఇబ్నెసాద్)

సహాబీల, తాబయీల కాలంతర్వాత, ప్రత్యేకంగా నేటికాలంలో ముస్లిం సమాజానికి, ఇస్లామీయ వైభవానికి అన్నిటికంటే ఎక్కువ నష్టం జరిగిందంటే ‘రేఖ’కు పూర్తిగా ‘స్కేలు’స్థాయి ఇవ్వబడిన కారణంగానే జరిగింది. అంటే కొమ్మను చెట్టుగా, తొండాన్ని ఏనుగుగా, అత్యల్ప విషయాన్ని అసలు విషయంగా పరిగణించడం జరిగిందన్న మాట. ధర్మానికి సంబంధించిన జటిల సమస్యలనేగాక, అతి సాధారణ విషయాలను సైతం అర్థం చేసుకోవడానికి ముస్లింలు తమ బుద్ధి వివేచనలను ఉపయోగించడం మానేశారు. వారు తమ ధర్మాన్ని ఏదోఒక “వ్యక్తిత్వం” ద్వారా లభించే నిర్ణయాన్నే ప్రతి వ్యవహారంలోనూ షరీఅత్ నిర్ణయంగా పరిగణించసాగారు.

హ్జ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) ఒకసారి ఇలా ఉపదేశించారు: “ఒక వ్యక్తి (సత్యాన్ని) విశ్వసిస్తే తానూ విశ్వసించి, అతను తిరస్కరిస్తే తానూ తిరస్కరించే విధంగా మనిషి తన ధర్మాన్ని ఏ ఒక్కరి విధేయతలో (గుడ్డిగా) ఇవ్వకూడదు.”

ఆయన మరోసందర్భంలో ఇలా అన్నారు: “ఒకవేళ ప్రజలంతా తిరస్కారం వహించినప్పటికీ తాను మాత్రం తిరస్కారం వహించను అనే నియమానికి మనిషి తనంతట తాను కట్టుబడి ఉండాలి.” (హలియతుల్ ఔలియా)

చాలామంది అనాలోచితంగా ఇతరులను అనుసరిస్తారు. దైవం ప్రసాదించిన బుద్ధీ వివేచనల వెలుగులో ఒక విషయం తప్పుగా లేక ఒప్పుగా ఉన్నట్లు స్పష్టంగా కన్పిస్తున్నా, గట్టి ప్రమాణం రీత్యా అందులో ఎలాంటి సందేహం, సందిగ్ధాలకు తావు లేకపోయినా దాన్ని కూడా వీరు ఇతరుల కళ్ళద్దాలతోనే చూసి ఆచరిస్తారు. దీన్నే “అంధానుకరణ” అంటారు.

దైవప్రవక్త (సల్లం) ఒకసారి తన అనుచరుల ముందు భవిష్యత్తులో సంభవించనున్న ఉపద్రవాలను గురించి ప్రస్తావిస్తూ “నా తదనంతరం జీవించి ఉండేవారు ఎన్నో విభేదాలను చూస్తారు. కనుక మీరు నా పద్ధతి (సంప్రదాయం)ని, నా ఖలీఫాల పద్ధతిని దృఢంగా పట్టుకోండి” అని సెలవిచ్చారు. (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం) హయాం తరువాత ఆయన సహబీల కాలం కూడా అత్యంత మెరుగైన ఇస్లామీయ యుగమే. ఆ కాలంలో ఏదైనా కొద్దో గొప్పో సంక్షోభం తలెత్తి ఉన్నా ఆనాటి ముస్లింలు దైవప్రవక్త (సల్లం), ఆయన ఖలీఫాల విధానాలనే ధర్మానికి కొలమానాలుగా పరిగణించారు. ఇలాంటి సందర్భంలోనే హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) ప్రజలకు హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు:

“బ్రతికున్నవారి ద్వారా రకరకాల ఉపద్రవాలు చెలరేగే ప్రమాదం ఉంది. కనుక మీరు పరిపూర్ణ సదాచరణ స్థితిలో తమ ఆదర్శాన్ని వదలి ప్రపంచాన్ని వీడిపోయిన వారిని మాత్రమే విధేయించండి.” హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) ఇక్కడ దైవప్రవక్త (సల్లం), ఆయన ముఖ్య అనుచరుల వైపు సూచిస్తూ వారి విధానాలను ఆదర్శంగా తీసుకోమని సలహా ఇస్తున్నారు. (మిష్కాత్)

ఈనాడు పరిస్థితులు మారిపోయాయి. ఎటు చూసినా ఏదో ఒక కొత్త ఉపద్రవం పుట్టుకొస్తోంది. ప్రతి ఉద్యమం, ప్రతి సంస్థ బాహ్యశక్తుల దాడులకు, అంతర్గత అలజడులకు గురయిపోయాయి. ప్రతి చోటా రెండు లేక అంతకన్నా ఎక్కువ వర్గాలు తయారవుతున్నాయి. ప్రతివర్గం నాయకుడూ ఓ చిన్న సేనను వెంట బెట్టుకొని ఉద్యమాన్ని నడుపుతూ, తాను చేపట్టిన ప్రతి ధర్మవ్యతిరేక కార్యానికి “యుక్తి” పేరిట ధర్మబద్ధతను సృష్టించుకుంటున్నాడు. జనసామాన్యం కేవలం భరోసా కారణంగా అతనితో సహకరిస్తూ అతని చదరంగంలో పావులుగా ఉపయోగపడుతున్నారు. మిగిలినవారు ప్రత్యర్థివర్గాలపై దుష్ప్రచారం సాగించడంలో నిమగ్నులైపోయారు.

ఇదీ ఈనాటి ముస్లింల పరిస్థితి. ఈ పరిస్థితికి కారణం ముస్లిం సమాజంలో సరైన ధార్మిక స్పృహ లేకపోవడమే. అదే గనక ఉంటే ప్రతి ముస్లిం కొత్తగా ఎదురయ్యే



సమస్యల విషయంలో ధర్మపరమైన ‘స్కేలు’ను ఉపయోగించి నిజాయితీ దృష్టితో ఆలోచించడానికి అలవాటు పడ్తాడు. ఎల్లప్పుడూ న్యాయానికి, ధర్మానికే కట్టుబడి ఉంటాడు. ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిశీలించి, తన అంతరాత్మకు ఏది సముచితమని అన్పిస్తుందో దాన్నే ఆచరించడానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ సత్యంతో సహకరించే సాహసం చేయలేని పక్షంలో కనీసం అసత్యాన్ని సమర్థించకుండానైనా ఉండగలుగుతాడు.

అంతరాత్మ ప్రబోధనం గురించి ఒక హదీసులో ఇలా ఉంది: “ముఫ్తీలు నీకు ఫత్వా (ధార్మిక తీర్పు) ఇచ్చినప్పటికీ నీవు నీ అంతరాత్మ దగ్గర ఫత్వా తీసుకో.” (బుఖారి చరిత్ర, అహ్మద్, దారిమి, తబ్రాని)

ఒక విషయం సముచితమయిందని, ధర్మయుక్తమయిందని ముఫ్తీ తీర్పు ఇవ్వవచ్చు. కాని ఆ తీర్పు పట్ల మన అంతరంగానికి సంతృప్తి కలగకపోతే దాన్ని అనుసరించడం మనకు మంచిది కాదు. మరొక హదీసులో ఇలా వచ్చింది: “ఏదయిన విషయం గురించి మీ అంతరంగం సందిగ్ధంలో పడిపోతే దాన్ని (ఆచరించడం) మానేయండి.” (మిష్కాత్)

ఈనాడు అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఒక వ్యక్తి ఎలాంటి తప్పుడు విషయంతో ఉద్యమించినా అతని చుట్టూ స్వప్రయోజనాపరులు కొందరైనా గుమిగూడుతారు. ఆ విధంగా ఈ ఉపద్రవాగ్నికి సమిధలు లభిస్తూ, అది ముస్లిం సమాజంలో నిరంతరం ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. చాలామంది పైకి ఎంతో మంచి వారుగా, నిజాయితీపరులుగా కన్పిస్తారు. కాని వారు ఏదో ఒక “వ్యక్తిత్వం” వలలో చిక్కుకొని అసత్యానికి తోడ్పడుతూ ఉంటారు.

కేవలం “వ్యక్తిత్వాన్ని” గౌరవిస్తూ, మనిషి ఒక విషయం అధర్మమయినదని భావిస్తూ కూడా దాని వెంటపడుతున్నాడంటే ఇంతకంటే ఘోరమైన ‘షిర్క్’ మరేదైనా ఉంటుందా? చాలామంది ముస్లింలు తాము దైవానికి భయపడుతున్నామని చెప్పుకుంటారు. కాని తమ దైనందిన జీవితంలో దైవానుగ్రహానికి గొనిపోయే అనేక పనులకు పాల్పడుతుంటారు. అంటే వారు దైవానికి భయపడవలసిన విధంగా భయపడటం లేదన్న మాట.

నిజమైన దైవభీతి కలిగివుంటూ నేడు ముస్లింలు నిజాయితీతో తమ బాధ్యతలను గ్రహిస్తే ఇస్లామీయ సంస్థలు, సంఘాలు, మిల్లత్‌కు సంబంధించిన ఇతర వ్యవహారాల విషయంలో సత్యాన్ని సమర్థిస్తూ ఉంటే వారిని పట్టిపీడిస్తున్న అనైక్యతా అలజడులు సగానికి పైగా అంతమవుతాయి. ఇతరులకు నాయకత్వాలను కట్టబెట్టే వారిని అధికారాసనాలపై అధిరోహింపజేసే కార్యకలాపాలకు తోడ్పడి మనం మన పరలోకాన్ని చేజేతులా నాశనం చేసుకోవడం ఎంత మూర్ఖత్వం!

ఇలాంటివారినే ఎత్తి చూపిస్తూ దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఇతరుల ప్రపంచం కోసం తన పరలోకాన్ని అమ్ముకున్నవాడే తుది దినాన (తీర్పు దినాన) అందరికంటే ఎక్కువ పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు." (ఫైజుల్ ఖదీర్)

"మా పెద్దలు, పూర్వీకులు ఈ విషయాన్నే మాకు నేర్పారు" అనే సమాధానం పరలోక న్యాయస్థానంలో సరయి సమాధానం కాజాలదు. సత్యాన్ని, యదార్థాన్ని పొందడానికి ఇతర మార్గాలు అందుబాటులో ఉన్నప్పటికీ, మనస్సుకు తృప్తి కలగక పోయినప్పటికీ కేవలం వర్గతత్వం, వ్యక్తుల పట్ల విశ్వాస గౌరవాలు లేదా ఏవైనా ప్రాపంచిన ప్రయోజనాల కారణాన అధర్మానికి పెనవేసుకుపోతే పర్యవసానం అతి భయంకరంగా ఉంటుంది.

"ఆరోజు వారి ముఖాలను వెనక్కి తిప్పివేసి అగ్నిలో వేయడం జరుగుతుంది. అప్పుడు వారు (తీవ్రంగా పశ్చాత్తాపపడుతూ) 'అయ్యయ్యో! మనం దేవునికి, దైవప్రవక్త కు విధేయులయివుంటే ఎంత బాగుండేది!' అనంటారు. (ఆ తర్వాత వారు దేవుణ్ని మొర పెట్టుకుంటూ) 'ప్రభూ! మేము మా నాయకులు, పెద్దలు చెప్పిన మాటలు విని, వారిని అనుసరించాము. వారు మమ్మల్ని అపమార్గం పట్టించారు. ప్రభూ! వారికి రెట్టింపు శిక్ష విధించు. వారిని తీవ్రంగా శపించు' అని అంటారు." (ఖుర్‌ఆన్-33:66-68)

# 31. ఖుర్‌ఆన్ సిఫారసు

దివ్యఖుర్‌ఆన్ కేవలం పారాయణం చేయడానికి మాత్రమే అవతరించలేదు. ఖుర్‌ఆన్‌ని దైవప్రోక్త గ్రంథమని విశ్వసించిన ప్రతి ముస్లిం దాన్ని ఎల్లప్పుడూ అర్థం చేసుకుంటూ చదువుతూ, దాని ప్రకారం ఆచరిస్తుండాలి. అప్పుడే అది మనకు ఇహ లోకంలోనూ, పరలోకంలోనూ ప్రయోజనకారి అవుతుంది. సమాధిలో కూడా అది మనకు ప్రయోజనం చేరూర్చుతుంది.

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: రాత్రివేళ మీరు నమాజ్ చేయడానికి నిలబడి నప్పుడు ఖుర్‌ఆన్‌ని బిగ్గరగా పఠించండి. (ఆ శబ్దం విని షైతానులు, దుర్మార్గపు భూతాలు పారిపోతాయి. గాలిలో (తేలియాడుతూ) వచ్చే పోయే దైవదూతలు కూడా ఆ శబ్దం వింటారు. ఇంట్లో ఉన్నవారు కూడా విని మీతోపాటు నమాజ్ చేస్తారు. ఈరాత్రి వచ్చే రాత్రికి హితోపదేశం చేస్తూ "ఇతని చివరిరాత్రీ! నీవితనికి సౌలభ్యం కలిగించు" అంటుంది.

విశ్వాసి చనిపోయినప్పుడు ఖుర్‌ఆన్ వచ్చి అతని తలవైపు నిలబడి (శవ) స్నానాన్ని పర్యవేక్షిస్తుంది. అతనికి వస్త్రసంస్కారం జరిగిన తరువాత అతని వస్త్రాలకు, వక్షస్థలానికి మధ్య దూరుతుంది. ఆ దాసుడ్ని ఖననం చేసిన తరువాత సమాధిలో పరీక్షదూతలు (మున్కిర్, నకీర్) వచ్చినప్పుడు ఖుర్‌ఆన్ మృతుడికి, పరీక్ష దూతలకు మధ్య వచ్చి



నిలబడుతుంది. పరీక్షదూతలు ఖుర్‌ఆన్‌తో "నీవు మా మధ్య నుండి తొలుగు. మేము ఇతడ్ని ప్రశ్నించాలి" అంటారు.

దానికి ఖుర్‌ఆన్ "దైవసాక్షి! నేనితడ్ని స్వర్గంలో ప్రవేశింపజేయించే వరకూ వదలిపెట్టి పోలేను. మీరితని పట్ల ఏదైనా వ్యవహారం జరపాలని దైవాజ్ఞ లభిస్తే మీపని మీరు చేసుకోండి" అని అంటుంది.

ఆ తరువాత పరీక్షదూతలు ఆ దాసునికి కొన్ని ప్రశ్నలు అడుగుతారు. ఖుర్‌ఆన్ అతని వైపు చూస్తూ "నేనెవరో నీకు తెలుసా?" అని అడుగుతుంది. దానికతను తెలియదు అంటాడు. అప్పుడు ఖుర్‌ఆన్ తనను తాను పరిచయం చేసుకుంటూ "నేను ప్రపంచంలో నిన్ను రాత్రివేళల్లో మేల్కొని ఉండేలా, పగటి వేళల్లో ఆకలి దప్పులతో ఉండేలా చేసిన ఖుర్‌ఆన్‌ని. కళ్ళు, చెవులకు సంబంధించిన చెడులకు నిన్ను దూరంగా ఉంచిన ఖుర్‌ఆన్‌ని. ఇప్పుడు నేను నీ శ్రేయస్సు కోరే స్నేహితుడ్ని, ఉత్తమ సోదరుడ్ని. కనుక సంతోషించు. పరీక్షదూతల విచారణ తరువాత ఇక నీకెలాంటి దుఃఖం ఉండదు" అని చెబుతుంది.

పరీక్షదూతలు విచారణ జరిపిన తరువాత వెళ్ళిపోతారు.

అప్పుడు ఖుర్‌ఆన్ కూడా తన ప్రభువు దగ్గరకు వెళ్ళిపోతుంది. వెళ్ళి సమాధిలోని ఆ దాసుని కోసం పడక ఇప్పించమని అభ్యర్థిస్తుంది. దానికి పడక, జ్యోతిర్మయ దీపం ఇవ్వమని దేవుడు ఆజ్ఞాపిస్తాడు. ఆ వస్తువుల్ని డెబ్భయివేల మంది దైవసన్నిహితులయిన దూతలు తీసుకొని వెళ్తారు. దివ్యఖుర్‌ఆన్ వారికి ముందుగానే సమాధిలో ఉన్న ఆ దాసుని దగ్గరకు చేరుకొని "దైవదాసుడా! నేను వెళ్ళిపోయిన తరువాత నీకేమీ భయాందోళనలు కలగలేదు కదా? నేను నీ కోసం పడక ఏర్పాటు చేయించడానికి దేవుని దగ్గరకు వెళ్ళాను. అందుకే కాస్సేపు నీ నుండి నేను వేరుకావలసి వచ్చింది. ఇప్పుడు నేనా వస్తువులు తీసుకొచ్చాను" అని అంటుంది.

అంతలో దైవదూతలు ఆ వస్తువులు తీసుకొచ్చి అతనికి పడక ఏర్పాటుచేస్తారు. తర్వాత వారతడ్ని కుడిపక్కకు తిప్పి పడుకోబెట్టి ఆకాశంలోకి అధిరోహించడం ప్రారంభిస్తారు. దాసుడు వారిని చూస్తుంటాడు. ఖుర్‌ఆన్ ఖిబ్లా వైపున్న నేల మీద ఓ దెబ్బ వేస్తుంది. దాంతో సమాధి కనుచూపు మేరకు విశాలమవుతుంది. (ఇబ్నె అబిద్దున్యా)

దైవప్రవక్త (సల్లం) ఒక హదీసులో ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన దివ్య ఖుర్‌ఆన్, దాని ప్రకారం ఆచరించినవారు తీసుకురాబడతారు. వారి ముందు ముందు బఖరా, అలిఇమ్రాన్ ( సూరాలు నడుస్తూ) ఉంటాయి. ఇవి ఎంతో ప్రకాశవంతమైన రెండు మేఘాల రూపంలో ఉంటాయి. లేదా రెక్కలు విచ్చుకున్న పక్షుల గుంపుల రూపంలో ఉంటాయి. ఇలా ఈ రెండు సూరాలు వచ్చి తమను పఠించినవారి కోసం ఎంతగానో సిఫారసు చేస్తాయి." (ముస్లిం)

# 32. పాఠ్యగ్రంథం పట్ల విశ్వాసుల ప్రవర్తన

"వారు తమ ఖుర్‌ఆన్‌ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారు. ప్రవక్తా! నీ ప్రభువు సాక్షి! (వారి కర్మల్ని గురించి ప్రళయదినాన) మీరేమి చేస్తుండేవారని మేము వారిని తప్పకుండా ప్రశ్నిస్తాము." (ఖుర్‌ఆన్-15:91-93)

ఖుర్‌ఆన్ అంటే పఠించబడేదని, పఠనగ్రంథమని అర్థం. మరోమాటలో చెప్పాలంటే నిత్య పఠనానికి, దాని ప్రకారం ఆచరించడానికి ఇవ్వబడిన పాఠ్యగ్రంథం అన్న మాట. ఈవిధంగా దావూద్ ప్రవక్త (అలై)పై అవతరించిన జబ్బూర్, మూసాప్రవక్త (అలై)పై అవతరించిన తౌరాత్, ఈసా ప్రవక్త (అలై)పై అవతరించిన ఇన్జీల్ గ్రంథాలు కూడా ఆయా కాలాల ప్రజలు పఠించడానికి, ఆచరించడానికి పంపబడిన ఖుర్‌ఆన్‌లే. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)పై అవతరించిన ఖుర్‌ఆన్ ఈనాటి ప్రజలు పఠించడానికి, ఆచరించడానికి పంపబడిన కలియుగ పాఠ్యగ్రంథం.

యూదులు తౌరాత్‌లో ఇచ్చిన ఆజ్ఞలలో కొన్నిటిని విశ్వసించి, మరి కొన్నిటిని తిరస్కరించారు (2:85). అందువల్ల వారు తమ ఖుర్‌ఆన్‌ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారని దేవుడు ఈ సూక్తిలో తెలియజేస్తూ "మీరు కూడా యూదుల వైఖరి అవలంబించి నా ఆగ్రహానికి గురికాకండ"ని ముస్లింలను హెచ్చరిస్తున్నాడు.

"మీరు ఖుర్‌ఆన్ పఠించడానికి ఉపక్రమించినప్పుడు శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి దేవుడ్ని శరణు వేడుకోండి. విశ్వప్రభువును నమ్ముకున్న విశ్వాసులపై వాడి పాచిక పారదు. వాడ్ని సంరక్షకుడిగా చేసుకొని (వాడు ఆడించినట్లు ఆడుతూ) మిథ్యాదైవాల్ని ఆరాధించేవారిపై మాత్రమే వాడి ఆటలు సాగుతాయి." (ఖుర్‌ఆన్-16:98-100)

"(కనుక) మీ ముందు ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి దాన్ని శ్రద్ధగా వినండి, మీరు కరుణించబడతారు." (ఖుర్‌ఆన్-7:204)

"ఏమైనప్పటికీ నీవు మటుకు దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపబడిన ఈ గ్రంథాన్ని దృఢంగా పట్టుకో. నిస్సందేహంగా నీవు సన్మార్గంలో ఉన్నావు. ఈగ్రంథం నీకు, నీజాతి ప్రజలకు గొప్ప హితకారిణి. త్వరలోనే మీరంతా దీని విషయమయి (దేవుని సమక్షంలో) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది." (ఖుర్‌ఆన్-43:44)

ఖుర్‌ఆన్ విషయంలో దేవుని ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని పైసూక్తి ముస్లింలను హెచ్చరిస్తోంది. మరి నేటి ముస్లింలు దేవునికి ఏం సమాధానం చెప్పుకుంటారు? "మేము ఖుర్‌ఆన్ పఠిస్తూనే ఉండేవాళ్ళం కదా!" అని సమాధానం చెబుతారా? "అయితే దాని ప్రకారం మీరెందుకు ఆచరించలేదు?" అనే మరోప్రశ్న ఎదురవుతుంది. దానికి ఏమని సమాధానమిస్తారు? "ఖుర్‌ఆన్‌భాష మాకు తెలియదు. అందువల్ల మేము దాని ప్రకారం ఆచరించలేకపోయాం" అని సమాధానమిస్తారా? "ఖుర్‌ఆన్‌భాష ఎందుకు నేర్చుకోలేదు లేదా మీకు తెలిసిన భాషలో దాని అనువాదం



మీరు ఎందుకు చదవలేదు?" అనే వేరొక ప్రశ్న కూడా ఎదురుకావచ్చు.

ముస్లింలు ఖుర్‌ఆన్‌ని విశ్వసించామని చెప్పుకుంటారు. ఖుర్‌ఆన్‌ని విశ్వసించడమంటే ఏమిటి? దాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం చేసి కళ్ళకద్దుకోవడమేనా? కాదు. ఖుర్‌ఆన్‌ని విశ్వసించడమంటే మన దైనందిన జీవితంలో దాని బోధనలు అమలు పరచాలి; అది ఆదేశించిన విషయాల్ని ఆచరించాలి; అది నిషేధించిన విషయాల్ని మానెయ్యాలి. ఈ విషయం గురించే దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరు ఖుర్‌ఆన్ నిషేధించిన విషయాలను ధర్మసమ్మతం చేసుకున్నాడో అతను నిజానికి ఖుర్‌ఆన్‌ని విశ్వసించనే లేదు." (తిర్మిజి)

"ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేస్తూ దానిప్రకారం ఆచరించే విశ్వాసి (ఒక విధమైన) నారింజ పండు లాంటివాడు. ఖుర్‌ఆన్ చదవకుండా కేవలం దాని ప్రకారం ఆచరించే విశ్వాసి ఖర్జూర పండు లాంటివాడు." (ముత్తఫకున్ అలై)

"ఎవరు ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేస్తూ దాని ప్రకారం ఆచరిస్తాడో ప్రళయ దినాన అతని తల్లిదండ్రులకు ధగధగ మెరిసిపోయే ఒక కిరీటం ధరించడం జరుగుతుంది. సూర్యుడు సైతం మీ ఇండ్లలోకి దిగివచ్చినా దాని కాంతి ముందు సూర్యుని కాంతి వెలవెల పోతుంది. ఖుర్‌ఆన్ ప్రకారం నడచుకునే మనిషికి దేవుడు ఏమేమి వరాలు ప్రసాదిస్తాడో మీకేమైనా తెలుసా?" (అహ్మద్, అబూదావూద్)

ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ పఠిస్తున్నప్పుడే అందులోని బోధనలను ఆచరించడానికి వీలవుతుంది. రోజుకు ఐదుసార్లు నమాజ్ చేయాలని ఇవ్వబడిన దైవాజ్ఞ వెనుక 'నమాజులో మనం పఠించే సూక్తుల్ని ఆచరణలో పెట్టాలన్న' లక్ష్యమే ఉంది. ఈలక్ష్యం ఉండటం వల్లనే "నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది." అని ఖుర్‌ఆన్ పేర్కొంటున్నది. (29:45)

నమాజులో పఠించే ఖుర్‌ఆన్ సూక్తులు అర్థం చేసుకున్నప్పుడే నమాజ్ మనల్ని చెడులు, అశ్లీలచేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది. ఖుర్‌ఆన్ భాష అర్థంకానప్పుడు వేరే సమయంలో దాని అనువాదాన్ని మనకు తెలిసిన భాషలోనైనా చదువుకోవాలి. ఇలా ఒక విషయాన్ని మాటిమాటికి చదవడంవల్ల అది మనల్ని ఆచరణ వైపు ప్రేరేపిస్తుందని ఆశించగలం. ఈపనే నేటి ముస్లింలు అనేకమంది చేయడంలేదు.

ఖుర్‌ఆన్ అసలు లక్ష్యాన్ని విస్మరించి కొందరు దాని సమక్షంలో హదీసుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొందరు ఫిఖా విషయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇంకా కొందరైతే ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాలను వదలిపెట్టి కొన్ని ఖుర్‌ఆన్ సూక్తులు, కొన్ని హదీసు ఉల్లేఖనాలతో కూడిన ఒక పుస్తకాన్ని పట్టుకొని "ఇందులోనే అన్నీ ఉన్నాయి. ఇక వేరే ఖుర్‌ఆన్, హదీసులు చదవనవసరం లేదు" అంటున్నారు. వారి బోధకులు, ప్రచారకులు ప్రజలకు వాటినే బోధిస్తున్నారు, ప్రచారం చేస్తున్నారు.

ఈ కారణాలలాగనే చాలామంది ముస్లింలు రోజుకు అయిదు పూటలా నమాజ్ చేస్తున్నప్పటికీ అబద్ధమాడటం, వాగ్దానభంగం చేయడం, మోసగించడం, ఇతరుల హక్కుల్ని కొల్లగొట్టడం, మంచివాళ్ళపై అపనిందలు మోపడం, వడ్డీ వ్యవహారాలు నడపడం, కుమార్తెలకు ఆస్తివాటాలు ఎగవేయడం, లక్షల రూపాయల కట్నాలు గుంజడం, నిషిద్ధవస్తువుల వ్యాపారం చేయడం, బలహీనుల్ని దోచుకోవడం, పర స్త్రీలను తదేకంగా చూడటం, వెకిలి చేష్టలకు పాల్పడటం మానుకోలేక పోతున్నారు. ఇలాంటి ముస్లింలు చేసే నమాజ్‌ని దేవుడు ఎలా స్వీకరిస్తాడు?

వీటన్నిటికి పరిష్కారం రెగ్యులర్‌గా ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేయడమే. ఖుర్‌ఆన్ అధ్యయనమే మానేస్తే ఇక దేవునికి, దాసునికి మధ్య సంబంధం ఏముంటుంది? ఇలాంటి మనిషికి సమాధిలో ఖుర్‌ఆన్ సహాయపడుతుందని చెప్పగలమా? అతని మోక్షం కోసం ఖుర్‌ఆన్ దేవుని దగ్గర సిఫారసు చేస్తుందని ఆశించగలమా? ఇస్లాం వ్యతిరేక శక్తులు ముస్లింలను ఖుర్‌ఆన్‌కు దూరంగా ఉంచడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రకరకాల కుట్రలు పన్నుతున్న ఈనాటి కాలంలో ముస్లింలు తీవ్రంగా ఆలోచించవలసిన విషయమిది.

ఖుర్‌ఆన్ ఔన్నత్యం గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు ఈ గ్రంథం ద్వారా కొందరిని పైకి తెస్తాడు; మరికొందరిని అణగ ద్రొక్కుతాడు." (ముస్లిం).

పండితుల వ్యాఖ్యానం ప్రకారం ఖుర్‌ఆన్ బోధనలను సర్వసామాన్యం చేయ డానికి అవిశ్రాంత పోరాటం జరిపేవారిని దేవుడు ప్రగతి శిఖరాలకు చేర్చుతాడు. వారు ఇహలోకంలోనూ సఫలమవుతారు; పరలోకంలోనూ సఫలమవుతారు. దీనికి భిన్నంగా ఖుర్‌ఆన్‌ని దగ్గర పెట్టుకొని దానిప్రకారం ఆచరించకుండా, పైగా దానికి వ్యతిరేకంగా వ్యవహరించేవారికి ఇహలోకంలోనూ అపజయమే, పరలోకంలోనూ అపజయమే.

మహాప్రవక్త (సల్లం) ఉపదేశించి ఈ క్రింది మహితోక్తులు కూడా చూడండి:

"ఖుర్‌ఆన్ కలిగివున్న ప్రజలారా! ఖుర్‌ఆన్‌ని తలగడగా చేసుకోకండి. దాన్ని పఠించవలసిన విధంగా పఠిస్తూ ఉండండి. రేయింబవళ్ళూ పఠిస్తూ ఉండండి. దాన్ని బహిరంగంగా పఠించండి. మంచి స్వరంతో పఠించండి. అందులోని విషయాలను పరిశీలించండి, ఆలోచించండి- తద్వారా మీరు సాఫల్యభాగ్యం పొందగలరని ఆశించ గలుగుతారు. దాని ప్రతిఫలం పరలోకంలో తప్పకుండా లభిస్తుంది. అందువల్ల ప్రపం చంలో దాని ప్రతిఫలం పొందడానికి ప్రయత్నించకండి." (బైహఖీ)

"దేవుడు స్వయంగా ఇలా సెలవిస్తున్నాడు: ఏ వ్యక్తిని ఖుర్‌ఆన్ నన్ను స్మరించ లేనంతగా, వేడుకొనలేనంతగా ధార్మిక కార్యకలాపాల్లో నిమగ్నం చేస్తుందో నేనతనికి దుఆ చేసేవారికిచ్చేటటువంటి అత్యంత శ్రేష్ఠమైన వస్తువు ప్రసాదిస్తాను." (తిర్మిజి)



# 33. నీతికి నెలవు నమాజే

ధర్మానికి ఆధారం విశ్వాసం అయితే, విశ్వాసానికి దర్పణం ఆచరణ అవుతుంది. ఆచరణ ద్వారానే విశ్వాసం బహిర్గతమవుతుంది. దేవుణ్ణి, ఆయన ప్రవక్త (సల్లం)ను విశ్వసించామని చెప్పుకునే ముస్లింలు దేవుని ఆజ్ఞలను, ఆయన ప్రవక్త ప్రవచనాలను పాటిస్తున్నప్పుడే వారి విశ్వాసానికి గుర్తింపు లభిస్తుంది. ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో విశ్వాసం తర్వాత నమాజ్ అగ్రస్థానం వహిస్తుంది. అలాంటి నమాజ్‌నే పాటించకపోతే దేవుని దగ్గర ముస్లింల విశ్వాసానికి ఇక విలువ ఏముంటుంది?

ఒక వ్యక్తి దేవుణ్ణి, దైవప్రవక్త (స)ను విశ్వసించానని ప్రకటించిన తర్వాత అతని విశ్వాస ప్రకటనకు ఎదురయ్యే మొట్టమొదటి పరీక్ష నమాజే. మస్జిద్ నుంచి అజాన్ పిలుపు వినగానే అతను తన విశ్వాస ప్రకటనను నిరూపించుకోవడానికి మస్జిద్‌కు పరుగెత్తి తోటిముస్లింలతో కలసి సామూహిక నమాజ్ చేయవలసి ఉంటుంది.

నమాజ్ ఇస్లాం ధర్మాన్ని విశ్వసించిన ప్రతి ముస్లిం స్త్రీ, పురుషుడు రోజుకు అయిదుసార్లు తప్పనిసరిగా నిర్వహించవలసిన అతి ముఖ్యమయిన విధి. దివ్య ఖుర్‌ఆన్‌లోని మొదటి అధ్యాయం (సూరా)లో విశ్వాసులు "దేవా! మేము నిన్నే ఆరాధిస్తాము, నీ సహాయమే అర్థిస్తాము" అని వేడుకోవాలని ఉంది. ఈ వేడుకోలుకు చక్కని క్రియాత్మక రూపమే నమాజ్. అదే అధ్యాయంలో జీవిత సాఫల్యం కొరకు తమకు రుజుమార్గం చూపమని విశ్వాసులు అర్థిస్తే, దానికి సమాధానంగా మొత్తం ఖుర్‌ఆన్ ఆజ్ఞలను వారి ముందు పెట్టడం జరిగింది. ఈ ఆజ్ఞలలో 'అతీంద్రియ విషయాల పట్ల విశ్వాసం' తరువాత అతిముఖ్యమయిన మొదటి ఆజ్ఞ నమాజే అని ఆ తరువాయి అధ్యాయంలో తెలియజేయబడింది.

"అలిఫ్-లామ్-మీమ్. ఇది ఎలాంటి సందేహానికి ఆస్కారంలేని (దైవదత్త) గ్రంథం. ఈ గ్రంథం భయభక్తులు కలవారికి రుజుమార్గం చూపుతుంది. వారు అగోచరాలు, అతీంద్రియాలను విశ్వసిస్తారు; నమాజ్‌ను స్థాపిస్తారు; మేము ప్రసాదించిన సంపద నుండి (మామార్గంలో) ఖర్చుపెడతారు; నీపై అవతరించిన ఈ గ్రంథాన్ని, నీకు పూర్వం గతప్రవక్తలపై అవతరించిన గ్రంథాలను విశ్వసిస్తారు. అదీగాక వారు పరలోకాన్ని కూడా విశ్వసిస్తారు. అలాంటి దైవభీతిపరులే తమ ప్రభువు నుండి వచ్చిన రుజుమార్గంలో నడిచేవారు. అలాంటి వారే సాఫల్యం చెందేవారు; మోక్షం పొందేవారు." (2:1-5)

దేవుడు తన గ్రంథంలో ఒక చోట విశ్వాసులు పరిస్థితిని వివరిస్తూ, "ఎవరు పరలోకాన్ని, ఖుర్‌ఆన్‌ని విశ్వసిస్తారో వారే నమాజ్‌ని పాటిస్తారు" అని పేర్కొన్నాడు.

ఖుర్‌ఆన్‌లో మరోచోట విశ్వప్రభువు ఇలా ఆదేశిస్తున్నాడు: "నిస్సందేహంగా నేనే దేవుణ్ణి. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి (మానవుడా!) నీవు నన్నే ఆరాధించు. నా జ్ఞాపకార్థం నమాజ్‌ని స్థాపించు." (20:14)

"విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య వారిద్దరినీ వేరుచేసే హద్దు నమాజే" అని దైవప్రవక్త సెలవిచ్చారు. (ముస్లిం)- ముస్లిం అని చెప్పుకునే వ్యక్తి ఈ నమాజ్‌నే వదిలేస్తే ఇక అతనికి, ఇతరులకు ఎలాంటి తేడా లేదని ఈ హదీసు తెలియజేస్తోంది.

"వారు (నరకంలోని) పాపాత్ముల్ని చూసి 'మిమ్మల్ని ఏ విషయం నరకంలో పడవేసింది?' అని అడుగుతారు. దానికి పాపాత్ములు ఇలా సమాధానమిస్తారు: 'మేము నమాజు చేసేవారిలో చేరలేదు. పేదలకు అన్న దానం చేసేవారం కాము. సత్యతిరస్కారులతో కలసి మేమూ (సత్యాన్ని) తిరస్కరిస్తుండే వాళ్ళము. తీర్పుదినాన్ని అసత్య విషయమని ఖండిస్తూ ఉండేవాళ్ళము. ఈ స్థితిలోనే చివరికి అనివార్య విషయం (మృత్యువు) మా ముందుకు వచ్చింది." (ఖుర్ఆన్-74:40-47)

"నమాజ్ చేయనివాడికి నమాజ్ (ప్రళయదినాన) వెలుగు నివ్వడంగాని, ప్రమాణంగా నిలవడంగాని, మోక్షప్రదాయని కావడంగాని జరగదు" అన్నారు దైవప్రవక్త (సల్లం). (అహ్మద్, దారిమి)

రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఓసారి తన క్రింది అధికారులకు ఒక సర్క్యులర్ జారీచేస్తూ, అందులో నమాజ్ ప్రాముఖ్యాన్ని గురించే ఇలా తాకీదు చేశారు:

"అసలు నా దృష్టిలో మీ సమస్యలన్నిటిలోకెల్లా అతి ముఖ్యమయిన సమస్య నమాజే. నమాజ్‌ని కాపాడే మనిషి యావత్తు ధర్మాన్నే కాపాడిన వాడవుతాడు. దీనికి భిన్నంగా నమాజ్‌ని వ్యర్థపరచినవాడు మిగతా ధర్మాన్ని (ఇతర దైవాజ్ఞలను) అంతకంటే ఎక్కువ వ్యర్థపరచిన వాడవుతాడు." (మిష్కాత్)

నమాజ్ మనిషిలో మంచిని పెంచి చెడులను పారద్రోలుతుంది. అతడ్ని జీవితపు అన్ని రంగాలలోనూ నీతిమంతుడిగా, నిజాయితీపరుడిగా తీర్చిదిద్దుతుంది. స్వయంగా ఖుర్ఆన్‌లో ఒకచోట "నమాజ్ తప్పనిసరిగా అశ్లీల చేష్టల నుండి, చెడు పనుల నుండి (మనిషిని) నిరోధిస్తుంది." (29:45) అని పేర్కొన్నది.

"మనిషి చేసే నమాజ్ అతడ్ని అశ్లీల చేష్టల నుండి నిరోధించకపోతే అతని నమాజ్ నమాజే కానేరదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).... (ముస్లిం)

"ఒక వ్యక్తి చేసే నమాజ్ అతడ్ని అశ్లీల చేష్టల నుండి, చెడ్డపనుల నుండి నిరోధించకపోతే, అతని నమాజ్ అతడ్ని దేవునికి మరింత దూరం చేస్తుంది." (తబ్రాని)

ఇమాం జాఫర్ సాధిఖ్ (రహ్మాలై) ఇలా ప్రవచిస్తున్నారు: "ఎవరయినా తన నమాజ్ దేవుని సన్నిధిలో స్వీకరించబడిందా లేదా అని తెలుసుకోదలిస్తే, తన నమాజ్ తనను అశ్లీల చేష్టల నుండి, చెడు పనుల నుండి ఏ మేరకు నిరోధించ గలిగిందో అతను చూసుకోవాలి. నమాజ్ నిరోధించే చెడులను గనక అతను మానుకున్నట్లయితే అతని నమాజ్ స్వీకరించబడినట్లే." (రూహుల్ మాని)



ముస్లింలు రోజుకు ఐదు సార్లు విధిగా నమాజ్ చేయాలని దేవుడు ఆజ్ఞాపించాడు. ఈ నమాజులను నిర్ణీత వేళల్లో, నిర్దేశించబడిన రీతుల ప్రకారమే చేయాలని కూడా ఆదేశించాడు. అంతేగాని మన ఇష్టమొచ్చిన వేళకు, ఇష్టమొచ్చిన విధంగా చేయడానికి వీల్లేదు. పైగా దేవునిపట్ల ఎంతో వినయ విధేయతలతో, భయభక్తులతో, ఏకాగ్రతతో, స్థిమితంగా, ప్రశాంత హృదయంతో చేయాలి.

"నేను ఏ విధంగా నమాజ్ చేస్తున్నానో మీరు అదేవిధంగా నమాజ్ చేయండి." "ఎవరైతే ఐదువేళల నమాజుల్ని కాపాడుతాడో, సరైనరీతిలో రుకూ చేస్తాడో, సక్రమమైన పద్ధతిలో సజ్దా చేస్తాడో, నమాజ్ వేళల్ని పాటిస్తాడో, నమాజ్ దైవం నిర్ణయించిన విధి అని విశ్వసించాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు." అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఒకసారి దైవప్రవక్త (సల్లం) ఒక వ్యక్తిని నమాజ్ చేస్తుండగా చూశారు. ఆ వ్యక్తి రుకూ సరిగా చేయడం లేదు, సజ్దా కూడా సరిగా చేయడం లేదు. అలా నమాజ్ చేసి వస్తుంటే అతడ్ని చూసి దైవప్రవక్త (సల్లం) "నువ్వు నమాజ్ సరిగా చేయలేదు. పోయి మళ్ళీ నమాజు చెయ్యి" అని ఆదేశించారు. ఆ వ్యక్తి వాపసుపోయి మళ్ళీ నమాజు చేశాడు. కాని దైవప్రవక్త (సల్లం) తిరిగి అదేవిధంగా ఆదేశించారు. ఇలా మూడుసార్లు జరిగింది. ఆ తర్వాత అతను దైవప్రవక్త (స)తో "మీకు సత్యాన్నిచ్చి పంపిన దేవుని సాక్షి! నేను ఇంతకంటే బాగా నమాజ్ చేయలేను. ఎలా చెయ్యాలో మీరే నేర్పండి నాకు" అని అన్నాడు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా వివరించారు:

"నువ్వు నమాజ్ చేయడానికి నిలబడినప్పుడు మొదట 'అల్లాహు అక్బర్' అని చెప్పు. తరువాత ఖుర్ఆన్‌ని పఠించగలిగినంత పఠించు, తరువాత 'రుకూ'లోకి వెళ్ళు. రుకూలో నింపాదిగా, రుకూ చేయగలిగినంత సేపు ఉండు, తరువాత రుకూ నుండి నిటారుగా లేచి నిలబడు. ఆ తర్వాత సజ్దా (స్థితి)లోకి వెళ్ళు, సజ్దాలో స్థిమితంగా సజ్దా చేయగలిగినంత సేపు ఉండు, ఆపై సజ్దా నుండి లేచి నిటారుగా, నింపాదిగా కూర్చో. ఇలా నీ మొత్తం నమాజ్‌ని స్థిమితంగా, నింపాదిగా చెయ్యి." (బుఖారి, ముస్లిం)

ఈవిధంగా చేసే నమాజ్‌నే దేవుడు స్వీకరిస్తాడని ఆశించగలం. స్థిమితంగా, నింపాదిగా చేయని నమాజ్ సరైన నమాజ్ అన్పించుకోదు. ఇలాంటి నమాజ్‌ని గురించే దైవప్రవక్త (స) "నీవు సరిగా నమాజ్ చెయ్యలేదు, సరిగా నమాజ్ చెయ్యి" అన్నారు.

కొందరు రుకూ, సజ్దాలు సరిగా, స్థిమితంగా చేయకుండా నమాజ్‌ని త్వరగా చేసి ముగించివేస్తారు. రుకూ నుండి నిటారుగా లేచి నిలబడకుండానే సజ్దా స్థితిలోకి వెళ్తారు. అలాగే రెండు సజ్దాల మధ్య సరిగా, స్థిమితంగా కూర్చోరు. మొదటి సజ్దా నుండి కాస్తంత తలపైకెత్తి వెంటనే రెండో సజ్దాలోకి పోతారు. వారి నమాజు పరిస్థితి చూస్తే ఎప్పుడు ముగించి వెళ్దామా అనే ధోరణి కనిపిస్తుంది.

ఇలాంటి వ్యక్తిని దైవప్రవక్త (స) పచ్చి దొంగగా అభివర్ణించారు. ఒకసారి ఆయన

రుకూ, సజ్దాలు సరిగా చేయని ఒక వ్యక్తిని చూసి "ఇతను ఇదే స్థితిలో చనిపోతే ఇతని ముగింపు ముస్లిం సమాజంలో జరగదు" అని పలికారు. అంటే అతను ముస్లిమే తరుని స్థితిలో చనిపోతాడని అర్థం.

దైవాజ్ఞలలో నమాజ్‌కు ఉన్నంత ప్రాముఖ్యం మరే ఆజ్ఞకూ లేదు. నమాజ్ ముస్లిం గుర్తింపు. హజ్రత్ ఈసా (అలై) మాటల్లో నమాజ్ మానసిక మందు. నమాజ్ హృదయ కవాటానికి తాళం వంటిది. నమాజ్ విశ్వాసాన్ని కాపాడే ఆయుధం. నమాజ్ మనోవాంఛ లను అదుపులో ఉంచే కళ్ళెం. నమాజే ప్రళయదినాన మనల్ని రక్షిస్తుంది. దేవుడు మన పాపాలను నమాజ్ ద్వారా తుడిచేస్తాడు. హజ్రత్ ఈసా (అలై) ఓసారి తన అను చరులకు ఒక దృష్టాంతంతో నమాజ్ ప్రాముఖ్యం బోధిస్తూ "మూగవాడికి పుట్టుగ్రుడ్డి ముందు ఎలా తన ఉనికిని నిరూపించుకునే శక్తి ఉండదో అలాగే నమాజ్ పాటించని వ్యక్తికి సత్కార్యాలు చేసేవాడిగా తయారయ్యే శక్తి ఉండదు" అని అన్నారు.

నిజం చెప్పాలంటే నమాజ్ మనిషి విశ్వాసానికి గీటురాయి వంటిది. ఇస్లాం పట్ల మన విశ్వాసం ఏస్థాయిలో ఉంటుందో నమాజులో దేవునిపట్ల మన సంబంధం కూడా అదే స్థాయిలో ఉంటుంది. ముస్లింలు నిర్ణీత సమయాల్లో రోజుకు అయిదు సార్లు విధిగా నమాజు చేయవలసి ఉంటుంది. ఇది విశ్వప్రభువు ఆజ్ఞ. దీన్ని నిరాక రించినవాడు అవిశ్వాసి (కాఫిర్) అవుతాడు. నిరాకరించకుండా దాన్ని పాటించనివాడు పరమపాపి అవుతాడు. దానికి పరలోకంలో శిక్ష అనుభవించవలసి వస్తుంది.

కొందరు ముస్లింలు "అమ్మో, రోజుకు అయిదు సార్లే! మావల్ల కాదు బాబూ!" అంటారు. బద్ధకస్తులకు, ప్రాపంచిక ప్రయోజనాలే ధ్యేయంగా పెట్టుకున్నవారికి రోజుకు అయిదు సార్లేమిటీ, ఒక్క సారి నమాజ్ చేయడం కూడా కష్టమే. ఖుర్‌ఆన్ ఇలాంటి వారిని హెచ్చరిస్తూ ఈవిధంగా చెబుతోంది:

"నమాజ్ కాస్త కష్టమైన పనే. సందేహం లేదు. కాని ఒకరోజు తమ ప్రభువును కలుసుకోవలసి ఉందని, ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉందని భావించే దైవభీతి పరులకు మాత్రం నమాజ్ చేయడం కష్టమేమీ కాదు." (2:45,46)

దేవునిపై, పరలోకంపై దృఢవిశ్వాసం ఉంటే, ఈ విశ్వాసం మనిషిని అప్రయత్నంగా ఆచరణ వైపుకు లాక్కెళుతుంది. ఏదో ఒక రోజు దైవానికి తన ముఖం చూపించవలసి ఉంటుందని, ఆయన సన్నిధిలో తన కర్మలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుందని అనుక్షణం అతని అంతరంగం అతనికి నొక్కి చెబుతుంది. అలాంటి వ్యక్తికి ప్రతిరోజు అయిదువేళలా నమాజ్ చేయడం ఏమాత్రం కష్టమైన పని కాజాలదు.

పోతే నమాజు కోసం మహాప్రవక్త (సల్లం) నిర్దేశించిన షరతులన్నిటిని వీలైనంత వరకు పూర్తిగా పాటించడానికి ప్రయత్నించాలి. మన ఆలోచనలను అటూఇటూ పోనీయ కుండా ఏకాగ్రత్తతో నమాజ్ చేయాలి. నమాజ్‌లో మనం పఠించే ఖుర్‌ఆన్ సూక్తుల్ని



జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. అరబీ భాష రానివారు, వేరే సమయాల్లో ఖుర్‌ఆన్ (మూలభాష) పారాయణంతో పాటు, మనకు తెలిసిన భాషలో దాని అనువాదాన్ని ప్రతిరోజూ కొంత సేపు అధ్యయనం చేయడానికి ప్రయత్నించాలి.

**నాకంటి చలువ:-** "నమాజ్ నా కంటి చలువ" అన్నారు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం). ఔను, నమాజే మనకు నిత్యశాంతి చేకూర్చే నిజమైన సాధనం. నీతికి నెలవు కూడా నమాజే. క్రమశిక్షణకు మారుపేరు నమాజ్. నమాజే స్వర్గధామానికి సరైన తాళపుచెవి. పాపాలకు అడ్డుకట్ట కూడా నమాజే.

నమాజులో ఖుర్‌ఆన్ సూక్తులు పఠించాలని, ఖుర్‌ఆన్ అరబీభాషలో ఉంది గనక నమాజులో పఠించే ఖుర్‌ఆన్ సూక్తులు అరబీ భాషలోనే పఠించాలని ఇస్లాంలో ఒక నిబంధన ఉంది. "నమాజులో ఖుర్‌ఆన్ సూక్తుల్ని అరబీ భాషలోనే ఎందుకు పఠించాలి? 'అర్థంకాని చదువు వ్యర్థం' అన్నాడు తెలుగు సోదరుడొకడు. అలాంటిది అరబీభాష రానప్పుడు మనకు తెలిసిన భాషలో ఎందుకు పఠించకూడదు?" ఈ ప్రశ్న నేను లేవనెత్తి లేదు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న నా మిత్రుడు నూర్బాషా రహ్మతుల్లా ఈ ప్రశ్న లేవనెత్తి ముస్లింల ముందు పెద్ద దుమారం లేవదీశాడు.

ఈ ప్రశ్న ఈనాడు కొత్తేమీ కాదు. గతంలో పశ్చిమ దేశాలలో కొత్తగా ఇస్లాం స్వీకరించిన అనేక మంది నవముస్లింలు ఈ ప్రశ్నను లేవనెత్తారు. ముస్లిం ధర్మవేత్తలు దానికి సమాధానాలు కూడా ఇచ్చి ఉన్నారు. దురదృష్టవశాత్తు నమాజ్‌లో ఖుర్‌ఆన్ అనువాదం కూడా చదవవచ్చని ధర్మవేత్తల నుండి అనుమతి లభించి ఉన్నట్లయితే ఈపాటికి ఖుర్‌ఆన్ కూడా అనువాదాలకు అనువాదాలయి, ప్రక్షిప్తాలకు నిక్షిప్తాలకు గురయి బైబిల్‌లా తయారయి ఉండేది.

రోజుకు ఐదు సార్లు చేసే నమాజులో, రమజాన్‌లో చేసే తరావీ నమాజులో మాటిమాటికి ఖుర్‌ఆన్‌సూక్తులు పఠించాలని నిబంధన ఉందంటే దానర్థం అర్థం చేసుకుంటూ పఠించాలనే. అర్థం చేసుకుంటూ పఠిస్తున్నప్పుడే ఖుర్‌ఆన్ ఆజ్ఞల్ని మనం మన జీవిత ఇతర వ్యవహారాల్లో అమలుపరచడానికి వీలుంటుంది. నమాజు లక్ష్యం కూడా ఇదే. ఒకవేళ మనకు అరబీభాష రాకపోతే నమాజ్‌లో దాన్ని మనకు తెలిసిన భాషలో పఠించాలని అర్థం కాదు. అలాంటి పరిస్థితిలో నమాజుకు ముందుగాని, తర్వాతగాని లేదా తీరిక సమయాల్లోగాని మనకు తెలిసిన భాషలో ఖుర్‌ఆన్ అనువాదాన్ని చదువుకోవాలి. అప్పుడే మన నమాజు లక్ష్యం నెరవేరుతుంది.

నమాజులో ఉన్నంత సేపూ మనం విశ్వప్రభువు ముందు నిలబడ్డామన్న ధ్యాస ఉండాలి. ఆయన మనల్ని ఓ కంట గమనిస్తున్నాడని, మన మాటలు వింటున్నాడని, ఆయన మన అంతరంగంలో మెదిలే భావాలను సైతం పసిగట్టగలడని మనం గ్రహించాలి. నమాజులో మన ధ్యాస దేవునిపై లేకపోతే దేవుడు కూడా మనల్ని పట్టించు

కోడు; మనపై తన కారుణ్య కటాక్షాలను ప్రసరింపజేయడు.

ఇస్లాం సామూహికత్వానికి ఎంతో ప్రాధాన్యత నిచ్చింది. కనుక ఫర్జ్ నమాజులను తోటి భక్తులతో కలసి సామూహికంగా చేయాలి. బలమయిన కారణం ఉంటే తప్ప మస్జిద్‌కు పోవడం మానెయ్యకూడదు.

"నా ముందు మోకరిల్లే (రుకూ చేసే)వారితో కలసి మీరూ మోకరిల్లండి." (2:43)

సామూహిక నమాజ్ చేయడం వల్ల లభించే లాభం, దాన్ని విడనాడటం వల్ల జరిగే నష్టం గురించి దైవప్రవక్త (సల్లం) వివిధ సందర్భాలలో వివిధ కోణాల ద్వారా నొక్కి చెప్పారు. ఉదాహరణకు ఈ క్రింది హదీసులు చూడండి:

"ఒంటరిగా చేసే నమాజ్ కంటే సామూహికంగా చేసే నమాజ్ 27 రెట్లు శ్రేష్ఠ మైనది" అని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (బుఖారి, ముస్లిం)

"సామూహిక నమాజ్‌కు లభించే పుణ్యఫలం గురించి ప్రజలకు తెలిసివుంటే వారు ఏ స్థితిలో ఉన్నా సరే సామూహిక నమాజ్ కోసం పరుగులు పెడ్తూ వస్తారు. జమాఅత్‌లోని మొదటి పంక్తి దైవదూతల పంక్తి వంటిది. ఒంటరిగా చేసే నమాజ్ కంటే ఇద్దరు వ్యక్తులతో కూడిన సామూహిక నమాజ్ సైతం ఎంతో మెరుగైనది. నమాజ్ చేసేవారు ఎంతమంది ఎక్కువగా ఉంటే ఆ జమాఅత్ అంతే ఎక్కువ దేవునికి ప్రియమైనది." (జామె తిర్మిజి)

"అజాన్ పిలుపు విని కూడా ఇండ్ల నుంచి బయటికి రానివారిని చూస్తుంటే, నా స్థానంలో ఇమామత్ కోసం ఎవరినైనా నియమించి, నిప్పు తీసుకొని వెళ్ళి వారి ఇళ్ళను తగల బెట్టాలని అన్పిస్తుంది నాకు." (బుఖారి, ముస్లిం)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి ఒక అంధుడు వచ్చి "దైవప్రవక్తా! నేను అంధుణ్ణయినందున సామూహిక నమాజ్‌కు వెళ్ళలేకపోతున్నాను. మరి నాకు సామూహిక నమాజులో పాల్గొనకుండా ఉండే అవకాశం ఏదైనా ఉందంటారా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీకు అజాన్ పిలుపు వినిపిస్తుందా?" అని అడిగారు. అతను వినిపిస్తుందన్నాడు. "అలాగైతే దానికి జవాబుగా నీవు మస్జిద్‌కు హాజరు కావలసిందే. నీకు అనుమతిచ్చే అవకాశమేదీ లేదు" దైవప్రవక్త (స) స్పష్టంగా చెప్పారు.

మరొకసారి ఆయన "ఎలాంటి అవరోధం లేకపోయినా సామూహిక నమాజ్ చేయడానికి రాని మనిషి ఒంటరిగా చేస్తే ఆ నమాజ్ స్వీకరించబడదు" అన్నారు. అనుచరులు ఈమాట విని "అవరోధం అంటే ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవ ప్రవక్త (స) "అవరోధమంటే భయం లేదా ఎదైనా వ్యాధి" అన్నారు. (అబూదావూద్)

ఈ హదీసుల్ని బట్టి సామూహిక నమాజ్ ఎంత ముఖ్యమయినదో అర్థం చేసుకోవచ్చు. కనుక సామూహిక నమాజ్ విషయంలో కూడా మనం ఏ మాత్రం అశ్రద్ధ, అజాగ్రత్త వహించకూడదు.



# 34. పరిశుభ్రత (ఉజూ-గుసుల్)

విశ్వాసికి చిత్తశుద్ధితో పాటు శరీరశుద్ధి కూడా చాల అవసరం. దేవుడు తన వైపుకు మరలేవారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు." (ఖుర్ఆన్-2:222). "పరిశుభ్రత అర్ధ విశ్వాసంతో సమానం" అన్నారు దైవప్రవక్త (సల్లం). విశ్వాసి మూత్రశుద్ధితో మటుకు 24 గంటలూ ఉండాలి.

మన నమాజ్‌లలో ఫరజ్, వాజిబ్ నమాజ్‌ల తర్వాత 'సున్నతె ముఅక్కిదా' నమాజ్ లకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. కనుక ఈ నమాజుల్ని కూడా చేస్తుండాలి. ఆ తర్వాత స్థానం 'సున్నతె గైర్‌ముఅక్కిదా', నఫిల్ నమాజులకు లభిస్తుంది. ఇవి ఐచ్ఛిక (Optional) నమాజులు. అంటే వీటిని చేస్తే పుణ్యం, కాని చేయకపోతే పాపం లేదు.

**ఫరజ్ నమాజ్‌లు:-** ఫజర్ వేళలో 2 రకాతులు, జుహర్ వేళలో 4 రకాతులు, అసర్ వేళలో 4 రకాతులు, మగ్రిబ్ వేళలో 3 రకాతులు, ఇషా వేళలో 4 రకాతులు, శుక్రవారం జుమా వేళలో 2 రకాతులు ఉంటాయి.

**వాజిబ్ నమాజ్‌లు:-** ఇషా వేళలో 3 రకాతులు 'వితర్' నమాజ్, ఈదుల్ ఫితర్ రోజు 2 రకాతులు, ఈదుల్‌అజ్హా రోజు 2 రకాతులు ఉంటాయి.

**సున్నతె ముఅక్కిదా నమాజ్‌లు:-** ఫజర్ వేళలో ఫరజ్ నమాజుకు ముందు 2 రకాతులు, జుహర్ వేళలో ఫరజ్ నమాజుకు ముందు 4 రకాతులు- ఫరజ్ నమాజు తరువాత 2 రకాతులు, మగ్రిబ్ వేళలో ఫరజ్ నమాజు తరువాత 2 రకాతులు, ఇషా వేళలో ఫరజ్ నమాజు తరువాత 2 రకాతులు ఉంటాయి. శుక్రవారం జుమా వేళలో ఖుత్బా (ప్రసంగం)- ఫరజ్ నమాజులకు ముందు 4 రకాతులు- ఫరజ్ నమాజ్ తరువాత 2 రకాతులు ఉంటాయి.

**సున్నతె గైర్‌ముఅక్కిదా నమాజ్‌లు:-** జుహర్ వేళలో ఫరజ్ నమాజ్‌కు ముందు 4 రకాతులు, అసర్ వేళలో ఫరజ్ నమాజ్‌కు ముందు 4 రకాతులు, ఇషా వేళలో ఫరజ్ నమాజ్‌కు ముందు 4 రకాతులు ఉంటాయి.

**నఫిల్ నమాజ్‌లు:-** జుహర్ వేళలో 2 రకాతుల సున్నతె ముఅక్కిదా తరువాత 2 రకాతులు, మగ్రిబ్ వేళలో 2 రకాతుల సున్నతె ముఅక్కిదా తరువాత 2 రకాతులు, ఇషా వేళలో 2 రకాతుల సున్నతె ముఅక్కిదా తరువాత 2 రకాతులు, శుక్రవారం జుమా వేళలో 2 రకాతుల సున్నతె ముఅక్కిదా తరువాత 2 రకాతులు ఉంటాయి.

**ఈద్ నమాజుల్లో నఫిల్ నమాజ్‌లు లేవు:-** ఈద్ నమాజ్‌కు ముందుగాని, ఆ తరువాతగాని ఎలాంటి నఫిల్ నమాజులు చేయకూడదు.

**జుమా, ఈద్ ఖుత్బాలు:-** జుమా నమాజ్‌కు ముందు, ఈద్ నమాజ్‌ల తరువాత ఇమామ్ ఇచ్చే ఖుత్బాలు (ప్రసంగాలు) తప్పనిసరిగా వినాలి.

**దుఆ (వేడుకోలు), జికర్ (స్మరణ)లు:-** దుఆలు, జికర్‌లు వ్యక్తిగతమైనవి. ఇమామ్‌తో పాటు చేసే 'దుఆ' తప్పని సరికాదు. దుఆ, జికర్‌లు ఫరజ్ నమాజ్ ముగిసిన వెంటనే చేయడం మంచిది, తప్పనిసరి మాత్రం కాదు. నమాజ్ పూర్తిగా ముగిసిన తరువాతయినా వీటిని ఆచరించవచ్చు.

**ఉజూ:-** నమాజ్ చేయడానికి ముందు దేహశుద్ధి ఉండాలి. అంటే 'ఉజూ' చేసి వుండాలి. ఉజూ చేస్తున్నానని సంకల్పించుకొని, 'బిస్మిల్లాహి ర్రహ్మా నిర్రహీం' అంటూ రెండు చేతుల్ని మణికట్ల వరకు కడుక్కోవాలి. తరువాత మూడుసార్లు నోట్లో నీళ్ళు పోసుకొని పుక్కిలించాలి. ఆ సమయంలో వ్రేలితో లేక పలుదోము పుల్లతో పళ్ళు తోముకోవాలి. ఉపవాసం లేకపోతే నీటిని గొంతు వరకు పోనిచ్చి గరగర (Garling) చేయాలి. తరువాత మూడుసార్లు ముక్కులోకి నీళ్ళు పోసుకొని చీది శుభ్రపరచుకోవాలి. తరువాత మూడుసార్లు నుదుటి నుంచి గడ్డం వరకు మొత్తం ముఖం కడుక్కోవాలి. తరువాత రెండు చేతుల్ని మోచేతుల వరకు మూడుసార్లు కడుక్కోవాలి. తరువాత తడి చేతులతో తలను, చెవుల్ని, మెడను 'మసహ్' చేయాలి. ఆ తరువాత రెండు కాళ్ళు కనీసం చీలమండల వరకు కడుక్కోవాలి. కాళ్ళకు మేజోళ్ళు ఉంటే వాటి మీద తడి చేత్తో మసహ్ చేస్తే సరిపోతుంది.

**తయమ్ముమ్:-** ఉజూ కోసం నీళ్ళు లభించకపోతే లేదా నీటి వాడకం వల్ల వ్యాధి ముదురుతుందన్న భయముంటే శుభ్రమైన మట్టితో శుద్ధి చేసుకోవడాన్ని 'తయమ్ముమ్' అంటారు.

"విశ్వాసులారా! నమాజ్ చేయడానికి సిద్ధమైనప్పుడు ముందుగా మీరు ముఖాన్ని, మోచేతులదాకా చేతుల్ని కడుక్కోండి; తలను తడిచేత్తో స్పర్శించండి; కాళ్ళు చీలమండల దాకా కడుక్కోండి. (వీర్యస్ఖలనం వల్ల) అశుద్ధావస్థ ఏర్పడితే పరిశుభ్రంగా తలంటు స్నానం చేయండి. ఒకవేళ మీరు వ్యాధిగ్రస్తులైతే, లేదా ప్రయాణావస్థలో ఉంటే, లేదా మల మూత్ర విసర్జనచేస్తే, లేదా స్త్రీని కలుసుకుంటే– అప్పుడు నీళ్ళు దొరకని పక్షంలో పరిశుభ్రమైన మట్టి ఉపయోగించండి. అంటే మట్టిపై చేతులుతట్టి వాటితో ముఖం, చేతులు రుద్దుకోండి. దేవుడు మీ జీవితాన్ని దుర్భరం చేయగోరడం లేదు. మీరు కృతజ్ఞులై ఉండేందుకు ఆయన మిమ్మల్ని పరిశుద్ధపరచి, మీకు తన అనుగ్రహాలను పూర్తిగా ప్రసాదించదలిచాడు." (ఖుర్ఆన్–5:6)

నీళ్ళు లభించనప్పుడు లేదా నీటి వల్ల ఆరోగ్యం మరింత క్షీణిస్తుందన్న భయం ఉన్నప్పుడు ఉజూ లేక గుసుల్ (స్నానం)కు బదులు తయమ్ముమ్ చేయాలి. అంటే పరిశుభ్రమైన మట్టిమీద లేక సున్నపు గోడమీద లేక ధూళి పేరుకున్న వస్తువు మీద రెండు చేతులు తట్టి (విదిలించి) వాటితో ముఖాన్ని స్పర్శించాలి. ఆ తర్వాత మరోసారి చేతుల్ని మట్టిమీద తట్టి చేతివ్రేళ్ళ నుంచి మోచేతుల దాకా రెండు చేతుల్ని రుద్దాలి. ఇంద్రియ స్ఖలనం జరిగినప్పుడు కూడా ఇదే విధంగా తయమ్ముమ్ చేసుకోవచ్చు.



**గుసుల్ (స్నానం):-** సంభోగంవల్ల లేక మధుర స్వప్నం వల్ల లేక మరేదయినా కారణంవల్ల వీర్యస్ఖలనం జరిగినప్పుడు, స్త్రీకి రుతుస్రావం లేక ప్రసూతిస్రావం అయినప్పుడు గుసుల్ (తలంటు స్నానం) చేయవలసి ఉంటుంది. ముందుగా రెండు చేతుల్ని మణికట్ల వరకు కడుక్కోవాలి. తరువాత మర్మాంగం కడుక్కోవాలి. ఆ తరువాత ఉజూ చేయాలి. ఉజూ చేశాక తలపై నీళ్ళుపోసుకోవాలి. ఆ తరువాత కుడి, ఎడమ భుజాలపై నుంచి నీళ్ళు పోసుకొని శరీరం తోముకోవాలి. శరీరమంతా తడిసే విధంగా ఇలా మూడు సార్లు చేయాలి.

**ఉజూ భంగమయ్యే విషయాలు:-** (1) మల మూత్ర విసర్జన, (2) అపాన వాయువు వెడలటం, (3) శరీరంలోని ఏ అవయవం నుండయినా రక్తస్రావం కావడం, (4) నోటి నిండా వాంతి కావడం, (5) పడుకొని లేదా దేనికైనా ఆనుకొని నిద్రించడం, (6) స్పృహ కోల్పోవడం. ఈకారణాల వల్ల ఉజూ, తయమ్ముమ్ భంగమవుతాయి. నమాజ్ కోసం తిరిగి చేసుకోవలసి ఉంటుంది. పోతే (7) నీరు లభించని కారణాన చేసిన తయమ్ముమ్ నీరు లభించగానే భంగమవుతుంది.

# 35. నమాజ్ ముందువిషయాలు

నమాజ్ చేయడానికి ముందుగా ఉజూ చేసి ఉండాలి. ఫరజ్ నమాజ్ కోసం అజాన్ ఇవ్వాలి. ఒకవేళ ఫరజ్ నమాజ్ ఏదైనా కారణం వల్ల సామూహికంగా చేయలేని పక్షంలో కూడా అజాన్ చెప్పిన తరువాతే ఫరజ్ నమాజ్ చేయాలి.

దైవప్రవక్త (స) ప్రవచనాలు:- "మౌజన్ (అజాన్ ఇచ్చే వ్యక్తి)కి (అతని అజాన్ విని) నమాజ్ చేసే ప్రతి మనిషికీ లభించే పుణ్యంతో సమానమైన పుణ్యం లభిస్తుంది." "అజాన్ వినే ప్రతి మానవుడు లేదా జిన్ లేదా మరేదైనా సృష్టితం ప్రళయదినాన మౌజన్ కోసం సాక్ష్యమివ్వడం జరుగుతుంది." (నసాయి)

**అజాన్ పలుకులు:-** ఎత్తయిన స్థలంలో ఖిబ్లా (కాబామస్జిద్) వైపు తిరిగి నిలబడాలి. తరువాత రెండుచేతుల చూపుడు వ్రేళ్ళు చెవులలో దూర్చుకొని బిగ్గరగా ఇలా అజాన్ చెప్పాలి:

"అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు)"- (4 సార్లు)

"అష్హదు అన్‌ల్లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యదైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను)"- (2 సార్లు)

"అష్హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్ (ముహమ్మద్ దేవుని ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను)"- (2 సార్లు)

"హయ్యా అలస్సలాహ్ (నమాజ్ కోసం రండి)"- (2 సార్లు ముఖం కుడి వైపుకు తిప్పి పలకాలి.)

“హయ్యి అలల్‌ఫలాహ్ (సాఫల్యం వైపుకు రండి)”- (2 సార్లు ముఖం ఎడమ వైపుకు తిప్పి పలకాలి.)

“అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు)”- (2 సార్లు)

“లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యదైవం లేడు)”- (ఒకసారి)

ప్రత్యేకంగా ఫజర్ వేళలో ‘హయ్యి అలల్ ఫలాహ్’ తరువాత “అస్సలాతు ఖైరుమ్ మినన్నౌమ్ (నిద్ర కంటే నమాజ్ శ్రేష్ఠమైనది)” అని కూడా 2 సార్లు పలకాలి.

“అజాన్ విన్న తరువాత ఈ (క్రింది) దుఆ చేసే వ్యక్తి (పరలోకంలో) నా సిఫారసు పొందడానికి హక్కుదారుడు అవుతాడని దైవప్రవక్త (సల్లం) అన్నారు.” (బుఖారి)

“అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్దావతి త్తామ్మతి వస్సలాతిల్ ఖాయిమతి ఆతి ముహమ్మదనిల్ వసీలత వల్‌ఫజీలత వబ్‌అస్‌హు మఖామమ్ మహ్మూద నిల్లజీ వఅద్‌త్తహు”

అర్థం: దేవా! ఈ పిలుపు, ఆహ్వానాల అధిపతీ! ప్రారంభం కాబోతున్న నమాజ్ (యొక్క) యజమానీ! ముహమ్మద్ (సల్లం)కు ‘వసీలా’ స్థానం ప్రసాదించు. ఆయనకు ‘ఫజీలా’ (దైవసాన్నిధ్య విశిష్ఠ స్థానం) అనుగ్రహించు. నీవు వాగ్దానం చేసిన ‘కీర్తి స్థానం’ కూడా ముహమ్మద్ (సల్లం)కు ప్రసాదించు.

నమాజు పంక్తులు తీరిన తరువాత “ఇఖామత్” చెప్పాలి. ఇఖామత్ పలుకులు కూడా దాదాపు అజాన్ పలుకుల్లాంటివే. కాకపోతే ‘హయ్యిఅలల్ ఫలాహ్’ తరువాత “ఖద్‌ఖామతిస్సలాహ్ (నమాజ్ కోసం జమాఅత్ నిలబడింది)” అని 2 సార్లు చెప్పాలి.

**నమాజ్ వేళలు, రకాతులు:-** ఫజర్ నమాజ్ ఉషోదయం నుంచి ప్రారంభమవుతుంది. హనఫీ దృక్పథం వారికంటే అహ్లెహదీస్ దృక్పథం వారు సుమారు అర గంట ముందు ఫజర్ నమాజ్ చేస్తారు. జుహర్ నమాజ్ వేళ సూర్యుడు నెత్తి మీద నుంచి కొంచెం వాలగానే ప్రారంభమవుతుంది. అసర్ నమాజ్ వేళ హనఫీ దృక్పథం ప్రకారం మధ్యాహ్నాం సూర్యుడు పడమటి వైపుకు వాలి, అప్పటి ఎండలో ప్రతి వస్తువు నీడ ఆ వస్తువుకు రెండింతలు అయినప్పుడు మొదలవుతుంది. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం వస్తువు నీడ దానికి సమానంగా ఉన్నప్పటి నుంచే ప్రారంభమవుతుంది. మగ్రిబ్, ఇషా వేళల్లో పైరెండు దృక్పథాల మధ్య పెద్ద తేడా లేదు. సూర్యాస్తమయం కాగానే మగ్రిబ్ వేళ అవుతుంది. ఆ తరువాత దాదాపు గంట, గంటన్నరకు ఇషా వేళ అవుతుంది. జుహర్, అసర్, ఇషా వేళలు పట్టణాలలోని మసీదులలో ప్రజల సౌలభ్యాలను బట్టి సమయం పది పదిహేను నిమిషాలు అటో ఇటో నిర్ణయిస్తారు.

ఫజర్ వేళలో మొదట రెండు రకాతులు సున్నత్ నమాజ్ చేయవలసి ఉంటుంది. దైవప్రవక్త (సల్లం) ఫజర్ వేళలోని ఈ సున్నత్ నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చారు. అందువల్ల నమాజీలు దీన్ని ఎట్టి పరిస్థితిలోనూ వదలకూడదు. రెండు రకాతుల



సున్నత్ తరువాత రెండు రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి.

జుహర్ వేళలో మొదట నాలుగు రకాతులు సున్నత్ నమాజ్ చేయాలి. ఆ తరువాత నాలుగు రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. ఫరజ్ నమాజ్ తరువాత మళ్ళీ రెండు రకాతులు సున్నత్ నమాజ్ చేయాలి. ఆ తరువాత ఇష్టమైన వారు రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేయవచ్చు.

అసర్ వేళలో నాలుగు రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. ఫరజ్ నమాజ్‌కు పూర్వం ఇష్టమైన వారు నాలుగు రకాతులు సున్నత్ నమాజ్ చేయవచ్చు. ఇది ఐచ్ఛికమైన సున్నత్ నమాజ్. అంటే చేస్తే పుణ్యం, చేయకపోతే పాపం లేదు.

మగ్రిబ్ వేళలో ముందుగా మూడు రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. తరువాత రెండు రకాతులు సున్నత్ నమాజ్ చేయాలి. ఆ తరువాత ఇష్టమైన వారు రెండు రకాతులు నఫిల్ నమాజ్ కూడా చేయవచ్చు. అహ్లెహదీస్ దృక్పథం కల నమాజీలు ఫరజ్‌కు ముందు రెండు రకాతులు సున్నత్ నమాజ్ కూడా చేస్తారు. ఇది ఐచ్ఛికమైన సున్నత్ నమాజ్. ఇష్టమైతే చేయవచ్చు, లేకుంటే వదిలేయవచ్చు.

ఇషా వేళలో మొదట నాలుగు రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. తరువాత రెండు రకాతులు సున్నత్, మూడు రకాతులు వితర్ నమాజ్ చేయాలి. ఫరజ్ నమాజ్‌కు ముందు ఇష్టమైన వారు నాలుగు రకాతులు సున్నత్ (గైర్‌ముఅక్కిదా) నమాజ్ చేయవచ్చు. లేకుంటే వదిలేయవచ్చు. అలాగే ఫరజ్ ముగిశాక రెండురకాతుల సున్నత్ నమాజ్ తరువాత రెండు రకాతుల నఫిల్ నమాజు కూడా చేయవచ్చు.

అయిదు వేళల నమాజుల్లో మొత్తం పన్నెండు రకాతులు సున్నత్ నమాజ్ చేయవలసి ఉంటుంది. ఈ పన్నెండు రకాతుల సున్నత్ నమాజ్ చేసేవారికి దైవప్రవక్త (స) ఇలా ఒక శుభవార్త చెప్పారు:

“రేయింబవళ్ళు (ప్రతిరోజూ) పన్నెండు రకాత్‌లు సున్నత్ నమాజ్ చేసే మనిషి కోసం దేవుడు స్వర్గంలో ఒక మహల్ నిర్మిస్తాడు.” (ముస్లిం)

## 36. వ్యక్తిగత నమాజ్ విధానం

ఖిబ్లాకు అభిముఖంగా నిలబడి “ఇన్ని వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ ఫతరస్ సమావాతి వల్‌అర్జ హనీఫవ్వమా అనా మినల్ ముష్రికీన్. ఇన్న సలాతి వ నుసుకి వమహ్‌యాయ వమమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. లాషరీక లహూ వబిజాలిక ఉమిర్‌తు వఅనా అవ్వలుల్ ముస్లిమీన్” అని పఠించడం మంచిది.

అర్థం: నేనిప్పుడు సమస్త విషయాలు వదలి పూర్తి ఏకాగ్రతతో భూమ్యాకాశాలు సృష్టించిన శక్తిస్వరూపుని వైపుకు మరలాను. ఆయనకు సాటి కల్పించేవారిలోని వాణ్ని కాను. నా నమాజ్, నా త్యాగం, నా జీవన్మరణాలు సమస్తం సకలలోక ప్రభువయిన

అల్లాహ్‌కే సమర్పితం. ఆయనకు సాటి ఎవరూ లేరు. నాకు ఆయన ఆదేశమే లభించింది. నేను యావత్తు దైవవిధేయులలో ప్రప్రథమ దైవవిధేయుడ్ని.

ఇప్పుడు నమాజ్ కోసం సంకల్పించుకోవాలి. సంకల్పం అనేది మనస్సుకు సంబంధించిన విషయం. అయితే సంకల్పించుకున్న విషయాలు నోటి ద్వారా కూడా వెలిబుచ్చడం మంచిదంటారు హనఫీ దృక్పథం పండితులు.

"నేను ఫజర్ నమాజ్‌కు సంబంధించిన రెండు రకాతులు ఫరజ్ నమాజ్ చేస్తున్నాను" అని సంకల్పించుకొని "అల్లాహుఅక్బర్" అంటూ రెండు అరచేతులు ఖిబ్లా వైపుకు పెట్టి చెవులదాకా పైకెత్తాలి. తర్వాత వెంటనే చేతులు దించుతూ హనఫీ దృక్పథం ప్రకారం ఎడమ ముంజేతిపై కుడి ముంజేయి ఉండేలా నాభి క్రింద కట్టుకోవాలి. రెండు పాదాల మధ్య 6-12 అంగుళాలు ఖాళీ ఉండాలి. దృష్టి సజ్దా చేసే చోటుపై ఉండాలి. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం అయితే చేతులు భుజాలవరకే ఎత్తి దించి, ఎడమ ముంజేతితో కుడి మోచేయి పైభాగం మీద, కుడి ముంజేతితో ఎడమ మోచేయి పైభాగం మీద ఉండేలా రొమ్ము మీద కట్టుకోవాలి. వీరు రెండు పాదాల మధ్య దాదాపు రెండడుగులు ఖాళీ ఉంచి నిలబడతారు.

**సనా:-** ఆ తరువాత ఈవిధంగా 'సనా' (ప్రశంసా పలుకులు) పఠించాలి:

"సుబ్‌హానక అల్లాహుమ్మవబిహమ్‌దిక వతబారకస్ముక వతఆలా జద్దుక వలా ఇలాహ గైరుక్" (దేవా! నీవు పరమ పవిత్రడవు. ప్రశంసలకు నీవే అర్హుడవు. నీవే శుభదాయకుడవు, మహోన్నతుడవు. నీ పేరు, ప్రాభవం ఎంతో ఉన్నతమైనవి. నీవు తప్ప మరే ఆరాధ్యనీయుడు లేడు.)

అహ్లెహదీస్ వారు 'సనా'కు బదులు ఇలా దుఆ చేస్తారు: "అల్లాహుమ్మ బాయిద్ బైని వబైన ఖతాయాయ కమా బాఅద్‌త బైనల్ మష్రిఖి వల్ మగ్రిబి అల్లాహుమ్మ నఖ్ఖిని మిన్ ఖతాయాయ కమా యునఖ్ఖస్సౌబుల్ అబ్‌యజు మినద్దనసి అల్లాహుమ్మ ఇగ్‌సిల్ మినీన్ ఖతాయాయ బిస్సల్జి వల్‌మాయి వల్‌బర్ద్." (దేవా! నాకు, నా పాపాలకు తూర్పు పడమరల మధ్య ఉన్నంత దూరం ఉంచు. దేవా! తెల్ల బట్ట మురికి పోయి ఎలా పరిశుభ్రమవుతుందో అలా నా పాపాలు ప్రక్షాళనం చేసి నన్ను పవిత్రుడ్ని చెయ్యి. దేవా! నా పాపాలను నీటితో, మంచుతో, వడగళ్ళతో కడిగెయ్యి.)

'సనా' తరువాత "అవూజు బిల్లాహి మినష్షయితా నిర్రజీం, బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్" (నేను తిరస్కృతుడయిన షైతాన్ కీడు నుండి నీ శరణు కోరుతున్నాను. కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను) అని చెప్పి 'ఫాతిహా సూరా', ఆమీన్, మరేదైనా రెండవ సూరా పఠించాలి.

**ఫాతిహా సూరా:-** "అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్‌ఆలమీన్ అర్రహ్మానిర్రహీం, మాలికి యౌమిద్దీన్, ఇయ్యాక నఅ్‌బుదు వఇయ్యాక నస్తయీన్, ఇహ్‌దినస్ సిరాతల్ ముస్తఖీమ్,



సిరాతల్లజీన అన్‌అమ్త అలైహి గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్. (ఆమీన్.)

(అర్థం: సమస్త లోకాలకు స్వామి, ప్రభువయిన అల్లాహ్‌కే సకల విధాల ప్రశంసలు శోభిస్తాయి. ఆయన కరుణామయుడు, కృపాసాగరుడు, పరలోక విచారణ దినానికి అధిపతి. దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ సహాయమే అర్థిస్తున్నాము. మాకు రుజుమార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయి దారితప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహానికి పాత్రులయినవారి మార్గమే మాకు చూపించు. (1:1-7) తథాస్తు.

**రెండవ సూరా:-** "అల్‌కుముత్తకాసురు హత్తా జుర్‌తుముల్ మఖాబిర్. కల్లా సౌఫ తఅ్‌లమూన సుమ్మ కల్లా సౌఫ తఅ్‌లమూన్. కల్లా లౌతఅ్‌లమూన ఇల్మల్‌యఖీన్. లతరవున్నల్ జహీమ సుమ్మ లతరవున్నహా ఐనల్‌యఖీని సుమ్మ లతుస్‌అలున్న యౌమ యిజిన్ అనిన్నయీమ్." (ఖుర్‌ఆన్–102:1–8)

(అర్థం: ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక సంపదే ప్రగతికి చిహ్నమని అనుకుంటున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంతమాత్రంకాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది. ఎంతమాత్రంకాదు. విశ్వసనీయ జ్ఞానంతో విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీకళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదల్ని గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది.)

ఇలా పఠించిన తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ 'రుకూ'లోకి పోయాలి. అంటే తలక్రిందుల 'యల్'(L)షేప్‌లా వంగాలి. అరచేతులతో మోకాళ్ళు పట్టుకొని "సుబ్‌హాన రబ్బియల్ అజీం" (నా ప్రభువు పరిశుద్ధుడు, మహోన్నతుడు) అని కనీసం మూడుసార్లు పఠించాలి. తర్వాత "సమిఅల్లాహు లిమన్ హమిదహ్" (దేవుడు తనను స్తుతించినవాని పలుకులు విన్నాడు) అంటూ నిటారుగా లేచి నిలబడాలి. నిలబడి "రబ్బనా లకల్‌హమ్ద్" (మాప్రభూ! అన్ని విధాల ప్రశంసలు నీకే శోభిస్తాయి) అని చెప్పాలి.

తర్వాత 'అల్లాహుఅక్బర్' అంటూ సజ్దాలోకి పోవాలి. మొదట మోకాళ్లు, అరచేతులు తర్వాత ముక్కు, నుదురు నేలకు ఆనిచ్చి సజ్దా చేయాలి. ముఖం మధ్యలోఉండేలా చెవులకు రెండు వైపులా అరచేతులు నేలకు ఆనిచ్చి పెట్టాలి. మోచేతులు నేలకు తాకనీకూడదు. సజ్దా స్థితిలో "సుబ్‌హాన రబ్బియల్ ఆలా" (నా ప్రభువు పవిత్రుడు, గొప్పవాడు) అని కనీసం మూడుసార్లు చెప్పాలి. తర్వాత 'అల్లాహుఅక్బర్' అంటూ లేచి నిటారుగా కూర్చోవాలి. ఎడమ మడమలపై పిరుదులు ఆనిచ్చి కుడి పాదం లేచి ఉండేలా నిటారుగా, నింపాదిగా కూర్చోవాలి. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం ఈ స్థితిలో "అల్లాహుమ్మగ్‌ఫిర్లీ వర్‌హమ్నీ" (దేవా! నన్ను క్షమించు, నాపై దయజూపు)

అని వేడుకోవాలి. ఆ తరువాత మళ్ళీ సజ్దా చేయాలి.

ఈవిధంగా రెండుసార్లు సజ్దా చేసిన తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ నిటారుగా లేచి నిలబడాలి. దీంతో ఒక రకాతు అవుతుంది. తిరిగి 'బిస్మిల్లా...., ఫాతిహా సూరా' పఠించి రెండవ సూరాగా మరేదైనా సూరా పఠించాలి. ఉదా- అస్ర్ సూరా చూడండి:

"వల్అస్రి ఇన్నల్ ఇన్సాన లఫీ ఖుస్రిన్ ఇల్లల్లజీన ఆమనూ వ ఆమిలుస్ సాలిహాతి వతవాసౌ బిల్హఖ్ఖి వతవాసౌ బిస్సబ్ర్." (కాలచక్రం సాక్షి! మానవుడు ఘోరంగా నష్ట పోయాడు. అయితే సత్యాన్ని విశ్వసించి (తదనుగుణంగా) సత్కార్యాలు చేస్తూ సత్యం, సహనాలను గురించి పరస్పరం ఉపదేశించుకునేవారు మటుకు ఏమాత్రం నష్టపోరు.)

ఆతర్వాత మొదటి రకాత్ మాదిరిగానే ఒక రుకూ, రెండు సజ్దాలు చేసి నిటారుగా నింపాదిగా కూర్చొని ఇలా 'తషహ్హుద్' పఠించాలి:

**తషహ్హుద్:-** "అత్తహియ్యాతు లిల్లహి వస్సలాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యు హన్నబియ్యు వరహ్మతుల్లహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వఅలా ఇబాదిల్లాహి స్సాలిహీన అష్హదు అన్లాఇలాహ ఇల్లల్లాహు వఅష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ."

(అర్థం: సమస్త విధాల ప్రశంసలు, స్తోత్రాలు, ఆరాధనలు, పరిశుద్ధ విషయాలు దేవునికి మాత్రమే శోభిస్తాయి. దైవప్రవక్తా! మీపై శాంతి నెలకొనుగాక. దేవుని కారుణ్యం, ఆయన శుభాలు మీపై వర్షించుగాక. మాపై, సజ్జనులయిన దైవదాసులందరిపై శాంతి నెలకొనుగాక. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (సల్లం) ఆయన దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను.)

ఇక్కడ 'లా ఇలాహ ఇల్లల్లహ్' అంటూ కుడి చేతి వ్రేళ్ళు పిడికిలిగా మడచి, చూపుడు వ్రేలిని పైకెత్తి సైగ చేయాలి. ఆ వెనువెంటనే కుడి చేతి అయిదు వ్రేళ్ళను యథాప్రకారం చాచి మోకాలుపై ఉంచాలి.

రెండు రకాత్లు, తషహ్హుద్ పఠించిన తర్వాత ఇలా 'దరూద్, దుఆ పఠించాలి:

**దరూద్:-** "అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్వ్వ వఅలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లయిత అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్."

(అర్థం: దేవా! ఇబ్రాహీంపై, ఆయన కుటుంబీకులు-సంబంధీకులపై ఎలా కారుణ్యం కురిపించావో అలాగే ముహమ్మద్పై, ఆయన కుటుంబీకులు-సంబంధీకులపై కూడా కారుణ్యం కురిపించు. నిస్సందేహంగా నీవే ప్రశంసనీయుడవు, మహత్తు గలవాడవు. దేవా! ఇబ్రాహీంకు, ఆయన కుటుంబీకులు-సంబంధీకులకు ఎలా శుభాలు



ప్రసాదించావో అలాగే ముహమ్మద్కు, ఆయన కుటుంబీకులు-సంబంధీకులకు కూడా శుభాలు ప్రసాదించు. నిస్సందేహంగా నీవే ప్రశంసనీయుడవు, మహత్తు గలవాడవు.)

**దరూద్ తర్వాయి దుఆలు:-** (1) "అల్లాహుమ్మ ఇన్నీ జలమ్తు నఫ్సి జుల్మన్ కసీరన్ వ్వలా యగ్ఫిరు జ్జునూబ ఇల్లా అన్త ఫగ్ఫిర్లీ మగ్ఫిరత మ్మిన్ ఇన్దక వర్హమ్నీ ఇన్నక అన్తల్ గఫూరు ర్రహీం." (అర్థం: దేవా! నేను నా ఆత్మకు చాలా అన్యాయం చేసుకున్నాను. పాపాలు మన్నించేవారు నీవు తప్ప మరెవరూ లేరు. కనుక నీవు నీ ప్రత్యేక అనుగ్రహంతో నా పాపాలు క్షమించు. నన్ను కరుణించు. నిస్సందేహంగా నీవు ఎంతో క్షమించేవాడవు, ఎంతో కరుణించేవాడవు.)

పై 'దుఆ'కు బదులు ఈ క్రింది 'దుఆ' కూడా పఠించవచ్చు:

(2) "అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మిన్ అజాబి జహన్నమ వ మిన్ అజాబిల్ ఖబ్రి వ అవూజుబిక మిన్ఫిత్నతిల్ మసీహిద్దజ్జాలి వఅవూజుబిక మిన్ఫిత్నతిల్ మహ్యా వల్మమాతి అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ మఅ్సమి వల్మగ్రమ్."

(అర్థం: దేవా! నరక, సమాధి యాతనల నుండి, దజ్జాల్ ఉపద్రవం నుండి, జీవన్మరణాల పరీక్ష నుండి నేను నీ రక్షణ కోరుతున్నాను. దేవా! పాపాల బారినుండి, ప్రాణసంకటమైన రుణబాధ నుండి నీశరణు కోరుతున్నాను. మీపై శాంతి, దైవానుగ్రహాలు వర్షించుగాక.)

ఈ దుఆ పఠించిన తరువాత కుడి వైపు ముఖం తిప్పుతూ "అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహ్" అని పలకాలి. తరువాత ఎడమ వైపు ముఖం తిప్పుతూ కూడా అదే విధంగా సలాం పలకాలి. దీంతో నమాజ్ ముగుస్తుంది.

మూడు లేక నాలుగు రకాత్ల ఫరజ్ నమాజ్ అయితే 'తషహ్హుద్' పఠించిన తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ లేచి నిలబడి మూడవ, నాల్గవ రకాతుల్లో ఫాతిహా సూరా మాత్రమే పఠించాలి. రెండవ సూరా పఠించకూడదు. తరువాత 'తషహ్హుద్తో పాటు దరూద్, దుఆ కూడా పఠించి, కుడి ఎడమల వైపు ముఖం తిప్పుతూ సలాం పలకాలి. ఇలా ఈ నమాజు ముగుస్తుంది. నాలుగు రకాతుల సున్నత్ నమాజ్ అయితే మూడవ, నాల్గవ రకాతుల్లో రెండవ సూరా కూడా పఠించాలి. ఉదా:

**మూడవ రకాత్లో రెండ వసూరా:-** "ఇజాజా అనస్రుల్లాహి వల్ఫత్హు వరాయితన్నాస యద్ఖులూన ఫీదీనిల్లాహి అఫ్వాజన్ ఫసబ్బిహ్ బిహమ్ది రబ్బిక వస్తగ్ఫిర్హు. ఇన్నహూ కాన తవ్వాబా."

(అర్థం: ప్రవక్తా! దేవుని సహాయం వచ్చి, విజయం లభించిన తర్వాత ప్రజలు తండోపతండలుగా దైవధర్మంలో చేరుతుండటం నీవు గమనిస్తూనేఉన్నావు. కనుక నీ ప్రభువు ఔన్నత్యం స్తుతిస్తూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తూ ఉండు. దాంతోపాటు ఆయన సన్నిధిలో నీ పొరపాట్లకు క్షమాపణకోరుకో. ఆయన గొప్పక్షమాశీలి.)- (110:1-3)

**నాల్గవ రకాత్‌లో రెండవ సూరా:-** "ఖుల్ హువల్లహు అహద్. అల్లాహుస్సమద్. లమ్‌యలిద్ వలమ్ యూలద్, వలమ్ యకున్‌ల్లహూ కుఫువన్ అహద్." (అర్థం: వారికి చెప్పు: ఆయన అల్లాహ్, ఏకైక దేవుడు. ఆ దేవుడు ఎవరి అవసరమూ లేని నిరపేక్షాపరుడు. ఆయనకు ఎలాంటి సంతానం లేదు. ఆయన ఎవరికీ సంతానంగా లేడు. ఆయనకు సమానమైన వారెవరూ లేరు. ఆయన సాటిలేని మహామేటి.)- (112:1-4)

**వితర్ నమాజ్:-** వితర్ నమాజ్‌ను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"దేవుడు మీకోసం ఒక నమాజ్ అధికంగా చేశాడు. అది వితర్ నమాజ్. మీరు దీన్ని ఇషా, ఉషోదయం వేళల మధ్య చేసుకోండి" (ఇబ్నెమాజ)

"దేవుడు మీకు మరొక నమాజ్ (కూడా) చేయాలని ఆజ్ఞ జారీచేశాడు. ఈ నమాజ్ మీ ఎర్రఒంటెల కంటే శ్రేష్ఠమైనది. అది వితర్ నమాజ్. దీన్ని మీకు ఇషా, ఉషోదయం వేళల మధ్య చేయాలని నిర్దేశించాడు." (అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

ఇషా నమాజ్‌లని ఫరజ్, సున్నత్, నఫిల్ తర్వాత మూడు రకాత్‌లు 'వితర్' నమాజ్ చేయాలి. ఇందులో రెండు రకాత్‌లు పైన పేర్కొన్నట్లే చేసి, 'తషహ్హుద్' తర్వాత నిలబడి మూడవరకాత్‌లో బిస్మిల్లా, ఫాతిహా సూరా, మరేదైనా రెండవ సూరా పఠించాలి. ఆ తర్వాత 'అల్లహుఅక్బర్' అంటూ చేతులు చెవులదాకా పైకెత్తి, దించి నాభి క్రింద కట్టుకొని క్రింద పేర్కొన్నట్లు "ఖునూత్" దుఆ చేయాలి:

ఖునూత్ దుఆ: "అల్లహుమ్మ ఇన్నా నస్తఈనుక వనస్తగ్‌ఫిరుక వనుఅ్ మిను బిక వ నతవక్కలు అలైక వనుస్నీ అలైకల్ ఖైర వనష్‌కురుక వలా నక్‌ఫురుక వనఖ్‌లవు వ నత్‌రుకు మన్‌య్యఫ్‌జురుక అల్లాహుమ్మ ఇయ్యాక నఅ్‌బుదు వలక నుసల్లి వనుస్‌జుదు వ ఇలైక నస్ఆ వనహ్‌ఫిదు వనర్జూ రహ్మతక వనఖ్షా అజాబక ఇన్న అజాబక బిల్ కుప్ఫారి ముల్‌హిఖ్"

(అర్థం: దేవా! మేము నీ సహాయం అర్థిస్తున్నాము. నీ నుండి పాపమన్నింపు కోరుతున్నాము. మేము నిన్ను విశ్వసించాము. నిన్నే నమ్ముకొని నీమీద ఆధారపడు తున్నాము. నిన్ను బహువిధాల కొనియాడుతున్నాము. నీకు కృతజ్ఞతలు తెలుపుకుంటు న్నాము. నీ పట్ల కృతఘ్నులుగా ఉండబోము. నీ పట్ల కృతఘ్నత, అవిధేయతలు చూపేవారితో మేము ఎలాంటి సంబంధం పెట్టుకోము. మేము నిన్నే ఆరాధిస్తున్నాం. నీ ప్రసన్నత కోసమే నమాజ్ చేస్తున్నాము. నీ సన్నిధిలోనే సాష్టాంగ పడుతున్నాము. నీ వైపుకే మరలి వస్తాము. నీ ఆజ్ఞల్ని శిరసావహించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటున్నాము. నీ కరుణాకటాక్షాల పైనే ఆశలు పెట్టుకున్నాము. నీ శిక్షకు భయపడు తున్నాము. నీవు సత్యతిరస్కారుల్ని తప్పకుండా శిక్షిస్తావు.)

ఈ దుఆ పఠించిన తర్వాత యథాప్రకారం రుకూ-సజ్దాలు, తషహ్హుద్ వగైరా పఠించి నమాజ్ ముగించాలి.



అహ్లెహదీస్ దృక్పథం కలవారు మూడవ రకాత్ 'రుకూ' తరువాత ఖునూత్ దుఆ చేతులు కట్టుకొని చేయడానికి బదులు చేతులు జోడించి పైకెత్తి చేస్తారు. వారు ఫజర్ నమాజ్‌లో కూడా ఫరజ్ రెండవ రకాత్ 'రుకూ' తరువాత ఈ దుఆ చేస్తారు. ఈ రెండు పద్ధతులు కూడా సరైనవే. రెండిటికీ హదీసు ప్రమాణాలు ఉన్నాయి.

'ఖునూత్ దుఆ' వితర్ నమాజ్‌లో తప్ప మరే నమాజ్‌లో పఠించకూడదు. అయితే సామూహిక ఆపద వచ్చినప్పుడు ఫజర్ నమాజ్‌లో కూడా ఈ దుఆ చేయవచ్చు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: (ముస్లిం యుద్ధఖైదీల విముక్తి, అవిశ్వాసుల వినాశం కోసం) దైవప్రవక్త (సల్లం) నిరంతరాయంగా ఒక నెల రోజులదాకా ఇషా నమాజ్ తరువాత 'ఖునూత్ దుఆ' పఠించారు. ఆతర్వాత ఒక రోజు ఈ దుఆ పఠించ లేదు. పఠించక పోవడానికి కారణం అడిగితే "ముస్లిం ఖైదీలు విడుదలయి వచ్చారు కదా!" అన్నారు దైవప్రవక్త (సల్లం)- (అబూదావూద్)

హనఫీ దృక్పథం ప్రకారం వితర్ నమాజ్‌లో మూడు రకాత్‌లు పఠించాలి. షాఫయి, అహ్లెహదీస్ ప్రజలు ఒక్క రకాత్ మాత్రమే పఠిస్తారు. అహ్లెహదీస్ మూడు, అయిదు, ఏడు రకాత్‌ల నమాజ్‌ని కూడా సమర్థిస్తారు.

"దైవప్రవక్త (సల్లం) వితర్ నమాజ్‌లో మూడు రకాత్‌లు పఠించేవారు. ఆ తర్వాత చివర్లో (కుడి ఎడమల వైపు ముఖం తిప్పుతూ) సలాం చేసేవారు." (హాకిమ్)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "దేవుడు మీకోసం ఒక నమాజ్ అధికంగా చేశాడు. అది వితర్ నమాజ్. మీరు దీన్ని ఇషా, ఉషోదయంల మధ్య చేసుకోండి" (ఇబ్నెమాజ)

**సహూ సజ్దా:-** నమాజ్‌లో ఒక్కోసారి ఏదైనా పొరపాటు జరగవచ్చు. వాటిని సరిదిద్దుకోకపోతే నమాజ్ విధి నెరవేరదు. నమాజ్ మళ్ళీ చేయవలసి వస్తుంది. అయితే కొన్ని రకాల పొరపాట్లు జరిగినప్పుడు "సహూసజ్దా" చేస్తే సరిపోతుంది. నమాజ్ మళ్ళీ చేయనవసరం లేదు. ఆ పొరపాట్లు, సహూసజ్దా పద్ధతి ఏమిటో తెలుసుకుందాం.

నమాజ్‌లో కొన్ని ప్రధానాంశాలు (అర్కానె నమాజ్) ఉన్నాయి. అవి తప్పిపోతే, లేక సరిగా చేయకపోతే 'సహూసజ్దా' చేసినా నమాజ్ నెరవేరదు. అవి ఇలా ఉన్నాయి:

✱ తక్బీరె తహ్రీమా (నమాజ్ ప్రారంభించడానికి చెప్పే 'అల్లాహుఅక్బర్' అనే వచనాన్నే 'తక్బీరె తహ్రీమా' అంటారు.

✱ ఖియాం (ఒక పెద్ద ఆయత్‌గాని, మూడు చిన్న ఆయత్‌లుగాని పఠించ గలిగేటంత సేపు నమాజ్ స్థితిలో నిటారుగా నిలబడటాన్ని 'ఖియాం' అంటారు. ఖియాం ఫరజ్, వాజిబ్ నమాజుల్లో మాత్రమే విధి.

✱ ఖిరాత్ (నమాజ్‌లో ఒక పెద్ద ఆయత్‌గాని, మూడు చిన్న ఆయత్‌లుగాని పఠించడాన్ని 'ఖిరాత్' అంటారు.

❋ రుకూ (అంటే తలక్రిందుల 'యల్'L షేప్‌లా వంగి చేతులతో మోకాళ్ళు పట్టుకోవాలి.

❋ సజ్దా (సాష్టాంగ ప్రణామం).

❋ ఆఖిరి ఖాయిదా (అంటే నమాజ్ చివరి రకాత్‌లో 'తషహ్హుద్' పఠించ గలిగేటంత సేపు కూర్చోవడం.

నమాజ్‌లో కొన్ని ముఖ్యాంశాలు (వాజిబాతె నమాజ్) ఉన్నాయి. అవి తప్పిపోతే లేదా సరిగా చేయకపోతే నమాజ్ కాదు. అయితే 'సహూసజ్దా' చేస్తే మాత్రం నమాజ్ విధి నెరవేరుతుంది. ఆ ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి:

☸ ఫరజ్ నమాజుల్లోని మొదటి రెండు రకాతుల్లో ఖుర్‌ఆన్ సూక్తులు పఠించడం.

☸ ఫరజ్ నమాజుల్లోని మొదటి రెండు రకాతుల్లో; సున్నత్, వితర్, నఫిల్ నమాజుల్లోని మొత్తం రకాతుల్లో ఫాతిహా సూరా పఠించడం.

☸ ఫరజ్ నమాజ్‌లోని మొదటి రెండు రకాతుల్లో; సున్నత్, వితర్ నమాజుల్లోని మొత్తం రకాతుల్లో ఫాతిహా సూరా తరువాత మరేదైనా సూరా పఠించడం.

☸ ఖిరాత్, రుకూ, సజ్దాలు, రకాత్‌లలో వరుస క్రమాన్ని పాటించడం.

☸ ఖౌమా (అంటే రుకూ నుండి లేచి నిటారుగా నిలబడటం).

☸ జల్సా (మొదటి సజ్దా చేసిన తర్వాత నిటారుగా, స్థిమితంగా కూర్చోవడం). కొందరు మొదటి సజ్దా చేశాక నిటారుగా కూర్చోరు. తల కాస్తంత పైకెత్తి వెంటనే రెండవ సజ్దాలోకి పోతారు. ఇది సరైన పద్ధతి కాదు. ఒకవేళ ఎప్పుడైనా పొరపాటున అలా జరిగితే 'సహూసజ్దా' చేయాలి. సహూసజ్దా చేయకపోతే నమాజ్ నెరవేరదు.

☸ తాదిలె అర్కాన్ (రుకూ, సజ్దా మొదలైన అంశాలన్నీ నింపాదిగా చేయడం).

☸ ఖాయిదాయె ఊలా (మూడు లేక నాలుగు రకాత్‌ల నమాజ్‌లోని రెండవ రకాత్ చివర్లో 'తషహ్హుద్' పఠించగలిగేటంత సేపు కూర్చోవడం).

☸ మూడు లేక నాలుగు రకాత్‌ల (నమాజ్) చివర్లో 'తషహ్హుద్' పఠించడం.

☸ "అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహ్" అంటూ నమాజ్ ముగించడం.

☸ వితర్ మూడవ రకాత్‌లో రుకూకు ముందు చేతులు చెవులదాకా ఎత్తి 'అల్లహుఅక్బర్' (తక్బీర్) చెప్పి, చేతులు దించి కట్టుకొని ఖునూత్ దుఆ పఠించడం.

☸ ఈద్ నమాజ్‌లలో అదనపు 'తక్బీర్'లు చెప్పడం.

☸ ఖుర్‌ఆన్ బిగ్గరగా పఠించే (జుహ్రీ) నమాజుల్లో నిశ్శబ్దంగా పఠించడం, నిశ్శబ్దంగా పఠించే (సిర్రీ) నమాజుల్లో బిగ్గరగా పఠించడం జరిగినప్పుడు సహూసజ్దా చేయవలసి ఉంటుంది. లేకుంటే నమాజ్ నెరవేరదు.



**ఖసర్ నమాజ్:-** ప్రయాణావస్థలో ఉండి చేసే సంక్షిప్త నమాజ్‌ని "ఖసర్" నమాజ్ అంటారు. ఖసర్ చేయవలసిన నమాజ్‌ని ఖసర్ నమాజ్‌గానే చేయాలి. అవకాశం, సౌకర్యం ఉన్నాయిగదా అని పూర్తి నమాజ్ ఎంతమాత్రం చేయకూడదు.

✦ మనిషి తాను నివసించే ఊరు నుండి కనీసం 58 కిలోమీటర్లు (మరొక అభిప్రాయం ప్రకారం 77 కిలోమీటర్లు) దూరం ప్రయాణం చేసే, అక్కడ కనీసం 15 రోజులు ఉండే ఉద్దేశంతో బయలుదేరితే, అతను ఖసర్ నమాజ్ చేయవలసి ఉంటుంది. అంటే జుహర్, అసర్, ఇషా వేళల నాలుగు రకాత్‌ల ఫరజ్ నమాజ్‌లో 2 రకాత్‌లు మాత్రమే చేయాలి. అంతకంటే ఎక్కువ చేయడం ధర్మసమ్మతం కాదు. సున్నత్, నఫిల్ నమాజులు చేయడం తప్పనిసరి కాదు. చేయదలచుకుంటే పూర్తి నమాజ్ చేయాలి, ఖసర్ లేదు. ఫజర్ వేళ సున్నత్ నమాజ్‌ని మాత్రం విడనాడకూడదు. అలాగే ఇషావేళ మూడు రకాతుల వితర్ నమాజ్‌ని తప్పకుండా చేయాలి.

✦ బాటసారి వెళ్ళిన చోట స్థానికుడయిన ఇమామ్ వెనుక నమాజ్ చేయవలసి వస్తే పూర్తి నమాజ్ చేయాలి, ఖసర్ చేయకూడదు. అలాగే 15 రోజులకంటే ఎక్కువ ఉండే ఉద్దేశంతో వెళ్తే ఒంటరిగా చేసినా పూర్తి నమాజ్ చేయాలి, ఖసర్ చేయకూడదు. ఉద్యోగులు, వర్తకులు తమ ఉద్యోగ-వ్యాపార పర్యటనల కారణంగా ఏ ఒక్క చోట కూడా కనీసం 15 రోజులు విడిది చేసే అవకాశం లేకపోతే అలాంటి వారు కూడా ఖసర్ నమాజ్ చేసుకోవచ్చు.

✦ బస్సు, రైలు, విమానం వంటి వాహనాలు ఆగకుండా నడుస్తున్నప్పుడు ప్రయాణీకులు ఆ వాహనాల్లోనే వేళకు నమాజ్ చేయాలి. నిలబడి చేయడానికి వీలు లేకపోతే కూర్చొని చేయవచ్చు. రుకూ, సజ్దాలు సరిగా చేయడానికి తగిన సౌకర్యం లభించకపోతే సైగలతో చేయాలి. ఖిబ్లాకు అభిముఖంగా తిరిగి నమాజ్ చేయడానికి అవకాశం లేకపోతే అవకాశం ఉన్న వైపుకే తిరిగి నమాజ్ చేయవచ్చు.

✦ ప్రయాణావస్థలో ఏదైనా కారణం వల్ల ఖసర్ చేయవలసిన నమాజ్ 'ఖజా' అయితే, స్వస్థలానికి తిరిగొచ్చిన తరువాత కూడా దానికి సంబంధించిన ఖసర్ నమాజ్ మాత్రమే చేయాలి, పూర్తి నమాజ్ చేయకూడదు.

✦ ప్రయాణావస్థలో ఒకే సమయంలో చేసే రెండు వేళల నమాజుల్ని "జమా బైనుస్సలాతీన్" అంటారు. ఉదా- జుహర్ వేళలోనే జుహర్ నమాజ్‌తో పాటు అసర్ నమాజ్‌ని కలిపి చేయడం. అలాగే మగ్రిబ్ నమాజ్‌ని ఆలస్యం చేసి ఇషా వేళలో దాన్ని ఇషా నమాజ్‌తో కలిపి చేయడం. ఇది హజ్‌యాత్రలోనే ధర్మసమ్మతం. ఇతర ప్రయాణాలలో రెండు నమాజులు కలిపి చేసే పద్ధతిని "జమాసూరి నమాజ్" అంటారు. జమాసూరి అంటే మొదటి నమాజ్‌ని దాని చిట్టచివరి వేళలో, తరువాత (రెండవ) నమాజ్‌ని దాని ప్రారంభవేళలో చేయడం అన్నమాట. ఈవిధంగా రెండు నమాజుల్ని ఒకే సమయంలో చేసినట్లు పైకి కన్పించినా నిజానికి వీటిని వాటి నిర్ణీత వేళల్లోనే చేసినట్లు లెక్క.

✦ అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం ఏ ప్రయాణావస్థలోనైనా "జమా బైనుస్సలాతీన్" ధర్మసమ్మతమే. అదీగాక వేళ కాకముందే తత్సంబంధిత నమాజ్‌ని దానికి పూర్వపు నమాజ్‌తో కలిపి చేయడం కూడా వారి దృష్టిలో ధర్మసమ్మతమే. ఇలాంటి నమాజ్‌ని వారు "జమా తఖ్దీమ్" అంటారు. పైగా ఒక నమాజ్‌ని ఆలస్యం చేసి (దాని నిర్ణీత వేళ తప్పించి) తరువాతి వేళ నమాజ్‌తో కలిపి చేయడం కూడా వారికి ధర్మసమ్మతమే. ఇలాంటి నమాజ్‌ని "జమాతాఖీర్" అంటారు.

**ఖజా నమాజ్:-** నిర్ణీత వేళ తప్పిపోయిన నమాజ్‌ను 'ఖజా నమాజ్' అంటారు. బలమైన కారణం లేకుండా నమాజ్ 'ఖజా' చేయడం సరికాదు. ఖజా అయినప్పుడు దాన్ని వీలైనంత త్వరగా నెరవేర్చాలి. ఖజా నమాజ్ నిర్ణీత వేళకు చేసే నమాజులాగే చేయాలి. ఫరజ్, వితర్ నమాజులు మాత్రమే ఖజా నమాజులుగా చేయాలి. సున్నత్, నఫిల్ నమాజులకు ఖజా లేదు. వితర్‌లో మూడు రకాతులూ చేయాలి.

దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: "ఎవరైనా (ఫరజ్) నమాజ్ మరచిపోతే లేక నిద్రపోతే (నిద్ర నుండి సకాలానికి మేల్కోలేకపోతే), నిద్రపోవడం వల్ల నమాజ్ తప్పిపోవడం జరిగితే దానికి ప్రాయశ్చిత్తం (కఫ్ఫారా) జ్ఞాపకం వచ్చిన తక్షణమే అతనా నమాజ్ చేయాలి." (బుఖారి, ముస్లిం)

**సుత్రా:-** నమాజ్ చేస్తున్న మనిషి ముందు నుంచి పోవడం పాపం. ఒకవేళ జనం అటూఇటూ తిరిగే ప్రదేశంలో నమాజ్ చేయవలసి వస్తే నమాజీ తన ఎదురుగా సుమారు మూడు అడుగుల ఎత్తు, కనీసం ఒక అంగుళం మందం కలిగిన వస్తువుని నిలబెట్టుకోవాలి. దీన్నే "సుత్రా" అంటారు. జనం దీని వెలుపల నడవచ్చు.

**స్త్రీల నమాజ్:-** స్త్రీలు 'తక్బీరెతహ్రీమా' చెప్పేటప్పుడు తమ చేతుల్ని తాము ధరించిన బురఖా లేక దుప్పటిలోనే ఉంచి భుజాల వరకు మాత్రమే పైకెత్తాలి. తరువాత కుడి అరచేతిని ఎడమ అరచేయి ఉపరితలంపై ఉండేలా రొమ్ముపై కట్టుకోవాలి.

రుకూ స్థితిలో రెండు మోచేతులు పక్కటెముకలతో కలిపి ఉంచాలి.

సజ్దా స్థితిలో వారు తమ పొట్టను తొడలకు, బాహువుల్ని చంకలకు ఆనించి (దగ్గరగా కలిపి) ఉంచాలి. మోచేతుల్ని పైకెత్తకుండా అరచేతులతో పాటు నేల మీదనే ఆనించాలి. అలాగే కాళ్ళ మడిమల్ని పైకి లేపకుండా నేల మీదనే పరచి ఉంచాలి. ఖాయిదాలో రెండు పాదాలను కుడి వైపుకు తీసి, రెండు తొడల్ని దగ్గరకు చేర్చి, ఎడమ ముంగాలిపై కుడి ముంగాలు, తొడ ఉండేలా కూర్చోవాలి.

నమాజ్‌లో ఖుర్‌ఆన్ పఠనం ఎల్లప్పుడు నిశ్శబ్దంగానే చేయాలి. సామూహిక నమాజ్ పురుషులకు మాదిరిగా స్త్రీలకు తప్పనిసరి కాదు. అయితే "మీ భార్యలు మస్జిద్‌కు వెళ్ళడానికి అనుమతి అడిగితే వారిని నిరోధించకండి అని దైవప్రవక్త (సల్లం) చెప్పారు" (బుఖారి, ముస్లిం)



సామూహిక నమాజ్ విషయంలో ఇస్లాం పురుషులకు ఇచ్చిన ఆదేశాలకు, స్త్రీలకు ఇచ్చిన ఆదేశాలకు చాలా తేడా ఉంది. పురుషులు మసీదులో సామూహికంగా చేసే నమాజే శ్రేష్ఠమైన నమాజ్‌గా పరిగణించబడింది ఇస్లాంలో. కాగా ఇంట్లో ఒంటరిగా చేసే నమాజ్ స్త్రీల కోసం అత్యంత శ్రేష్ఠమైన నమాజ్‌గా ఇస్లాం పేర్కొన్నది.

హజ్రత్ ఉమ్మె హమీద్ సాయిదియా (రజి) దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నాకు మీతోపాటు (మసీదులో) నమాజ్ చేయాలని ఉంది" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "నీవు ఇలా అడుగుతావని నాకు తెలుసు. కాని నీవు నీ గది (మధ్య)లో నమాజ్ చేయడం కంటే ఒక మూలలో నమాజ్ చేయడం శ్రేష్ఠం. నీవు నీ ఇంటి ప్రాంగణంలో చేసే నమాజ్ కంటే ఇంటి గదిలో చేసే నమాజే శ్రేష్ఠమయినది. మీ వీథిలో ఉండే మసీదులో నమాజ్ చేయడం కంటే మీ ఇంటి ప్రాంగణంలో నమాజ్ చేయడం ఉత్తమం. జామియా మసీదులో కంటే వీథి మసీదులో నమాజ్ చేయడం చాలా మంచిది." (తబ్రాని)

అయితే దైవప్రవక్త (సల్లం) స్త్రీలకు మసీదుకు పోయే స్వేచ్ఛపై ఆంక్షలు విధించ లేదు. వారికి నమాజు కోసం మసీదుల కన్నా వారి ఇండ్లే మంచివని చెబుతూ ఇలా అన్నారు: "మీ స్త్రీలను మసీదులకు పోనీయకుండా నిరోధించకండి. కాని వారి కోసం వారి గృహాలే శ్రేష్ఠమయినవి." (అహ్మద్, అబూదావూద్)

నమాజు కోసం మసీదుకు పోవడం పురుషునికి విధి అయివుంటే, స్త్రీకి ఇది అనుమతి మాత్రమే. అదైనా చివరి వరుసలో ఉండి నమాజ్ చేయడాన్నే ఇస్లాం ఎక్కువగా ఇష్టపడుతుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) భార్యలలో ఒకరు ఫజ్ర్, ఇషా వేళల సామూహిక నమాజులు చేయడానికి మస్జిద్‌కు వెళ్ళేవారు. "స్త్రీలు మస్జిద్‌కు వెళ్ళడాన్ని హజ్రత్ ఉమర్ (రజి) ఇష్టపడరని, ఈ విషయంలో ఆయన ఎంతో అభిమానం కల వ్యక్తి అని తెలిసి కూడా మీరు ఇంటి నుండి బయటికి ఎందుకు వెళ్ళున్నారు?" అని ఆమెను ఒకరు అడిగారు. దానికామె "అయితే ఉమర్ (రజి) నన్నెందుకు నిరోధించడం లేదూ?" అని ఎదురు ప్రశ్న వేశారు. "ఎందుకంటే దేవుని దాసీలను దేవుని ఆలయానికి వెళ్ళడాన్ని నిరోధించకండని దైవప్రవక్త (సల్లం) అన్నారు. ఈ ప్రవచనమే మిమ్మల్ని నిరోధించకుండా ఆయనకు అడ్డుతగిలింది" అని అన్నాడు ఆ వ్యక్తి. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "(ఈనాడు) స్త్రీలు (రకరకాల ఫ్యాషన్‌లతో) తమల్నితాము (సింగారించుకొని) ఎలా రూపొందించుకున్నారో దైవప్రవక్త (స) గనక చూస్తే, బనీఇస్రాయీల్ స్త్రీలు ఎలా నిరోధించబడ్డారో అలా స్త్రీలను ఆయన మస్జిద్‌కు వెళ్ళనీకుండా నిరోధించేవారు." (బుఖారి, ముస్లిం)

# 37. సామూహిక నమాజ్ పద్ధతి

ప్రతిరోజూ నిర్ణీత సమయాల్లో అయిదు సార్లు జమాఅత్‌తో కలసి సామూహిక నమాజ్ చేయడం పురుషుల విధి (వాజిబ్). షరీఅత్ పరమైన కారణం లేకుండా సామూహిక నమాజ్‌ని వదలిపెట్ట కూడదు.

ఫరజ్, ఈద్ నమాజులు, రమజాన్‌లోని తరావీ, వితర్ నమాజులు జమాఅత్‌తో కలసి సామూహికంగా చేయడం జరుగుతుంది. జుమా నమాజ్, ఈద్ నమాజుల్లో జమాఅత్ తప్పిపోతే వాటికి ప్రత్యామ్నాయ నమాజులు లేవు. జుమా నమాజ్‌ని మాత్రం జుహర్ నమాజుగా చేయవచ్చు.

స్త్రీలు మసీదులో సామూహిక నమాజ్ చేయడానికి వస్తే వారు వారి పంక్తులు పురుషుల, పిల్లల పంక్తులకు వెనుక ఉండాలి. "స్త్రీలు పురుషులకు ఇమామత్ (నాయకత్వం వహించకూడదని దైవప్రవక్త (సల్లం) అన్నారు." (ఇబ్నెమాజ)

**నమాజ్ నాయకత్వం:-** ఖుర్ఆన్, ధర్మజ్ఞానం బాగా తెలిసి ఉండటంతో పాటు అందరిలో నైతికంగా ఉత్తముడైన వ్యక్తి నమాజ్‌కు నాయకత్వం వహించాలి.

సామూహిక నమాజ్‌లో ఇమామ్ ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు అతని వెనుక నిలబడిన ముఖ్తదీలు మౌనంగా ఉండాలి. అహ్లెహదీస్ దృక్పథం కలవారు ఇమామ్ వెనుక ఫాతిహా సూరా నెమ్మదిగా పఠిస్తారు. హనఫీ దృక్పథంలో ముఖ్తదీలు ఫాతిహా సూరా కూడా నెమ్మదిగానైనా సరే పఠించకుండా మౌనంగా ఉండి వినాలి. దీనికి ముఖ్యమైన ప్రమాణం ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తే:

"మీ ముందు ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి దాన్ని శ్రద్ధగా వినండి, మీరు కరుణించబడతారు." (7:204)

హజ్రత్ ఇమాం అబూహనీఫా (రహ్మాలై), ఆయన అనుయాయులు ఈసూక్తిని ప్రమాణంగా తీసుకొని సామూహిక నమాజులో ఇమామ్ ఖుర్ఆన్ బిగ్గరగానైనా, మెల్లిగానైనా పఠిస్తున్నప్పుడు ముఖ్తదీలు (అనుచరులు) మౌనంగా ఉండాలని అన్నారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ (రహ్మాలై)లు మాత్రం ఇమామ్ బిగ్గరగా పఠించే (జుహ్రీ) నమాజుల్లో మాత్రమే ముఖ్తదీలు మౌనంగా ఉండాలన్నారు.

అయితే ఇమామ్ షాఫయి (రహ్మాలై), కొన్ని హదీసుల్లో ఫాతిహా సూరా పఠించనిదే నమాజు నెరవేరదని ఉన్నందున, "ఇమామ్ ఖుర్ఆన్ బిగ్గరగా పఠించినా, మెల్లిగా పఠించినా ముఖ్తదీలు కూడా ఇమామ్‌తో పాటు ఫాతిహా సూరా పఠించాలి" అని అభిప్రాయపడ్డారు.

**తప్పిపోయిన రకాత్‌లను నెరవేర్చుకునే పద్ధతి:-** సామూహిక నమాజ్‌లో ఇమామ్ రుకూ స్థితి నుండి లేచి నిలబడిన తరువాత ఎవరైనా జమాఅత్‌లో



చేరితే అతనికి ఆ రకాత్ తప్పిపోయినట్లుగా షరీఅత్ పరిగణిస్తుంది. ఇమామ్ రుకూ చేస్తున్నప్పుడు జమాఅత్‌లో చేరితే రకాత్ లభించినట్లే. అయితే అతను ముందుగా "అల్లాహుఅక్బర్" అంటూ చేతులు చెవులదాకా ఎత్తి దించి నాభి క్రింద కట్టుకోవాలి. ఆ తరువాతనే అతను ఇమామ్‌ను అనుసరిస్తూ నమాజ్ చేయాలి.

సామూహిక నమాజ్‌లో ఇలా ఎవరికైనా ఒకటి లేక అంతకన్నా ఎక్కువ రకాతులు తప్పిపోతే అలాంటి వ్యక్తి చివరి రకాత్ తరువాత ఖాయిదాలో 'తషహ్హుద్' మాత్రమే పఠించి ఇమామ్ నమాజ్ ముగించడానికి 'సలాం' చేసేవరకు మౌనంగా ఉండాలి. ఇమామ్ సలాం చేయగానే అతను 'సలాం' చేయకుండా లేచి నిలబడి తప్పిపోయిన నమాజుల్ని నెరవేర్చుకోవాలి.

ఉదాహరణకు- నాలుగు రకాతుల జుహర్ నమాజులో ఎవరికైనా మొదటి రకాత్ తప్పిపోతే నమాజ్ చివర్లో అతను సలాం చేయకుండా లేచి నిలబడి తప్పిపోయిన ఆ రకాత్ నెరవేర్చడానికి బిస్మిల్లా తరువాత ఫాతిహా సూరా, రెండవ సూరాగా మరేదైనా సూరా పఠించి యథాప్రకారం నమాజ్ ముగించాలి. మొదటి రెండు రకాతులు తప్పిపోతే ఆ రెండు రకాత్‌లలోనూ ఫాతిహా సూరాతో పాటు రెండవ సూరా పఠించాలి. ఒకవేళ ఎవరికైనా మొదటి మూడు రకాతులు తప్పిపోతే ఇమాం సలాం చేసి నమాజ్ ముగించగానే లేచి నిలబడి తప్పిపోయిన మొదటి ఒక రకాత్‌లో ఫాతిహా సూరా, రెండవ సూరా పఠించి రుకూ, సజ్దాల తరువాత 'ఖాయిదా'లో తషహ్హుద్ పఠించి లేచి నిలబడాలి. నిలబడి తప్పిపోయిన రెండవ రకాత్‌లో కూడా ఫాతిహా సూరా, రెండవ సూరా పఠించాలి. తప్పిపోయిన మూడవ రకాత్‌లో ఫాతిహా సూరా మాత్రమే పఠించాలి. చివర్లో 'తషహ్హుద్, దరూద్, దుఆ పఠించి నమాజ్ ముగించాలి.

నమాజ్‌లో ప్రతి రెండు రకాతుల తరువాత 'తషహ్హుద్' పఠించవలసి ఉంటుంది. రకాత్‌లు తప్పిపోయినవారు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వాటిని నెరవేర్చాలి.

మగ్రిబ్ నమాజ్‌లో ఎవరైనా ఇమామ్ రెండవరకాత్ సజ్దా స్థితిలో ఉన్నప్పుడు జమాఅత్‌లో వచ్చిచేరితే ఇమామ్‌తో పాటు అతను **తషహ్హుద్** పఠించి, ఇమామ్‌ను అనుసరిస్తూ మూడవ రకాత్ ముగింపులో **తషహ్హుద్** మాత్రమే పఠించి మౌనంగా ఉండిపోవాలి. ఇప్పటి వరకు అతనికి ఒక్క రకాత్ మాత్రమే లభించింది. ఇమామ్ నమాజ్ ముగించిన వెంటనే లేచి నిలబడి తప్పిపోయిన మొదటి రకాత్‌లో ఫాతిహా సూరా, రెండవ సూరాగా మరేదైనా సూరా పఠించి రుకూ, సజ్దాల తరువాత ఖాయిదాలో మూడవ సారి కూడా **తషహ్హుద్** మాత్రమే పఠించాలి. దాంతో అతను రెండు రకాతులు నెరవేర్చినట్లు అవుతుంది. తరువాత లేచి నిలబడి మూడవ రకాత్‌లో కూడా ఫాతిహా సూరా, రెండవసూరా పఠించి రుకూ, సజ్దాల తర్వాత ఖాయిదాలో **తషహ్హుద్**, దరూద్, దుఆ పఠించి నమాజ్ ముగించాలి. ఈ విధంగా మనం ఇలాంటి సందర్భంలో ఒకే నమాజ్‌లో **నాలుగు సార్లు** 'తషహ్హుద్' పఠించవలసి వస్తుంది.

రకాత్‌లు తప్పిపోయిన వ్యక్తి ఇమామ్ వెనుక నమాజ్ చేస్తున్నప్పుడు తన వల్ల నమాజ్‌లో ఏదైనా పొరపాటు జరిగితే స్వయంగా 'సహూసజ్దా' చేయకూడదు. అప్పుడు ఇమామ్ వల్ల పొరపాటు జరిగితే మాత్రం అతను సహూసజ్దా చేస్తే రకాత్‌లు తప్పి పోయిన వ్యక్తి తన వల్ల పొరపాటు జరగక పోయినా ఇమామ్‌తో పాటు సహూసజ్దా చేయవలసి ఉంటుంది. ఒకవేళ తప్పిపోయిన రకాతులు నెరవేరుస్తున్నప్పుడు పొరపాటు జరిగితే సహూసజ్దా తప్పకుండా చేయాలి.

**జుమా నమాజ్:-** సృష్టికర్త ముస్లింల కోసం శుక్రవారాన్ని పండుగ దినంగా నిర్ణ యించాడు. ఆరోజు ముస్లింలు స్నానం చేసి, సువాసన పూసుకొని జుమా నమాజ్ కోసం మస్జిద్‌కు వెళ్ళాలి. జుమానమాజ్ విధిగా పాటించవలసిన నమాజ్. జుమా ఫరజ్ నమాజ్‌కు ముందు ఇమామ్ రెండు ఖుత్బా(ఉపన్యాసాలు) ఇస్తాడు. తరువాత రెండు రకాత్‌లు ఫరజ్ నమాజ్ చేస్తాడు. ముఖ్తదీలు (అనుచరులు) విధిగా రెండు ఖుత్బాలు విని ఫరజ్ నమాజ్‌లో పాల్గొనాలి.

"విశ్వాసులారా! శుక్రవారం సమావేశం రోజున నమాజుకోసం పిలుపునిచ్చినప్పుడు మీరు వెంటనే అమ్మకం, కొనుగోళ్ళ వ్యవహారాలు వదిలేసి దైవస్మరణ (ధర్మబోధ) వైపుకు పరుగెత్తండి. మీరు అర్థం చేసుకుంటే ఇది మీకెంతో శ్రేయస్కరమైనది." (ఖుర్‌ఆన్-62:9)

**ఈద్ నమాజ్:-** ఈదుల్ ఫితర్, ఈదుల్ అజ్హాలు మాత్రమే ముస్లింల కోసం దైవం నిర్ణయించిన పండుగ దినాలు. ఈద్‌నమాజ్ కోసం ఈద్గాకుగాని, పట్టణంలోని పెద్ద మసీదుకుగాని వెళ్ళాలి. దారిలో ఇలా 'తక్బీర్' పలుకులు పఠించాలి:

"అల్లాహుఅక్బర్ అల్లాహుఅక్బర్, లాఇలాహ ఇల్లల్లాహ్, వల్లాహుఅక్బర్ వలిల్లాహిల్ హమ్ద్." (ఈద్గాకు ఒక దారిన వెళ్ళి, మరొక దారిన రావడం సంప్రదాయం.)

ఈద్ నమాజ్ కోసం ఈదుల్ ఫితర్ లేక ఈదుల్ అజ్హాకు చెందిన రెండు రకాత్‌లు వాజిబ్ నమాజ్ ఆరు అదనపు తక్బీర్‌లతో చేస్తున్నానని సంకల్పించుకోవాలి. తరువాత 'తక్బీర్' (అల్లాహుఅక్బర్) చెబుతూ చేతులు చెవులదాకా పైకెత్తి దించి నాభి క్రింద కట్టుకోవాలి. ఆ తరువాత 'సనా' పఠించి మూడు సార్లు అదనంగా 'తక్బీర్' చెప్పాలి. తక్బీర్ చెప్పిన ప్రతిసారీ చేతులు చెవులదాకా ఎత్తి పూర్తిగా కిందికి దించాలి. అయితే మూడవసారి తక్బీర్ చెప్పి తరువాత చేతులు పూర్తిగా కిందికి దించకుండా నాభి పైభాగాన కట్టుకోవాలి. ఇప్పుడు "అవూజుబిల్లాహి మినష్షయితానిర్రజీం, బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం", ఫాతిహా సూరా, రెండవ సూరాగా మరేదైనా సూరా పఠించి రుకూ, సజ్దాలు చేయాలి. తరువాత లేచినిలబడి ఫాతిహా సూరా, రెండవ సూరా పఠించి మూడు సార్లు మళ్ళీ అదనంగా 'తక్బీర్' చెప్పాలి. తక్బీర్ చెప్పిన ప్రతిసారీ చేతులు చెవులదాకా ఎత్తి పూర్తిగా కిందికి దించాలి. నాలగవ సారి తక్బీర్ చెబుతూ రుకూలోకి పోవాలి. ఆవిధంగా రెండవ రకాత్ కూడా చేసి నమాజ్ ముగించాలి.



ఈద్ నమాజ్‌లో జమాఅత్ తప్పిపోతే హనఫీ దృక్పథం ప్రకారం దానికి ఖజా నమాజ్ లేదు. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం జమాఅత్ తప్పిపోతే ఒంటరిగా చేసినా ఈద్ నమాజ్ నెరవేరుతుంది.

ఈదుల్‌అజ్హా నమాజ్ జిల్‌హజ్ నెల 10వ తేదీన జరుగుతుంది. జిల్‌హజ్ 9వ తేదీ ఫజర్‌వేళ నుండి 13వ తేదీ అసర్‌వేళ వరకు ప్రతి ఫరజ్ నమాజ్ తరువాత ఇలా మూడుసార్లు 'తక్బీరె తష్రీఖ్' పఠించడం విధి (వాజిబ్): "అల్లాహుఅక్బర్ అల్లాహుఅక్బర్, లాఇలాహ ఇల్లల్లాహు వల్లాహుఅక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లా హిల్ హమ్ద్.

**తరావీ నమాజ్:-** రమజాన్ నెలలో ఇషా వేళ ఫరజ్, సున్నత్, నఫిల్ నమాజుల తరువాత తరావీ నమాజ్ మొదలవుతుంది. ఇమామ్ రెండేసి రకాత్‌ల చొప్పున ఇరవై రకాత్‌లు పఠిస్తాడు. అహ్లెహదీస్ ఇమామ్ ఎనిమిది రకాత్‌లు మాత్రమే పఠిస్తాడు. ఆ తరువాత చివర్లో వితర్ నమాజ్ జరుగుతుంది. వివరాలు ముందు రాబోతున్నాయి.

# 38. నమాజ్ ప్రభావం

రమజాన్ నెలవంక కన్పించగానే ముస్లింలు మొట్టమొదట చేయవలసిన పని "తరావీ నమాజ్." ఈ నమాజ్ ఇషా వేళలో వితర్ నమాజ్‌కు ముందు చేస్తారు. కనుక అసలు నమాజ్ ప్రాముఖ్యం, దాని ప్రభావం గురించి ముందుగా తెలుకుందాం. ఆ తరువాత తరావీ నమాజ్‌ని గురించి చర్చిద్దాం.

నమాజ్ కేవలం ఆరాధనకు సంబంధించిన ఒక సంప్రదాయం మాత్రమే కాదు. ఇది మొత్తం జీవితాన్నే దైవదాస్యంగా రూపొందించగల సమగ్ర దైవారాధన. నమాజ్‌లోని అంశాలు, ఆచరణలు నమాజ్ చేసే వ్యక్తికి అతని పూర్తి జీవితాన్ని దైవదాస్యంలో గడిపే శిక్షణనిస్తాయి. అయితే నమాజులో పఠించే సూరాలు, సంస్మరణలు మనిషి మనోమస్తిష్కాలపై ఎలాంటి ప్రభావాన్ని వేస్తాయి? అతని జీవితాన్ని ఇవి ఏ విధంగా దైవేతరుల దాస్యం నుంచి తీసి దైవదాస్యానికి కట్టుబడి ఉండేలా చేస్తాయి? వీటిని గురించి తెలుసు కోవాల్సిన అవసరం ఉంది.

మొట్టమొదట దాసుడు నమాజ్ చేయడానికి సంకల్పించుకుంటాడు. తద్వారా ఇతర విషయాలన్నిటినీ ఓ పక్కకు నెట్టేసి నమాజ్ మీదనే ధ్యాస ఉంచాలి. ఈ ఏకాగ్రత మనిషికి "నీవు దేవుని దాసుడవు" అన్న భావనను కలిగిస్తుంది. అంటే, "సంకల్పంలోని ఈ స్పిరిట్ నీ జీవితపు సమస్త వ్యవహారాల్లో ద్యోతక మవుతుండాలి. నీవు చేసే ప్రతి పని విషయంలో దైవప్రసన్నతా భాగ్యమే నీ ముందుండాలి." అని అర్థం అన్నమాట.

నమాజ్ సంకల్పం తర్వాత దాసుడు అల్లాహుఅక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు) అంటూ నమాజు ప్రారంభి స్తాడు. ఈ పదం నమాజులో అనేక సార్లు వస్తుంది. నమాజులో మాటిమాటికి ఇలా అల్లాహ్ అందరికంటే గొప్పవాడని అంగీకరించే మనిషి నమాజు వెలుపల ఇతర వ్యవహారాల్లో కూడా అల్లాహ్ మాత్రమే అందరికంటే

గొప్పవాడన్న తన మాటను నిలబెట్టుకుంటాడు. ఈ పదం అతనికి ప్రతిచోటా ఇలా గుర్తు చేస్తుంది: "నీవు అల్లాహ్‌ను అందరికంటే గొప్పవాడని ఒప్పుకున్నావు. అంచేత ప్రతి విషయంలో నీవు అల్లాహ్ ఆజ్ఞకే ఆధిక్యతనిస్తూ ఇతరుల ప్రేమ-విధేయతల సమక్షంలో దేవుని ప్రేమ-విధేయతలకే ప్రాధాన్యత నివ్వాలి."

అల్లాహుఅక్బర్‌లోని ఈ భావం గనక నమాజ్ చేసే వ్యక్తి  అంతర్యంలో బలంగా నాటుకుంటే, ఇక అతని జీవితంలోని ఏ రంగమూ దైవదాస్య పరిధిని అతిక్రమించ లేదు. అతను చేసే ప్రతిపనీ పలికే ప్రతిపలుకూ అతను దేవుని దాసుడని సాక్ష్యమిస్తాయి. అతని కార్యకలాపాలన్నీ దైవదాస్య భావనతో తొణికిసలాడుతుంటాయి.

ఆ తరువాత దాసుడు 'ఫాతిహా' సూరా పఠిస్తాడు. ఫాతిహా సూరాలో మొట్టమొదట అతను సమస్త విధాల ప్రసంశలు అల్లాహ్‌కే చెల్లుత్తాయి' అనంటాడు. ఈ విధంగా అతను అల్లాహ్ ఘనతను కొనియాడి, తాను లేక మరెవరైనా ప్రశంసలకు అర్హులు కాగలరు అన్న ఆలోచనను తన మేధ నుండి తీసివేస్తాడు. ఒకవేళ ఎవరికైనా ప్రశంస వర్తిస్తుందంటే అది అతను దైవదాసుడైన కారణంగానే వర్తిస్తుంది తప్ప మరో స్థాయిలో ఉన్న వ్యక్తిగా మాత్రం కాదు. ఈ యదార్థం తెలుసుకొని నమాజు చేసే మనిషి ఎల్లవేళలా దేవుని దాస్యానికే బద్ధుడైవుంటూ ఆయన ఆజ్ఞల పరిధిలోనే తన కార్యకలాపాలన్నిటిని నిర్వహిస్తాడు. దీనివల్ల అతనిలో ఏవైనా అహంకారం, ఆత్మస్థుతి భావాలు గనక ఉంటే అవికాస్తా అణగారిపోతాయి. అతను ఎలాంటి ఆత్మవంచనకూ పాల్పడలేడు.

దాసుడు దేవునికి కృతజ్ఞతలు ప్రకటించినప్పుడు, దేవుని పట్ల అతని హృదయంలో విధేయతా భావం జనిస్తుంది. అతనికి ఎన్నో వరాలు ప్రసాదించిన ఆ దేవుని యెడల అతని మనస్సులో ప్రేమా ఔన్నత్యాలు ఏర్పడతాయి. అతను సమర్పణ భావంతో తన శిరస్సును ఆయన ముందు వంచుతాడు. ఎంతో వినమ్రతతో చేతులు జోడించి వేడుకుంటాడు. తన మేధాసామర్థ్యాన్ని, శారీరక శక్తులను దేవుని అభీష్టం ప్రకారమే వినియోగిస్తాడు. ప్రతి వ్యవహారంలోనూ దేవుని ఇష్టాయిష్టాలకే ప్రాధాన్యతనిస్తాడు. ఆయన చేయమని ఆదేశించిన పనుల్ని సంతోషంగా చేస్తాడు. చేయకూడదని వారించిన పనుల్ని ఎలాంటి సంకోచం లేకుండా మానేస్తాడు.

దాసుడు ఆ తర్వాత ఫాతిహా సూరా పఠిస్తూ 'అల్లాహ్‌ను తీర్పుదినం అధిపతి' అని అంగీకరిస్తాడు. తానీ ప్రపంచంలో చేస్తున్న పనులన్నిటి ప్రతిఫలం పొందడానికీ ఒక రోజు నిర్ణీతమయిందని, ఆరోజు సత్కార్యాలకు పుణ్యఫలం, దుష్కార్యాలకు శిక్ష లభిస్తుందని, సర్వాధికారాలుగల విశ్వప్రభువు పూర్తి న్యాయంతో తీర్పు చెబుతాడని అతని మనోమస్తిష్కాలలో దృఢమైన నమ్మకం ఏర్పడుతుంది.

ఈవిధంగా ప్రతిరోజూ అనేకసార్లు పరలోక విశ్వాసాన్ని నోటితో ఉచ్చరించి మనస్సులో దాన్ని గట్టిగా ధృవపరచే మనిషి దైవదాస్య పరిధిని అతిక్రమించి ఎన్నటికీ



విశృంఖల జీవితం గడపలేడు. ఇలాంటి వ్యక్తి ఏ విషయంలోనయినా నోరు విప్పే ముందు అది దేవుని అభీష్టం ప్రకారమే ఉందా లేక దానికి వ్యతిరేకంగా ఉందా అని ఆలోచిస్తాడు. తాను మాట్లాడబోయే మాట దేవుని అభీష్టానికి అనుగుణంగా ఉంటే దాన్ని నోటి నుంచి వెలువరిస్తాడు. దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా ఉంటే మాత్రం పరలోకభీతితో దాన్ని మనస్సులోనే అణచిఉంచుతాడు.

అతను ఏ పని చేయవలసివచ్చినా ఆ పని చేయడానికి ముందు అది దేవునికి ఇష్టమైన పనేనా , పరలోకంలో దాని పర్యవసానం ఏమిటి అని ఆలోచిస్తాడు. ఆ పని దేవునికి ఇష్టమైనదయివుంటే, అది పరలోక పుణ్యఫలానికి కారణమవుతుందని భావించి దాన్ని చేస్తాడు. దీనికి బదులు ఆ పని దైవాభీష్టానికి వ్యతిరేకమైనదయివుంటే, అది పరలోక శిక్షకు దారితీస్తుందని భావించి దానికి దూరంగా ఉంటాడు.

నమాజు చేసే వ్యక్తి మనస్ఫూర్తిగా, పూర్తి స్పృహతో 'దేవుడు పరలోక తీర్పుదినం అధిపతి' అని అంగీకరిస్తే దేవుడు అతనికి సత్యాన్నే మాట్లాడే సద్బుద్ధి ప్రసాదిస్తాడు. అతని నోట మంచి మాటలే వెలువడుతాయి. అబద్ధం, అపనింద, అశ్లీలం, చెడు, దుర్భాష, దురుసుతనం లాంటి దైవాగ్రహానికి దారితీసే మాటలు ఎన్నటికీ వెలువడవు. దైవస్మరణ, మానవశ్రేయస్సు, ధర్మోన్నతా పథకాలతో సదా అతని మనోమస్తిష్కాలు నిండి ఉంటాయి.  అతను తన కాళ్ళూ చేతుల్ని పరోపకారానికి దైవధర్మ ప్రచారానికి, చెడుల నిర్మూలనకు, మంచిని స్థాపించడానికి మాత్రమే ఉపయోగిస్తాడు. దొంగతనం, దౌర్జన్యం, వ్యభిచారం, మద్యసేవనం వంటి చెడులకోసం అవి ఎన్నటికీ సిద్ధపడవు.

ఇలాంటి వ్యక్తి దేవుని హక్కుల్ని, ఆయన దాసుల హక్కుల్ని కాలరాయలేడు. ద్రోహం, దుష్ట సంకల్పం, మోసాలకు పాల్పడలేడు. స్వార్థం, స్వప్రయోజనాలకు ఒడిగట్ట లేడు. జీవితంలోని ఏ వ్యవహారంలోనూ అతను దైవదాస్య పరిధుల్ని అతిక్రమించ లేడు. ఆ తర్వాత దాసుడు "ప్రభూ! నేను నిన్నే ఆరాధిస్తున్నాను, నీసహాయమే అర్థిస్తాను" అంటాడు. అంటే అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిస్తానని, ఆయన సహాయాన్ని మాత్రమే అర్థిస్తానని అతను ప్రమాణం చేస్తున్నాడన్నమాట.

దాసుడు ఈ విధంగా నమాజులో ఫాతిహా సూరా ద్వారా అల్లాహ్‌ను వేడుకొని ఓ గొప్ప యదార్థాన్ని అంగీకరిస్తూ ఇలా ప్రమాణం చేస్తున్నాడు: "దేవా! నాకోసం ఆరాధనాలయం నీమస్జిదే. నా బలిపీఠం నీ పూజామందిరమే. నా రుకూ, సజ్దాలకు నీవే అర్హుడవు. నా వినయవిధేయతలు నీకే పరిమితం. నీ విధేయతకు వ్యతిరేకమైన నా ప్రతి మనో వాంఛను త్యజిస్తాను. నీవు ప్రసాదించినవి తప్ప ప్రజలు కల్పించుకున్న సమస్త దురాచారాలను, దుష్టసంప్రదాయాలను మానేస్తాను. నీ అభీష్టానికి వ్యతిరేకమైన యావత్తు మూఢనమ్మకాలకు, కుటుంబాచారాలకు, జాతీయ సంప్రదాయాలకు దూరంగా ఉంటాను. నీ షరీఅత్‌కు విరుద్ధమైన చట్టాలను సుతరామూ పాటించను. నీ ధర్మంతో పొసగని విషయాల జోలికిపోను. అన్ని విధాల దాస్యాన్ని, బానిసత్వాన్ని

నిర్ద్వందంగా త్రోసిపుచ్చి, నీ దాస్యం మాత్రమే చేస్తాను. ఆపద సమయాల్లో నీవే నా రక్షకుడివి, ఆపత్బాంధవుడవు. సహాయంకోసం చేతులెత్తి నీ సన్నిధిలోనే వేడుకుంటాను. నీవు తప్ప నా అసవరాలను తీర్చేవాడు, నన్ను ఆపదల నుండి గట్టెక్కించేవారు మరెవరూ లేరు. నీవే నా సంరక్షకుడవు."

ఇక్కడ ఒక విషయం గమనార్హం. దాసుడు, "దేవా! నేను నిన్ను ఆరాధిస్తున్నాను, నీ సహాయం అర్థిస్తున్నాను" అని మాత్రమే ప్రమాణం చేయడు. "నేను నిన్నే ఆరాధిస్తున్నాను, నీ సహాయమే అర్థిస్తాను" అని ప్రమాణం చేస్తాడు. 'నేను నిన్ను ఆరాధిస్తున్నాను, నీ సహాయం అర్థిస్తున్నాను' అంటే "ఒకసారి నీఆజ్ఞల్ని పాటిస్తాను, మరొకసారి మనో వాంఛల్ని, కుటుంబ సంప్రదాయాలను, మానవకల్పిత చట్టాలను కూడా పాటిస్తాను, ఒకసారి నీ ముందు సాష్టాంగపడతాను; మరొకసారి ఇతరుల ముందు సాష్టాంగ పడతాను; అంటే కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలుకుంటాను; ఒకప్పుడు నీ దాస్యం చేస్తాను; వేరొకప్పుడు ఇతరులక్కూడా దాస్యం చేస్తాను; కొన్ని సమయాల్లో నీసహాయం కోరుతాను; మరికొన్ని సమయాల్లో ఇతరుల సహాయాన్ని అర్థిస్తాను" అని అర్థం వస్తుంది.

దీనికి భిన్నంగా, నేను నిన్నే ఆరాధిస్తాను, నీ సహాయమే అర్థిస్తాను అంటే, "ప్రభూ! నేను నిన్నే పూజిస్తాను, నిన్ను తప్ప మరెవ్వరినీ పూజించను, నీకు మాత్రమే విధేయుడనై ఉంటాను, మరెవరికీ విధేయుణ్ణయి వుండను, నీ ఆజ్ఞలనే శిరసావహిస్తాను, వేరెవరి ఆజ్ఞలనూ శిరసావహించను, సహాయం కోసం కూడా నిన్నే అర్థిస్తాను, మరెవరి సహాయం కోసం చేతులు జోడించను" అని భావం.

ఈవిధంగా నమాజులో రోజుకు అనేకసార్లు దైవదాస్య ప్రమాణం చేసే మనిషి మిథ్యాదైవాల పెత్తనం క్రిందికి ఎలా పోగలడు? అతని జీవితాన్ని దైవేతరుల అధికారం ఎలా ప్రభావితం చేయగలుగుతుంది? అతని వ్యాపారలావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలు, సామాజిక కార్యకలాపాలు, విద్యాశిక్షణలు, సుఖదుఃఖాలు దేవుని విధేయతా పరిధి దాటి ఎలా బయటికి పోగలవు? అతను ఇలా ప్రమాణం చేసిన తర్వాత అతను తన జీవితంలోని వ్యక్తిగత, సామూహిక రంగాలన్నింటిని దైవిధేయతా సౌరభంతో నింపుతాడు. తన జీవిత సకలరంగాలను దేవుడు నిర్దేశించిన శాసనాలకు కట్టుబడి ఉండేలా మలచుకుంటాడు. ఏ వ్యవహారంలో కూడా అతను దేవుని హద్దులను అతిక్రమించలేడు.

దాసుడు ఈవిధంగా ప్రమాణం చేసిన తరువాత, "దేవా! నాకు రుజుమార్గంపై నడిచే సద్బుద్ధి అనుగ్రహించు; నీ ఆగ్రహానికి గురయి భ్రష్టులు, శాపగ్రస్తులయిన వారి మార్గం నుండి నన్ను తప్పించి కాపాడు" అని వేడుకుంటాడు. దాసుడు వేడుకునే ఈ రుజుమార్గాన్నే ఖుర్ఆన్ పరిభాషలో "సిరాతుల్‌ముస్తఖీం" అని అంటారు. ఈ రుజుమార్గమే దైవారాధనా మార్గం.

అంటే, "దేవా! నన్నీ ప్రపంచంలో నీ ఆరాధనా మార్గంలో నడిపించు; నేను వేసే ప్రతి అడుగు నీ దాస్యం వైపుకు, నీ విధేయత వైపుకు పురోగమించేలా చెయ్యి; నా



శక్తిసామర్థ్యాలన్నీ నీ ప్రసన్నతా భాగ్యంకోసమే వినియోగింపజెయ్యి; నా నోట వెలువడే ప్రతిపలుకూ, నాచేత జరిగే ప్రతిపనీ నీ హితవులకు అనుగుణంగా ఉండేలా కట్టడి చెయ్యి. జీవితాంతం, జీవిత సకలరంగాల్లో నన్ను దైవప్రవక్తలు, అమరగతులు, సత్యసంధులు నడచిన బాటపై నడిపించు. నీ దర్శన భాగ్యానికి గొనిపోయే, నీ స్వర్గసీమకు చేర్చే దారినే నన్ను నడిపించు" అని అర్థం.

ఆ తరువాత దాసుడు రుకూ స్థితి లోకిపోయి- "నా ప్రభువు పరిశుద్ధుడు, మహోన్నతుడు" అని అంటాడు. రుకూ నుండి సజ్దా స్థితిలోకి పోయి "నా ప్రభువు పరిశుద్ధుడు, సర్వాధికుడు" అని అంటాడు. ఈ పలుకుల ద్వారా అతను "ఔన్నత్యం, ఆధిక్యతలు అల్లాహ్‌కు మాత్రమే ఉన్నాయి. ఆయన గుణగణాల్లో, శక్తి సామర్థ్యాల్లో, ఆయన అధికారాల్లో నేను మరెవరికీ చోటు కల్పించను. నేను నా జీవితంలోని ఏ రంగంలో కూడా ఆయన దాస్య పరిధిని వదలి ఇతరుల దాస్యంలోకి పోను. నేను మానవుల స్వయంకృత చట్టాల ఆధిక్యతకు చరమగీతం పాడి, దేవుని సహజ శాసనాల ఆధిక్యతను స్వాగతిస్తాను. నేను అన్ని వైపుల నుండి విముఖుణ్ణయి నా ప్రభువు వైపుకే ఎల్లప్పుడూ మరలి ఉంటాను" అని ప్రకటిస్తాడు.

ఈ వివరణనుబట్టి నమాజ్ ఎంత సమగ్రమైన ఆరాధనో, అది జీవితాన్ని ఎంత ప్రభావితం చేస్తుందో మనకు స్పష్టంగా తెలుస్తోంది. అందుకే నమాజుకు ఎంతో ప్రాముఖ్యం వచ్చింది. నమాజు చేసే వ్యక్తి ఫాతిహా సూరాని అర్థం చేసుకుంటూ పూర్తి స్పృహతో పఠిస్తే అతని జీవిత స్వరూపాన్ని సమూలంగా మార్చివేయడానికి ఇదొక్క సూరా చాలు. ఈ కారణంగానే ఒక హదీసులో "ఫాతిహా సూరా పారాయణం జరగని నమాజ్ నమాజే కాదు" అని పేర్కొనబడింది.

**ప్రభావం లేని నమాజ్:-** ఖుర్ఆన్‌లో కపట విశ్వాసుల దుర్లక్షణాలు పేర్కొనబడ్డాయి. వాటిలో నమాజ్‌కు సంబంధించిన దుర్లక్షణాలు కూడా ఉన్నాయి. ఈనాడు కొందరు ముస్లింలు కపట విశ్వాసులు కాకపోయినా వీరి నమాజ్‌లో కూడా ఈ కాపట్య కాలుష్యం తొంగిచూస్తుంది. ఖుర్ఆన్ ఏమంటున్నదో చూడండి:

"పరలోక తీర్పును ధిక్కరించే వాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్సహించనివాడు. ప్రార్థన పట్ల అశ్రద్ధ, ఏమరుపాటులు వహించేవారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. వారు ప్రతిపనీ లోకులమెప్పు కోసం చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణ వస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు." (107:1-7)

"వారు నమాజు చేయడానికి నిల్చుంటే బద్ధకంచేస్తూ లోకుల మెప్పు కోసం నిలబడతారు. పైగా దేవుడ్ని చాలా తక్కువగా స్మరిస్తారు." (4:142) "వారు నమాజు చేయడానికి బయలుదేరితే వళ్ళు విరుచుకుంటూ బద్ధకంతో లేస్తారు. దైవమార్గంలో ధనం

ఖర్చుపెట్టవలసివస్తే ఏడ్పుగొట్టు ముఖంతో అయిష్టంగా ఖర్చుపెడతారు." (9:54)

నమాజులో అశ్రద్ధ, ఏమరుపాటులంటే నిర్ణీత వేళ దాటిన తర్వాత చేయడం. అయితే నమాజు చేస్తున్నప్పుడు మనసులో ఏవేవో ఆలోచనలు వస్తాయి. మరి ఇది కూడా నమాజు పట్ల అశ్రద్ధే కదా అంటారు కొందరు. మానవబలహీనత కారణంగా ఇలాంటి ఆలోచనలు సహజం. కాని నిజమైన విశ్వాసి తన దృష్టి వేరే ఆలోచనల వైపు మళ్ళిందని గ్రహించగానే తిరిగి నమాజుపై దృష్టి సారించడానికి ప్రయత్నిస్తాడు. లోకుల మెప్పు కోసం నమాజు చేసేవారు నమాజుపై మనస్సు కేంద్రీకరించరు. ఈ సూక్తుల్లో పేర్కొనబడ్డ అశ్రద్ధ, ఏమరుపాటులు ఇలాంటి వ్యక్తులకే వర్తిస్తాయి.

కొందరు పిసినారులు ఇరుగుపొరుగు వాళ్ళు తాత్కాలికంగా వాడుకోవడానికి అడిగే చిన్న చిన్న వస్తువుల్ని కూడా ఇవ్వరు. ఉదాహరణకు, చెంబు, చాంతాడు, గొడ్డలి, కలం, పుస్తకం, స్టౌ, సైకిల్, కుర్చీలు వగైరా. ఇలాంటి చిన్న వస్తువులు సైతం ఇవ్వడానికి నిరాకరించడమంటే అది పిసినారితనానికి పరాకాష్ఠ అన్నమాట. ఆ మాత్రం త్యాగభావం కూడ లేనివాడ్ని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు.

ఇలాంటి వ్యక్తులు చేసే నమాజ్ వారిని ఎలా ప్రభావితం చేస్తుంది? వారు చేసే ప్రార్థనలు ఎలా స్వీకరించబడతాయి? రమజాన్ మాసంలో వారు యాచకులకు చేసే కానీ, యాగానీ దానాలు వారి పాపాలను ప్రక్షాళనం చేస్తాయని ఆశించగలమా? వారు నమాజులో పఠించే, వినే ఖుర్‌ఆన్ సూక్తులు అర్థంకాకపోతే వేరే సమయంలో వాటి అనువాదం ఎందుకు చదవరు? చదవకపోతే వారిపై వారి నమాజ్ ప్రభావం ఎలా పడుతుంది? ఈ విషయం గురించి చిత్తశుద్ధితో ఆలోచించి, అధ్యయనం చేయాలి. అర్థం చేసుకున్నవారికే దేవుడు ఆచరణ సద్బుద్ధి ప్రసాదిస్తాడని ఆశించగలం.

## 39. ఖుర్‌ఆన్ పఠనం, పఠన సజ్దా

దివ్య ఖుర్‌ఆన్ కలియుగ పాఠ్యగ్రంథం. కనుక దీన్ని ముస్లింలు నిత్యం పఠిస్తూ ఉండాలి. నిత్య పఠనం కోసం మన సృష్టికర్త విభిన్న సమయాల్లో రోజుకు అయిదు సార్లు విధిగా నమాజ్ చేయాలని నిర్దేశించినప్పటికీ, అరబ్బీ భాష రానివారు నమాజ్ వేళల తరువాత తమకు తెలిసిన భాషలో ఖుర్‌ఆన్ అనువాదం కూడా చదువుతూ ఉండాలి. అందులోని ఒక్కొక్క విషయాన్ని గురించి యోచించాలి. అప్పుడే వారు దాన్ని సరిగా అర్థం చేసుకొని తదనుగుణంగా ఆచరించ గలుగుతారు.

ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు ఆత్మశుద్ధితో పాటు దేహశుద్ధి కూడా ఉండాలి.

"ఇది సురక్షిత గ్రంథంలో (రాయబడి) ఉన్న మహిమాన్వితమైన ఖుర్‌ఆన్. దీన్ని పవిత్రులు, పరిశుద్ధులు తప్ప మరెవ్వరూ తాకలేరు." (ఖుర్‌ఆన్-56:79)

అవిశ్వాసులు ఖుర్‌ఆన్‌ని విశ్వసించడానికి నిరాకరిస్తూ, దాన్ని ఏ భూతమో, పిశాచమో ముహమ్మద్ (సల్లం)కు నేర్పుతోందని ఆరోపించేవారు. దేవుడు వారి



ఆరోపణలను ఖండిస్తూ, ఈ అద్భుతవాణి దేవలోకంలోని ఓ సురక్షిత గ్రంథంలో ఉంచబడిందని, అక్కడికి ఎవరూ పోలేరని, భూతపిశాచాలకు ఆ శక్తి లేదని, అవి దాన్ని తాకనైనా తాకలేవని చెబుతున్నాడు. పరిశుద్ధులు, పాపరహితులైన దైవదూతలు మాత్రమే ఈ దివ్యగ్రంథాన్ని తాకడానికి, దాన్ని దివి నుండి భువికి దించడానికి అర్హులని కూడా దేవుడు ఈ సూక్తిలో స్పష్టం చేశాడు.

పై సూక్తి చారిత్రక బ్యాక్‌గ్రౌండ్ ఇలా ఉంటే, అధికసంఖ్యాక ధర్మవేత్తలు ఇదే సూక్తిని ప్రమాణంగా తీసుకొని ఉజూ లేకుండా ఖుర్‌ఆన్‌ని తాకకూడదని ఆంక్ష విధించారు. ఉజూ లేకుండా ఖుర్‌ఆన్‌ని తాకకూడదుగాని, పారాయణం మాత్రం నిస్సంకోచంగా చేయవచ్చని కూడా అన్నారు మన ధర్మవేత్తలు. ఖుర్‌ఆన్ పరిశోధన పట్ల ఆసక్తిగలవారు తీరిక దొరికినప్పుడల్లా స్వేచ్ఛగా ఖుర్‌ఆన్ చదవాలనుకుంటే ఈ ఆంక్షలు వారిని కొంచెం ఇరకాటంలో పెడ్తున్నాయి.

మరికొందరు ధర్మవేత్తలు ఖుర్‌ఆన్‌ని ఉజూ లేకుండా తాకడం అధర్మం ఏమీ కాదుకాని, అలా చేయడం సమంజసం కాదన్నారు.

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) ఉజూతో కూడా, ఉజూ లేకుండా కూడా ఖుర్‌ఆన్ పఠించేవారు. కాకపోతే లైంగిక అపరిశుద్ధావస్థలో మాత్రం ఎన్నడూ ఖుర్‌ఆన్ పఠించలేదు." (మిష్కాత్)

హజ్రత్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "బహిష్టు అయిన మహిళ, లైంగిక అపరిశుద్ధావస్థలో ఉన్నవారు ఖుర్‌ఆన్‌ని ఏమాత్రం పఠించకూడదు." (తిర్మిజి)

**పఠన ప్రాముఖ్యం:-** దైవప్రవక్త (సల్లం) నిత్య ఖుర్‌ఆన్ పఠనం గురించి తమ అనుచరుల్ని ఎంతో ప్రోత్సహించారు. ఆయన ఖుర్‌ఆన్ పఠన ప్రాముఖ్యం గురించి అనుచరులకు హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు:

"ఎవరైతే ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేసి, దాన్ని ప్రతిరోజూ పఠిస్తూ ఉంటాడో అతను కస్తూరీ నిండిన (మూతలేని) జాడీ లాంటివాడు. దాని పరిమళం నలువైపులా గుబాళిస్తుంది. మరెవరైతే ఖుర్‌ఆన్‌ని అధ్యయనం మాత్రమే చేసి, దాన్ని (రోజూ) పఠించని మనిషి కస్తూరీ నింపి బిరడా బిగించిన సీసా లాంటివాడు." (తిర్మిజి)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: ప్రళయదినాన (హషర్ మైదానంలో) ఖుర్‌ఆన్ పఠించే మనిషితో (దైవదూతలు) ఇలా అంటారు- "నీవు భూలోకంలో ఉన్నప్పుడు ఖుర్‌ఆన్‌ని ఏవిధంగా వినమ్రతతో, సౌమ్యంగా పఠిస్తుండేవాడవో అదేవిధంగా ఇప్పుడు పఠించు. తద్వారా ప్రతి ఆయత్ (సూక్తి)కి ప్రతిఫలంగా ఒక్కొక్క అంతస్తు ఎక్కుతూ పైకెళ్ళు. నీ గమ్యస్థానం నీవు పఠించే చివరిసూక్తి దగ్గర ఉంది." (తిర్మిజి)

ఖుర్‌ఆన్ విషయంలో ఎటో ధ్యాస పెట్టి అనేక సూరాలు వడివడిగా చదవడం

కంటే కొన్ని సూక్తులైనా సరే మనస్సు లగ్నం చేసి యోచనా దృష్టితో అధ్యయనం చేయడం ఎంతో మంచిది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: "అల్‌బఖరా, ఆలిఇమ్రాన్ వంటి పెద్ద పెద్ద సూరాలు అర్థం చేసుకోకుండా వడివడిగా పఠించడం కంటే అల్‌ఖారిఅత్, అల్‌ఖద్ర్ వంటి చిన్న చిన్న సూరాలు యోచిస్తూ, అర్థం చేసుకుంటూ పఠించడమే మంచిదని నేను భావిస్తున్నాను." (ఆసాన్ ఫిఖ్హా, రెండవ భాగం)

ప్రఖ్యాత తత్వవేత్త, దైవప్రియుడయిన హజ్రత్ హసన్ బస్రీ (రహ్మాలై) కథనం: "ఖుర్‌ఆన్ దేవుని ఆదేశం (దైవగ్రంథం) అని, ఆయన తరపు నుండే అవతరించిందని మన పూర్వీకులు దృఢంగా నమ్మేవారు. అందువల్ల వారు రాత్రివేళల్లో యోచన, పరిశీలనా దృష్టితో దాన్ని లోతుగా అధ్యయనం చేసేవారు; పగలు దాని ఆదేశాల ప్రకారం ఆచరించేవారు. కాని ఇప్పుడు మీ పరిస్థితి చాలా శోచనీయం. మీరు ఖుర్‌ఆన్‌లోని పదాలను (చిలుక పలుకుల్లా పఠిస్తూ, వాటి అక్షరాల కొమ్ములు, గుడింతాలు సరిచేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. కాని ఆచరణ విషయంలో మాత్రం మీరు చాలా బద్ధకస్తులైపోయారు." (కీమియాయె సాదత్)

బైబిల్ పాత నిబంధనంలో దేవుడు తన దాసుడ్ని ఇలా హెచ్చరిస్తున్నాడు: "నా దాసుడా! నీకు సిగ్గు లేదా? నీవు ప్రయాణంలో ఉన్నప్పుడు నీ సోదరుని దగ్గర్నుంచి దారిలో ఏదైనా ఉత్తరం నీ వద్దకు వస్తే నీవు వెంటనే ఆగిపోయి, దారి నుండి పక్కకు తొలగి ఆ ఉత్తరంలోని ఒక్కొక్క పదాన్ని అర్థం చేసుకుంటూ, ఆలోచిస్తూ పఠిస్తావు. అయితే ఈ గ్రంథం (తౌరాత్) నా ఆదేశం. అందులోని విషయాలను పరిశీలిస్తూ, యోచిస్తూ ఉండాలని, దాని ఆజ్ఞలను ఆచరించాలని నేను నీకు రాశాను. కాని నీవు మాత్రం దీన్ని నిరాకరిస్తూ ఆచరించడానికి బద్ధకిస్తున్నావు. ఒకవేళ ఎప్పుడైనా కాస్త పఠించినా దాన్ని యోచనా, పరిశీలనా దృష్టితో పఠించవు." (కీమియాయె సాదత్)

ఖుర్‌ఆన్ పఠనానికి మించిన గొప్ప ధ్యానం, సంస్మరణలు లేవు. అలాగే ఆధ్యాత్మిక వికాసం, నైతిక సంస్కరణల కోసం ఖుర్‌ఆన్ పఠనం కంటే గొప్ప సాధనం కూడా మరేమీ లేదు. అంతేకాదు, ఖుర్‌ఆన్ పఠనం కన్నా గొప్ప ఆరాధన కూడా ఏదీ లేదు. ఖుర్‌ఆన్ పఠనం సమక్షంలో ఎవరైనా ధ్యానం, సంస్మరణలకు (జికిర్‌కు) ప్రాధాన్యం ఇస్తున్నాడంటే అతనికి దైవధర్మం పట్ల సరైన అవగాహన లేదన్న మాట. ఖుర్‌ఆన్ పఠనం ద్వారానే దాసుడు అందరికంటే ఎక్కువ దైవసాన్నిధ్యం పొంద గలుగుతాడని దైవప్రవక్త (సల్లం) అన్నారు. (కీమియాయె సాదత్)

దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్ పఠనం గురించి స్పష్టంగా ఇలా ప్రవచించారు: "నా అనుచర సముదాయం కోసం అన్నిటికంటే గొప్ప ఆరాధన ఏదైనా ఉందంటే అది ఖుర్‌ఆన్ పఠనమే." (కీమియాయె సాదత్)



ఖుర్‌ఆన్ పఠనం తరువాత దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా 'దుఆ' చేసేవారు:

"దేవా! ఖుర్‌ఆన్ ద్వారా నీవు నన్ను కరుణించు. ఖుర్‌ఆన్‌ని నాకు మార్గదర్శినిగా చేసి నా కోసం హితబోధినిగా, కారుణ్యప్రదాయినిగా రూపొందించు. దేవా! ఇందులో నేనేదయినా మరచిపోతే దాన్ని నాకు గుర్తుచేయి, నేను ఎరగని విషయాలు నాకు నేర్పు. నేను రాత్రివేళ కొంతసమయం, ఉదయం, సాయంత్రం దీన్ని పఠించేలా నాకు సద్బుద్ధి ప్రసాదించు. సర్వలోకప్రభూ! ఈ గ్రంథాన్ని నాకు అనుకూలంగా మాట్లాడే సాక్షినిగా చెయ్యి." (కీమియాయె సాదత్)

**పఠన సజ్దా:-** ఖుర్‌ఆన్‌లో పధ్నాలుగు ప్రత్యేక సూక్తులు ఉన్నాయి. వాటిని పఠించేవారు, వినేవారు విధి (వాజిబ్)గా సజ్దా చేయవలసి ఉంటుంది. సూక్తి పూర్తిగా పఠించిన తర్వాతగాని, సజ్దాగుర్తున్న పదం సమీపంలోని వాక్యం పూర్తయిన తర్వాత గాని సజ్దా చేయాలి. దీన్ని "పఠనసజ్దా" (సజ్దాయేతిలావత్) అంటారు.

దైవప్రవక్త (సల్లం) ఓసారి సజ్దా (సాష్టాంగ ప్రమాణం) గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "మనిషి సజ్దా సూక్తి పఠించి సజ్దా చేసినప్పుడు షైతాన్ ఓ మూలకు వెళ్ళి కూర్చొని 'అయ్యయ్యో' అంటూ తెగ బాధ పడుతుంటాడు. ఆ బాధతో 'అయ్యో! (నేనెంతటి దౌర్భాగ్యుడ్ని!!) ఆదం సంతానాన్ని సజ్దా చేయండని ఆజ్ఞాపించినప్పుడు ఆదం సంతానం సజ్దా చేసి స్వర్గ ప్రవేశానికి అర్హులైపోయారు. నన్ను సజ్దా చేయమని ఆజ్ఞాపించినప్పుడు నేను సజ్దా చేయడానికి తిరస్కరించి నరకాగ్నికి అర్హుడైపోయాను' అని పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. (సహీముస్లిం, ఇబ్నెమాజ)

నమాజ్‌లో ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు సజ్దా సూక్తి రాగానే అల్లాహుఅక్బర్ అంటూ సజ్దాలోకి పోవాలి. సజ్దాలో యథాప్రకారం 'సుబ్‌హాన రబ్బియల్‌ఆలా' అని కనీసం మూడుసార్లు చెప్పి తిరిగి అల్లాహుఅక్బర్ అంటూ లేచినిలబడాలి. ఇతర సమయాల్లో కూర్చొని లేదా వాహనమెక్కి పోతూ ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు కూడా పఠన సజ్దా (సజ్దా తిలావత్) చేయాలి. అప్పుడు ఉజూతో ఉండాలని, ఖిబ్లా వైపుకు తిరగాలని, నమాజ్‌లో చేసే సజ్దాలాగా నుదురు-ముక్కు నేలకు ఆనిచ్చాలని ధర్మవేత్తలు అభిప్రాయ పడ్డారు. కాని ఈ షరతులకు హదీసుల్లో ఎలాంటి ప్రమాణం కన్పించదు.

"ఇమామ్ బుఖారి (రహ్మాలై) హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ని గురించి వ్రాస్తూ, ఆయన ఉజూ లేకుండా పఠన సజ్దా చేసేవారని అన్నారు. హజ్రత్ అబూ అబ్దుర్రహ్మాన్ సలమీ (రహ్మాలై) గురించి 'ఫతహుల్‌బారీ'లో ఇలా ఉంది- 'ఆయన ఉజూతోఉన్నా లేకపోయినా, ఖిబ్లాకు అభిముఖంగా ఉన్నా లేకపోయినా సరే దారిలో నడుస్తూ ఖుర్‌ఆన్ పఠించేవారు. సజ్దా సూక్తి వచ్చినప్పుడు శిరస్సు వంచేవారు.' కాబట్టి ఒకవేళ ఎవరైనా అధికసంఖ్యాక ధర్మవేత్తల దృక్పథానికి వ్యతిరేకంగా నడిస్తే అతడ్ని నిందించకూడదని మేము భావిస్తున్నాము. అధికసంఖ్యాక ధర్మవేత్తల దృక్పథాన్ని

సమర్థించే ఎలాంటి నిరూపిత సున్నత్ (హదీసు గ్రంథాల్లో) లేదు. పైగా మన పూర్వీకుల్లో 'అధికసంఖ్యాక ధర్మవేత్తల' దృక్పథానికి వ్యతిరేకంగా ఆచరించిన వారు కూడా అనేక మంది ఉన్నారు." (తఫ్హీముల్ ఖుర్ఆన్, రెండవ భాగం)

# 40. జిక్ర్-దుఆలు

ముస్లింలు జిక్ర్, దుఆలకు కూడా ప్రాముఖ్యం ఇవ్వాలి. 'జిక్ర్' అంటే స్మరణ, ప్రస్థావన అనే అర్థాలు ఉన్నాయి.

"విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించిపోయే సమయమింకా రాలేదా? ఆయన పంపిన సత్యం ముందు లొంగిపోయే వేళ ఆసన్నం కాలేదా?" (ఖుర్ఆన్-57:16)

**జిక్ర్:-** పైసూక్తిలోని మూలభాషలో 'జిక్ర్' అనే పదమే ఉంది. ఇక్కడ జిక్ర్ అంటే దైవనామ స్మరణ లేక జపం లేక ధ్యానం కాదు. ఈ సూక్తిలో జిక్ర్ అనే పదం విస్తృతభావంతో కూడుకున్నది. దేవునికి సంబంధించిన, ఆయన ధర్మానికి సంబంధించిన ప్రతి విషయమూ జిక్ర్ కిందికే వస్తుంది. దేవుడు తన గ్రంథం ద్వారా తెలిపిన సమస్త విషయాలు, ఆయన ఆదేశించిన-సూచించిన సంగతులన్నీ జిక్ర్ కిందికే వస్తాయి. ఖుర్ఆన్‌కు మరో పేరు "అజ్జిక్ర్" అని కూడా ఉంది. ఇక్కడ అజ్జిక్ర్ అంటే జ్ఞాపకం చేసేదని అర్థం. ఖుర్ఆన్ మానవులకు వారు మరచిపోయిన పాఠాలను జ్ఞాపకం చేస్తుంది కనుక దాన్ని 'అజ్జిక్ర్' అని కూడా పేర్కొనడం జరిగింది.

ఖుర్ఆన్ అనేక చోట్ల దైవప్రవక్తల ప్రస్తావనను కూడా జిక్ర్ అనే పేర్కొన్నది. 'జుముఅ' సూరాలో పేర్కొనబడిన 'జిక్రిల్లా' అంటే దైవధ్యానం లేదా దైవనామ స్మరణ అని అర్థం కాదు. ఇక్కడ 'జిక్రిల్లా' అంటే శుక్రవారం జుమా నమాజ్‌లో నమాజ్‌కు పూర్వం చేసే ధర్మబోధ (మస్నూన్ ఖుత్బా) అని అర్థం. దైవధర్మం గురించి తెలుసుకునే పని కూడా జిక్ర్ కిందికే వస్తుంది. ప్రత్యేకంగా దైవధ్యానం అర్థంలో కూడా కొన్ని విషయాలు ఉన్నాయి. వాటిని మనం కూర్చొని, నిల్చొని, పడుకొని, నడుస్తూ లేదా యాంత్రికమైన మరే పని చేస్తున్నప్పుడయినా సరే పఠిస్తుండవచ్చు.

ఒక హదీసులో 33 సార్లు "సుబ్హానల్లాహ్," 33 సార్లు "అల్‌హమ్దులిల్లాహ్," 34 సార్లు "అల్లాహుఅక్బర్" అని జికర్ చేయడం ఎంతో పుణ్యప్రదమైన విషయమని ఉంది. ఈ జిక్ర్ ఫరజ్‌నమాజ్ తరువాత చేయడం మంచిది. అలాగే "లాఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్" అని కూడా ధ్యానం చేయవచ్చు.

నమాజ్ తర్వాత చేయవలసిన కొన్ని దుఆలు ఇక్కడ పేర్కొనబడుతున్నాయి:

"అస్తగ్ఫిరుల్లాహ, అస్తగ్ఫిరుల్లాహ, అస్తగ్ఫిరుల్లాహ, అల్లాహుమ్మ అన్తస్సలాము వమిన్‌కస్సలాము తబారక్‌త యాజల్‌జలాలి వల్‌ఇక్రామ్." (ముస్లిం)



అర్థం:- నేను దేవుడ్ని నా పాపాలు క్షమించమని అర్థిస్తున్నాను. నేను దేవుడ్ని నా పాపాలు క్షమించమని అర్థిస్తున్నాను. నేను దేవుడ్ని నా పాపాలు క్షమించమని అర్థిస్తున్నాను. దేవా! నీవు శాంతిమయుడవు. నీ నుండే శాంతి లభిస్తుంది. మహోపకారీ! మహానుభావా!! నీవు గొప్ప శుభకరుడవు.

దైవప్రవక్త (సల్లం) ఒకసారి హజ్రత్ ముఆజ్ (రజి) చేయి పట్టుకొని "ముఆజ్! నాకు నీ మీద అభిమానం ఉంది" అన్నారు. తర్వాత ఆయన ఇలా ఉపదేశించారు:

"అల్లాహుమ్మ అఇన్నీ అలా జిక్రిక వషుస్ని ఇబాదతిక" (అర్థం: దేవా! మేము నిన్ను స్మరించడానికి, నీకు కృతజ్ఞత చెప్పుకోవడానికి, నిన్ను గొప్పగా ఆరాధించడానికి వీలుగా మాకు సహాయం చెయ్యి.)- (రియాజుస్సాలిహీన్)

**దుఆలు (వేడుకోలు):-** దుఆ చేయడం అంటే అర్థించడం, ప్రార్థించడం, వేడుకోవడం, బ్రతిమాలడం, మొరపెట్టుకోవడం, విన్నవించుకోవడం అనే అర్థాలు ఉన్నాయి. ప్రతి విషయంలోనూ శక్తి, అధికారం, కలిగివున్న ఏ శక్తిస్వరూపుని అధీనంలో మన కష్టసుఖాలు, లాభనష్టాలు ఉన్నాయో ఆ అద్వితీయుడ్ని మాత్రమే వేడుకోవడం, మొరపెట్టుకోవడం జరగాలి. ఆ అద్వితీయుడు సర్వసృష్టికర్త, విశ్వప్రభువు, నిజయజమాని అయిన అల్లాహ్ మాత్రమే. ఆయనే మన ఆపద్బాంధవుడు, ఆపదల మొక్కులవాడు. కనుక మానవులు తమ వేడుకోళ్లు, మొరలు, విన్నపాలు ఆ ఏకైక దేవునికే ప్రత్యేకించాలి. ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

✦ "నీవు ఏకాగ్ర చిత్తుడవయి ఈ ధర్మంలోనే స్థిరంగా ఉండు. బహుదైవారాధకుల్లో చేరిపోకు. దేవుడ్ని వదలి నీకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని మిథ్యాదైవాలను ఎన్నటికీ ప్రార్థించకు. అలా చేస్తే నీవు దుర్మార్గుడవైపోతావు. దేవుడు నిన్ను ఏదయినా కష్టానికి గురిచేయదలిస్తే ఆయన తప్ప ఆ కష్టం నుండి నిన్ను గట్టెక్కించేవారు మరెవరూ ఉండరు." (10:105,106)

✦ "నాదాసులు నాగురించి అడిగితే నేను వారికి చేరువలోనే ఉన్నానని చెప్పు. మొరపెట్టుకునేవాడు నన్ను మొరపెట్టుకుంటున్నప్పుడు నేనతని మొరాలకించి, దానికి సమాధానం ఇస్తానని కూడా చెప్పు. అయితే వారు నా సందేశాన్ని స్వీకరించి నా పట్ల పూర్తి విశ్వాసం కలిగివుండాలి. అప్పుడే వారు సన్మార్గం పొందగలరు." (2:186)

✦ "కొందరు ప్రజలు దేవుడ్ని ప్రార్థిస్తూ " ప్రభూ! మాకు (నీవు ప్రసాదించేవన్నీ) ప్రపంచంలోనే ప్రసాదించు" అంటారు. అలాంటివారికి (ప్రపంచంలోనే తప్ప) పరలోక (స్వర్గ)ంలో ఎలాంటి వాటా లభించదు." (2:199)

✦ "మీరు నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థన స్వీకరిస్తాను. అహంకారంతో నన్ను ఆరాధించడానికి అంగీకరించనివారు నీచులై నరకానికి పోతారు." (40:60)

**వివరణ:-** కష్టసుఖాలు, లాభనష్టాలు, కీడు-మేళ్ళు అన్నీ సృష్టికర్త, విశ్వపాల

కుడైన దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయనే సర్వేశ్వరుడు, అసాధారణ శక్తిసంపన్నుడు. ఆయన తన దాసుల మొరలను ఎలాంటి మధ్యవర్తులు లేకుండానే ప్రత్యక్షంగా వింటాడు; తాను తలచుకున్నవారికి సహాయం కూడా చేస్తాడు. కనుక మానవులు ఎట్టి పరిస్థితులు ఎదురైనా ఆయన్నే వేడుకోవాలి.

ఈ కార్యకారణ ప్రపంచంలోని సహజ వనరులు, సాధనసంపత్తులేవీ ఒక్కోసారి దాసుల కష్టాలు దూరంచేయలేవు, వారి అవసరాలు తీర్చలేవు. అప్పుడు దాసులు అసాధారణ శక్తిసంపన్నుడి (Super Natural Power)ని మొరపెట్టుకోవడానికి సిద్ధమవుతారు. ఈ అసాధారణ శక్తిసంపన్నుడు, సృష్టికర్త, సర్వేశ్వరుడయిన దేవుడే అని గుర్తించాలి. ఆయన్ని వదలి సృష్టితాలను వేడుకునేవారు ప్రపంచంలో తాత్కాలిక ప్రయోజనం పొందగలిగినా ఘోర పాపాని (షిర్క్)కి పాల్పడిన వారవుతారు. నిజమైన విశ్వాసం కలిగిన ముస్లింలు ఆయన్నే వేడుకుంటారు.

అయితే మొరపెట్టుకునేవారు తమ భౌతిక ప్రయత్నాలతో పాటు ఈ క్రింది విషయాలు  కూడా గమనించాలి:

- "ఒక ముస్లిం పాపకార్యానికి లేదా బంధువుల పట్ల నిర్దయకు సంబంధించిన విషయంలో గాకుండా మరేదయినా విషయంలో దుఆ చేసినప్పుడు దేవుడు అతని దుఆను మూడురూపాల్లో ఏదోఒక రూపంలో స్వీకరిస్తాడు. అతని దుఆను ఈ ప్రపంచంలోనే స్వీకరిస్తాడు; లేదా అతనికి పరలోకంలో ప్రతిఫలం ఇవ్వడానికి దాన్ని భద్రపరుస్తాడు; లేదా ఆ దుఆలోని విషయానికి సమానస్థాయి గల ఏదైనా ఆపదను అతని మీద పడకుండా నిరోధిస్తాడు." (ముస్నద్ అహ్మద్)
- "దుఆను దేవుడు తప్పక స్వీకరిస్తాడన్న గట్టి నమ్మకంతో చేయాలి." (తిర్మిజి)
- "మనిషి తొందరపాటుతో 'నేను ఎంతో వేడుకున్నాను, చాలాసార్లు వేడుకున్నా. కాని నావేడుకోలు స్వీకరించబడే సూచనలు కానరావడం లేదు' అని చెప్పి అలసిపోయి వేడుకోవడం మానేస్తాడు. అలాంటి తొందరపాటు పనికిరాదు." (ముస్లిం)
- "మీలో ప్రతి వ్యక్తీ తన అవసరాల కోసం దేవుడ్ని వేడుకోవాలి. చివరికి తన చెప్పువారు తెగిపోయినా (దానికోసం కూడా) దేవుడ్ని వేడుకోవాలి." (తిర్మిజి)
- "ఒకతను సుదూర ప్రయాణం చేసి దుమ్ము ధూళి కొట్టుకొని వస్తాడు. అతను ఆకాశం వైపు చేతులెత్తి 'ప్రభూ! ప్రభూ!' అంటూ ప్రార్థిస్తాడు. కాని అతను తిన్నది అధర్మమైన తిండి, అతను కట్టుకున్నవి అధర్మ వస్త్రాలు, అతని శరీరం అక్రమ సంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన (దుఆ) ఎలా స్వీకరించబడుతుంది?" (ముస్లిం)

ఓసారి మదీనాలో తీవ్రమైన కరువు వస్తే అప్పటి ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) వర్షం కోసం దైవాన్ని ప్రార్థించడానికి బదులు పాపమన్నింపుకై దుఆ (వేడుకోలు) చేసి



ఊరుకున్నారు. దానిపై ప్రజలు ఆయన్ని విమర్శిస్తూ "మీరు వర్షం కోసం దుఆ చేయనే లేదు" అన్నారు. ఆయన దానికి సమాధానమిస్తూ "నేను ఆకాశం నుండి వర్షం కురిసే తలుపుల్ని తట్టాను. (అంతకంటే మరేం కావాలి?)" అని చెప్పి నూహ్ అధ్యాయంలోని ఈ క్రింది సూక్తులు పఠించారు.

"మీ ప్రభువును క్షమాపణ కోరుకోండి. ఆయన గొప్ప క్షమాశీలి. ఆయన మీకోసం ఆకాశం నుండి వర్షం కురిపిస్తాడు. మీకు సంతానం సిరిసంపదలు అనుగ్రహిస్తాడు. మీకోసం తోటలు పండిస్తాడు; సెలయేరులు ప్రవహింపజేస్తాడు." (71:10-12)

ప్రఖ్యాత దైవప్రియుడు హజ్రత్ హసన్ బస్రీ (రహ్మాలై) సన్నిధికి ఒకతను వచ్చి తమ ప్రాంతంలో కరువు వచ్చిందని తెలిపాడు. అప్పుడాయన, అయితే పాపమన్నింపుకై దైవాన్ని వేడుకోండి అని చెప్పారు. కాస్సేపటి మరొకతను వచ్చి తన దారిద్ర్య స్థితిని ఏకరువు పెట్టుకున్నాడు. ఇంకొకడు వచ్చి తనకు సంతానం కలగడం లేదని చెప్పుకున్నాడు. వేరొకడు వచ్చి తనపొలంలో పంట తగ్గిపోతోంది ఏం చెయ్యాలని అడిగాడు. హజ్రత్ హసన్ బస్రీ (రహ్మాలై) వారందరికీ పాపమన్నింపు కోసం దైవాన్ని వేడుకోండని ఒకేఒక సమాధానమిచ్చారు. దానికి ప్రజలు ఆశ్చర్యపోతూ "అదేమిటండీ మీరు విభిన్న రకాల ఫిర్యాదులు చేసిన వారందరికీ ఒకే నివారణ చూపుతున్నారు?" అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన పైన పేర్కొన్న సూక్తులే పఠించారు.

**ఖుర్ఆన్ 'దుఆ'లు:-** దివ్యఖుర్ఆన్‌లో ఎంతో భావగర్భితమైన, సమగ్రమైన 'దుఆ'లు ఉన్నాయి. నమాజ్ ముగిసిన తరువాత వీటిని పఠించడం మంచిది. ఇతర సమయాల్లో కూడా వీటిని పఠించవచ్చు.

(1) "రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతన్వ్వ ఫిల్ఆఖిరతి హసనతన్వ్వఖినా అజాబన్నార్." (2:201)

భావం: ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరక యాతనల నుండి రక్షించు.

(2) "రబ్బనా లా తుఆఖిజ్‌నా ఇన్నసీనా ఔ అఖ్‌తానా. రబ్బనా వలా తహ్‌మిల్ అలైనా ఇస్రన్ కమా హమల్‌తహూ అలల్లజీన మిన్ ఖబ్‌లినా. రబ్బనా వలా తుహమ్మిల్నా మాలా తాఖతలనా బిహీ. వఅ్ఫుఅన్నా వగ్‌ఫిర్‌లనా వర్‌హమ్నా అన్త మౌలానా ఫన్‌సుర్నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్." (2:286)

భావం: ప్రభూ! మేము మరచిపోయి ఏదైనా పొరపాటు చేసివుంటే దాన్ని పట్టకు. మాకు పూర్వం గతప్రజలపై మోపిన భారం మాపై మోపకు. ప్రభూ! మేము మోయలేని భారం మామీద వేయకు. మా పట్ల మృదువుగా ప్రవర్తించు. మా పొరపాట్లు పట్టించుకోకు. మమ్మల్ని క్షమించు, కనికరించు. నీవే మా స్వామివి, సంరక్షకుడివి. అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయం చెయ్యి.

(3) “రబ్బనాఇన్ననా ఆమన్నా ఫగ్ఫిర్లనా జునూబనా వఖినాఅజాబన్నార్.”(3:16)

భావం: ప్రభూ! మేము (నిన్ను, నీ ప్రవక్తను) విశ్వసించాము. మా తప్పులు మన్నించు. మమ్మల్ని నరకాగ్ని నుండి రక్షించు.

(4) రబ్బనా లాతుజిగ్ ఖులూబనా బఅ్ద ఇజ్‌హదైనా వహబ్‌లనా మిన్‌ల్లదున్క రహ్మాతన్. ఇన్నక అన్తల్ వహ్హాబ్. రబ్బనా ఇన్నక జామివున్నాసి లియౌమిల్ ల్లారైబ ఫీహి. ఇన్నల్లాహ లా యుఖ్లిఫుల్ మీఆద్.” (3:8,9)

భావం: ప్రభూ! నీవు మాకు (ఒకసారి) సన్మార్గం చూపిన తరువాత తిరిగి మా హృదయాల్ని వక్రమార్గం వైపుకు పోనివ్వకు. నీ సన్నిధి నుండి మాకు కారుణ్యం ప్రసాదించు. నీవే గొప్ప (కారుణ్య) ప్రదాతవు. ప్రభూ! ఒకరోజు నీవు మానవులందర్నీ సమావేశ పరచనున్నావు. ఆరోజు తప్పకుండా వస్తుంది. దేవుడు తన వాగ్దానాన్ని ఎన్నటికీ మీరడు.

(5) “రబ్బనా హబ్‌లనా మిన్ అజ్‌వాజినా వ జుర్రియ్యాతినా ఖుర్రత అఅ్‌యునిన్ వ్వజ్‌అల్‌నా లిల్‌ముత్తఖీన ఇమామా.” (25:74)

భావం: ప్రభూ! మా భార్యాపిల్లల ద్వారా మా కంటికి చలువ ప్రసాదించు. మేము దైవభీతిపరులకు నాయకులయ్యేలా చెయ్యి.

(6) “రబ్బనగ్ ఫిర్‌లనా వ లిఇఖ్‌వాని నల్లజీన సబఖూనా బిల్‌ఈమాని వలా తజ్ అల్ ఫీఖులూబినా గిల్ల లిల్లజీన ఆమనూ రబ్బనా ఇన్నక రవూఫుర్రహీమ్.” (59:10)

భావం: ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. (యావత్తు) విశ్వాసుల పట్ల మా హృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు.

(7) “రబ్బనా అలైక తవక్కల్‌నా వ ఇలైక అనబ్‌నా వ ఇలైకల్ మసీర్. రబ్బనా లా తజ్‌అల్‌నా ఫిత్‌నతన్‌ల్లిల్లజీనా కఫరూ వగ్ఫిర్‌లనా రబ్బనా ఇన్నక అన్తల్ అజీజుల్ హకీమ్.” (60:4,5)

భావం: ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాము. నీ (ధర్మం) వైపుకే మరలాము. చివరికి మేము నీ సన్నిధికే రావలసి ఉంది. ప్రభూ! మమ్మల్మి అవిశ్వాసుల కోసం పరీక్షగా చేయకు. ప్రభూ! మా తప్పులు మన్నించు. నిస్సందేహంగా నీవే అపార శక్తి సంపన్నుడవు, అసామాన్య వివేకవంతుడవు.

(8) “రబ్బి అవ్‌జిఅ్‌నీ అన్‌అష్కుర నిఅ్‌మత కల్లతీ అన్‌అమ్త అలయ్య వఅలా వాలిదయ్య వఅన్ అఅ్‌మల సాలిహన్ తర్‌జాహు వఅస్లిహ్‌లి ఫీ జుర్రియ్యతి. ఇన్ని తుబ్తు ఇలైక వఇన్ని మినల్ ముస్లిమీన్.” (46:15)



భావం: ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేళ్ళకు నేను నీపట్ల కృతజ్ఞుడైవుండే సద్బుద్ధి ప్రసాదించు. నీ ప్రసన్నతాభాగ్యం లభించేటటువంటి సత్కార్యాలు చేసే సద్బుద్ధి కూడా ప్రసాదించు. నా సంతానాన్ని కూడా సజ్జనులుగా చేసి నాకు సుఖాన్నివ్వు. నేను నీకు విధేయుణ్ణయిన దాసుడ్ని. నా పాపాలకు నేను పశ్చాత్తాపపడుతూ నన్ను క్షమించమని నీ సన్నిధిలో వేడుకుంటున్నాను.

# 41. నఫిల్ నమాజులు

జుహర్, మగ్రిబ్, ఇషా వేళల్లో చేసే సాధారణ నఫిల్ (ఐచ్ఛిక) నమాజులే గాకుండా ప్రత్యేకంగా మరికొన్ని నఫిల్ నమాజులు కూడా ఉన్నాయి. వాటిని గురించి కూడా తెలుసుకుందాము. ఫరజ్, వాజిబ్‌ల తర్వాత  చేసే నమాజులన్నీ నఫిల్ నమాజుల కిందే లెక్క. ఈవిధంగా సున్నత్ నమాజులు కూడా నఫిల్ కేటగిరి కిందికే వస్తాయి.

**తహజ్జుద్ నమాజ్:-** తహజ్జుద్ నమాజ్ ప్రత్యేకంగా దైవప్రవక్త (స) కోసం సిఫారసు చేయబడిన నమాజ్ అయినప్పటికీ దీని ప్రాముఖ్యం ఆయన అనుచర సముదాయానికి కూడా వర్తిస్తుంది. తహజ్జుద్ నమాజ్ చేస్తుండాలని దైవప్రవక్త (స) తన అనుచరులకు కూడా తాకీదు చేశారు. అందువల్ల ఆనాడు వారంతా తహజ్జుద్ నమాజ్‌ని క్రమం తప్పకుండా చేసేవారు. ఖుర్‌ఆన్‌లో దీని ప్రస్తావన ఇలా ఉంది:

“రాత్రివేళ తహజ్జుద్ నమాజు కూడా చేస్తూ ఉండు. ఇది నీకోసం అదనపు నమాజుగా నిర్ణయించబడింది. నీ ప్రభువు నిన్ను త్వరలోనే అత్యున్నతమైన స్తుతిస్థానం (మఖామె మహ్మూద్) మీద అధిష్ఠింపజేయవచ్చు.” (17:79)

“మనస్సును అదుపులో ఉంచడానికి రాత్రి జాగరణ ఎంతో ప్రయోజనకరమైనది. ప్రశాంతంగా ఖుర్‌ఆన్ పఠించడానికి కూడా అది చాలా సమంజసమైన వేళ.” (73:6)

“ఆరోజు దైవభీతిపరులు స్వర్గవనాలలో చెలమల మధ్య (హాయిగా) ఉంటారు. వారు తమ ప్రభువు ప్రసాదించినదాన్ని అమిత సంతోషంతో స్వీకరిస్తూ ఉంటారు. వారు ఈరోజు రాకపూర్వం నీతిమంతులుగా ఉండేవారు. రాత్రివేళల్లో చాలా తక్కువగా నిద్రించేవారు. ప్రతి రోజూ తెల్లవారుజామున లేచి (తమ ప్రభువును) క్షమాపణ కోరుకునేవారు.” (51:15-18)

“కరుణామయుని (నిజ) భక్తులు తమ ప్రభువు సన్నిధిలో నిలబడి ప్రార్థనచేస్తూ, సాష్టాంగపడుతూ రాత్రిళ్ళు గడుపుతారు.” (25:64)

“వీరు సహనశీలురు, స్థిరచిత్తులు, సత్యమంతులు, రుజువర్తనులు, వినమ్రులు, దానశీలురు, రాత్రి చివరి ఘడియల్లో దేవుడ్ని క్షమాభిక్ష వేడుకునేవారు.” (3:17)

హజ్రత్ అబ్దుల్లా బిన్ సలాం (రజి) కథనం:- దైవప్రవక్త (సల్లం) మదీనా వలస వచ్చినప్పుడు నేనాయన నోట మొట్టమొదట ఈ పలుకులు విన్నాను: “సోదరులారా!

'సలాం'ని సర్వసామాన్యం చేయండి. (పేద)జనానికి భోజనం పెట్టండి. బంధుత్వాలను కలిపిఉంచండి. రాత్రి ప్రజలంతా నిద్రపోతున్నప్పుడు మీరు లేచి నమాజ్ చేయండి. దీనివల్ల మీరు క్షేమంగా స్వర్గంలో ప్రవేశిస్తారు." (ఇబ్నెమాజ, తిర్మిజి)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వివిధ సందర్భాలలో ఉపదేశించిన ఈ క్రింది మహితోక్తులు కూడా గమనించండి:

"తహజ్జుద్ నమాజ్ చేయడం అలవరచుకోండి. ఇది సత్పురుషుల లక్షణం. ఈ నమాజ్ మీకు దైవసాన్నిధ్యం ప్రసాదిస్తుంది; పాపాలను కడిగేస్తుంది; పాపకార్యాల నుండి మిమ్మల్ని కాపాడుతుంది; శరీరంలోని రోగాలను పారదోలుతుంది." (ముస్లిం)

"ఫరజ్ నమాజుల తరువాత అన్నిటి కంటే అత్యంత శ్రేష్ఠమైన నమాజ్ (అర్థ) రాత్రి వేళ చేసే తహజ్జుద్ నమాజే." (ముస్లిం, అహ్మద్).

"రాత్రి చివరి ఘడియల్లో దేవుడు ఆకాశం నుండి భూలోకం వైపు అవతరించి 'నన్ను మొరపెట్టుకునేవారు ఎవరైనా ఉన్నారా, నేను వాళ్ళ మొరాలకిస్తాను; నన్నేదైనా అర్థిస్తే నేను వారికి ప్రసాదిస్తాను; పాపక్షమాపణ కోరితే నేను వారి పాపాలను క్షమిస్తాను' అని అంటాడు" (సహీబుఖారి)

**తహజ్జుద్ వేళ, రకాత్‌ల సంఖ్య:-** తహజ్జుద్ అంటే నిద్రను భంగపరచి మేల్కోవడం అని అర్థం. రాత్రివేళ ఇషానమాజ్ తరువాత కాస్సేపు నిద్రపోయి అర్ధరాత్రి లేచి తహజ్జుద్ నమాజ్ చేయడం ప్రవక్త సంప్రదాయం. దైవప్రవక్త (సల్లం) అర్ధరాత్రి లేచి తహజ్జుద్ నమాజ్‌కు ముందు ఆకాశం వైపు తలెత్తి ఆలిఇమ్రాన్ సూరా చివరి సూక్తుల్లోని కొన్ని సూక్తులు పఠించేవారు. ఆ తరువాత ఆయన ఉజూ చేసి, తహజ్జుద్ నమాజ్ చేసేవారు. దైవప్రవక్త (సల్లం) ఆకాశం వైపు తలెత్తి పఠించే ఖుర్ఆన్ సూక్తులకు అనువాదం ఏమిటో చూడండి:

"భూమ్యాకాశాల నిర్మాణంలో, రాత్రింబవళ్ళ చక్రభ్రమణంలో యోచించే వారికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. ఆ యోచనాపరులు నిల్చొని, కూర్చొని, పడుకొని – ఏ స్థితిలో ఉన్నాసరే ఎల్లప్పుడూ దేవుడ్ని స్మరిస్తూ ఉంటారు. అంతేకాకుండా వారు భూమ్యాకాశాల నిర్మాణం గురించి పరిశీలిస్తూ ఇలా ప్రార్థిస్తారు:

'ప్రభూ! నీవు ఈ విశ్వాన్ని నిష్ప్రయోజనంగా, లక్ష్యరహితంగా సృజించలేదు. నీవు పరమ పవిత్రుడవు. మమ్మల్ని నరకయాతనల నుండి కాపాడు. నీవు ఎవరినైతే నరకంలో పడవేస్తావో అతడ్ని ఘోరమైన అవమానికి గురిచేసినట్లే. అలాంటి దుర్మార్గులకు ఎవరూ సహాయపడలేరు. ప్రభూ! మేము విశ్వాసం వైపు పిలిచేవాని పిలుపు విన్నాం. మీ ప్రభువుని విశ్వసించండని ఆయన మమ్మల్ని అడగ్గానే మేము నిన్ను విశ్వసించాము. కనుక ప్రభూ! మా తప్పులు క్షమించు. మాలో ఉన్న చెడుల్ని మా నుండి తొలగించు. మాకు పుణ్యాత్ముల మరణంలాంటి మంచి మరణం కలిగించు. ప్రభూ! నీవు నీ ప్రవక్తల



ద్వారా వాగ్దానం చేసిన వాటిని మాకు ప్రసాదించు. నీవు ఎట్టి పరిస్థితిలోనూ వాగ్దానభంగం చేయవని మాకు తెలుసు. కనుక ప్రళయ దినాన మమ్మల్ని నలుగురిలో పరాభవం పాల్జేయకు." (3:189-194)

తహజ్జుద్ నమాజ్‌లో కనీసం 2 రకాత్‌లు పఠించాలి. గరిష్ఠంగా 8 రకాత్‌లు. దైవప్రవక్త (సల్లం) రెండేసి రకాత్‌ల చొప్పున ఎనిమిది రకాత్‌లు పఠించేవారు.

**తహియ్యతుల్ ఉజూ:-** ఉజూ చేసిన తర్వాత శరీరం మీద ఉజూతడి ఆరకముందే రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేయడం ముస్తహబ్ (అభిలషనీయం). ఈ నమాజ్‌లో నాలుగు రకాతులు కూడా పఠించవచ్చు.

దైవప్రవక్త (సల్లం) ఈ నమాజ్ ప్రాముఖ్యం గురించి ఇలా ప్రవచించారు: "ఎవరైతే చక్కగా ఉజూ చేసి చిత్తశుద్ధితో రెండు రకాతులు నమాజ్ చేస్తాడో అతని కోసం స్వర్గం వాజిబ్ (తప్పనిసరి) అవుతుంది." (సహీ ముస్లిం)

**తహియ్యతుల్ మస్జిద్:-** ఇది మస్జిద్‌లో ప్రవేశించగానే చేసే నమాజ్. మస్జిద్ ప్రత్యేకంగా దైవారాధన కోసం నిర్మించబడిన భవనం కనుక దానికి గౌరవ సూచకంగా లోపల ప్రవేశించగానే కూర్చోకుండా రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేయడం ముస్తహబ్ (అభిలషనీయం). ఒకవేళ ఎవరైనా మస్జిద్‌లో ప్రవేశించిన తరువాత ఈ నఫిల్ నమాజ్ చేసేటంత వ్యవధిలేక అతను ఆ వేళకు సంబంధించిన సున్నత్ నమాజ్‌గాని లేదా ఫరజ్ నమాజ్‌గాని చేయడం జరిగితే ఈ సున్నత్ లేక ఫరజ్ నమాజే తహియ్యతుల్ మస్జిద్ నమాజ్‌కు ప్రత్యామ్నాయం అవుతుంది.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరైనా మస్జిద్‌కు పోవడం జరిగితే మస్జిద్‌లో రెండు రకాతులు నమాజ్ చేసే వరకు కూర్చోకూడదు." (బుఖారి)

**ఇష్రాఖ్ నమాజ్:-** సూర్యోదయమై కాస్త పొద్దెక్కిన తరువాత ఈ నమాజ్ చేయడం ముస్తహబ్ (అభిలషనీయం). ఈ నమాజ్‌లో కనీసం నాలుగు రకాతులు పఠించాలి. "నేను ప్రవక్త సంప్రదాయం పాటించడానికి నాలుగు రకాతుల ఇష్రాఖ్ నమాజ్ చేస్తున్నాను" అని సంకల్పించుకొని ఈ నమాజ్ చేయాలి.

**అవ్వాబీన్ నమాజ్:-** మగ్రిబ్ నమాజ్ ముగిసిన తర్వాత రెండేసి రకాతుల చొప్పున ఆరు రకాతుల నమాజ్ చేయడం ముస్తహబ్ (అభిలషనీయం).

**సలాతె తస్బీహ్:-** ఈ నమాజ్ చేయడం కూడా ముస్తహబ్ (అభిలషనీయం). దైవప్రవక్త (సల్లం) ఈ నమాజ్‌లో ఒకే సలామ్‌తో నాలుగు రకాతులు పఠించారు. రెండేసి రకాతుల చొప్పున కూడా నాలుగు రకాతులు పఠించవచ్చు. ప్రతి రకాతులో 75 సార్లు ఈ 'తస్బీ' పఠించాలి: "సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి వ లాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్."

నాలుగు రకాతులు సలాతుత్తస్బీహ్ చేస్తున్నానని సంకల్పించుకొని చేతులు కట్టుకోవాలి. 'సనా' తరువాత పైన పేర్కొన్న 'తస్బీ' 15 సార్లు పఠించాలి. ఆ తర్వాత అవూజు బిల్లాహి..., బిస్మిల్లా..., ఫాతిహా సూరా, మరేదైనా రెండవ సూరా పఠించాలి. చివర్లో మళ్ళీ 10 సార్లు 'తస్బీ' పఠించి రుకూ చేయాలి. రుకూలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీమ్' తర్వాత మళ్ళీ 10 సార్లు 'తస్బీ' పఠించాలి. రుకూ నుండి లేచి మళ్ళీ 10 సార్లు 'తస్బీ' పఠించాలి. తర్వాత మొదటి సజ్దాలో 'సుబ్‌హాన రబ్బియల్‌ఆలా పఠించాక తిరిగి 10 సార్లు 'తస్బీ' పఠించాలి. సజ్దా నుండి లేచి కూర్చొని తిరిగి 10 సార్లు 'తస్బీ' పఠించాలి. మళ్ళీ రెండవసజ్దాలో కూడా 'సుబ్‌హాన రబ్బియల్‌ఆలా' తర్వాత 10 సార్లు 'తస్బీ' పఠించాలి. దీంతో మొదటి రకాత్‌లో 'తస్బీ' 75 సార్లు పఠించినట్లవుతుంది.

అదేవిధంగా రెండవ, మూడవ, నాల్గవ రకాత్‌లో కూడా ఈ 'తస్బీ' 75 సార్లు చొప్పున పఠించాలి. దీంతో నాలుగు రకాత్‌లలో మొత్తం 300 సార్లు ఈ 'తస్బీ' పఠించి నట్లవుతుంది. ఈ 'తస్బీ' పఠిస్తున్నప్పుడు దాని సంఖ్య లెక్కపెట్టుకోవడానికి చేతివ్రేళ్ళు పైకెత్తకూడదు. చేతివ్రేళ్ళు దేహానికి వత్తుతో మనసులో లెక్కించుకోవాలి.

**సలాతె కుసూఫ్, సలాతె ఖుసూఫ్:-** కుసూఫ్ అంటే సూర్యగ్రహణం. ఖుసూఫ్ అంటే చంద్రగ్రహణం. సూర్య చంద్ర గ్రహణాలు పట్టినప్పుడు రెండు రకాత్‌లు నఫిల్ చేయడం సున్నత్ (సంప్రదాయం). సూర్యగ్రహణం పట్టినప్పుడు ఈ నమాజ్ జమాఅత్‌తో సామూహికంగా చేయడం సంప్రదాయం.

ఈ సామూహిక నమాజ్ కోసం అజాన్, అఖామత్‌లు చెప్పకూడదు. నమాజ్‌లో 'ఆలిఇమ్రాన్, బఖరా' లాంటి పెద్ద పెద్ద సూరాలు బిగ్గరగా పఠించడం, రుకు-సజ్దాలు సుదీర్ఘంగా చేయడం సంప్రదాయం. నమాజ్ తరువాత ఇమామ్ 'దుఆ' చేయడంలో లీనమైపోవాలి. ముఖ్తదీలు ఆమీన్ ఆమీన్ అంటూ పలకాలి. ఈ 'దుఆ' గ్రహణం వదిలే వరకు కొనసాగాలి. ఒకవేళ గ్రహణం వదలక ముందే జుహర్ లేక అసర్ నమాజుల సమయం వస్తే 'దుఆ' ముగించి ఆ నమాజులు చేయాలి.

చంద్రగ్రహణం పట్టినప్పుడు 'ఖుసూఫ్' నమాజ్ ఒంటరిగా చేసుకోవడమే సంప్ర దాయం. సూర్య చంద్ర గ్రహణాలు పట్టినప్పుడు నమాజ్ నిషిద్ధ వేళలు వస్తే గ్రహణపు నమాజులు చేయకూడదు. అప్పుడు తస్బీ మాత్రమే చేయాలి. తుఫాన్, భూకంపం వగైరా ఎలాంటి ప్రకృతివైపరీత్యాలు వచ్చినా ఇలాంటి నమాజ్ చేయవచ్చు.

ఈ నమాజుల్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "సూర్యుడు, చంద్రుడు దేవుని రెండు (శక్తి)సూచనలు. అంతేగాని ఎవరో చనిపోవడం వల్ల లేదా పుట్టడం వల్ల వాటికి గ్రహణం పట్టదు. కనుక మీరు వాటికి గ్రహణం పట్టడం చూస్తే గ్రహణం వదిలే వరకు దేవుడ్ని మొరపెట్టుకోండి, ఆయన్ని వేడుకోండి, నమాజ్ చేయండి." (బుఖారి, ముస్లిం)



"రాత్రి, పగలు, సూర్యుడు, చంద్రుడు (వగైరా ప్రకృతి శక్తులన్నీ) దేవుని (శక్తిసామర్థ్యా లకు) నిదర్శనాలే. (కనుక) సూర్యచంద్రులకు సాష్టాంగపడకండి. మీరు నిజంగా దేవుడ్ని ఆరాధించేవారైతే వాటిని సృష్టించిన దేవునికే సాష్టాంగపడండి." (ఖుర్ఆన్-41:37)

**నమాజ్ నిషిద్ధ వేళలు:-** మూడు సమయాల్లో ఎలాంటి నమాజ్ చేయడ మైనా, సజ్దా చేయడమైనా నిషిద్ధం. (1) సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు, (2) సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు, (3) సూర్యుడు సరిగ్గా నెత్తిమీద ఉన్నప్పుడు.

# 42. దైవభీతి పరాయణత

దైవభీతి పరాయణత అంటే దేవునికి భయపడటమే కదా అనుకుంటారు చాలా మంది ముస్లింలు. అయితే దానికి సరయిన నిర్వచనం వారిలో అనేక మందికి తెలియదు. తెలిసినవారిలో కూడా చాలా మంది దాన్ని ఆచరణాత్మకంగా పాటించరు. దానికి కారణం ఇస్లాం పట్ల దృఢమైన నమ్మకం, సరయిన, సమగ్రమైన అవగాహన లేకపోవడమేనని చెప్పవచ్చు. ప్రాపంచిక వ్యామోహం, ఏమరుపాటులు కూడా ఇతర కారణాలుగా చెప్పవచ్చు. ఏమైనప్పటికీ ఇది ప్రతిముస్లిం ఆత్మావలోకనం చేసు కోవాల్సిన విషయం.

దైవభీతి పరాయణతను ఇస్లాం "తఖ్వా" అంటుంది. తఖ్వా అంటే భయము లేక భీతి అని శాబ్దిక భావం. ఇస్లామీయ పరిభాషలో తఖ్వా అంటే దైవభీతి అని అర్థం. సృష్టికర్త చేయమన్న పనులను చేయడం, ఆయన వారించిన పనులను మానేయడమే దైవభీతి పరాయణత (తఖ్వా) అనబడుతుంది. రమజాన్ ఉపవాసాల లక్ష్యం కూడా దైవభీతే. కేవలం ఇస్లాంను విశ్వసించి తమను తాము ముస్లింలని ప్రకటించుకోవడంతో ముస్లింల విశ్వాసం పరిపూర్ణమవదు. ఆచరణలేని విశ్వాసం నిరర్థకం అంటోంది ఇస్లాం. అందుకే దైవాజ్ఞలను పూర్తిగా పాటించని ముస్లింలను దివ్యఖుర్ఆన్ ఒక చోట, విశ్వాసులారా! విశ్వసించండని హెచ్చరిస్తోంది.

"విశ్వాసులారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి. (దేవునికి అంకితమైన) ముస్లింలుగా వున్న స్థితిలో తప్ప (ఇతర స్థితిలో) చనిపోకండి." (3:102)

"ఆదం సంతానమా! మీరు మీ మర్మావయవాలను కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాము. అయితే అన్నిటికంటే భయభక్తుల దుస్తులే ఎంతో(శ్రేష్ఠమైనవి. ఇది (వస్త్రధారణ) దేవుని సూచనల్లో ఒక సూచన. మీరు విషయం గ్రహిస్తారని (ఇలా తెలుపుతున్నాం)". (7:26)

"హజ్‌యాత్రకు బయలుదేరినప్పుడు ప్రయాణ సామగ్రి వెంట తీసికెళ్ళండి. అన్నిటికంటే శ్రేష్ఠమైన ప్రయాణ సామగ్రి దైవభీతే. కనుక విజ్ఞులారా! నా పట్ల భయ భక్తులు కలిగివుండండి." (2:197)

'దైవభీతి' హృదయంలో జనించి ఆచరణలో వ్యక్యమయ్యే విషయం. ఒక విశ్వాసి హృదయంలో నిజంగా దైవభీతి ఉంటే దైవేతరుల ఆజ్ఞలు, సిద్ధాంతాల సమక్షంలో దేవుని ఆజ్ఞలు, సిద్ధాంతాలను మాత్రమే అతను పాటించాలి. వాటికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే అతని దైవభీతి ఆచరణలో వ్యక్తం కాలేదన్న మాట. ఆచరణలో వ్యక్తం కాని దైవభీతికి దేవుని దృష్టిలో ఎలాంటి విలువ ఉండదు. ఖుర్ఆన్‌లో సృష్టికర్త మన మేలుకోరి అనేక ఆదేశాలు, ఉపదేశాలిస్తూ ఆ వెనువెంటనే "దేవునికి భయపడండి, ఆయన మీ చర్యల్ని గమనిస్తున్నాడని తెలుసుకోండి' అని కూడా చెబుతున్నాడు.

"నిషేధితాలన్నిటినీ అందరూ సమానంగా గౌరవించవలసిందే. దీనికి భిన్నంగా ఎవరైనా (నిషిద్ధ మాసంలో లేదా పవిత్రస్థలం దగ్గర) మీపై దాడిచేస్తే మీరుకూడా వారిపై దాడిచేయండి. అయితే దేవునికి భయపడుతూ మసలుకోవాలి. దేవునికి భయపడేవారికే ఆయన అండగా నిలుస్తాడు." (ఖుర్ఆన్–2:194)

"మీరు ఎక్కడున్నా, ఏ ప్రాంతానికెళ్ళినా అక్కడ నుంచి మీరు ప్రతిష్ఠాలయం వైపుకే అభిముఖులుకండి. మీకు వ్యతిరేకంగా ఇతరులు ఎలాంటి మాట అనడానికైనా ఆస్కారమివ్వకుండా మీరు దాని వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. ఇక దుర్మార్గుల విషయానికొస్తే, వారు ఎల్లప్పుడూ మీకు వ్యతిరేకంగా ఏదో ఒకటి వాగుతూనే ఉంటారు. కనుక మీరు వారికి భయపడకూడదు, నాకే భయపడాలి." (ఖుర్ఆన్–2:150)

"తల్లులు తమ బిడ్డలకు గడువుకాలం పూర్తయ్యేవరకు పాలు పట్టదలచుకుంటే పూర్తిగా రెండు సంవత్సరాలు పాలుపట్టాలి. అప్పుడు బిడ్డతండ్రి ఆమెకు తగిన రీతిలో తిండి, బట్ట సమకూర్చవలసి ఉంటుంది. అయితే వారుభయుల్లో ఏ ఒక్కరిపైనా శక్తికి మించిన భారం మోపకూడదు. బిడ్డను కన్నందుకు ఇటు తల్లినీ కష్టపెట్టకూడదు; బిడ్డజన్మకు కారకుడయినందుకు అటు తండ్రినీ వేధించకూడదు." బిడ్డకు పాలుపట్టే తల్లిపట్ల బిడ్డతండ్రికి ఎంత బాధ్యతఉందో అతని వారసుల క్కూడా అంతే బాధ్యత ఉంది. ఒకవేళ తల్లిదండ్రులు ఒకర్నొకరు సంప్రదించుకొని పరస్పరామోదంతో బిడ్డకు పాలు మాన్పించదలచుకుంటే తప్పులేదు. అలాగే మీరు మీపిల్లలకు వేరే స్త్రీలచేత పాలు పట్టించాలనుకున్నా తప్పులేదు. కాకపోతే పాలుపట్టేవారికి తగిన ప్రతిఫలం ముట్టజెప్పాలి. మీరు దేవుని పట్ల భయభక్తులతో వ్యవహరించాలి. గుర్తుంచుకోండి! మీరు చేస్తున్న పనులన్నిటినీ ఆయన గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్ఆన్–2:233)

"మీలో ఎవరైనా చనిపోయి, వారిభార్యలు బ్రతికివుంటే అలాంటి స్త్రీలు నాలుగు నెలల పదిరోజులు తమనుతాము నిగ్రహించుకోవాలి. గడువుకాలం (ఇద్దత్) ముగిసిన తర్వాత వారు తమకు నచ్చిన పని (పునర్వివాహం) తగిన రీతిలో చేసుకోవచ్చు. దానికి మీపై ఎలాంటి బాధ్యతలేదు. మీరు చేసే పనులన్నీ దేవునికి తెలుసు. గడువుకాలంలో మీరు ఆ వితంతు స్త్రీని వివాహమాడదలచినట్లు సూచన ప్రాయంగా తెలియజేసినా లేదా మీ ఉద్దేశ్యాన్ని మీ మనసులోనే దాచివుంచినా సరే ఎలాంటి తప్పులేదు. మీరీ విషయాన్ని



ఆమె దగ్గర ప్రస్తావిస్తారని దేవునికి తెలుసు. అయితే ఒక విషయం గుర్తుపెట్టుకోండి–మీరు చాటుమాటుగా ఎలాంటి ఒప్పందం చేసుకోకండి. ఏది చేసినా ధర్మయుక్తంగానే చేయాలి. గడువుకాలం తీరనంతవరకు మీరు పెళ్ళి విషయంలో గట్టినిర్ణయం మాత్రం తీసుకోకూడదు. మీ హృదయాల్లో మెదిలే ప్రతివిషయం దేవునికి తెలుసు. కనుక ఆయనకు భయపడుతూ ఉండండి." (ఖుర్ఆన్–2:234–235)

"విశ్వాసులారా! (వాస్తవం తెలిసికూడా) మీరు దేవునికి, ఆయన ప్రవక్తకు ద్రోహం తలపెట్టకండి. మీకప్పగించబడే బాధ్యతల విషయంలో కూడా ద్రోహబుద్ధితో వ్యవహరించకండి. వాస్తవానికి మీ సంతానం, సిరిసంపదలు మీ పాలిట పరీక్షా సాధనాలని గుర్తుంచుకోండి. మీకోసం దేవుని దగ్గర ఇంతకంటే ఎంతో గొప్ప ప్రతిఫలం ఉంది. విశ్వాసులారా! మీరు గనక భయభక్తుల వైఖరి అవలంబిస్తే దేవుడు మీకు మంచీ చెడుల విచక్షణాజ్ఞానం ప్రసాదిస్తాడు; మీలో ఉన్న చెడుగులు తొలగిస్తాడు; మీ తప్పులు మన్నిస్తాడు. దేవుడు అపార దయామయుడు." (ఖుర్ఆన్–8:27–29)

"మీ స్త్రీలలో ఎవరైనా రుతుస్రావం పట్ల నిరాశచెందిఉంటే, వారి (గడువు విషయంలో) మీకేదయినా అనుమానం కలిగినప్పుడు వారి గడువు మూడు నెలలు (అని తెలుసుకోండి). ఈ ఆజ్ఞ రుతుస్రావం ఆరంభంకాని వారిక్కూడా వర్తిస్తుంది. ఇక గర్భవతుల విషయానికివస్తే, వారి గడువు కాలం వారు ప్రసవించే వరకు ఉంటుంది. దేవుడు తనకు భయపడేవారికి తగిన సౌలభ్యం కలిగిస్తాడు. ఇది దేవుని ఆజ్ఞ. దాన్ని ఆయన మీ దగ్గరికి అవతరింపజేశాడు. ఎవరు దేవునికి భయపడతాడో దేవుడు అతనిలోని చెడులు (దుర్గుణాలు) తొలగించి అతనికి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాడు." (ఖుర్ఆన్–65:4,5)

"దేవునికి భయపడుతూ వ్యవహరించేవాడికి దేవుడు కష్టాలనుంచి బయట పడేందుకు ఏదైనా దారి చూపుతాడు. (ఒకవేళ ఆర్థిక ఇబ్బందులుంటే) అతనికి దేవుడు అతని ఊహ సయితం పోని దిశ నుండి ఉపాధినిస్తాడు. దేవుణ్ని నమ్ముకునే వాడికి దేవుడే చాలు." (ఖుర్ఆన్–65:2)

"భార్యలందరి పట్ల సమాన దృష్టితో మసలుకుంటూ వారికి పూర్తిన్యాయం చేకూర్చడం మీ శక్తికి మించిన పని. మీరు తలచినా చేయలేరు. అయినప్పటికీ మీరు ఒకభార్య వైపు పూర్తిగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండి. మీ వైఖరి సరిదిద్దుకొని దేవునికి భయపడుతూ మసలుకోండి." (ఖుర్ఆన్–4:129)

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. నిస్సందేహంగా దేవుడు సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు." (ఖుర్ఆన్–49:13)

దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన ఈ హితోపదేశాలు కూడా గమనించండి:

“ప్రళయదినాన దేవుడు మీ కులగోత్రాలను గురించి అడగడు. మీలో అందరి కంటే ఎక్కువ దైవభీతి కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు.” (ఇబ్నెమాజ)

“దేవుడు మీ రూపురేఖల్ని చూడడు. ఆయన మీ ఆంతర్యాలను, ఆచరణలను మాత్రమే చూస్తాడు.” (ముస్లిం, ఇబ్నెమాజ)

“ప్రజలారా! జాగ్రత్తగా వినండి, మీకందరికీ దేవుడు ఒక్కడే. అరబ్బులకు అరబ్బే తరులపై, అరబ్బేతరులకు అరబ్బులపై, తెల్లవాళ్ళకు నల్లవాళ్ళపై, నల్లవాళ్ళకు తెల్ల వాళ్ళపై దైవభీతి ప్రాతిపదికపై తప్ప ఎలాంటి ఔన్నత్యం లేదు. మీలో అందరికంటే ఎక్కువ దైవభీతిపరుడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు......” (బైహఖి)

“భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. నీకు, నీకుపూర్వం గ్రంథం ఇవ్వబడిన వారిక్కూడా మేము దేవుని పట్ల భయభక్తులు కలిగివుండాలనే ఆదేశించాం. ఒకవేళ మీరు (మాఈ) ఆదేశాన్ని అంగీకరించకపోతే పోనివ్వండి. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. ఆయన నిరపేక్షాపరుడు, ఎంతో ప్రశంసనీయుడు. దేవుడు మాత్రమే భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తానికి యజమాని. కార్యసఫలతకు ఆయన ఒక్కడే చాలు.” (ఖుర్ఆన్-4:131,132)

“నీప్రభువు నీపై అవతరింపజేసిన వాణి సత్యమని గుర్తించినవాడు, దాన్ని గుర్తించని అంధుడు ఒకటే అవుతారా? విజ్ఞులే (మా) హితోపదేశాన్ని గ్రహిస్తారు.” (ఖుర్ఆన్-13:19)

“ఆ విజ్ఞుల జీవనసరళి ఇలా ఉంటుంది: వారు దేవునితో చేసిన ప్రమాణాన్ని నెరవేరుస్తారు. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భంగపరచరు. స్థిరంగా ఉంచాలని దేవుడు ఆదే శించిన సంబంధాలను స్థిరంగా ఉంచుతారు. వారు తమ ప్రభువుకు ఎల్లప్పుడూ భయ పడుతుంటారు. కఠినంగా (కర్మ)విచారణ జరుగుతుందేమోనని భయపడుతుంటారు. తమ ప్రభువు ప్రసన్నతను ఆశిస్తూ సహనంతో వ్యవహరిస్తారు. అదీగాక, వారు ప్రార్థనా (నమాజు) వ్యవస్థను స్థాపిస్తారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (సత్కార్యాలకోసం) రహస్యంగాను, బహిరంగంగాను ఖర్చుపెడతారు. చెడుని మంచి ద్వారా నిర్మూలిస్తారు.”

“అలాంటి వారికే పరలోక (స్వర్గ) సీమ ఉంది. (అంటే) శాశ్వత నిలయాలుగా లభించే స్వర్గవనాలలో వారు ప్రవేశిస్తారు. వారి తాతముత్తాతలు, తల్లిదండ్రులు, భార్యాపిల్లల్లో సజ్జను లైనవారుకూడా స్వర్గప్రవేశం చేస్తారు. అప్పుడు నలువైపుల నుండి ఎందరో దైవదూతలు వారికి స్వాగతించడానికి వస్తారు. ఆ దూతలు వారికి స్వాగతం చెబుతూ “మీకు శాంతి కలుగుగాక! మీరు ఇహలోకంలో సహనంతో వ్యవహరిస్తూ (సాత్విక) జీవితం గడిపినందుకు ఈరోజు దీనికి అర్హులైపోయారు” అనంటారు. ఆహా! ఎంత శ్రేష్ఠమైనది ఈ పరలోకసీమ!!” (ఖుర్ఆన్-13:20-24)



ఎవరైనా మనకు కీడు తలపెడితే తిరిగి మనం వారికి కీడు చేయకూడదని, వారిపట్ల సత్ప్రవర్తనతో మెలగాలని పైసూక్తి తెలియజేస్తోంది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా వివరించారు:

“మీరు మీ ప్రవర్తనా వైఖరిని లోకుల ప్రవర్తనా వైఖరికి అనుగుణంగా మార్చు కోకండి. ఇతరులు మంచిపని చేస్తే తామూ మంచిపని చేస్తామని, ఇతరులు దౌర్జన్యం చేస్తే తామూ దౌర్జన్యం చేస్తామని చెప్పడం సరికాదు. మీరు మిమ్మల్ని ఒక నియమావళికి కట్టుబడి ఉండేలా రూపొందించు కోండి. ఇతరులు మేలు చేస్తే మీరూ మేలు చేయండి. కాని ఇతరులు మీకేమైనా అపకారం తలపెడ్తే మీరు మాత్రం వారికి అపకారం తలపెట్టకండి.”

మరో సందర్భంలో ఆయన “నిన్నెవరైనా మోసగిస్తే నీవు తిరిగి వారిని మోస గించకు” అన్నారు. ఆయన “నా ప్రభువు నన్ను తొమ్మిది విషయాల్ని గురించి ఆజ్ఞా పించాడ”ని తెలియ జేసిన తొమ్మిది విషయాలలో నాలుగు విషయాలు ఇలా ఉన్నాయి: “(1) నేను ఎవరి పట్లయినా సంతోషంగావున్నా, అయిష్టంగావున్నా ఎట్టి పరిస్థితిలోనైనా సరే న్యాయంగా మాట్లాడాలి (2) ఎవరైనా నా పట్ల నెరవేర్చవలసిన బాధ్యత నెరవేర్చకపోయినా, నేను మాత్రం వారిపట్ల నెరవేర్చవలసిన నా బాధ్యతను నెరవేర్చాలి. (3) ఎవరైనా నాకు (సహాయసహకారాలు) ఇవ్వకపోయినా నేను మటుకు వారికివ్వాలి. (4) ఎవరైనా నామీద దౌర్జన్యం చేస్తే నేను వారిని క్షమించాలి.”

హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: “ఎవరైనా నీపట్ల వ్యవహరించడంలో దేవునికి భయపడకపోతే, నీవు మాత్రం దేవునికి భయపడ్తూ అతనిపట్ల వ్యవహరించు. ఇదే అతనికి తగినశిక్ష.”

మహాప్రవక్త (స) ప్రవచించిన ఈ మహితోక్తి కూడా ఎంతో ఆలోచించదగినది. ఆయన ఇలా ప్రవచించారు: “ప్రజలందరిలో కెల్లా శక్తిమంతుడు కాదలచుకున్న వ్యక్తి దేవుడ్నే నమ్ముకొని ఆయన మీద భారం వేయాలి. అందరికంటే గొప్ప స్థితిపరుడు కాదలచుకున్న వ్యక్తి తన దగ్గరున్న దానికంటే దేవుని దగ్గర (స్వర్గంలో) ఉన్నదాని మీద ఎక్కువ నమ్మకం పెట్టుకోవాలి. అలాగే అందరి కంటే ఎక్కువ గౌరవనీయుడు కాదలచుకున్నవాడు అత్యంత గౌరవనీయుడు, మహోన్నతుడయిన దేవునికి భయపడుతూ ఉండాలి.” (ఇబ్నె అబ్బాస్)

“ఇది ఎంతో శుభదాయకమైన గ్రంథం. కనుక మీరు దీన్ని అనుసరిస్తూ భయ భక్తుల వైఖరి అవలంబించండి; మీరు కరుణించబడతారు.” (ఖుర్ఆన్-6:155)

పైన పేర్కొన్న దైవాజ్ఞలన్నీ తెలుసుకోవాలంటే ప్రతిరోజూ దైవగ్రంథం యోచనా దృష్టితో పఠిస్తూ ఉండాలి. అప్పుడే అతనిలో నిజమైన దైవభీతి జనిస్తుంది. దైవభీతే మనిషిని పాపకార్యాల నుండి వారించి సత్కార్యాల వైపుకు పురిగొల్పుతుంది.

# 43. దైవభీతి తెచ్చిన పరివర్తన

"విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించిపోయే సమయమింకా రాలేదా? ఆయన పంపిన సత్యం ముందు లొంగిపోయే వేళ ఆసన్నం కాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కాని ఓ సుదీర్ఘకాలం గడచిన తరువాత వారి హృదయాలు కఠినమైపోయాయి. ఈనాడు వారిలో చాలామంది దుర్మార్గులై ఉన్నారు. మీరు అలా కాకూడదు సుమా!" (ఖుర్ఆన్-57:16)

పూర్వం ఖురాసాన్ పట్టణంలో అబ్దుల్లా అనే ఒక యువకుడు ఉండేవాడు. అతను తన తల్లిదండ్రులకు ఏకైక సంతానం. ఏకైక సంతానాన్ని తల్లిదండ్రులు సహజంగానే అల్లారుముద్దుగా పెంచుతారు. అబ్దుల్లాను అతని తల్లిదండ్రులు కూడా అలాగే పెంచారు. దాంతో అబ్దుల్లా త్రాగుడు, జూదం, వ్యభిచారం మొదలైన దుర్వ్యసనాలకు అలవాటు పడి విశృంఖుల జీవితం గడపసాగాడు. తల్లిదండ్రులు ఎన్ని విధాల హితోపదేశం చేసినా అతని చెవులకు ఎక్కేదికాదు.

ఒకరోజు రాత్రి అబ్దుల్లా తన స్నేహితులతో కలసి మందుపార్టీ జరుపుకుంటూ, మత్తులో తేలిపోయాడు. మద్యం మత్తులోనే కాస్సేపటికి నిద్రపోయి స్వప్నలోకంలో విహరించసాగాడు. ఎంతో అందమైన ఉద్యానవనంలో ఓ చెట్టుకొమ్మ మీద కూర్చున్న ఒక చిలకమ్మ సుమధుర స్వరంతో "విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించిపోయే సమయమింకా రాలేదా?" అంటూ పాడసాగింది.

అబ్దుల్లా ఈ పలుకులు వినగానే అదిరిపోయి "దేవా! నా దైవమా! ఆ సమయం వచ్చేసింది" అంటూ చివాలున లేచాడు. లేవగానే మధుపాత్రలు ఎత్తి నేల మీద విసరి కొట్టాడు. తాంబుర్ర తీగలు లాగేసి దాన్ని పగలగొట్టాడు. వంటి మీది రంగుల చొక్కా చించిపారేశాడు. స్నానం చేసి దైవసన్నిధిలో మోకరిల్లాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోతూ దైవాన్ని క్షమాపణ వేడుకుంటూ, ఇకనుంచి ఎలాంటి పాపానికీ, చెడుకూ పాల్పడనని గట్టిగా వాగ్దానం కూడా చేశాడు.

ఆనాటి నుంచి అబ్దుల్లా జీవితం పూర్తిగా మారిపోయింది. ఆయనే యావత్తు ముస్లిం జగత్తులో గొప్ప దైవప్రియుడిగా, ప్రముఖ హదీసువేత్తగా ప్రసిద్ధిచెందిన అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మాలై).

ఇదీ దైవభీతి. దైవభీతికి సంబంధించిన మరికొన్ని ఉదాహరణలు వినండి:

మన రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ముందు ఒకతను "నీ ప్రభువు శిక్ష తప్పకుండా వచ్చి తీరుతుంది. దాన్ని ఏ శక్తీ అడ్డుకోజాలదు" అనే ఖుర్ఆన్ సూక్తి పఠించాడు. అంతే, ఈ సూక్తి వినగానే హజ్రత్ ఉమర్ (రజి) నిలువునా వణికిపోతూ ఒకేఒక పొలికేక పెట్టారు. ఆ తరువాత స్పృహతప్పి పడిపోయారు. వెంటనే స్నేహితులు ఆయన్ని ఎత్తుకొని ఇంటికి చేర్చారు. ఈ దైవభయంతో ఆయన నెల రోజుల దాకా



అస్వస్థతకు గురయి ఉన్నారు.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) యధాప్రకారం ఓరోజు రాత్రివేళ రాజధాని నగరం మదీనాలో గస్తీ తిరగసాగారు. అలా గస్తీ తిరుగుతుంటే ఓ ఇంటిముందు ఒక ముసలమ్మ గేదెపాలు పితకుతోంది. హజ్రత్ ఉమర్ (రజి) ఆమెను ఉద్దేశించి "బామ్మా! పాలలో ఏమాత్రం నీళ్ళు కలపకు. ప్రజల్ని ఎన్నటికీ మోసగించకూడదు సుమా!"అని చెప్పారు. దానికి ఆ ముసలమ్మ "విశ్వాసులనాయకా! మీరు నిశ్చింతగా ఉండండి. నేనలా ఎన్నటికీ చేయను" అన్నది. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని ముందుకు సాగారు.

కొన్నాళ్ళ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) రాత్రివేళ గస్తీ తిరుగుతూ అదే ఇంటి పక్కగా నడుస్తుంటే లోపలి నుంచి తల్లీకూతుళ్ళ మాటలు ఇలా విన్పించాయి:

హజ్రత్ ఉమర్ (రజి) వెంటనే ఆ ఇంటి చూరు కింద నిల్చొని వారిద్దరి మాటలు జాగ్రత్తగా వినసాగారు:

"అమ్మాయ్! తెల్లవారు కావస్తోంది. లేచి తొందరగా పాలలో నీళ్ళు కలుపు"

"అమ్మా! పాలలో నీళ్ళు కలపడం చట్టపరంగా నేరం. మన ఖలీఫా కూడా పాలలో నీళ్ళు కలపవద్దని హెచ్చరించారు. నేనెల నీళ్ళు కలపను?"

"ఇప్పుడు ఖలీఫా వచ్చి చూడబోతున్నాడా ఏమిటీ? తొందరగా నీళ్ళు కలుపు."

"ఖలీఫా చూడకపోయినా భూమ్యాకాశాల యజమాని చూస్తూనే ఉన్నాడుకదా! మనం ఖలీఫా, ఆయన రక్షకభటుల కళ్ళుగప్పగలం కాని, సృష్టికర్త కళ్ళు గప్పలేము. నేను మాత్రం ఎన్నటికీ పాలలో నీళ్ళు కలపలేను."

హజ్రత్ ఉమర్ (రజి) ఈసంభాషణ విని వెళ్ళిపోయారు. మరునాడు కొడుకుల్ని పిలిచి విషయం చెబుతూ "ఆ అమ్మాయిని నేను నా కోడలిగా చేసుకోదలిచాను. మీలో ఆ అమ్మాయిని ఎవరు చేసుకుంటారో చెప్పండి, నేనెళ్ళి అమ్మాయి తల్లితో మాట్లాడుతాను" అని అన్నారు. అప్పుడు హజ్రత్ ఆసిమ్ (రజి) ముందుకు వచ్చి "నాన్నా! నేను చేసుకుంటాను" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) ఆ పాలముసలమ్మ ఇంటికి వెళ్ళారు. ఖలీఫాను చూడగానే ఆ ముసలమ్మ కంగారుపడిపోతూ ఓ పాత చాప పరిచింది కూర్చోమంటూ. హజ్రత్ ఉమర్ (రజి) చాపమీద కూర్చుంటూ "నేను మీ అమ్మాయిని నా కోడలుగా చేసుకోదలిచాను. నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అని అన్నారు.

ఈమాట వినగానే ముసలమ్మ కొయ్యబారిపోయి గుడ్లప్పగించి చూడసాగింది. తరువాత ఆశ్చర్యం నుంచి తేరుకొని "అమీరుల్ మోమినూన్ (విశ్వాసుల నాయకా)! పూరిగుడిసెలో ఉండే ఈ పేదరాలు ఎక్కడా, ఓ పెద్ద సామ్రాజ్యానికే అధినేత

అయిన తమరెక్కడా! అంతకంటే గొప్ప అదృష్టం ఈ దీనురాలికి మరేం కాగలుగుతుంది." అని అన్నది ఆనందాశృవులు రాల్చుతూ. లోపల్నుంచి ఈమాటలు విన్న ఆ యువతి సంతోషం సరేసరి.

ఆ తరువాత ఖలీఫా కుమారుడు ఆసిమ్ (రజి) వివాహం ఆ పేద యువతితో జరిగిపోయింది. వారిద్దరికి ఉమ్మెఆసిమ్ అనే బాలిక జన్మించింది. అప్పటి సామ్రాజ్యాధినేత అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్‌తో ఉమ్మెఆసిమ్ వివాహం జరిగింది. వారిద్దరి ముద్దుబిడ్డే గొప్ప దైవభీతిపరాయణుడిగా, రెండవ ఉమర్‌గా, సన్మార్గగాముడైన ఐదవ ఖలీఫాగా విశ్వవిఖ్యాతి చెందిన హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై).

పూర్వం బస్రా పట్టణంలో ఓ భూస్వామి ఉండేవాడు. అతనొక రోజు తన తోటలోని మహల్‌లోకి ప్రవేశించినప్పుడు అతని దగ్గర పనిచేసే ఒక సేవకుడు, అతని అందాల కుమార్తె కన్పించారు. భూస్వామి ఆ యువతిని చూడగానే అతని మనస్సు అదుపు తప్పింది. అతను సేవకుడ్ని ఏదో పనిమీద బయటికి పంపివేశాడు.

ఆ తరువాత భూస్వామి ఆ యువతిని ఉద్దేశించి "మహల్ తలుపులన్నీ మూసెయ్యి" అని ఆదేశించాడు. యువతి యజమాని ఆదేశం పాటిస్తూ తలుపులన్నీ మూసి వచ్చింది. భూస్వామి ఆమెను తదేకంగా చూస్తూ "తలుపులన్నీ మూశావా?" అని అడిగాడు. దానికా యువతి "తలుపులన్నీ మూశాను దొరా! కాని ఒక తలుపు మాత్రం మూయలేక పోయాను" అన్నది.

భూస్వామి ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటీ, ఒక తలుపు మూయలేక పోయావా? ఏ తలుపది?" అని అడిగాడు.

దానికా యువతి సమాధానమిస్తూ "ఏ తలుపు గుండా మీ ప్రభువు, నా ప్రభువు అయిన విశ్వపాలకుడు మనల్ని చూస్తున్నాడో ఆ తలుపును నేనెలా మూసేయ గలుగుతాను?" అని అన్నది.

ఈమాట వినగానే భూస్వామి నెత్తిమీద పిడుగు పడినట్లు అదిరిపడ్డాడు. సిగ్గుతో కుంచించుకు పోతూ వెంటనే ఆ యువతికి క్షమాపణ చెప్పుకున్నాడు. తనను పాపకార్యం నుండి కాపాడిన దేవునికి కృతజ్ఞతలు కూడా చెప్పుకున్నాడు.

## 44. పాపభీతి-మానసిక ప్రభావం

"ఇంగ్లాండులోని న్యూకేస్టల్ విశ్వవిద్యాలయం పరిశోధకులు 'కళ్ళకు' ఉన్న మహాత్మ్యాన్ని పరిశోధన ద్వారా ఇటీవల నిరూపించారు. వారు చేసింది చాలా చిన్న ప్రయోగం, కాని పరిశోధించి తెలుసుకున్నది, నిరూపించింది మాత్రం నేరపరిశోధ నాశాస్త్రానికి తలమానికమయింది. ఎక్స్‌రే మెషీన్లు, క్లోజ్డ్ సర్క్యూట్ కెమేరాలు, నిరంతరం నిఘా సిబ్బంది పెంచలేని 'నిజాయితీ'ని కేవలం రెండు కళ్ళు ఉన్న చిత్రం సాధిస్తుందని కనుగొన్నారు."



"విశ్వవిద్యాలయంలోని కాంటిన్‌లో 'నిజాయితీ డబ్బా'ను ఒక డ్రింక్స్ అమ్మే మిషన్ దగ్గర పెట్టారు. కాఫీ తాగాలనుకున్నవారు ఒక మీట నొక్కితే కప్పులోకి కాఫీ వస్తుంది. కాఫీ తీసుకొని ఒక రూపాయిని పక్కనే ఉన్న 'నిజాయితీ డబ్బా'లో వేయాలి. ఇంతవరకు ఏమాత్రం వింత ఏవిధమైన పరిశోధనాంశం లేవు. కాని విశ్వవిద్యాలయంలోని మానసికశాస్త్ర పరిశోధకులు కాఫీమెషీన్ మీద సరిగ్గా కళ్ళ ఎదురుగా పూలగుత్తి ఉన్న ఒక చిత్రం అతికించారు. ఒక వారం రోజుల తరువాత కాఫీమిషన్ పక్కన ఉన్న నిజాయితీ డబ్బాలో పోగయిన డబ్బు లెక్కించి నమోదు చేశారు. దీని తర్వాత అదే మెషీన్ మీద కళ్ళకు ఎదురుగా ఆకర్షణీయంగా ఉండే చక్షుద్వయం ఫొటోను ఉంచారు. మరొక వారం రోజుల తర్వాత నిజాయితీ డబ్బాను తెరచి చూసిన పరిశోధకులు ఆశ్చర్యపోయారు.

ఆ డబ్బాలో గతవారం కన్నా దాదాపు మూడురెట్లు ఎక్కువ ధనం పోగయింది. తమ ప్రయోగం సఫలమైనందుకు సంతోషించి 'ఇతరులు తమను గమనిస్తున్నారన్న భావన వల్ల నేరప్రవృత్తి తగ్గుతుంది. దీనికి నిజమైన కళ్ళే అవసరం లేదు. కేవలం కళ్ళున్న ఫొటో కూడా చాలు అని సిద్ధాంతీకరించారు. తాము కనుగొన్న ఫలితాలు రేపటి నేరప్రవృత్తిని, హింసామార్గాన్ని అరికడతామని డాక్టర్ బాటేసన్ అనే పరిశోధకురాలు ప్రకటించారు. ఇతరులు గమనిస్తున్నారన్న భావం కల్పిస్తే వ్యక్తుల ప్రవర్తనలో, సహకారంలో, సాంఘిక జీవనంలో నిజాయితీ చోటు చేసుకుంటుంది. మంచి-చెడు నిర్ణయించుకోవడంలో మంచి వైపు మొగ్గుతారు అని నిగ్గు తేల్చారు..." (తెలుగు దినపత్రిక 'వార్త'-9.7.06 సంచిక చూడండి.)

### దైవనిఘా

సాధారణంగా నేరం చేసే మనిషి నేరం చేస్తున్నప్పుడు తనను శిక్షించే, తనకు వ్యతిరేకంగా సాక్షమిచ్చేవారు ఎవరైనా చూస్తున్నారా అని భావిస్తూ, అలాంటి వాళ్ళు ఎవరైనా లేరని నిర్ధారణ చేసుకున్నప్పుడే అతనా నేరానికి పాల్పడతాడు. అలాంటి వాళ్ళు ఎవరైనా తనను చూస్తున్నారని పసికడ్తే మాత్రం నేరం చేయడానికి సాహసించలేడు. అయితే ఈ నేరభీతి ప్రపంచానికి సంబంధించిన నేరభీతి కంటే పరలోకానికి సంబంధించిన నేరభీతి తీవ్రంగా ఉంటుంది. పరలోకపు జవాబుదారీ విశ్వాసం కలిగిన ఇస్లాం ధర్మాన్ని దృఢంగా విశ్వసించిన మనిషి తనను మనుషులు ఎవరూ చూడక పోయినా, దేవుడు మాత్రం నిస్సందేహంగా చూస్తున్నాడని నమ్ముతాడు. అందువల్ల నేరం చేయడానికి సాహసించలేడు.

ఈ విషయం గురించి ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల పేర్కొనబడింది. ఉదాహరణకు ఈ క్రింది సూక్తులు చూడండి:

- "మీరు చేస్తున్న పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (2:110)

❀ "గుర్తుంచుకోండి! మీరు చేస్తున్న పనులన్నిటినీ ఆయన గమనిస్తూనే ఉన్నాడు." (2:233)

❀ "దేవుడు మీ చర్యల్ని గమనిస్తూనే ఉన్నాడు." (3:99)

❀ "పైన అందరికంటే అధికుడు, అత్యున్నతుడైన దేవుడు ఉన్నాడని గుర్తుంచుకోండి." (4:34)

❀ "వీరు తమ చేష్టల్ని ప్రజల కంటబడకుండా దాచగలరుగాని దేవుని కంటబడకుండా దాచలేరు.... దేవుడు వారి చర్యలన్నిటినీ పరివేష్ఠించి ఉన్నాడు." (4:108)

❀ "వారు ఎంతో రహస్యంగా ఉంచామనుకున్న విషయాలు కూడా దేవునికి తెలుసు." (5:61)

❀ "ఆయన శిక్ష నుండి నేరస్థుల్ని ఎవరూ తప్పించలేరని వారికి చెప్పు." (6:147)

❀ "ఆయన (మానవుల) హృదయాల్లో మెదిలే రహస్య విషయాలు సయితం ఎరిగివాడు." (8:43)

❀ "మీరు అంతర్బాహ్యాలన్నీ ఎరిగిన దేవుని వైపుకు మరలించబడతారు. అప్పుడాయన మీరు (భూలోకంలో) ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాడు." (9:94)

❀ "భూమ్యాకాశాల్లోని సృష్టిరాసులన్నీ కట్టుబానిసలై ఆయన ముందుకొస్తాయి. ఆయన అందర్నీ పరివేష్ఠించిఉన్నాడు. ప్రతిఒక్కర్నీ లెక్కపెట్టి ఉంచాడు. చివరికి యావన్మంది ప్రళయదినాన ఒంటరిగా ఆయన ముందు సమావేశమౌతారు." (19:93-95)

❀ "ఆరోజు మానవులు విభిన్నవర్గాలుగా విడిపోయి (దైవ న్యాయస్థానం నుండి) తిరిగొస్తారు. అప్పుడు వారికి వారి కర్మలు చూపించబడతాయి. ఆ తరువాత ఎవరైనా అణుమాత్రం సత్కార్యం చేసివున్నా అతను దాన్ని (కళ్ళారా) చూసుకుంటాడు. ఎవరైనా అణుమాత్రం దుష్కార్యం చేసివున్నా అతనూ దాన్ని చూసుకుంటాడు." (99:6-8)

కొన్ని రకాల సత్కార్యాలు విశ్వాసులూ చేస్తారు, అవిశ్వాసులూ చేస్తారు. అయితే ప్రతిఫలం విషయంలో ఖుర్ఆన్ నాలుగు విధల దృక్పథాన్ని పేర్కొన్నది:

✪ అవిశ్వాసులు, బహుదైవారాధకులు, కపట విశ్వాసులు చేసిన సత్కార్యాలు వృథాఅవుతాయి. పరలోకంలో వారికి ఎలాంటి పుణ్యఫలం లభించదు. ఆ సత్కార్యాలకు ఏదైనా ప్రతిఫలం లభిస్తుందంటే అది ఇహలోకంలో మాత్రమే లభిస్తుంది. ఉదా:- ఖుర్ఆన్‌లోని 7:147; 9:17,67-69; 11:15,16; 14:18; 18:104,105; 24:39; 25:23; 33:19; 39:65; 46:20 సూక్తులు చూడండి.

✪ ఎంత పాపం చేస్తే అంతే శిక్ష పడుతుంది. అయితే సత్కార్యాలకు పదింతల ప్రతిఫలం లభిస్తుంది. ఒక్కోసారి దేవుడు తలిస్తే అంతకంటే ఎక్కువ కూడా



ప్రతిఫలం ప్రసాదించవచ్చు. ఉదా:- ఖుర్ఆన్‌లోని 2:261; 6:160; 10:26,27; 24:38; 28:84; 34:27; 40:40 సూక్తులు చూడండి.

✪ విశ్వాసి పెద్ద పెద్ద పాపాలు విడనాడితే అతను చేసిన చిన్న చిన్న పాపాలు క్షమించబడతాయి. ఉదా:-ఖుర్ఆన్‌లోని 4:31; 42:37; 53:32 సూక్తులు చూడండి.

✪ "(పాప)భారం మోసేవారెవరూ ఇతరుల (పాప)భారం మోయలేరు. (పాప) భారం క్రింద అణగిపోయినవాడు తన భారాన్ని తొలగించుకోవడానికి ఎవరినైనా పిలిస్తే, అతని అణుమాత్రం బరువు కూడా మోయడానికి ఎవరూ ముందుకు రారు." (35:18)

✪ సద్గుణ సంపన్నుడైన విశ్వాసి నుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంది. అతని పొరపాట్లు క్షమించబడతాయి. అతను చేసిన పుణ్యాకార్యాల ప్రకారం అతనికి అత్యున్నత ప్రతిఫలం లభిస్తుంది. ఉదా:- ఖుర్ఆన్‌లోని 29:7; 39:35; 46:16; 84:8 సూక్తులు చూడండి. అలాంటి విశ్వాసి తాను చేసిన అణుమాత్రపు పాపకార్యానికి సైతం ఫలితం ప్రపంచంలో అనుభవిస్తాడు; అణుమాత్రపు పుణ్యకార్యానికి సైతం ప్రతిఫలం పరలోకంలో పొందుతాడు.

హజ్రత్ అబూబకర్ (రజి) భోంచేస్తున్నప్పుడు ఈసూక్తి గురించి ప్రవక్త (స) నోట వినగానే భోజనం ఆపేసి "దైవప్రవక్తా! నేనుచేసిన అణుమాత్రపు పాపానిక్కూడా పర్యవసానం చూసుకుంటానా?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అబూబకర్! భూలోకంలో నీకు బాధకలిగించే ఏ విషయమైనా అది నీ వల్ల జరిగిన అణుమాత్రపు పాపానికి పర్యవసానం. అణుమాత్రపు పుణ్యకార్యం చేసిఉంటే, దాన్ని దేవుడు పరలోకంలో నీకోసం భద్రపరచి ఉంచుతాడు." (తబ్రాని, బైహఖి)

మరోసారి దైవప్రవక్త (సల్లం) విశ్వాసి చేసే పాపపుణ్యాలను గురించి ఇలా తెలిపారు: "మీలో పుణ్యకార్యాలు చేసేవారికి వాటి ప్రతిఫలం పరలోకంలో లభిస్తుంది. అయితే పాపకార్యాలకు మాత్రం ఇహలోకంలోనే ఆపదలు, వ్యాధుల రూపంలో శిక్ష అనుభవిస్తారు." (ఇబ్నె మర్దూయా)

షరీఅత్ ఆజ్ఞల్ని గట్టిగా పాటించే ముస్లింలకు మాత్రమే పై హితోక్తి వర్తిస్తుంది. పదార్థపూజారులై పోయిన ముస్లింలను దేవుడు పట్టించుకోడు. అందుకే వారు పాప కార్యాలు చేస్తున్నా ఏ బాధలు లేకుండా ఉంటున్నారు.

పోతే అవిశ్వాసులకు పుణ్యకార్యాల ప్రతిఫలం ప్రపంచంలోనే లభిస్తుంది. పాపాకార్యాలకు పరలోకంలో నరక శిక్ష చవిచూడవలసి వస్తుంది. కొన్ని ప్రవక్తప్రవచనాల ప్రకారం అవిశ్వాసులు చేసిన పుణ్యకార్యాల వల్ల పరోలోకంలో వారికి శిక్ష తీవ్రత కొంతవరకు తగ్గించబడుతుందని తెలుస్తోంది. ఉదాహరణకు, విశ్వవిఖ్యాత దానశీలుడయిన హాతింతాయికి అతను చేసిన విశేష దానధర్మాలకు పరలోకంలో తేలికపాటి శిక్ష విధించబడుతుందని తెలుస్తోంది. (రూహుల్ మాని)

# 45. దైవభీతి సర్వత్రా ద్యోతకమవ్వాలి

అనేక ఆరాధనలలో ఉపవాసవ్రతానికి ఓ ప్రత్యేకత ఉంది. ఎలాంటి ప్రదర్శనా బుద్ధి లేకుండా కేవలం దేవుని ప్రసన్నత, ఆయన విధేయతలను కోరుకునే మనిషి మాత్రమే ఉపవాసం పాటించ గలుగుతాడు. దీనిక్కారణం ఒక్కటే. ఇతర ఆరాధనల సంగతి నలుగురికీ తెలుస్తుంది. ప్రజల కంటబడకుండా వాటిని రహస్యంగా ఆచరిం డం సాధ్యం కాదు. కాని ఫలానా వ్యక్తి ఉపవాసం ఉన్నాడా లేదా అనే విషయం జనానికి తెలియదు. ఒకవేళ అతను ఎవరి కంట బడకుండా తింటూ, తాగుతూ నేను ఉపవాసం ఉన్నానని అంటే జనం నిజమే అనుకుంటారు.

ఒక వ్యక్తి జమాఅత్‌తో కలసి సామూహిక నమాజ్ చేస్తుంటే అనేకమంది అతడ్ని చూస్తుంటారు. అయితే ఇక్కడ అతను దేవుని ప్రసన్నత కోసం గాకుండా ఇతరుల మెప్పు కోసమో లేదా మరేదైనా ప్రాపంచిక ప్రయోజనం ఆశించో నమాజ్ చేసే అవకాశం ఉంది. లేదా మనసులో ఇష్టం లేకపోయినా వృత్తిపరమైన ధార్మికత దృష్ట్యా కూడా నమాజ్ చేయవచ్చు. హజ్‌కు బయలుదేరినప్పుడు అతను ప్రయాణంలో హజ్ నియమాలను పాటిస్తూ ఉండటాన్ని ప్రజలు చూస్తారు. ప్రజల దృష్టి నుండి అతను తప్పించుకోలేడు. పైగా హజ్‌యాత్రలో తోటియాత్రికులు అనేకమంది అతని వెంట ఉంటారు. వారంతా అతను హజ్ నియమాలను పాటిస్తుంటే చూస్తుంటారుస. జకాత్, ఇతర దానధర్మాల సంగతి చాలామందికి తెలియకపోయినా కనీసం వాటిని స్వీకరించే వారికైనా తెలుస్తుంది. అలాగే యుద్ధరంగంలో ముజాహిద్ చేసే పోరాటాన్ని ఎందరో చూస్తారు. ధర్మవేత్తలు తమ జ్ఞానసంపదను గుప్తంగా ఉంచలేరు. హాఫిజ్, ఖారీల సంగతయితే సరేసరి. వారి పేరుప్రఖ్యాతలు సుదూర ప్రాంతాలకు పాకిపోతాయి. సంఘసేవ, ఇస్లామీయ పరిపాలనా కార్యకలాపాలు మొదలైన సత్కార్యాల పరిస్థితి కూడా ఇంతే. వాటిని ప్రజల దృష్టి పడకుండా రహస్యంగా ఆచరించడం కష్టం.

హాజీ అన్పించుకోవాలన్న కోరికగాని, మరేదయినా ప్రాపంచిక ప్రయోజనం పొందాలన్న ఉద్దేశ్యంగాని ఒక వ్యక్తిని హజ్ చేయడానికి ప్రేరేపించవచ్చు. దాతగా, దానకర్ణుడిగా ఖ్యాతి చెందాలన్న కోరిక జకాత్ ఇవ్వడానికి, దానధర్మాలు చేయడానికి పురిగొల్పవచ్చు. విజేతగా, వీరాధివీరుడిగా జనంలో వెలిగిపోవాలన్న దుర్బుద్ధిగాని, సమరసొత్తు పొందాలన్న పేరాశగాని యుద్ధమైదానానికి గొనిపోవచ్చు. ప్రజల గౌరవాభి మానాలు పొందవచ్చని, గొప్పరచయితగా, మంచి ఉపన్యాసకుడిగా పేరుప్రఖ్యాతలు పొందవచ్చని భావించి జ్ఞానార్జన చేయవచ్చు. హాఫిజ్‌గా, ఖారీగా ప్రజల మెప్పు పొందా లన్న వాంఛ ఖుర్ఆన్ కంఠస్తం చేయడానికి, ఖిరాత్ కళ నేర్చుకోవడానికి ఉసిగొల్ప వచ్చు. ఇంకా ఇతర అనేక సత్కార్యాల విషయంలో కూడా ఇలాంటి దురుద్దేశ్యాలు, దుష్ట సంకల్పాలు ఉండే ప్రమాదం ఉండవచ్చు.



కాని ఉపవాస విషయం దీనికి భిన్నంగా ఉంది. మనిషి ఉపవాసం పాటిస్తున్న సంగతి దేవునికి తప్ప మరెవరికీ తెలియదు. ఎవరు ఉపవాసం ఉన్నారు, ఎవరు ఉపవాసం లేరు అనే విషయం దేవునికి మాత్రమే తెలుసు. అందువల్ల మనిషి కేవలం దేవుని ప్రసన్నత కోసం ఉపవాసం పాటించవలసి ఉంటుంది. దైవప్రసన్నతను, నరక శిక్ష నుండి విముక్తిని కోరుకునే మనిషి మాత్రమే ఉపవాసం పాటించ గలుగుతాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) రోజా ప్రత్యేకతను తెలుపుతూ ఇలా అన్నారు: "మనిషి చేసే ప్రతి సత్కార్యానికి ప్రతిఫలం పది నుండి ఏడు వందల రెట్లదాకా పెంచడం జరుగుతుంది. అయితే ఉపవాసం విషయంలో దేవుడు ఇలా తెలియ జేశాడు- 'ఈ నిబంధన నుండి రోజా మినహాయించబడింది. కారణం రోజా కేవలం నా కోసమే పాటించబడుతుంది. నేనే స్వయంగా దానికి ప్రతిఫలం ప్రసాదిస్తాను. రోజా పాటించే వ్యక్తికి సుఖసంతోషాలు లభించే రెండు సందర్భాలు ఉన్నాయి. ఒకటి, ఇఫ్తార్ చేస్తున్నప్పుడు. రెండు, తన ప్రభువును కలుసుకున్నప్పుడు."

ఉపవాసవ్రతం కేవలం దైవప్రసన్నత కోసం ఆచరించబడే దైవారాధన. కనుక ఇది మనిషి హృదయంలో దైవభీతిని కలిగిస్తుంది. హృదయంలో ప్రదర్శనాభావం, పేరుప్రతిష్ఠల కోరికలు లేకుండా దాన్ని ప్రక్షాళనం చేస్తుంది. పరలోక జవాబుదారీ భావాన్ని జనింపజేస్తుంది. బాహ్యాసంస్కరణకు ముందు అంతర్‌సంస్కరణ చేస్తుంది.

ఎడతెగకుండా నెల రోజులపాటు ఉపవాసాలు పాటించడం వల్ల మన హృద యాంతరాళంలో దైవభీతి పరాయణత్వం వేళ్ళూనితుంది. ఆ దైవభీతి పరాయణత జీవితంలోని వివిధ రంగాల్లో బహిర్గతమవుతుంది. దాని ఫలపుష్పాలు కన్పించనారం భిస్తాయి. హృదయంలో దైవభీతి పరాయణత దృఢంగా నాటుకోబడిన వ్యక్తి రహస్యం గాకూడా పాపానికి పాల్పడలేడు. అతను అబద్ధమాడలేడ. నమ్మకద్రోహం చేయలేడు. దొంగతనం, మద్యపానం, వ్యభిచారం వంటి ఘోరనేరాలకు ఒడిగట్టలేడు.

దైవభీతి పరాయణత్వం అతని అంతర్‌బాహ్యాలను ఒకే మూసాలో పోతపోసి సమన్వయపరుస్తుంది. తనను ఇతరులు చూస్తున్నా చూడకపోయినా దేవుడు మాత్రం గమనిస్తూనే ఉన్నాడన్న విశ్వాసం, నమ్మకాలు అతని మనస్సులో ఏర్పడతాయి. దైవ భీతిపరాయణత్వం (తఖ్వా) అతడ్ని హెచ్చరిస్తూ "నీవు ఇహలోక చట్టం పట్టు నుండి తప్పించుకుంటే తప్పించుకో గలవుకాని, పరలోక శిక్ష నుండి మాత్రం ఎన్నటికీ తప్పించుకోలేవు" అని అంటుంది.

ఉపవాసవ్రతం వల్ల హృదయంలో దైవభీతి పరాయణత్వం జనించి, అది జీవితంలోని ఇతర వ్యవహారాల్లో బహిర్గతమవుతుంటే, ఇక మన ఆకలిదప్పుల శ్రమ ఫలించినట్లేనని గ్రహించాలి. ఒకవేళ ఉపవాసాల ప్రభావం మన జీవితవ్యవహారాలపై కన్పించకపోతే, ఆకలిదప్పుల బాధ తప్ప మనకు మిగిలేదీ ఉండదు. ఈనాడు

ముస్లిములు పాటిస్తున్న ఉపవాసాలు వారి హృదయాల్లో దైవభీతి లక్షణాన్ని కలిగించడం లేదు. వాటి ప్రభావం వారి జీవిత వ్యవహారాల్లో కానరావడం లేదు. కారణం వారు ఉపవాసంలో ఆకలిదప్పులతో మాత్రమే ఉంటున్నారు కాని, దాంతోపాటు దైవభీతిని జనింపజేయడానికి కావలసిన ఇతర పనులను నెరవేర్చడం లేదు.

**పైన బటారం లోన లటారం:-** అంచేత వారి బాహ్యస్వరూపం ఎంత కాంతిమంతంగా ఉన్నా వారి అంతర్గతం మటుకు చీకటిగానే ఉంటోంది. వారు పైకి కన్పించే ధర్మపరాయణత కోసం ఎంత శ్రద్ధవహిస్తున్నారో వారి జీవిత అంతర్విభాగాలు అంతగా ధర్మపరాయణతకు దూరమై పోతున్నాయి. వారు ప్రజల ముందు మాటల ద్వారా, చేతల ద్వారా ఎంత భక్తిపరాయణత ప్రదర్శిస్తున్నారో ఏకాంత వ్యవహారాల్లో అంతకన్నా ఎక్కువగా ధర్మరాహిత్యం, దుర్గుణాల్లో కొట్టుకుపోతున్నారు.

ప్రజలు వీరికి దూరంగా ఉన్నంతవరకు వీరిని చూసి వీరిదంతా ఓ ప్రత్యేక వేషధారణ, కృత్రిమ ధార్మికత తప్ప మరేమీ కాదని తెలుసుకొని ఆశ్చర్యపోతారు. ప్రజలు దగ్గరికొచ్చి చూస్తే వీరి ధర్మపరాయణత బండారం కాస్త బయట పడుతుంది. అంటే వీరి పరిస్థితి పైన బటారం, లోన లటారంలా ఉందన్నమాట!

కాబట్టి వారు ఇప్పటికైనా కళ్ళు తెరచి ఈ పరిస్థితిని మార్చుకోవడానికి ప్రయత్నించాలి. ఇది ఈమాన్ (విశ్వాసం) వైఖరికాదు, నిఫాఖ్ (కాపట్యం) వైఖరి. దీన్ని అంత మొందించాలి. మొట్టమొదట వారు తమ హృదయాల్లో దైవభీతిని, పరలోక జవాబు దారీ భావాన్ని కలిగించాలి. బాహ్యవిషయాలకు ముందు అంతర్విషయాలను సంస్కరించుకోవాలి. బాహ్యవిషయాల్లోకన్నా అంతర్విషయాల్లోనే ధర్మపరాయణత ఎక్కువగా ద్యోతకమవ్వాలి. పైకి కన్పించే ధర్మపరాయణత పట్ల శ్రద్ధవహించడానికి ముందు ధర్మపరాయణతకు సంబంధించిన వాస్తవికతకు, దాని స్పిరిట్‌కు తమ హృదయంలో చోటివ్వడానికి కృషి చేయాలి. ఈ వైఖరే ముస్లిముల విశ్వాసానికి, దైవభీతికి, ధర్మపరాయణతకు దర్పణం. దీని పైనే వారి పరలోక సాఫల్యం ఆధారపడి ఉంటుంది.

ఇలాంటి దైవభీతి జనింపజేయడానికి పూర్తి స్పృహతో ఉపవాసాలు పాటించాలి. అంతేకాదు, వాటిని ప్రభావంతం చేసి ఫలవంతం చేయగలిగే ఇతర విషయాలను కూడా పాటించాలి. ఉపవాసాల ప్రభావాన్ని నీరుగార్చే పనులను మానెయ్యాలి. ఉపవాసవ్రతంలో ఉన్నప్పుడు మనసులో చెడు తలంపులు రాకుండా చేసుకోవాలి. నోరు, కళ్ళు, చెవులను చెడు విషయాల జోలికి పోనివ్వకుండా కాపాడుకోవాలి. అబద్ధం, అపనింద, అవినీతి, మద్యం, జూదం, అక్రమం, అత్యాచారాలకు దూరంగా మసలుకోవాలి. విధులు, బాధ్యతలను నెరవేరుస్తూ ఉండాలి. ఖుర్‌ఆన్, హదీసు, ఇతర ధార్మిక గ్రంథాలను తరచుగా అధ్యయనం చేస్తుండాలి. దేవునికి పూర్తిగా విధేయులయి, ఆయన ఆజ్ఞలన్నిటిని శిరసావహిస్తూ ఆయన ప్రవక్త (సల్లం) అడుగు జాడల్లో నడవడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలి.



మన హృదయం భక్తిపరాయణతకు కేంద్రం, మంచి విషయలకు నిలయం. అందువల్ల మనం శారీరకంగా మాత్రమే గాకుండా, మానసికంగా కూడా ఉపవాసం పాటించాలి. మానసిక ఉపవాసం లేనిదే శుష్క శారీరక ఉపవాసం వల్ల ఎలాంటి ప్రయోజనం సిద్ధించదు. కనుక మనం మొట్టమొదట మన హృదయాల్లో దైవభీతిని, పరలోకపు జవాబుదారీ భావాన్ని జనింపజేయాలి. మనస్సు సంస్కరించబడితే శరీరం కూడా సంస్కరించబడుతుంది. మన జీవిత రంగాలన్నిటిలోనూ దైవభీతి పరాయణత్వం తొణికిసలాడాలి. మనం దేవుని ముందు, లోకుల ముందు ఒకే ముఖంతో కన్పించాలి. మన అంతర్ బాహ్యాలలో ఎలాంటి వైరుధ్యం కన్పించకూడదు.

ఉపవాసానికి ఉన్న ఈ ప్రత్యేకత వల్లనే దేవుడు దాని పుణ్యఫలాన్ని కూడా అసాధారణంగా పెంచాడు. ఉపవాసాల ద్వారా ఈ అసాధారణ పుణ్యఫలాన్ని ఆశించే వారు సహజంగానే రమజాన్ శుభమాసాన్ని ఎంతో ఉత్సాహంతో స్వాగతిస్తారు. ఆ మాసంలో వారు ఒక్కరోజు కూడా వదలకుండా ఉపవాసాలు పాటిస్తారు.

ఒకసారి హజ్రత్ అబూ ఉమామా (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! దేవుడు నాకు (ఎక్కువ) ప్రయోజనం చేకూర్చేటటువంటి (ప్రత్యేక) సత్కార్యం ఏదైనా ఉంటే ఆజ్ఞాపించండి, నేను ఆచరిస్తాను" అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఉపవాసం పాటించు. ఉపవాసానికి మించిన సత్కార్యం మరేదీ లేదు" అని ఉపదేశించారు.

ఉపవాసానికున్న అసాధారణమైన ఈ ప్రాముఖ్యం, ప్రత్యేకతల వల్లనే షరీఅత్ పరమైన కారణమేదీ లేకుండా రమజాన్ ఉపవాసం ఒక్కటైనా సరే వదలెయ్యడం ఘోరమైన పాపం అని ఇస్లాం పేర్కొన్నది. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"ఒకరోజు నేను నిద్ర పోతుంటే ఇద్దరు మనుషులు వచ్చి నన్ను లేపి ఓ కొండ పైకి తీసికెళ్ళారు. అక్కడ నాకు భీకరమైన కొన్ని అరుపులు, పెడబొబ్బలు విన్పించాయి నేను 'ఏమిటీ ఈ ధ్వనులు?' అని ప్రశ్నించాను. దానికి వారు 'ఇవి నరకవాసుల అరుపులు' అని సమాధానమిచ్చారు. ఆ తరువాత వారు నన్ను మరికాస్త ముందుకు తీసికెళ్ళారు. అక్కడ నాకు, తలక్రిందుల వ్రేలాడదీయబడిన కొందరు వ్యక్తులు కన్పించారు. వారి దవడలు పగిలి రక్తం కారుతోంది. నేను, ఎవరీ వ్యక్తులు అని అడిగాను. 'వీరు ఉపవాసం వదిలేసినవారు. రమజాన్ నెలలో (ఉపవాసాలు పాటించకుండా) తింటూ, తాగుతూ ఉండేవారు' అని వారు నాకు తెలియజేశారు."

"స్వర్గ ద్వారాలలో 'బాబుర్రయ్యాన్' (సంతుష్టపరిచే ద్వారం) అనే ఒక ద్వారం ఉంది. ప్రళయదినాన ఆ ద్వారం గుండా ఉపవాసవ్రతకులు మాత్రమే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారు తప్ప మరెవరూ ఆ ద్వారం గుండా స్వర్గంలో ప్రవేశించలేరు. ఆ రోజు దేవుని ప్రసన్నత కోసం ఆకలిదప్పులు సహిస్తూ ఉపవాసాలు పాటించినవారు

ఎక్కడున్నారు?' అని పిలవడం జరుగుతుంది. అప్పుడు ఉపవాసకులు ఈ పిలుపు విని వెళ్తారు. ఆ ద్వారం గుండా ప్రవేశించడానికి వారికి తప్ప మరెవరికీ అనుమతి ఉండదు. ఉపవాసకులంతా స్వర్గంలో ప్రవేశించిన తరువాత ఆ ద్వారం మూసివేయ బడుతుంది. ఇక ఎవరూ దాని గుండా స్వర్గంలో ప్రవేశించలేరు."

కాబట్టి ముస్లింలంతా ఈ శుభమాసంలో ఉపవాసాలు పాటించి, తరావీ నమజులు చేసి, వాటితోపాటు జీవిత సకల రంగాల్లో, సమస్త వ్యవహారాల్లో ఇస్లాం వారిపై మోపిన విధులను, బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తిస్తూ ఉండాలి. మరోవైపు అన్ని విధాల చెడులకు, పాపాలకు దూరంగా మసలుకుంటూ దైవాన్ని క్షమాపణ వేడుకుంటూ ఉండాలి. అప్పుడే వారు స్వర్గాన్ని ఆశించ గలుగుతారు.

స్వర్గసీమ మానవుని ఆలోచనలకు సైతం అంతుచిక్కని అద్భుత ప్రపంచం. ఇంతవరకు ఎవరి కళ్ళూ చూడని, ఎవరి చెవులూ వినని, ఎవరి మనస్సుకూ తోచని అపరూప లోకం. అది భూమ్యాకాశాలంత విశాలంగా, సకలవిధాల భోగభాగ్యాలతో, వివిధరకాల విలాసాలతో, మనోహరమైన వస్తువులతో నిత్యం కనువిందు చేస్తూ ఉంటుంది. దైవభీతి పరాయణులకు మాత్రమే ఈ మహాభాగ్యం లభిస్తుంది.

అదేవిధంగా దైవభీతి పరాయణులు నరక శిక్ష నుండి కూడా రక్షించమని దేవుడ్ని వేడుకుంటారు. నరకం అంటే ఆషామాషీ విషయం కాదు. భగభగమండే దాని అగ్నిజ్వాలలు నరకవాసుల చర్మాలను నిలువునా వలిచేస్తాయి. వారక్కడ దప్పిక గొన్నప్పుడల్లా వారికి సలసల మరిగే నీళ్ళు, దుర్భరమైన కంపుగొట్టే గాయాల కడుగు మాత్రమే ఇవ్వబడతాయి. తినడానికి అత్యంత చేదు, పరమ వగరు అయిన ముండ్ల చెట్లు మాత్రమే వారికి లభిస్తాయి. ధరించడానికి అగ్ని వస్త్రాలు ఇవ్వబడతాయి. వారి కాళ్ళు చేతులు ఇనుప సంకెళ్ళతో బిగించబడి ఉంటాయి. అలాంటి భయంకరమైన నరకంలో పడినవాడి కంటే మించిన దౌర్భాగ్యుడు మరెవరూ ఉండరు.

(కువైట్ రేడియో నుంచి 10-7-1981న మౌలానా గులాం ముహమ్మద్ మన్సూరీ గారు చేసిన ఉర్దూ ప్రసంగం ఆధారంగా)

# 46. ప్రదర్శనాబుద్ధి, ప్రపంచవ్యామోహం

ప్రపంచవ్యామోహం, ప్రదర్శనాబుద్ధి నరనరాల్లో జీర్ణించుకుపోయిన మనిషి బాహ్యపరమైన వేషధారణతో పాటు ఎన్ని నమాజులు చేసినా, మరెన్ని ఉపవాసాలు పాటించినా అతని పరలోక పర్యవసానం మాత్రం చాలా భయంకరంగా ఉంటుంది. అతను ప్రపంచ వ్యవహారాలను ధర్మపరిధి నుండి తీసి వాటిని తన స్వప్రయోజనాల కోసం వాడుకుంటాడు. అతను చేసే ప్రతి పనిలోనూ స్వార్థమే తొంగి చూస్తుంది. చివరికి అతను హద్దుమీరిన ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయి పరలోక పరిణామా లను మరచిపోతాడు. అదే స్థితిలో తనువు చాలిస్తాడు. ఈమాటే ఖుర్ఆన్ అంటోంది:



"ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించా లన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక సంపదే ప్రగతికి చిహ్నమని అను కుంటున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది." (102:1-4)

"ఎంతమాత్రం కాదు. విశ్వసనీయ జ్ఞానంతో మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీకళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (102:5-8)

ప్రపంచవ్యామోహం కంటే కూడా ప్రమాదకారి అయిన మరొక విషయం ఉంది. అదే ప్రదర్శనాబుద్ధి. "ప్రజలు తనను మెచ్చుకోవాలి, తన ప్రతిష్ఠ ఇనుమడించాలి, తన పేరు మార్మోగాలి, సమాజంలో తన స్టేటస్ పెరిగిపోవాలి, తన కీర్తికండూతి సర్వత్రా వ్యాపించాలి." ఏ పని చేసినా, చివరికి ఎలాంటి దైవకార్యం చేసినా ఇలాంటి భావోద్రేకాలే అతని మనస్సులో అనుక్షణం మెదులుతుంటాయి. పరలోకంలో ఇలాంటి ప్రదర్శనాకారులకు ఎదురయ్యే పరిణామాలను గురించి కాస్త ఊహించండి....

ఆయన రాజు, రాజులకు రారాజు, రారాజులకే మహారాజు. ఆయన రాజ్యానికి ఎల్లలు లేవు. ఆయన అధికారానికి అవధులు లేవు. ఆయన తన రాజ్యంలో ప్రజలం దరూ ఎలాంటి అన్యాయాలకు, అక్రమాలకు గురికాకుండా సదా సుఖసంతోషాలతో జీవించేందుకు ఎందరో వైస్రాయ్‌ల (రాజ ప్రతినిధుల)ను నియమించాడు. న్యాయ వంతమైన పరిపాలన సాగించడానికి కావలసిన సమగ్ర రాజ్యాంగాన్ని వారికి అంద జేశాడు. రాజ్యాంగంలోని నియమ నిబంధనలు ప్రజలు తెలుసుకోవడానికి ఆయన ప్రత్యేకంగా రాజ్యాంగ నిపుణుల్ని కూడా ఏర్పాటు చేశాడు. అంతేకాదు, సామ్రాజ్య సరిహద్దులను అనుక్షణం కాపాడేందుకు వీర జవానుల్ని, దేశ సిరిసంపదలు న్యాయ వంతంగా పంపిణీ అయ్యేందుకు కొందర్ని ధనికులుగా, భూస్వాములుగా చేసి వారిని ట్రస్టీలుగా కూడా నియమించాడు.

ఆ రాజు ఆజ్ఞలకు తిరుగులేదు. ఆయన నియంతే అయినా జనశ్రేయోభిలాషి. దుష్టులకు, దుర్మార్గులకు చండశాసనుడే అయినా సజ్జనులకు, సదాచారులకు అపార కృపాశీలుడు. ఆయన తన వైశ్రాయ్‌లకు కొంత స్వతంత్ర ప్రతిపత్తి ఇచ్చి, వారు తమకివ్వబడిన అధికారాలను ఎంతవరకు సద్వినియోగం చేస్తున్నారో పరీక్షించడానికి దేశవ్యాప్తంగా లక్షలాది గూఢచారులను కూడా నియమించాడు.

అయితే ఆయన వైశ్రాయ్‌లలో అనేక మంది ఈ వాస్తవాన్ని విస్మరించి తామే అసలు ఏలికలయినట్లు ఇష్టారాజ్యం చేస్తూ ఆయన రాజ్యవ్యవస్థను అస్తవ్యస్తం

చేస్తున్నారు. ఆయన రాజ్యాంగాన్ని త్రోసిపుచ్చి సొంత రాజ్యాంగాలను నిర్మించుకొని విశృంఖలంగా ప్రవర్తిస్తున్నారు. ఆయన రాజ్యాంగ నిపుణుల్లోనూ కొందరు చిత్తశుద్ధిని వదిలేసి ప్రజల్లో తమ పేరు పలుకుబడులు పెంచుకోవడంలో నిమగ్నులైపోయారు. ఆయన నియమించిన కొందరు సైనికులు, ట్రస్టీల పరిస్థితి కూడా ఇలాగే మారింది. ఇదంతా ఆయన గూఢచారులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తూనే ఉన్నారు.

గూఢచారులు ఇలా నమోదు చేసిన రికార్డులను రాజు సమక్షంలో సమర్పించే దినం ముందే నిర్ణయమైపోయింది. ఆరోజు ఆయన తన వైస్రాయ్‌లకు, సైనికులకు, ట్రస్టీలకు వారికి ప్రసాదించబడిన అధికారాల వినియోగాన్ని బట్టి శిక్ష లేదా బహుమానం ఇవ్వడానికి కూడా నిర్ణయించబడింది.

ఆయన రాజ్యాంగాన్ని ప్రజలు క్రమంగా విస్మరించారు. హింసాదౌర్జన్యాలు, అన్యాయం, అక్రమాలు పెచ్చరిల్లిపోయాయి. మోసం, లంచం, మద్యం, జూదం, అశ్లీలం, వ్యభిచారాలు సర్వసామాన్యమైపోయాయి. మొత్తం రాజ్యమే తీవ్రమైన సంక్షోభానికి లోనయింది. ఆయన రౌద్రమూర్తి అయి తన సింహాసనం నుండి లేచాడు. వైస్రాయ్‌లను, వీరజవానులను, ట్రస్టీలను, రాజ్యాంగ నిపుణులను, ఇతర అధికారులను- అందర్నీ సమావేశపరిచాడు. న్యాయవాదులు, సాక్షులు, గూఢచారులు కూడా న్యాయస్థానానికి హాజరయ్యారు.

అదొక భయానక సన్నివేశం. కనీ వినీ ఎరగని అసాధారణ సమావేశం. జనం గుండెలు దడదడలాడుతున్నాయి. అందరూ ఊపిరి బిగబట్టి రారాజు తీర్పు కోసం ఎదురుచూడసాగారు. రాజు పట్ల అమితమైన భయభక్తులు, వినయవిధేయతలు కలిగి ఆయన ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా ఆచరణలో పెట్టినవాళ్ళను తీర్పు జరపకుండానే అత్యున్నత బహుమానాలతో సత్కరించడం జరిగింది. పోతే రాజద్రోహులకు, రాజ్యాంగ ధిక్కారులకు భయంకర శిక్షలు విన్పించడం జరిగింది. వాళ్ళను రాజభటులు కొడుతూ, తన్నుతూ, జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్తున్నారు. మిగిలినవారి విషయంలో తీర్పు ప్రారంభమయింది. నేరస్థులు లోలోన వణికిపోతూ తీర్పు కోసం నిరీక్షిస్తున్నారు.

“నిందితుడా! నేను నీకు నా రాజ్యాంగజ్ఞానాన్ని ప్రసాదించానా లేదా?” నిలదీశాడు రారాజు దిక్కులు పిక్కుటిల్లేలా ప్రశ్నిస్తూ.

“ప్రసాదించావు ప్రభూ! నీవు నీ రాజ్యాంగ జ్ఞానాన్ని నిస్సందేహంగా ప్రసాదించావు” అంటూ రాజ్యాంగ నిపుణుడు ఒప్పుకున్నాడు.

“అయితే అందులోని నా ఆదేశాలు, అధికరణలను నీవు ఏమేరకు పాటించావు?”

“ప్రభూ! నేను రేయింబవళ్ళూ దాన్ని చదువుతూ, ఇతరులకు బోధిస్తూ పరిరక్షించడంలో నిమగ్నుడయ్యేవాడ్ని.”



“లేదు. నీవు అబద్ధాలరాయుడవు. నీవు అబద్ధాలరాయుడవని సాక్ష్యం ఇవ్వడానికి నా గూఢచారులు కూడా సిద్ధంగా ఉన్నారు. నీ ప్రయత్నాలన్నీ ప్రజల్లో నీవు గొప్ప రాజ్యాంగ నిపుణ్ణని అన్పించుకోవడానికే ఉద్దేశించబడ్డాయి. అలా నీవు అన్పించుకున్నావు. ఈవిధంగా అక్కడ నీ ఉద్దేశ్యం నెరవేరింది. ఇక ఇక్కడ నీకు మిగిలేది శిక్ష మాత్రమే. తీసికెళ్ళండి వీడ్ని, ఎత్తి అగ్నిగుండంలో పడేయండి” అంటూ తీర్పిచ్చాడు రారాజు. తక్షణమే శిక్ష అమలుపరచడానికి అటు భటుల్ని కూడా ఆజ్ఞాపించాడు.

వెంటనే రాజభటులు అతడ్ని లాక్కెళ్ళి ఓ పెద్ద అగ్నిగుండంలో పడేశారు. తర్వాత రెండవ కోవకు చెందిన ముద్దాయి అయిన సరిహద్దు భద్రతా సైనికుడ్ని ప్రవేశపెట్టారు.

“నిందితుడా! నీవు యుద్ధం ఎందుకు చేశావు? ఏ ఉద్దేశ్యంతో చేశావు?” అడిగాడు రారాజు ఆ సమరయోధుడ్ని.

“ప్రభూ! నీ రాజ్య సరిహద్దుల్ని కాపాడేందుకు నీ మార్గంలో పోరడమని నీవు ఆదేశించావు కదా, నీ ఆదేశాన్ని శిరసావహించడానికి నేను నీ మార్గంలో పోరాడాను. చివరికి నా ప్రియమైన ప్రాణాన్ని సైతం ధారపోయడానికి సిద్ధమయ్యాను.” అన్నాడు ముజాహిద్.

“అబద్ధం. నీవు అబద్ధాలరాయుడవని నా గూఢచారులు కూడా సాక్ష్యమిస్తారు. నువ్వసలు ప్రజల్లో గొప్ప వీరుడని అన్పించుకోవడానికే ఇదంతా చేశావు. అది నీకక్కడ లభించింది. ఇప్పుడిక్కడ నీకు దొరికేది భయంకరమైన శిక్షే. తీసికెళ్ళండి వీడ్ని కూడా, నరకాగ్నిలో విసిరేయండి” అన్నాడు రారాజు.

“రాజభటులు తక్షణమే సమరయోధుడ్ని కూడా ఈడ్చుకెళ్ళి అగ్నిజ్వాలల్లో పడవేశారు. ఆతర్వాత వారు ధనరాసులు ప్రసాదించబడిన ట్రస్టీని బోనులో ఎక్కించారు.

“నిందితుడా! నేను నీకు అపార సిరిసంపదలు ప్రసాదించి అన్ని విధాలా సుఖశాంతులు కలిగించలేదా? నిన్ను మేము ఏ ఒక్కరిపై ఆధారపడకుండా చేయలేదా?” అడిగాడు రారాజు.

“మహప్రభో! నీవు నాకు అన్నీ ప్రసాదించావు. అమితంగా ప్రసాదించావు. అందులో సందేహం లేదు” ఒప్పుకున్నాడు ముద్దాయి.

“అయితే ఆ ధనాన్ని నీవు ఏవిధంగా వినియోగించావు?”

“ప్రభూ! ఆ ధనంతో నేను బంధువుల హక్కులు నెరవేర్చాను. విశాల హృదయంతో బీదసాదలకు దానధర్మాలు కూడా చేశాను.” సమాధానమిచ్చాడు ట్రస్టీ.

“అబద్ధం. నీవు పచ్చి అబద్ధాలరాయుడవు. నా గూఢచారులు కూడా నీవు అబద్ధాలరాయుడవని సాక్ష్యమివ్వడానికి సిద్ధంగా ఉన్నారు. నువ్వసలు ప్రజల్లో గొప్ప దాత, దానశీలుడవని అన్పించుకోవడానికే దానధర్మాలు చేశావు. ఆ పేరు నీకక్కడ లభించింది. వీడ్ని కూడా ఈడ్చుకెళ్ళి అగ్నిగుండంలో పడేయండి” అన్నాడు రారాజు.

రాజభటులు అతడ్ని కూడా ఈడ్చుకెళ్ళి అగ్నిగుండంలోకి ఎత్తి పడేశారు. ఇలా ఆ మూడు విధాల నేరస్థులు భయంకరమైన నరకాగ్నికి సమిధలైపోతారు.

ఇదీ ఆ రాజు కథ. ఆ రాజే విశ్వప్రభువు. ఆ రారాజే సర్వలోక సృష్టికర్త. ఆ మహా రాజే ప్రళయదినాన తిరుగులేని తీర్పులిచ్చే "మాలికి యౌమిద్దీన్" (తీర్పు దినాధిపతి). ఆయన రాజ్యమే విశ్వవ్యవస్థ. దాని సక్రమ నిర్వహణ కోసం నియమించబడిన ఇస్లాం జీవన వ్యవస్థే ఆయన రాజ్యాంగం. అదే దివ్యఖుర్ఆన్. ఆయన వైస్రాయ్ (ఖలీఫా)లే మానవులు. దివ్యఖుర్ఆన్ జ్ఞానం ఆర్జించిన పండితులు, ధర్మవేత్తలే ఆయన రాజ్యాంగ నిపుణులు. ఇస్లామీయ వ్యవస్థ పరిరక్షణకై ఆయన మార్గంలో పోరాడే ముజాహిద్‌లే సరిహద్దు భద్రతా సైనికులు. ఆయనచే సిరిసంపదలు ప్రసాదించబడిన ధనికులే ఆయన రాజ్యంలోని ట్రస్టీలు.

సహీబుఖారీ గ్రంథంలోని ఒక హదీసు ఆధారంగా వివరించబడిన ఈ తీర్పు సంఘటన ఇప్పుడు జరగకపోయినా త్వరలోనే తప్పనిసరిగా జరిగితీరుతుంది. ఆ దినం మెరుపు వేగంతో పరుగులు పెడుతూ వస్తోంది. అది సజ్జనులకు శుభదినం. దుర్జనుల పాలిట మహా దుర్దినం. అప్పుడు మన పరిస్థితి ఏమిటీ? మానవుల అసలు లక్ష్యమైన దైవప్రసన్నతను వదిలేసి లోకుల మెప్పు కోసం, పెద్దలనబడేవారి ప్రాపకం కోసం పని చేసే ధనికులు, ధర్మవేత్తలు, ధర్మప్రచారకుల గతి ఏమవుతుంది?? చిత్తశుద్ధి లోపించిన పుణ్యకార్యాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే నని తెలిసి కూడా ఆ బూడిదలోనే తమ పన్నీటిని ఒలికించేవారి కంటే గొప్ప ఆత్మవంచకులు మరెవరుంటారు???

## 47. ఉపవాసాల ప్రాముఖ్యం

అదిగో వరాల వసంతం! ఉరుకులు పరుగులతో వస్తోంది!! శుభాల సిరులు తెస్తోంది!!

అదిగో రమజాన్ మాసం! 'రోజా' మూటలతో ఊరిస్తోంది!! అపార సౌభాగ్యాల వైపుకు ఆహ్వానిస్తోంది!!!

ఇక తలబిరుసు జిన్నులకు సంకెళ్ళు పడబోతున్నాయి. నరక ద్వారాలన్నీ మూయ బడబోతున్నాయి. స్వర్గ ద్వారాలన్నీ తెరవబడబోతున్నాయి.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) రమజాన్ నెల సమీపించినప్పుడు జరిగే విశేషాలను గురించి ఇలా ప్రవచించారు:

"రమజాన్ నెల రాగానే స్వర్గద్వారాలన్నీ తెరవబడతాయి; నరకద్వారాలన్నీ మూసి వేయబడతాయి; దుష్టశక్తుల్ని కట్టివేయడం జరుగుతుంది." (బుఖారి, ముస్లిం)

"రమజాన్ నెల మొదటి రాత్రి రాగానే (సమాజంలో) చెడ్డపనులు వ్యాపింపజేయ డానికి అనుక్షణం కాచుకొని ఉండే షైతానులను, జిన్నులను కట్టి పడేయడం జరుగు



తుంది. నరకద్వారాలన్నీ మూసివేయబడతాయి. వాటిలో ఒక్క ద్వారం కూడా తెరవడం జరగదు. అలాగే స్వర్గద్వారాలన్నీ తెరవబడతాయి. వాటిలో ఒక్క ద్వారం కూడా మూసి వేయడం జరగదు. పిలిచేవాడొకడు ఇలా పిలుస్తాడు- 'మేలు, శ్రేయాలను కోరుకునే వాడా, ముందుకు రా! చెడు, దురాచారాల వెంట పడేవాడా, ఆగిపో.' దేవుని తరఫున అనేక మందికి నరకాగ్ని నుండి విముక్తి కలుగుతుంది- ఈవిధంగా ప్రతిరాత్రీ జరుగుతుంది." (తిర్మిజి, ఇబ్నెమాజ)

అదిగో అటు చూడండి, దేవుని ప్రత్యేక దూత ఎలా చాటింపు వేస్తున్నాడో!

"మేలు, శ్రేయాలను కోరుకునేవాడా, ముందుకు రా! చెడు, దురాచారాల వెంటపడేవాడా, ఆగిపో."

ఆ మేలు శ్రేయాలు ఎలా ప్రాప్తమవుతాయి? చెడు దురాచరణలను మానుకొని రమజాన్ నెలలో రోజాలను పాటించడం ద్వారా మాత్రమే సాధ్యం.

మానవుని పుట్టుక లక్ష్యం కేవలం దైవాన్ని ఆరాధించడమేనని ఖుర్ఆన్ పేర్కొంటున్నది. మనిషి తన దైనందిన జీవితంలో పూర్తిగా దైవాజ్ఞలను పాటించడం ద్వారా అతని జీవితమంతా దైవారాధనే అవుతుంది. అసలయిన ఈ దైవారాధన కోసం నమాజ్, రోజా, జకాత్, హజ్, ఆరాధనలు మనిషిని సుశిక్షితుడ్ని చేస్తాయి. ఏ విధంగా నమాజ్ అందులో పఠించే ఖుర్ఆన్ ద్వారా మనిషికి దైవాదేశాలకు అనుగుణంగా జీవితం గడపటానికి నిరంతరం శిక్షణనిస్తుందో, అదేవిధంగా ఉపవాసం కూడా మనిషిలో మనోనిగ్రహం, సహనం, స్థయిర్యం, దైవభీతి పెంపొందే శిక్షణనిస్తుంది.

విశ్వాసుల కొరకు శుభాల సీజన్ మళ్ళీ వచ్చేసింది. దైవభీతి, ధార్మిక స్పృహ ఉన్న ప్రతి ముస్లిం రమజాన్ నెలవంక చూడగానే ఉపవాసాలు పాటించడానికి సిద్ధమవుతాడు. అది విశ్వప్రభువు నుండి అతనిపై మోపబడిన విధి (ఫర్జ్). ఉపవాస వ్రతం ప్రతియుగంలోనూ దైవప్రవక్తల ద్వారా విశ్వాసులకు విధిగా నిర్ణయించబడుతూ వచ్చింది. ఖుర్ఆన్ ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇలా వివరించింది:

"విశ్వాసులారా! గతప్రవక్తల అనుయాయులకు ఏవిధంగా ఉపవాసాలు విధించ బడ్డాయో అదేవిధంగా (ఇప్పుడు) మీరు కూడా ఉపవాసాలు పాటించాలని నిర్ణ యించాము. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశముంది." (2:183)

దైవంపట్ల భయభక్తులు ఉన్నప్పుడే మనిషి చెడును వదలి మంచిని స్వీకరిస్తాడు. రమజాన్‌లో ప్రత్యేక దైవభీతి కలగడానికి కారణమయ్యే ఉపవాసవ్రతాన్ని అరబీలో 'సౌమ్' అంటారు. సౌమ్ అంటే చేస్తున్న పని నుండి ఆగిపోవడం. దాన్ని విడనాడటం అని అర్థం. షరీఅత్ పరిభాషలో వేకువ జాము నుండి సూర్యాస్తమయం వరకు తినడం, త్రాగడం, సంభోగించడం వంటి అవసరాలను మానుకోవడాన్నే 'సౌమ్' అంటారు.

కేవలం పైమూడు అవసరాలు విడనాడినంత మాత్రాన ఉపవాస లక్ష్యం నెరవేరదు. చెడు పనులను, చెడు ఆలోచనలను కూడా మానుకోవాలి. నిజానికి చెడు పనులకు, చెడు ఆలోచనలకు మనిషి ఎల్లప్పుడూ దూరంగానే ఉండాలి. ప్రత్యేకంగా రమజాన్ మాసంలోనైతే మరీ నిష్ఠగా ఉండాలి. అప్పుడే ఉపవాస వ్రతాలు మనకు శుభాలు, సౌభాగ్యాలు చేకూర్చగలవని ఆశించగలం. షరీఅత్ పరమైన కారణం ఏదీ లేకుండా రమజాన్ ఉపవాసాలు పాటించని వ్యక్తి ఘోర పాపం వడిగట్టిన వాడవుతాడు. ఘోరపాపం పర్యవసానం తెలిసిందే.

ప్రతి మనిషీ మరణానంతరం ప్రపంచంలో తాను చేసుకున్న కర్మలకు పరలోకంలో విశ్వపాలకుని ముందు సమాధానం ఇచ్చుకోవలసి ఉంది. వాటి ప్రకారం ప్రతిఫలం అనుభవించవలసి వస్తుంది. విశ్వాసి మదిలో నిరంతరం మెదిలే ఈ భావనే దైవభీతి. సరైన దైవభీతి కలిగిన మనిషి చెడులకు, పాపాలకు, దూరంగా ఉంటూ సదాచార సంపన్నుడయి సదా పవిత్ర జీవితం గడుపుతాడు. రమజాన్ నెల ప్రారంభంకాగానే దైవాజ్ఞ, ప్రవక్త హితవుల ప్రకారం అతను ఉపవాసవ్రతాలు కూడా పాటిస్తాడు.

పై సూక్తిలో రమజాన్ ఉపవాసాల లక్ష్యం 'దైవభీతి' అని తెలియజేయబడింది. అంటే రమజాన్ నెలంతా పాటించే ఉపవాసాలు మనిషిలో దైవభీతిని జనింపజేసే, దాన్ని పటిష్ఠవంతం చేసే శిక్షణ ఇస్తాయన్న మాట. దేవుడు ముస్లింలకు రమజాన్ ఉపవాసాలు పాటించాలని ఇచ్చిన ఆదేశంలోని ఉద్దేశం దైవభీతి మాత్రమే కాదు, దైవకృతజ్ఞత కూడా ఉంది. అంటే దేవుడు రమజాన్ నెలలో మానవుల జీవితాన్ని సమూలంగా సంస్కరించి, వారికి ఇహపర సౌభాగ్యాలు ప్రసాదించే దివ్యఖుర్ఆన్‌ని అవతరింపజేసినందుకు వారాయనకు కృతజ్ఞతలు కూడా చెల్లించుకోవాలి.

"దేవుడు మీకు సన్మార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు కృతజ్ఞులై ఉండటానికిగాను ఈ సౌలభ్యం ప్రసాదించాడు." (ఖుర్ఆన్-2:185)

రమజాన్ ఉపవాసాలు పాటించడం ద్వారానే మనం దేవునికి కృతజ్ఞతలు సమర్పించుకోగలుగుతాం. రమజాన్‌లో ఒక ముస్లిం శక్తి ఉండి కూడా ఉపవాసాలు పాటించడం లేదంటే అతను దేవుడు చేసిన మేలు మరచిపోయి ఆయనకు కృతఘ్నుడై పోయాడన్న మాట. ఈ కృతఘ్నతా పర్యవసానం అతను పరలోకంలో అనుభవించవలసి వస్తుంది.

"దేవుడు మీకోసం భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువుల్ని అదుపులో ఉంచిన సంగతి మీరు గమనించలేదా? అదీగాక ఆయన తన గోచర, అగోచర మహాభాగ్యాలు (ఎన్నో) మీ కోసం సమకూర్చాడు." (ఖుర్ఆన్-31:20)

"మీరు భూమి ఉపరితలంపై (నిశ్చింతగా) తిరిగేందుకు ఆయనే దాన్ని అదుపులో ఉంచాడు. దేవుడు ప్రసాదించిన ఉపాధి (ఒనరులు) అనుభవించండి. చివరికి మీరు (మరణానంతరం) ఆయన సన్నిధికే పునర్జీవులై పోవలసిఉంది." (ఖుర్ఆన్-67:15)



"మానవులపట్ల నీ ప్రభువు అమిత దయాళువు. కాని చాలామంది (ఆయనకు) కృతజ్ఞత చూపరు." (ఖుర్ఆన్-27:73)

"మీరు దేవుని అనుగ్రహాలు లెక్కించ దలచుకుంటే వాటిని ఎన్నటికీ లెక్కించలేరు. నిస్సందేహంగా ఆయన గొప్ప క్షమాశీలి, పరమ దయామయుడు." (ఖుర్ఆన్-16:18)

"దేవుడే భూమ్యాకాశాలను సృష్టించాడు. ఆయనే ఆకాశం నుండి వర్షం కురిపించి తద్వారా మీ ఉపాధి కోసం వివిధ రకాల పండ్లు పండిస్తున్నాడు. ఆయనే సముద్ర యానం కోసం మీకు ఓడలు అధీనం చేసినవాడు. ఆయన ఆజ్ఞతోనే అవి సముద్రంలో సవ్యంగా సాగిపోతున్నాయి. నదుల్ని కూడా ఆయనే మీకోసం అదుపులో ఉంచాడు. ఆయనే సూర్య చంద్రుల్ని మీకోసం ఒక నియమావళికి కట్టుబడి నిరంతరాయంగా సాగిపోయేలా చేశాడు. మీకోసం రాత్రిని, పగటిని సృష్టించినవాడు కూడా ఆయనే. ఇలా మీరు కోరిన దంతా ఆయన మీకు ప్రసాదించాడు. అనంతమైన దైవానుగ్రహాలను మీరు లెక్కించాలనుకున్నా లెక్కించలేరు. అయితే (ఇన్ని అనుగ్రహాలు పొందినప్పటికీ) మానవుడు చాలా కృతఘ్నుడుగా, అన్యాయపరుడుగా తయారయ్యాడు." (ఖుర్ఆన్-14:32-34)

దేవుడు చేసిన మేలుకు ఆయన పట్ల కృతజ్ఞత చూపడానికి సరైన మార్గం ఒక్కటే. దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించి వారు నిర్దేశించిన విధుల్ని నిర్వహిస్తూ ఉండాలి. ఆ విధులలో రమజాన్ ఉపవాసాలు, తరావీ నమాజులు కూడా ఉన్నాయి.

"ఈ ఉపవాసాలు కొన్నాళ్ళపాటు మాత్రమే. ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తుడయితే లేదా ప్రయాణావస్థలో ఉంటే అలాంటి వ్యక్తి తప్పిపోయిన ఆ ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (నెల ఉపవాసాలు) పూర్తిచేయాలి. ఉపవాసం పాటించే శక్తి ఉండి కూడా దానిని పాటించనివారు మాత్రం పాపపరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఒక ఉపవాస దినానికి పరిహారంగా ఒక నిరుపేదకు భోజనం పెట్టాలి. (ఈ విషయంలో) ఎవరైనా తమంతట తాము సంతోషంగా మరింత పుణ్యం చేయదలచుకుంటే అది వారికే మేలు చేకూర్చుతుంది. ఏమైనప్పటికీ) మీరు విషయం గ్రహించగలిగితే ఉపవాసం పాటించడమే మీకు మంచిది." (ఖుర్ఆన్-2:184)

ఇది ఉపవాస విషయంలో అవతరించిన మొదటి ఆజ్ఞ. ఇందులో శక్తి ఉండి కూడా ఉపవాసం పాటించని వ్యక్తి నిరుపేదలకు అన్నదానం చేస్తే సరిపోతుందని చెప్పబడింది. అయితే ఆ తరువాత సూక్తిలో రమజాన్ ఉపవాసాలు శక్తి కలిగినవారు విధిగా పాటించాలని ఆజ్ఞయింది.

"రమజాన్ ఖుర్ఆన్ అవతరించిన నెల. ఈగ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి, కనుక ఇకనుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి." (ఖుర్ఆన్-2:185)

ఇస్లాం సౌధానికుండే అయిదు మూలస్తంభాలలో రమజాన్ ఉపవాస వ్రతాలు ఒకటి. కనుక ఈ ఉపవాసాలను విస్మరించడమంటే మొత్తం ఇస్లాంనే విస్మరించినట్లు అవుతుంది. ఉపవాస వ్రతాలు పాటిస్తున్నప్పుడు వాటి బాహ్య నియమాలతో పాటు, అంతర్ నియమాలను కూడా తప్పకుండా పాటించాలి. ఉదాహరణకు అబద్ధమాడటం, చాడీలు చెప్పడం, దూషించడం, పరోక్షంగా నిందించడం, దురుసుగా మాట్లాడటం, అశ్లీలపు మాటలు పలకడం, జగడానికి దిగడం మొదలైన చేష్టలకు పాల్పడకూడదు. ఇది ఇతర సమయాల్లో కూడా పాపకార్యాలే. అయితే ప్రత్యేకించి రమజాన్ నెలలో వీటికి మరీ దూరంగా ఉండాలి.

షైతాన్ ప్రయోగించే ఖడ్గం నుండి కాపాడుకోవడానికి ఉపవాసం మనిషికి డాలు వంటిది. ఆ డాలును ఎలా ఉపయోగించుకోవాలో దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

"రోజా (ఉపవాసం) డాలు వంటిది. మీలో ఎవరైనా ఉపవాసం పాటిస్తే అతను ఆ ఉపవాసం నోటితో అశ్లీలమైన పలుకులు పలకరాదు. అల్లరి పనులు చేయరాదు. ఇతరులెవరైనా తనను దూషించినా, తనతో జగడానికి దిగినా, తాను ఉపవాసం ఉన్నానని అతను గుర్తుంచుకోవాలి." (మిష్కాత్)

మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "....ఉపవాసం పాటించే మనిషి నోటి కంపు దేవునికి కస్తూరీ సువాసన కన్నా ఎంతో ప్రియమైనది. ఉపవాసం (మనిషి ఆత్మరక్షణకు) డాలు వంటిది. కనుక ఉపవాసం పాటించే వ్యక్తి నోటిదురుసు-దుర్భాషలకు దిగడం గాని, కలహాలు-కల్లోలాలకు పాల్పడటంగాని చేయకూడదు. ఉపవాసం పాటించే వ్యక్తిని ఎవరైనా దూషిస్తే లేదా జగడానికి దిగితే అతను (ప్రతిచర్యకు పూనుకోకుండా) తాను ఉపవాసం పాటిస్తున్నానని అతనితో అనాలి." (బుఖారి, ముస్లిం-పాక్షికం)

దుష్కార్యాలను ప్రేరేపించే విషయాలు ఏవైనా ఎదురయినప్పుడు వెంటనే మనం ఉపవాసం పాటిస్తున్నామని గుర్తు చేసుకొని, సహనంతో వ్యవహరిస్తూ ఆ చెడుల నుండి తప్పించుకోవాలని ఈ హదీసు తెలియజేస్తున్నది. చెడుల నుండి తప్పించుకోకపోతే మన ఉపవాసాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.

"ఒకవేళ షైతాన్ నుండి నీకేదయినా దుష్టప్రేరణ కలిగినట్లు అన్పిస్తే (వెంటనే) నీవు దేవుని శరణు వేడుకో." (ఖుర్ఆన్–41:36)

షైతాన్ ఎల్లప్పుడూ ఏదో వంకతో మానవుణ్ణి రెచ్చగొట్టి, కోపం తెప్పించి అతని చేత ధర్మవ్యతిరేక కార్యాలు చేయించడానికి ప్రయత్నిస్తాడు. అలాంటి పరిస్థితి ఎదురయితే వెంటనే ఆ దుష్టుడి కీడు నుండి దైవాన్ని శరణుకోరుకోవాలని పై సూక్తిలో హెచ్చరించబడింది.

ఒకసారి దైవప్రవక్త (స) దగ్గర హజ్రత్ అబూబకర్ (రజి) కూర్చొని ఉంటే ఒకతను వచ్చి అబూబకర్ (రజి)ని అనవసరంగా దూషించసాగాడు. హజ్రత్ అబూబకర్ (రజి)



వెంటనే రెచ్చిపోకుండా మౌనం వహించి అతని దూషణలు వినసాగారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని చూసి చిరునవ్వు చిందించసాగారు. కాని తరువాత కాస్సేపటికి అబూబకర్ (రజి) అతని దూషణలు సహించలేక సమాధానంగా ఒక తీవ్రమైన మాట అన్నారు. ఆయన నోట ఆమాట వినగానే దైవప్రవక్త (స) ముఖారవిందం ముడుచుకు పోయింది. ఆయన తక్షణమే లేచి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అబూబకర్ (రజి) కూడా లేచి ఆయన వెనకాలే నడిచారు. దారిలో ఆయన దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "(ఏమిటీ మీ ధోరణి) చాలా విచిత్రంగా ఉందే! ఆ వ్యక్తి నన్ను తిడ్తున్నంత సేపు మీరు మౌనంవహించి చిరునవ్వు నవ్వుతుండేవారు. కాని తర్వాత నేను అతని దూషణకు జవాబివ్వగానే మీకు కోపం వచ్చేసింది" అని అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నువ్వు మౌనంగా ఉన్నంతసేపు ఒక దైవదూత నీ దగ్గర నిలబడి నీ తరపున అతని దూషణలకు జవాబిచ్చాడు. కాని నీవు మాట్లాడటం మొదలెట్టగానే ఆ దూత అదృశ్యమై అతని స్థానంలో షైతాన్ ప్రత్యక్షమయ్యాడు. మరి నేను షైతాన్‌తో కలసి కూర్చోలేనుగా?" అన్నారు. (ముస్నద్ అహ్మద్)

"(ఉపవాసం పాటిస్తున్నప్పటికీ) అసత్యం పలకడాన్ని, అసత్యాన్ని ఆచరించడాన్ని మానివేయని వ్యక్తి ఆకలి దప్పులతో పడుండటం పట్ల దేవునికి ఏ మాత్రం ఆసక్తిలేదు" అన్నారు దైవప్రవక్త (సల్లం) ఒక సందర్భంలో." (బుఖారి)

మరొక సందర్భంలో ఆయన ఇలా ప్రవచించారు. "రోజా పాటించే ఎందరో వ్యక్తులకు తమ రోజావ్రతం ద్వారా ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించదు."

"ఉపవాసం పాటిస్తున్న ఇద్దరు వ్యక్తులు (ఆ రోజు) జుహర్, అస్ర్ నమాజులు చేశారు. వారి నమాజులు ముగిసిన తరువాత దైవప్రక్త (స) వారిని ఉద్దేశించి, "మీరిద్దరు మళ్ళీ ఉజూ చేసి నమాజు చేయండి. మీ ఉపవాసాన్ని కూడా పూర్తి చేసి మరునాడు దాని ఖజా పాటించండి" అన్నారు. వారు "ఎందుకు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) మీరు ఫలానా వ్యక్తిని అతని పరోక్షంలో నిందించారు" అని అన్నారు. (బైహఖి)

ఉపవాస లక్ష్యం మనిషి ఆకలిదప్పులతో ఉండటం కాదు. ఉపవాసం పాటిస్తున్నప్పుడు అతను దేవుని విధేయతా పరిధిలో మరింత స్థిరంగా ఉండి ఆయన నిషేధించిన చెడులన్నిటిని పూర్తిగా మానివేయాలి.

రమజాన్ నెలంతా ఉపవాసాలు పాటించడం వయోజనులైన ప్రతి ముస్లిం స్త్రీ పురుషులకు విధిగా నిర్ణయించబడింది. దీన్ని తిరస్కరించిన వ్యక్తి కాఫిర్ (సత్యతిరస్కారి) అవుతాడు. రమజాన్ ఉపవాసాలను బలమైన కారణం ఏదీ లేకుండా వదిలేసినవాడు ఘోర పాపానికి పాల్పడినవాడవుతాడు.

బాటసారులు (ప్రయాణదూరం కనీసం నలభై ఎనిమిది మైళ్ళు ఉండాలి), వ్యాధిగ్రస్తులు, అతివృద్ధులు, మతిస్థిమితం లేనివారు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు,

అశుద్ధావస్థలో ఉన్న స్త్రీలు ఉపవాసం నుండి మినహాయించబడ్డారు. అయితే బాటసారులు, వ్యాధిగ్రస్తులు, బాలింతలు, అశుద్ధావస్థలో ఉన్న స్త్రీలు తప్పిపోయిన ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి నెల రోజుల వ్రతం పూర్తిచేయాలి.

"రోగగ్రస్తులు, ప్రయాణీకులు (రమజాన్‌లో తప్పిపోయిన) ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (ఆ సంఖ్యను) పూర్తిచేయాలి. దేవుడు మీకు సౌలభ్యం చేకూర్చ దలిచాడుగాని, మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయాలని భావించడంలేదు. మీరు ఉపవాసాల సంఖ్యను పూర్తి చేసుకోవడానికి, దేవుడు మీకు సన్మార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు కృతజ్ఞులై ఉండటానికిగాను ఈ సౌలభ్యం ప్రసాదించాడు." (ఖుర్‌ఆన్-2:185)

రమజాన్ నెలలో ప్రతిరోజూ ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు దాదాపు పధ్నాలుగు గంటలపాటు ఉపవాస వ్రతాన్ని పాటించవలసి ఉంటుంది. అంటే ఈ సమయంలో తినడం, త్రాగడం సంభోగించడం, అశ్లీల చేష్టలకు పాల్పడటం పూర్తిగా మానెయ్యాలి. మనస్సుని అదుపులో ఉంచి ఎంతో నిష్ఠగా ఉండాలి. ఈ విధంగా మొత్తం రమజాన్ మాసం ఉపవాసాలు పాటించాలి.

"రమజాన్ నెలలో షరీఅత్ పరమైన కారణం ఏదీ లేకుండా ఒక్క ఉపవాసం వదిలేసినా ఆ తరువాత ఆ కొరతను తీర్చడానికి జీవితాంతం ఉపవాసాలు పాటించినా అవన్నీ కలసి రమజాన్ నెలలో వదిలేసిన ఆ ఒక్క ఉపవాసం కొరతను తీర్చలేవు" అని దైవప్రవక్త (సఅసం) స్పష్టంగా చెప్పారు. (తిర్మిజీ)

రమజాన్ ప్రాముఖ్యం, ప్రయోజనాలను గురించి దైవప్రవక్త (సల్లం) ఓసారి షాబాన్ నెల చివరి తేదీన ఉపన్యసిస్తూ ఇలా బోధించారు:

"ప్రజలారా! ఒక మహోజ్వలమైన శుభాలమాసం త్వరలో రానున్నది. అందులోని ఒక రాత్రి వేయి నెలల కన్నా ఎంతో శుభప్రదమయినది. దేవుడు ఆ నెలలో ఉపవాసం పాటించడం విధిగా నిర్ణయించాడు. ఆ నెల రాత్రి వేళల్లో 'తరావీహ్' నమాజ్ చేయడం నఫిల్‌గా నియమించాడు. కనుక ఆ నెలలో ఎవరైనా అంతర్ ప్రేరణతో, సంతోషంగా ఒక సత్కార్యం చేస్తే, అది ఇతర మాసాల్లో విధి (ఫర్జ్)ని నిర్వర్తించిన దానికి సమానం. మరెవరైనా ఆ మాసంలో ఫర్జ్ (విధి)నిర్వహిస్తే, అది ఇతర నెలలో డెబ్భై ఫర్జ్‌లను నిర్వర్తించిన దానికి సమానం. ఇది సహనం వహించవలసిన నెల. సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సమాజలోని బీదసాదల పట్ల సానుభూతి చూపవలసిన నెల." (మిష్కాత్)

"ఎవరైతే ధర్మనిష్ఠతో ఆత్మపరిశీలనతో, పరలోక ప్రతిఫలాపేక్షతో రమజాన్ ఉపవాసాలు పాటిస్తాడో అతని గత పాపాలు దేవుడు మన్నిస్తాడని" దైవప్రవక్త (స) మరో సందర్భంలో బోధించారు.



రోజా ఔన్నత్యం గురించి ఆయన వేరొక హదీసులో ఇలా బోధించారు: "ఆదం కుమారుడు చేసే ప్రతి సత్కార్యానికి పుణ్యఫలం పది నుండి ఏడు వందల రెట్ల దాకా పెంచడం జరుగుతుంది. అయితే ఉపవాసం విషయంలో దేవుడు ఇలా తెలియజేశాడు- 'ఉపవాసం వ్యవహారం వేరుగా ఉంది. ఇది ప్రత్యేకంగా నా (ప్రసన్నత) కోసం పాటించబడుతుంది. అందువల్ల నేను స్వయంగా దాని పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాను. మనిషి నా కోసం మాత్రమే తన లైంగిక వాంఛల్ని, తన ఆహార పానీయాల్ని మానుకుంటాడు, ఉపవాసం పాటించే మనిషికి రెండు సంతోషకరమైన విషయాలు ఉన్నాయి. ఒకటి ఉపవాస విరమణ సమయంలో. రెండు, తన ప్రభువును సందర్శించే సమయలో. ఉపవాసం పాటించే మనిషి నోటి కంపు దేవునికి కస్తూరీ సువాసన కన్నా ఎంతో ప్రియమైనది...." (బుఖారి, ముస్లిం-పాక్షికం)

# 48. పరలోకంలో ఉపవాస పుణ్యఫలం

ఏకైక దేవుడ్ని విశ్వసించి ఆయనకు విధేయుడయి పోయిన మనిషినే ఖుర్‌ఆన్ పరిభాషలో ముస్లిం అంటారు. అలాంటి ముస్లిం ఖుర్‌ఆన్ అవతరించిన పవిత్ర రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించకపోతే అతను ఆచరణలో దేవునికి అవిధేయుడయ్యాడన్న మాట. నిజంగా ఇది అతనికెంతో దురదృష్టకరమైన విషయం. అలాంటి ముస్లింలు రమజాన్ శుభాలను పోగొట్టుకోవడమే గాక మరణానంతరం తీవ్రమైన శిక్షకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. మహాప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు:

"(ఓ రోజు) నేను నిద్రపోతుంటే ఇద్దరు వ్యక్తులు నా దగ్గరికి వచ్చారు. వారు నా భుజం పట్టిలేపి నన్నొక కఠిన మార్గం గల పర్వతం దగ్గరికి తీసికెళ్ళారు. దానిపై ఎక్కమని చెప్పారు. నేను ఈ కొండ ఎక్కడం నా శక్తికి మించిన పని' అని అన్నాను. 'పర్వాలేదు ఎక్కండి. మేము మీకు ఊతమిస్తాము' అన్నారు వారు. అప్పుడు నేను కొండపైకి ఎక్కాను. కొండపై సగం దూరం చేరుకొనేటప్పటికీ (ఎక్కడ్నుంచో) అరుపులు, పెడ బొబ్బలు విన్పించాయి. 'ఈ ఏడ్పులు, పెడబొబ్బలు ఏమిటీ?' అని నేను అడిగాను. 'ఇది నరకవాసుల పెడబొబ్బలు' అని వారు చెప్పారు. ఆ తరువాత నన్ను మరి కాస్త పైకి తీసికెళ్ళారు. అక్కడ కొందరు మనుషులు తలక్రిందులుగా చేయబడి ఉన్నారు. వారి దవడలు చీల్చబడి ఉన్నాయి. వాటి నుండి రక్తం కారుతోంది. నేను వీరెవరని అడిగాను. 'వీరు రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించకుండా పగటి వేళల్లో హాయిగా తింటూ, త్రాగుతూ ఉండేవారు' అని సమాధానమిచ్చారు." (అల్ మన్జరి)

విశ్వాసి కొరకు ఖుర్‌ఆన్, ఉపవాస వ్రతాలు కూడా దేవునికి సిఫారసు చేస్తాయి. ఈ విషయాన్ని దైవప్రవక్త (సల్లం) ఇలా వివరించారు:

"ఖుర్‌ఆన్, ఉపవాసవ్రతాలు విశ్వాసి కొరకు దైవానికి సిఫారసు చేస్తాయి. రోజా ఇలా అంటుంది- 'ప్రభు! నేను ఈ వ్యక్తిని పగటి వేళల్లో తిండికి, ఇతర వాంఛలకు

దూరం చేశాను. ఇతను దాన్ని శిరసావహించాడు. కనుక (అతని మోక్షం కోసం) నా సిఫారసు స్వీకరించు.' అలాగే ఖుర్‌ఆన్ ఇలా అంటుంది- 'నేను ఇతడ్ని రాత్రిళ్ళలో సుఖనిద్రకు దూరం చేశాను. కనుక స్వామీ! ఇతని విషయంలో నా సిఫారసు స్వీకరించు.' అప్పుడు దేవుడు ఈ రెండిటి సిఫారసు స్వీకరిస్తాడు." (మిష్కాత్, బైహఖి)

దైవప్రవక్త (స) రమజాన్ ఉపవాసాల ప్రాముఖ్యం తెలుపుతూ "రమజాన్ నెల చివరి రాత్రిన నా అనుచర సముదాయం పాపాలు క్షమించబడతాయ"ని అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! ఆ రాత్రేనా లైలతుల్‌ఖదర్ (మహా శుభరాత్రి)?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "కాదు. శ్రామికుడు తన పని పూర్తిగా నిర్వహించిన తర్వాత అతనికి కూలి ఇవ్వబడుతుంది. (అంటే పని నిర్ణీతకాలం ముగింపులో లేదా నెల చివరితేదీన వేతనం ఇవ్వబడుతుంది)" అని అన్నారు. (అహ్మద్)

దైవప్రవక్త (సల్లం) స్వర్గం గురించి ఒక హదీసులో ఇలా తెలిపారు: "స్వర్గానికి ఎనిమిది ప్రధాన ద్వారాలు ఉంటాయి. వాటిలో ఒక ద్వారం పేరు 'రయ్యాన్.' ఈ ద్వారం గుండా ఉపవాసాలు పాటించేవారు మాత్రమే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారు తప్ప మరెవరూ ఈ ద్వారం గుండా ప్రవేశించలేరు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "రమజాన్ కోసం స్వర్గం ఒక సంవత్సరాంతం నుంచి వచ్చే సంవత్సరారంభం వరకు అలంకరించబడుతుంది. రమజాన్ నెల మొదటి రోజు రాగానే దైవ సింహాసనం (అర్ష్) క్రింద ఒక విధమైన గాలి వీస్తుంది. ఈ గాలి స్వర్గ వృక్షాల గుండా వీస్తూ లేడికళ్ళ అప్సరసల మీదికి చేరుతుంది. (హృదయాలను గిలిగింతలు పెట్టే) ఈ పవన వీచికల స్పర్శతో ఆ అప్సరసలు 'ప్రభూ! నీ పుణ్యదాసులలో మా కళ్ళకు చలువ కలిగించే భర్తలను మాకు ప్రసాదించు. మా సహచర్యంతో వారి కళ్ళకు చలువ కలిగించు' అని ప్రార్థిస్తారు." (బైహఖి)

## 49. అత్యధిక దానధర్మాలు

రమజాన్ మాసంలో చేసే ప్రతి సత్కార్యానికి కనీసం పది రెట్ల పుణ్యం లభిస్తుంది. ఎవరికైనా పది రూపాయలు దానం చేస్తే వంద రూపాయలు దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. అందుకే రమజాన్ నెలలో ముస్లింలు ఉపవాసాలు పాటించడమే గాకుండా అత్యధిక దానధర్మాలు కూడా చేస్తుంటారు. ఇస్లాం రమజాన్ మాసంలో దైవప్రసన్నత కోసం ధనవ్యయం చేసేవారిని ప్రోత్సహించడమే గాకుండా "ఫిత్రా" దానాన్ని కంపల్సరి చేసింది. ఈ కారణంగానే రమజాన్ నెలలో ప్రతి మసీదు దగ్గర ఇతర దినాలలో కంటే ఎక్కువ మంది యాచకులు కన్పిస్తారు.

కొందరు ముస్లింలు రమజాన్‌లో లభించే అసాధారణ పుణ్యఫలాన్ని దృష్టిలో పెట్టుకొని 'జకాత్' (పేదల ఆర్థిక హక్కు) కూడా ఈ నెలలోనే చెల్లిస్తారు. రమజాన్



నెలలో వారి సంపదపై కచ్చితంగా ఒక సంవత్సరం గడిస్తే రమజాన్ నెలలోనే జకాత్ చెల్లించవచ్చు. అలాకాకుండా రమజాన్‌కు ఒకటి రెండు నెలలకు ముందుగాని లేదా తర్వాతగాని ఒక సంవత్సరం పూర్తయితే రమజాన్ నెలలో జకాత్ చెల్లించడం సరికాదు.

దైవమార్గంలో దానధర్మాల ప్రాముఖ్యం, ఆవశ్యకతలు ఏమిటో ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

"దైవమార్గంలో ఖర్చుపెట్టండి. (సత్కార్యాల కోసం సంపద వినియోగించండి.) చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి. సత్కార్యాలు చేస్తూ ఉండండి. సత్కార్యాలు చేసేవారిని దేవుడు తప్పకుండా ప్రేమిస్తాడు." (2:195)

"అలాగే తాము పిసినారితనం వహించడమే గాకుండా ఇతరులను కూడా పిసినారితనం గురించి పురిగొల్పేవారిని దేవుడు ప్రేమించడు. (ఇదంతా తెలిసి కూడా) ఎవరైనా సత్యానికి విముఖులయిపోతే దేవుడు కూడా వారిని ఖాతరు చేయడు. ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు." (57:23,24)

"అలాగే తాము పిసినారితనం వహించడమేగాక ఇతరులక్కూడా పిసినారితనం నూరిపోసేవారిని దేవుడు ప్రేమించడు. వారు తమకు దేవుడు ప్రసాదించిన అనుగ్రహాన్ని కూడబెడ్తారు. ఇలాంటి కృతఘ్నుల కోసం మేము నీచమైన యాతన సిద్ధపరచి వుంచాము. వారొకవేళ ఏదైనా ఖర్చుపెట్టినా లోకుల మెప్పు కోసం మాత్రమే ఖర్చుపెడ్తారు. వారు దేవుడ్నీ విశ్వసించరు, పరలోకాన్నీ విశ్వసించరు. కారణం, అలాంటివారికి షైతాన్ సహచరుడై పోయాడు. షైతాన్ సహచర్యం అత్యంత దుష్టసహచర్యం." (4:37,38)

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది. యావత్తు భూమ్యాకాశాలకు దేవుడే వారసుడు. మీరు చేస్తున్నదంతా దేవునికి బాగా తెలుసు." (3:180)

"వారిలో కొందరు "దేవుడు తన అనుగ్రహంతో తమకు సిరిసంపదలు ప్రసాదిస్తే తాము (ఉదారంగా) దానధర్మాలు చేస్తామని, సజ్జనులయి ఉంటామ"ని ప్రమాణం చేశారు. కాని దేవుడు తన దయతో వారిని ధనికులుగా చేయగానే వారు పిసినారితనం వహించారు. వారు తమ ప్రమాణాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా భంగపరిచారు. ఇలా వారు దేవుని విషయంలో వాగ్దానభంగానికి పాల్పడటం వల్ల, వారు పలుకుతున్న అబద్ధాల వల్ల దేవుడు వారి హృదయాల్లో కాపట్యం జనింపజేశాడు. వారు దేవుని సన్నిధిలో ప్రవేశపెట్టబడేవరకు ఈ కాపట్యజాడ్యం వారిని వదలదు." (9:75-77)

'వినండి, (అవసరార్థం) దైవమార్గంలో ధనం ఖర్చుపెట్టమని మిమ్మల్ని కోరడం జరుగుతోంది. కాని మీలో కొందరు పిసినారితనం వహిస్తున్నారు. అయితే పిసినారితనం

వహిస్తున్నవాడు నిజానికి తన సొంత విషయంలోనే పిసినారితనం వహిస్తున్నాడు (అని వారు తెలుసుకోలేకపోతున్నారు). దేవుడు నిరపేక్షాపరుడు. మీరే (సమస్త అవసరాలకు) ఆయనపై ఆధారపడేవారు. మీరు గనక (మా ఆజ్ఞలకు) విముఖులైతే దేవుడు మీ స్థానం లో కొత్తగా మరోజాతిని తెచ్చిపెడతాడు. వారు మీలా ప్రవర్తించరు." (ఖుర్ఆన్-47:38)

"పరలోక తీర్పును ధిక్కరించే వాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం ప్రోత్సహించనివాడు. ప్రార్థనపట్ల అశ్రద్ధ, ఏమరు పాటులు వహించేవారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. వారు ప్రతిపనీ లోకుల మెప్పు కోసం ప్రదర్శనాబుద్ధితో చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణ వస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు." (107:1-7)

"విశ్వాసులారా! ఎలాంటి క్రయ విక్రయాలు జరగని, స్నేహసహకారాలు ఉపయోగ పడని, ఎవరి సిఫారసు కూడా చెల్లని (పరలోక తీర్పు) దినం రాకముందే మేము మీకు ప్రసాదించిన సంపద నుండి (కొంత దైవమార్గంలో కూడా) ఖర్చుపెట్టండి. (మామాటలు నమ్మని) సత్యతిరస్కారులే పరమ దుర్మార్గులు." (2:254)

"రాత్రింబవళ్ళు బహిరంగంగానూ, గోప్యంగానూ (దైవమార్గంలో) తమ సంపదను ఖర్చు చేసేవారి కోసం తగిన ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (అక్కడ) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." (2:274)

"మీరు (దైవమార్గంలో) ఖర్చు చేసిందయినా, లేక మీరు మొక్కుబడి చేసుకున్న దైనా సరే, అంతా దేవునికి తెలుసు. దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయరు. మీరు దానధర్మాలు బహిరంగంగా చేసినా మంచిదే; ఒకవేళ మీరు ఇతరుల కంట పడకుండా రహస్యంగా అగత్యపరులకు దానం చేస్తే అది మరీ మంచిది. అలాంటి దానం మీ పాపాలను కడిగివేస్తుంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు." (2:270-271)

"దైవమార్గంలో సంపద ఖర్చుచేసేవారి (ఖర్చు) పోలిక, ఒక విత్తనం నాటగా అది ఏడు వెన్నులు ఈని ప్రతి వెన్నులో వందేసి గింజలున్నట్లు ఉంటుంది. అదే విధంగా దేవుడు తాను తలచుకున్న వారి కర్మఫలాన్ని అనేక రెట్లు పెంచుతాడు. దేవుడు ఎంతో ఉదార స్వభావుడు, సర్వం తెలిసినవాడు." (2:261)

"దైవమార్గంలో ధనాన్ని ఖర్చుచేయడంతో పాటు, చేసిన మేలు గుర్తుచేసి (దానగ్రహీత) మనస్సు నొప్పించనివారి కోసం వారిప్రతిఫలం వారిప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. దానంచేసి మనస్సు నొప్పించే పని కన్నా మృదువుగా మాట్లాడటం, క్షమించడం అనేవి ఎంతో శ్రేష్ఠమైన పనులు. దేవుడు నిరపేక్షాపరుడు, విశాలహృదయం కలవాడు." (2:262,263)

"(కనుక) విశ్వాసులారా! లోకుల మెప్పు కోసం ప్రదర్శనా బుద్ధితో దానధర్మాలు చేసే వాడిలా, మీరు మీ దానధర్మాలను ఎత్తిపొడుపు మాటలద్వారా, (గ్రహీత) మనస్సు



నొప్పించి వృధా చేసుకోకండి. అతనికి దేవునిమీద, పరలోకమ్మీద నమ్మకం లేదు. అలాంటి వ్యక్తి(చేసే దానధర్మాలు) భారీవర్షం కురవగానే పైనున్న పల్చటి మట్టిపొర కాస్తా తుడిచిపెట్టుకుపోయి నున్నగా మిగిలిపోయే రాతి (ప్రదేశం)తో సమానం. అలాంటివారు సత్కార్యాలు చేసి ఎలాంటి పుణ్యఫలం పొందలేరు. సత్యతిరస్కారులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు." (2:264)

"(దీనికి భిన్నంగా) కేవలం దైవప్రసన్నత కోసం చిత్తశుద్ధితో తమ సంపదను ఖర్చు చేసే వారు మెరకప్రాంతంలో ఉండే తోట లాంటివారు. ఆతోట వర్షాలు బాగా ఉంటే రెండింతలు ఫలసాయాన్నిస్తుంది. అంతగా వర్షాలు లేకుండా సన్నటి జల్లులు పడినా దానికి సరిపోతుంది. మీరు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (2:265)

"విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీ కోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి. దైవమార్గంలో ఖర్చు చేయడానికి నాసిరకం వస్తువుల్ని ఏరితీసే ప్రయత్నం చేయకండి. అలాంటి వస్తువుల్ని మీకే గనక ఎవరయినా ఇస్తే మీరు తీసుకోవడానికి ఇష్టపడతారా? కళ్ళు మూసుకొని స్వీకరిస్తారేకాని, మనస్ఫూర్తిగా మీరు ఎన్నటికీ వాటిని స్వీకరించరు. దేవుడు నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడని తెలుసుకోండి." (2:267)

"(కనుక) దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించండి. ఏ సంపద గురించి ఆయన మీపై ప్రాతినిధ్య బాధ్యతను మోపాడో, దానినుండి (కొంత దైవమార్గంలో) ఖర్చు పెట్టండి. సత్యాన్ని విశ్వసించి (దైవమార్గంలో) ధనవ్యయం చేసేవారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుంది." (57:7)

పైసూక్తిలో 'సంపద గురించిన ప్రాతినిధ్య బాధ్యత' అంటే మానవుని దగ్గర ఉన్న సంపదలన్నిటికీ అసలు యజమాని దేవుడే. మానవుడు కేవలం ఆయన ప్రతినిధిగా వ్యవహరిస్తూ, ఆయన ఆదేశాల అనుసారమే వాటిని వినియోగించవలసి ఉంటుంది. అంతేగాని మానవుడు తన ఇష్టానుసారం ఖర్చుపెట్టడానికి వీల్లేదు. దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి గమనించండి:

"భూమ్యాకాశాల్లోని సర్వస్వం దేవునిదే. ఆయనే వాటికి వారసుడు. అలాంటప్పుడు మీరు దైవమార్గంలో సంపదను ఎందుకు ఖర్చుపెట్టరు?" (57:10)

ఒక వ్యక్తిలోని ధనవ్యామోహం అతనికేగాక, ఇతరులక్కూడా అనేక అనర్థాలు తెచ్చి పెడ్తుంది. అసలీ ధనం అతనిది కాదు, దేవుడు ప్రసాదించినది. ఒక్కొక్కసారి మనిషి ఎన్ని అడ్డదారులు తొక్కి ప్రయత్నించినా అతనికి రెండుపూటల తిండి కూడా సరిగా దొరకదు. మనిషి తనదని చెప్పుకునే ధనమంతా నిజానికి అతనిది కాదు. దానధర్మాలు చేయడం ద్వారా, ధర్మసంస్థాపనా కృషికి వినియోగించడం ద్వారా పరలోకానికి పంపుకునే ధనం మాత్రమే అతనిది అవుతుంది.

ఈ విషయాన్నే దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "మనిషి నా ధనం, నా డబ్బు అంటాడు. నిజానికి నీ ధనంలో నీవు తిని అంతం చేసింది, నీవు ధరించి మాసి పోయేలా చేసింది లేదా నీవు దానధర్మాలు చేసి ముందుకు పంపుకున్నది మాత్రమే నీ వాటాకు వస్తుంది. మిగిలినదంతా చేజారి పోయేదే. నీవు దాన్ని ఇతరుల కోసం వదలి వెళ్ళవలసి ఉంటుంది." (ముస్లిం)

ధనవంతులు తమ ధనం ద్వారా రమజాన్ శుభాలు పొందదలచుకుంటే ఎన్నో మార్గాలు ఉన్నాయి. అప్పుల భారం కింద అణగిపోతున్న పేదలకు, ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న అనాథలు-వితంతువులకు ధన సహాయం చేయవచ్చు. ధార్మిక ప్రచార ప్రచురణ కార్యకలాపాల్లో నిమగ్నమయిపోయిన సంస్థలకు చేయూత నివ్వవచ్చు. రమజాన్‌లో ఏ సత్కార్యం చేసినా వందల రెట్ల పుణ్యఫలం లభిస్తుంది. అంతేకాదు, ధనసహాయం వల్ల దాతల ఆస్తి కూడా తరగదని ఖుర్ఆన్ హామీ ఇస్తోంది.

"వారికిలా చెప్పు: 'నా ప్రభువు తన దాసులలో తానుకోరిన విధంగా కొందరికి విస్తృతంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధి ప్రసాదిస్తున్నాడు. మీరు (దైవమార్గంలో) ఏది ఖర్చుపెట్టినా ఆ వెల్తిని భర్తీచేయడానికి ఆయన మీకు మరింత ప్రసాదిస్తాడు. ఆయన యావత్తు ఉపాధి ప్రదాతల్లోకెల్లా గొప్ప ఉపాధిప్రదాత". (ఖుర్ఆన్-34:39)

"షైతాన్ మిమ్మల్ని పేదరికంగురించి భయపెట్టి సిగ్గుమాలిన పనులకు పాల్పడేలా ప్రేరేపిస్తాడు. కాని దేవుడు మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. ఆయన ఎంతో ఉదారస్వభావుడు, సర్వం తెలిసినవాడు. తాను తలచుకున్న వారికి వివేకం, విచక్షణ జ్ఞానం ప్రసాదిస్తాడు. వివేకం, విచక్షణల జ్ఞానం లభించినవాడు ఎంతో అదృష్ట వంతుడు. నిజంగా అతనికి అపార సంపదలు లభించినట్లే. బుద్ధిమంతులు మాత్రమే (మా) హితోపదేశం గ్రహిస్తారు." (2:268,269)

"మీ సంపద నుండి మీరు ఏది ఖర్చుచేసినా అది మీకే లాభ దాయకం. మీరు చేసే దంతా దైవప్రసన్నత కోసమే కదా! దైవప్రసన్నత కోసం మీరు ఏది ఖర్చుచేసినా దాని పుణ్యఫలం మీకు పూర్తిగా లభిస్తుంది. మీకేమాత్రం అన్యాయం జరగదు." (2:272)

"ముఖ్యంగా దైవకార్యాల్లో నిమగ్నులయిపోయి, జీవనోపాధి కోసం ధరణిపై తిరిగే అవకాశం లేని నిరుపేదలకు (ఆర్థికసహాయం చేయండి). వారి స్థితిగతులు ఎరగనివారు వారి ఆత్మాభిమానం చూసి వారు స్థితిపరులేనని భావిస్తారు. కాని వారి ముఖాలు చూస్తే మీరు వారి వాస్తవ పరిస్థితి గ్రహిస్తారు. వారు (సిగ్గు వదలి) ప్రజల వెంటబడి అర్థించే (యాచకుల్లాంటి) వారుకాదు. వారి సహాయం కోసం మీరు చేసే ఏఖర్చయినా దేవునికి తెలియకుండా ఉండదు." (2:273)

"వారు కలిమిలోనూ, లేమిలోనూ తమ సంపదను (దైవమార్గంలో) ఖర్చు పెడతారు. కోపోద్రేకాలు దిగమింగుతారు. ఇతరుల తప్పులు క్షమిస్తారు. ఇలాంటి సద్వర్తనులనే దేవుడు ప్రేమిస్తాడు." (3:134)



"మీ సంతానం, సిరిసంపదలు మీకు పరీక్షగా చేయబడ్డాయి. (ఈ పరీక్ష నుండి గట్టెక్కితే మీ కోసం) దేవుని దగ్గర గొప్ప ప్రతిఫలం ఉంది." (ఖుర్ఆన్-64:15)

మనిషికి సాధారణంగా సంతానం, సిరిసంపదల పట్లే ఎక్కువ ప్రేమావ్యా మోహాలు ఉంటాయి. సంతానం, సిరిసంపదలే అతనికి దైవమార్గంలో అవరోధాలై నిలుస్తాయి. అందుకే విశ్వాసి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని పైసూక్తి చెబుతోంది. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలు శత్రువు అతను కాదు. నీ అసలుశత్రువు నీ కడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీ అధీనంలో ఉన్న నీ సిరిసంపదలే." (తబ్రాని)

# 50. అన్నదానం

ఓసారి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి ఒక వ్యక్తి (అతిథిగా) వచ్చాడు. దైవప్రవక్త (సల్లం) అతనికి భోజనం ఏర్పాటు చేయమని తన భార్యలతో అన్నారు. దానికి వారు "మా దగ్గర మంచినీరు తప్ప మరేమీ లేద"ని చెప్పారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) తమ అనుచరులను సంబోధిస్తూ "మీలో ఇతనికి ఆతిథ్యమిచ్చేవారు ఎవరయినా ఉన్నారా?" అని అడిగారు. ఒక అన్సారీ ముస్లిం లేచి "నేనాతిథ్యమిస్తాను" అన్నాడు.

ఆ తరువాత అతనా వ్యక్తిని ఇంటికి పిలుచుకెళ్ళి "ఇతను ప్రవక్తగారి అతిథి. ఇతనికి మనం భోజనం పెట్టాలి" అన్నాడు భార్యతో. దానికామె "పిల్లల కోసమే కాస్తుంది" అన్నది. "ముందు భోజనం తయారుచెయ్యి. పిల్లలు అన్నం అడిగితే ఏదోచెప్పి వాళ్ళను నిద్రపుచ్చు"అన్నాడతను.

కాస్సేపటికి ఆయన భార్య భోజనం తయారుచేసి దీపం వెలిగించింది. పిల్లల్ని (ఏదోచెప్పి) పడుకోబెట్టింది. ఆ తరువాత ఆమె లేచి దీపం (వత్తిని) సరిచేస్తున్నట్లు నటిస్తూ ఆర్పింది. ఆ చీకటిలోనే వారిద్దరు తాము కూడా అన్నం తింటున్నట్లు అతిథికి అన్పించేలా నోళ్ళు కదపసాగారు. ఇలా వారిద్దరు ఆరాత్రి అతిథికి అన్నంపెట్టి తాము పస్తుండిపోయారు. మర్నాడు ఉదయం ఆ అన్సారీ ప్రవక్త సన్నిధికి వెళ్ళగానే "ఈరోజు మీరు చేసిన పనిని దేవుడు చూసి సంతసించాడు. సంతసించి ఈసూక్తి అవతరింప జేశాడు" అంటూ ఆయన ఈ క్రింది సూక్తి పఠించారు. (బుఖారి, ముస్లిం)

"(మక్కా నుండి) తమ దగ్గరకు (మదీనా) వలసవచ్చిన వారిని వీరు అభిమాని స్తున్నారు. వీరికి ఏదిచ్చినా అది తమకు అవసరమని వీరు తమ హృదయాల్లో సైతం ఆకాంక్షించరు. వారు స్వయంగా నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం

ఇస్తారు. పేరాశ, పిసినారితనాల నుండి రక్షించబడినవారే ధన్యులు." (ఖుర్ఆన్-59:9)

హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ఉపదేశించారు: "...ఈ నెల విశ్వాసి ఉపాధి పెంచడం జరుగుతుంది. ఎవరైనా ఈనెలలో ఉపవాసి ఉపవాసాన్ని (ఆహారపదార్థాలు ఇచ్చి) విరమింపజేస్తే ఆ సత్కార్యం అతని పాపమన్నింపుకు, నరకశిక్ష నుండి అతని రక్షణకు కారణభూతమవుతుంది. ఉపవాసం పాటించినందుకు ఉపవాసికి ఎంత పుణ్యఫలం లభిస్తుందో ఉపవాసం విరమింప జేసినందుకు అతనికి కూడా అంతే పుణ్యఫలం లభిస్తుంది. దానివల్ల ఉపవాసికి లభించే పుణ్యఫలం ఏమాత్రం తగ్గించడం జరగదు."

అప్పుడు ప్రవక్త అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! మాలో ప్రతి ఒక్కరికీ (ఉపవాసం విరమింపజేసే) అంత స్తోమత ఉండదు కదా! (అప్పుడు మేము ఏం చేయాలి?)" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ ఇలా అన్నారు:

"ఉపవాసికి మీగడమజ్జిగతో లేదా ఒక ఖర్జూర పండుతో లేదా ఒక గుక్కెడు నీళ్ళతో ఉపవాసం విరమింపజేసినా సరే, దేవుడు అలాంటి వ్యక్తికి కూడా అంతే పుణ్యఫలం ప్రసాదిస్తాడు. మరెవరైనా ఒక ఉపవాసికి కడుపునిండా భోజనం పెడితే దేవుడు అతనికి నా (కౌసర్) సరోవరంలోని నీటిని తాగిస్తాడు. ఈ సరోవరంలోని నీటిని ఒకసారి తాగితే ఇక అతనికి స్వర్గంలో ప్రవేశించేవరకు దాహం కలగదు. ఈ నెల ప్రారంభంలో దైవకారుణ్యం ఉంటుంది. నెల మధ్యలో పాపమన్నింపు ఉంటుంది. నెలాఖరులో నరకం నుండి విమోచనం ఉంటుంది. ఈ నెలలో ఎవరు తన సేవకునితో తేలికపాటి సేవ చేయించుకుంటాడో దేవుడు అతని పాపాలను క్షమించి అతడ్ని నరకం నుండి విముక్తి కలిగిస్తాడు."----------- (బైహఖి)

## 51. రూ10-ల పెట్టుబడిపై రూ100-ల లాభం

"మీలో దేవునికి రుణమిచ్చే వారెవరైనా ఉన్నారా? శ్రేష్ఠమైన రుణం? అలాంటివారికి దేవుడు ఆ రుణాన్ని అనేక రెట్లు పెంచి తిరిగి ఇచ్చివేస్తాడు. పైగా వారికి అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం కూడా లభిస్తుంది." (ఖుర్ఆన్-57:11)

భూమ్యాకాశాలన్నీ దేవునివే అయినప్పుడు, ఆ దేవుడు ప్రసాదించిన ధనాన్ని ఆయన నిర్దేశించిన పుణ్యకార్యాల కోసం ఖర్చు చేయడానికి మానవులకు ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. కాని మానవుడు పిసినారితనంతో సత్కార్యాల కోసం డబ్బు వెచ్చించడానికి వెనుకంజ వేస్తాడు. అంచేత ఉపాధి ప్రసాదించేది తానేనని, దానం చేస్తే ఆ కొరతను తాను తీరుస్తానని దేవుడు అంటున్నాడు (ఖుర్ఆన్-34:39).

అంతేకాదు, నేను ప్రసాదించిన ఆ ధనాన్ని నాకు రుణంగా అందజేస్తే ఆ రుణాన్ని నేను అనేక రెట్లు పెంచి తిరిగి తీర్చుతానని, ఆపై తగిన ప్రతిఫలం కూడా



ప్రసాదిస్తానని ఆయన వాగ్దానం చేస్తున్నాడు. ఈ వాగ్దానం పరలోకంలో నెరవేరు తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

హజ్రత్ అబుద్దహ్దా అన్సారీ (రజి) ముహమ్మద్ మహనీయు (సల్లం)ని నోట ఈసూక్తి విని "దైవప్రవక్తా! దేవుడు మనల్ని అప్పు అడుగుతున్నాడా?" అని ప్రశ్నించారు. దానికాయన అవునన్నారు. అప్పుడు అబుద్దహ్దా (రజి) "అయితే కాస్త మీ చేయి జాపండి" అన్నారు. దైవప్రవక్త (స) చేయి జాపారు. హజ్రత్ అబుద్దహ్దా (రజి) ఆయన చేతిని తన చేతిలోకి తీసుకొని "నేను నా ప్రభువుకు నా తోటను (అప్పుగా) ఇస్తున్నాను" అని చెప్పారు.

హజ్రత్ అబుద్దహ్దా (రజి) తోటలో ఆరొందల ఖర్జూర చెట్లున్నాయి. తోటలోనే ఆయన ఇల్లు కూడా ఉంది. అక్కడే ఆయన భార్యాపిల్లలు నివసిస్తున్నారు. ఈ మాట చెప్పి ఆయన నేరుగా తోట దగ్గరికి వెళ్ళి "ఉమ్మె దహ్దా! బయటికి వచ్చేసేయి. నేనీ తోటను నా ప్రభువుకు అప్పుగా ఇచ్చేశాను" అన్నారు.

ఆయన భార్య హజ్రత్ ఉమ్మెదహ్దా (రజి) కూడా ఎంతో సాధ్వీమణి. ఆమె ఈ మాటలు విని "మీరు చాలా లాభదాయకమయిన వ్యాపారం చేశారు" అన్నారు.

హజ్రత్ అబుదహ్దా (రజి) అప్పటికప్పుడు తన ఇంటి సామగ్రిని, భార్యాపిల్లలను తీసుకొని తోటలో నుంచి బయటికి వచ్చేశారు. మనం గనక అప్పుడా దానశీలుడ్ని చూస్తే ఆరొందల చెట్లకు బదులు ఆరొందల కోట్ల రూపాయలు ఆర్జించానన్న ధీమా ఆయన ముఖవర్చస్సులో తప్పకుండా గమనించగలం.

ఇస్లాంలో దేహారాధన, ద్రవ్యారాధన అని రెండు విధాల ఆరాధనలు ఉన్నాయి. దేహారాధన అంటే శరీరంతో, అవయవాల కదలికతో చేసే ఆరాధన అన్నమాట. ఉదా: నమాజ్, ధ్యానం, వేడుకోలు, హజ్ వగైరా. ద్రవ్యారాధన అంటే ధన సంబంధమైన ఆరాధన. ఉదా: జకాత్, ఫిత్రా, దానధర్మాలు మొదలైనవి.

అయితే ఒక్క ప్రాణత్యాగం మినహాయిస్తే దేహత్యాగం కన్నా ద్రవ్యత్యాగమే మనిషికి ఎంతో కష్టమైన ఆరాధన. మన చేయి తొందరగా జేబులోకి పోదు; ఇనుప్పెట్టె దగ్గరికి అంతకన్నా పోదు. కారణం పరలోకం పట్ల మన విశ్వాసం (ఈమాన్) బలహీనంగా ఉండటమే; ప్రపంచం పట్ల మాత్రం చాలా బలంగా ఉంటుంది.

కాని పరలోకం పట్ల ప్రవక్త ప్రత్యక్ష అనుచరుల విశ్వాసం మన విశ్వాసం కన్నా ఎంతో పటిష్ఠంగా ఉండేది. అది ఎంత పటిష్ఠమైన విశ్వాసమో ఓసారి గతంలోకి తొంగిచూడండి.......

అది మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) పరిపాలిస్తున్న కాలం. ఒకసారి మదీనాలో కరువు వచ్చింది. జనం తిండి గింజల కోసం అల్లాడిపోసాగారు.

ఓరోజు ఖలీఫా ప్రజల దుస్థితి చూసి "ఈరోజు సాయంత్రానికల్లా దేవుడు మీ బాధ దూరం చేస్తాడు" అని జోస్యం చెప్పారు.

కాకతాళీయంగా అదే రోజు సాయంత్రం సిరియా నుంచి హజ్రత్ ఉస్మాన్ (రజి)కు చెందిన వాణిజ్య బిడారాలు వచ్చాయి. వేయి ఒంటెల మీద ఆహార ధాన్యాల బస్తాలు కిటకిటలాడుతున్నాయి.

సిరియా నుంచి ఉస్మాన్ (రజి) గారి సరుకు వచ్చిందని తెలియగానే మదీనాలోని పెద్ద పెద్ద వర్తకులంతా బేరమాడటానికి మార్కెట్‌కు వచ్చేశారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) వర్తకుల్ని ఉద్దేశించి "సిరియా నుంచి దిగుమతి అయిన ఈ సరుకుపై మీరు నాకు ఎంత లాభం ఇవ్వగలరు?" అని అడిగారు.

"మీరు సరుకు పది రూపాయలకు కొంటే దానికి నేను పన్నెండు రూపాయలు ఇస్తాను" అన్నాడు ఒక వ్యాపారి.

అంటే కొనుగోలు ధరపై ఉస్మాన్ గారికి రెండు రూపాయలు లాభం ఉంటుందన్న మాట. కాని ఆ మాత్రం లాభానికే ఆయన తన సరుకుని అమ్మదలచుకో లేదు.

"నాకు దానికంటే ఎక్కువ లాభం వస్తుంది" అన్నారు ఆయన.

"అట్లయితే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పదమూడు రూపాయలు ఇస్తాను" అన్నాడు మరొక వ్యాపారి వేలంపాట పెంచుతూ.

"నాకు అంతకంటే ఎక్కువ లాభం వచ్చే అవకాశం ఉంది" అన్నారు ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి).

"సరే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పధ్నాలుగు రూపాయలు ఇస్తాను, వదిలేయండి" అన్నాడు వేరొక వర్తకుడు.

"ఊహూ, ఆ లాభం నాకు చాలదు. నాకు దానికంటే కూడా ఎక్కువ లాభం వచ్చే అవకాశం ఉంది" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

"ఇంతకంటే ఎక్కువ లాభమా! పోనీ, మరో రూపాయి పెంచుతున్నా, సరుకు వదిలేయండి" అన్నాడు ఆ వర్తకుడే.

"లాభం లేదు. నాకు ఇంతకంటే కూడా ఎక్కువ లాభం వచ్చే చాన్సుంది" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి) తల పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ.

"ఏమిటీ, ఇంతకంటే కూడా ఎక్కువ లాభమా! ఎవరండీ ఆ వ్యాపారి మీకింత కంటే ఎక్కువ లాభం ఇస్తాననంటున్నది?" వర్తకులంతా ఎంతో ఆశ్చర్యపోతూ అడిగారు.

"నాకు పది రూపాయల సరుకు మీద వంద రూపాయలు ధర లభిస్తుంది. మీరు ఇంతకంటే ఎక్కువ ధర పెట్టి ఈ సరుకు కొనగలరా?" అన్నారు హజ్రత్ ఉస్మాన్.



అంటే పది రూపాయల పెట్టుబడికి తొంభయి రూపాయలు లాభం వస్తుందన్న మాట! ఈ మాటలు విన్న వర్తకులు మరింత ఆశ్చర్యపోయారు.

"ఇది మరీ చోద్యంగా ఉంది. మేమ్మటుకు అంత ధర పెట్టలేమండీ!" అన్నారు వారు నిరాశతో ఢీలా పడిపోయి.

"అయితే వినండి. నేనీ మొత్తం సరుకును దైవమార్గంలో దానం చేస్తున్నాను. దీనికి మీరే సాక్షులు. దేవుడే నా పెట్టుబడిపై పదింతలు లాభం ప్రసాదించేవాడు" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

ఈ సంగతి వినగానే తిండి గింజల కోసం కటకటలాడుతున్న పేద ప్రజలు ఎంతో సంబరపడిపోయారు. సిరియా నుంచి వచ్చిన మొత్తం వేయి ఒంటెల ఎత్తు ఆహారధాన్యాలు అప్పటికప్పుడు పేదలకు దానం చేశారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

అదే రోజు రాత్రి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఓ విచిత్రమైన కల గన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) జ్యోతిర్మయ దుస్తులు ధరించి టర్కీజాతి తెల్ల గుర్రం ఎక్కి ఎక్కడికో బయలుదేరుతున్నట్లు ఆయన కలలో చూశారు.

అప్పుడాయన "దైవప్రవక్తా! మీరు ఎక్కడికి వెళ్తున్నారు, హడావిడి చేస్తున్నారు? నా హృదయం మాత్రం మీ దర్శనభాగ్యం కోసం తహతహ లాడుతోంది" అన్నారు.

"ఈరోజు ఉస్మాన్ (రజి) వేయి ఒంటెల ఆహారధాన్యాలు దానం చేశాడు కదా! ఆయన చేసిన ఈ దానాన్ని దేవుడు స్వీకరించి, దానికి ప్రతిఫలంగా ఒక స్వర్గ కన్యతో ఆయన వివాహం జరిపిస్తున్నాడు. నేనా వివాహమహోత్సవంలో పాల్గొనడానికి వెళ్తున్నా" అన్నారు దైవప్రవక్త (సల్లం).

# 52. తరావీ నమాజ్

రమజాన్ ఉపవాసాల ప్రాముఖ్యం గ్రహించిన ముస్లింలు సంతోషంగా ఉపవాసాలు ఉంటారు. బాగానేఉంది. అయితే పొద్దస్తమానం ఆకలిదప్పులతో గడిపాం కదా, ఇక రాత్రికి సుష్టుగా తిని మస్తుగా పడుకుందామంటే కుదరదు. అసలు ఆరాధన రాత్రి వేళే మొదలవుతుంది. దాసుడు దేవుని పట్ల తన సంబంధాన్ని పటిష్ఠవంతం చేసుకోవడానికి సరయిన అదను రాత్రివేళే. కనుక రమజాన్ నెల రాత్రుళ్ళలో దైవప్రవక్త (సల్లం) అనుచరులు (సహబీలు) సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని ఆరాధనల్లో గడుపుతుండేవారు.

దీనికోసం ఇస్లాం రోజా చేసే అయిదు పూటల నమాజులేగాక రమజాన్ నెలలో అదనంగా 'తరావీహ్' నమాజులను నిర్ణయించింది. రోజా పాటించలేనివారు కూడా తరావీహ్ నమాజ్ చెయ్యాలి. తరావీహ్ నమాజ్ 'సున్నతె మువక్కద.' అంటే దైవప్రవక్త (స) తన జీవితకాలంలో ఎన్నడూ విడువకుండా చేసిన నమాజులన్నమాట.

దైవదాసుడు సంతోషంగా చేసే ఈ అదనపు నమాజ్ వల్ల అతనికి ఇతర దినాల్లో చేసే ఫర్జ్ నమాజ్ అంత పుణ్యఫలం లభించగలదు. పైగా ఈ నమాజ్‌ను మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దాసుని పాపాల మన్నింపు సాధనంగా కూడా పరిగణించారు. ఒక హదీసులో ఆయన ఇలా సెలవిచ్చారు:

"ఎవరయితే రమజాన్ నెల రాత్రుళ్ళలో విశ్వాసంతో కూడిన పరిస్థితిలో, పరలోక పుణ్యఫలం ఆర్జించాలన్న సంకల్పంతో (తరావీహ్) నమాజ్ చేస్తారో దేవుడు అతను లోగడ చేసిన పాపాలన్నిటిని క్షమిస్తాడు." (మిష్కాత్-పాక్షికం)

తరావీహ్ బహువచనం. దాని ఏకవచనం 'తర్‌వీహ.' అరబీభాషలో తర్‌వీహ అంటే విశ్రాంతి తీసుకోవడం, కాస్సేపు కూర్చోవడం అని అర్థం. ఇస్లామీయ షరీఅత్ పరిభాషలో తర్‌వీహ అంటే రమజాన్ మాసం రాత్రి సమయాల్లో చేసే అదనపు (నఫిల్) నమాజుల సందర్భంగా ప్రతి నాలుగు రకాతుల తరువాత కాస్సేపు విశ్రాంతి తీసుకోవడం అని అర్థం.

పగలంతా ఉపవాసాలతో అలసిపోయినవారిపై తరావీహ్ ద్వారా ఈ అదనపు భారం ఏమిటీ అన్నది ఆలోచించాల్సిన విషయమే. నమాజ్‌లో ముస్లింలు ఖుర్‌ఆన్‌ని పఠిస్తారు. అందులోని దైవాజ్ఞలను మాటిమాటికి మననం చేసుకుంటారు. ఆ విధంగా వారు తమజీవితపు సమస్త రంగాల్లో ఖుర్‌ఆన్ బోధల ప్రకారం నడుచుకోవడానికి వీలు కలుగుతుంది. అయితే తరావీహ్ నమాజ్ ఇంకా ఎక్కువగా ఖుర్‌ఆన్ పఠించడానికి లేదా వినడానికి అవకాశం కల్పిస్తుంది.

**సామూహిక తరావీ నమాజ్:-** తరావీ నమాజ్ జమాఅత్‌తో కలసి సామూహికంగా చేయడం సంప్రదాయమై పోయింది. దైవప్రవక్త (సల్లం) రమజాన్ మాసం 23, 25, 27 తేదీలలో మూడు రాత్రులు మాత్రమే తరావీ నమాజ్ సామూహికంగా చేయించారు. ప్రజలు ఈ నమాజ్ పట్ల ఎంతో ఆసక్తి, ఉత్సాహం కనబరస్తూ మస్జిద్‌కు రాసాగారు. మూడవ రాత్రి నాటికి వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) తరావీ నమాజ్ కోసం మస్జిద్‌కు రాలేదు. అప్పుడు అనుచరులు బహుశా దైవప్రవక్త (సల్లం) పడుకొని ఉంటారని భావించి ఆయన ఇంటికి పోయి కేకవేసి పిలువసాగారు.

దైవప్రవక్త (సల్లం) వారి పిలుపుకు బయటికొచ్చి ఇలా అన్నారు: "(తరావీ నమాజ్ పట్ల) మీ ఆసక్తి, ఉత్సాహాలలో దేవుడు మరింత శుభం కలిగించుగాక! ఈ నమాజ్ మీకు ఫరజ్ (తప్పనిసరి విధి) అయిపోతుందేమోనని, ఒకవేళ ఫరజ్ అయిపోతే మీరు దాన్ని ఎల్లప్పుడూ పాటించలేరేమోనని భయపడి నేను బయటికి రాలేదు. అందువల్ల మీరీ నమాజ్‌ని మీ ఇండ్లలోనే చేస్తూ ఉండండి. నఫిల్ నమాజులు ఇండ్లలో చేయడమే ఎక్కువ పుణ్యప్రదమైనవి." (ముస్లిం)



ఈ హదీసుని బట్టి తరావీ నమాజ్ సామూహికంగా చేయడం ధర్మసమ్మతమేనని తెలుస్తోంది. కారణం దైవప్రవక్త (సల్లం) ఈ నమాజ్ మూడు రాత్రులు సామూహికంగా చేశారు. అదీగాక దైవప్రవక్త (సల్లం) హితోపదేశం విన్న అనుచరులు కూడా ఆయన కాలంలో, ఆయన తదనంతరం మస్జిద్‌లోనే చిన్న చిన్న జమాఅత్‌లుగా ఏర్పడి తరావీ నమాజ్ సామూహికంగా చేస్తుండేవారు. చివరికి రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) తరావీ నమాజ్ సామూహికంగా చేసే పనిని క్రమబద్ధీకరించారు. అంటే ఆయన ఒకే మస్జిద్‌లో చిన్న చిన్న జమాఅత్‌లు కాకుండా ఒకే జమాఅత్ రూపంలో ఈ సామూహిక నమాజ్‌ని క్రమబద్ధీకరించారు. ప్రవక్త అనుచరులంతా దాన్ని అంగీకరించారు.

ఈ పని దైవప్రవక్త (సల్లం) చేసివుంటే సామూహిక తరావీ నమాజ్ ఫరజ్ (విధి) అయివుండేది. హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫా అయినప్పటికీ ప్రవక్తేతర వ్యక్తి గనుక ఆయన క్రమబద్ధీకరించిన సామూహిక తరావీ నమాజ్ 'ఫరజ్' అన్న ప్రసక్తి రాదు.

**రకాతుల సంఖ్య:-** ఇషా నమాజ్ తరువాత (వితర్‌కు ముందు) చేసే ఈ తరావీహ్ నమాజ్ రెండేసి రకాతుల చొప్పున మొత్తం ఇరవై రకాతులు చేయాలి. 'అహ్లెహదీస్' ప్రజలు మాత్రం ఎనిమిది రకాతులే చేస్తారు. అనేక ఉల్లేఖనాలు వారి అభిప్రాయాన్ని సమర్థిస్తున్నాయి. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో ఇరవై రకాతుల ప్రస్తావన ఉంది. అహ్లెహదీస్ అభిప్రాయాన్ని సమర్థించే హదీసుల సమక్షంలో ఈ హదీసు బలహీనమై పోయింది. అయితే మన రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో సామూహిక తరావీ నమాజ్ ప్రారంభమైనప్పుడు ప్రవక్త అనుచరులంతా ఏకాభిప్రాయంతో ఇరవై రకాతులే చేసేవారు. హజ్రత్ ఉస్మాన్ (రజి), హజ్రత్ అలి (రజి) పరిపాలనా కాలాల్లో కూడా ఇరవై రకాతులే చేసేవారు. దీంతో ప్రవక్త అనుచరుల (సహాబీల)లో ఏ ఒక్కరూ విభేదించలేదు.

ఇరవై రకాతుల తరావీ నమాజ్‌పై ముగ్గురు ఖలీఫాలు ఏకీభవించడం, సహాబీలలో ఎవరూ దాంతో విభేదించక పోవడం గమనిస్తే దైవప్రవక్త (సల్లం) కాలంలో కూడా ప్రజలు తరావీ నమాజ్‌లో ఇరవై రకాతులే పఠించేవారని నిరూపితమవుతోంది. ఇక ఇమాముల విషయానికి వస్తే ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ (రహ్మలై) ముగ్గురూ ఇరవై రకాతుల నమాజ్‌నే సమర్థించారు. ఇమామ్ మాలిక్ (రహ్మలై) కూడా ఒక సందర్భంలో ఇరవై రకాతులకు అనుకూలంగా తన అభిప్రాయం వెలిబుచ్చారు. హజ్రత్ దావూద్ జాహిరీ (రహ్మలై) కూడా దీన్ని సమర్థించారు.

ఒకవేళ అహ్లెహదీస్ వారి దృక్పథమే సరయినదనుకుంటే ఇరవై రకాతుల నమాజ్ పట్ల ప్రవక్త అనుచరుల్లో కొందరైనా అభ్యంతరం లేవదీసిఉండాలి. కాని అలాంటిదేమీ జరగలేదు. పైగా వారంతా ఇరవై రకాతులనే సమర్థించారు. అహ్లెహదీస్ దృక్పథాన్ని సమర్థించే ఉల్లేఖనాలు "ముత్తఫఖున్ అలై" హదీసుల జాబితాలో కూడా లేవు. దీన్నిబట్టి ఈ ఉల్లేఖనాలలో ఎక్కడో గందరగోళం జరిగినట్లు అన్పిస్తోంది నా మట్టుకు.

ఈ వివరణతో నేను ఏదో ఒక వర్గానికి వత్తాసు పలకడం నా ఉద్దేశం కాదు. ధర్మావగాహనా దృక్పథాలలో వచ్చిన విభేదాల కారణంగా ప్రజలు పరస్పరం రాగద్వేషాలకు పోకూడదని, ఇస్లాంలోని మౌలిక విషయాలపై దృష్టి కేంద్రీకరించి వారు తమపై మోపబడిన ధర్మప్రచార బాధ్యతను సమైక్యంగా నిర్వహిస్తూ ఉండాలని మాత్రమే నేను కోరుకుంటున్నాను. ధర్మావగాహనా దృక్పథం విషయానికి వస్తే, ఎవరైనా సరే ఏదో ఒక దృక్పథాన్ని మాత్రమే అనుసరించడం సహజం. నేను అంతే. అంతమాత్రాన రెండవ దృక్పథం అనుసరిస్తున్నవారు సత్యమార్గంలో లేరని నేను ఎన్నటికీ చెప్పలేను. నేను ఇరవై రకాతుల ఇమామ్ వెనుక కూడా తరావీ నమాజ్ చేశాను; ఎనిమిది రకాతుల ఇమామ్ వెనుక కూడా తరావీ నమాజ్ చేశాను.

తరావీ నమాజ్‌లో ప్రతి నాలుగు రకాత్‌ల తర్వాత కాస్సేపు విశ్రాంతి తీసుకోవడం ప్రవక్త (స) సంప్రదాయం. ఈ విరామ సమయంలో దైవధ్యానం (జిక్ర్)గాని, నఫిల్ నమాజ్‌గాని చెయ్యవచ్చు. ఖుర్ఆన్ కూడా పఠించవచ్చు లేదా ఊరికనే మౌనంగా కూర్చోవచ్చు. ఈ విషయంలో ముఖ్తదీలు ఇమాంని అనుసరించనవసరం లేదు. దైవప్రవక్త (సల్లం) కాలంలో మౌనంగా కూర్చోవడానికి బదులు మక్కాలోని ప్రజలు కాబా ప్రదక్షిణ చేసేవారు; మదీనాలోని ప్రజలయితే నాలుగు రకాతుల నఫిల్ నమాజ్ చేసేవారు.

ఈనాడు కొన్నిచోట్ల ప్రతి నాలుగు రకాత్‌ల తరువాత ఖుర్ఆన్ అనువాదం విన్పించడం జరుగుతున్నది. ఇది చాలా మంచి విషయం. ఇలా ఖుర్ఆన్‌లో ఏముందో తెలుసుకోవడానికి ఓ చక్కని అవకాశం లభిస్తుంది. అరబీ భాష తెలిసినవారయితే తరావీహ్ నమాజ్‌లోనే ఖుర్ఆన్‌ని అర్థం చేసుకోవచ్చు.

రమజాన్ నెలలో తరావీహ్ నమాజ్‌లో కనీసం ఒకసారి మొత్తం ఖుర్ఆన్ గ్రంథాన్ని పఠించడం లేదా వినడం ప్రవక్త సంప్రదాయం. అందుకే మస్జిద్‌లలో ఈ నెల ప్రత్యేకంగా హాఫిజ్‌ల ఏర్పాటు జరుగుతుంది.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నమాజ్‌లో ఖుర్ఆన్‌ని ఆగి ఆగి నిదానంగా పఠించేవారు. ఈ విషయమయి హజ్రత్ అబూవాయిల్ (రహ్మలై) కథనం వినండి. ఆయన ఇలా అన్నారు:

ఒక వ్యక్తి హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) దగ్గరికి వచ్చి "నేను గతరాత్రి ఒక్క రకాత్‌లో 'ముఫస్సిల్' సూరాలన్నీ పఠించాను" అని అన్నాడు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఈమాట విని "ఏమిటీ నువ్వు కవుల మాదిరిగా వడివడిగా పఠిస్తున్నావా?" అని అడిగారు. ఆ తరువాత ఆయన 'నజాయిర్' సూరాలను గురించి నాకు బాగా తెలుసు. దైవప్రవక్త (సల్లం) వాటిని కలిపేసి (ఒక్కొక్క రకాతులో) పఠించేవారు" అని అన్నారు. ఆ సందర్భంలో ఆయన 'ముఫస్సిల్' సూరాలలో ఇరవై సూరాలను ప్రస్తావించి "వీటిలో దైవప్రవక్త (సల్లం) ప్రతి రకాతులో రెండేసి సూరాలు పఠించేవారు" అని తెలియజేశారు. (సహీబుఖారి, సహీముస్లిం)



ఖుర్ఆన్‌లోని ఫతహ్ సూరా నుంచి చివరి సూరా వరకున్న 66 సూరాలను "ముఫస్సిల్" సూరాలు అంటారు. పోతే సూక్తుల సంఖ్యారీత్యా పరస్పరం పోలిక వున్న పది జంట సూరాలను "నజాయిర్" సూరాలు అంటారు. ఇవి ఈ విధంగా ఉన్నాయి: (1) అర్రహ్మాన్-అన్నజ్మ్, (2) ఇఖ్తర్‌బత్-అల్‌హాఖ్ఖా, (3) జారియా-తూర్, (4) వాఖియా-నూన్, (5) సాలసాయిల్-నాజియాత్, (6) వైలుల్లిల్ ముతఫ్ఫిఫీన్-అబస, (7) ముదస్సిర్-ముజమ్మిల్, (8) హల్‌హతాక-లాఉఖ్సిమ్, (9) అమ్మయతసాలూన్-ముర్సలాత్, (10) ఇజష్షమ్సు కువ్విరత్- దుఖ్ఖాన్.

అయితే ఈనాడు కొన్ని మసీదుల్లో ఒకరాత్రి తరావీనమాజ్‌లో మూడేసి పారాలు (కాండాలు) చొప్పున పఠించడం జరుగుతోంది. అంతేకాదు, హైదరాబాద్ వంటి నగరాల్లోని మరికొన్ని మసీదుల్లో ప్రత్యేకంగా ఒకరాత్రి మొత్తం ఖుర్ఆన్ పఠించడం కూడా జరుగుతోంది. ఈ ధోరణి ప్రవక్త సంప్రదాయాలకే విరుద్ధం.

ఇక వేగం విషయానికి వస్తే దాదాపు అన్ని చోట్లా అనేక మసీదుల్లో హాఫిజ్‌లు గుక్క తిప్పుకోకుండా యమ స్పీడుతో ఖుర్ఆన్ పఠించడం మనకు తెలిసిందే. అంత వేగంగా పఠించే ఖుర్ఆన్ సూక్తుల్ని అరబీభాష నేర్చుకున్న పెద్ద పెద్ద పండితులు కూడా ఆ వేగంతో అర్థం చేసుకోలేరు. ఇక అరబీభాష రానివారి సంగతి చెప్పనవసరం లేదు. అలాంటి వారు కనీసం రమజాన్ నెలలో అయినా మొత్తం ఖుర్ఆన్ అనువాదాన్ని వ్యాఖ్యానంతో సహా చదివితే మంచిది.

ఆమాత్రం తీరిక లేనివారు తరావీ నమాజ్ తర్వాత ఖుర్ఆన్ అనువాదం విన్పించే ఏర్పాట్లు ఉండే మసీదులకు వెళ్ళి అయినా ఖుర్ఆన్ వింటే బాగుంటుంది.

# 53. ఉపవాస వ్రతాలు

"ఉపవాసకాలం రాత్రివేళల్లో మీరు మీ భార్యల దగ్గరకు పోవడం ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటివారు. మీరు (మీ భార్యల చెంతకు పోవడానికి సంకోచిస్తూ) ఆత్మద్రోహం చేసుకుంటున్న సంగతి దేవునికి తెలుసు. అందువల్ల ఆయన మిమ్మల్ని కనికరించి మీ పొరపాట్లు మన్నిస్తున్నాడు. ఇప్పుడిక మీరు మీభార్యలతో నిస్సంకోచంగా రాత్రులు గడపవచ్చు. దేవుడు మీకు ధర్మసమ్మతం చేసిన దాన్ని (దాంపత్య సుఖాన్ని) అనుభవించండి. మీరు (ఉపవాసకాలంలో) కడరేయి నలుపు (చీకటి) తగ్గి తొలిజాము తెలుపు (ఉషోదయ కాంతి) కనపడేవరకు హాయిగా తినండి, త్రాగండి. ఆతర్వాత (వీటన్నిటినీ త్యజించి) సూర్యాస్తమయమై చీకటిపడేవరకు ఉపవాసం పాటించాలి. అయితే మీరు మసీదుల్లో ఎతెకాఫ్ (తపోనిష్ఠ) పాటిస్తున్నప్పుడు మాత్రం మీ భార్యలను కలుసుకోకూడదు. ఇవి దేవుడు నిర్ణయించిన హద్దులు. వాటి దరిదాపులకు వెళ్ళకండి. ప్రజలు (పెడత్రోవ తొక్కకుండా) భయభక్తులతో మెలిగేందుకే దేవుడు ఈవిధంగా తన ఆదేశాలను విడమరచి తెలియజేస్తున్నాడు. (ఖుర్ఆన్-2:187)

దేహానికి దుస్తులకు మధ్య ఎలాంటి అవినావభావ సంబంధముంటుందో భార్యాభర్తల మధ్య కూడా అలాంటి సంబంధమే ఉందని, అందువల్ల రమజాన్ నెల రాత్రి వేళల్లో పురుషులు తమ భార్యాలను ఎలాంటి సంకోచం లేకుండా కలుసుకోవచ్చని దేవుడు తెలియజేస్తున్నాడు.

ఇక్కడ హద్దులు అతిక్రమించరాదని చెప్పలేదు; హద్దుల దరిదాపులకు వెళ్ళకండని చెప్పడం జరిగింది. అంటే హద్దులలోపే ఉండాలన్న మాట. హద్దులు దరిదాపులకు వెళ్తే ఆ తరువాత ఏదో ఒక రోజు వాటిని కూడా దాటిపోయి పాప పంకిలంలో పడే ప్రమాదం ఉంటుంది. ఏమైనప్పటికీ విశ్వాసి ఏ వ్యవహారంలోనైనా దేవుని విధేయతా పరిధిలో ఉన్నప్పుడే అతని విశ్వాసానికి దేవుని దృష్టిలో నిజమైన గుర్తింపు లభిస్తుంది.

కొన్ని దినాలలో ఉపవాసాలు పాటించడం ఇస్లాంలో నిషిద్ధం. దైవారాధన అంటే మన ఇష్టమొచ్చినప్పుడు ఇష్టమొచ్చిన విధంగా ప్రార్థనలు చేయడం, ఉపవాసాలు పాటించడం అని అర్థం కాదు. ఇస్లాంలో దైవారాధన అంటే దేవుని ఆజ్ఞల్ని శిరసావహించడమే. దేవుడు చేయమన్న సమయంలో చేయమన్న పనులు చేయడం; ఆయన వారించిన పనులు మానెయ్యడమే. ఇక్కడ విధేయతకు మారు పేరే ఆరాధన. నిషిద్ధ ఉపవాసాలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ఆదేశించారు:

"మీలో ఎవరూ రమజాన్‌కు ఒకటి రెండు రోజుల ముందు (నఫిల్) ఉపవాసం పాటించకూడదు. కాకపోతే ఎవరికైనా ఇంతకు పూర్వం నుంచే ఆ రోజు ఉపవాసం పాటించే అలవాటుంటే అలాంటి వ్యక్తి ఉపవాసం పాటించవచ్చు." (బుఖారి, ముస్లిం)

"(రమజాన్‌కు ముందు వచ్చే) షాబాన్ నెలలో సగం రోజులు గడచిన తరువాత (నఫిల్) ఉపవాసాలు పాటించకండి." (అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

పైరెండు హదీసులలో రమజాన్ ప్రారంభం కావడానికి ఒకటి రెండు రోజుల ముందు లేదా పదిహేను రోజుల ముందు ఉపవాసాలు పాటించవద్దని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు అంటే, ఈ నఫిల్ ఉపవాసాల వల్ల రమజాన్ నెలంతా పాటించవలసిన ఫరజ్ ఉపవాసాలు మనిషికి భారంగా పరిణమించవచ్చన్న ఉద్దేశమే ఈ ఆదేశంలో ఉంది. ఒకవేళ ఒకటి రెండు ఖజా రోజాలు ఏమైనా ఉంటే రమజాన్‌కు ముందు వాటిని పాటించవచ్చు. ఖజా రోజాలైనా రమజాన్ మాసం ప్రారంభం కావడానికి ముందే నెరవేర్చుకోవడం మంచిది. ఈవిధంగా మనిషి రమజాన్ నెల పొడుగూతా ఉపవాసాలు ఉత్సాహంగా పాటించడానికి ఆరోగ్యంరీత్యా సిద్ధంగా ఉండాలి.

కేవలం అనుమానంతో ఉపవాసం పాటించడం లేక వదిలేయడం ధర్మసమ్మతం కాదు. సాధారణంగా తొలిరోజు నెలవంక విషయంలో ఆకాశం మేఘావృతమై ఉన్నప్పుడు కొందరికి ఈరోజు ఉపవాసం పాటించాలా వద్దా లేక వదిలేయాలా కొనసాగించాలా



అని అనుమానం వస్తుంది. అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు అనుమానానికి గురికాకుండా గట్టి నమ్మకం ఉన్న పనే చేయాలి.

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞను తన మాటల్లో ఇలా వ్యక్తపరిచారు: "అనుమానాస్పదమైన రోజున ఉపవాసం పాటించినవాడు (దైవ ప్రవక్త) అబుల్‌ఖాసిం-సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల అవిధేయతకు పాల్పడిన వాడవుతాడు." (తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ)

# 54. ఆరు విధాల ఉపవాసాలు

సాధారణంగా రమజాన్‌లో తప్ప ఇతర దినాలలో పాటించే రోజాలన్నీ నఫిల్ రోజాల కిందికి వస్తాయి. అయితే కొన్ని ప్రత్యేక దినాలలో నఫిల్ రోజాలు పాటించడం ప్రవక్త సంప్రదాయం; మరికొన్ని ప్రత్యేక దినాలలో నఫిల్ రోజాలు నిషిద్ధం. ఇలాంటి ఉపవాసాలలో ఆరు విధాల ఉపవాసాలు ఉన్నాయి. వాటి వివరాలు, తత్సంబంధిత ఆదేశాలను గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**1. ఫరజ్ ఉపవాసాలు:-** ప్రతి సంవత్సరం రమజాన్ నెలంతా పాటించే ఉపవాసాలు 'ఫరజ్' ఉపవాసాలు. అంటే తప్పకుండా పాటించవలసిన ఉపవాసాలు అన్న మాట. రమజాన్ ఉపవాసాలు ఫరజ్ (తప్పనిసరి) కాదని తిరస్కరించిన వాడు ఇస్లాంలో కాఫిర్ (సత్యతిరస్కారి)గా పరిగణించబడతాడు. షరీఅత్ పరమైన కారణం ఏదీ లేకుండా రమజాన్ ఉపవాసాలు పాటించనివాడు చెడ్డవాడు (ఫాసిఖ్), ఘోరమైన పాపాత్ముడు అవుతాడు. అలాగే ఏమరుపాటుతో లేదా మరేదైనా కారణం వల్ల కొన్ని ఉపవాసాలు తప్పిపోతే వాటి "ఖజా రోజాలు" పాటించడం కూడా 'ఫరజ్' (తప్పనిసరి) అవుతుంది. ఖజా రోజాలు వీలయినంత త్వరగా పాటించాలి.

**2. వాజిబ్ ఉపవాసాలు:-** మొక్కుబడి (నజర్) ఉపవాసాలు, పాపపరిహారం (కప్ఫారా) ఉపవాసాలు పాటించడం 'వాజిబ్' (అనివార్యం) అవుతుంది. మొక్కుబడి కోసం ఫలానా రోజు ఉపవాసం పాటిస్తానని ఒక దినం నిర్ణయించుకుంటే ఆ నిర్ణీత దినానే ఉపవాసం పాటించాలి. రోజు నిర్ణయించుకోక పోతే ఎప్పుడయినా ఉపవాసం పాటించవచ్చు. అయితే ఈ మొక్కుబడి ఉపవాసాన్ని కూడా వీలయినంత త్వరగా పాటించాలి. అనవసరంగా ఆలస్యం చేయడం మంచి పద్ధతి కాదు.

**3. మస్నూన్ ఉపవాసాలు:-** దైవప్రవక్త (సల్లం) స్వయంగా పాటించి, ఇతరుల్ని పాటించమని పురమాయించిన ఉపవాసాలను సాంప్రదాయిక (మస్నూన్) ఉపవాసాలు అంటారు. వీటిని పాటించడంలో గొప్ప పుణ్యం ఉంది. అయితే పాటించకపోతే పాపం మాత్రం లేదు. మస్నూన్ ఉపవాసాలు ఇలా ఉన్నాయి:

❖ ముహర్రమ్ 9, 10 తేదీల (రెండు రోజులు) ఉపవాసాలు.

ముహర్రమ్ 10వ తేదీని "యౌమె ఆషురా" అంటారు. దైవప్రవక్త (సల్లం) ముహర్రం నెలలో ఆ ఒక్క రోజు మాత్రమే ఉపవాసం ఉండేవారు. ఆ తరువాత ఆయన తన అంత్యకాలంలో 9, 10 తేదీల రెండురోజులు ఉపవాసం పాటించాలని అన్నారు. వీటి వివరాలు, కారణాలు కూడా తెలుసుకోవడం అవసరమే.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: అజ్ఞాన కాలంలో ఖురైషీయులు ఆషురా రోజు ఉపవాసం ఉండేవారు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) కూడా ఆరోజు ఉపవాసం ఉండాలని ప్రజలను ఆదేశించారు. అయితే రమజాన్ ఉపవాసాలు ఫరజ్ (విధి) అయినప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆషురా రోజు ఉపవాసం గురించి ప్రస్తావిస్తూ "ఆషురా రోజు ఇష్టమున్నవాళ్ళు ఉపవాసం పాటించవచ్చు, ఇష్టంలేనివాళ్ళు దాని వదిలేయవచ్చు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మదీనాకు వలస వచ్చినప్పుడు ఆయన (మదీనాలో) ఆషురా రోజు ఉపవాసం పాటించడం చూశారు. అప్పుడు ఆయన "ఈ ఉపవాసం ఏమిటీ" అని అడిగారు. దానికి వారు సమాధానమిస్తూ "ఈరోజు సుదినం. ఈ దినమే దేవుడు హజ్రత్ మూసా (అలైహి)కు, ఆయన జాతి (ఇస్రాయీల్ సంతతి)కి విముక్తి కలిగించాడు; ఫిరౌన్‌ని, అతని జాతిని (నడిసముద్రంలో) ముంచివేశాడు. అందువల్ల హజ్రత్ మూసా (అలైహి) దేవుని పట్ల కృతజ్ఞతా పూర్వకంగా ఈరోజు ఉపవాసం పాటిస్తుండేవారు" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "అయితే మూసా (అలైహి) సంప్రదాయం ప్రకారం నడచు కోవడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం" అని అన్నారు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) అప్పటినుంచి 'ఆషురా ఉపవాసం' పాటించడం ప్రారంభించారు. ఇతరుల్ని కూడా ఆరోజు ఉపవాసం పాటించాలని ఆదేశించారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఓసారి ఆషురా రోజు ఉపవాసం పాటించినప్పుడు ప్రజలు ఆయనతో మాట్లాడుతూ "దైవప్రవక్తా! ఇది యూదులు, క్రైస్తవులు కూడా పవిత్రమైనదిగా భావిస్తున్న దినం. (ఇలాంటి దినాన మనం కూడా ఉపవాసం పాటించడం బాగుంటుందా?)" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నేను వచ్చే సంవత్సరం బ్రతికుంటే ముహర్రమ్ నెల తొమ్మిదో తేదీన కూడా ఉపవాసం పాటిస్తాను" అని అన్నారు. (ముస్లింషరీఫ్)

దీన్నిబట్టి ఈ విషయాన్ని ప్రజలు దైవప్రవక్త (సల్లం) జీవితపు చివరి రోజుల్లో ఆయన దృష్టికి తెచ్చారని తెలుస్తోంది. అంతకు పూర్వం దైవప్రవక్త (సల్లం) ఆషురా రోజు (ముహర్రం పదో తేదీన) ఉపవాసం పాటిస్తున్నప్పుడు ఈ విషయాన్ని ఎవరూ ఆయన దృష్టికి తీసుకురాలేదు. యూదులు, క్రైస్తవులు ఆషురా దినాన్ని పవిత్రమైన దినంగా పరిగణించారు; మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కూడా ఆ దినానికి



పవిత్రత ఆపాదించారు. దీనివల్ల ముస్లింలు తమను అనుకరిస్తున్నారని యూదులు, క్రైస్తవులు చెప్పుకోవచ్చని కొందరు ముస్లింలు భావించారు. అందువల్లనే బహుశా వారు ఆ తరువాత మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) జీవితపు అంత్యదశలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అప్పుడు మహాప్రవక్త (సల్లం) పై హదీసులో పేర్కొన్నట్లు ముహర్రమ్ పదో తేదీతో పాటు తొమ్మిదో తేదీ కూడా కలిపి రెండు రోజులు ఉపవాసం పాటిస్తానని అన్నారు.

ఈ వివరణను బట్టి ముస్లింలు ముహర్రం నెలలో ఒక్క పదో తేదీన మాత్రమే ఉపవాసం పాటించకూడదని, దానికి మరోరోజు కలిపి రెండు రోజులు ఉపవాసం పాటించాలని తెలుస్తోంది. పదో తేదీకి తొమ్మిదో తేదీ మాత్రమే కలపనవసరం లేదు. పదోతేదీకి పదకొండో తేదీ కూడా కలపి రెండురోజులు ఉపవాసం ఉండవచ్చు.

❖ జిల్‌హజ్జ తొమ్మిదవ తేదీ (అర్ఫా రోజు) ఉపవాసం.

ఈ ఉపవాసం జిల్‌హజ్జ తొమ్మిదవ తేదీన హజ్‌యాత్రలో లేనివారు మాత్రమే పాటించవచ్చు. హజ్‌నియమాలు పాటించే హజ్‌యాత్రికులు పాటించకూడదు.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అర్ఫారోజు పాటించే ఉపవాసానికి లభించే పుణ్యఫలం వేయిరోజుల ఉపవాసాల పుణ్యఫలానికి సమానం." (అత్తర్గీబ్)

హజ్రత్ ఉమ్ముల్ ఫజల్ బిన్త్ హారిస్ (రజి) కథనం:- నా ముందు అర్ఫారోజు ఉపవాసం గురించి కొందరు వాదించుకోసాగారు. వారిలో కొందరు దైవప్రవక్త (సల్లం) ఉపవాసంతో ఉన్నారని భావిస్తుంటే, మరికొందరు ఉపవాసంతో లేరని భావిస్తున్నారు. నేనప్పుడు (నిజం తెలుసుకోవడానికి) దైవప్రవక్త (స) సన్నిధికి ఓ పాలగిన్నె పంపాను. ఆ సమయంలో ఆయన అరఫాత్ మైదానంలో ఒంటె మీద కూర్చొని ఉన్నారు. నేను పంపిన పాలగిన్నెను ఆయన తీసుకొని పాలు తాగారు." (బుఖారి, ముస్లిం)

❖ ప్రతి నెలా (అయ్యామె బైజ్) 13, 14, 15 తేదీల ఉపవాసాలు.

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఉల్లేఖనం:- దైవప్రవక్త (సల్లం) నాకు హితోప దేశం చేస్తూ "అబూజర్! నీవు ప్రతినెలా మూడు రోజులు ఉపవాసం పాటించదలచు కుంటే 13, 14, 15 తేదీలలో పాటిస్తూవుండు" అని అన్నారు. (తిర్మిజి, నసాయి)

హజ్రత్ ముఆజతల్ అదవియ్యా (రజి) కథనం:- నేను హజ్రత్ ఆయిషా (రజి) తో మాట్లాడుతూ "దైవప్రవక్త (స) ప్రతి నెలా మూడు రోజులు ఉపవాసం పాటించే వారా?" అని అడిగాను. దానికామె ఔనన్నారు. నేను మళ్ళీ "అయితే దైవప్రవక్త (స) ప్రతినెలా ఏఏ తేదీలలో మూడు రోజులు ఉపవాసం పాటించేవారు?" అని అడిగాను. దానికామె సమాధానమిస్తూ "దైవప్రవక్త (స) నెలలో మూడు రోజులు ఏఏ తేదీలలో ఉపవాసం ఉండాలనే విషయం గురించి పట్టించుకునేవారు కాదు." (ముస్లిం)

**4. నఫిల్ ఉపవాసాలు:-** ఫరజ్, వాజిబ్, మస్నూన్ ఉపవాసాలు తప్ప మిగిలిన ఉపవాసాలన్నీ నఫిల్ రోజాలుగా పరిగణించబడతాయి. వీటిని పాటించడం వాంఛనీయం (ముస్తహబ్). వీటిలో కూడా కొన్ని గొప్ప పుణ్యఫలం తెచ్చే ఉపవాసాలు ఉన్నాయి. ఉదాహరణకు ఈ క్రింది ఉపవాసాలు చూడండి:

- షవ్వాల్ నెలకు చెందిన 6 రోజుల ఉపవాసాలు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "రమజాన్ ఉపవాసాలాతో పాటు ఎవరైతే షవ్వాల్ నెలలో ఆరురోజుల ఉపవాసాలు కూడా పాటిస్తాడో అతడ్ని ఈరోజే అతనితల్లి కన్నదా అన్నట్లు అతను పరమ పవిత్రుడయి పోతాడు." (ముస్లిం, అబూదావూద్)

హజ్రత్ అయ్యూబ్ అన్సారి (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "రమజాన్ ఉపవాసాలన్నిటితో పాటు ఎవరైతే షవ్వాల్ నెలలో ఆరు రోజుల ఉపవాసాలు కూడా పాటిస్తాడో అతను ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటిస్తున్న వాడవుతాడు." (ముస్లిం)

హజ్రత్ ముస్లిం ఖురైషీ (రజి) కథనం ప్రకారం "సాయిముద్దహర్" (ఎల్లప్పుడూ ఉపవాసం పాటించడం) గురించి అడిగిన ప్రశ్నకు దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధాన మిచ్చారు: "నీపై నీ భార్యాపిల్లల హక్కు కూడా ఉంది. కనుక రమజాన్ ఉపవాసా లతో పాటు ఆ తరువాయి (షవ్వాల్) నెలలోని (ఆరు రోజుల) ఉపవాసాలు కూడా పాటిస్తూవుండు. అంతేగాకుండా బుధవారం, గురువారం కూడా ఉపవాసం పాటిస్తూ ఉండు. ఈవిధంగా నీవు ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటించేవాడిగా పరిగణించ బడతావు." (అబూదావూద్, తిర్మిజి)

- సోమవారం, గురువారం ఉండే ఉపవాసాలు.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ఉప దేశించారు: "సోమ, గురువారాలలో కర్మలు (విశ్వప్రభువు ముందు) సమర్పించ బడతాయి. అందువల్ల నేను ఉపవాసం పాటిస్తున్న స్థితిలో నా కర్మలు సమర్పించ బడాలని నేను కోరుకుంటున్నాను." (తిర్మిజి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) ప్రతి సోమవారం, ప్రతి గురువారం ఉపవాసం పాటిస్తుండేవారు." (తిర్మిజి, నసాయి)

- కేవలం దైవప్రసన్నత కోసం ఒకరోజు ఉండే ఉపవాసం.

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం:- "కేవలం దైవప్రసన్నత కోసం ఎవరైనా ఒక రోజు ఉపవాసం పాటిస్తే దేవుడు అతడ్ని నరకం నుండి చాలా దూరం ఉంచుతాడు. ఒక కాకి పుట్టిన దగ్గర్నుంచి ముసలిదయి చచ్చిపోయేదాకా ఎంత దూరం ఎగిరి పోతుందో అంత దూరం ఉంచుతాడు." (అహ్మద్, బైహఖి)



- జిల్‌హజ్ నెల మొదటి దశకంలోని 8 రోజులు ఉండే ఉపవాసాలు.

అర్ఫారోజుకు ముందుండే ఎనిమిది రోజులలో పాటించే ఉపవాసానికి కూడా గొప్ప పుణ్యఫలం ఉంది. ఈ విషయం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"మనిషి ఇతర దినాలలో చేసే దైవారాధన కంటే జిల్‌హజ్ మొదటి దశకంలో చేసే దైవారాధన దేవునికి ఎంతో ప్రియమైనది. ఆ దశకంలో ప్రతిరోజా పాటించే ఉపవాసం సంవత్సరమంతా పాటించే ఉపవాసాలకు సమానమవుతుంది. ఆ దశకం లోని ప్రతిరాత్రీ చేసే నఫిల్ నమాజ్ మహాశుభరాత్రి (లైలతుల్‌ఖదర్)న చేసే నఫిల్ నమాజులకు సమానమవుతుంది." (ఆసాన్ ఫిఖ్హా, రెండవ భాగం)

**5. హరాం ఉపవాసాలు:-** అంటే నిషిద్ధ ఉపవాసాలు. ఈ దిగువన పేర్కొన్న దినాలలో ఉపవాసం పాటించడం హరాం (నిషిద్ధం):

- ఈదుల్ ఫితర్ (రమజాన్ పండుగ) నాడు పాటించే ఉపవాసం.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని ఈదుల్ ఫితర్ (రమజాన్ పండుగ) నాడు ఉపవాసం పాటించకూడదని వారించారు." (బుఖారి, ముస్లిం)

- ఈదుల్ అజ్హా (బక్రీద్ పండుగ) నాడు పాటించే ఉపవాసం.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఈదుల్ ఫితర్, ఈదుల్ అజ్హా (రమజాన్, బక్రీద్ పండుగల) రోజుల్లో ఎలాంటి ఉపవాసాలు లేవు." (బుఖారి, ముస్లిం)

- అయ్యామె తష్రీఖ్ (జిల్‌హజ్జ 11, 12, 13 తేదీల) ఉపవాసాలు.

హజ్రత్ నుబైషా హుజలీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "అయ్యామె తష్రీఖ్ (జిల్‌హజ్జ 11,12,13 తేదీలు) తినే, త్రాగే, దైవాన్ని స్మరించే రోజులు." (ముస్లిం). అంటే ఆ మూడురోజులు రోజా ఉండకూడదు.

**6. మక్రూహ్ ఉపవాసాలు:-** అంటే అవాంఛనీయమైన ఉపవాసాలు. కొందరు ఏదో ఒక రోజు నిర్ణయించుకొని ఎల్లప్పుడూ ఆ నిర్ణీత దినాన క్రమతప్ప కుండా ఉపవాసం పాటిస్తారు. ఇది మంచి పద్ధతి కాదు. దైవప్రవక్త (స) ఆదేశించిన, పురమాయించిన, సూచించిన దినాలలో మాత్రమే ఉపవాసం పాటించాలి. ఇవి అవాంఛనీయమైన ఉపవాసాలు. ఉదాహరణకు క్రింద చూడండి:

- కేవలం శనివారం లేక ఆదివారం నాడు ఉపవాసం పాటించడం.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "శనివారం నాడు ఫరజ్ (విధిగా) పాటించవలసిన ఉపవాసం ఏదైనా వస్తే తప్ప (సాధారణ పరిస్థితుల్లో) ఆరోజు

ఉపవాసం పాటించకండి. ఒకవేళ ఎవరైనా పొరపాటున శనివారం ఉపవాసం ఉంటే అలాంటి వ్యక్తి కనీసం ద్రాక్షపండు తొక్కగాని లేదా ఏదైనా చెట్టుబెరడుగాని నమలి ఉపవాసభంగం చేయాలి." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) నఫిల్ ఉపవాసాలలో సాధారణంగా శని, ఆదివారాల ఉపవాసాలు పాటించేవారు. వాటిని గురించి ఆయన ఇలా చెబుతుండేవారు: "ఇవి బహుదైవారాధకుల (అంటే యూదులు, క్రైస్తవుల) పండుగ దినాలు. అందువల్ల నేను (ఒకేసారి రెండురోజులు) ఉపవాసం పాటించడం ద్వారా) వారికి వ్యతిరేకంగా ఆచరించదలిచాను." (అహ్మద్)

✶ కేవలం ముహర్రం పదో తేదీన ఒక రోజు ఉపవాసం పాటించడం.

ముహర్రమ్ 10వ తేదీని "యౌమె ఆషురా" అంటారు. దైవప్రవక్త (సల్లం) ముహర్రం నెలలో ఆ ఒక్క రోజు మాత్రమే ఉపవాసం ఉండేవారు. ఆ తరువాత ఆయన తన అంత్యకాలంలో 9, 10 తేదీల రెండురోజులు ఉపవాసం పాటించాలని అన్నారు. (మస్నూన్ ఉపవాసాల శీర్షికలో దీని ప్రస్తావన వచ్చింది, చూడండి.)

✶ కేవలం శుక్రవారం నాడు ఉపవాసం పాటించడం.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "మీలో ఎవరూ (కేవలం) శుక్రవారం నాడు ఉపవాసం పాటించకూడదు. కాకపోతే దానికి ముందుగాని తరువాతగాని ఒకరోజు కలుపుకొని (రెండు రోజులు) ఉపవాసం పాటించవచ్చు." (ముత్తఫఖున్ అలై)

✶ స్త్రీ తన భర్త అనుమతి లేకుండా నఫిల్ ఉపవాసం పాటించడం.

స్త్రీలు రమజాన్ ఉపవాసాలు తప్ప మరే ఉపవాసమైనా తమ భర్తల అనుమతి లేకుండా ఉండకూడదు. ఒకవేళ ఏ స్త్రీ అయినా అలా ఉపవాసం ఉన్నప్పుడు ఉపవాసభంగం చేయమని భర్త ఆజ్ఞాపిస్తే ఆమె ఉపవాసభంగం చేయవలసి ఉంటుంది. దాని ఖజాఉపవాసం కూడా ఆమె భర్త అనుమతితోనే ఉండవలసి ఉంటుంది.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "స్త్రీ తన భర్త ఇంట్లో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా (నఫిల్) ఉపవాసం పాటించడం ధర్మసమ్మతం కాదు. అలాగే స్త్రీ తన భర్త అనుమతి లేకుండా ఏ వ్యక్తినీ తన ఇంట్లోకి రానివ్వకూడదు." (ముస్లిం)

హజ్రత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం: ఓరోజు మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉంటే ఒక స్త్రీ వచ్చి తన బాధామయ గాధను ఇలా ఏకరువు పెట్టింది- "దైవప్రవక్తా! నా భర్త సుఫ్వాన్ బిన్ ముఅత్తల్ నమాజు చేస్తున్నందుకు నన్ను కొడ్తున్నారు. ఆయనేమో పొద్దెక్కిన తరువాత లేచి నమాజు చేస్తారు. నేనెప్పుడైనా ఉపవాసం పాటిస్తే



ఉపవాసం పాటించవద్దని వారిస్తున్నారు."

ఈ ఆరోపణలు చేస్తున్నప్పుడు ఆమె భర్త సుఫ్వాన్ అక్కడే కూర్చొని ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) విషయం ఏమిటని అడిగితే హజ్రత్ సుఫ్వాన్ "ఈమె నమాజులో సుదీర్ఘమైన రెండు సూరాలు పఠిస్తుంది. అంత పెద్ద సూరాలు పఠించవద్దని మాత్రమే నేను చెప్పాను" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "నువ్వు ఒక్క సూరా పఠించినా సరిపోతుంది" అని చెప్పారు ఆ స్త్రీకి.

ఆ తరువాత సుఫ్వాన్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! నేనీమె ఉపవాసాలను నిరోధిస్తున్నానని ఆరోపిస్తోంది. కాని ఈవిడ నఫిల్ (ఐచ్ఛిక) ఉపవాసాలు పాటించడం మొదలెడితే వాటినిక విరమించకుండా రోజుల తరబడి అలా పాటిస్తూనే ఉంటుంది. కాని, నేనేమో యువకుడ్ని, నిగ్రహించుకోలేక పోతున్నాను" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి విని "భర్త అనుమతి లేకుండా ఏ స్త్రీ కూడా నఫిల్ ఉపవాసాలు పాటించకూడదు" అని ఆదేశించారు.

సుఫ్వాన్ (రజి) మూడో ఆరోపణకు సంజాయిషీ ఇస్తూ "దైవప్రవక్తా! మేము కష్టజీవులం. పొద్దుపొడవనిదే నిద్రలేవని వంశస్థులుగా పేరుపడ్డాం" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "సరే సుఫ్వాన్! నిద్ర నుంచి మేల్కోగానే నమాజ్ చేస్తుండు" అని ఉపదేశించారు.

✶ నిర్విరామంగా అనేకరోజులు ఉపవాసం పాటించడం. ఇలాంటి ఉపవాసాలను "సౌమె విసాల్" అంటారు. వీటిని పాటించడానికి దైవప్రవక్త (సల్లం)కు మాత్రమే అనుమతి ఉంది, మరెవరికీ లేదు.

# 55. సైరన్‌కూతతో సహ్రీ ఆరంభం

ఈరోజు ఆకాశంలో నక్షత్రాలు దేదీప్యమానంగా మెరిసిపోతున్నాయి. ముస్లిం మహిళలు ఆదరాబాదరాగా లేచి వంటపని హడావిడిలో లీనమయి పోయారు. పిల్ల తారలు ఒక్కొక్కటే కనుమరుగయి పోతున్నాయి. ఇప్పుడు జనానికి కోడికూతలతో పని లేదు, సైరన్‌లు ఉన్నాయి కదా! సైరన్‌లు లేని చోట అలారం గడియారాలు ఎటూ ఉంటాయి. హైదరాబాద్ పాతబస్తీ సంగతైతే చెప్పనవసరం లేదు. సైరన్ మోతలతో ప్రజలు దిగ్గున లేచి కూర్చుంటున్నారు.

"ఇంకా కూర్చున్నారేమిటండీ! నిద్రమత్తు వదల్లేదా? తొందరగా ముహం కడుక్కొని రండి, దస్తర్‌ఖాన్ మీద భోజనం సిద్ధంగా ఉంది."

"గుయ్‌య్..." మరో సైరన్ మోతతో మా సందేశభవనం దద్దరిల్లింది.

"తొంతరగా రండి, సహ్రీ ముగించడానికి ఇంకా పదిహేను నిమిషాలే ఉన్నాయి."

"ఆ... వస్తున్నా." మా ఆవిడ ఓరల్ సైరన్‌తో నేను గబగబా ముహం కడుక్కొని దస్తర్‌ఖాన్ ముందుకొచ్చి కూర్చున్నాను.

'సహ్‌రీ' అనగానే సహ్‌రీకీ సంబంధించి ప్రవక్త ప్రవచనాలు గుర్తుకొచ్చాయి.

"సహ్‌రీ (భోజనం) చేయండి. సహ్‌రీ చేయడంలో శుభం ఉంది" అన్నారు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం)- (బుఖారి, ముస్లిం)

"సహ్‌రీ భోజనంలో ఎంతో శుభం ఉంది. కనుక సహ్‌రీ చేయడం ఎన్నటికీ వదలి పెట్టకండి. గుక్కెడు నీళ్ళతోనైనా సరే సహ్‌రీ చేయండి. సహ్‌రీ ఆహారం తినే వారిపై దైవకారుణ్యం వర్షిస్తుంది, వారి కోసం దైవదూతలు పాపమన్నింపు ప్రార్థన చేస్తారు" అన్నారు దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో. (అత్తర్గీబ్)

నేను సహ్‌రీ చేయడం ఇంకా ముగించనే లేదు, అటు మస్జిద్ నుండి సైరన్ మోత మరొకసారి మా శ్రీమతిని హడలగొట్టింది.

దాంతో ఆమె చిరెత్తిపోయి "విన్నారా! సహ్‌రీ వేళ అయిపోయిందని సైరన్ మోగింది? మీరెప్పుడూ ఇంతే, తొందరగా కానివ్వండీ!" అన్నది ఓరల్‌సైరన్‌తో.

"ఎప్పుడో ఒకసారి కాస్తంత ఆలస్యమయితే 'మీరెప్పుడూ ఇంతే' అంటేవేమిటీ? ఇలాంటి సందర్భంలో ఏం చేయాలో మన ప్రియప్రవక్త (సల్లం) ఏమన్నారో తెలుసా?" అన్నా నేను భోజనం ముగించి చెయ్యి కడుక్కుంటూ.

"ఏమన్నారేవిటీ?" నిలదీసింది మా శ్రీమతి.

దైవప్రవక్త (సల్లం) తమ అనుచరులతో మాట్లాడుతూ "మీలో ఎవరైనా అజాన్ విన్నప్పుడు అతని ముందు కంచంలో అన్నం ఇంకా మిగిలివుంటే, అతనా అన్నం తినే దాకా కంచం వదలి లేవకూడదు" అని అన్నారు. (అబూదావూద్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "(రమజాన్ నెలలో) బిలాల్ (రజి) (అర్థ)రాత్రి వేళ ఇంకా ఉండగానే అజాన్ ఇస్తుంటారు. అందువల్ల మీరు (ఆయన అజాన్ గురించి పట్టించుకోకుండా) ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) తిరిగి అజాన్ ఇచ్చే వరకు నిరభ్యంత రంగా (సహ్‌రీ) తినవచ్చు, తాగవచ్చు." (బుఖారి, ముస్లిం)

అంతేకాదు "మూడు విషయాలు ప్రవక్తల లక్షణాల్లాంటివి. అవి: 1- సహ్‌రీ ఆలస్యంగా తినడం, 2- ఇఫ్తార్ తొందరగా చేయడం, 3- నమాజ్‌లో ఎడమ చేతిపై కుడిచేయి పెట్టుకోవడం" అని కూడా దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (ఆసాన్‌ఫిఖ్హా)

సహ్‌రీ చేస్తున్నప్పుడు సైరన్ మోత విన్పించి రెండు మూడు నిమిషాలు గడచి నంత మాత్రాన కొంపలేమీ అంటుకోవు. సహ్‌రీ వేళకు గీటురాయి సైరన్ కాదు, ఖుర్‌ఆన్‌లో మన సృష్టికర్త ఇచ్చిన ఆదేశమే అసలైన గీటురాయి.



"మీరు (ఉపవాసకాలంలో) కడరేయి నలుపు (చీకటి) తగ్గి తొలిజాము తెలుపు (ఉషోదయ కాంతి) కనపడేవరకు హాయిగా తినండి, త్రాగండి. ఆతర్వాత (వీటన్నిటినీ త్యజించి) సూర్యాస్తమయమై చీకటిపడేవరకు ఉపవాసం పాటించాలి." (2:187)

హజ్రత్ అద్దీ బిన్ హాతిం (రజి) పై సూక్తి విషయంలో తన అనుభవాన్ని ఇలా తెలియజేశారు: "(ఖుర్‌ఆన్‌లో) 'నడిరేయి నలుపు తగ్గి తొలి జాము తెలుపు దారం కనబడే వరకు' (2:187) అనే సూక్తి అవతరించినప్పుడు నేను ఒక నల్ల దారం, ఒక తెల్ల దారం తీసుకొని తలగడ క్రింద పెట్టుకున్నాను. కాని రాత్రివేళ చీకటిలో చూస్తే అవి నాకు కన్పించలేదు. ఉదయం కాగానే నేను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి విషయం తెలిపాను. దైవప్రవక్త (స) అది విని 'వాటి అర్థం రాత్రి నలుపు, పగటి తెలుపు అని గ్రహించాలి (దారాలు కాదు)' అని అన్నారు." (బుఖారి)

హజ్రత్ సహెల్ బిన్ సాద్ (రజి) కథనం: "వకులూ వష్రబూ హత్తాయత బయ్యన లకుముల్ ఖైతుల్ అబ్‌యజుమినల్ ఖైతిల్ అస్వది' అనే సూక్తి (2:187) అవతరించింది. 'మినల్ ఫజ్ర్' ఇంకా అవతరించలేదు. అప్పుడు (మాలో) కొందరు ఉపవాసం ఉండేం దుకు (సహ్‌రీ వేళ తెలుసుకునేందుకు) తమ కాళ్ళకు ఒక నల్లదారం, ఒక తెల్లదారం కట్టుకొని ఆ దారాలు స్పష్టంగా కన్పించే వరకు (రాత్రివేళ నిస్సంకోచంగా) తింటూ ఉండేవారు. తరువాత దేవుడు 'మినల్ ఫజ్ర్' సూక్తి అవతరింపజేశాడు. దాంతో వారికి ఈ సూక్తి అర్థం పగలు-రేయి అని తెలిసింది." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఒకసారి ఇలా అన్నారు: "మన ఉపవాసాలకు, గ్రంథప్రజల (యూదులు, క్రైస్తవుల) ఉపవాసాలకు తేడా సహ్‌రీ భోజనమే." (ముస్లిం)

గ్రంథప్రజలు సహ్‌రీ చేయకుండా పరగడుపుతో ఉపవాసం ఉంటారు. ముస్లింలు సహ్‌రీ చేసిన తరువాతే ఉపవాసం ప్రారంభిస్తారు. గ్రంథప్రజలు తమనుతాము కష్ట పెట్టుకోవడమే ఉపవాస లక్ష్యమని భావిస్తారు. ఇస్లాంలో ఆకలిదప్పులతో మనిషిని బాధపెట్టడం ఉపవాస లక్ష్యం కాదు. ఇక్కడ మనిషికి దేవుని ఆజ్ఞల్ని పాటించే అలవాటు చేసి తద్వారా ఆయన సాన్నిధ్యం పొందడమే ఉపవాస లక్ష్యం.

గ్రంథప్రజలు, ముఖ్యంగా క్రైస్తవులు దైవసాన్నిధ్యం పొందడానికి దేవుడు ఆజ్ఞపించ నటువంటి ఎన్నో కష్టాలు, కడగండ్లు పైన వేసుకున్నారు. ఉదాహరణకు ఈ క్రింది సూక్తులు చూడండి:

"వారందరి తరువాత మర్యం కుమారుడు ఈసాను పంపి, అతనికి ఇన్జీల్ ప్రసా దించాము. అతడ్ని అనుసరించినవారి హృదయాలలో మేము దయా, సానుభూతులు కలిగించాము. అయితే వైరాగ్యాన్ని వారు స్వయంగా సృష్టించుకున్నారు. మేము దాన్ని వారికి విధిగా చేయలేదు. దైవప్రసన్నత కోసం వారీ కొత్త సంప్రదాయం ప్రారంభించారు. సరే దానికైనా కట్టుబడి ఉన్నారా అంటే అదీలేదు. వారిలో (సత్యాన్ని) విశ్వసించినవారికి

మేము తగిన ప్రతిఫలం ప్రసాదించాము. కాని చాలామంది దుర్జనులైపోయారు.” (ఖుర్ఆన్-57:26,27)

(వివరాలకు ‘ఖుర్ఆన్ భావామృతం’లో ఈ సూక్తికి రాసిన వ్యాఖ్యానం చూడండి.)

ఒకసారి ముగ్గురు సహాబీలు ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ద్వారా దైవప్రవక్త (సల్లం) ఆరాధనలను గురించి విన్న తరువాత వారిలో ఒకతను తానిక నుంచి ఎల్లప్పుడూ రాత్రంతా నమాజులో గడుపుతానని నిశ్చయించుకున్నాడు. మరొకతను తాను ఎల్లప్పుడూ ఉపవాసవ్రతం పాటిస్తానని, ఒక్కరోజు కూడా విడిచి పెట్టనని అన్నాడు. వేరొకడు తానసలు వివాహమే చేసుకోనని, స్త్రీలతో ఎలాంటి సంబంధం పెట్టుకోనని నిర్ణయించుకున్నాడు.

దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి తెలుసుకొని “మీరేనా ఈ మాటలు అంటున్నది? దైవసాక్షి! నేను మీ అందరిలో కెల్లా దేవునికి ఎక్కువగా భయపడేవాడ్ని. అయినా నేను కొన్నాళ్ళు ఉపవాసం ఉంటే, కొన్నాళ్ళు ఉపవాసం లేకుండా గడుపుతున్నాను. రాత్రి వేళల్లో ప్రార్థన కూడా చేస్తాను, నిద్ర కూడా పోతాను. అలాగే స్త్రీలను వివాహమాడి దాంపత్య జీవితం కూడా గడుపుతాను. కనుక నాసంప్రదాయాలు పాటించనివారితో నాకెలాంటి సంబంధం లేదు” అని హెచ్చరించారు. (బుఖారి, ముస్లిం)

‘సహ్రీ అంటే మనం రోజూ తినే ఆహారం లాంటిదే కదా! కాకపోతే ఈ ఆహారం ఉషోదయానికి ముందు తినాలి, అంతేగా!’ అనుకుంటారు కొందరు. కాని ఇదెంతో శుభవంతమైన ఆహారం.

హజ్రత్ ఇర్బాజ్ బిన్ సారియా (రజి) కథనం: “ఒక సారి దైవప్రవక్త (సల్లం) తనతో పాటు సహ్రీ చేయడానికి నన్ను పిలుస్తూ ‘శుభవంతమైన (సహ్రీ) భోజనం చేయడానికి వచ్చెయ్యి’ అన్నారు.” (అబూదావూద్, నసాయి)

సహ్రీలో మంచి ఆహారం ఏమవుతుంది? మన దృష్టిలో రుచికరమైన పదార్థాలే మంచి ఆహారం. కాని మన ప్రియప్రవక్త (సల్లం) దృష్టిలో మాత్రం ఖర్జూర పండ్లు అత్యంత శ్రేష్ఠమైన ఆహారం. ఆయన ఇలా అన్నారు:

“విశ్వాసికి ఖర్జూరపండ్లు అత్యంత శ్రేష్ఠమైన సహ్రీ (ఆహారం).” (అబూదావూద్)

ఖర్జూర పండ్లలో మానవుని ఆహారపు అవసరాలన్నీ సమకూర్చే సామర్థ్యం ఉంది. మనిషికి ఖర్జూర పండ్లు తప్ప మరే ఆహార పదార్థాలు లభించకపోతే ఆ పండ్లే అతనికి చాలు. వాటిలోనే కావలసిన పోషక పదార్థాలన్నీ ఉన్నాయి.

సైంటిస్టుల పరిశోధన ప్రకారం మానవునికి తన శక్తిసామర్థ్యాలు కాపాడుకోవడానికి ఎన్ని కేలరీల ఆహారం కావాలో అన్ని కేలరీలు ఖర్జూర పండ్లలో ఉన్నాయి. ఈ కారణంగానే ఈనాడు ఏదైనా సైన్యం ఎడారి ప్రాంతంలో సుదీర్ఘకాలం ఉండవలసి



వచ్చినప్పుడు సాధారణ ఆహార పదార్థాల సరఫరాకు సత్వర అవకాశాలులేని పక్షంలో సైనికులకు ఖర్జూర పండ్లు సరఫరా చేయడం జరుగుతోంది. ఈవిధంగా నెలల తరబడి కేవలం ఖర్జూర పండ్లతో గడిపినా వారి శక్తి సన్నగిల్లదు.

ఉపవాసికి సహ్రీలో మామూలుగా తినే ఆహారం కడుపునిండా లభించకపోతే, అసలేమీ లభించకపోయినా కొన్ని ఖర్జూర పండ్లు తింటే చాలు, పగలంతా ఏమాత్రం ఢీలా పడిపోకుండా తన దైనందిన పనులు యధాప్రకారం చేసుకోగలుగుతాడు.

సరే సైరన్ మోగింది, సహ్రీ ముగిసింది. దాంతో మన ఉపవాసవ్రతం మొదలయింది. రమజాన్ ఉపవాసవ్రతం కోసం సంకల్పం ఎంతో అవసరం. ఈ రోజు నేను రమజాన్ ఉపవాసం పాటిస్తున్నానని సంకల్పించుకొని వేకువజాము నుంచి ఉపవాసవ్రతం ప్రారంభించాలి. ప్రతిరోజూ ఉపవాసం ప్రారంభించినప్పుడల్లా ఈవిధంగా సంకల్పించుకోవాలి:

“నవైతు బిసౌమిల్ యౌమ మిన్షహ్రి రమజాన్.” (అర్థం:- నేను రమజాన్ నెలకు చెందిన ఈ రోజు ఉపవాసం పాటిస్తున్నాను.)

సంకల్పం అసలు హృదయానికి సంబంధించిన విషయం. నోటితో ఇలా పలకనవసరం లేదు. ఒకవేళ నోటితో పలికినా తప్పులేదు. మొత్తం మీద సంకల్పం చాలా అవసరం. సహ్రీ వేళలో సంకల్పం మరచిపోతే మధ్యాహ్నం 12 గంటల లోపైనా సంకల్పం చేసుకోవాలి.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “ఎవరైనా ఫజర్ వేళకు ముందే ఉపవాసం ఉంటానని నిర్ణయించుకోకపోతే అతని ఉపవాసం ఉపవాసం కాజాలదు.” (తిర్మిజి)

రమజాన్ నెలలో పనులన్నీ వాటి నిర్ణీత సమయాల్లోనే నెరవేర్చాలి. దీని వల్ల మనిషి క్రమశిక్షణకు అలవాటుపడే అవకాశం కూడా ఉంది. రాత్రుళ్ళలో అనసరంగా పొద్దుపోయేదాకా జాగరణచేసి సహ్రీ వేళకు లేవకపోవడం చాలా చెడ్డ విషయం. కొందరు గాఢంగా నిద్రపట్టడం వల్ల సహ్రీ వేళ దాటిపోయాక లేచి “అయ్యయ్యో! సహ్రీ వేళ దాటిపోయిందే, ఇక భోజనం చేయకుండా ఉపవాసం ఎలా ఉండగలుగుతాం?” అని భావించి ఆ రోజు ఉపవాసమే మానేస్తారు. ఇది కూడా మంచి విషయం కాదు. పిరికితనం, పాపకార్యం కూడా అవుతుంది.

సహ్రీ వేళ దాటిపోయి తీరిగ్గా భోజనం చేసేటంత సమయం లేకపోతే, రెండు మూడు ఖర్జూర పండ్లు తిని ఉపవాసం ఉండాలి లేదా ఓ గ్లాసెడు మంచినీళ్ళు తాగాలి. అజాన్ విన్పించి ఉషోదయం కూడా దాటిపోయిన తరువాత మేల్కొంటే గుక్కెడు మంచినీళ్ళు కూడా తాగడానికి వీల్లేదు. పరగడుపుతోనే ఉపవాసం పాటించవలసి ఉంటుంది. ఉపవాసం పాటించకపోతే తన కర్మల చిట్టాలో పాపాన్ని జమ చేసుకోవలసి ఉంటుంది.

# 56. రోజా నుండి మినహాయించబడినవారు

ఇస్లాం ధర్మశాస్త్రం (షరీఅత్) రమజాన్ ఉపవాసాల నుండి కొందరిని మినహాయించింది. వారిలో కొందరిని ఉపవాసం ఉండరాదని నిషేధించింది. మరికొందరిని ఉపవాసం పాటించకుండా ఉండేందుకు అనుమతించింది.

శక్తి, స్పృహ కలిగిన ప్రతి ముస్లిం రమజాన్ ఉపవాసాలు విధిగా పాటించవలసి ఉంటుంది. బహిష్టు అయిన, ప్రసూతి మైలతోవున్న స్త్రీలు మాత్రం ఉపవాసం పాటించడానికి వీల్లేదు. ఆ రెండు అపరిశుద్ధావస్థలు దూరం కానంతవరకు అలాంటి స్త్రీలు నమాజ్ చేయడం, ఉపవాసం పాటించడం నిషిద్ధం. అపరిశుద్ధావస్థలు దూరమయిన తరువాత తప్పిపోయిన రమజాన్ ఉపవాసాలకు ఖజా ఉపవాసాలు పాటించవలసి ఉంటుంది. తప్పిపోయిన నమాజులకు మాత్రం ఖజా పాటించనవసరం లేదు.

ఇకపోతే మిగిలిన వాళ్ళంతా రమజాన్ ఉపవాసాలు పాటించడానికి యోగ్యులవుతారు. అయితే వారిలో కొందరు వారి స్థితిగతుల దృష్ట్యా రమజాన్ ఉపవాసాల పాటింపు నుండి మినహాయించబడ్డారు. ఈ దిగువన వారి జాబితా చూడండి:

**వ్యాధిగ్రస్తుడు:-** ఉపవాసం పాటిస్తే ఏదైనా వ్యాధి వస్తుందన్న భయముంటే లేదా ఉన్న వ్యాధి ముదురుతుందన్న అనుమానముంటే అలాంటి వారికి ఉపవాసం పాటించకుండా ఉండేందుకు అనుమతి ఉంది. అయితే దానికోసం వైద్యుని సలహా తీసుకోవలసి ఉంటుంది. వ్యాధిగ్రస్తులు వ్యాధి నయంకాగానే రమజాన్ ఉపవాసాలు పాటించడం ప్రారంభించాలి. తప్పిపోయిన ఉపవాసాలకు ఖజా కూడా పాటించాలి. ఒకవేళ ఎవరైనా ఉపవాసాలు పాటించిన కారణంగా తీవ్రంగా నీరసించిపోయి మళ్ళీ ఉపవాసాలు పాటించలేనంత దుస్థితికి దిగజారిపోవడం జరిగితే అలాంటి వ్యక్తికి కూడా రోజా పాటించకుండా ఉండేందుకు అనుమతి ఉంది. అయితే అతను కూడా వైద్యుని సలహా తీసుకోవలసి ఉంటుంది.

**బాగా వయస్సుమీరిన వృద్ధుడు:-** వృద్ధాప్యంతో చాలా నీరసించి పోయిన వృద్ధులు రమజాన్ ఉపవాసాలు పాటించనవసరం లేదు. అలాంటి వృద్ధులు ఖజా ఉపవాసాలు పాటించే ఆశ కూడా ఉండదు. అందువల్ల వారికి ఉపవాసం నుండి శాశ్వతంగా అనుమతి ఉంటుంది. అయితే వారు ఫిదియా (పరిహారం) చెల్లించవలసి ఉంటుంది. ఒక ఉపవాసానికి ఒక ఫిత్రా పరిమాణం చొప్పున రమజాన్ నెల రోజుల పాటు ఫిదియా తీసి పేదలకు దానం చేయవలసి ఉంటుంది.

**ఉన్మాది, అపస్మారకుడు:-** కొందరు పుట్టుకతోనే ఉన్మాదులుగా ఉంటారు. మరికొందరు కొంత వయస్సు వచ్చిన తరువాత ఉన్మాదులయిపోతారు. ఇంకొందరు తాత్కాలికంగా ఉన్మాదులవుతారు. అలాంటివారికి రమజాన్ ఉపవాసాల పాటింపు నుండి మినహాయింపు ఉంది.



తాత్కాలికమైన ఉన్మాదం వైద్యంతో దూరమైనప్పుడు తప్పిపోయిన రమజాన్ ఉపవాసాలకు ఖజా ఉపవాసాలు పాటించవలసి ఉంటుంది. అలాగే అపస్మారక స్థితి తొలగిపోయినప్పుడు తప్పిపోయిన ఉపవాసాలకు ఖజా ఉపవాసాలు పాటించవలసి ఉంటుది. శాశ్వతమైన ఉన్మాదులు మాత్రం రమజాన్ ఉపవాసాల పాటింపు నుండి పూర్తిగా మినహాయించబడతారు. అలాంటి ఉన్మాదుల తరపున 'ఫిదియా' కూడా చెల్లించనవసరం లేదు.

**సమరయోధుడు:-** దైవమార్గంలో జిహాద్ చేయడానికి వెళ్ళే సమరయోధుడికి యుద్ధం చేయడం వల్ల నీరసం కలిగే భయమున్నప్పుడు అతను ఉపవాసం మానెయ్యడానికి అనుమతి ఉంది. యుద్ధం ఇంకా ప్రారంభం కాకపోయినా ఏ క్షణంలోనైనా శత్రువులతో యుద్ధం చేయవలసి ఉంటుందన్న ఆత్యయిక పరిస్థితి ఏర్పడినప్పుడు కూడా ఉపవాసం ఉండకపోవడంలో తప్పు లేదు.

ఒకవేళ ఎవరైనా సమరయోధుడు ఉపవాసం ఉన్నప్పుడు హఠాత్తుగా యుద్ధం చేయవలసి వస్తే అతను తన ఉపవాసవ్రతాన్ని భంగపరచవచ్చు. ఈ ఉపవాస వ్రత భంగానికి కప్ఫారా (పాపపరిహారం) చెల్లించనవసరం లేదు. మొత్తం మీద సమర యోధులు తప్పిపోయిన రమజాన్ ఉపవాసాలకు ఖజా పాటించవలసి ఉంటుంది.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: "మేము రమజాన్ పదహారవ తేదీన దైవప్రవక్త (సల్లం)తో కలసి ఒక దండయాత్ర కోసం ప్రయాణమయ్యాము. ఈ ప్రయాణంలో మాలో కొందరు ఉపవాసం ఉన్నారు, మరికొందరు ఉపవాసం లేరు. అయితే ఉపవాసం ఉన్నవారు ఉపవాసం లేనివారికి, ఉపవాసం లేనివారు ఉపవాసం ఉన్న వారికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు." (ముస్లిం)

**గర్భిణీ స్త్రీలు:-** గర్భిణీ స్త్రీలకు కూడా రమజాన్ ఉపవాసాల పాటింపు నుండి మినహాయింపు ఉంది. అయితే ఉపవాసం పాటించినందు వల్ల గర్భస్థ పిండానికి నష్టం వాటిల్లుతుందని లేదా స్వయంగా తన ఆరోగ్యం పాడయిపోతుందని అనుమానం ఉండినప్పుడు మాత్రమే ఉపవాసం నుండి మినహాయింపు ఉంటుంది.

ఉపవాస సంకల్పం చేసుకున్న తరువాత ఏ స్త్రీ అయినా తనకు గర్భధారణ జరిగిందని తెలుసుకొని, గర్భధారణ స్థితిలో ఉపవాసం పాటిస్తే తనకుగాని, తన గర్భస్థ పిండానికి నష్టం వాటిల్లుతుందన్న భయమున్నప్పుడు ఆమె ఆరోజు ఉపవాసాన్ని భంగం చేయవచ్చు. అయితే ఈ వ్రతభంగం చేసినందుకు ఆమెగాని ఆమె తరపున మరెవరైనాగాని పాపపరిహారం (కప్ఫారా) చెల్లించనవసరం లేదు.

**పాలతల్లి:-** పిల్లలకు పాలిచ్చే మహిళలకు కూడా రమజాన్ ఉపవాసాల నుండి మినహాయింపు ఉంది. పాలతల్లి ఉపవాసం పాటిస్తే పాలు తగ్గిపోయి పిల్లవాడు ఆకలితో అలమటించిపోతాడని భయం ఉన్నప్పుడు లేదా స్వయంగా తన ఆరోగ్యం

క్షీణించే ప్రమాదం ఉన్నప్పుడు మాత్రమే పాలతల్లికి రమజాన్ ఉపవాసాల నుండి మినహాయింపు ఉంటుంది.

కన్నతల్లి కాకుండా మరే స్త్రీకయినా వేతనమిచ్చి పిల్లవాడికి పాలు పట్టించదలచుకున్నప్పుడు కన్నతల్లి రమజాన్ ఉపవాసాలు విధిగా పాటించవలసి ఉంటుంది. ఒకవేళ ఆ పాలతల్లికి కూడా అదే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదముంటే ఆమెకు కూడా రమజాన్ ఉపవాసాల నుండి మినహాయింపు ఉంటుంది.

**ప్రయాణీకుడు:-** ఇస్లాం ధర్మశాస్త్రం దైవదాసుల్ని ఇబ్బందుల పాలుజేయకుండా ప్రతి ఆదేశంలోనూ అవసరమైన చోట సడలింపు ప్రసాదించింది. రమజాన్ ఉపవాసాలు విధిగా నిర్ణయించినప్పుడు వ్యాధిగ్రస్తులు, ప్రయాణీకుల స్థితిగతుల్ని కూడా దృష్టిలో పెట్టుకుంది మన ధర్మశాస్త్రం. ఇది నిజంగా దైవానుగ్రహం.

“ఇక నుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి. అయితే వ్యాధిగ్రస్తులు, ప్రయాణీకులు (రమజాన్‌లో తప్పిపోయిన) ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (ఆ సంఖ్యను) పూర్తిచేయాలి. దేవుడు మీకు సౌలభ్యం చేకూర్చ దలిచాడుగాని, మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయాలని భావించడంలేదు. మీరు ఉపవాసాల సంఖ్యను పూర్తి చేసుకోవడానికి, దేవుడు మీకు సన్మార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు కృతజ్ఞులై ఉండటానికిగాను ఈ సౌలభ్యం ప్రసాదించాడు.” (ఖుర్‌ఆన్–2:185)

(1) హ్జ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: హ్జ్రత్ హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి) అత్యధిక ఉపవాసాలు పాటించేవారు. ఆయన ఒకసారి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి “దైవప్రవక్తా! ప్రయాణావస్థలో నేను ఉపవాసం పాటించవచ్చా?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) “నీకిష్టమయితే ఉపవాసం పాటించు, లేకుంటే మానెయ్యి. (అంతా నీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంది.)” అని అన్నారు. (ముత్తఫఖున్ అలై)

(2) హ్జ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “దేవుడు ప్రయాణీకుడి నమాజ్‌ని సగం తగ్గించాడు. అతనికి ఉపవాసం వదిలే అనుమతి కూడా ప్రసాదించాడు. అదేవిధంగా పాలిచ్చే స్త్రీకి, గర్భిణీ స్త్రీకి కూడా ఉపవాసం వదిలే అనుమతి ప్రసాదించాడు.” (అబూదావూద్, తిర్మిజి, నసాయి)

(3) హ్జ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం: ఒకసారి దైవప్రవక్త (స) (అనుచరులతో కలసి) ప్రయాణం చేస్తున్నారు. (దారిలో ఓచోట ప్రయాణీకుల్లో) ఒక వ్యక్తి చుట్టూ కొందరు గుమికూడి (ఒక వస్త్రంతో) నీడ పట్టారు. దైవప్రవక్త (స) ఆ జనసమూహం చూసి “ఏమయిందీ?” అని అడిగారు. అప్పుడు జనం “ఒక ఉపవాసి (నీరసంతో ఢీలా పడిపోతున్నాడు.)” అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని “ప్రయాణావస్థలో రోజా పాటించడం పుణ్యకార్యం కాదు” అని అన్నారు. (ముత్తఫఖున్ అలై)



పై హదీసులో దైవప్రవక్త (సల్లం) “ప్రయాణావస్థలో ఉపవాసం పాటించడం పుణ్యకార్యం కాదు” అంటే అన్ని విధాల ప్రయాణావస్థలలో అని అర్థంకాదు. అలాగే అందరి కోసం అని కూడా అర్థం కాదు. ప్రయాణం కఠినమైనదా, తేలికయినదా; ప్రయాణావస్థలో ఉపవాసం పాటించే శక్తీ, ధైర్యం తనకు ఉందా, లేదా వగైరా విషయాలన్నీ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

(4) హ్జ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్ల (రజి) ఉల్లేఖనం: మక్కా జయించబడిన సంవత్సరం రమజాన్ నెలలో దైవప్రవక్త (స) (తమ అనుచరులతో కలసి) మదీనా నుండి మక్కా పట్టణానికి బయలుదేరారు. దారి పొడుగూతూ ఆయన ఉపవాసం పాటించారు. చివరికి ‘కురాఅల్ గమీమ్’ అనే ప్రదేశానికి చేరుకొని ఆగారు. ప్రజలు ఆరోజు కూడా యథాప్రకారం ఉపవాసం ఉన్నారు. అయితే దైవప్రవక్త (సల్లం) ఒక పాత్రలో నీళ్ళు తెప్పించి, ఆ నీటిపాత్రను జనమంతా చూడగలిగేటంత పైకెత్తి పట్టుకున్నారు. తరువాత ఆ నీటిని ఆయన తాగారు. (అంటే ఆ నీటితో ఉపవాసాన్ని విరమించారు.) ఆ తర్వాత కొందరు దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళి “మాలో కొందరు ఇంకా ఉపవాసంతోనే ఉన్నారు” అని చెప్పారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని “వారు అవిధేయులు, వారు అవిధేయులు” అని (రెండు సార్లు) అన్నారు. (ముస్లిం)

ఈ హదీసులో దైవప్రవక్త (సల్లం) ఉపవాసాన్ని ఏ సమయంలో విరమించారో స్పష్టంగా పేర్కొనబడకపోయినప్పటికీ దైవప్రవక్త (సల్లం) ఉపవాస విరమణ తీరును బట్టి ఆయన సూర్యాస్తమయానికి పూర్వమే ఉపవాసం విరమించినట్లు తెలుస్తోంది.

అది నడి ఎండాకాలంలో సాగిన సుదీర్ఘ ప్రయాణం. మక్కా చేరుకొని యుద్ధం చేయవలసిన అవసరం కూడా ఉందప్పుడు. నిర్విరామంగా ఉపవాసాలు పాటిస్తూ ప్రయాణం చేస్తే మక్కా చేరుకునే టప్పటికి యోధులు బలహీనులైపోయి యుద్ధం చేయలేని దుస్థితికి గురికావచ్చు. దైవప్రవక్త (సల్లం) వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని, దేవుడిచ్చిన రాయితీని ఉపయోగించుకుంటూ ఉపవాసం విరమించారు. ఆయన స్వయంగా ఉపవాసాన్ని భంగం చేసి తన ఆచరణ ద్వారా అనుచరులు కూడా ఉపవాస భంగం చేయాలని పరోక్షంగా ఆదేశించారు.

ఈ పరోక్ష ఆదేశాన్ని పాటించనివారిని దైవప్రవక్త (సల్లం) ‘అవిధేయులు’ అన్నారు. అంతేగాని ‘మీరు చాలా మంచిపని చేస్తున్నారు. ఉపవాసంలో ధైర్యసాహసాలు చూపుతున్నారు. శభాష్! మీరు గురువును మించిన శిష్యులైపోయారు’ అని వాళ్ళను పొగడలేదు. ఇస్లాంలో అన్నిటికంటే ముఖ్యమైన విషయం వినయవిధేయతలే. ఇక్కడ ధర్మపరాయణతకు గీటురాయి దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయత చూపడమే. విధేయత లోపించిన ధర్మపరాయణత నిజమైన ధర్మపరాయణత అన్పించుకోదు. పైపెచ్చు అలాంటి వైఖరి దైవధిక్కార వైఖరిగా పరిగణించబడుతుంది.

(5) హజ్రత్ అనస్ (రజి) కథనం: మేమొక సారి దైవప్రవక్త (స)తో కలసి ప్రయాణం చేస్తున్నాము. అప్పుడు మాలో కొందరు ఉపవాసంతో ఉన్నారు; మరికొందరు ఉపవాసం లేరు. తీవ్రమైన వేసవి తాపం రోజున మేమొక ప్రదేశానికి చేరుకొని విడిది చేశాము. అక్కడికి చేరుకోగానే ఉపవాసం ఉన్నవారు (అలసిపోయి చెట్ల క్రింద) పడుకున్నారు. ఉపవాసం లేనివారు నడుం వాల్చకుండా గుడారాలు వేయడంలో, ఒంటెలకు నీరు పెట్టడంలో లీనమైపోయారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఈరోజు ఉపవాసం లేనివారు అమితమైన పుణ్యఫలం దోచుకున్నారు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

పై హదీసు బట్టి కఠినమైన ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు ఉపవాసం పాటించక పోవడమే మంచిదనిపిస్తుంది. ప్రయాణం తేలికగా, స్వల్పకాలిక ప్రయాణ మయివుండి, చేరుకునే స్థలంలో తగిన సౌకర్యాలు లభించే అవకాశం కూడా ఉన్నప్పుడు ఉపవాసాలు పాటించడమే మంచిది. ఇలాంటి పరిస్థితిలో రమజాన్ ఉపవాసాలు వదిలేయడం మంచిది కాదు. ఈ విషయాన్ని ఈ క్రింది హదీసు కూడా సమర్థిస్తోంది:

(6) హజ్రత్ సలమా బిన్ ముహబ్బఖ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "ఎవరి దగ్గరైనా మంచి వాహనం ఉండి, అది అతడ్ని (రాత్రికి) కడుపునిండా భోజనం దొరికే (అతను తృప్తిగా తినే) ప్రాంతానికి చేర్చగలిగితే అలాంటి మనిషి రమజాన్ నెలలో ఉపవాసం పాటించాలి." (అబూదావూద్)

ఈనాడు బస్సులు, రైళ్ళు, విమానాల ద్వారా ప్రయాణం చాలా సులభమయి పోయింది. ప్రయాణ సమయం కూడా చాలా తగ్గిపోయింది. అదీగాక జేబులో డబ్బుంటే చాలు ఎక్కడబడితే అక్కడ ఆహారపదార్థాలు కూడా లభిస్తున్నాయి. అందువల్ల ఈనాటి ప్రయాణీకులు అందరూ కాకపోయినా అనేకమంది పై హదీసు దృష్ట్యా రమజాన్ ఉపవాసాలను ఖజా చేయకుండా పాటించడం మంచిదని నా అభిప్రాయం. ఉపవాసం పాటించకుండా ఖుర్ఆన్ ఇచ్చిన రాయితీని ఉపయోగించుకోదలచినవారికి ఈ క్రింది హదీసు ఊతమిస్తుంది. చూడండి ఈ హదీసు:

(7) హజ్రత్ హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి) కథనం: నేనొక సారి దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నాకు ప్రయాణావస్థలో కూడా ఉపవాసం పాటించే అంతటి శక్తి ఉంది. మరి నేను అలా చేస్తే పాపినవుతానా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "ఇది మహోన్నతుడు, సర్వశక్తిమంతుడయిన దేవుని తరఫున ఇవ్వబడిన రాయితీ. ఎవరైనా ఈ రాయితీని ఉపయోగించుకొని ప్రయోజనం పొందితే ఇది చాలా మంచి విషయం. ఒకవేళ ఎవరైనా ఉపవాసం పాటించడానికే ఇష్టపడితే అందులో దోషం కూడా లేదు" అని అన్నారు. (ముస్లిం)

ఈ హదీసులో ప్రస్తావించబడిన ఉపవాసం నఫిల్ ఉపవాసం గురించినదో లేక రమజాన్ ఉపవాసం గురించినదో పేర్కొనలేదు. నఫిల్ ఉపవాసం గురించి అయితే



ప్రయాణావస్థలో నఫిల్ ఉపవాసం పాటించకపోవడమే మంచిదని నా అభిప్రాయం. ఒకవేళ అది రమజాన్ ఉపవాసం గురించి అయితే రమజాన్ ఉపవాసం పాటించడం మంచిదని నేను అభిప్రాయపడుతున్నాను. నేనీ అభిప్రాయానికి రావడానికి కారణం 6వ నంబర్ హదీసుతో పాటు ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులే:

"ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తుడయితే లేదా ప్రయాణావస్థలో ఉంటే అలాంటి వ్యక్తి ఆ తప్పిపోయిన ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (నెల ఉపవాసాలు) పూర్తి చేయాలి. ఉపవాసం పాటించే శక్తి ఉండి కూడా దానిని పాటించనివారు మాత్రం పాప పరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఒక ఉపవాస దినానికి పరిహారంగా ఒక నిరుపేదకు భోజనం పెట్టాలి. (ఈ విషయంలో) ఎవరైనా తమంతట తాము సంతోషంగా మరింత పుణ్యం చేయదలచుకుంటే అది వారికే మేలు చేకూర్చుతుంది. (ఏమైనప్పటికీ) మీరు విషయం గ్రహించగలిగితే ఉపవాసం పాటించడమే మీకు శ్రేయస్కరం." (2:184)

## చనిపోయిన మనిషి ఖజా రోజాలు

ఎవరైనా రమజాన్ నెలలోని ఖజా ఉపవాసాలు నెరవేర్చవలసి ఉన్నప్పుడు అతను వాటిని నెరవేర్చక ముందే చనిపోవడం జరిగితే, అతని మీద ఆ ఉపవాసాల రుణభారం ఉంటుందా? ఉంటే ఆ రుణభారం ఎవరు తొలగించాలి? తప్పిపోయిన ఫరజ్ నమాజ్‌ల విషయంలో కూడా చనిపోయిన వ్యక్తి మీద ఆ నమాజుల రుణభారం ఉంటుందా? ఈ రుణాన్ని ఎవరు తీర్చాలి? ఇవన్నీ ఆసక్తికరమైన ప్రశ్నలే. వీటికి సమాధానాలు హదీసు వెలుగులో అన్వేషిద్దాం.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఒక వ్యక్తి చనిపోయినప్పుడు అతనిపై కొన్ని ఉపవాసాలు పాటించవలసిన బాధ్యత ఉంటే వాటిని అతనికి బదులుగా అతని సంరక్షకుడు పాటించాలి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: "ఒక వ్యక్తి చనిపోయినప్పుడు అతనిపై రమజాన్ ఉపవాసాలు ఏవైనా పాటించవలసిన బాధ్యత ఉంటే అతని తరఫున అతని సంరక్షకుడు ప్రతి ఉపవాసానికి బదులుగా (అంటే ఫిదియా కింద) ఒక నిరుపేదకు భోజనం పెట్టాలి." (తిర్మిజి)

పై రెండు హదీసులలో మొదటి హదీసు ఆధారంగా "మృతునిపై రమజాన్ ఉపవాసాల బాధ్యత ఉన్నప్పుడు వాటిని అతని సంరక్షకుడు ఖజా ఉపవాసాలుగా పాటించాల"ని ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై) ఫత్వా జారీచేశారు. ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్ (రహ్మలై)లు మాత్రం "ఈ హదీస్‌లోని ఉపవాసాలు రమజాన్‌కు సంబంధించినవా కావా అనే విషయం లేనందున ఇవి మొక్కుబడి ఉపవాసాలు కావచ్చని, పైగా హదీసులో 'వాజిబ్' (తప్పనిసరి) అని లేదు కనుక అతని సంరక్షకుడు తలచుకుంటే మృతుని తరఫున ఈ ఉపవాసాలు

ఉండవచ్చని, అదీగాక మరికొన్ని హదీసుల్ని బట్టి ఈ హదీసు ఆతరువాత వచ్చినందు వల్ల ఇది రద్దయి పోయింది" అని చెప్పారు.

రెండవ హదీసు విషయంలో "అసలిది దైవప్రవక్త (సల్లం) నోట వెలువడిన ప్రవచనమేనా లేక హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) అభిప్రాయమా" అని ఇమామ్‌లు సందేహంలో పడిపోయారు.

పై రెండు ఉల్లేఖనాలకు భిన్నంగా మరో ఉల్లేఖనం ఈవిధంగా ఉంది:

ఇమామ్ మాలిక్ (రహ్మలై) తనకు అందిన ఒక సమాచారం ఈవిధంగా ఉందని తెలియజేశారు: "హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ను ఒకతను 'ఏ వ్యక్తి అయినా మరొకనికి బదులుగా ఉపవాసం పాటించగలడా? లేక మరొకతనికి బదులుగా నమాజ్ చేయగలడా?' అని ప్రశ్నించాడు. దానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) సమాధాన మిస్తూ 'ఏ వ్యక్తి కూడా మరొకని తరఫున ఉపవాసం పాటించడంగాని, నమాజ్ నెరవేర్చ డంగాని చేయలేడు" అని అన్నారు." (మువత్తా-ఇమామ్ మాలిక్)

## 57. ఉపవాసంలో ఆంక్షలు, రాయితీలు

ఉపవాసం అంటే కేవలం కూడు, నీళ్ళు మానెయ్యడం మాత్రమే కాదు. మరెన్నో పనులు మానెయ్యవలసి ఉంటుంది. ఒక ఉపవాసికి ఉపవాస స్థితిలో ఏఏ పనులు చేయకూడదో తెలుసుకోవలసిన అవసరముంది.

❋ ఉపవాస స్థితిలో మొట్టమొదటి ఆంక్షలు తినడం, త్రాగడం, సంభోగించడమే. ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఈ మూడు పనులు వదిలెయ్యడాన్నే ఇస్లాంలో ఉపవాసం (రోజా) అంటారు.

**మరచిపోయి తినడం, త్రాగడం:-** ఒకవేళ మరచిపోయి ఏదయినా, ఎంతయినా తినడం, త్రాగడం జరిగితే ఉపవాసం భంగం కాదు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "ఉపవాసం ఉన్న వ్యక్తి ఒకవేళ మరచిపోయి ఏదైనా తింటే లేదా త్రాగితే అతని ఉపవాసం భంగం కాదు. కనుక ఉపవాసం ఉన్న వ్యక్తి అలా మరచిపోయి తినడం, త్రాగడం జరిగితే (గుర్తొచ్చిన తరువాత సూర్యాస్తమయం వరకూ మరేమీ తినకుండా, త్రాగకుండా) అతనా ఉపవాసాన్ని పూర్తి చేయాలి. (ఆ మనిషి మరచిపోయి తిన్నా, త్రాగినా) వాస్తవానికి దేవుడే అతనికి తినిపించాడు, త్రాగించాడు." (బుఖారి, ముస్లిం)

ఈ హదీసును బట్టి మరచిపోయి చేసిన తప్పు క్షమార్హమయినదని ఒక సాధారణ సూత్రం ఏర్పడింది. షరీఅత్ దీన్ని ఆమోదిస్తుంది.

మనిషి మరచిపోయి ఆహారం కడుపునిండా తిన్నా, పానీయం కడుపునిండా తాగినా ఉపవాస వ్రతానికి భంగమయితే రాదు. కాని తాను ఉపవాసం ఉన్నానని



జ్ఞాపకం రాగానే తినడం, తాగడం మానెయ్యాలి. ఒక మెతుకు అన్నమైనా, ఒక చుక్క నీరైనా గొంతులోనికి పోనీయకూడదు. లేకుంటే ఉపవాసం భంగమవుతుంది.

నోరు, ముక్కు, చెవి, మల మార్గాల ద్వారా పదార్థాన్ని మెదడు, అన్నకోశాలకు చేర్చడానికి మానవశరీరంలో సహజసిద్ధమైన కవాటాలు ఉన్నాయి. ఈ కవాటాన్ని ఫిఖ్హా పరిభాషలో **"మన్ఫజ్"** అంటారు. మనిషి ఉపవాస స్థితిలో ఉన్నప్పుడు ఎలాంటి పదార్థ మయినా 'మన్ఫజ్' గుండా శరీరంలోకి ప్రవేశించనీయ కూడదు. ఉపవాసం విషయంలో ఇది సూత్రప్రాయమైన విషయం.

**ఇంజెక్షన్ ద్వారా పదార్థ ప్రవేశం:-** ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కించే ఏ పదార్థమైనా 'మన్ఫజ్' గుండా మెదడుకు, అన్నకోశానికి చేరదు. అందువల్ల మన ఆధునిక ధర్మవేత్తలు పూర్వకాలపు ఫిఖ్హావేత్తల అభిప్రాయాలను విశ్లేషించిన తరువాత ఇంజెక్షన్ ద్వారా గ్లూకోజ్, రక్తం, మందులు శరీరంలోకి ఎక్కిస్తే ఉపవాసం భంగం కాదని తీర్మానించారు. ఈ ఇంజెక్షన్ శరీరం మీద ఎక్కడ చేసినా రోజా భంగం కాదు. ఈ విషయంలో కొందరు ధర్మవేత్తలు ఇలా ఓ స్పష్టమైన ఉదాహరణ పేర్కొన్నారు:

పాము కరిస్తే దాని విషం శరీరమంతా పాకుతుందని అందరికీ తెలుసు. అయినా పాము కాటు వల్ల ఉపవాసం భంగమవుతుందని ఫిఖ్హా గ్రంథాల్లో ఎక్కడా ప్రస్తావన లేదు. దీనిక్కారణం ఈ విషం "సహజసిద్ధమైన మార్గం" (మన్ఫజ్) గుండా శరీరంలోకి ఎక్కదని వీరి అభిప్రాయం. కాని ఇది అంత బలమైన హేతువుగా కన్పించడం లేదు. పాము కాటు వల్ల ఉపవాసం భంగం కాకపోవడానికి కారణం బహుశా శరీరంలోకి పోయే విషం ఆరోగ్యం చేకూర్చడానికి బదులు ప్రాణాపాయం తెచ్చిపెడ్తుందని కావచ్చు.

ఫిఖ్హా గ్రంథాల్లో పేర్కొన్న ఉదాహరణలను బట్టి ఒక విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. శరీరారోగ్యానికి ప్రయోజనం చేకూర్చేదయినా, నష్టం కలిగించేదయినా నోటి గుండా అన్నకోశానికి చేరే పదార్థాలన్నీ ఉపవాస వ్రతాన్ని భంగపరుస్తాయి. నోటి గుండా కాకుండా ఇతర అవయవాల గుండా శరీరంలోకి ప్రవేశించి ప్రయోజనం మాత్రమే చేకూర్చే పదార్థాలు కూడా ఉపవాసాన్ని భంగపరుస్తాయి. అందువల్ల 'హిదాయా' గ్రంథకర్త చెవిలో వేసే మందును మాత్రమే ఉపవాసానికి భంగకరమైన పదార్థంగా పేర్కొని, నీటిని మినహాయించారు. కారణం పైన పేర్కొన్నట్లు చెవిలో వేసే మందు ప్రయోజనం చేకూర్చుతుంది, నీరు నష్టం కలిగిస్తుంది.

కాబట్టి ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కించే పదార్థం మందు అయినా, చివరికి రక్తమయినా సరే అది ఉపవాసాన్ని భంగం చేయదని తెలుస్తోంది. అలాగే నరాల గుండా శరీరంలోకి ఇంజెక్షన్ ద్వారా ఎక్కించే గ్లూకోజ్ కూడా ఉపవాసాన్ని భంగం చేయదు. ఇవి మెదడుకు, అన్నకోశానికి సహజసిద్ధమైన కవాటం (మన్ఫజ్) గుండా చేరవు గనక వాటి వల్ల ఉపవాసానికి భంగం కలగదు.

**గాయాలపై మందుపూత:-** రెండురకాల గాయాలకు మందు పూస్తే ఉపవాసం చెడిపోతుందని ఫిఖ్కావేత్తలు అభిప్రాయపడ్డారు. అవి: (1) తల మీద మెదడు దాకా అయిన లోతైన గాయం. (2) పొట్ట మీద అన్నకోశం దాకా అయిన గాయం. ఈ రెండు గాయాలకు మందు పూయడం వల్ల ఉపవాసం చెడిపోతుంది.

తల, పొట్ట మినహాయించి ఇతర అవయవాలకు మందు పూయడం వల్ల ఉపవాస వ్రతానికి ఎలాంటి భంగం ఉండదు. ఉదాహరణకు- తలకు నూనె రాయడం వల్లగాని, నూనెతో శరీరం మర్దన చేయడం వల్లగాని ఉపవాసం చెడిపోదు.

**చెవులు, కళ్ళలో మందు వేయడం:-** మందు ద్రవ స్థితిలో ఉన్నా, ఘన స్థితిలో ఉన్నా కంటిలో వేస్తే ఉపవాసం భంగం కాదని ఫిఖ్కావేత్తలు తీర్మానించారు. కంటిలో వేసిన మందు గొంతులోకి దిగి దాని రుచి అనుభూతమైనా సరే ఉపవాసం భంగం కాదని "ఫతావా ఆలంగీర్" గ్రంథంలో ఉంది. అలాగే కళ్ళకు సుర్మా లేక కాటుక పెట్టుకోవడం వల్ల, దాని రుచి అనుభూతమైనప్పటికీ ఉపవాసానికి భంగం రాదని "ఖులాసతుల్ ఫతావా" గ్రంథంలో పేర్కొనబడింది. అయితే మందు చెవిలో పోస్తే మాత్రం ఉపవాసం భంగమవుతుంది.

ఇది ఫిఖ్కాశాస్త్రానికి సంబంధించిన సమస్య. కాని ఇప్పుడిది వైద్యశాస్త్రానికి సంబంధించిన సమస్యగా మారింది. అనేకమంది డాక్టర్లు జరిపిన పరిశోధన ప్రకారం చెవికి, మెదడుకు లేక అన్నకోశానికి మధ్య ఎలాంటి కవాటం లేదు. పైగా చెవి అంతర్భాగంలో ఉండే కర్ణభేరి (గూబ) చెవి నుండి మెదడుకు లేక అన్నకోశానికి పోయే దారిని మూసివేస్తుంది. దీనికి భిన్నంగా కంటి నుండి మెదడు వైపుండే దిశలో కవాటం ఉంది. అంటే చెవిలో వేసే మందు రుచి ఏమిటో మనకు తెలియదు. కాని కంటిలో వేసే మందు మాత్రం గొంతులోకి దిగి రుచి తెలుస్తుంది. అందువల్ల వైద్యశాస్త్రం రీత్యా కంటిలో ద్రవస్థితిలో ఉండే మందు వేసుకుంటే ఉపవాసం భంగమవుతుంది; చెవిలో వేసుకుంటే మాత్రం భంగం కాదు. అయితే ఫిఖ్కాదృక్పథం రీత్యా ఉపవాసం ఉండి చెవిలో మందు వేసుకోక పోవడమే మంచిది.

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "నా కళ్ళలో బాధగా ఉంది. మరి నేను ఉపవాస స్థితిలో కళ్ళకు సుర్మా పెట్టుకోవచ్చా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ... పెట్టుకో" అన్నారు. (తిర్మిజి)

ఈ ఉల్లేఖనం బలహీనమైనది. ఒకవేళ ఉల్లేఖనం సరైనదేనని అంగీకరించినా దాని ద్వారా కళ్ళకు సుర్మా మాత్రమే పెట్టుకోవచ్చని తెలుస్తోంది. ఎందుకంటే కళ్ళకు పెట్టుకునే సుర్మా కొద్ది పరిమాణంలో పొడి రూపంలో ఉండే పదార్థం. అంతేగాని ఈ హదీసు ఆధారంగా ద్రవం లేక పేస్టు రూపంలో ఉండే మందును కళ్ళలో వేసుకోవచ్చని చెప్పడం సరికాదు. ఈ హదీసుకు ముందు పేరాలో పేర్కొన్నట్లు కంటి నుండి మెదడు



వైపుండే దిశలో కవాటం (మన్ఫజ్) ఉంది గనక కంటిలో వేసే మందు గొంతులోకి దిగి రుచి తెలుస్తుంది. గొంతులోకి మందు దిగితే ఉపవాసం భంగమైనట్లే.

**టూత్‌పేస్ట్, టూత్‌పౌడర్ల వాడకం:-** ఉపవాస స్థితిలో ఉపవాస స్థితిలో పలుదోము పుల్ల (మిస్వాక్) పచ్చదయినా సరే వాడవచ్చని హనఫీ ధర్మవేత్తలు అనుమతించారు. కాకపోతే పలుదోము పుల్లను నీటిలో తడిపి వాడటం మాత్రం 'మక్రూహ్' (అవాంఛనీయం) అని ఇమామ్ అబూ యూసుఫ్ (రహ్మలై) అభిప్రాయపడ్డారు.

హజ్రత్ ఆమిర్ బిన్ రబీఅ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) ఉపవాస స్థితిలో మిస్వాక్ (బ్రష్) చేస్తుండగా ఆయన్ని నేను అనేక సార్లు చూశాను." (తిర్మిజి)

ఈ హదీసును బట్టి పలుదోము పుల్ల (మిస్వాక్)తో పళ్ళు తోముకోవడం వల్ల ఉపవాసం భంగం కాదని తెలుస్తోంది.

అయితే టూత్‌పేస్ట్, టూత్‌పౌడర్ల పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. వీటి రుచి స్పష్టంగా, గాఢంగా ఉంటుంది. కాబట్టి వీటిని పలుదోము పుల్ల (మిస్వాక్)తో పోల్చి లేక వీటి వాడకం మిస్వాక్ వాడకంలా 'సున్నత్' (సంప్రదాయం) అని భావించి వాడటం ఏమాత్రం మంచిది కాదు. అనివార్య పరిస్థితిలో వాడటం అన్నది వేరే విషయం. బలమైన కారణం (షరయి ఉజర్) ఏదీ లేకుండా ఏదైనా పదార్థం రుచి చూడటం, నమలడం 'మక్రూహ్' (అవాంఛనీయం) అని ఫిఖ్కావేత్తలు తీర్మానించారు.

**మర్మాంగం గుండా మందు వాడకం:-** ఎలాంటి మందయినా సరే స్త్రీ మర్మాంగం గుండా శరీరంలోకి ఎక్కిస్తే ఆమె ఉపవాసం భంగమవుతుంది. స్త్రీ మర్మాంగంలోకి ఎలాంటి ద్రవపదార్థానికి చెందిన ఒక చుక్కయినా సరే పోయడం వల్ల ఆమె ఉపవాసం భంగమవుతుందని "ఫతావా ఆలంగీర్" గ్రంథంలో ఉంది. అంతేకాదు, చివరికి నీటితో లేక నూనెతో తడిఅయిన వేలిని సైతం స్త్రీ తన మర్మాంగంలోకి జొప్పించుకున్నా ఆమె ఉపవాసం భంగమయ్యే ప్రమాదం ఉంది.

స్త్రీ ఉపవాసం భంగమవడానికి కారణం స్త్రీ శరీరంలో గర్భాశయం దాకా వస్తువుని గొనిపోయే సహజసిద్ధమైన కవాటం (మన్ఫజ్) ఉంది. పురుషుని శరీరనిర్మాణం దీనికి భిన్నంగా ఉంది. పురుషుని మూత్రనాళానికి, అన్నకోశానికి మధ్య నేరుగా సహజసిద్ధమైన ఎలాంటి దారిగాని, కవాటం (మన్ఫజ్)గాని లేదు. అందువల్ల పురుషాంగంలోకి ఏదైనా పదార్థంగాని, వస్తువుగాని జొప్పిస్తే అతని ఉపవాసం భంగం కాదు.

**రోజా స్థితిలో శస్త్రచికిత్స, అవయవ మార్పిడి:-** పొట్ట లేక మెదడులోని అంతర్ భాగానికి చేరే పదార్థాలన్నీ ఉపవాస వ్రతాన్ని భంగపరుస్తాయి. దీన్నిబట్టి కాలు, చేయి వంటి ఇతర అవయవాల శస్త్రచికిత్స వల్ల ఉపవాసంపై ఎలాంటి ప్రభావం ఉండదు. అలాగే మెదడు, అన్నకోశాల వైపున సహజ సిద్ధమైన కవాటాలు కలిగి ఉన్న

ముక్కు, చెవి, గుదం, రహస్యాంగాలకు సంబంధించిన ఆపరేషన్లు కూడా ఉపవాసాన్ని చెడగొట్టవు. అలాగే ఈ అవయవాల మార్పిడి కోసం జరిగే శస్త్రచికిత్స వల్ల కూడా రోజా భంగం కాదు. మెదడు లేక అన్నకోశం దాకా చేరుకొని ఆరోగ్యం చేకూర్చే పదార్థాల వల్లనే ఉపవాసం భంగమవుతుంది. అయితే శస్త్రచికిత్సతో పాటు ఈ అవయవాల్లో ఏదైనా మందు కూడా వేస్తే ఉపవాసం భంగమవుతుందని ధర్మవేత్తలు తెలిపారు.

ఇక పొట్ట, మెదడుకు సంబంధించిన ఆపరేషన్‌ల విషయానికి వస్తే, ఈ అవయవాల్లో కొత్తగా ఎలాంటి పదార్థాన్ని ప్రవేశపెట్టని పక్షంలో ఈ ఆపరేషన్‌లు ఉపవాసాన్ని ప్రభావితం చేయలేవు. అలాకాకుండా ఆపరేషన్ చేసి లోపల మందు వేస్తే లేదా కృత్రిమ అవయవం దేన్నయినా ప్రవేశపెడితే ఉపవాసం భంగమవుతుంది.

ఈ సమస్యకు సంబంధించిన తార్కాణాలు ఫిఖ్హా గ్రంథాల్లో ఉన్నాయి. విరోధి లేక దుండగుడు పొడిచిన లేదా విసరిన కత్తిగాని, బుల్లెట్‌గాని అన్నకోశం దాకా దిగి దాన్ని తీసివేస్తే ఉపవాసం భంగం కాదు. ఒకవేళ ఆ కత్తి లేక బుల్లెట్ అలాగే పొట్టలో ఉండిపోతే కొందరి అభిప్రాయం ప్రకారం ఉపవాసం భంగమవుతుంది. మరికొందరి అభిప్రాయం ప్రకారం ఉపవాసం భంగం కాదు. వాస్తవదృష్టితో పరిశీలిస్తే ఇక్కడ ఉపవాసం భంగం కాదనే చెప్పాలి. అయితే ఆపరేషన్ విషయంలో ఉపవాసం భంగమవుతుంది. ఎందుకంటే దుండగుడు విసరిన కత్తి దేహానికి హాని కలిగించడం. కాని ఆపరేషన్ లక్ష్యం శరీరానికి ఆరోగ్యం, ప్రయోజనం చేకూర్చడం అవుతుంది.

పొట్ట ఆపరేషన్ సందర్భంలో డాక్టర్లు రోగి పొట్టలో నుంచి ఏదైనా అవయవాన్ని బయటికి తీసి, మళ్ళీ దాన్ని పొట్టలో యథాస్థానంలో ఉంచితే రోగి రోజా భంగమవుతుంది. దీనిక్కూడా ఫిఖ్హాగ్రంథాల్లో ఇలా ఉదాహరణలు పేర్కొన్నారు- కడుపు లోనుంచి నోటిలోకి వచ్చిన ఆహారం లేక మందును మళ్ళీ మింగితే, లేక కఫాన్నిగాని, లాలాజలాన్ని గాని నోటి నుంచి బయటికి తీసి మళ్ళీ మింగితే రోజా చెడిపోతుంది. అదేవిధంగా పొట్ట నుంచి అవయవం బయటికి తీసి మళ్ళీ ప్రవేశపెడితే రోజా చెడిపోతుంది.

✱ ఉపవాస వ్రతానికి భంగం కలిగించే ముఖ్యమై రెండవ విషయం సంభోగం, లేదా హస్తప్రయోగం. అంచేత సంభోగం, హస్తప్రయోగాలు ఉపవాస స్థితిలో నిషేధించబడ్డాయి. సంభోగం బలవంతంగా జరిగినా సరే ఉపవాసం భంగమవుతుంది. అలాగే మనస్సును అదుపులో పెట్టలేక ఈ చర్యలకు పాల్పడినా రోజా భంగమవుతుంది.

ఖుర్‌ఆన్ ఆదేశాలు అవతరించక పూర్వం కొందరు ముస్లింలు 'రమజాన్ ఉపవాసాలు అంటే ఎంతో నిష్ఠగా ఉండాలికదా!" అని భావించి ఉపవాస విరమణ తరువాత రాత్రి వేళ కూడా తమ భార్యలతో సంభోగించేవారు కాదు. ఖుర్‌ఆన్ ఇది ఆత్మద్రోహం అని చెప్పి, రాత్రివేళ సంభోగించవచ్చని తెలియజేసింది. (2:187 సూక్తి చూడండి.) ఉపవాస స్థితిలో పగటి వేళ మాత్రమే సంభోగం నిషిద్ధం.



**వీర్యస్ఖలనం:-** కలలో వీర్యస్ఖలనం జరిగిపోతే ఉపవాసానికి భంగం రాదు. స్వప్న స్ఖలనం జరిగిన పరిస్థితిలో కూడా సహ్‌రీ చేసి ఉపవాసం ప్రారంభించవచ్చు. అయితే స్వప్నస్ఖలనం జరిగిన తరువాత స్నానం చేసేటంత సమయం ఉంటే స్నానం చేయాలి. స్నానం చేసేటంత సమయం లేకపోతే త్వరగా సహ్‌రీ చేసి ఉపవాసం ప్రారంభించాలి. ఆ తరువాత స్నానం చేసి ఫజర్ నమాజ్‌కు వెళ్ళాలి.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "రమజాన్ మాసంలో దైవప్రవక్త (సల్లం)కు ఒక్కోసారి ఆయన లైంగిక అపరిశుద్ధవస్థలో ఉన్నప్పుడు ఫజర్ వేళ వస్తుంది. ఈ లైంగిక అపరిశుద్ధావస్థ స్వప్నస్ఖలనం వల్ల ఏర్పడే అపరిశుద్ధావస్థ లాంటిదే. కనుక దైవప్రవక్త (సల్లం) ఉపవాస స్థితిలో ఉండగా స్నానం చేసేవారు." (బుఖారి, ముస్లిం)

ఈ హదీసులో రమజాన్ ఉపవాసం పాటించడానికి స్వప్నస్ఖలనం అడ్డురాదని, ఇక్కడ స్వప్నస్ఖలనం వల్ల అయ్యే అపరిశుద్ధావస్థ సంభోగం వల్ల అయ్యే అపరిశుద్ధావస్థ లాంటిది కాదని స్పష్టంగా తెలియజేయబడింది. అంతేకాదు, పగటిపూట స్వప్నస్ఖలనం జరిగినా ఉపవాసం భంగం కాదని తెలుస్తోంది. కనుక ఇలాంటి పరిస్థితులు ఎదురయినప్పుడు ఉపవాసం పాటించవచ్చు. దానివల్ల ఉపవాసానికి ఎలాంటి మచ్చరాదు.

**ఉపవాస స్థితిలో భార్యతో ఎలా మసలుకోవాలి:-** భార్యఅన్నాక భర్త ఉపవాస స్థితిలో ఉన్నప్పటికీ ఎప్పుడో ఒకప్పుడు ఆమెను తాకడం, చేయి పట్టు కోవడం, కలసి కూర్చోవడం జరుగుతాయి. అప్పుడు పురుషుడు తన భార్యతో ఎలా మసలుకోవాలి? ఈ ప్రశ్నకు ఈ క్రింది హదీసు సమాధానమిస్తుంది:

హజ్రత్ ఆబూహురైరా (రజి) కథనం: "ఒకతను దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ 'ఉపవాసం పాటిస్తున్న మనిషికి తన భార్యతో కలసిమెలసి మసులుకునేందుకు అనుమతి ఉందంటారా?' అని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) ఆ వ్యక్తికి అలా మసలు కోవడానికి అనుమతి ఇచ్చారు. ఆ తరువాత మరొకతను వచ్చి దైవప్రవక్త (సల్లం)ను ఇదే ప్రశ్న అడిగాడు. అప్పుడు దైవప్రవక్త (స) అతడ్ని అలా మసలుకోకూడదని వారించారు. దైవప్రవక్త (స) అనుమతించిన మనిషి వయస్సు మీరిన వృద్ధుడు. కాగా దైవప్రవక్త (స) వారించిన మనిషి యువకుడు."

లైంగిక భావోద్రేకాలను అదుపులో ఉంచగలిగేవారు ఉపవాస స్థితిలో తన భార్యతో కలసిమెలసి మసులుకోవచ్చని, లైంగిక భావోద్రేకాలను అదుపులో ఉంచుకోలేనివారు అలా చేయకుండా జాగ్రత్త వహించాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది.

**వేసవితాపం, దప్పిక సమయాల్లో చన్నీటిస్నానం:-** తీవ్రమైన దాహాన్ని, వేసవి తాపాన్ని భరించలేనప్పుడు ఉపవాసి తల మీద చన్నీళ్ళు పోసుకోవడం వల్ల లేదా చన్నీటి స్నానం చేయడం వల్ల ఉపవాసం భంగం కాదు.

దైవప్రవక్త (సల్లం) సహబీ ఒకరు ఇలా తెలియజేశారు: "నేను (మక్కా, మదీనాల మధ్య ఉన్న) 'అర్జ్' ప్రదేశంలో దైవప్రవక్త (సల్లం) తల మీద నీళ్ళు పోసుకుంటుంటే చూశాను. అప్పుడాయన ఉపవాస స్థితిలో ఉన్నారు. తీవ్రమైన దప్పిక వల్లనో, వేసవి తాపం వల్లనో అలా చేశారాయన." (మాలిక్, అబూదావూద్)

వేసవి తాపం, దప్పిక తీవ్రతలను తగ్గించుకోవడానికి తల మీద చన్నీళ్ళు పోసుకుంటే ఉపవాసం భంగం కాదని పై హదీసు ద్వారా తెలుస్తోంది. అంతేకాదు, చన్నీళ్ళతో తలంటు స్నానం చేసినా, చన్నీళ్ళ గాబులో ఎంత సేపు కూర్చున్నా ఉపవాసం భంగం కాదని కూడా ఈ హదీసు వెలుగులో ధర్మవేత్తలు అభిప్రాయం వెలిబుచ్చారు.

**వాంతి అయితే రోజా భంగంకాదు:-** ఉపవాస స్థితిలో మనిషికి వాంతి దానంతటది వస్తే ఉపవాసం భంగంకాదు. ఉపవాసం పాటిస్తున్న వ్యక్తి కావాలని వాంతి చేసుకుంటే మటుకు ఉపవాసం భంగమవుతుంది. దానికి ఖజా ఉపవాసం పాటించవలసి ఉంటుంది.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "మనిషి ఉపవాస స్థితిలో ఉన్నప్పుడు వాంతి దానంతటది వస్తే అతను ఖజా ఉపవాసం పాటించనవసరం లేదు. మనిషి కావాలని వాంతి చేసుకుంటే మాత్రం ఖజా ఉపవాసం పాటించవలసి ఉంటుంది." (తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ)

హజ్రత్ మాదాన్ బిన్ తల్హా (రహ్మాలై) కథనం: నేను డెమాస్కస్ మస్జిద్‌లో హజ్రత్ సూబాన్ (రజి)ని కలుసుకోవడం జరిగింది. అప్పుడు నేనాయనతో మాట్లాడుతూ "దైవప్రవక్త (సల్లం) వాంతి చేసుకొని ఉపవాసం విరమించారని నాకు హజ్రత్ అబుద్దర్దా (రజి) చెప్పార"ని అన్నాను. హజ్రత్ సూబాన్ (రజి) ఈమాట విని "అబుద్దర్దా (రజి) నిజం చెప్పారు. నేను స్వయంగా దైవప్రవక్త (సల్లం) చేతిపై నీళ్ళు పోశాను. పుక్కిలించడానికి ఆయనకు నీళ్ళు అందించాను" అని అన్నారు. (అబూదావూద్, తిర్మిజి)

ఇక్కడ దైవప్రవక్త (సల్లం) నఫిల్ రోజా పాటించారు. వాంతి అయినప్పుడు నఫిల్ రోజా విరమించడంలో తప్పు లేదు.

# 58. ఇఫ్తార్ (ఉపవాస విరమణ)

రమజాన్ ప్రారంభంలో ఒకటి రెండు రోజులు ఉపవాసం భారం అన్పిస్తుంది. తరువాత అలవాటవుతుంది. అయితే సాధారణంగా మధ్యాహ్నం పదకొండు గంటల నుంచి మూడు గంటల వరకు ఉపవాసి కాస్తంత ఢీలాపడి పోతాడు. అయితే తమ దైనందిన పనుల్లో పూర్తిగా లీనమైపోయేవారికి ఉపవాసం ఉన్నట్లు కూడా అన్పించదు. జుహర్ నమాజ్ తరువాత కాస్తంత విశ్రాంతి తీసుకుంటే ఉపవాసి మళ్ళీ ఉత్తేజితుడై పోతాడు. ఈ విశ్రాంతి తరావీ నమాజ్ ఉత్సాహంగా చేయడానికెూడా తోడ్పడుతుంది.



"రోజా పాటింపులో సహ్రీ తినడం ద్వారా సహాయం తీసుకోండి. అలాగే తరావీ నమాజ్ నిర్వహణలో మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవడం ద్వారా సహాయం తీసుకోండి" అన్నారు మన ప్రియప్రవక్త (సల్లం)- (ఆసాన్ ఫిఖ్హా, రెండవ భాగం)

అసర్ వేళ తరువాత కాలం గడుస్తున్న కొద్దీ ఉపవాసి హృదయంలో ఉత్సాహం పెరుగుతూ ఉంటుంది. అదిగో సూర్యుడు బలహీనమైపోతున్నాడు. అతని వాడి కిరణాలు మందగించిపోతున్నాయి. పళ్ళు పలహారాలతో ఉపవాసకులు 'ఇఫ్తార్' కోసం సిద్ధమవుతున్నారు. ఉపవాసికి ఎంత సంతోషకరమైన సమయం అది!

తీవ్రమైన ఆకలిదప్పులతో ఢీలా పడిపోయి, కళ్ళు లోపలికి పీక్కుపోయి, జీవచ్ఛమై ఉండే మనిషికి గుక్కెడు గంజినీళ్ళు దొరికినా చాలు, అమితమైన సంతోషంతో పొంగిపోతూ దాన్ని అమృతంలా సేవిస్తాడు. అతని కళ్ళలో దైవం పట్ల కృతజ్ఞతాజ్యోతులు వెలిగిపోతాయి.

"ఉపవాసం పాటించే మనిషికి రెండు సంతోషకరమైన విషయాలు ఉన్నాయి. ఒకటి ఉపవాస విరమణ సమయంలో. రెండు, తన ప్రభువును సందర్శించే సమయంలో. ఉపవాసం పాటించే మనిషి నోటికంపు దేవునికి కస్తూరీ సువాసన కన్నా ఎంతో ప్రియమైనది." (బుఖారి, ముస్లిం)

సూర్యాస్తమయం కాగానే ఉపవాస విరమణ (ఇఫ్తార్) కోసం ఇలా దుఆ చేయాలి:

"అల్లాహుమ్మ లక సుమ్‌తు వఅలా రిజ్‌ఖిక అఫ్‌తర్తు"

(అర్థం- ఓ దేవా! నేను నీ కోసం రోజా పాటించాను. నీవు ప్రసాదించిన ఆహారంతోనే రోజా విరమిస్తున్నాను)

ఇలా దుఆ చేసిన తరువాత ఖర్జూర పండ్లుగాని, మరేదయినా పదార్థంగాని తినడం ద్వారా ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయాలి. ఇఫ్తార్ చేసిన తరువాత ఈవిధంగా 'దుఆ' చేయడం మంచిది:

"జహబజ్జమాఉ వబ్‌తల్లతిల్ ఉరూఖు వసబతల్ అజ్‌రు ఇన్‌షాఅల్లాహ్"

అర్థం:- దాహం తీరింది. నరాలు నిండి పోయాయి. దేవుడు తలిస్తే ప్రతిఫలం కూడా తప్పకుండా లభిస్తుంది. (అబూదావూద్)

సూర్యాస్తమయం తరువాత ఇఫ్తార్ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకూడదు. సహ్రీ ఆలస్యంగా చేయాలని, ఇఫ్తార్ తొందరగా చేయాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. ఆ మహనీయుని ఆదేశం పాటించడం కంటే గొప్ప ధర్మపరాయణత మరేం కాగలుగుతుంది? ఆయన ఇలా ప్రవచించారు:

"ప్రజలు ఉపవాస విరమణ (ఇఫ్తార్) తొందరగా చేస్తున్నంత కాలం మంచికి కట్టుబడి ఉంటారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "రాత్రి (చీకటి) అటువైపు నుంచి రావడం ప్రారంభమయి, పగలు (వెల్తురు) ఇటు వైపు నుంచి (కనుమరుగై) పోవడం మొదలయి సూర్యుడు అస్తమించినప్పుడు ఉపవాసికి అతని ఉపవాస సమయం ఆరంభమవుతుంది." (ముత్తఫకున్ అలై)

దైవప్రవక్త (సల్లం) దేవుని మాటలను ఇలా తెలిపారు: "నా దాసులలో అందరి కంటే ఉపవాస విరమణలో తొందర చేసేవారే నాకెక్కువ ప్రియమైనవారు." (తిర్మిజి)

హజ్రత్ ఇబ్నె అబీ ఔఫా (రజి) కథనం: మేమొక సారి దైవప్రవక్త (సల్లం)తో కలసి ప్రయాణం చేస్తున్నాం. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఉపవాసంతో ఉన్నారు. సూర్యుడు కనుమరుగైపోగానే ఆయన (మాలో) ఒకతడ్ని ఉద్దేశించి "దిగు. దిగి నా కోసం సత్తుపిండి కలిపి తీసుకురా" అన్నారు. అతనీ మాట విని "దైవప్రవక్తా! ఇంకాస్సేపు ఆగండి, చీకటి అలుముకుంటే మంచిది కదా!" అని అన్నాడు. కాని దైవప్రవక్త (సల్లం) అతడ్ని మళ్ళీ ఆదేశిస్తూ "వాహనం దిగి నా కోసం సత్తుపిండి కలిపి తీసుకురా" అన్నారు. దానికా వ్యక్తి "దైవప్రవక్తా! పగటి వెల్తురు ఇంకా ఉంది కదా! (ఇంకాస్సేపు ఆగితే మంచిదేమో)" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) మళ్ళీ "వాహనం దిగి నా కోసం సత్తుపిండి కలిపి తీసుకురా" అన్నారు.

అప్పుడతను వాహనం దిగి మాఅందరి కోసం సత్తుపిండి తయారుచేశాడు. దైవ ప్రవక్త (స) సత్తుపిండి తిని "రాత్రిచీకటి అటు(తూర్పు) వైపు నుండి అలుముకోనారంభించడం చూడగానే ఉపవాసి తన ఉపవాసాన్ని విరమించాలి" అన్నారు. (బుఖారి)

గ్రంథప్రజలు, ముఖ్యంగా యూదులు ఉపవాసం ద్వారా తమను కష్టపెట్టుకోవడాన్ని గొప్ప ధర్మపరాయణత అని భావిస్తారు. దీనికి భిన్నంగా ఉపవాసం ద్వారా ఆకలిదప్పులతో మనిషిని బాధపెట్టడం ఇస్లాం ఉద్దేశ్యం కాదు. ఇక్కడ మనిషి దేవునికి, ఆయన ప్రవక్త (స)కు పూర్తిగా విధేయుడయి వారి ఆదేశాలను పాటించడమే అసలైన ధర్మపరాయణత అన్పించుకుంటుంది.

ఉపవాసికి ఇఫ్తార్ చేయించడం గొప్ప పుణ్యకార్యం. ఈ కారణంగానే రమజాన్ మాసంలో అనేకమంది ఉపవాసం పాటించేవారికి ఇఫ్తార్ పార్టీలు ఇస్తుంటారు. ఈనాడు ముస్లింలు, ముస్లిమేతరులన్న తేడా లేకుండా రాజకీయ నాయకులు సైతం ఓటర్ పాపులారిటీ కోసం అనేకమందిని సమీకరించి ఇఫ్తార్ పార్టీలు ఇస్తున్నారు.

హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: "ఒక వ్యక్తి ఏ ఉపవాసికైనా ఉపవాస విరమణ చేయిస్తే లేదా ఏ యోధుడి కోసమైనా (యుద్ధ) సామగ్రి సరఫరా చేస్తే అలాంటి వ్యక్తికి ఉపవాసికి ఉపవాసం పాటించినందుకు లభించే, యోధుడికి యుద్ధం (జిహాద్) చేసినందుకు లభించే పుణ్యమే లభిస్తుంది." (బైహఖి)



# 59. ఆంక్షల సంక్షిప్త స్వరూపం

ఖుర్‌ఆన్, హదీసుల్ని లోతుగా అధ్యయనం చేసిన మన షరీఅత్ వేత్తలు ఉపవాసం లక్ష్యాన్ని, దాని స్పిరిట్‌ని దృష్టిలో పెట్టుకొని ఉపవాస స్థితిలో మనిషి చేయకూడని పనులేమిటో వివరంగా తెలియజేశారు. వాటిని నేనిక్కడ పేర్కొంటున్నాను:

ఉపవాస స్థితిలో కొన్ని చెయ్యరాని పనులున్నాయి. వాటివల్ల రోజా భంగమవుతుంది. అలాగే చెయ్యగలిగే పనులు మరికొన్ని ఉన్నాయి. వీటిని చేసినా ఉపవాస వ్రతానికి భంగం రాదు. అందువల్ల వీటిని గురించి తెలుసుకోవడం అవసరం.

## చెయ్యకూడని పనులు

- ☆ తినడం
- ☆ త్రాగడం
- ☆ సంభోగించడం
- ☆ వీర్యం వెలువడే చేష్టలకు పాల్పడటం
- ☆ ఇతర అవయవాల ద్వారా మందు, తైలం వంటి పదార్థాలను శరీరంలోకి పంపడం.
- ☆ రోజా సంకల్పం (నియ్యత్) చేయకపోవడం
- ☆ కావాలని వాంతి చేసుకోవడం
- ☆ పొగత్రాగడం, నశ్యం పీల్చడం
- ☆ సహ్రీ వేళ ముగిసిన తరువాతగాని, సూర్యాస్తమయానికి ముందుగాని తినడం, త్రాగడం, సంభోగించడం.

పై పనులు పొరపాటున సంభవిస్తే లేక ఎవరయినా బలవంతంగా చేయిస్తే ఖజా రోజాలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. అయితే మరచిపోయి తినడం, త్రాగడం చేసి గుర్తురాగానే మానేస్తే ఉపవాసం భంగంకాదు.

## అవాంఛనీయమైన పనులు

ఈ క్రింది పనులు చేయడం వల్ల ఉపవాసానికి భంగం కలగకపోయినా, అవాంఛనీయ (మక్రూహ్) చర్యలుగా పరిగణించబడతాయి. వీటికి సాధ్యమయినంత దూరంగా ఉండటంలోనే మన శ్రేయస్సు వుంది.

- ☆ పదార్థాల రుచి చూడటం
- ☆ నోట్లో ఏదయినా వస్తువు వేసుకొని నమలడం, చప్పరించడం
- ☆ లైంగికవాంఛతో అర్ధాంగి దగ్గరికి వెళ్ళడం

- ✯ స్వయంగా ఉపవాసాన్ని భంగపరిచే స్థితి వచ్చేంతటి తలకు మించిన కష్ట మయిన పనులు చేయడం, లేదా అతిగా శ్రమించడం.
- ✯ పళ్ళపొడి, పేస్టు, బొగ్గు, ఉప్పుతో పళ్ళు తోముకోవడం.
- ✯ అసత్యమాడటం, పరోక్షంగా ఇతరుల్ని నిందించడం, దుర్భాషలాడటం, వ్యక్తిగత వ్యవహారంలో రెచ్చిపోవడం. ఈ చెడులు ఇతర దినాల్లో కూడా అధర్మమే అయినా రమజాన్ నెలలో ప్రత్యేకంగా వీటిని విడనాడాలి.

## చెయ్యగలిగే పనులు

- ✯ కళ్ళకు కాటుక లేదా సుర్మా పెట్టుకోవడం
- ✯ సువాసన పూసుకోవడం, వాసన చూడటం
- ✯ తలకు నూనె రాసుకోవడం, మాలిష్ చేసుకోవడం
- ✯ లైంగిక వాంఛ లేకుండా అర్ధాంగిని కౌగలించుకోవడం
- ✯ ఉమ్మిని కూడబెట్టకుండా మింగడం
- ✯ స్వప్నస్కలనం
- ✯ అప్రయత్నంగా వాంతిచేసుకోవడం
- ✯ వేపపుల్ల, ఉత్తరేణి, ఉత్త బ్రష్ మిస్వాక్‌లతో పళ్ళు తోముకోవడం.
- ✯ ఎండ వేడిమి వల్ల శరీరంపై చన్నీళ్ళు చల్లుకోవడం, తడిగుడ్డ వేసుకోవడం, స్నానం చేయడం.
- ✯ (పగటి పూట) నిద్రించడం
- ✯ సహ్‌రీ భుజించడంలో జాప్యం చెయ్యడం
- ✯ నీరు పుక్కిలించేటప్పుడు కాకతాళీయంగా గొంతులోకి దిగిపోవడం వల్ల రోజాకు భంగం రాదు.
- ✯ దోమగాని, ఈగగాని యాదృచ్ఛికంగా గొంతులోకి పోవడంవల్ల కూడా రోజా భంగం కాదు.
- ✯ రోజా సంకల్పం, ఇఫ్తార్ (ఉపవాస విరమణ) దుఆ ఏ భాషలోనయినా చేసుకోవచ్చు.

## రోజా అవసరం లేనివారు

ఈ క్రింది వ్యక్తులు రమజాన్ ఉపవాసాలు పాటించడం విధి కాదు.

- ❇ ప్రయాణీకులు (తాము ఉండే ఊరు నుంచి 48 మైళ్ళ దూరం దాటిన ఊళ్ళకు పయనమయ్యేవారే షరీఅత్ పరిభాషలో ప్రయాణీకులనబడతారు)
- ❇ బాగా వయసుమీరి బలహీనమైపోయిన వృద్ధులు



- ❇ వ్యాధిగ్రస్తులు
- ❇ గర్భిణీ స్త్రీలు
- ❇ పిల్లలకు పాలిచ్చే స్త్రీలు
- ❇ జిహాద్ (ధర్మయుద్ధం)లో పాల్గొన్నవారు
- ❇ పిల్లలు, పిచ్చివాళ్ళు
- ❇ ఉపవాస సమయంలో తీవ్రమయిన ఆకలి దప్పులు ఏర్పడి ప్రాణం పోతుం దన్న భయమున్నప్పుడు, మరేదయినా ప్రాణాపాయం వాటిల్లే పరిస్థితి ఎదురై నప్పుడు ఉపవాసం విరమించవచ్చు.
- ❇ స్పృహ తప్పినప్పుడు కూడా ఉపవాసం విరమించవచ్చు.
- ❇ రుతుస్రావం, పురిటిస్రావంతో ఉన్న స్త్రీలు అసలు రోజాలే పాటించరాదు.

పై వ్యక్తులకు ఈ పరిస్థితులు తొలగిపోయిన తరువాత ఖజా రోజాలు పాటించాలి. అసలు ఎన్నటికీ ఉపవాసం పాటించలేని వృద్ధులయితే అరవై మంది పేదలకు (ఫిదియాగా) రెండు పూటలా భోజనం పెట్టాలి. లేదా దాని ఖరీదు ధనధాన్యాదుల రూపంలోనయినా పేదలకు ఇవ్వవచ్చు.

## పరిహారం, ప్రాయశ్చిత్తం

ఎవరైనా రమజాన్ మాసంలో షరీఅత్ పరమైన ఎలాంటి కారణం లేకుండా కేవలం బద్ధకంతో ఒక రోజు ఉపవాసం మానేసినా లేదా ఉపవాస స్థితిలో మనస్సును అదుపులో పెట్టుకోలేక భార్యతో రమించినా సరే, దానికి ప్రాయశ్చిత్తంగా రెండు నెలలు నిరంతరాయంగా ఉపవాసాలు పాటించాలి. ఆ రెండునెలల రోజులలో ఒక్క రోజు తప్పినా మళ్ళీ రెండు నెలలు నిరంతరాయంగా ఉపవాసం పాటించవలసి ఉంటుంది. ఒకవేళ వృద్ధులు, బలహీనులు ఎవరైనా నిరంతరాయంగా రెండు నెలలు ఉపవాసం పాటించలేకపోతే అరవై మంది పేదలకు రెండు పూటలా కడుపునిండా భోజనం పెట్టాలి. అది తాను తినేటటువంటి భోజనమయి ఉండాలి.

❖ ఎవరయినా ఉద్దేశ్యపూర్వకంగా తినడం, త్రాగడం, సంభోగించడం చేస్తే అలాంటివారు ప్రాయశ్చిత్తం (కఫ్ఫారా)గా రెండు నెలలు నిరంతరాయంగా ఉపవాసాలు పాటించవలసి ఉంటుంది. పైగా భంగమైపోయిన ఉపవాసాలు తిరిగి ఖజా రోజాలుగా పాటించడం కూడా జరగాలి.

❖ ఎవరయినా షరీఅత్ పరమైన కారణం ఏదీ లేకుండా కొన్ని ఉపవాసాలు నాగా చేస్తే లేదా అసలు ఉపవాసాలే పాటించకపోతే అలాంటివారు కఫ్ఫారా (ప్రాయ శ్చిత్తం)గా రెండు నెలలు నిరంతరయాంగా ఉపవాసాలు పాటించాలి.

❖ ఏదైనా షరీఅత్‌పరమైన కారణం వల్ల ఉపవాసం పాటించకపోతే కఫ్ఫారాగా

60 మంది పేదలకు రెండు పూటలా భోజనం పెట్టాలి లేదా దాని ఖరీదు ఇవ్వాలి.

❖ శక్తి ఉడిగిపోయిన వృద్ధులు, ఇక కోలుకోగలమన్న ఆశలేని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఫిదియా (పరిహారం)గా 60 మంది పేదలకు రెండు పూటలా భోజనం పెట్టాలి లేదా దాని ఖరీదు ఇవ్వాలి.

# 60. పాపం పోయి పారితోషికం దక్కింది

అది రమజాన్ మాసం. ఉపవాసాలు పాటించే ముస్లిములపై శుభాల వర్షం కురిపించే పవిత్రమైన సీజన్. మదీనాలో ముస్లింలంతా ఉపవాస వ్రతాలతో వరాల వసంతానికి నీరాజనం పడ్తున్నారు. ఓ రోజు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కొందరు అనుచరులతో సమావేశమయి ఉన్నారు. అప్పుడు ఒక వ్యక్తి ఎంతో ఆందోళన చెందుతూ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చాడు. అతని బక్కచిక్కిన శరీరం, చినిగిన బట్టలు అతని దుర్భర దారిద్ర్యాన్ని చెప్పకనే చెబుతున్నాయి. అతను వచ్చీరాగానే అన్నాడు:

"దైవప్రవక్తా! నేను నాశనమయిపోయాను" అక్కడ కూర్చున్నవారందరి దృష్టి ఒక్కసారిగా ఆ వ్యక్తి మీదికి మళ్ళింది.

"ఏమిటి! ఏమయింది నీకు?" అడిగారు దైవప్రవక్త (సల్లం) ఆదుర్దాగా.

"దైవప్రవక్తా! నేను ఉపవాసం ఉండి నా భార్యతో కలిశాను" అన్నాడా వ్యక్తి అదురుతున్న గుండెలతో.

"అయితే (దీనికి పరిహారంగా) నువ్వు ఒక బానిసను (విముక్తి కలిగించడానికి) తీసుకురాగలవా?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"తీసుకురాలేనండీ!" అన్నాడతను.

"సరే, మధ్యలో ఒక్క నాగా కూడా లేకుండా వరుసగా రెణ్ణెల్ల పాటు ఉపవాసం పాటించగలవా?" మళ్ళీ ప్రశ్నించారు దైవప్రవక్త (సల్లం)

"(అన్ని రోజులు) పాటించలేనండీ"

"పోనీ, అరవై మంది పేదలకు అన్నదానం చేయగలవా?"

"లేదండీ, అంత తాహతు కూడా లేదండీ నాకు" అన్నాడు ఎముకల గూడులో నకనకలాడుతున్న ఆ వ్యక్తి.

"అయితే అక్కడ కూర్చో కాస్సేపు" అన్నారు దైవప్రవక్త (సల్లం)

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు. అంతలో ఎవరో ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి ఖర్జూర పండ్లతో నిండిన ఓ పెద్ద బుట్ట తీసుకువచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం)-



"ఏడా మనిషి? నాశనమయిపోయానంటూ వచ్చిన మనిషి ఎక్కడున్నాడు?" అన్నారు ఎదురుగా ఉన్న అనుచరుల్ని ఉద్దేశించి.

"ఇక్కడే ఉన్నానండి నేను" అంటూ ఆ వ్యక్తి వెంటనే లేచి దైవప్రవక్త (సల్లం) సమీపానికి వచ్చాడు.

"ఇదిగో ఈ పళ్ళబుట్ట తీసికెళ్ళి (నీ పాపానికి ప్రాయశ్చిత్తంగా ఇందులోని పళ్ళు) పేదలకు దానంచెయ్యి"అన్నారు దైవప్రవక్త (సల్లం).

"దైవప్రవక్తా! (ఈ పళ్ళు తీసికెళ్ళి) నాకంటే ఎక్కువ పేదవాడికి దానం చెయ్యమంటున్నారా? దైవసాక్షి! నాకుటుంబానికి మించిన పేదకుటుంబం మొత్తం మదీనాలోనే లేదు" అన్నాడా వ్యక్తి.

ఈ మాటలు వినగానే దైవప్రవక్త (సల్లం) పకాలున నవ్వారు.

"సరే, ఈ పళ్ళను నువ్వే తీసికెళ్ళి నీ భార్యాపిల్లలకు తినిపించు" అన్నారు ఆయన (పళ్ళబుట్టను ఆ నిరుపేద అనుచరుడికి అందజేస్తూ).

**(సహీ బుఖారి, సహీ ముస్లిం గ్రంథాలలోని ఒక హదీసు ఆధారంగా)**

# 61. మహా శుభరాత్రి

యావత్ మానవ చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఓ అద్భుత మహాత్కార్యం సంభవించింది. ఆ మహాత్కార్యం మానవుల చరిత్ర గతిని సమూలంగా మార్చివేసి, ఓ నూతన ప్రపంచ ఆవిష్కరణకు నాందీ వాచకం పలికింది. అది మానవుని సకల జీవన రంగాల్లోనూ అణువణువునా మానవత్వాన్ని నూరిపోసి అతడ్ని అత్యున్నత నైతిక శిఖరాలపైకి చేర్చింది. ఈ మహాత్కార్యం సంభవించిన శుభ సమయం ఒక రాత్రిలో కొన్ని ఘడియలు మాత్రమే అయినప్పటికీ ఆ రాత్రి అంతా శుభప్రదమయిన రాత్రే. అంతేకాదు ఆ రాత్రి వచ్చే నెల కూడా శుభప్రదమైనదిగానే పరిగణించబడింది. ఆ నెలే వరాల వసంతమయిన రమజాన్ మాసం.

రమజాన్ నెలలోని ఆ శుభరాత్రినే ఖుర్ఆన్ "లైలతుల్ ఖద్ర్" అని పేర్కొన్నది.

"మేము దీన్ని ఘనతగల మహారాత్రిన అవతరింపజేశాం. ఘనతగల ఆరాత్రి ఏమిటో నీకేం తెలుసు? ఆ మహారాత్రి వేయినెలల కన్నా ఎంతో శ్రేష్ఠమైనది. ఆ రాత్రి పరిశుద్ధాత్మ, దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి వ్యవహారానికి సంబంధించిన ఆజ్ఞలు తీసుకొని అవతరిస్తారు. అది ఉషోదయం వరకు పూర్తిగా శుభవంతమైన రాత్రి." (దివ్యఖుర్ఆన్–97:1–5)

'ఖద్ర్' అంటే ఎంతో విలువైన, ఘనమైన, గౌరవప్రదమైన అని అనేక అర్థాలు ఉన్నాయి. లైలతుల్ ఖద్ర్ అంటే ఎంతో విలువైన, ఘనమైన, గౌరవప్రదమైన రాత్రి

అని భావం. దుఖాన్ సూరాలో ఖుర్‌ఆన్ ఓ శుభరాత్రి అవతరించిందని ఉంది. అంటే ఈ రాత్రిని గొప్ప శుభాల నిలయంగా పేర్కొనవచ్చు.

ఈ వరాలవసంతాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి దైవప్రవక్త (సల్లం) షాబాన్ నెల నుంచే తేదీలు లెక్కబెడ్తూ రమజాన్ నెలారంభ సమయం కోసం ఎదురు చూసేవారు. దాన్ని గురించి అనుచరులకు కూడా తాకీదు చేస్తూ "రమజాన్ తేదీలు తెలుసుకోవడానికి వీలుగా షాబాన్ నెలవంక లెక్కగడ్తూ ఉండండ"ని సెలవిచ్చారు.

రమజాన్ నెల రోజులపాటు స్పృహవచ్చిన ప్రతి ముస్లిం ఉపవాసం పాటించాలని విధి (ఫర్జెఅయిన్)గా నిర్ణయించబడింది. దీన్ని నిరాకరించినవాడు కాఫిర్ అవుతాడని, షరీఅత్ పరమైన కారణం లేకుండా రమజాన్ ఉపవాసాలు విడనాడినవాడు ఫాసిఖ్ (పాపాత్ముడు)గా పరిగణించబడతాడని ఫిఖ్హావేత్తలు నిర్ధారించారు.

దైవప్రవక్త (స) షాబాన్ నెల చివరిరోజుల్లో ఓసారి ఇలా బోధించారు: "ప్రజలారా! మీ కోసం ఒక మహోజ్వలమైన, ఎనలేని శుభాల నెల రాబోతున్నది. అందులోని ఒక రేయి వేయి నెలల కన్నా శ్రేష్ఠమైనది. దేవుడు ఈ నెలలో ఉపవాసాల పాటింపు విశ్వాసులకు) విధి (ఫర్జెఅయిన్)గా నిర్ణయించాడు." (బైహఖి)

వేరొక ఉల్లేఖనంలో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "మీకు ఈ నెల వచ్చింది. ఇందులో ఒక రాత్రి వేయి నెలల కంటే కూడా ఎంతో శ్రేష్ఠమైనది. దీనికి నోచుకోనివాడు యావత్తు శ్రేయోశుభాలకు దూరమయిపోతాడు. పరమదౌర్భాగ్యుడే దాని శ్రేయోశుభాలకు దూరమయిపోతాడు." (ఇబ్నెమాజ)

అందువల్ల రమజాన్ రోజాలను నిరాకరించినవాడు కాఫిర్ అవుతాడని, షరీఅత్ పరమైన కారణం లేకుండా వీటిని వదలినవాడు ఫాసిఖ్ (పాపాత్ముడు)గా పరిగణించ బడతాడని ఫిఖ్హావేత్తలు నిర్ధారించారు.

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: లైలతుల్ ఖద్ర్ రాగానే హజ్రత్ జిబ్రీల్ (అలైహి) ఓ పెద్ద దైవదూతల బృందంతో భూలోకానికి వస్తారు. ఆ సమయంలో నిల్చొని, కూర్చొని మహోన్నతుడైన దేవుడ్ని స్మరించే ప్రతి దైవదాసుడి కోసం ఆయన దుఆ చేస్తారు. పండుగ రోజు వచ్చాక దేవుడు తన దాసుల్ని గురించి దైవదూతల ముందు గర్విస్తాడు. వారిని సంబోధిస్తూ "దైవదూతలారా! తనకు అప్పగించిన పనిని నెరవేర్చిన కార్మికుడికి ప్రతిఫలం ఏమిటీ?" అని ప్రశ్నిస్తాడు. దానికి దైవదూతలు "కార్మికుడికి అతని వేతనం పూర్తిగా ఇచ్చేయాలి" అని అంటారు. అప్పుడు దేవుడు ఇలా అంటాడు:

"దైవదూతలారా! నేను నా దాసులకు, దాసీలకు అప్పగించిన బాధ్యతను వారు నెరవేర్చారు. ఇప్పుడు వీరు నన్ను దీనాతిదీనంగా వేడుకోవడానికి ఇండ్ల నుంచి (ఈద్ నమాజ్ కోసం) బయలు దేరారు. (వినండి!) నా గౌరవప్రతిష్ఠల సాక్షిగా, నా రౌద్రత సాక్షిగా, నా దాక్షిణ్యం సాక్షిగా, నా మహోన్నత హోదా-అంతస్తుల సాక్షిగా, నా అత్యున్నత



స్థాయి సాక్షిగా, చెబుతున్నాను- నేను వీరి వేడుకోళ్ళను తప్పకుండా స్వీకరిస్తాను." ఆ తరువాత దేవుడు తన దాసుల్ని ఉద్దేశించి "(నా దాసులారా!) నేను మిమ్మల్ని క్షమించాను. మీ పాపాలను పుణ్యాలుగా మార్చేశాను, వెళ్ళండి" అంటాడు-

దైవప్రవక్త (సల్లం) ఈ విషయాలు చెబుతూ "అప్పుడు వారు దేవుడు తమను క్షమించిన స్థితిలో తమ (ఇండ్లకు) మరలి పోతారు" అని అన్నారు. (బైహఖి)

రమజాన్ వంటి పవిత్ర మాసంలో 'ఆ మహోత్కార్యం' సంభవించిన శుభరాత్రి మరెంతటి పవిత్రమైనదో, ఘనమైనదో ఊహించండి. ఈ ఒక్క రాత్రే వేయి నెలలకంటే శుభప్రదమయినదని దైవగ్రంథం కూడా పేర్కొన్నది. అంటే ఈ ఒక్క రాత్రి మనం చేసే దైవారాధనలు, సత్కార్యాలు ఇతర వేయి నెలల్లో చేసే ఆరాధనలు, సత్కార్యాల కన్నా ఎంతో శ్రేష్ఠమైనవని అర్థం.

ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) "దైవప్రవక్తా! నాకే గనక లైలతుల్ ఖద్ర్‌ని దర్శించే భాగ్యం లభిస్తే దైవాన్ని నేనేం వేడుకోను?" అని అడిగారు. అప్పుడు మహాప్రవక్త (స) "అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్ వఫ అవఫ్ అన్నీ" (దేవా! నీవు అమితంగా క్షమించేవాడివి. క్షమాభిక్ష అంటే నీకెంతో ఇష్టం. కనుక నన్ను క్షమించు) అని వేడుకో అన్నారు. (మిష్కాత్)

ఈ "మహారాత్రిన మన పాపాల మన్నింపు కోసం దైవాన్ని వేడుకోవడం నఫిల్ నమాజ్ చేయడం కన్నా ఉత్తమం" అని ఇమామ్ సుఫియాన్ సౌరీ (రహ్మలై) అన్నారు.

దివ్యఖుర్‌ఆన్‌లోని 'ఖద్ర్' సూరాలో "దైవదూతలు, జిబ్రయీల్ (అలైహి) ఈ రాత్రి తమ ప్రభువాజ్ఞతో అన్ని రకాల ఉత్తర్వులను, ఆదేశాలను తీసుకొని అవతరిస్తారని" ఉంది. దుఖాన్ సూరాలో ఈ రాత్రిని దైవాజ్ఞతో అన్ని వ్యవహారాలకు సంబంధించిన తిరుగులేని గట్టి నిర్ణయాలు జారీ చేయబడే రాత్రి అని పేర్కొనడం జరిగింది.

కొన్ని హదీసుల్ని బట్టి దైవాజ్ఞ ప్రకారం దైవదూతలు ఈ 'రాత్రి' మానవ ప్రపంచాన్ని సందర్శిస్తారు. ఒక సంవత్సరం కాలానికి వ్యక్తుల, జాతుల మంచి-చెడులకు, కష్ట సుఖాలకు సంబంధించిన వార్షిక భవితవ్యాన్ని (తఖ్దీర్‌ని) నిర్ణీత ఘడియల ప్రకారం అమలుపరిచేందుకు దేవుడు ఈ దూతల్ని నియమిస్తాడు. వీరు దాన్ని ఖచ్చితంగా అమలు పరుస్తారు. అంటే ఒక ఏడాది కాలంలో సంభవించబోయే మానవుల పుట్టుక, చావు, కలిమిలేములు, యుద్ధాలు, కరువులు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు, సత్కార్యాలు, దుష్కార్యాలు మొదలయిన సమస్త విషయాలకు సంబంధించిన దైవ నిర్ణయాలను తీసుకొని దైవదూతలు 'ఈ రాత్రి' భువిపై దిగుతారు. ఈ కారణంగా ఈ శుభరాత్రిని 'లైలతుల్ హుక్మ్" అని, "లైలతుత్తక్దీర్" అని కూడా అంటారు.

ఇక్కడ మనిషి భవితవ్యం దైవదూతల చేతుల్లో ఉందని అర్థం కాదు. మానవుల మంచి చెడులు, కష్టసుఖాలకు సంబంధించిన భవితవ్యమంతా నిజానికి విశ్వప్రభువు

అధీనంలోనే ఉంది. ఒక ఏడాది కాలానికి వ్యక్తులు, జాతులకు సంబంధించిన భవితవ్యాన్ని (తఖ్దీర్‌ని) నిర్ణీత ఘడియల ప్రకారం అమలు జరిపేందుకు దేవుడు తన దూతల్ని నియమిస్తాడు, ఈ దూతలు దాన్ని ఖచ్చితంగా అమలుజరుపుతారు, మానవుని చావుపుట్టుకలు, కలిమిలేములు, యుద్ధాలు, వైపరీత్యాలు, కరువులు, శాంతి, సదాచరణ, దురాచరణ మొదలయిన సమస్త విషయాలకు సంబంధించిన దైవ నిర్ణయాలను తీసుకొని దైవదూతలు ఈ రాత్రి భువిపై దిగుతారు. అందువల్ల ఇలాంటి మహారాత్రి చేసే సత్కార్యాలకు ఎంతో విలువ ఉంటుంది.

అందువల్ల ముస్లిమ్‌లు ఈ రాత్రిని ఏమాత్రం వృధా పోనివ్వకుండా సాధ్యమైనంత వరకు ప్రతి ఘడియనూ సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించాలి. చిత్తశుద్ధితో, పరలోక ప్రతిఫలాపేక్షతో ఈ రాత్రి దైవారాధనలో గడిపినవారి గతపాపాలన్నీ క్షమించ బడతాయి.

ఖుర్‌ఆన్‌లో ఈ మహారాత్రి వేయి నెలల కంటే శ్రేష్ఠమైనదని ప్రశంసించబడింది. అయితే రమజాన్ మాసంలో ఇంత ఘనత వహించిన రాత్రి ఏది అనే ప్రశ్న ఉత్పన్న మవుతుంది. దీన్ని గురించి భేదాభిప్రాయాలున్నాయి. ధర్మవేత్తల్లో అత్యధిక మంది ఈ రాత్రి రమజాన్ నెలలో చివరి పది తేదీల్లోని బేసి రాత్రి అని నిర్ణయించారు.

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం ప్రకారం 'లైలతుల్ ఖద్ర్'ని రమజాన్ నెల చివరి పది రాత్రుల్లోని బేసి సంఖ్యగల రాత్రుల్లో అన్వేషించమని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు. (బుఖారి, ముస్లిం, తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా సెలవిచ్చారు: "లైలతుల్ ఖద్ర్‌ని రమజాన్ నెల చివరి దశకంలో అన్వేషించండి. అంటే 21, 23, 25, 27, 29 తేదీలలో అన్వేషించండి." (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) అనుచరులు అనేక మంది రమజాన్ నెల చివరి ఏడు తేదీలలో లైలతుల్ ఖద్ర్ ఉన్నట్లు కల గాంచారు. ఈ వార్త దైవప్రవక్త (సల్లం) దృష్టికి రాగా ఆయన ఇలా అన్నారు: "మీరు కలలో రమజాన్ నెల చివరి ఏడు రోజుల విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కన్పిస్తున్నారు. కనుక ఇక నుంచి లైలతుల్ ఖద్ర్‌ని అన్వేషించే మనిషి రమజాన్ నెల చివరి ఏడు తేదీలలో అన్వేషించాలి." (ముత్తఫఖున్ అలై)

లైలతుల్ ఖద్ర్‌కు సంబంధించిన జ్ఞానాన్ని దేవుడు వాపసు తీసుకున్నప్పుడు దైవప్రవక్త (సల్లం) తమ అనుచరులతో "బహుశా అందులోనే మీ శ్రేయస్సు ఉంది కనుక మీరిప్పుడు దాన్ని 21వ తేదీ లేదా 23వ తేదీ లేదా 25వ తేదీ రాత్రి వెతకండి" అని సెలవిచ్చారు. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "27వ రాత్రి లేక 29వ రాత్రి అని ఈ మహారాత్రిని గురించి దైవప్రవక్త (సల్లం) అన్నారు." (అబూదావూద్)



హజ్రత్ అబూజర్ (రజి)ను ఈ రాత్రిని గురించి అడిగితే ఆయన, హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ హుజైఫా (రజి), ఇంకా ఇతర సహాబీలలో ఏ ఒక్కరికీ ఆ రాత్రి 27వ రాత్రి అనే విషయలో అనుమానంలేకుండేదని అన్నారు. (ఇబ్నె అబిషైబా)

షబేఖద్ర్ గురించి సహాబీల అభిప్రాయాలు ఎలా ఉన్నా దేవుడు అది ఫలానా రాత్రి అని మాత్రం నిక్కచ్చిగా చెప్పలేదని తెలుస్తోంది. దీనిక్కారణం ప్రజలు ఏదో ఒక రాత్రితో తృప్తిపడకుండా ఆ మహారాత్రి శుభాలతో ప్రయోజనం పొందాలనే ఆసక్తితో వీలైనన్ని ఎక్కువ రాత్రులు దైవారాధనలో గడుపుతారని కావచ్చు.

"లైలతుల్ ఖద్ర్"లో రాత్రి అన్న పదం గురించి ఒక సందేహం సహజంగా కలుగుతుంది. అరేబియాలో రాత్రి అయినప్పుడు ప్రపంచంలోని ఇతర అనేక దేశాల్లో పగలుగా ఉంటుంది. అందువల్ల ఆదేశాల్లోని ప్రజలు లైలతుల్ ఖద్ర్‌ని అసలు పొందనే లేరుకదా! అన్నదే ఆ సందేహం. కాని అరబ్బీ భాషలో లైల్ (రాత్రి) అనే పదం సాధారణంగా రాత్రి, పగలు రెండిటికీ వర్తించే విధంగా వాడబడుతుంది. అందువల్ల రమజాన్ నెలకు చెందిన ఈ తేదీలలోని ఏ తేదీ అయినా ఒక ప్రాంతంలో వస్తే దాని పగటికి ముందు వచ్చే రాత్రి అక్కడి ప్రజలకు లైలతుల్ ఖద్ర్ అవుతుంది.

ఇక్కడ మరో విషయం కూడా గమనార్హమయినది. దివ్యఖుర్‌ఆన్‌లో "ఈ ఘనతగల రాత్రిలో చేసే దైవారాధనలువంటి సదాచరణ వేయి నెలలకంటే శ్రేష్ఠమైనది" అని చెప్పబడలేదు. దానికి బదులుగా అక్కడ, "ఈ రాత్రి వేయి నెలలకంటే శ్రేష్ఠమైనది" అని చెప్పడం జరిగింది. మరోవిశేషం ఏమిటంటే వేయి నెలలంటే ఖచ్చితంగా లెక్కకట్టి 83 సంవత్సరాల 4 నెలలు మాత్రమే కానవసరం లేదు. అరబ్బీ సాహిత్యంలో సాధారణంగా వేయి అనే సంఖ్య అత్యధిక మయింది అనే భావంతో ప్రయోగించబడు తుంది. అందువల్ల ఈ రాత్రిలో జరిగినంతటి మహత్కార్యం మానవ చరిత్రలోనే ఏ సుదీర్ఘ కాలంలో కూడా జరగలేదని ఇక్కడ గ్రహించాలి.

ఇంతకూ ఆ మహత్కార్యం ఏమిటి? ఘనమయిన ఈ శుభరాత్రిన సంభవించిన అపూర్వ సంఘటన ఏమిటి? ఈ సంఘటన తెచ్చే అపార శుభాలను పొందడానికి ఒక నెల రోజులు ముందు నుంచే సన్నాహాలు ప్రారంభించి రమజాన్ నెలంతా ఉపవాసాలు పాటించి, విస్తృతంగా దానధర్మాలు చేసి, తరావీహ్ నమాజ్ వంటి ప్రత్యేక నమాజులు చేసి, వీటితో పాటు నెల చివరి దశకం అంతా ఎతికాఫ్‌లో గడిపి, ఆ చివరి దశకంలోనూ బేసి సంఖ్యాక రాత్రుళ్ళు జాగరణ చేసి మరింత నిష్ఠగా, దీక్షగా దైవారాధనలో లీనమయి ఉండ వలసినంతటి ప్రాముఖ్యం ఏర్పరచిన ఆ మహత్తర సంఘటన ఏమిటి? దాని వెనుక ఉన్న మహోన్నత దైవకార్యం ఏమిటి?

మానవాళి మార్గదర్శనం కోసం దేవుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హృదయ ఫలకంపై ఖుర్‌ఆన్ అవతరింపజేయడమే ఆ మహత్కార్యం. మానవ జీవితాన్ని

సమూలంగా సంస్కరించే అద్భుతమైన దైవవాణి దివి నుండి భువి పైకి దిగి రావడమే ఆ మహత్తర సంఘటన. మానవులకు వారి జీవిత సకల రంగాల్లో సంపూర్ణ మార్గదర్శనం చేయడానికి దేవుడు అవతరింపజేసిన ఈ దివ్యవాణి కేవలం 23 సంవత్సరాల అతిస్వల్ప కాలంలో ఎంత గొప్ప విప్లవం తెచ్చిందో ప్రపంచ చరిత్రకారులకు తెలియని వాస్తవం కాదు. అసలు దివ్యఖుర్‌ఆన్ అవతరించిన కారణంగానే రమజాన్ మాసానికి, రమజాన్ మాసంలోని ఈ మహాశుభరాత్రి (లైలతుల్‌ఖద్ర్)కి అంతటి విలువ, ప్రాముఖ్యం, ఘనత, గౌరవప్రతిష్ఠలు లభించాయి.

అలాంటి విప్లవ గ్రంథానికి దాన్ని విశ్వసిస్తున్నామని చెప్పుకునే నేటి ముస్లింలు ఇస్తున్న గౌరవం ఏమిటి? మానవాళికి మార్గదర్శినిగా అవతరించిన ఈ మహోగ్రంథాన్ని వారానికి ఒకసారి (శుక్రవారం రోజు) అర్థంపర్థం లేకుండా పారాయణం చేసి, కళ్ళకద్దుకొని గలేబులో చుట్టి బీరువాలో భద్రపరచడమేనా గౌరవం ఇవ్వడమంటే? లేదా అందులో నమాజ్, రోజా, జకాత్, హజ్‌లాంటి కొన్ని ఆజ్ఞల్ని మాత్రమే స్వీకరించి, మానవుని అత్యధిక జీవిత భాగమైన ప్రాపంచిక వ్యవహారాల్లో దాని ఆజ్ఞల్ని, హితవుల్ని పాటించనవసరం లేదా? ఖుర్‌ఆన్ ఆదేశాలకు అనుగుణంగా నడచుకోకుండా, చివరికి నమాజ్, రోజాల విషయంలోనూ తగిన శ్రద్ధ వహించకుండా, ఏడాది కొకసారి ఆర్భాటం తో రాత్రి జాగరణ చేసినంత మాత్రాన సరిపోతుందా? ఇవేనా దైవగ్రంథం పట్ల ముస్లింల కున్న విశ్వాస గౌరవాలు??

రమజాన్ వాస్తవానికి ప్రతి ముస్లిమ్ ఆత్మపరిశీలన చేసుకోవలసిన పవిత్ర మాసం. అంటే ఈ మాసంలో వారు ఎందుకు ఉపవాసాలు పాటిస్తున్నారో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అలాగే రమజాన్ మాసంలో ముస్లింలు హాఫిజ్‌లను రప్పించి ప్రత్యేకంగా తరావీహ్ నమాజులు కూడా చేస్తారు. ఈ తరావీహ్ నమాజ్‌లో పఠించే ఖుర్‌ఆన్ సూక్తుల్ని తాము ఎంతవరకు తమ దైనందిన జీవితంలో ఆచరిస్తున్నామని కూడా వారు ఆత్మావలోకనం చేసుకోవలసిన అవసరం ఉంది.

మానవుని పుట్టుక (జీవిత) లక్ష్యం కేవలం దైవాన్ని ఆరాధించడం మాత్రమేనని దివ్యఖుర్‌ఆన్ పేర్కొంటున్నది. (51:56 సూక్తి చూడండి.) అంటే, మనిషి తన దైనందిన జీవితంలో దేవుని ఆదేశాలను, ఆయన ప్రవక్త (సల్లం) హితవులను పూర్తిగా పాటించడం ద్వారా మాత్రమే అతని జీవితమంతా దైవారాధనగా మారుతుంది. అసలయిన ఈ దైవారాధన కోసం నమాజ్, రోజా, జకాత్, హజ్ ఆరాధనలు "ట్రైనింగ్ కోర్సులు"లాంటివి. ఈ కోర్సుల్ని చిత్తశుద్ధిగా అమలుపరిస్తే ఇవి మనిషిని సుశిక్షితుడ్ని చేస్తాయి. ఏ విధంగా నమాజ్ అందులో పఠించే ఖుర్‌ఆన్ సూక్తుల ద్వారా మనిషికి దైవాదేశాలకు అనుగుణం గా జీవితం గడపటానికి నిరంతరం శిక్షణ ఇస్తుందో, అదే విధంగా రమజాన్‌లోని నెలరోజుల ఉపవాసాలు కూడా మనిషిలో మనోనిగ్రహం, సహనం, స్థయిర్యం, దైవభీతి దాతృత్వాలు పెంపొందే శిక్షణ ఇస్తాయి.



# 62. ఏతికాఫ్

రమజాన్ మాసంలో ఉపవాసవ్రతం, తరావీహ్ నమాజ్, ఫిత్రాదానం తరువాత "ఏతికాఫ్"కు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఏతికాఫ్ అంటే శాబ్దిక అర్థం తననుతాను ఆపి ఉంచడం లేక ఏదైనా విషయంపై స్థిరంగా ఉండటం. షరీఅత్ పరిభాషలో మనిషి ఓ ప్రత్యేక రీతిలో ఓ నిర్ణీతకాలం మస్జిద్‌లో ఉండి పోవడం లేక తనను తాను ఆపిఉంచడాన్ని ఏతికాఫ్ అంటారు. ఏతికాఫ్ సామూహిక విధి (ఫర్జెకిఫాయా). అంటే ఒక వాడలో, లేక ఒక మస్జిద్ పరిధిలో ఏ ఒక్కరు ఏతికాఫ్ పాటించినా అందరి బాధ్యత నెరవేరుతుంది.

ప్రతియేడూ రమజాన్ నెల చివరి పది రోజులు మస్జిద్‌లో ఏతికాఫ్ చేయడం మహాప్రవక్త (సల్లం) సంప్రదాయం. రమజాన్ నెలలో మహాప్రవక్త (సల్లం) పరిస్థితే మారిపోయేది. ప్రత్యేకంగా రమజాన్ చివరి పది రోజులు రాగానే ఆయన రాత్రిళ్ళు ఇతోధికంగా జాగరణ చేసి దైవారాధనలో గడిపేవారు.

లైలతుల్ ఖద్ర్‌ని పొంది, దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి మంచి సాధనం 'ఏతికాఫ్.' రమజాన్ చివరి దశకంలో తొమ్మిది పదిరోజుల పాటు ప్రపంచ వ్యవహారాలన్నీ పక్కన బెట్టి కేవలం దైవారాధన, దైవసంస్మరణ సంకల్పంతో మస్జిద్‌లో ఉండిపోవడాన్నే ఏతికాఫ్ అంటారు.

ఏతికాఫ్ కోసం మస్జిద్‌లో ఓ మూల కొంత స్థలాన్ని ప్రత్యేకించుకోవాలి. అక్కడ ఓ పరదా కట్టుకొని డేరాలా తయారుచేసుకోవాలి. అందులో రమజాన్ 21వ తేదీ నుంచి పది రోజులపాటు ఉండాలి. అక్కడే తినడం, త్రాగడం, పడుకోవడం చేయాలి. పెద్ద అవసరమేదీ లేకుండానే బయటికి పోకూడదు. ఫర్జ్ నమాజ్ మాత్రం డేరా నుంచి బయటికొచ్చి జమాఅత్‌తోనే చేయాలి. ఈనాడు కొన్ని చోట్ల పేదలకు డబ్బిచ్చి ఏతికాఫ్ చేయిస్తున్నారు. ఇది చాలా ఘోరమైన చెడ్డ పద్ధతి.

ఏతికాఫ్ విశ్వాసికి ఓ ప్రత్యేక శిక్షణా శిబిరంలాంటిది. అందువల్ల ఈ శిబిరంలో గడిపే పదిరోజుల కాలాన్ని విశ్వాసులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఈ వ్యవధిలోనే లైలతుల్ ఖద్ర్ కూడా ఉంటుంది కనుక ఈ 'సమయం' ఎంత విలువయినదో ఊహించవచ్చు. ఏతికాఫ్‌లో సాధారణ నమాజులతోపాటు సాధ్యమైనంత అధికంగా నఫిల్ నమాజ్, జిక్ర్, ఖుర్‌ఆన్ పఠనం చేయాలి. ఇస్లాంకు సంబంధించిన ఇతర పుస్తకాలు చదవడం, రాయడం కూడా చేయవచ్చు. ఏతికాఫ్‌లో విధిగా పాటించవలసిన కొన్ని విషయాలున్నాయి. అవి ఈవిధంగా ఉన్నాయి:

- మూలమూత్రాల విసర్జన, స్నానంవంటి అవసరాలకు తప్ప మస్జిద్ నుంచి బయటికి వెళ్ళకూడదు.
- భోజనం తెచ్చిచ్చే వారెవరూ లేనిపక్షంలో ఇంటికి వెళ్ళిరావచ్చు.

✦ తీవ్రవ్యాధితో బాధపడుతున్న రోగిని తప్ప మామూలు రోగిని పరామర్శించడానికి బయటికెళ్ళరాదు.

✦ భార్యను సమీపించకూడదు, ఆమెను తాకకూడదు.

✦ గట్టి కారణాల మీద బయటికి వెళ్ళవలసివచ్చినా పని పూర్తయిన వెంటనే మస్జిద్‌కు తిరిగి వచ్చేయాలి.

✦ ఉపవాసం పాటించకుండా ఏతికాఫ్ చేయడం సరికాదు.

విశ్వప్రభువు ఏ విశ్వాసికీ ఇవ్వనటువంటి ఓ ప్రత్యేక వరాన్ని ఏతికాఫ్ చేసే వ్యక్తికి ఇస్తున్నాడు. అతని విషయంలో దైవప్రవక్త (స) ఏమన్నారో చూడండి:

"ఏతికాఫ్ చేసే వ్యక్తి (ఏతికాఫ్ దినాలలో) చెడులకు దూరంగా ఉంటాడు. అందువల్ల అతను (ఇతర దినాలలో) చేసే సత్కార్యాలన్నిటికీ రాయబడే పుణ్యాలన్నీ ఇప్పుడు (ఏతికాఫ్‌లో ఉన్నప్పుడు) కూడా అతనికి రాయబడతాయి." (ఇబ్నెమాజ)

మనిషికి ఏదయినా చెడు తలంపు వచ్చినప్పుడు తత్సంబంధిత చెడ్డ పని అతని వల్ల జరగనంతవరకూ అతని కర్మల జాబితాలో పాపం రాయడం జరగదు. అదే మంచితలంపు అయితే దానికి సంబంధించిన మంచిపని అతని వల్ల జరగక పోయినా, అతని కర్మల జాబితాలో దానికి పుణ్యం రాయడం జరుగుతుంది. ఇక ఆ వ్యక్తి ఏతికాఫ్‌లో ఉన్నప్పుడు అతనిలో సత్కార్యాలు చేసే తలంపు రాకపోయినా, ఒకవేళ అతను బయట ఉంటే ఆ పదిరోజులు ఫలానా సత్కార్యాలు చేస్తాడని నిర్ణయించి దేవుడు వాటి పుణ్యాలన్నీ అతనికి ప్రసాదిస్తాడు. ఇది మానవులపై దేవునికున్న గొప్ప అనుగ్రహం కాకపోతే మరేమిటి? అలాంటి అనుగ్రహానికి అర్హులయినవారే గొప్ప అదృష్టవంతులు.

# 63. ఫిత్రా ప్రాముఖ్యం

రమజాన్ నెలలో ఉపవాసాలు, ఖుర్ఆన్ పఠనం, నమాజ్‌లతోపాటు దానధర్మాలు కూడా ఇతోధికంగా చేయాలి. ఉపవాసం ఉన్న వారికి ఇఫ్తార్ విందు చేయడం కూడా గొప్ప పుణ్యకార్యమే. పేదవాడి ఆకలి బాధను ఆచరణాత్మకంగా అర్థం చేసుకోవడానికి ఉపవాసవ్రతమే ఉత్తమ సాధనం. కడుపు నింపుకోవడం, సుఖాలు జుర్రుకోవడం జీవితం యొక్క అసలు ధ్యేయం కాదని, వాటికంటే జీవితానికి ఎంతో విలువ ఉందని ఉపవాస వ్రతం మనకు గుణపాఠం నేర్పుతుంది.

"ఒకసారి దైవప్రవక్త (సల్లం) ఒక వ్యక్తి తేన్పుతుంటే చూసి- 'తేన్పును తగ్గించు. ప్రపంచంలో ఉండగా బాగా కడుపునిండా తిన్న వ్యక్తి ప్రళయదినాన అందరికంటే ఎక్కువ ఆకలితో ఉంటాడు" అని అన్నారు. (తిర్మిజి)

అందువల్ల రమజాన్ నెలలో అత్యధికంగా దానధర్మాలు చేయడం, ఇతర



ధర్మకార్యాలకు డబ్బు ఖర్చు చేయడం జరగాలి. ఈ లక్ష్యం కోసమే ఫిత్రా మనకు ఫర్జ్ (విధి)గా నిర్ణయించబడింది. ఫిత్రా పేదల హక్కు. దాన్ని తప్పనిసరిగా నెరవేర్చాలి.

మనం ప్రారంభించిన మంచి పని ఏదయినా జయప్రదంగా ముగిస్తే మనకు అమితమయిన సంతోషం కలుగుతుంది. అంతేకాకుండా ఆ పని చేయడానికి మనకు సద్బుద్ధి ప్రసాదించి, దాన్ని జయప్రదంగా పూర్తవడానికి అవకాశం కల్పించిన దైవం పట్ల మన హృదయం కృతజ్ఞతాభావంతో నిండిపోతుంది. అప్పుడు మనం దేవునికి కృతజ్ఞతగా ఆయన్ని స్తుతిస్తాం. ఇక పని పూర్తి అయినందుకు సంతోషంతోగా మనం ఒక్కొక్కసారి మన బంధుమిత్రులకు టీ పార్టీలు కూడా ఇస్తుంటాం.

అదే విధంగా రమజాన్ ఉపవాస వ్రతాలన్నీ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయితే దైవదాసునికి కలిగే ఆనందం వర్ణనాతీతం. దైవం పట్ల అతని హృదయం కృతజ్ఞతాభావంతో నిండిపోతుంది. ఆ కృతజ్ఞతను వెలిబుచ్చుకోవడానికి అతను రెండు రకాత్‌లు ఈద్ నమాజ్ చేస్తాడు. దానికి ముందు అతను తన సంతోషాన్ని తోటి దాసులతో ముఖ్యంగా నిరుపేద దాసులతో పంచుకుంటాడు.

సమాజంలో కడుపు నిండా తిండికి, ఒంటి నిండా బట్టకు సయితం నోచుకోని నిర్భాగ్యజీవులు ఎందరో ఉన్నారు. పండుగ శుభసందర్భంలో ఇలాంటి పేదవాళ్ళకు సహాయం అందజేయడం కన్నా ఒక విశ్వాసికి గొప్ప సంతోషం మరొకటి ఏముంటుంది? దివ్యఖుర్ఆన్ అవతరించిన రమజాన్ నెలలో పేదలకు అందజేసే ఈ సహాయాన్నే ఫిత్రా (ఫిత్ర్) దానం అంటారు.

## పేదల హక్కు ఫిత్రా

'ఫిత్ర్' అంటే ఉపవాసాల్ని విరమించడం లేదా పరిసమాప్తం చేయడం అని అర్థం. ఈదుల్ ఫిత్ర్ అంటే రమజాన్ ఉపవాసాలు ముగించి సంతోషించే రోజు. అదే పండుగ రోజు. ఫిత్ర్ (ఫిత్రా) దానం అంటే రమజాన్ ఉపవాసాలను పూర్తి చేసిన సందర్భంగా పేదలకు ఇవ్వాల్సిన తప్పనిసరి దానం.

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "ఎవరైతే పండుగకు ముందే ఫిత్రా దానం (పేదలకు) ఇచ్చివేస్తాడో అది దేవుని దృష్టిలో 'స్వీకృత ఫిత్రా'గా పరిగణించ బడుతుంది. మరెవరు పండుగ తరువాత ఫిత్రాదానం చెల్లిస్తాడో అది సాధారణమైన దానం అవుతుంది." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఫిత్రాదానం నిర్ణయించడానికి కారణం- అది ఉపవాసకులను పనికిమాలిన పనుల నుండి, సిగ్గుమాలిన చేష్టల నుండి ప్రక్షాళనం చేస్తుంది. మరోవైపు నిరుపేదల కోసం ఆహార పానీయాల ఏర్పాటు కూడా జరుగుతుంది. కనుక ఎవరైతే పండుగ నమాజ్‌కు ముందే ఫిత్రా చెల్లిస్తాడో అది స్వీకృత దానంగా పరిగణించబడుతుంది. మరెవరు నమాజ్

తరువాత ఫిత్రాదానం చెల్లిస్తాడో అది సాధారణమైన దానం మాదిరిగా ఒక దానం అవుతుంది.'' (అబూదావూద్, ఇబ్నెమాజ)

రమజాన్ ఉపవాసాలు ఫరజ్ (విధి)గా నిర్దేశించబడిన తరువాత దైవప్రవక్త (స) తన మనిషి ఒకణ్ని పట్నం వీథుల్లోకి పంపి ఈవిధంగా ప్రకటన చేయించారు:

"(జనులారా!) వినండి. ప్రతి ముస్లిం పురుషుడు, స్త్రీ, బానిస, స్వేచ్ఛాపరుడు, చిన్నా, పెద్దా అందరూ ఫిత్రా దానం విధి (వాజిబ్)గా చెల్లించాలి.'' (తిర్మిజి)

ఫిత్రా ఎంత చెల్లించాలి, ఏ రూపంలో చెల్లించాలి అనే విషయాలను కూడా దైవప్రవక్త (సల్లం) నిర్ణయించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం "ముస్లిం అయిన ప్రతి పురుషుడు, స్త్రీ, బానిస, స్వేచ్ఛాపరుడు, చిన్నా, పెద్దా ఫిత్రా దానంగా ఒక 'సా' ఎత్తు గోధుమలు గాని, యవలుగాని (పేదలకు) విధిగా చెల్లించాలని దైవప్రవక్త (సల్లం) నిర్దేశించారు. ఈ ఫిత్రా ఈద్గాహ్‌కు వెళ్ళకముందే చెల్లించాలని కూడా ఆయన ఆదేశించారు.'' (బుఖారి)

ఈవిధంగా ఫిత్రా ఇవ్వడం ప్రతి ముస్లిం పురుషునికీ, స్త్రీకీ విధి (వాజిబ్)గా నిర్ణయించబడింది. అంటే ఫిత్రా పేదవాళ్ళ హక్కన్న మాట. ఇస్లాం మానవుల సహజ భావోద్రేకాలను సమాజంలోని పేద ప్రజల సంక్షేమానికి ఎలా వినియోగం చేస్తుందో చూడండి. రమజాన్ ఉపవాసవ్రతాలు పూర్తికావడం విశ్వాసికి ఓ సంతోషకరమయిన విషయమయితే, ఆ సంతోషం వ్యక్తమవడానికి ఇస్లాం అతని చేత పేదలకు ఫిత్రా రూపేణ కొంత ఆర్థిక సహాయాన్ని అందజేయిస్తుంది.

ఫిత్రాదానం ఇవ్వగల ఆర్థికస్తోమత ఉన్న ప్రతి ముస్లిం రమజాన్ ఉపవాసాలు ఉన్నా లేకపోయినా ఫిత్రా మాత్రం పేదలకు తప్పనిసరి (వాజిబ్)గా ఇవ్వాలి. హదీసులో వచ్చిన ఫిత్రా కొలమానం, పరిమాణాలను గురించి ఈనాటి ధర్మవేత్తలు పరిశోధించి తమ అభిప్రాయాలు ప్రకటించారు. దాని ప్రకారం ఫిత్రా దానంగా (ఒక మనిషి తరఫున) సుమారు పావుతక్కువ రెండు కిలోలు గోధుమలు గాని, అంతే ఖరీదుగల ఇతర ఆహారధాన్యాలుగాని పేదలకు అందజేయాలి. లేదా ఆ ఖరీదు నగదు రూపంలోనైనా ఇవ్వచ్చు, వస్త్రరూపంలోనైనా ఇవ్వచ్చు.

చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అంతమంది వైపునా ఫిత్రా చెల్లించవలసిందే. చివరికి అప్పుడే పుట్టిన పిల్లల తరఫున కూడా వారి సంరక్షకులు ఫిత్రా దానం చెల్లంచవలసి ఉంటుంది. భార్య ఫిత్రా చెల్లించ వలసిన బాధ్యత భర్తపై లేకపోయినా, అతను తన భార్య తరఫున చెల్లిస్తే ఆమెపై ఉన్న ఫిత్రా బాధ్యత తీరిపోతుంది. ఫిత్రా ఈద్ నమాజ్‌కు ముందే చెల్లించాలి. పేదలు తమ పండుగ అవసరాలు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా పండుగకు రెండు మూడు రోజులు ముందుగానే ఫిత్రా ఇవ్వడం మంచిది.



## పాప వినాశిని

ఈ ఫిత్రా చెల్లింపు వెనుక విశ్వాసికి మరో ప్రయోజనం కూడా ఉంది. మనిషి ఎంత నిష్ఠగా ఉపవాస వ్రతాలు పాటించినప్పటికీ 'మానవ సహజ దౌర్బల్యం' కారణంగా అతని వల్ల కొన్ని పొరపాట్లు జరుగుతాయి. ఒక్కొక్కసారి అతనికి తెలియకుండానే ఈ పొరపాట్లు జరగడం కూడా సంభవమే. అందువల్ల ఈ పొరపాట్లు, బలహీనతలు హరించబడేందుకు ఇస్లాం ధర్మశాస్త్రం (షరీఅత్) ముస్లిములకు ఫిత్రా చెల్లింపును వాజిబ్ (విధి)గా నిర్ణయించింది.

ప్రఖ్యాత సహాబీ హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఫిత్రా ప్రాముఖ్యాన్ని తెలుపుతూ ఇలా అన్నారు:

"దైవప్రవక్త (సల్లం) ఫిత్రా దానాన్ని విధిగా నిర్ణయించడానికి కారణం ఏమిటంటే- ఉపవాసవ్రతంలో పొరపాటున మననోట పనికిమాలిన మాటలు వెలువడుతుంటాయి. ఇంకా అనాలోచితంగా మన హృదయంలో చెడు తలంపులు కూడా కలుగుతుంటాయి. అందువల్ల ఫిత్రాదానం వల్ల (ఈ పొరపాట్లన్నీ క్షమించబడి) మన ఉపవాసాలు ప్రక్షాళనం అవుతాయి. మరో వైపు దీనిద్వారా పేదలకు ఆహారం (లాంటి ప్రాథమిక అవసరాలు) కూడా ఏర్పాటవుతుంది.'' (మిష్కాత్)

## ఫిత్రా చెల్లించాల్సినవారు

❖ ఆర్థిక స్తోమత కలిగిన పురుషుడు తనతోపాటు యుక్తవయస్సుకురాని తన సంతానం తరఫున కూడా ఫిత్రా చెల్లించాల్సి ఉంటుంది.

❖ యుక్తవయస్కులయిన సంతానం ఆర్థిక స్తోమత కలిగినవారయితే స్వయంగా వారే ఫిత్రాదానం చెల్లించాల్సి ఉంటుంది. పేదవారయితే వారి తరఫున వారి తండ్రే ఫిత్రాదానం చెల్లించాలి.

❖ తెలివి, స్పృహకు దూరమయిన సంతానం ఆర్థిక స్తోమత కలిగివున్నా లేకున్నా వారి తరఫున తండ్రి తప్పనిసరిగా ఫిత్రా చెల్లించాలి.

❖ యజమాని తన సంరక్షణలో ఉండే సేవకుల తరఫున ఫిత్రా ఇవ్వాలి.

❖ అనాథ బాలల తరఫున వారి సంరక్షకులు ఫిత్రా చెల్లించవలసి ఉంటుంది.

❖ భార్య తరఫున భర్త ఫిత్రా చెల్లించనవసరం లేదు. చెల్లిస్తే భార్యపై ఉన్న ఫిత్రా బాధ్యత తీరిపోతుంది.

❖ తండ్రి మరణిస్తే అతని సంతానం తరఫున నెరవేర్చవలసిన ఫిత్రా బాధ్యతలు వారి తాతపై ఉంటుంది.

❖ ఆర్థిక స్తోమత కలిగిన స్త్రీ తన తరఫున మాత్రమే ఫిత్రా దానం ఇవ్వాలి. పురుషుడిలా ఆమె మరెవరి తరఫునా ఫిత్రా చెల్లించనవసరం లేదు.

## ఫిత్రా ఎంత, ఎవరికి, ఎప్పుడు?

▲ ఫిత్రాదానంగా దాదాపు పావు తక్కువ రెండు కిలోల గోధుమలు పేదలకు ఇవ్వాలి లేదా వాటికి సమానమైన ఖరీదుగల ఇతర ఆహారధాన్యాలు లేక డబ్బయినా సరే ఇవ్వచ్చు.

▲ జకాత్ స్వీకరణకు అర్హులయినవారందరికీ ఫిత్రా ఇవ్వచ్చు.

▲ ఒక వ్యక్తి ఫిత్రా ఒక నిరుపేదకయినా ఇవ్వచ్చు లేదా ఒకరికంటే ఎక్కువ మంది పేదలకయినా ఇవ్వచ్చు. అలాగే కొందరి ఫిత్రాలు కలిపి ఒకరికయినా ఇవ్వచ్చు లేదా ఒకరికంటే ఎక్కువ మందికైనా ఇవ్వచ్చు.

▲ ఫిత్రా దానం ఈద్ నమాజ్‌కు ముందే పేదలకు ఇచ్చివేయాలి. ఈ తరువాత ఇస్తే అది సాధారణ దానం క్రిందికి వస్తుంది. ఈద్‌కు రెండు మూడు రోజుల ముందుగానే ఇవ్వడం మంచిది.

▲ రమజాన్ ఉపవాసాలు పాటించనివారు కూడా ఫిత్రా దానం ఇవ్వాలి.

ఉపవాసాల పరిపూర్తికి ఫిత్రాదానం ప్రాముఖ్యాన్ని గురించి చెబుతూ హజ్రత్ షాహ్‌వలి అల్లా (రహ్మలై) ఇలా అన్నారు:

“పండుగ దినం సంతోషకరమయిన రోజు. ఆ రోజు ముస్లింల సంఖ్యాధిక్యత, వారి అసాధారణ సామూహికత్వం ద్వారా ఇస్లాం ఔన్నత్యం వ్యక్తమవుతుంది. ఈ లక్ష్యం ఫిత్రాదానంతో పరిపూర్ణమవుతుంది. అదీగాక ఉపవాసవ్రతాల పరిపూర్తికి కూడా ఫిత్రా కారణభూతమవుతుంది.”

# 64. నడిరేయి నిర్ణయం

“నాజియా! పండగ ఇంకా మూడు రోజులే ఉంది. ఖర్చెంతవుతుందో కాస్త ఎస్టిమేషన్ వేసి చెప్పు. అలాగే ఇంట్లో కావాల్సిన వస్తువులు కూడా ఏవయినా ఉంటే చెప్పు, ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు తీసుకొస్తాను” అన్నాడు నయీమ్ సైకిల్ తుడుస్తూ.

పండగ ప్రస్తావన రాగానే నాజియా ఆలోచనలో పడిపోయింది. పండగంటే ఆనందోత్సవాలు జరుపుకునే రోజు. కాని ఈ ఆనందం కోసం పెద్ద మూల్యమే చెల్లించుకోవలసి ఉంటుంది. నిత్యావసర వస్తువులతో సహా ప్రతి వస్తువు ధర మండిపోతున్న ఈ రోజుల్లో ఏది తీసుకురమ్మని చెప్పాలో, ఏది వద్దని చెప్పాలో నాజియాకు అర్థం కావడం లేదు.

అదీగాక నాజియా మదిలో పేటలోని పేద పిల్లల దీనావస్థ కూడా మెదిలింది. దాంతో ఆమె గుండెలు కాస్త బరువెక్కాయి.

“ఏమిటీ ఆలోచిస్తున్నావు? కావాల్సిన వస్తువులు చాలా ఉన్నాయా?” అడిగాడు



నయీమ్, భార్య నుండి వెంటనే సమాధానం రాకపోయినందుకు.

“కావాల్సిన వస్తువులన్నీ మనం కొనలేం కదండీ! ఏమయినా పండగంటే కాస్త ఖర్చుతో కూడిన వ్యవహారమే. పిల్లలు కొత్త బట్టలు కొత్త చెప్పులు కావాలని డిమాండ్ చేస్తున్నారు. కొద్దోగొప్పో బంధువుల పిల్లలకు బహుమతులు, పనివాళ్ళకు మామూళ్ళు కూడా ఇవ్వాల్సి ఉంటుంది....”

“సరే ఇవన్నీ మామూలే. నీకు చీరా, ఏదయినా కావాల్నా?”

“ప్రస్తుతం నాకు చీర, గట్రాల్లాంటివేమీ అక్కర్లేదులెండి. ఉన్నవాటితోనే సరిపుచ్చుకుంటాను. పండగ ఖర్చులు ఇంకా చాలా ఉన్నాయి. ఆ రోజు భోజనానికి మీరు ఇద్దరు ముగ్గురు స్నేహితుల్ని కూడా ఆహ్వానిస్తానన్నారుగా. పోతే ఫిత్రా దాదాపు రెండొందల రూపాలయదాకా కావచ్చు. దాంతోపాటు మరో మూడు, నాలుగొందలు రూపాయిలుంటే మనం ఇరుగు పొరుగువారి సంతోషంలో కూడా పాలుపంచుకోవచ్చని భావిస్తున్నాను” అన్నది నాజియా.

“ఎవరా ఇరుగుపొరుగు? ఏమిటా కథ!!” అన్నాడు నయీమ్ చిరునవ్వుతో భార్యవైపు చూస్తూ.

“పండగటంటే ముఖ్యంగా పిల్లల సంబరమే కాదండీ! మన వీధిలో కొందరు పేద పిల్లలు కూడా ఉన్నారు. వారిలో ఒక్క పిల్లవాడి సంతోషంలోనయినా పాలుపంచుకోవాలని ఉంది. అందుకని మన పిల్లల బట్టలతోపాటు అదనంగా మరో జత బట్టలు సమకూరితే...”

“దానిదేముంది. అలాగే తెద్దాం. సరే, నాకు ఆఫీసు టైమవుతోంది. రేపు మాకు ఆప్షనల్ హాలిడేగా, సెలవు పెట్టి తీరిగ్గా షాపింగ్ చేద్దాం” అంటూ నయీమ్ సైకిల్ తీసుకొని బయటికెళ్ళాడు.

నాజియా మనస్సు ఇప్పుడు కాస్తంత కుదుటపడింది. అయితే ఇతర పేద పిల్లల సంగతేమిటి అన్న మరో ఆలోచన ఆమె బుర్రను తొలచడం ప్రారంభించింది.

పేటలోని వారంతా తమ తమ ఫిత్రాలను ఈ పసిహృదయాల కోసం ఖర్చుపెడితే బాగుంటుంది. దానికోసం తానే సమాయత్తమయి ఆయా గృహిణులకు నచ్చజెప్పాలి. కాని ఎలా? కనీసం ఇద్దరు స్త్రీలైనా తన అభిప్రాయంతో ఏకీభవిస్తే కానిపని కాదు.

ఇది వరాల వసంతం. ఈ నెలలో ప్రజల హృదయాలు సత్కార్యాల వైపు మొగ్గి ఉంటాయి. ప్రతి వ్యక్తి కొద్దోగొప్పో సత్కార్యం చేయాలనే భావిస్తాడు. ఈ ఆలోచనతో నాజియా నయనాల్లో ఆనందరేఖలు మెరిశాయి.

అదీగాక ఈరోజు షబెఖద్ర్ కూడా. అందుకని ఈ రోజే ప్రత్యేక సమావేశం పేరిట కొందరు స్త్రీలను సమీకరించి విషయాన్ని నచ్చజెప్పాలని నిశ్చయించుకుంది నాజియా.

నాజియా ఆ పేటలో తరచుగా ఇజ్తిమాలు (ధార్మిక సమావేశాలు) కూడా నిర్వహిస్తుంటుంది. ప్రారంభంలో ఈ ఇజ్తిమాలకు చాలా మంది స్త్రీలు వచ్చేవారు. కాని సమాజంలో ముఖ్యంగా స్త్రీలలో చోటు చేసుకున్న దురాచారాలను ఖండిస్తున్నందున వారిలో అనేక మంది ఆ తరువాత క్రమంగా జారుకున్నారు. అయినప్పటికీ పేట మహిళలకు ఆమె పట్ల ఒక విధమయిన గౌరవభావం ఇప్పటికీ ఉంది.

పేటకు ఆమె వచ్చిన తర్వాతనే కొందరు మహిళలు నమాజు చేయడం ప్రారంభించారు. మరికొందరు మూఢాచారాలను మానేయకపోయినా ఆమె నిర్వహించే ఇజ్తిమాలకు తరచుగా వస్తుంటారు.

అందువల్ల ఈ రాత్రి ప్రత్యేక సమావేశంలో తన నిర్ణయాన్ని వెలిబుచ్చితే తన సన్నిహితులు, స్నేహితురాళ్ళయినా ఈ సత్కార్యానికి సహకరించవచ్చని ఆమె ధైర్యంతో పథకాన్ని ప్రారంభించింది.

"ఒరేయ్ నదీమ్....! ఫహీం....!! అబ్బబ్బబ్బ!!! ఎక్కడికి పోయార్రా? సెలవు దొరికితే చాలు. ఒక్క క్షణమయినా ఇంటిపట్టున ఉండరు కదా."

"ఏంటమ్మా! నదీమ్ అన్నయ్య బ్యాట్ తీసుకుని వాళ్ళ స్నేహితుడితో కలసి ఎక్కడికో పోయాడు. మరేమో ఫహీం అన్నయ్య..."

"అదిసరేగాని చూడు ఫౌజియా! మన వీధిలో ఉన్న ఫాతిమా పిన్ని, సల్మా ఆంటీ, రషీదా ఆంటీ, నజ్మా అక్కయ్య- వీళ్ళందరూ ఉన్నారు చూశావూ, వాళ్ళ ఇళ్ళకు పోయి, ఈ రోజు మా ఇంట్లో ఇజ్తిమా ఉందని, రాత్రి తొమ్మిది గంటలకల్లా వచ్చేయమని అమ్మ చెప్పమన్నది అని చెప్పిరామ్మా!" అన్నది నాజియా.

'కాని ఈ రోజు శనివారం కాదు కదమ్మా!" సందేహం వెలిబుచ్చింది ఎనిమిదేళ్ళ ఫౌజియా.

"నేను చెప్పినట్లు చెయ్యవే తల్లీ! ఈ రోజు లైలతుల్ ఖదర్ కదా! మనమంతా ఈ రాత్రి జాగారం చెయ్యాలి. నమాజ్ చెయ్యాలి, ఖుర్‌ఆన్ పఠించాలి."

"ఆ..ఔనౌను, రాత్రికి నేను కూడా మేల్కొంటా నమ్మా!"

"సరేలే, ముందు ఈ విషయం చెప్పిరా వాళ్ళందరికీ."

"సరే నే వెళ్తున్నానమ్మా! అదిగో నాన్నగారు వస్తున్నారు" అంటూ ఫౌజియా చెంగుచెంగున గంతులేస్తూ బయటికి పరుగెత్తింది.

నయీమ్ రాగానే నాజియా తన కార్యక్రమాన్ని వివరించి రాత్రికి టీ కోసం ఒక లీటరు పాలు, తేయాకు తెచ్చిపెట్టమని కోరింది. ఇలాంటి కార్యక్రమాలంటే నయీమ్‌కు కూడా ఎంతో ఇష్టం. శ్రీమతి చెప్పిందే తడవు అతను పాలు, తేయాకు తెచ్చిచ్చాడు. రాత్రి భోంచేసి ఇషా నమాజుకు వెళ్తూ చెప్పాడు:



"లాలాగూడలో ఈ రాత్రి మాక్కూడా స్పెషల్ ప్రోగ్రాం ఉంది. సహరీ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. అంచేత నా కోసం నువ్వు ఎదురు చూడాల్సిన అవసరం లేదు."

నయీమ్ వెళ్ళిపోయిన తరువాత మగపిల్లలు నదీమ్, నసీమ్, ఫహీం రహీంలు కూడా నమాజు కోసం వీధి మస్జిద్‌కు వెళ్తున్నామని చెప్పి వెళ్ళిపోయారు.

కాస్సేపటికి అస్సలాము అలైకుం అంటూ నలుగురు ఆడవాళ్ళు వచ్చారు. ఇంకాస్సేపటికీ మరో అయిదుగురు స్త్రీలు వచ్చారు. నాజియా అందర్నీ సాదరంగా ఆహ్వానించి హాల్లో కూర్చోబెట్టింది. టైం తొమ్మిదింబావు అయింది. అప్పటికి మొత్తం పద్దెనిమిది మంది స్త్రీలు గుమికూడారు.

"నాజియా! ప్రత్యేక సమావేశం అంటూ పిలిపించావు. ఏమిటి విశేషం?" ఓ యాభయి యేళ్ళ మహిళ రాగానే అడిగింది.

"విశేషం ఏముంది? ఈ రోజు షబే ఖద్ర్ కదా పిన్నీ! సామూహికంగా ఇషా నమాజు చేశాక ఈ మహారాత్రి ప్రాముఖ్యం, జకాత్, ఫిత్రాల వివరాలు చెప్పుకుని పరస్పరం తెలుసుకుందామని పిలిపించాను" అన్నది నాజియా.

నాజియా నేతృత్వంలో అందరూ ఇషా నమాజ్ చేశారు. ఆ తరువాత ఈమె ఖుర్‌ఆన్ పఠనంతో ఇజ్తిమా ప్రారంభించింది. తర్వాత పక్కింటి పర్వీన్‌బాను, "షబేఖద్ర్ మహిమలు," కౌసర్ సుల్తానా అనే ఆవిడ "ఫిత్రా ప్రాముఖ్యం" అన్న పుస్తకాలు వరుసగా చదివి వినిపించారు.

చివరిలో నాజియ రమజాన్ నెలలో ప్రత్యేకంగా పాటించవలసిన సత్కార్యాలు వివరిస్తూ దైవమార్గంలో ధన వినియోగం, దాని ప్రాముఖ్యతను గురించి చెప్పింది. ఈ నెల్లో ముఖ్యంగా సమాజంలోని పేదలను దృష్టిలో పెట్టుకోవలసిన అవసరాన్ని గురించి నొక్కి చెప్పింది. దాంతో ఆ కార్యక్రమం ముగిసింది.

నాజియా ప్రసంగానికి ఉత్తేజితురాలయినా ఒక స్త్రీ ప్రసంగం పూర్తికాగానే అడిగింది, ఫిత్రా పైకం మొత్తం ఒకళ్ళకే ఇవ్వచ్చా అని.

"ఇవ్వచ్చు. కాకపోతే ఎవరికిబడితే వారికి ఇవ్వకుండా ఎక్కువ అర్హులయినవారికి ఇవ్వాలి. మీరు సాధారణంగా ఫిత్రా ఎవరికిస్తారు?" అన్నది నాజియా.

"అడిగేవాళ్ళు తక్కువుంటే కదా ఫలానా వాళ్ళని ప్రత్యేకించి ఇవ్వడానికి! ఫిత్రా డబ్బు తీసుకొని నిలబడితే చాలు, రూపాయి రెండు రూపాయల చొప్పున మొత్తం ఇచ్చేసినా ఇంకా వస్తూనే ఉంటారు. మనం ఇంకేదో దాచిపెట్టినట్లు కదలకుండా మొండికేసి బతిమాల్తారు."

"ఎవరూ, బిచ్చగాళ్ళ సంగతేనా నువ్వు చెప్తున్నది? వాళ్ళ గురించి చెప్పకు తల్లీ! పండగ రోజు ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటేనే భయమేస్తుంది. రయ్ అని

ఈగల్లా ముసురుకుంటారు. చుట్టుముట్టి పీక్కుతింటారు" అన్నది ఓ నడికారు మహిళ.

"అంటే మన ధర్మసంపాదన సముచిత మార్గంలో ఖర్చవడం లేదన్నమాట. ఫిత్రా నిర్ణయించబడింది వృత్తిపరమైన బిచ్చగాళ్ల కోసమేనా? నా మనసు మాత్రం ఫిత్రాను ఇలా ఖర్చు చేయడానికి అంగీకరించడం లేదు" అన్నది నాజియా.

"నీ మాటలు విచిత్రంగా ఉన్నాయే! ఫిత్రా మాత్రం విధిగా ఇవ్వాలి. కాని దాన్ని ఎవరికీ ఇవ్వకూడదంటావు, ఏమోనమ్మా! నీ మాటలు మాకు అర్థం కావడం లేదు. మన భర్తలు ఫిత్రా డబ్బులో కొంత మనకిచ్చి కొంత వారు ఈద్గాహ్‌కు తీసికెళ్తారు. దారిలో దొరికిన ప్రతి బీదా, బిక్కికి పంచివేస్తారు. ఇది పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయమే కదా! ఈ రోజు ఏమయింది నువ్వేదో కొత్త విషయం చెప్తున్నావు?" అన్నది ఓ లావుపాటి పిన్నమ్మ.

"పిన్నిగారు! కష్టార్జితం నుంచి తీసే ఫిత్రాను ఇలా రూపాయి, అర్థ రూపాయి చొప్పున అడిగిన ప్రతి యాచకుడికి ఇస్తూపోతే ప్రయోజనం ఏవిటి? దానికి బదులు మన పేటలో ఉండే ఓ పేదపిల్లవాడికి పండుగ సందర్భంగా ఒక జత బట్టలు కుట్టిస్తే ఎంత బాగుంటుంది. ఇలా మనమందరమూ నిర్ణయించుకుంటే పేటలోని పేద పిల్లలందరికీ కొత్త బట్టలు లభిస్తాయి; ఇటు మన ఫిత్రా కూడా పూర్తిగా సద్వినియోగ మవుతుంది" వివరించింది నాజియా.

లావుపాటి పిన్నితో సహా అందరూ క్షణంపాటు మౌనంగా ఉండిపోయారు. తర్వాత నాజియా బంధువు ఒకామె అన్నది:

"ఈ ఆలోచన బాగానే ఉంది. కాని అందరూ ఇలా ఆలోచిస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది."

"నా మట్టుకు ఇలా చేయాలనే ఉంది. కాని మావారు ఏమంటారో! ఆయన ఒప్పుకుంటే మా ఫిత్రాలన్నీ నీకే తెచ్చిస్తాను" అన్నది మరో మహిళ.

"ఇది మన ప్రాంతంలో కొత్త విషయమే అయినా సమాజ సంక్షేమం గురించి ఆలోచిస్తే ఎంతో మంచి పని. ఎప్పుడూ చింపిరి గుడ్డలు తొడుక్కునే బీదవాళ్ళ పిల్లలు కనీసం పండగ రోజయినా కొత్త బట్టలు వేసుకొని సంతోషంగా గడుపుతారు" అన్నది ఒక టీచరమ్మ.

"కాని ఫిత్రాని వాళ్ళకు నగదు రూపంలో ఇవ్వకుండా బట్టలు కుట్టించి ఇస్తేనే బాగుంటుంది" అన్నది కుమారి నజ్మా నయ్యర్, బియస్సీ ఫైనల్.

"బాగానే ఉంటుంది. కాని మన ఫిత్రాలకు సరిపడే బట్టలు కొనాలి. వాటిని కుట్టించాలి. ఆ బట్టలు అందజేయడానికి మళ్ళీ పేద పిల్లల కోసం వెతుక్కుంటూ బయలుదేరాలి. కాని మనం ఇక్కడ్నుంచి వెళ్ళిపోయి ఇంటి పనుల్లో మునిగిపోతే పండగొచ్చేదాకా విషయమే గుర్తుకుండదు" అన్నది పక్కింటి రాషీదా.



"అదీగాక ఈ పని ఎవరికి వారు వేర్వేరుగా చేస్తే కొందరు పిల్లలకు బట్టలు అసలు లభించకపోవచ్చు. అంచేత ఈ బాధ్యతను ఎవరో ఒకరు తీసుకుంటే బాగుంటుంది" ఒక గృహిణి ప్రతిపాదించింది.

"నాజియా! ఈ పని కోసం నువ్వే నడుం కట్టాలి. మేమంతా మా ఫిత్రాలు తీసుకొచ్చి నీ చేతిలో పెడతాం" అన్నది మరో ఆవిడ.

"ఔను వదినా! నువ్వయితేనే ఈ పని విజయవంతమవుతుంది. మేమూ మా ఫిత్రాలు ఇచ్చేస్తాము" అన్నారు ఇంకో ఇద్దరు స్త్రీలు ఒకేసారి.

"విషయం ప్రతిపాదించినందుకు బాధ్యత కూడా నామీదే వేస్తున్నారన్నమాట. సరే దుఆ చేయండి పని సఫలం కావాలని. రేపు సాయంత్రానికల్లా పైకం సమకూరితే పండుగకు ఒక రోజు ముందుగా పేద పిల్లలకు బట్టలు అందుతాయి" అన్నది నాజియా.

"ఏం పిన్నిగారూ! మీరేం మాట్లాడరు?" ఒకామె అడిగింది.

"బాగానే ఉందమ్మా! బిచ్చగాళ్ళ బాదరాబంది పడేకన్నా, ఈ పనే బాగుంది" అంటూ లావుపాటి పిన్నిగారు కూడా నాజియా ప్రతిపాదనను అంగీకరించింది.

నాజియా తృప్తిగా నిట్టూర్చింది. అరవై యేళ్ళ వృద్ధ గడియారం "క్వార్ట్జ్"తో పోటీపడుతూ ఠంగ్...ఠంగ్... అని రెండు కొట్టింది, ఇక వెళ్ళి సహ్‌రీ ఏర్పాట్లు చేసుకోండన్నట్లు.

(తాహిరా తన్వీర్ గారి కలం నుండి జాలువారిన కథానిక)

# 65. ఆత్మపరిశీలన

"తాను చేసిన పని తప్పా ఒప్పా, ఇందులో ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా?" అని విజ్ఞులు, దైవభీతిపరులు మాత్రమే ఆత్మపరిశీలన చేసుకుంటారు. ఒకవేళ అందులో లోటుపాట్లు ఉంటే వెంటనే వాటిని సరిదిద్దుకుంటారు.

ఆత్మపరిశీలన లేక ఆత్మావలోకనం అనే ఈ ప్రక్రియను అరబీభాషలో 'ఎహ్తెసాబ్' అంటారు. మానవుడు సహజంగా చాలా బలహీనుడు. అతని వల్ల తప్పు జరుగుతుంది. దీన్నే 'మానవ పొరపాటు' (Human Error) అంటారు. పొరపాటు జరగక పోవడం అనేది ఏ మనిషి విషయంలో కూడా ఉండదు. అయితే ఆ పొరపాటును అంగీకరించి సరిదిద్దుకున్నప్పుడే మనిషిలో నిజమైన మానవత్వం, నిజాయతీలు తొణికిసలాడతాయి. ముఖ్యంగా దైవకార్యాల్లో ఏవైనా పొరపాట్లు, లోటుపాట్లు జరిగినప్పుడు వాటిని వీలైనంత త్వరగా సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలి. లేకుంటే పరలోకంలో వాటి పరిణామాలు చాలా భయంకరంగా ఉంటాయి.

రమజాన్ ఉపవాస వ్రతాల్లో దాదాపు ప్రతి మనిషి వల్ల ఏదో ఒక స్థాయిలో పొరపాటు జరుగుతుంది. దానికి నిష్కృతిగా పశ్చాత్తాపం, పరిహారాలు కూడా ఉన్నాయి.

అయితే ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం కూడా అవసరమే. దీన్ని గురించి మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరు (దృఢమయిన) విశ్వాసంతో, ఆత్మపరిశీలన (స్పృహ)తో రమజాన్ ఉపవాసాలు పాటిస్తాడో, గతంలో అతని వల్ల జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి. అలాగే మరెవరు (దృఢమైన) విశ్వాసంతో, ఆత్మపరిశీలన (స్పృహ)తో రమజాన్ నెలలో రాత్రిజాగరణ (అంటే ఇషా నమాజ్‌తో పాటు తరావీ నమాజ్) చేస్తాడో, అతని గత పాపాలు కూడా క్షమించబడతాయి. అదేవిధంగా ఎవరు మహా శుభరాత్రిన (లైలతుల్ ఖద్‌లో) విశ్వాస స్ఫూర్తితో, ఆత్మపరిశీలన స్పృహతో రాత్రి జాగరణ చేస్తాడో అతని గత పాపాలు కూడా క్షమించబడతాయి." (బుఖారి, ముస్లిం)

మనం ఏ సత్కార్యాం చేసినా దైవప్రసన్నతను ఆశిస్తూ, పరలోక ప్రతిఫలాపేక్షతో మాత్రమే చేయాలి. లోకుల మెప్పుకోసం, పేరుప్రతిష్ఠల కోసం చేయకూడదు. ఒక సత్కార్యం చేస్తున్నప్పుడు మనం కేవలం దైవప్రసన్నత కోసమే చేస్తున్నామా లేక తాను గొప్ప దైవభక్తుడిగా, సత్పురుషుడిగా, పుణ్యాత్ముడిగా జనాదరణ పొందే ఉద్దేశ్యంతో చేస్తున్నామా అని ఆత్మవలోకనం చేసుకోవాలి. ఉపవాసాలు పాటిస్తున్నా, రాత్రిజాగరణ (నమాజ్, జిక్ర్, ఖుర్‌ఆన్ పారాయణం) చేస్తున్నా, ఫిత్రా దానం చేస్తున్నా దైవప్రసన్నతా భాగ్యమే మన ప్రధాన ఉద్దేశ్యమయి ఉండాలి.

రమజాన్ నెలలో మనం పాటించే ఉపవాసాలు, చేసే ఆరాధనలు మనకు గొప్ప నైతిక, ఆధ్యాత్మిక శిక్షణ ఇస్తాయి. అందువల్ల వాటి ప్రభావం మనపై ఇతర నెలల్లో కూడా ఉండాలి. అంతేగాని-

"రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించు, తరావీ నమాజులు చెయ్యి, లైలతుల్ ఖద్‌ని ఆరాధనల్లో గడుపు, నీ పాపాలన్నీ తుడిచిపెట్టుకుపోయి నువ్వు పరమ పావనుడయి పోతావు. నీ కర్మల చిట్టాలో ఒక్క పాపం కూడా మిగిలి ఉండదు. ఇక ఏడాది పొడుగూతా నువ్వు ఏమైనా చేసుకో. అబద్ధాలు పలుకు, అశ్లీలం-అక్రమాలకు పాల్పడు, లంచం తీసుకో, ఇతరుల హక్కులు కొల్లగొట్టు, అలజడులు సృష్టించు, హింసాదౌర్జ న్యాలకు ఒడిగట్టు, మరే నేరాలకైనా పాల్పడు. మళ్ళీ రమజాన్ వస్తుంది కదా! అప్పుడు మళ్ళీ ఉపవాసాలు పాటించు, తరావీ నమాజులు చెయ్యి, మునుపటి పదకొండు నెలల పాపాలన్నీ ప్రక్షాళనమైపోతాయి..." అని హైహదీసు భావం కాదు.

మరి ఆత్మావలోకనం అంటే ఏమిటీ?

ప్రతి వ్యవహారంలోనూ దైవప్రసన్నతనే ప్రధాన ధ్యేయంగా భావించి తన వల్ల ఇతరుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా జాగ్రత్త వహిస్తూ, రాత్రి ఘడియల్లో దైవాన్ని ప్రార్థిస్తూ, దైవానుగ్రహాల పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, తన వల్ల ఫలానా పొరపాటు జరిగిపోయిందే, విధి నిర్వహణలో తాను తప్పటడుగు వేశానే!



అని పశ్చాత్తాపం చెందుతూ క్షమాభిక్ష పెట్టమని సృష్టికర్తను వేడుకోవడమే ఆత్మావలోకనం అంటే. అంతేకాదు, ఇకముందు ఎలాంటి తప్పులు చేయనని గట్టిగా నిర్ణయించుకోవాలి. ఇలా తప్పులు సరిదిద్దుకునే సద్వర్తనులు, దైవభీతిపరులకే హైహదీసు వర్తిస్తుంది. అలాంటివారి ఉపవాసాలనే దేవుడు స్వీకరిస్తాడు.

ఒక యజమాని దగ్గర నిజాయితీపరుడయిన ఒక సేవకుడు ఉంటాడనుకోండి. అతను యజమాని ఇచ్చే ప్రతి ఆదేశాన్ని శిరసావహిస్తూ కష్టపడి పని చేస్తాడు. ఏ విషయంలో కూడా నమ్మకద్రోహానికి పాల్పడడు. పనిదొంగగా, బద్ధకస్తుడిగా కూడా ప్రవర్తించడు. అందువల్ల యజమానికి అతనంటే వల్లమానిన అభిమానం ఉంటుంది. అయితే ఆ సేవకుడి వల్ల ఓసారి ఒక తప్పు జరిగిపోతుంది. వెంటనే అతను ఈ విషయాన్ని తన యజమాని దృష్టికి తెస్తూ, ఇకముందు ఎలాంటి తప్పు జరగకుండా జాగ్రత్త పడతానని యజమానికి వాగ్దానం చేస్తాడు.

అలాంటి నిజాయితీపరుడయిన సేవకుడ్ని ఒక్క తప్పు చేసినందుకే యజమాని ఉద్యోగం నుంచి తీసివేస్తాడా? తీసివేయడు. అతడ్ని క్షమించి మరో అవకాశం ఇస్తాడు. ఆ సేవకుడు మునుపటిలాగే యజమానికి విధేయత చూపుతూ, చేసిన తప్పును మరోసారి చేయకుండా జాగ్రత్త వహిస్తూ పనిచేస్తుంటే యజమానికి తన సేవకుని చిత్తశుద్ధి పట్ల పూర్తి నమ్మకం కలుగుతుంది. అతను ఇది వరకులాగానే తన సేవకుడ్ని అభిమానిస్తాడు. అదేవిధంగా దాసుల పట్ల దేవుని వ్యవహారం కూడా ఉంటుంది.

"నాదాసులు నాగురించి అడిగితే నేను వారికి చేరువలోనే ఉన్నానని చెప్పు. మొరపెట్టుకునేవాడు నన్ను మొరపెట్టుకుంటున్నప్పుడు నేనతని మొరాలకించి, దానికి సమాధానమిస్తానని కూడా చెప్పు. అయితే వారు నాసందేశం స్వీకరించి నాపట్ల పూర్తి విశ్వాసం కలిగివుండాలి. అప్పుడే వారు సన్మార్గం పొందగలరు." (ఖుర్‌ఆన్-2:186)

"దేవుడు పశ్చాత్తాపంతో తన వైపుకు మరలేవారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు." (ఖుర్‌ఆన్-2:222)

"దైవభీతిపరులు తమవల్ల ఏదైనా నీతిమాలిన పనిగాని, పాపకార్యంగాని జరిగిపోతే వెంటనే వారు దేవుడ్ని స్మరించి క్షమాపణ చెప్పుకుంటారు. అంతేగాని, తాము చేసినదానిపై మంకుపట్టు పట్టరు." (ఖుర్‌ఆన్-3:133)

ఆత్మావలోకనం దేవునితో దాసుని సంబంధం పటిష్ఠపరుస్తుంది. అతడ్ని ఆచరణలో రాటు దేలుస్తుంది. తరచుగా ఆత్మపరిశీలన చేసుకునే మనిషి ఎదుటివారి లోపాన్ని ఎత్తిచూపే ముందు ఓసారి తన అంతరంగంలోకి తొంగి చూసుకుంటాడు. అతను తన సదాచరణ, నీతినడవడికల ద్వారా ఇతరులకు ఆదర్శప్రాయం కావడానికి ప్రయత్నిస్తాడు. తరచుగా ఆత్మపరిశీలన చేసుకునే మనిషి పలికే మాటల్లో 'బరువు' ఉంటుంది. అతని వ్యక్తిత్వానికి ఎదుటివారు ప్రభావితులవుతారు.

# 66. రమజాన్ శుభాలకు అర్హులు

రమజాన్ ముస్లింల విశ్వాస కుసుమాలను వికసింపజేసే వరాల వసంతం. దైవ ప్రసన్నత, దైవభీతిపరాయణతల సాధనకు అనుకూలమైన రుతువు. దేవుని కారుణ్య కడలిని, ఆయన మన్నింపు కెరటాలను ఉప్పొంగజేసే మహోజ్వలమైన మాసం. రమజాన్ ఆరంభం నుండి అంతం వరకు అపార దైవానుగ్రహాలను వర్షింపజేసే శుభాల సీజన్.

ఈ శుభమాసంలో ఉపవాసాలు పాటిస్తూ, తరావీ నమాజులు చేస్తూ, ఖుర్ఆన్ పఠిస్తూ, బీదసాదలకు సహాయం చేస్తూ పూర్తి జీవితాన్ని దేవుని విధేయతా పరిధిలో గడిపేవారు ఎంతో అదృష్టవంతులు. నిరంతరాయంగా దైవానుగ్రహాలు వర్షించే ఈ నెలలో ఉపవాసాలు పాటించకుండా పగటివేళల్లో తింటూ, తాగుతూ, రాత్రివేళల్లో పొద్దు పోయేదాకా వ్యర్థ పనులలో కాలక్షేపం చేసి, పొద్దెక్కేదాకా పక్క వదలనివారు ఎంతో దురదృష్టవంతులు. శాశ్వతమైన సుందర స్వర్గసౌఖ్యాలు వదలుకొని, అశాశ్వత మైన ప్రాపంచిక తళుకుబెళుకుల వెంటపడేవారు ఎంత దురదృష్టవంతులు!

రమజాన్ నెలలో కేవలం ఉపవాసాలు పాటిస్తూ, తరావీ నమాజులు చేసినంత మాత్రాన మనం దాని శుభాలను పొందలేము. రమజాన్ శుభాలకు అర్హులు కావాలంటే మన అంతరంగాల్లో దైవభీతి దృఢంగా నాటుకోవాలి. దాని ప్రభావం మన దైనందిన జీవితంలో కన్పించాలి. అంటే మనం అన్ని విధాల చెడుల్ని వదలిపెట్టి పరిశుద్ధమైన జీవితం గడపాలి. ఉపవాసాలు పాటిస్తూ నమాజ్ మాత్రమే చేసే వ్యక్తి కష్టపడినా ఫలితం దక్కని రైతు లాంటివాడు. ఆ రైతు తీవ్రమైన ఎండలో చెమటలు కక్కుతూ నాగలితో పొలం దున్ని విత్తనాలు చల్లుతాడు. అవి మొలకెత్తిన తరువాత పెరగడానికి కావలసిన సదుపాయాలన్నీ కలగజేస్తాడు. రాత్రిళ్ళు మేల్కొని పొలానికి కాపలా కూడా కాస్తాడు. కాని పంట పండి కొన్ని రోజుల్లో చేతికి వస్తుందనగా దాన్ని వదిలేస్తాడు. దాంతో ఆ పొలం ఒకవైపు కలుపుమొక్కలు, చీడపురుగులతో, మరోవైపు పక్షులు, పశువులు అడపా దడపా మేయడంతో పంట చేతికి రాకముందే పూర్తిగా నాశనం అవుతుంది. ఈ విషయాన్నే దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు:

"ఎందరో ఉపవాసం పాటించేవారికి తమ ఉపవాసాల ద్వారా ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించదు. అలాగే ఎందరో తరావీనమాజ్ చేసేవారికి తమ తరావీ నమాజ్ ద్వారా జాగరణ తప్ప మరేమీ ప్రాప్తం కాదు."

కష్టపడ్డా ఫలితం దక్కని రైతులాంటి ముస్లింలు మన సమాజంలో ఎందరో ఉన్నారు. పాపం వీరు ఉపవాసం ఉండి ఆకలిదప్పుల బాధపడతారు. రాత్రిళ్ళు తరావీ నమాజుల కోసం నిద్ర కూడా త్యాగం చేస్తారు. దానధర్మాల కోసం డబ్బు కూడా ఖర్చుపెడతారు, అంతే. ఆ తరువాత తమ దైనందిన జీవితవ్యవహారాలో దైవభీతి పరాయణత్వం ఏమేరకు ద్యోతకమవుతోంది, కనీసం దాని వాసనలైనా గోచరిస్తున్నాయా లేదా అని ఆలోచించరు. దాన్ని గురించి అసలు పట్టించుకోరు. ఇలాంటి ముస్లింలు ఓసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి.



దైవభీతి పరాయణత మస్జిద్‌లోనేకాదు, మస్జిద్ వెలుపల బజారుల్లో, ఇండ్లలో, దుకాణాల్లో, కార్యాలయాల్లో, కార్ఖానాల్లో కూడా కన్పించాలి. ఏదైనా వ్యవహారంలో తప్పు చేస్తున్నప్పుడు దేవుడు చూస్తున్నాడని గుర్తుకు తెచ్చుకొని ఆయనకు భయపడాలి. దైవభయమే మనిషిని చెడుకు దూరంగా ఉంచగలిగేది. మన హృదయంలో చెడు పట్ల వెగటు, మంచి పట్ల అభిమానం జనించాలి. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, బయటి వత్తిళ్ళకు లొంగకుండా కేవలం దైవప్రసన్నత కోసం చెడులను మాని మంచిని అవలంబించాలన్న కోరిక కలగాలి. అధర్మ విషయాలను పూర్తిగా వదిలేసి దైవధర్మం మనపై మోపిన బాధ్యతలను తు.చ. తప్పకుండా నిర్వహిస్తూ ఉండాలి.

ఈవిధంగా జరిగినప్పుడే మన హృదయానికి దైవభీతి పరాయణతా భాగ్యం లభిస్తుంది. అప్పుడే మన ఉపవాసాలు, తరావీ నమాజులు ఫలవంతమవుతాయి. ఈ లక్షణాలు గనక మనలో ఏర్పడకపోతే మన ఉపవాసాల వల్ల ఆకలిదప్పుల బాధ, తరావీ నమాజుల వల్ల జాగరణ వ్యధ తప్ప మనకు దక్కేదేమీ ఉండదు.

మనం ఉపవాసాలు ఎందుకు పాటిస్తున్నాం? అది దేవుని ఆజ్ఞ కాబట్టే కదా? అంటే మనం దేవునికి, ఆయన ప్రవక్త (స)కు విధేయత చూపుతూ వారి ఆదేశాలను పాటిస్తున్నామన్న మాట. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఆహారపానీ యాలు ముట్టుకోకండని, లైంగిక వాంఛలకు అడ్డుకట్ట వేయండని దేవుడు, ఆయన ప్రవక్త (స) ఇస్తున్న ఆదేశాన్ని మనం శిరసావహిస్తున్నాం. ఇలా మనం ఒకరోజు, రెండు రోజులు కాదు, నెలరోజులు ఈ ఆజ్ఞ శిరసావహిస్తున్నాం. అదేవిధంగా మనం జీవితం లోని ఇతర రంగాల్లో కూడా దేవునికి, ఆయన ప్రవక్త (స)కు పూర్తిగా విధేయులయి వారి ఆజ్ఞలను పాటిస్తూ ఉండాలి. ఇదే మనకు రమజాన్ రోజాలు ఇస్తున్న శిక్షణ.

మనలో జనించే ఈ విధేయతా భావం రమజాన్ గడచిపోగానే అంతరించకుండా సంవత్సరంలోని మిగిలిన పదకొండు నెలలు కూడా సజీవంగా ఉండేలా రమజాన్ ఉపవాసాలు మనకు శాశ్వత శిక్షణ ఇస్తాయి. హృదయంలో దైవభీతి పరాయణత, జీవిత వ్యవహారాలపై దాని ప్రభావం తాత్కాలికంగా కాకుండా జీవితాంతం ఉండేలా ఇవి మనకు తోడ్పడుతాయి. ఖుర్ఆన్‌లో మన సృష్టికర్త ఇలా ఆదేశిస్తున్నాడు:

"విశ్వాసులారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి. మీరు వినయవిధేయతలతో జీవితం గడుపుతున్న స్థితిలో తప్ప మీకు మరణం రాకూడదు."

**పార్ట్‌టైం ముస్లింలు:-** కొందరు ముస్లింలు సాధారణ దినాల్లో అయితే నమాజ్ చేయరుకాని, రమజాన్ నెలవంక చూడగానే అమితోత్సాహంతో క్రమం తప్పకుండా అయిదు వేళలా నమాజ్ చేయడం ప్రారంభిస్తారు. మరికొందరున్నారు.

వారు ఇతర నెలల్లో దైవాన్ని, దైవప్రవక్తను విస్మరించి అనేక పాపాలలో కూరుకొని ఉంటారు. రమజాన్ నెల రాగానే పాపకార్యాలన్నీ వదిలేసి ఎంతో భక్తిశ్రద్ధలతో నమాజ్, ఖుర్‌ఆన్ పారాయణం చేస్తారు. కాని పండుగ దినం గడచిన మరుసటి రోజు నుంచే నమాజ్ వదిలేసి తిరిగి పాపాకార్యాల్లో పడిపోతారు. హరాం-హలాల్, మంచి-చెడుల విచక్షణ చేయరు. యధాప్రకారం మళ్ళీ చెడ్డ పనుల్లో, దుర్వ్యసనాల్లో మునిగిపోతారు. అంటే వీరు రమజాన్ నెలకు పరిమితమై పోయిన ముస్లింలు అన్నమాట!

మరికొందరున్నారు. వారు నమాజ్, రోజా, జకాత్, జిక్ర్, హజ్, నికాహ్, తలాఖ్ వంటి విషయాల్లో మాత్రమే దేవుని పట్ల, ఆయన ప్రవక్త (స) పట్ల విధేయత చూపుతారు. కాని జీవితంలోని ఇతర వ్యవహారాల్లో మాత్రం మనోవాంఛలకు, కుటుంబ కట్టుబాట్లకు తాతముత్తాతల ఆచారాలకు బానిసలైపోతారు. దైవచట్టాలను వదిలేసి మానవకల్పిత చట్టాలకు ప్రాధాన్యం ఇస్తారు. అంటే వీరంతా 'పార్ట్‌టైం ముస్లింలు' అన్నమాట. ఇలాంటి అసంపూర్ణ ధర్మావలంబన వల్ల మనం దైవాగ్రహానికి గురయ్యే ప్రమాదం ఉంది. బహుశా ఇలాంటి ముస్లింలను గురించే దేవుడు ఇలా ఆదేశిస్తున్నాడు:

"విశ్వసించిన ప్రజలారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగుజాడలలో నడవకండి. వాడు మీకు ఆగర్భశత్రువు. స్పష్టమైన బోధనలు అందినప్పటికీ మీరు తిరిగి తప్పటడుగులు వేస్తే మటుకు, బాగా తెలుసుకోండి! దేవుడు సర్వశక్తిమంతుడు, సర్వం తెలిసిన మహావివేకి." (ఖుర్‌ఆన్-2:208,209)

ఈ సూక్తుల వివరణ ప్రకారం విశ్వప్రభువు ముస్లింలను ఇలా ఆజ్ఞాపిస్తున్నాడు-

మద్యం, జూదం, వ్యభిచారం, హత్య, దోపిడి, అవినీతి, అపనింద, అశ్లీలం, వడ్డీ లావాదేవీలు హరాం (నిషిద్ధం) అని నా ప్రవక్త ద్వారా నా ఆదేశం మీకు అందినప్పుడు వాటన్నిటినీ మానేయండి. తల్లిదండ్రుల్ని సేవించండని, పెద్దలను గౌరవించండని, పిల్లలను ప్రేమించండని ఆదేశించినప్పుడు ఆ పనులు పాటించండి. అలాగే నా ఆజ్ఞ ప్రకారం తూనికల్లో, కొలతల్లో తగ్గించి ఇవ్వకండి; మితిమీరిన లాభాల కోసం ధరలు పెంచకండి; సరుకులు నిల్వచేచి కృత్రిమ కొరత సృష్టించకండి; బ్లాక్ మార్కెటింగ్ చేయకండి; కల్తీ వ్యాపారానికి పాల్పడకండి; అన్యాయం, అక్రమ పద్ధతులకు ఒడిగట్టకండి; దుర్భాష, దురుసుతనాలకు దిగకండి; ఇచ్చిన మాట నిలబెట్టుకోండి; న్యాయంగా వ్యవహరించండి; పేదలకు, అగత్యపరులకు సహాయం చేయండి; ప్రజల్లో మంచిని ప్రచారం చేయండి; వారిని చెడుల నుండి వారించండి; ధర్మసంస్థాపన కోసం ధనప్రాణాలతో పోరాడండి. నమాజ్, రోజా, హజ్, నికాహ్, తలాఖ్ ఆజ్ఞల్ని పాటిస్తున్నట్లే ఈ ఆజ్ఞల్ని కూడా గట్టిగా పాటించండి. అప్పుడే మీ జీవితం సార్థకమయి మీరు పరలోక మోక్షానికి అర్హులవుతారు....

"ఉపవాసం ఉండి కూడా అబద్ధమాడటాన్ని, దాన్ని ఆచరించడాన్ని వదలిపెట్టని మనిషి ఆహారపానీయాలు మానేసి ఆకలిదప్పులతో ఉండటం పట్ల దేవునికి ఏమాత్రం



ఆసక్తి లేద"ని దైవప్రవక్త (సల్లం) స్పష్టంగా చెప్పారు. ఈ మహితోక్తి ప్రకారం ఒక వ్యక్తి రమజాన్ నెలలో ఉపవాసాలు ఉండి అబద్ధమాడటాన్ని వదిలేసి ప్రతి వ్యవహారంలోనూ నీతిగా, నిజాయితీగా మసలుకుంటుంటే ఇక అతని ఆకలిదప్పులు, రాత్రి జాగరణలు సత్ఫలితాలు ఇస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.

దీనికి భిన్నంగా ఒకవేళ అతను రమజాన్ నెలలో, ఆ తరువాత కాలంలో అసత్యమాడటం, అసత్యవ్యవహారాలు నడపడం, జీవితసౌధాన్ని సత్యతా పునాదులపై పునర్నిర్మించడానికి కృషి చేయకపోవడం, ధర్మరాహిత్యంతో కూడిన ప్రస్తుత జీవనవ్యవస్థనే 'అంటిపెట్టుకొని ఉండటం చేస్తుంటే, అతను పాటించే ఉపవాసాల వల్ల అతనికి ఒరిగేదేమీ ఉండదు. ఇలాంటివారే ప్రస్తుత వ్యవస్థ అంతా అసత్యం, అధర్మంతో కూడుకున్నది గనక ఈ వ్యవస్థలో ఉండి సత్యసంధతతో జీవితం గడపలేమని, దీన్ని అంతమొందించి సత్యతా సూత్రాలపై నూతన వ్యవస్థను నిర్మించలేమని అంటారు. అంతేకాదు, జీవించడానికి ప్రగతి సాధించాలి కాబట్టి సత్యం, ధర్మం, నీతి, నిజాయితీ అనే పాతకాలపు ఆలోచనల్ని మనస్సులో నుంచి తీసేసి, అసత్యంతో కూడుకున్నదైనా సరే ప్రస్తుత వ్యవస్థలోనే ఒక భాగమైపోయి జీవించాలని, ప్రగతి కోసం అసత్యాన్ని అమృతంలా సేవించాలని వీరు అంటారు. ఈవిధంగా అసత్యాన్ని అవలంబించి ప్రతి వ్యవహారంలో అసత్యాన్నే ఆచరించేవారు ఉపవాసాలుండి ఆకలిదప్పుల బాధ భరించడం వల్ల వారికీ ఉపవాసాలు పరలోకంలో ఎలాంటి ప్రయోజనం చేకూర్చవు.

రమజాన్ ఉపవాసాలను ఫలవంతం చేసే మరో విషయం కూడా ఉంది. మనం దైవగ్రంథంతో పటిష్ఠమైన సంబంధం ఏర్పరచుకోవాలి. ఖుర్‌ఆన్ మన సృష్టికర్త పంపిన గ్రంథమని, ఇందులో ఎలాంటి మార్పు జరగలేదని, ఇకముందు కూడా జరగదని మనం గట్టిగా విశ్వసించాలి. ఖుర్‌ఆన్ ప్రతికాలంలో, ప్రతిజాతికీ, ప్రతిదేశానికీ ఆచరణ యోగ్యమైన దివ్యగ్రంథం. ఇందులో జీవిత వ్యవహారాలకు సంబంధించిన ప్రతి సమస్యకూ చక్కని పరిష్కారం ఉంది. ఇది ఓ సమగ్ర జీవనవిధానానికి, రాజ్యస్థాపనకు కావలసిన ఓ సంపూర్ణ సంవిధానం కలిగివున్న ఏకైక దైవగ్రంథం. మన ప్రపంచ ప్రగతి అయినా, పరలోక సాఫల్యమయినా అంతా ఈ గ్రంథంతోనే ముడివడి ఉంది.

ఇలాంటి దృఢమైన విశ్వాసంతో మనం ఖుర్‌ఆన్‌ని శ్రద్ధాసక్తులతో పఠిస్తుండాలి. అందులోని ఒక్కొక్క వాక్యాన్ని, ఒక్కొక్క పదాన్ని గురించి జాగ్రత్తగా ఆలోచిస్తూ, అర్థం చేసుకుంటూ అధ్యయనం చేస్తుండాలి. దాని బోధనలకు అనుగుణంగా మన భావాలను, మన నమ్మకాలను మలచుకోవాలి. వాటి ప్రకారం మన గుణగణాలను, జీవితవ్యవహారాలను, తోటిమానవులతో మన సంబంధాలను సంస్కరించుకోవాలి. ఆపై దాని సందేశాన్ని ఇతరులకు అందజేసే కార్యక్రమాలు చేపట్టాలి. ఈ గ్రంథం ప్రతిపాదిస్తున్న జీవన వ్యవస్థను నెలకొల్పడానికి శాయాశక్తులా కృషి చేయాలి. దానికోసం సర్వశక్తులు, సమస్త ఒనరులు ధారపోసి పోరాడాలి.

ఉపవాసవ్రతకులు ఖుర్‌ఆన్ పట్ల ఈవిధంగా దృఢమైన సంబంధం ఏర్పరచుకోకపోతే రమజాన్ నెలలో వారి ఖుర్‌ఆన్ పారాయణ, వారి తరావీ నమాజుల వల్ల ప్రయాస, జాగరణ తప్ప వారికి మరేమీ లభించదు. పైగా ఈ గ్రంథం ప్రళయ దినాన ఇలాంటి ఉపవాసకులకు వ్యతిరేకంగా విశ్వప్రభువు ముందు ఈవిధంగా ఫిర్యాదు చేసే అవకావం కూడా లేకపోలేదు-

"ప్రభూ! ఇతడు నన్ను మొదలు నుంచి చివరిదాకా చదివాడుకాని, నాలోని ఆదేశాలను, హితవులను పాటించలేదు. ఒకవేళ ఎప్పుడైనా పాటించినా సులువైనవి మాత్రమే పాటించి, కఠినమైన వాటిని పక్కన పెట్టేశాడు. దీనికి కారణం ఈ ఆదేశాలు, హితవులు త్యాగాలతో, కఠిన పరీక్షలతో, కఠోర నియమాలతో ప్రమాదకరమైన దిశలకు దారితీసేవిగా ఉండటమే. ప్రశాంతమైన జీవిత సాగరంలో కష్టాల, కడగండ్ల తుఫాను బీభత్సాన్ని సృష్టించే విషయాలు కూడా నాలో ఉన్నాయి. అందువల్ల ఇతడు ప్రాపంచిక సౌఖ్యాలతో సుఖమరిగి, ఈ ఆపదలను, అగ్నిపరీక్షలను ఎదుర్కోవడానికి భయపడి ఈ ఆదేశాల్లోని కఠినమైన వాటిని పూర్తిగా వదిలేశాడు. కాకపోతే రమజాన్ నెలలో మటుకు కొన్నిటిని పాటించాడు"

దివ్యఖుర్‌ఆన్ ఒకవేళ పరలోక నాయస్థానంలో "మాలికియౌద్దీన్" ముందు నిజంగా ఇలా ఈ ముస్లింలకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే అప్పుడు వీరి గతి ఏమవుతుంది? అందువల్ల మనం రమజాన్ ఉపవాసాలు పాటిస్తున్నప్పుడు ఈ విషయాలన్నిటినీ దృష్టిలో పెట్టుకోవాలి. మన ఉపవాసవ్రతాలు ఫలవంతం కావడానికి చేయవలసిన పనులన్నీ చేయాలి. ఉపవాసాలు పాటించవలసిన విధంగా పాటించాలి. అంటే ఉపవాసకులకు నైతిక సంస్కరణ గురించి దైవప్రవక్త (స) ఇచ్చిన ఆదేశాలను కూడా మనం పాటించాలి. అప్పుడే మన ఉపవాసాలు నిజమైన ఉపవాసాలుగా పరిగణించబడతాయి.

సరే, రమజాన్ ఉపవాసాలన్నీ ఏదోవిధంగా పాటించి పండుగ జరుపుకుంటాం అనుకోండి. దాంతో రమజాన్ మాసం పట్ల మనకున్న బాధ్యత తీరిపోయినట్లు ఫీలవుతాము. కాని ఆతర్వాత మన జీవితంలో వాటి ప్రభావం ఏమిటని ఆలోచించము. మనం పాటించిన ఉపవాసాలు నిజమైన ఉపవాసాలో లేక ఆకలిదప్పులతో ఉండటాన్నే మనం ఉపవాసాలని పేరు పెట్టుకున్నామో రమజాన్ గడచిన తరువాత వచ్చే రోజులే తెలియజేస్తాయి. మన తరావీ నమాజుల్లో, మన ఖుర్‌ఆన్ పఠనాల్లో విశ్వాస పటిష్ఠత, ఆత్మపరిశీలనా భావం పనిచేస్తుండేవా లేక నిర్జీవంగా ఉండేవా అనే విషయాలు కూడా రమజాన్ తరువాతనే తెలుస్తాయి. కనుక మనం వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని, రమజాన్ తర్వాత మిగిలిన పదకొండునెలల కాలంలో కూడా ఉపవాసాల ప్రభావం మన జీవితంలోని సమస్తరంగాల్లో గోచరించేటట్లు వీలైనంత వరకు కృషి చేయాలి.

(కువైట్ రేడియో నుంచి 7-8-1981న మౌలానా గులాం ముహమ్మద్ మన్సూరీ గారు చేసిన ఉర్దూ ప్రసంగం ఆధారంగా)



# రమజాన్‌శుభాల కోసం రచయిత వెంపర్లాట

"రమజాన్ ఆశయాలు"అనే ఈ పుస్తకం ఈ ఏడు రమజాన్ మాసంలోనే ప్రచురించి విడుదల చేయడానికి 'డిటిపి' ఆపరేటర్, ప్రచురణకర్త కూడా అయిన ఈ రచయిత విశ్వప్రభువును వేడుకుంటూ రేయింబవళ్ళు శాయాశక్తులా కృషి చేస్తున్నాడు.

కాలం చకచకా సాగిపోతోంది. "కీబోర్డ్" దాని వెనుక పరుగుపందెంలోని క్రీడాకారిణిలా పరుగెడుతోంది. "రమజాన్ మాసమా! నీ వెనుక నేనూ వస్తున్నా ఆగు. నన్ను వెనకేసి పరుగెత్తకు" అంటోంది 'మౌస్' రచయిత చేతిలో కిచకిచలాడుతూ.

అంతలో నా మిత్రుడొకడు ఊడిపడ్డాడు. అంతే, ఆటోమ్యాటిక్‌గా రచయిత చేతిలోని 'మౌస్' జారిపోయింది; 'కీబోర్డ్' మూగబోయింది. తేనీటి సేవనం, కుశల ప్రశ్నలు అయ్యాక మా మిత్రుడు ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన టీవీ ఛీఫ్ రిపోర్టర్‌లా ముఖం పెట్టి నా వైపు చూడసాగాడు.

"అది సరేగాని నువ్వేదో రమజాన్‌ఆశయాల పేరుతో పుస్తకం రాశావట, ఎన్నిపేజీల పుస్తకం అది?" ఇంటర్వ్యూలోని మొదటి ప్రశ్నబాణం సంధించాడు ఆ మిత్రుడు.

"పుస్తకం పూర్తికాలేదు, చివరి దశలో ఉంది. దైవచిత్తమయితే 224 పేజీలు అవుతుంది." అన్నా నేను.

"ఏమిటీ, 224 పేజీలే! ఈ రోజుల్లో ఎవరు చదువుతారు ఇంత పెద్ద పుస్తకాలు?" అన్నాడు నా మిత్రుడు సామాజిక కార్యకర్తలా చూస్తూ.

"రమజాన్ శుభాల పట్ల ఆసక్తిగల తెలుగు పాఠకులు తప్పకుండా చదువుతారు."

"సరే, ఇంతకూ రమజాన్ శుభాలకు అర్హులు ఎవరవుతారని నీ ఉద్దేశ్యం?"

"రమజాన్ ఆశయాలు అనే ఈపుస్తకం పూర్తిగా చదివి, దాని ప్రకారం ఆచరించే వారు" అన్నాను నేను ముక్తసరిగా.

"అయితే నీ ఈ పుస్తకానికి పూర్వం రమజాన్ శుభాలకు అర్హులయిన వారు ఎవరూ లేరంటావా?"

"కేవలం తెలుగు పాఠకుల కోసం ఈ అంశంపై తేటతెలుగులో వెలువడబోతున్న మొట్టమొదటి సమగ్ర గ్రంథం, పరిశోధనాత్మక గ్రంథం ఇదే."

"అయితే ఇది చదివి తీరాల్సిన పుస్తకమే. ప్రింట్ కాగానే ఫోన్ చేయి, వచ్చి తీసికెళ్తా. ఇక నేను వెళ్ళొస్తా."

మిత్రుడు షార్ట్ ఇంటర్వ్యూతో తొందరగానే వెళ్ళిపోయాడు. నేను "అల్‌హమ్దులిల్లాహ్" అంటూ మళ్ళీ కంప్యూటర్ ముందు కూర్చొని నా ముద్దుల మౌస్‌ని చేతిలోకి తీసుకున్నాను, రమజాన్ మాసం శుభాలకు అర్హులయ్యేవారి గురించిన వివరాలు టయిప్ చేయడానికి.

# 67. రమజాన్ చారిత్రక సంఘటనలు

రమజాన్ 21వ తేదీ సోమవారం మహనీయ ముహమ్మద్ (సల్లం)పై మొట్టమొదటి సారిగా 'ఇఖ్‌రా' సూరాలోని తొలి ఐదు సూక్తులతో దైవవాణి అవతరించింది. ఆనాటికి చాంద్రమాన లెక్కప్రకారం ఆయన వయస్సు 40 సంవత్సరాల 6 నెలల 12 రోజులు. సూర్యమానం ప్రకారం 39 సంవత్సరాల 3 నెలల 22 రోజులు.

❂ రమజాన్ 17వ తేదీన హి.శ. రెండులో అంటే క్రీ.శ. 623లో బద్ర్ మైదానంలో సత్యాసత్యాల మధ్య మొట్టమొదటి సారిగా భీకర సంగ్రామం జరిగింది. మక్కా అవిశ్వాసులు అపజయం పాలయ్యారు. ముస్లింలు విజయకేతనం ఎగరవేశారు.

❂ రమజాన్ నెల హిజ్రీ రెండు (క్రీ.శ. 623)లో 'ఫిత్రా' ఆదేశాలు వచ్చాయి.

❂ రమజాన్ 21వ తేదీ హి.శ. 8లో దైవప్రవక్త (సల్లం) మక్కాను జయించారు.

❂ హి.శ. 9 రమజాన్‌లో దైవప్రవక్త (స) నాయకత్వంలో తబూక్ దండయాత్ర జరిగింది. అయితే రోమన్ సైన్యం ముందుకు రాకపోవడంతో యుద్ధం జరగలేదు.

❂ అదే సంవత్సరం రమజాన్‌లో తాయెఫ్ నగరానికి చెందిన ఓ ప్రతినిధి బృందం దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించింది. ఈ బృందం మదీనాలో ఉండి ఇతర విధులు నెరవేర్చుకుంటూ రమజాన్ రోజాలు పాటించింది.

❂ రమజాన్ మాసంలోనే షాహెన్ హమీద్ ప్రతినిధులు మదీనా వచ్చి ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (సల్లం) వారికి హక్కులు, బాధ్యతలకు సంబంధించి ఓ వ్రాత పూర్వకమైన దస్తావీజును బహూకరించారు. ఈ ఉత్తరం నేటి ప్రపంచంలోని ప్రఖ్యాత ఉత్తరాల్లో ఒకటిగా పరిగణించబడుతోంది.

❂ హిజ్రీ శకం 132 రమజాన్‌లో కైరో (ఈజిప్టు)లోని అజ్‌హర్ యూనివర్శిటీ నిర్మాణం పూర్తయింది. దానికి అనుబంధంగా కట్టిన మస్జిద్‌లో సామూహికంగా నమాజు ప్రారంభమయ్యింది.

❂ హిజ్రీ శకం 584 రమజాన్‌లో సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి (రహ్మాలై) క్రైస్తవ సైనికులను చిత్తుగా ఓడించారు. అదే నెలలో చివరి క్రైస్తవ రాజుకు చెందిన ప్రఖ్యాత ప్రాసాదము 'సఫద్' ముస్లింల కైవశమయింది.

❂ హిజ్రీ శకం 658 రమజాన్ మాసంలో తాతారీలు బగ్దాద్‌పై దాడిచేసి సర్వనాశనం చేశారు. దాంతో ముస్లింల 'ఖిలాఫత్' వ్యవస్థ అంతమైపోయింది.


❂ హిజ్రీ శకం 1393 రమజాన్‌లో జాత్యాహంకార యూదులు 'సీనా' భూభాగంపై దురాక్రమణ జరిపి అరబ్బుల నుండి సూయాజ్ కాలువను హస్తగతం చేసుకున్నారు. ఆ తరువాత ఈ శుభమాసంలోనే ఈజిప్టు సైనికులు సూయాజ్ కాలువను దురాక్రమణ దారుల నుండి మళ్ళీ సాధించుకోగలిగారు.



# మానవాళికి వెలుగుబాట

**ఖు**రాన్ ఇస్లాం మత ప్రామాణిక గ్రంథం. దివ్యఖురాన్ ముహమ్మద్ ప్రవక్త ద్వారా వెలువడిన భగవంతుని వాణి అని ఇస్లాం మతస్తుల విశ్వాసం. ఖలీఫా అబూబకర్ కాలంలో ముహమ్మద్ ప్రవక్త ప్రవచనాలన్నీ గ్రంథస్తమయ్యాయి. ఖురాన్ మతగ్రంథమే కాదు, న్యాయశాస్త్రగ్రంథం కూడా. ఇందులో జీవనపద్ధతి, ఆచారవ్యవహారాలను క్రమబద్ధీకరించారు. జూదాన్ని, మద్యాన్ని నిషేధించారు. శిశు హత్యను నిరసించారు. బానిసలపట్ల మరింతదయతో ప్రవర్తించవలెనని చెప్పారు.

ఖురాన్ బహుభార్యాత్వాన్ని అనుమతించడమే కాకుండా సమర్థించడం వెనుక ఆనాటి ఆర్థిక, సామాజిక పరిణామాల విశ్లేషణ కనబడుతుంది. ఆనాటి అరబ్ తెగలలో స్త్రీలస్థాయిని పెంచడానికి ఇస్లాం ప్రయత్నించిన వైనం ఇందులో గుర్తించవచ్చు. పాశ్చాత్యులదృష్టితో ఖురాన్‌ను విశ్లేషించడంగాని, ఒకఅంచనాకు రావడం గాని కష్టమే. ఖురాన్‌ను బాగా అర్థం చేసుకోవాలంటే శ్రద్ధగా, పూర్తిగా చదవాలి.




**ఖురాన్ భావామృతం**
భావానువాదం: **అబుల్ ఇర్ఫాన్**
ప్రతులకు
ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్
ఛత్తాబజార్, హైదరాబాద్-2
వెల: రూ. 250/-లు

ఖురాన్ అందరికీ అందుబాటులోలేని కాలంలో కొంతమంది స్వార్థపరులు ఖురాన్‌బోధనలను వక్రీకరించిన సంఘటనలు చరిత్రలో ఎన్నో కనబడతాయి. ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు కూడా బైబిల్ అనువాదాలు చొరబడినంత సులభంగా, వేగంగా ఖురాన్ చేరకపోవడం వల్ల చాలానష్టమే జరిగింది. ప్రాంతీయభాషలలో ఖురాన్ అనువాదాలు వెలువడకపోవడం వెనుక కొంత మంది స్వార్థపరుల ఆంక్షలు, అనవసర భయాలుకూడా ఒక కారణమనే చెప్పాలి. ఈ ప్రయత్నాల్లో భాగంగా వచ్చిన ప్రాంతీయఅనువాదాల్లో ముఖ్యంగా తెలుగులో గతంలో వచ్చిన అనువాదాలు కూడా సమగ్రంగా లేకపోవడం, గ్రాంథికంలో ఉండడంవల్ల ఎవరూ అంతగా పట్టించుకోలేదు.

ఇన్నాళ్ళకి తెలుగులో సులభ సుందరశైలిలో, అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించడంలో అత్యంతప్రతిభ కనబరచిన అబుల్‌ఇర్ఫాన్ అభినందనీయుడు. ఖురాన్ అనువాదంలో ఎదురయ్యే ఇబ్బందులను, క్లిష్టతలను వివరించిన ముందుమాటల ద్వారా అనువాదకర్త నిజాయితీని, నిబద్ధతను గుర్తించగలం. ఈ పుస్తకాన్ని అరబిక్ లిపితో, దాని అనువాదంతో పాటు ఇచ్చిన పాదపీఠికలు విషయాన్ని సులభంగా వివరిస్తాయి. ఈ కృషి విజ్ఞానదాయకమైనది.

**-కె.పి. అశోక్ కుమార్ ('వార్త' దినపత్రిక-22.5.2005)**